


www.abulhasanalinadwi.org

بَلَغَ الْعُلٰى بِكَمَالِهٖ ★ كَشَفَ الدُّجٰى بِجَمَالِهٖ ★ حَسُنَتْ جَمِيْعُ خِصَالِهٖ ★ صَلُّوْا عَلَيْهِ وَآلِهٖ ★

اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ
وَّعَلٰى اٰلِ مُحَمَّدٍ كَمَا صَلَّيْتَ
عَلٰى إِبْرَاهِيْمَ وَعَلٰى اٰلِ إِبْرَاهِيْمَ
إِنَّكَ حَمِيْدٌ مَّجِيْدٌ ، اَللّٰهُمَّ بَارِكْ عَلٰى
مُحَمَّدٍ وَّعَلٰى اٰلِ مُحَمَّدٍ كَمَا بَارَكْتَ
عَلٰى إِبْرَاهِيْمَ وَعَلٰى اٰلِ إِبْرَاهِيْمَ
إِنَّكَ حَمِيْدٌ مَّجِيْدٌ۔

طالبِ دعا

مُصلح الدین احمد حیدرآبادی

خادمِ مفکرِ اسلام حضرت مولانا سید ابوالحسن علی ندوی رح

www.abulhasanalinadwi.org

మానవ మహోపకారి

# ముహమ్మద్

(సల్లల్లాహు అలైహి వ సల్లం)

ఉర్దూ సంకలనం

హజ్రత్ మౌలానా అబుల్ హసన్ అలీ నద్వీ (రహ్మాలై)

తెలుగు అనువాదం

ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

పర్యవేక్షకులు

ముస్లిహుద్దీన్ అహ్మద్ హైదరాబాదీ

ప్రకాశకులు :

సయ్యిద్ అబుల్ హసన్ నద్వీ పబ్లికేషన్ ట్రస్ట్

హన్మకొండ.

www.abulhasanalinadwi.org

# MANAVA MAHOPAKARI MUHAMMAD (PBUH)

Writer:
**Moulana Abul Hasan Ali Hasani Nadwi (Rah)**

Translator:
**Mohd. Azeez.ur.Rahman**

All Rights Reserved with Publishers

First Edition: 1st October, 2004 - 15th Shaban 1425

Copies: 1000

Price: 100/-

Publishers:
**Syed Abul Hasan Nadwi Publication Trust**
**Muslehuddin Ahmed**
H.No. 1-8-534/1, Nakkala Gutta,
Hanmakonda- 506 001
Warangal (Dist).

Printed at:
**Om Sai Graphics**
3-4-709, Narayanaguda,
Hyderabad. Ph: 27560543.

www.abulhasanalinadwi.org

# విషయ సూచిక


తొలి పలుకులు

గ్రంథ పరిచయం

1. శుభోదయం ... 1

పాల గడువు -2; పినతండ్రి సంరక్షణలో - 3; సంక్షేమ కార్యక్రమాల్లో ఆసక్తి - 5; హజ్రత్ ఖదీజాతో వివాహం - 7; కాబా గృహ పునర్నిర్మాణ వివాదం - 7; దైవిక శిక్షణ - 9

2. మానవత్వం మొర ఆలకించబడిన వేళ ... 10

ఇస్లాం సందేశ ప్రచారం -12; బహు దైవారాధకుల ఆగడాలు - 15; ఉత్బాతో భేటి - 20; ఖురైషు సర్దారులతో ముఖాముఖి - 22; ముస్లిములపై ఖురైషుల దురాగతాలు - 26; అబూ బక్ర్ (రజి) పట్ల అవిశ్వాసుల వైఖరి - 31; ఇథియోపియాకు ముస్లింల వలస - 32; హమ్జా ఇస్లాం స్వీకరణ - 34; ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ మక్కా రాకతో... -39; హాషిం తెగకు సంఘ బహిష్కరణ శిక్ష - 41; ఒప్పంద విరమణ - 42; అబూ బక్ర్ పట్ల ఖురైషుల వైఖరి - 43; అబూ తాలిబ్, ఖదీజాల మరణం - 45; తాయఫ్ వీధుల్లో తుంటరితనం - 46; అరబ్బు తెగలకు ఇస్లాం సందేశం - 50; ఉఖబా ఒప్పందం - 57; రెండవ ఉఖబా ఒప్పందం - 61; నాయకులుగా ఎన్నికైన వారి పేర్లు - 63;

3. హిజ్రత్‌కు అనుమతి ... 66

దైవప్రవక్త (స) మదీనాకు హిజ్రత్ చేసిన సంఘటన - 69; దైవప్రవక్త (స) కోసం సురాఖా వేట - 74; భాగ్యవంతుడు - 75; మదీనాలో దైవప్రవక్త (స)కు స్వాగతం - 77; ఖుబా మస్జిద్ నిర్మాణం - 78; మదీనాలో మొదటి జుమా నమాజు -


www.abulhasanalinadwi.org

79; అబూ అయ్యూబ్ అన్సారీ ఇంట్లో బస - 82; మస్జిదె నబవీ నిర్మాణం - 84; అజాన్ ఆదేశం - 86; ముహాజిర్ - అన్సార్‌ల మధ్య సోదర బంధం - 87; అరుగు వాసులు - 91.

4. బద్ర్ సంఘటన ... 94

రణ రంగానికి - 96; యుద్ధ సన్నాహాలు - 98; తొలి దశ యుద్ధం - 103; పేరు మోసిన అవిశ్వాస సర్దారుల వధ - 105; ఘన విజయం - 108; యుద్ధ ఖైదీల పట్ల ముస్లింల వ్యవహారం - 109; అబుల్ ఆస్ (రజి) ఇస్లాం స్వీకరణ - 111; ఉమైర్ బిన్ వహబ్ (రజి) ఇస్లాం స్వీకరణ - 112; హజ్రత్ ఫాతిమా (ర.అ) వివాహం - 114; ప్రతీకార వాంఛ పెల్లుబికింది - 116.

5. ఉహుద్ ప్రతిఘటన ... 120

యుద్ధారంభం - 122; గెలుపు ఓటమిగా పరిణమించింది - 124 నిరుపమాన త్యాగభావం - 127; అమరవీరుల పరిస్థితి - 133; యుద్ధంలో ముస్లిం మహిళల పాత్ర - 138; హమ్రావుల్ అసద్ వరకు శత్రువుల్ని తరిమి కొట్టడం - 139; ముస్లింలపై దారుణ మారణకాండ - 141; బనూ నజీర్ తెగ బహిష్కరణ - 145; హిజ్రీ 4వ యేట జరిగిన సంఘటన - 147.

6. కందక ప్రతిఘటన ... 148

భయంకరమైన ముట్టడి - 153; సఫియా (ర.అ) సాహసం - 157; దైవ సహాయం వచ్చింది - 158; కన్నతల్లి తన తనయుణ్ణి యుద్ధానికి వెళ్ళమని ప్రేరేపించింది - 160; జాతుర్రిఖా యుద్ధం - 161; బనూ ఖురైజా యుద్ధం - 162; నజద్ యుద్ధం - 165.

7. హుదైబియా ఒప్పందం ... 168

బైతె రిజ్వాన్ - 173; ఒప్పంద వివరాలు - 174; ఒప్పందంలోని షరతులు - 175; ముస్లింల సహనానికి పరీక్ష - 176; పరాభవ పవనాలు కాదు, విజయ వీచికలు - 179; రాజులు,

www.abulhasanalinadwi.org

చక్రవర్తులకు ఇస్లాం సందేశం - 183; అబిసీనియా రాజు నజాషీకి లేఖ - 184; బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ - 185; బహ్రాయిన్ రాజుకు లేఖ - 186; అమ్మాన్ రాజుకి లేఖ - 187; డెమాస్కస్, ఎమన్ పాలకులకు లేఖలు - 192; అలెగ్జాండ్రియా రాజుకు లేఖ - 192 హెరిక్లిస్‌కు లేఖ - 194; ఈరాన్ చక్రవర్తికి లేఖ - 198.

**8.** ఖైబర్ ప్రతిఘటన ... 200

మౌతా యుద్ధం - 209

**9.** మక్కా విజయం ... 213

అందరికీ క్షమా భిక్ష - 217; కక్ష కార్పణ్యాల రోజు కాదు - 219; చెదురు మదురు సంఘటనలు - 221; కాబా గృహం నుండి విగ్రహాల ప్రక్షాళన - 221;

**10.** హునైన్ పోరాటం ... 228

ఓటమికి కారణాలు - 231

**11.** తబూక్ ప్రతిఘటన ... 240

దౌస్ ప్రతినిధి బృందం - 255; సఖీఫ్ ప్రతినిధి బృందం - 256; అబ్దుల్ ఖైస్ ప్రతినిధి వర్గం - 262; హునైఫ ప్రతినిధి వర్గం - 264; 'తై' తెగ - 264; అజ్ద్ బృందం - 265; హమ్‌దాన్ బృందం - 268; నజీజ్ బృందం - 269; బనీ సాద్ హుజైమ్ బృందం - 271; బనీ అసద్ బృందం - 272; బహ్‌రా బృందం - 273; హౌలాన్ బృందం - 274; ముఖారిబ్ ప్రతినిధి వర్గం - 276; బనీ అబస్ బృందం - 277, ఘామిద్ బృందం - 277; బనీ ఫజారా బృందం - 278; సలామాన్ బృందం - 279; నజరాన్ బృందం - 280; నఖా బృందం - 286

**12.** అంతిమ హజ్ ... 289

**13.** మహా ప్రస్థానం ... 305

అంత్య క్రియలు - 315.

www.abulhasanalinadwi.org

# తొలి పలుకులు

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

*అల్ హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్. వ సల్లల్లాహు త ఆలా అలా రసూలిహీ ముహమ్మదిన్ వ్వ ఆలిహీ వ సహ్బిహీ అజ్మయీన్.*

అంతిమ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రత్యేకతలను గురించి దివ్య ఖుర్ఆన్ పలు చోట్ల పలు విధాలుగా అభివర్ణించింది. ఉదాహరణకు :-

1. "ఆయనే నిరక్షరాస్యులలో ఒక ప్రవక్తను స్వయంగా వారి నుండే లేపాడు. ఆ ప్రవక్త వారికి అయన వాక్యాలను వినిపిస్తున్నాడు. వారి జీవితాలను తీర్చిదిద్దుతున్నాడు. వారికి గ్రంథాన్నీ, వివేకాన్నీ బోధిస్తున్నాడు. వాస్తవానికి దీనికి పూర్వం వారు పూర్తిగా మార్గం తప్పి ఉన్నారు".

   (ఖుర్ఆన్-జుముఅహ్ - 2)

2. మరొక చోట ఇలా అనబడింది :

   "(ఓ ముహమ్మద్!) నీవు నిస్సందేహంగా మహోన్నతమైన శీలం కలవాడవు". (ఖుర్ఆన్-ఖలమ్ - 4)

3. ఇంకో చోట ఇలా సెలవీయబడింది :

   "వాస్తవంగానే దేవుని ప్రవక్తలో మీకు ఒక మంచి ఆదర్శం ఉంది". (ఖుర్ఆన్-అహ్జాబ్ - 21)

చెప్పవచ్చిందేమిటంటే ఒక విశ్వాసి కోసం దేవుని అంతిమ ప్రవక్త (సఅసం) మార్గ దర్శకులు. వెలుగు స్థంభం వంటి వారు. తన జీవన సాఫల్యం కోసం ఆయన్నుంచి వెలుగు పొందటం, ఆయన (స) అడుగు జాడలలో నడవటం, గుణగణాలలో, నీతి నడవడికలలో ఆయన్ని ఆదర్శంగా తీసుకోవటం ప్రతి ముస్లిం విధ్యుక్త ధర్మం. ఈ అనుసరణలోనే అతని శ్రేయో సాఫల్యాలు ఇమిడి ఉన్నాయి. దైవప్రవక్త (సఅసం)

www.abulhasanalinadwi.org

అనుసరణలోనే విశ్వాసి విజయ రహస్యం అంతర్లీనమై ఉంది. దైవప్రవక్త (సఅసం) విధేయత పట్ల వైముఖ్యం కనబరచినవాడు లేక నిర్లక్ష్యం వహించిన వాడు సన్మార్గానికి దూరమై పోతాడు. నెలవు దప్పి మార్గ భ్రష్ఠతకు లోనైపోతాడు.

దైవప్రవక్త (స) పవిత్ర జీవితాన్ని ఆకళింపు చేసుకోవటానికి, ఆయన పాద చిహ్నాలలో నడచుకోవటానికి మనిషి రెండు నియమాలకు కట్టుబడి ఉండాలి. అవేమంటే (1) ఆయన(స) యెడల అచంచలమైన ప్రేమాభిమానాలు కలిగి ఉండాలి. ఆయన కోసం తన సర్వస్వాన్నీ అర్పించడానికి మనిషి సిద్ధమై ఉండాలి. కేవలం నోటితో పలికి సరిపుచ్చకుండా ఆచరణలో చిత్తశుద్ధిని కనబరచాలి. ప్రవక్తగారి ప్రత్యక్ష సహచరులు తమ ప్రేమాభిమానాలను క్రియాత్మకంగా రుజువు చేశారు. ఇస్లాం కోసం వారు తమ ధన ప్రాణాలను పణంగా పెట్టారు. కాలపు కాళ నాగులు వారిని ఉరికంభం మీదికి ఎక్కించి, "నీవు నిలబడి ఉన్నచోట ముహమ్మద్ నిలబడాలని నీవు అభిలషిస్తే నీకు ప్రాణ భిక్ష పెట్టబడుతుంది" అని ఆశ చూపారు. దానికి సమాధానంగా ఆ త్యాగధనులు, "ఆయన (స) కాలిలో ముల్లు గుచ్చుకునే షరతుపై మాకు ప్రాణ భిక్ష లభించినా అది మాకు సహించదు గాక సహించదు" అని తెగేసి చెప్పారు. హజ్రత్ హస్సాన్ బిన్ సాబిత్ అన్సారీ (రజి) తమ నాయక శిఖామణి (స) కోసం చెప్పిన ఒక కవిత సారాంశం ఇది :

> "నా పితామహుల, తాత ముత్తాతల మాన మర్యాదలను,
> ఆఖరికి నా మాన మర్యాదలను సయితం మహనీయ
> ముహమ్మద్ (స) మాన మర్యాదల రక్షణ కోసం డాలుగా
> సమర్పిస్తాను".

హోరాహోరీగా జరిగిన ఒక యుద్ధం నుంచి తిరిగి వస్తున్న సైనికుల నుద్దేశించి ఒక త్యాగమయి, "మన ప్రవక్త (సఅసం) కుశలమే కదా!" అని ప్రశ్నించింది. "అది సరే గాని నీ తండ్రి అమరగతి నొందాడు తెలుసా!" అని ఒకరు సమాధానమిచ్చారు. "మన ప్రవక్త (స) క్షేమమే కదా!" అని ఆమె రెండవసారి దర్యాప్తు చేసింది. "నీ భర్త కూడా వీర మరణం పొందాడమ్మా!" అని జవాబు వచ్చింది. "ప్రవక్త(స) గారెలా ఉన్నారో ముందు నాకు చెప్పండి" అని ఆ మహిళామణి మూడవసారి

నిలదీసింది. "ఆయన (సఅసం) క్షేమంగానే ఉన్నారు" అని జవాబివ్వబడింది. దానికామె, "ఆయన (సఅసం) క్షేమంగా ఉంటే చాలు. ఆయనుంటే ఏ బాధనయినా సులభంగా జీర్ణించుకోవచ్చు" అని చెప్పింది. దైవప్రవక్త (సఅసం) యెడల ఇటువంటి నిష్కల్మషమైన అభిమానం, గౌరవశ్రద్ధలు కలిగి ఉన్న అనుయాయి మాత్రమే ఆయన(స)కు నిజమైన విధేయుడుగా రాణించగలుగుతాడు.

(2) విశ్వాసి అయినవాడు అంతిమ దైవప్రవక్త (స) గారి జీవితాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, దాన్ని ఉదాహరణగా తీసుకోవాలి. ఆయన గుణగణాలు, దైవదాసుల పట్ల ఆయనకు గల సానుభూతి, ఆయన సద్వ్యవహారం, అపకారులకు సయితం ఉపకారం చేయాలన్న ఆయన ఆరాటం, దైవప్రసన్నత కోసం ఆయన పడే తపన, మానవుల ఇహపర లోకాల సాఫల్యం కోసం ఆయన కనబరచే ఆత్రుత, నరకాగ్ని నుంచి ప్రజల్ని కాపాడటానికి ఆయన చేసే చింతన ఎటువంటివో శ్రద్ధగా పరిశీలించాలి. తోటి మానవులతో ఆయన ఎలా మెలిగేవారు, ఆలుబిడ్డల యెడల ఆయన ఎలా ప్రేమానురాగాలతో మసలుకునేవారు, అపరిచిత వ్యక్తుల పట్ల సయితం ఆయన ఎలా వ్యవహరించేవారన్న విషయాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేయాలి. ప్రజలను సంస్కరించడానికి, వారి జీవితాలను తీర్చిదిద్దడానికి ఆయన అవలంబించిన విధానం ఎటువంటిది, దైవ భీతి, పరలోక భీతి ద్వారా ఆయన నైతిక విప్లవాన్ని ఎలా తీసుకు వచ్చారు, దైవాగ్రహం నుంచి మానవులను కాపాడటానికి ఆయన ఇచ్చిన ఉపమానాలేవి? ఇత్యాది విషయాలను కూడా తెలుసుకోవాలి.

ఈ రెండు సూత్రాల ద్వారానే ఒక విశ్వాసి తన జీవితాన్ని తీర్చిదిద్దుకుని, తన 'విశ్వాసాన్ని' నిష్కల్మషంగా ఉంచుకోగలుగుతాడు. ఈ రెండు షరతులకు కట్టుబడి ఉన్నంత కాలం అతను తన లక్ష్య సాధనలో కృతకృత్యుడై ఉంటాడు. ఈ రెండు షరతులకు కట్టుబడనివాడు గమ్యం తప్పిపోతాడు. దైవప్రవక్త (స) పవిత్ర జీవితాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన మీదట కూడా, ఆయన్ని అనుసరించకుండా ఉండటం, వట్టి మాటలతో ప్రేమాభిమానాలను వ్యక్తపరచటం 'నిజమైన ప్రేమ' అనిపించుకోదు.

www.abulhasanalinadwi.org

అయితే దైవప్రవక్త(స) వారి పవిత్ర జీవితాన్ని గ్రంథాలలో వెతకటం ప్రతి ఒక్కరికీ సాధ్యమవదు. దీని కోసం వారు విద్వాంసుల ఉపన్యాసాలను వినాలి. విద్వాంసులు సంకలనం చేసిన సీరత్ పుస్తకాలను చదవాలి. ఇలాంటి పుస్తకాలలో కొన్ని చాలా లోతుగా, క్లిష్టంగా ఉంటాయి. మరికొన్ని సులభంగా, స్థూలంగా ఉంటాయి.

హజ్రత్ మౌలానా సయ్యిద్ అబుల్ హసన్ అలీ నద్వి (రహ్మ.లై) గారు వారం వారం జరిగే తబ్లీగీ సమావేశాలలో చదివి వినిపించే నిమిత్తం పెద్ద పెద్ద సీరతు గ్రంథాల నుంచి ప్రవక్త (స) వారి గుణగణాలను, సందేశాన్ని, సంస్కరణా పద్ధతులను, ముఖ్యమైన జీవిత ఘట్టాలను వ్యాసాల రూపంలో సంకలనం చేశారు. ఆ సంక్షిప్త భాగాల ద్వారా శ్రోతలకు ఎంతో మేలు చేకూరేది. శ్రోతల జీవితాలలో ఆశించిన పరివర్తనను తీసుకు రావటంలో, వారి విశ్వాసాన్ని ఇనుమడింప జేయటంలో ఈ భాగాలు ఎంతగానో దోహద పడ్డాయి. హజ్రత్ మౌలానా అబుల్ హసన్ అలీ నద్వి (రహ్మ.లై) గారు సంకలనం చేసిన ఈ సీరత్ ముసాయిదాల గురించి సయ్యిద్ బిలాల్ అబ్దుల్ హై హసనీ నద్వి గార్కి ముందు నుంచీ తెలుసు. ఆ ముసాయిదాలను ఆయన వెలికి తీసి, వాటిని కూర్చి, ప్రచురణకు తోడ్పడ్డారు. ఈ గ్రంథం మరీ లావు గానూ, మరీ చిరు పుస్తకం గాను కాకుండా ఓ మోస్తరు గ్రంథంగా రూపుదిద్దుకుంది. సంఘటనలన్నింటి ఆధారాలివ్వబడ్డాయి. చారిత్రక ఆధారాలతో ప్రమాణబద్ధంగా తీర్చిదిద్దబడిన కృతి ఇది. ఇందులో విశ్వాస శిక్షణ, నైతిక సంస్కరణలతో పాటు దైవ భీతి, పరోపకారం, దైవ దాస్యం, మానవ సేవ వంటి అంశాలు - ప్రధానంగా చర్చకు వస్తాయి. ఈ గ్రంథాన్ని ప్రజా బాహుళ్యంలోకి విస్తృత స్థాయిలో తీసుకు పోవలసిన అవశ్యకత ఉంది. మా వాడు (మౌల్వీ బిలాల్ హసనీ నద్వి) ఈ పుస్తకానికి తొలి పలుకులు వ్రాసే బాధ్యతను నాకప్పగించాడు. నా పరిమిత జ్ఞానంతో ఈ బాధ్యతను నెరవేర్చడానికి ఉపక్రమించాను. కారుణ్య ప్రభువైన అల్లాహ్ ఈ కృషిని స్వీకరించు గాక! (ఆమీన్)

- ముహమ్మద్ రాబే హసనీ నద్వి
(ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షులు)
లక్నో

www.abulhasanalinadwi.org

# గ్రంథ పరిచయం

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

*అల్ హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్, వస్సలాతు వస్సలాము అలా సయ్యిదిల్ ముర్సలీన్, ముహమ్మదిన్ వ ఆలిహీ వసహ్బిహీ అజ్మయీన్ అమ్మా బాద్ :*

ఈ రోజు దైవప్రవక్త (సల్లం) జీవిత చరిత్రకు సంబంధించిన ఒక గ్రంథాన్ని వెలువరించే మహాభాగ్యానికి నోచుకున్నందుకు నా శిరస్సు కృతజ్ఞతా పూర్వకంగా దైవ సన్నిధిలో మోకరిల్లుతున్నది. అధరాలు దైవ ప్రశంసా గీతాల్ని ఆలాపిస్తున్నాయి. ఆ పరమ ప్రభువును ఎంత స్తుతించినా తక్కువే. ఈ గ్రంథం దాదాపు యాభై సంవత్సరాల క్రితం ఓ మహనీయునిచే విరచితమై ఆ తర్వాత సుదీర్ఘ కాలం పాటు ధర్మప్రచార సమావేశాల్లో పఠించబడుతూ ఉండేది. కాని ఇటీవల వరకు ప్రచురణ భాగ్యానికి నోచుకోలేక పోయింది.

నేటికి పది సంవత్సరాల క్రితం గురువర్యులు హజ్రత్ మౌలానా సయ్యిద్ అబుల్ హసన్ అలీ నద్వీ (రహ్మ.లై) గారు తనకు పూర్వీకుల నుండి వారసత్వంగా లభించిన గ్రంథ సంపదను తరచి చూస్తున్నప్పుడు ఆయనకు ముసాయిదా రూపంలో ఉన్న ఈ పుస్తకం కనిపించింది. ఆ సందర్భంలో ఆయన మాకు ఈ గ్రంథ నేపథ్యం గురించి వివరించారు. లక్నోలోని ధర్మసందేశ ప్రచార కేంద్ర మస్జిద్‌లో ఉన్నప్పుడు ఆయనకు ధార్మిక సమావేశాల్లో చదివి వినిపించటానికి అనువైన గ్రంథ మొకటి రచించాలన్న ఆలోచన వచ్చింది. ఆ తర్వాత ఆయన షిబ్లీ నోమానీ గారి 'సీరతున్నబీ'[1] గ్రంథాన్ని, ఖాజీ సులైమాన్ గారి 'రహ్మతుల్లిల్ ఆలమీన్' గ్రంథాన్ని ఆధారంగా చేసుకొని ఈ పుస్తకాన్ని రచించారు. ధర్మసందేశ ప్రదాతలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలని, వారి హృదయాలను భక్తి

1) ఈ పుస్తకంలోని చాలా భాగం 'సీరతున్నబీ' గ్రంథం నుండే సంగ్రహించబడింది.

www.abulhasanalinadwi.org

విశ్వాసాల్లో ఓలలాడించాలన్న ఉద్దేశంతో మహాప్రవక్త (సల్లం) జీవిత చరిత్రలోని ప్రభావవంతమైన సంఘటనలన్నీ ఏర్చి కూర్చి ఈ పుస్తకాన్ని రచించారాయన.

ఆయన ఈ పుస్తక నేపథ్యం గురించి చెప్పినప్పుడే అనిపించింది నాకు, దీన్ని ఎలాగైనా ప్రచురించాల్సిందేనని! కాని ఆయన ముందు ఆ కోరికను వెలిబుచ్చటానికి ధైర్యం చాల్లేదు నాకు. కాని దైవ నిర్ణయాని కయితే తిరుగుండదు కదా!

మౌలానాగారు రమజాన్ మాసంలో షాహ్ అలముల్లాహ్ తకియా కలాన్ ప్రాంతంలో విడిది చేసేవారు. ఆయన ఆత్మీయులు, సన్నిహితులు కొందరు రమజాన్ మాసంలో ప్రశాంతంగా దైవారాధన చేసుకునే ఉద్దేశంతో ఆయన సాంగత్యంలో ఉండేవారు. వారి శిక్షణ నిమిత్తం బోధనా సమావేశాలు కూడా నిర్వహించబడేవి. ఆ సమావేశాల్లో పలు రకాల ధార్మిక గ్రంథాలు చదివి వినిపించబడేవి. రెండు సంవత్సరాల క్రితం పినతండ్రి తుల్యులు హజ్రత్ మౌలానా సయ్యిద్ రాబే నద్వీ గారు దైవప్రవక్త (సల్లం) జీవిత చరిత్రకు సంబంధించిన క్లుప్తమైన పుస్తక మొకటి వెలువడాలని అభిప్రాయ పడ్డారు. వెంటనే నాకు ఈ పుస్తకం సంగతి గుర్తొచ్చింది. అప్పటి వరకు ఈ పుస్తకం ముసాయిదా రూపంలోనే ఉంది. సోదరులు మౌలానా అబ్దుల్లాహ్ హసనీ నద్వీ గారు కూడా ముసాయిదాను ఒకసారి స్థూలంగా పరిశీలించి ఈ పుస్తకం తప్పకుండా వెలువడాలన్నారు. ఆ తర్వాత పుస్తకంపై పరిశోధన మొదలయింది. కొంతకాలానికి ఈ పుస్తకాన్ని చదివిన వారందరూ దీన్ని ప్రచురించాలని కోరటం మొదలు పెట్టారు. గురువర్యుల్ని పుస్తక ప్రచురణ కోసం అనుమతి కోరగా ఆయన సుముఖత వ్యక్తం చేశారు. పైగా దాని కూర్పు, పరిశోధనా బాధ్యతలు నా పైనే మోపారు.

ఈ పుస్తకం విషయంలో ఎదురైన ఇంకో సమస్య ఏమిటంటే, ఇందులో మధ్యలోని కొన్ని పుటలు లుప్తమయి ఉన్నాయి. ముఖ్యంగా

www.abulhasanalinadwi.org

దైవప్రవక్త (సల్లం) మరణ సంఘటన ఇందులో అసలు లేనే లేదు. కాని దైవకృప వల్ల ఎలాగో ఈ పుస్తకాన్ని ఆసాంతం పరిశోధించాను. ప్రామాణికమైన హదీసు గ్రంథాల ఆధారాలు దొరికితే వాటిని కూడా పొందుపరిచాను. షిబ్లీ గారి 'సీరతున్నబీ' గ్రంథాన్ని, గురువర్యుల విరచితమైన 'నబీయె రహ్మత్' గ్రంధాన్ని ఆధారంగా చేసుకొని లుప్తమయిన భాగాన్ని కూడా పూర్తి చేశాను. శీర్షికలు 'నబీయె రహ్మత్' ను అనుసరించే పెట్టాను. దైవ కృప వల్ల ఇప్పుడు ఈ గ్రంథం సర్వాంగ సిద్ధమై పాఠకుల ముందుకు వచ్చేసింది. దేవుడు ఈ కృతిని స్వీకరించు గాక! దీనికి విస్తృత ప్రచారాన్ని కల్పించు గాక! ముక్తి, మన్నింపులకు సాధనంగా చేయు గాక!

ఈ సందర్భంగా ఇంకో విషయం కూడా ఇక్కడ ప్రస్తావించటం అవసరమనుకుంటున్నాను. ఇది దైవప్రవక్త (సల్లం) జీవిత చరిత్రపై సంక్షిప్తంగా, ప్రభావవంతంగా రచించబడిన పుస్తకం. సామాన్య ప్రజానీకానికి ఈ గ్రంథం చాలా ఉపయోగ పడగలదని ఆశిస్తున్నాం. దీన్ని మస్జిదుల్లో, ధార్మిక సమావేశాల్లో జనసామాన్యానికి చదివి వినిపించటానికి కూడా ఉపయోగించుకోవచ్చు. అయితే దైవప్రవక్త (సల్లం) జీవిత చరిత్రను విపులంగా అధ్యయనం చేయాలనుకునే విద్యార్థులు, పరిశోధకుల కోసం స్వయంగా ఈ పుస్తక రచయిత గారే 'అస్సీరతున్నబవియ్యా' అనే పేరుతో ఓ ఉద్గ్రంథాన్ని రచించారు. ఆ గ్రంథంలో ఆయన దైవప్రవక్త (సల్లం) జీవిత చరిత్రకు సంబంధించి ఇతర రచయితలెవరూ స్పృశించ లేకపోయిన సరిక్రొత్త కోణాల్ని స్పృశించారు. పాశ్చాత్య మూల గ్రంథాల వెలుగులో అజ్ఞాన కాలపు ప్రపంచ పరిస్థితుల్ని కూలంకషంగా వివరించారు. పిత్రులు మౌలానా సయ్యిద్ ముహమ్మదుల్ హసనీ (రహ్మ.లై) గారు దాన్ని ఉర్దూ భాషలోకి తర్జుమా కూడా చేశారు. 'నబీయె రహ్మత్' అనే పేరుతో ఆ గ్రంథం పాఠక లోకంలో బహుళ ప్రచారం పొందింది. విభిన్న భాషల్లోకి అనువదించబడి ప్రచురణకు కూడా నోచుకుంది.

చివరగా నేను ఈ పుస్తకాన్ని వెలువరించటంలో సహాయ పడిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. పినతండ్రి సమానులు మౌలానా సయ్యిద్ ముహమ్మద్ రాబే హసనీ నద్వీగారు ఈ పుస్తకానికి పీఠిక వ్రాసి నన్ను ప్రోత్సహించారు.

ప్రియతములు మౌల్వీ ముఖ్తార్ అహ్మద్ నద్వీ గారు వ్రాతపనిలో, ఈ పుస్తకాన్ని తులనాత్మకంగా అధ్యయనం చేయటంలో నాకు ఎంతగానో సహకరించారు. మౌలానా ముహమ్మద్ రిజ్వాన్ నద్వీగారు పుస్తకం ప్రచురణ దశకు చేరుకున్నప్పుడు ఎనలేని తోడ్పాటు నందించారు. అల్లాహ్ వారందరికీ సత్ఫలితాన్ని ప్రసాదించు గాక! ఈ కృషిని అంగీకరించి పరలోకంలో మా కోసం దీని పుణ్యాన్ని నిక్షేపంగా ఉంచు గాక!

> 'వమా తౌఫీఖీ ఇల్లా బిల్లాహ్, అలైహి తవక్కల్తు వ ఇలైహి ఉనీబ్ వలహూల్ హమ్దు వల్ మిన్నహ్, వ సల్లల్లాహు తఆలా అలా ఖైరి ఖల్ఖిహీ ముహమ్మదిన్ వ ఆలిహీ వ సహ్బిహీ అజ్మయీన్.'

- బిలాల్ అబ్దుల్ హై హసనీ నద్వీ
దారె అర్ఫాత్ దాయ్‌రా షా అలముల్లాహ్
రాయ్‌బరేలి

# ముందు మాట

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలు, పట్టణాల నుంచి వచ్చిన ముస్లిం, నవముస్లిం విద్యార్థులు 'The True Message Centre' kakinada' లో మతాల తులనాత్మక అధ్యయనం కోర్సు పూర్తి చేసుకొని ఆ తర్వాత ధర్మప్రచార కార్యంలో నిమగ్నులయ్యేందుకు గృహోన్ముముఖులవబోతున్న రోజులవి. 2002వ సంవత్సరం సెప్టెంబర్ 20వ తేదీన వారి స్నాతకోత్సవం జరగవలసి ఉంది. ఆ సందర్భంగా సదరు సంస్థ డైరెక్టర్ అహ్మద్‌అలీగారు, సెక్రటరీ ముష్తాక్ అహ్మద్‌గార్లు ఆ సభలో ప్రసంగించటానికి నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. నిజానికి ఆ సభకు ముఖ్య అతిధి అయ్యేటంతటి యోగ్యతార్హతలు నాలో లేవు. కాని పెద్దలమాట కాదనలేక సంతోషంగానే ఆ ఆహ్వానాన్ని అంగీకరించాను. పరిసరాల విషప్రభావాలకు గురికాకుండా ఇప్పటికీ స్వచ్ఛంగా, పరిశుద్ధంగా ఉన్న ముస్లిం, నవముస్లిం విద్యార్థుల మనోఫలకాల మీద అంతిమదైవప్రవక్త బోధించిన నైతికవిలువల్ని, ఉత్తమ నడవడికనూ, మహోన్నతమైన సుగుణాలను లిఖించే భాగ్యం లభించటం ఒక సువర్ణావకాశంగా, దేవుడు ప్రసాదించిన ఒక వరంగా భావించిన నేను ఆ అవకాశాన్ని జారవిడుచుకోదలచుకోలేదు. దాని మూలంగా పరలోకం కోసం పుణ్యం సంపాదించుకోవాలనుకున్నాను. నాకు తెలుగుభాషలో ఏమంత పాండిత్యం లేదు. కాని మానవులందరిలోకెల్లా ప్రియతములు, మానవ మహోపకారి అయిన ముహమ్మద్(సల్లం) పిలుపును సర్వవ్యాప్తం చేయవలసిన బాధ్యతను, ఆయన అనుసరించిన ధర్మప్రచార రీతిని-నాకు తెలిసినంతవరకు ధర్మప్రచార కార్యకలాపాల్లో తలమునకలై ఉన్న నేటి విద్యార్థులకు, అధ్యాపకులకు తెలియజేయాలన్న ఆతురతతో, ప్రవక్త పదవీ బాధ్యతల గురించి, ఆ మహోన్నతస్థానం గురించి మాట్లాడే భాగ్యాన్ని దక్కించుకోవాలన్న కాంక్షతో, ముఖ్యంగా నా పరలోక జీవితాన్ని చక్కదిద్దుకోవాలన్న ఆశతో ఆ సభకు వెళ్ళాలనుకున్నాను. ఆ ఆశే నన్ను అక్కడికి లాక్కెళ్ళింది.

ధర్మప్రచార కార్యాన్ని నిర్వర్తించటంలో వివిధ మతాల తులనాత్మక అధ్యయనం ఎంతో ప్రాముఖ్యం వహిస్తుంది. ప్రస్తుత కాలంలో దాని అవసరం చాలా ఉంది. ఈ రోజుల్లో అనేక ధార్మిక బృందాలు ఈ పనిని నిర్వర్తించటం సంతోషకరమే. కాని దైవప్రవక్త (సల్లం) బోధించిన ధర్మప్రచార (దావత్) సూత్రాల గురించి, ఆయన శైలీవిధానాల గురించి తెలియనివారు కూడా కొందరు ఈ బృందాల్లో చేరిపోతుండటం మూలంగా వారి కార్యకలాపాల్లో ఆనాటి శుభాలుగాని, కళగాని కానరావటం లేదు.

దేశంలోని వివిధ భాషల్లోకి ''దైవప్రవక్త (సల్లం) జీవిత చరిత్రను'' అనువదింపజేయటం అవసరమనీ, ముఖ్యంగా నూతన తరానికి దీని అవసరం చాలా ఉందన్నది నా అభిప్రాయం. అంతేకాదు, ఆలోచనాపరంగా, విద్యాపరంగా, రాజకీయపరంగా సమాజానికి నేతృత్వం వహిస్తున్న మన నాయకగణం గనక తలచుకుంటే

www.abulhasanalinadwi.org

ప్రజల్లో తిష్ఠవేసివున్న జడత్వాన్ని, అరాచకాన్ని, ఆధ్యాత్మిక నిర్లక్ష్యాన్ని, పదార్థ పూజనూ, భౌతిక బానిసత్వాన్ని, పాశ్చాత్య భావజాలం పట్ల మక్కువనీ దూరం చేసి వారిలో నవచైతన్యాన్ని, నూతనోత్తేజాన్ని నింపి సత్యధర్మ సంస్థాపనను, నవసమాజ నిర్మాణాన్ని సాధించి తీరుతుందని కూడా నేను ఘంటాపథంగా చెప్పగలను. కాని శోచనీయమైన విషయం ఏమిటంటే దైవదౌత్య విధానం గురించి, దాని స్వరూపస్వభావాల గురించి మన నేతలకే తెలియదు. దాని విలువ, ప్రాముఖ్యతలు వారికే ఒంటబట్టవు. మానవ జీవితానికి, సంస్కృతీనాగరికతలకు దైవదౌత్యం చేసిన ఉపకారం ఎలాంటిదో, దానిమూలంగా లోకానికి ఎన్ని ప్రయోజనాలు చేకూరాయో, నవతరం, నవనాగరికతలు ఈ దైవదౌత్యంతో తెగత్రెంపులు చేసుకోవటం మూలంగా మన నాగరిక సమాజం ఎలాంటి భ్రష్టత్వానికి గురయిందో, ఎంతటి లోతైన వినాశ కూపంలో అది పడిపోబోతుందో వారికి బోధపడటం లేదు.

"అల్ యౌమ అక్మల్తులకుమ్ దీనకుమ్ వ అత్మమ్తు అలైకుమ్
నీమతీ వ రజీతు లకుముల్ ఇస్లామ దీనా"

ఈ నాడు నేను మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం చేశాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తిచేశాను. మీ కొరకు ఇస్లామ్‌ను మీ ధర్మంగా అంగీకరించాను.

పై సూక్తి ద్వారా కేవలం ముస్లిం సమాజానికి మాత్రమే కాకుండా యావత్తు మానవాళికీ లభించిన సంపదను, వరాలను, ప్రత్యేకతను గురించి కూడా చాలా తక్కువమంది యోచించి ఉంటారు. మొదటగా ఈ సూక్తుల్లో ప్రవక్తల పరంపర ముగిసిపోయిందని ప్రకటించటం జరిగింది. ముహమ్మద్ (సల్లం) అంతిమ దైవప్రవక్త. ఆయన తర్వాత మరే ప్రవక్తా రాడు. ప్రపంచంలో ప్రవక్తలు నేర్పించవలసిన విద్యాసంస్కారాలు మిగిలి లేవు. కనుక ఇక ప్రపంచానికి మరే ప్రవక్తా రావలసిన అవసరం లేదు. దేవుడు ఈ ఇస్లాం ధర్మాన్ని, మరో మాటలో చెప్పాలంటే తన అనుగ్రహాన్ని పరిపూర్ణం చేశాడు. ఇకపోతే రెండో విషయం దైవధర్మాన్ని, దైవానుగ్రహాలను పరిపూర్ణం చేయటం జరిగిందనే ప్రకటన ద్వారా ధర్మంలో ఇక ఎలాంటి సవరణకుగాని హెచ్చుతగ్గులకుగాని అవకాశం లేదనీ మరే ప్రవక్తా రానవసరం లేదని తెలుస్తోంది.

మహాప్రవక్త (సల్లం) ఇహలోకం వీడి వెళ్ళిపోయేముందే ప్రవక్తల పరంపర ఆయనతో అంతమవుతుందనీ, తాను తన అనుగ్రహాన్ని పరిపూర్ణం చేశాననీ, ఆయన తర్వాత మరే ప్రవక్తా రాడనీ, మరే నూతన సమాజం ఆవిర్భవించబోదని ప్రకటించటం దేవుడు ముస్లిం సమాజానికి చేసిన మరో మహోపకారం. దివ్యఖుర్ఆన్‌లో ఎంతో వివరంగా చేయబడిన ఈ ప్రకటన ద్వారా మనకు గొప్ప గుణపాఠం, సందేశం లభిస్తున్నాయి. ఈ ప్రకటన మనల్ని విశ్వాసాల, ఆచరణల ప్రాదేశిక,కాలపరమైన ఏకత్వం వైపుకు పిలుపునిస్తోంది. ప్రళయం వరకూ ముస్లిం సమాజ విశ్వాసాలు, ఆచరణలు ఒకేవిధంగా ఉంటాయనీ, ప్రతియుగంలో ప్రతిచోటా ముస్లింలు ధర్మం, విశ్వాసం, ఆచరణల పరంగా ఐకమత్యంతో

www.abulhasanalinadwi.org

ఉంటారని కూడా దీని ద్వారా మనకు బోధపడుతోంది.

మా ఆధ్యాత్మిక గురువులు, ప్రముఖ ఇస్లామీయ విద్వాంసులు హజ్రత్ మౌలానా సయ్యిద్ అబుల్ హసన్ అలీ నద్వీ (రహ్మాలై) గారితో నాకు సేవా సంబంధం ఏర్పరచిన మా నాన్న - శ్రీయుత గౌరవనీయులు బషీరుద్దీన్ అహ్మద్ (ఇంజనీర్) గారికి నేను నిండు హృదయంతో కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. నా భార్యకూ, నాకూ పవిత్ర మక్కానగరంలో ఆ మహానుభావుని చేతిపై 'బైత్' చేసే భాగ్యం లభించింది. అది నాకు గర్వకారణం.

హిజాజ్ వాస్తవ్యులైన ప్రియసోదరులు యూనుస్ మైమనీ గారి ముందు ఈ పుస్తకం అనువాదం చేయిస్తున్నానని చెప్పినప్పుడు ఆయన ఎంతగానో సంతోషించి ఈ శుభకార్యం త్వరగా నెరవేరటం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయటం ప్రారంభించారు. నేనాయనకూ కృతజ్ఞుణ్ణి. ఆ తర్వాత ముఖ్యంగా దీనిని పునఃపరిశీలించి ఇచ్చిన ముహమ్మద్ ఆసిఫుద్దీన్ (M.B.A., L.L.B) గారికి కూడా నేను నిండు హృదయంతో కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఈ పుస్తకాన్ని ప్రచురించటంలో నాకు తగిన విధంగా సూచనలిచ్చిన పెద్దలు జనాబ్ సయ్యిద్ గులామ్ మహ్మూద్ జీలానీగారికి, జనాబ్ ముహమ్మద్ ఉస్మాన్ హిజాజ్‌గారికి, ఈ పుస్తకాన్ని ఉర్దూ నుండి తెలుగులోకి అనువదించిన అల్‌హఖ్ తెలుగు పబ్లికేషన్స్ డైరెక్టరు ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ గారికి అందరికీ నేను కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

చివరగా ఈ పుస్తకాన్ని ఉర్దూనుండి తెలుగులోకి అనువదించుకోవటానికి అనుమతినిచ్చిన మా ఆధ్యాత్మిక గురువులు-లక్నో పట్టణంలోని నద్వతుల్ ఉలమా కళాశాల ప్రిన్స్‌పాల్, ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షులు మౌలానా సయ్యిద్ రాబె హసనీ నద్వీగారికి కూడా కృతజ్ఞతలు తెలుపుకుంటూ దేవుడు ఆయనకు ఆయురారోగ్యాలను ప్రసాదించాలనీ, మరింత ధర్మసేవ చేసే అవకాశం కల్పించాలని కోరుకుంటున్నాను.

ఈ సత్కార్యాన్ని నా కొరకు, నా ఆలుబిడ్డలకొరకు క్షమాభిక్షాసాధనంగా, పరలోక సామాగ్రిగా భావిస్తూ ఈ అనువాద కృతిని దైవసన్నిధిలో సమర్పించుకుంటున్నాను. దేవుడు ఈ చిరుకృషిమీద ఆమోదముద్ర వేయాలనీ, మా ఆధ్యాత్మిక గురువులైన సయ్యిద్ అబుల్ హసన్ అలీ నద్వీగారి సమాధిని వెలుగుతో నింపాలనీ, ఆయన పరలోక అంతస్తుల్ని పెంచాలనీ, ఆయనగారి ఈ పుస్తకం ద్వారా ముస్లింలకు ముఖ్యంగా ముస్లిమేతర సోదరులకు సన్మార్గం లభించాలని కోరుకుంటూ......

ప్రకాశకులు

అబుల్ హసన్ అలీ నద్వీగారి శిష్యుడు

ముస్లిహుద్దీన్ అహ్మద్ హైదరాబాదీ.

# రచయిత గురించి....

మౌలానా సయ్యిద్ అబుల్ హసన్ అలీ నద్వీ (రహ్మలై) 20వ శతాబ్దపు ఇస్లామీయ విద్వాంసుల్లో ప్రముఖులు. గొప్ప తత్త్వవేత్త. అరబీ, ఉర్దూ భాషల్లో అసామాన్య పాండిత్యం కలిగిన రచయిత. మౌలానాగారు 1914వ సంవత్సరం రాయ్‌బరేలీలోని ఓ ధార్మిక కుటుంబంలో జన్మించారు. ఈయన పూర్వీకులు 1857 సిపాయిల తిరుగుబాటులో పాల్గొన్నవారు. బ్రిటిషు సామ్రాజ్యవాదుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన, యావత్తు భారతజాతి గర్వించదగ్గ ప్రప్రథమ స్వాతంత్ర సమరయోధుడు సయ్యిద్ అహ్మద్ షహీద్ (రహ్మలై) ఈయన వంశంవారే.

మౌలానా అబుల్ హసన్‌గారికి చిన్నప్పటి నుంచే అరబీభాష మీద, సాహిత్యం మీద వల్లమాలిన ఆసక్తి ఉండేది. ఆ ఆసక్తే ఆయన్ని ఇస్లామీయ పరిజ్ఞానం పట్ల ఆకర్షితుణ్ణి చేసింది. 1934 వ సంవత్సరంలో ఆయన తన 20వ యేట నద్వతుల్ ఉలమా కళాశాలలో ఖురాన్ వ్యాఖ్యాన (తఫ్సీర్) ఉపాధ్యాయుడిగా ఇస్లాం ధర్మ సేవా కార్యక్రమానికి నడుం బిగించారు. ఎన్నో గ్రంథాలు రాశారు. లెక్కకు మించి ఉపన్యాసాలు ఇచ్చారు.

1966-1983 మధ్య కాలంలో ఆయన ముస్లిం దేశాలలో ఇస్లాం విద్య పరిస్థితి, ముస్లిం దేశాలమీద పాశ్చాత్య సంస్కృతి ప్రభావం గురించి వివరిస్తూ, ముస్లిం దేశాలలో ఇస్లామీయ విద్యా జాగృతిని, ఆధునిక విద్యా ప్రాముఖ్యతను నొక్కి వక్కాణిస్తూ అరబీ భాషలో అనేక పుస్తకాలు రచించారు. అదే సమయంలో భారతదేశ ముస్లిం ప్రజానీకానికి ప్రతినిధిగా, ప్రభుత్వానికి-ముస్లిం ప్రజానీకానికి మధ్య వారధిగా ఉండి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమైనవి. ముస్లిం-ముస్లిమేతరుల మధ్య అంతరాల అగాధాలను పూడ్చటానికి, భారతదేశ సంస్కృతిమీద ఇస్లాం మరియు ముస్లింల ప్రభావాన్ని చాటి చెప్పటానికి, ఇస్లాం మతగురువులు, రాజులు, విజేతలు భారతజాతికి ఏక దైవారాధన, సర్వమానవ సమానత్వం, సౌభ్రాతృత్వం, స్త్రీల పట్ల గౌరవం, సమన్యాయ పాలన లాంటి ఎన్నో అపురూపమైన కానుకలు ఇవ్వటమేగాకుండా వారు భారతదేశాన్ని తమ స్వంత దేశంగా భావించారనే విషయం ప్రతి భారతీయుడికీ తెలియపరచటం కోసం ఆయన తన వ్యాసాల ద్వారా ఉపన్యాసాల ద్వారా ఎంతగానో కృషి చేశారు.

ఇస్లాం కోసం ఏడు దశాబ్దాల పాటు నిర్విరామంగా కృషి చేసిన ఆ మహానుభావుడు 1999 డిసెంబరు 31వ తేది, హి.శ. 1421 రమజాన్ మాసం 25వ తేది శుక్రవారం నాడు జుమా నమాజుకు ముందు అనవాయితీ ప్రకారం దివ్యఖురాన్ పారాయణం చేస్తూ ఇహలోకం వీడిపోయారు. దేవుడు ఆయన మీద శాంతికారుణ్యాలు కురిపించుగాక! ఆమీన్.

# Our Distributors Addresses

★ **Darul-Kitab**
Tel: No. 040-23211993
Distbuters, A-109, 1st Floor Mayur Kushra
Gunfoundry, Abids-Hyderabad-500 001
Opp: State Bank of Hyderabad Main Branch.

★ **Huda Book Distributors**
Purani Haveli Road,
Hyderabad.
Tel: 24411637

★ **Maktaba Al-Hasani**
Near Mallapalli Masjid
Hyderabad.
Tel: 23340466.

www.abulhasanalinadwi.org

బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీమ్

# శుభోదయం

మన ప్రవక్త (ఆయనపై దేవుని శాంతి, కారుణ్యాలు వర్షించుగాక!) ఏనుగుల వారి సంఘటన జరిగిన సంవత్సరం[1] వసంతకాలంలో రబీవుల్ అవ్వల్ మాసం తొమ్మిదో తేది[2] సోమవారంనాడు అంటే క్రీ.శ.571 ఏప్రిల్ 22వ తేదీన ఉషోదయం అయిన తరువాత సూర్యోదయానికి ముందు జన్మించారు. ఆయన(స) తన తల్లిదండ్రులకు ఏకైక సంతానం.[3] ఆయన(స) పుట్టకముందే ఆయన తండ్రి చనిపోయారు.[4]

ఆయన(స) తాతగారైన అబ్దుల్ ముత్తలిబ్ కూడా అనాధాశ్రమ జీవితాన్ని అనుభవించిన వ్యక్తి. నలభై నాలుగు సంవత్సరాలకే నూరేళ్ళు నిండిపోయిన తన కుమారుడు అబ్దుల్లాహ్‌కు జ్ఞాపికగా బాలుడు జన్మించాడన్న శుభవార్త వినగానే ఆయన ఇంట్లోకి విచ్చేశారు. అప్పుడే పుట్టిన పసికందుని ఎత్తుకొని పవిత్ర కాబా గృహంలోకి వెళ్ళి ప్రార్థన చేసి తిరిగి పిల్లవాడిని ఇంటికి తీసుకొనివచ్చారు.[5] ఏడవరోజున ఖుర్బానీ చేసి ఖురైష్ తెగవారందరినీ విందుభోజనానికి అహ్వానించారు. భోజనాదులు ముగిశాక విందుకు వచ్చిన జనం పిల్లవాడికి ఏంపేరు

---

1) సీరత్ ఇబ్నెహిషామ్ మొదటి సంపుటిలో 171వ పుట. ఏనుగులవారి సంఘటన జరిగిన సంవత్సరానికి సంబంధించిన ఉల్లేఖనాన్ని ఇమామ్ తిర్మిజీ మహిమోన్నతల ప్రకరణంలో ఉల్లేఖించి దాని ప్రామాణికతను బలపరిచారు.

2) ఇబ్నె ఇస్‌హాఖ్ రబీవుల్ అవ్వల్ పన్నెండో తేది అని ఉల్లేఖించారు. ఇబ్నెహిషామ్ మొదటి సంపుటి 171వ పుటలో సోమవారం నాడు జన్మించారని ప్రామాణికమైన ఉల్లేఖనాలు తెలుపుతున్నాయి. సహీహ్ ముస్లిం గ్రంథంలోని ఉపవాసాల ప్రకరణంలో 'ఇస్తిహ్‌బాబు సియామి సలాసతి అయ్యామిన్ మిన్‌కుల్లి షహ్‌రిన్' అనే అధ్యాయం.

3) ఖాజీ సులైమాన్ మన్సూర్‌పూరీ (రహ్మాలై)గారి 'రహ్మతుల్లిల్ అలమీన్' అనే గ్రంథం అధారంగా.

4) ముసన్నఫ్ అబ్దుర్రజ్జాఖ్ ఐదవ సంపుటిలో 317వ పుట. ముస్తద్రక్ హాకిం రెండు, ఐదు, ఆరు సంపుటాలు. హాకిం ఈ ఉల్లేఖనాన్ని ఇమామ్ ముస్లిం నియమాలననుసరించి వెలికితీశారు. ఇమామ్ జహబీ(రహ్మాలై) కూడా దాన్ని సమర్థించారు.

5) సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటి 160వ పుట. తబఖాత్ ఇబ్నె సాద్ మొదటి సంపుటి 103వ పుట తహ్‌జీబ్ తారీఖె దమిష్క్ మొదటి సంపుటి 284వ పుట.

www.abulhasanalinadwi.org

పెట్టారని అడిగారు. "ముహమ్మద్" అని అబ్దుల్ ముత్తలిబ్ చెప్పారు. ఆ పేరు వినగానే జనమంతా ఆశ్చర్యపోతూ వంశపరంపరలో ఉన్న పేర్లన్నింటినీ వదలి ఈ క్రొత్త పేరు పెట్టారేమిటి?" అని ప్రశ్నించారు. "ముహమ్మద్ అంటే ప్రశంసించదగినవాడు. నా మనుమడు లోకం ప్రశంసలు, మన్ననలు పొందుతాడు" అని ఆశాభావం వ్యక్తం చేశారు[1] అబ్దుల్ ముత్తలిబ్.

## పాల గడువు

అందరికన్నా ముందు ఆయన తల్లి ఆయన(స)కు పాలు పట్టింది. రెండు మూడు రోజుల తరువాత అబూలహబ్ దాసి అయిన 'సౌబియ్యా' ఆయనకు పాలు త్రాపించటం మొదలుపెట్టింది[2]. అప్పటి ఆచారం ప్రకారం అరబ్బుదేశంలో నగరాల్లో నివసించే సర్దారులు, ఉన్నత వర్గాలవారు పాలుత్రాగే తమ పసిపిల్లలను చుట్టుప్రక్కల గ్రామాలకు పంపించేవారు. పిల్లలు పల్లె వాతావరణంలో పెరిగి స్వచ్ఛమైన అరబీ భాషను నేర్చుకుంటారనీ, స్వచ్ఛమైన అరబ్బు లక్షణాలను పుణికి పుచ్చుకుంటారన్న ఉద్దేశ్యంతో వారలా చేసేవారు. ఆయన(స) జన్మించిన కొంతకాలానికి హవాజిన్ తెగకు చెందిన కొంతమంది మహిళలు పాలుపట్టాల్సిన పసిపిల్లల్ని వెతుక్కుంటూ మక్కానగరానికి వచ్చారు. వారిలో హలీమా సాదియా ఆయా కూడా ఉన్నారు. కాకతాళీయంగా ఆమెకు ఏ పసిపిల్లవాడూ దొరకలేదు. ఆయన(స) తల్లి తన పిల్లవాడి ఆలనాపాలనా కోసం ఆమెను నియమించాలనుకున్నారు. కాని హలీమా సాదియా తండ్రిలేని పిల్లవాడ్ని తీసుకున్నా ప్రయోజనమేముంటుంది? అని ముందు కాస్త తటపటాయించారు. అయితే ఒట్టి చేతులతో తిరిగి వెళ్ళటం ఎందుకులే అని తల్లి ఆమినా విజ్ఞప్తిని అన్యమనస్కంగానే అంగీకరించారు. ఆయన్ను తన ఇంటికి తీసుకెళ్ళారు. రెండు సంవత్సరాల తరువాత పిల్లవాడ్ని తిరిగి మక్కాకు తీసుకువచ్చి తల్లికి అప్పగించారు.

---

1). తహ్జీబ్ తారీఖె దమిష్క్ మొదటి సంపుటి 282వ పుట. అల్‌బిదాయా వన్నిహాయా రెండవ సంపుటిలో 264వ పుట.

2) సహీహ్ బుఖారీలో నికాహ్ ప్రకరణంలో "లాయతజవ్వజు అక్సర మిన్ అర్బయిన్" తరువాతి అధ్యాయం.

www.abulhasanalinadwi.org

కాని అదే సమయంలో మక్కానగరంలో అంటువ్యాధి ప్రబలి వుండటం మూలంగా పిల్లవాడిని ఇంకొంత కాలం ఆమె దగ్గరే ఉంచుకోమని ఆయన (స) తల్లి చెప్పి పంపించారు. అంటువ్యాధి తగ్గిపోయిన తరువాత హలీమా పిల్లవాడిని తిరిగి మక్కాకు తీసుకువచ్చారు.[1]

ఆయన(స) తనకు పాలు తాపిన తల్లి హలీమా సాదియాను ఎంతగానో ప్రేమించేవారు. హలీమా సాదియా భర్త, అంటే ఆయన(స)కు పాలవరస తండ్రిపేరు హారిస్ బిన్ అబ్దుల్ ఉజ్జా. ఆయన(స) దైవప్రవక్త అయిన తరువాత హారిస్ ఒకసారి మక్కా వచ్చారు. ఆయన(స)ను కలుసుకొని "నువ్విచ్చే సందేశమేమిటి?" అని అడిగారు. దానికి సమాధానమిస్తూ ఆయన(స) "నేను చెప్పే మాటలు నిజమని మీకు రుజువు చేసి చూపిస్తాను. ఆ రోజు తప్పకుండా వస్తుంది" అని అన్నారు. అది విన్నవెంటనే హారిస్ ఇస్లాం స్వీకరించారు.[2]

## పినతండ్రి సంరక్షణలో

ఆరవ ఏట ఆయన(స) తల్లి ఆయన్ను మదీనా తీసుకొని వెళ్ళారు. ఆయన(స) తాతగారి అమ్మమ్మ తరపు బంధువులు మదీనాలోని నజ్జార్ తెగకు చెందినవారు. ఆయన(స) తల్లి కొంతకాలం ఆ బంధువుల దగ్గరే ఉన్నారు. ఈ ప్రయాణంలో అయన(స) దాది అయిన ఉమ్మె ఐమన్ కూడా వారికి తోడుగా వెళ్ళింది. మదీనాలో ఒక నెలరోజులపాటు ఉండి వారు ముగ్గురూ మక్కాకు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో

1) సీరతున్నబీ మొదటి సంపుటిలో 172-173 పుటలు. హలీమా సాదియా ఆయన(స)కు పాలు త్రాపించిన సంఘటన అందరికీ తెలిసిందే. ఎంతోమంది చరిత్రకారులు ఈ విషయాన్ని గురించి వివరించారు. అంతేగాకుండా హదీసువేత్తల్లో ఇమామ్ హాకిమ్ తన గ్రంథమైన ముస్తద్రక్ రెండో సంపుటి 216వ పుటల్లో, ఇమామ్ అహ్మద్ తన గ్రంథమైన ముస్నద్ నాల్గో సంపుటి 184వ పుటలో, దారిమి తన సునన్ గ్రంథం మొదటి సంపుటి 8వ పుటలో, తబ్రానీ తన 'మోజమ్'లో, ఇబ్నెహిబ్బాన్ తన 'మవారిదుజ్జమ్ఆన్' గ్రంథంలో హలీమా సాదియా పాలు త్రాపించిన సంఘటన గురించి ప్రస్తావించారు. బాల్యంలో బనూసాద్ తెగలో ఉంటున్నప్పుడు అయన(స) ఉరం చీల్చబడిందన్న సంఘటనను ఇమామ్ ముస్లిం (రహ్మలై) తన సహీహ్ గ్రంథంలో పేర్కొన్నారు. విశ్వాసప్రకరణంలో అల్ ఇస్రా బి రసూలిల్లాహ్ అనే అధ్యాయం.

2) హాఫిజ్ ఇబ్నె హజర్ అస్ఖలానీ గ్రంథం అల్ఇసాబా మొదటి సంపుటి 283వ పుట.

www.abulhasanalinadwi.org

'అబ్వా' ప్రాంతానికొచ్చేసరికి ఆయన(స) తల్లి మరణించారు. ఆమె ఖనన సంస్కారాలు కూడా అక్కడే జరిగాయి. ఉమ్మె ఐమన్ ఆయన్ని తన వెంట మక్కా తీసుకొని వచ్చింది.[1]

తల్లి మరణించిన తరువాత తాత అబ్దుల్ ముత్తలిబ్ ఆయన్ని(స) తన సంరక్షణలోకి తీసుకున్నారు. అబ్దుల్ ముత్తలిబ్ మనుమడిని ఎప్పుడూ తనవెంటే ఉంచుకునేవారు.[2] కొంతకాలానికి తన ఎనభై రెండవ యేట అబ్దుల్ ముత్తలిబ్ కూడా మరణించారు. అప్పటికి ఆయన(స) వయస్సు ఎనిమిదేళ్ళు.[3] జనం అబ్దుల్ ముత్తలిబ్ శవాన్ని మోసుకెళ్తుంటే తాతమీద ప్రేమకొద్దీ ఆయన(స) ఏడ్వటం మొదలుపెట్టారు. అబ్దుల్ ముత్తలిబ్ తాను మరణశయ్యపై ఉన్నప్పుడు ఆయన(స) సంరక్షణా బాధ్యతలు తన కొడుకు అబూతాలిబ్‌కు అప్పగించారు. అబూతాలిబ్ ఆయన్ని ఎంతగానో ప్రేమించేవారు. తన కన్నకొడుకులకన్నా బాగా చూసుకునేవారు. పడుకున్నప్పుడు ఆయన్ని తనప్రక్కనే పడుకో బెట్టుకునేవారు. ఎక్కడికన్నా బయలుదేరితే ఆయన్ని కూడా తన వెంట తీసుకొని వెళ్ళేవారు.[4]

బహుశా పది సంవత్సరాల వయసప్పుడు ఆయన(స) కాపరిగా పనిచేశారు.[5] తాను దైవప్రవక్త అయిన తరువాత కూడా ఆయన(స) ఆ మధురమైన జ్ఞాపకాలను నెమరు వేసుకునేవారు. అప్పుడప్పుడూ తన సహచరుల ముందు దాని గురించి ప్రస్తావించేవారు కూడా. ఒకసారి ఆయన(స) తన సహచరులతో కలిసి అడవికి వెళ్ళారు. అక్కడ ఆయన(స) సహచరులు రేగిపండ్లు కోసుకొని తినసాగారు. అది చూసి ఆయన(స), "బాగా నల్లగా ఉండే పండ్లు చాలా మధురంగా ఉంటాయి. నా బాల్యంలో నేను ఇక్కడ మేకలు కాసినప్పుడు అలాంటి పండ్లు తిని

1) సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటి 155వ పుట. తబఖాత్ ఇబ్నెసాద్ మొదటి సంపుటి 116వ పుట. బైహఖీ గ్రంథం దలాయిలున్నుబువ్వా మొదటి సంపుటి 188వ పుట.
2) ముసన్నఫ్ అబ్దుర్రజ్జాఖ్ ఐదవ సంపుటి 318వ పుట.
3) బైహఖీ గ్రంథం దలాయిలున్నుబువ్వా రెండో సంపుటి 22వ పుట. జహబీ గారి అస్సీరతున్నబవియ్యాలోని 25వ పుట.
4) సీరతున్నబీ మొదటి సంపుటిలో 177వ పుట
5) సహీహ్ బుఖారీలోని బాడుగల ప్రకరణం, రాయుల్ గనమి అలా ఖరారీత్ అధ్యాయం

www.abulhasanalinadwi.org

ఉన్నాను" అని అన్నారు.[1]

అబూ తాలిబ్ వ్యాపారం చేసేవారు. ఆ కాలంలో ఖురైష్ తెగకు చెందిన వర్తకులు సంవత్సరానికొకసారి వ్యాపార నిమిత్తం సిరియా దేశానికి వెళ్ళేవారు. అంచేత అబూతాలిబ్ కూడా ప్రతియేడు మాదిరిగానే ఆ యేడు కూడా సిరియాకు బయలుదేరారు. అప్పటికి ఆయన(స)కు పన్నెండేళ్ళు ఉంటాయేమో! ప్రయాణం కష్టంగా ఉంటుందనో లేక మరే కారణం వల్లనో ఆయన(స)ను తన వెంట తీసుకెళ్ళటానికి అబూతాలిబ్ యిష్టపడలేదు. కాని ఆయన(స)కు బాబాయి అంటే వల్లమాలిన ప్రేమ. ఆయన్ని విడిచిపెట్టి ఉండలేకపోయేవారు. అబూతాలిబ్ బయలు దేరుతుంటే పరుగెత్తుకుంటూ వెళ్ళి ఆయన్ని వాటేసుకున్నారు. అబూతాలిబ్ ఆ లేత మనసును కష్టపెట్టడం యిష్టం లేక ప్రయాణంలో ఆయన్ని కూడా తన వెంట తీసుకొని వెళ్ళారు.[2]

## సంక్షేమ కార్యక్రమాల్లో ఆసక్తి

ఇస్లాంకు పూర్వం అజ్ఞానకాలంలో అరబ్బుల్లో ఎడతెగకుండా యుద్ధాలు జరుగుతూనే ఉండేవి. అటువంటి యుద్ధాల్లో అత్యంత ప్రసిద్ధమైనది, భయంకరమైనది ఫిజ్జార్ యుద్ధం. ఇది ఖురైష్‌కు-ఖైస్ తెగవారికి మధ్య జరిగింది. ఈ యుద్ధానికి ఖురైష్ తెగ నాయకత్వం వహించటం వల్ల ఆయన(స)కూడా అందులో పాల్గొనాల్సి వచ్చింది. కాని ఆయన(స) ఎన్నడూ ఎవరిపైనా చెయ్యెత్తలేదు.[3]

ఈ యుద్ధాలు తరం తరం... నిరంతరం కొనసాగటం వల్ల ఎన్నో కుటుంబాలు నాశనమయ్యేవి. హత్యలు, వధింపులు వారసత్వనీతిగా పరిగణించబడేవి. కక్షలు కార్పణ్యాలు వారి జీవితాల్లో అంతర్లీనం అయిపోయి ఉండేవి. తమ పెద్దల పగ, ప్రతీకారాలను తీర్చుకోవటాన్ని ప్రజలు తమ విద్యుక్తధర్మంగా భావించేవారు. ఈ దారుణ మారణ

1) తబఖాత్ ఇబ్నెసాద్ మొదటి సంపుటిలో 80వ పుట.
2) సుననె తిర్మిజీలోని మహిమోన్నతల ప్రకరణం 'మాజాఅ ఫీ బద్‌యిన్నబువ్వహ్' అనే అధ్యాయం.
3) సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటి 195వ పుట. అర్రౌజుల్ అనిఫ్ సుహైలీ మొదటి సంపుటి 120వ పుట.

www.abulhasanalinadwi.org

హోమాలకు కొన్ని హృదయాలు చలించిపోయాయి. వాటిలో సంస్కరణా భావం జనించింది. అప్పుడు దైవప్రవక్త(స) బాబాయి, తన వంశానికి పెద్ద దిక్కు అయిన జుబైర్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ ఒక ప్రతిపాదన చేశారు. దాని ప్రకారం హాషిం, జుహ్రా, తైమ్ వంశాలకు చెందినవారంతా అబ్దుల్లాహ్ బిన్ జద్ఆన్ ఇంట్లో సమావేశమై తమలోని ప్రతి ఒక్కరూ బాధితుడికి సహాయం చెయ్యాలనీ, మక్కా నగరంలో దౌర్జన్యకారుల ఆటకట్టించాలని ప్రతినబూనారు.[1] ఈ సమావేశంలో ఆయన(స)కూడా పాల్గొన్నారు. తాను దైవప్రవక్త అయిన తరువాత కూడా తరచూ దాని గురించి ప్రస్తావిస్తూ ఉండేవారు. ఎవరైనా నాకు ఆ ప్రతిజ్ఞకు బదులుగా ఎర్ర ఒంటెలను ఇచ్చినాసరే నేను దానిని ఉపసంహరించుకొని ఉండేవాణ్ణి కాను. ఈ రోజు కూడా ఎవరైనా అలాంటి ఒప్పందాల కోసం పిలిస్తే అందులో పాల్గొనటానికి నేను సిద్ధంగా ఉంటాను[2] అని చెప్పేవారు.

ఆయన(స) తన చిన్నతనంలోనే అబూతాలిబ్‌తో కలసి కొన్ని వ్యాపారసంబంధమైన ప్రయాణాలు చేసి అన్ని విషయాల్లో అనుభవాన్ని గడించారు. ఆయన నిజాయితీ సద్వ్యవహారం గురించిన వార్తలు నలువైపులా వ్యాపించాయి. ఆయన(స) సహచరులైన అబ్దుల్లాహ్ బిన్ అబుల్ హమ్‌సా(రజి) ఇలా అంటున్నారు:

"ఆయన(స) దైవప్రవక్త కాకమునుపు ఒకసారి మా ఇద్దరి మధ్య లావాదేవీలకు సంబంధించిన ఒక వ్యవహారం కుదిరింది. వ్యవహారం పూర్తికాకముందే నేనాయనతో 'మీరిక్కడే ఉండండి, నేను మళ్ళీ వస్తాననీ' వాగ్దానం చేసి వెళ్ళిపోయాను. కాని మూడురోజుల దాకా నాకు ఆ వాగ్దానం సంగతి గుర్తుకు రాలేదు. మూడోరోజు వెళ్ళి చూస్తే ఆయన(స) అక్కడే నా కోసం నిరీక్షిస్తున్నారు. కాని నేను చేసిన వాగ్దానాన్ని మర్చిపోయినందుకు ఆయన(స) కొంచెమయినా నాపై కినుక వహించలేదు." "మీరు నన్ను ఇబ్బందిలో పడేశారండీ, నేను ఈ ప్రదేశంలోనే మీకోసం మూడు రోజుల

1) తబఖాత్ ఇబ్నెసాద్ మొదటి సంపుటి 82వ పుట.
2) ముస్తద్రక్ హాకిమ్ రెండవ సంపుటి 219 మరియు 220 పుటలు. ఇమామ్ జహబీ ఈ ఉల్లేఖనాన్ని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. ఇమామ్ బుఖారీ అల్ అదబుల్ ముఫ్రద్‌లో, బైహఖీ తన 'సునన్' గ్రంథంలో దీనిని పొందుపరిచారు.

www.abulhasanalinadwi.org

నుండి ఎదురుచూస్తున్నాను" అని మాత్రం అన్నారు.[1]

## హజ్రత్ ఖదీజా (రజి.అన్హా)తో వివాహం

ఖదీజా అనే ఆమె మక్కా నగరంలో ఓ గౌరవప్రద కుటుంబానికి చెందిన వితంతు మహిళ. గొప్ప ధనికురాలు. తన ధనాన్ని పెట్టుబడిగా పెట్టి ఇతరుల చేత వ్యాపారం చేయించేది. ఆమె అయన(స) మంచితనాన్ని గురించి విని, అయన సత్యసంధతను, నిజాయితీని, వ్యవహారశైలిని గురించి ప్రజల్ని అడిగి తెలుసుకుంది. ఆ తరువాత తన పెట్టుబడితో వ్యాపారం చేయమని తనే స్వయంగా అయన్ని కోరింది. అయన(స) ఆమె పెట్టుబడితో వ్యాపారం చేశారు. అందులో విపరీతమైన లాభం వచ్చింది. ఈ వ్యాపార ప్రయాణంలో ఖదీజాగారి బానిస మైసరా కూడా అయన(స)కు తోడుగా వెళ్ళాడు. ప్రయాణం నుండి తిరిగొచ్చిన తరువాత అతను అయన(స) మంచితనాన్ని గురించి, అయన(స) గుణగణాల గురించి ఖదీజాకు వివరించాడు. అయన(స) గుణగణాలకు ప్రభావితురాలై ఖదీజా (రజి అన్హా) తనే స్వయంగా వివాహ సందేశం పంపింది. సంప్రతింపుల తరువాత అయన(స) వివాహం ఖదీజాతో జరిగిపోయింది. విశేషమేమిటంటే అయన(స) కంటే ముందు ఆమె గొప్ప గొప్ప సర్దారుల వివాహ సందేశాలను త్రోసిపుచ్చారు.[2]

## కాబాగృహ పునర్నిర్మాణ వివాదం సద్దుమణిగేందుకు అయన చేసిన కృషి

అయన(స) మంచితనానికి ప్రభావితులైన ప్రజలందరూ అయన్ని పేరుపెట్టి పిలిచేబదులు 'సాదిఖ్' (సత్యసంధుడు) "అమీన్" (నిజాయితీ పరుడు) అని పిలిచేవారు. అప్పటికి అయన(స) వయస్సు పాతికేళ్ళు. ఆ కాలంలో ఒక వరదతాకిడికి కాబా గృహ గోడలు పడిపోయాయి.

1) సుననె అబుదావూద్‌లోని సంస్కార ప్రకరణంలో వాగ్దానాల అధ్యాయం
2) ఖదీజా (రజి.అన్హా) పెట్టుబడితో వ్యాపారం చేయడానికి అయన(స) సిరియా వెళ్ళారని హాకిమ్ తన గ్రంథం 'ముస్తద్రక్'లో ప్రస్తావించారు. (మూడవ సంపుటి 182వ పుట.) ఇమామ్ జహబీ దీనిని సమర్థించారు. హాకిమ్ వివాహ సంఘటనను గురించి కూడా ప్రస్తావించారు. జుర్ఖానీ ఈ విషయాలన్నింటినీ ఎంతో వివరంగా చర్చించారు. సహీహ్ బుఖారీలో దైవప్రవక్త(స) స్వయంగా ఆమె సుగుణాలను కొనియాడిన ప్రస్తావన ఉంది.

www.abulhasanalinadwi.org

అంచేత ఖురైషులు దాని పునర్నిర్మాణానికి ఉపక్రమించారు.[1] గృహనిర్మాణం పూర్తయ్యేవరకు అందరూ కలిసి పనిచేశారు. కాని "హజ్రె అస్వద్" (నల్లరాయి)ని ప్రతిష్ఠించే విషయానికి వచ్చేసరికి పెద్ద గొడవే జరిగింది. వారిలోని ప్రతి తెగా ఆ కీర్తి తమకే దక్కాలని పట్టుబట్టింది. మాటా మాటా పెరిగింది. పరస్పరం కత్తులు దూసుకునే దాకా వెళ్ళింది. ఆ కాలంలో అరబ్బు దేశంలో ఎవరయినా ప్రాణార్పణం చేస్తానని ప్రతినబూనితే దానికి సూచనగా ఒక పాత్రనిండా రక్తం తీసి దాంట్లో తన వ్రేళ్లుముంచేవాడు. ఈ వివాదం జరిగినప్పుడు కూడా కొంతమంది ఆ విధంగా ప్రతినబూని రక్తతర్పణం చేశారు. నాలుగురోజుల వరకు ఈ గొడవ భయంకరంగా కొనసాగింది. ఐదోరోజు ఖురైష్ తెగకు చెందిన వారిలో అందరికన్నా వయోవృద్ధుడు అబూ ఉమయ్యా బిన్ ముగీరా ఒక సలహా ఇచ్చాడు. రేపు ఉదయం అందరికన్నా ముందు కాబా గృహ ప్రాంగణంలోకి వచ్చిన వ్యక్తిని మధ్యవర్తిగా నిర్ణయించుకుందామన్నాడు. అందరూ అతని సలహాను అంగీకరించారు. అదృష్టవశాత్తూ మరునాడు ఉదయం అందరికన్నా ముందు ఆయన(స) కాబా గృహానికి వచ్చారు. ఆయన్ని చూడగానే ప్రజలంతా 'అమీన్' (నిజాయితీపరుడు)వచ్చాడు. అతనిచ్చే తీర్పుని మేము సంతోషంగా ఒప్పుకుంటాం' అని నినదించటం మొదలుపెట్టారు. ఆ సందర్భంగా ఆయన(స) తన బుద్ధి కౌశలంతో, విషయావగాహనతో ఒక ఉపాయం చెప్పారు. ఉభయతారకమైన దానిపట్ల అందరూ తమ హర్షం వెలిబుచ్చారు. ఆయన(స) నేలపై ఒక దుప్పటిని పరచి తన చేతులతోనే హజ్రెఅస్వద్‌ను దానిపై ఉంచారు. ఆ తరువాత వివిధ తెగల నాయకులందరినీ పిలిచి ఆ దుప్పటిని పట్టుకొని పైకెత్తమని ఆజ్ఞాపించారు. అలా అందరూ కలిసి దుప్పటి సాయంతో రాయిని పైకెత్తగానే ఆయన(స) తన స్వహస్తాలతో గోడమూలన, కాబా ప్రదక్షిణ మొదలెట్టే చోట దాన్ని ప్రతిష్ఠించారు.[2] ఈ చిన్న ఉపాయంతో హజ్రెఅస్వద్ వివాదం సద్దుమణిగింది. లేకపోతే ఈ మామూలు వివాదమే మున్ముందు భీకరపోరాటానికి తెరతీసేది. ఆ కాలంలో అరబ్బులు పశువులకు నీళ్లు త్రాపించటం, గుర్రాలను పరుగెత్తించటం, కవితలు అల్లి ఒకరినొకరు

1) ముసన్నఫ్ అబ్దుర్రజ్జాఖ్ ఐదవ సంపుటి 102వ పుట. ఇమామ్ జహబీ ఈ ఆధారాన్ని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు.

2) ముస్నదె అహ్మద్ మూడవ సంపుటిలో 425వ పుట. మొదటి సంపుటిలో 458 వ పుట. ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటిలో 458వ పుట.

www.abulhasanalinadwi.org

తూలనాడటం లాంటి చిన్న చిన్న విషయాలపై ఒకసారి గొడవపడి యుద్ధానికి దిగారంటే ఇరవై, ముప్పై సంవత్సరాలైనా ఆ యుద్ధం అంతమయ్యేది కాదు.

## దైవిక శిక్షణ

ఆయన(స) తన బాల్యంలోగాని, యుక్తవయస్సులోగాని ఎన్నడూ బహుదైవారాధన ఆచారాలను పాటించలేదు. దైవప్రవక్త కాకమునుపు కూడా నిత్యం ఆయన(స) వాటికి దూరంగానే ఉన్నారు. ఒకసారి ఖురైషులు విగ్రహాలకు నైవేద్యంగా పెట్టిన ఆహారం తినమని ఆయనకు తెచ్చిచ్చారు. అందులో ఒక విగ్రహం పేరుమీద బలిఇచ్చిన జంతువు మాంసం ఉంది. ఆయన(స) దాన్ని తినటానికి నిరాకరించారు.[1] దైవప్రవక్త కాక ముందు నుంచే ఆయన(స) విగ్రహారాధనను ఖండించేవారు. తనకు బాగా తెలిసిన మిత్రులను దాన్నుండి వారించేవారు కూడా.[2]

దైవప్రవక్త(స) పుట్టిన కాలంలో మక్కా నగరం బహుదైవారాధనకు నిలయంగా విరాజిల్లుతోంది. ఒక్క పవిత్ర కాబాగృహంలోనే మూడొందల అరవై విగ్రహాలుండేవి. ఆ విగ్రహాలయ సంచాలకులు, సంరక్షకులు దైవప్రవక్త(స) కుటుంబీకులే. ఆ విధంగా వారి కుటుంబం మక్కాలో ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. అయినప్పటికీ ఆయన(స) ఎన్నడూ ఏ విగ్రహం ముందూ తలవంచలేదు. ఇతర అజ్ఞాన కాలపు ఆచారాలలోనూ పాల్గొనలేదు. ఖురైషులు ప్రతి విషయంలోనూ తాము ఇతరులకన్నా ప్రత్యేకంగా, విలక్షణంగా ఉండాలని కోరుకునేవారు. స్వయంగా ఎన్నో ఆచారాలను కల్పించుకున్నారు. హజ్‌యాత్ర కాలంలో ఖురైషులు అరఫాత్ మైదానానికి వెళ్ళవలసిన అవసరం లేదని చెప్పేవారు. బయటినుంచి యాత్రకోసం వచ్చేవారు ఖురైషుల వస్త్రధారణను అనుకరించాలి. లేదా నగ్నంగానే కాబా గృహం చుట్టూ ప్రదక్షిణ చెయ్యాలి. ఈ కారణంగానే ఆ కాలంలో నగ్నంగా కాబా ప్రదక్షిణాలు చేసే ఆచారం ఏర్పడింది. అయితే ఆయన(స) ఈ విషయాల్లో ఎన్నడూ తన వంశం వారితో సహకరించలేదు.[3]

1) సహీహ్ బుఖారీలో ఇలాంటివి పలు సంఘటనలు ప్రస్తావించబడి ఉన్నాయి. సహీహ్ బుఖారీలోని మహిమోన్నతల ప్రకరణం
2) ముస్తద్రక్ హాకిం మూడవ సంపుటి 216వ పుట. మోజమ్ కబీర్ తబ్రానీ ఐదవ సంపుటిలో 88వ పుట.
3) సహీహ్ బుఖారీ

www.abulhasanalinadwi.org

# మానవత్వం మొర ఆలకించబడిన వేళ

దైవప్రవక్తగా నియుక్తులయ్యే రోజులు సమీపిస్తున్న కొద్దీ ఆయనలో ఏకాంత ప్రియత్వం పెరగసాగింది. ఆయన తరచూ కొంచెం సత్తు, నీళ్లు వెంటబెట్టుకొని మక్కాకు వెలుపల కొన్ని కోసుల దూరంలో ఉన్న నిర్జన ప్రదేశానికి వెళ్ళేవారు. అక్కడ హిరా కొండ గుహలో కూర్చొని దైవారాధనలో కాలం గడిపేవారు. ఈ ఆరాధనలో ఆయన అల్లాహ్‌ను స్మరించేవారు. సృష్టిని, సృష్టికర్తను గురించి యోచన చేసేవారు. వెంట తీసుకెళ్లిన నీళ్లు, సత్తు అయిపోయేవరకు ఇంటికి తిరిగి వచ్చేవారుకాదు. ఆ తరువాత కొంత కాలానికి ఆయన(స)కు కలలు రావటం మొదలయ్యాయి. అతి త్వరలోనే ఆ కలలు నిజమయ్యేవి. రాత్రి కలగన్న విషయాలు పగలు అచ్చం అలాగే జరుగుతున్నట్టు అనిపించేవి. అలవాటు ప్రకారం ఆయన(స) ఒకరోజు హిరా గుహలో దైవధ్యానంలో ఉండగా ఆయన ముందు ఓ దైవదూత ప్రత్యక్షమయ్యాడు. "చదువు" అని అతను ఆయన్ని (స) కోరాడు. తనకు చదవటం రాదన్నారు ఆయన(స). ఆ దైవదూత ఆయన్ని గట్టిగా కౌగిలించుకొని వదలిపెట్టాడు. ఆ కౌగిలి బంధానికి జవసత్వాలు నశించినట్లనిపించింది ఆయనకు. దైవదూత మళ్లీ చదవమన్నాడు. తాను చదువుకున్న వాణ్ణి కాదని ఆయన(స) అన్నారు. ఈసారి అతను మరింత బలంగా ఆయన్ని కౌగిలించుకొని వదలిపెట్టాడు. ఆ తరువాత 'చదువు' అన్నాడు. ఆయన(స) తనకు చదవటం రాదనే అన్నారు. దైవదూత ఈసారి ఇంకా గట్టిగా కౌగిలించుకొని చదవమని పురమాయించాడు. అప్పుడు కూడా ఆయన అదే జవాబు చెప్పారు. ఆ సందర్భంగా దైవదూత ఈ క్రింది వాక్యాలు పఠించి వినిపించాడు:

www.abulhasanalinadwi.org

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

"చదువు, సృష్టించిన నీ ప్రభువు పేరుతో చదువు, ఆయన మానవుడిని నీళ్లపురుగుతో పుట్టించాడు. చదవనారంభించు, నీ ప్రభువు పరమ దయామయుడు. ఆయన కలం ద్వారా జ్ఞానబోధ చేశాడు. మనిషికి తెలియని విషయాలన్నీ నేర్పాడు."

ఈ సంఘటన జరిగిన తరువాత ఆయన(స) కంగారుపడుతూ ఇంటికి వచ్చి పడుకున్నారు. వణుకు పుట్టిస్తున్న భయానికి తట్టుకోలేక తనపై దుప్పటి కప్పేయమని భార్యతో అన్నారు. కాసేపటికి మనసు కుదుటపడ్డాక తనకు ఇలాంటి దృశ్యాలు కనబడుతున్నాయని, చచ్చిపోతానేమోనని భయంగా ఉందని సతీమణితో చెప్పారు. అది విని ఖదీజా (రజి.అన్హా) "భయమెందుకండీ, మీరు బంధువులను ఆదరిస్తారు. ఎల్లప్పుడూ సత్యం పలుకుతారు. వితంతువులు, అనాథలు, నిరాశ్రయుల్ని ఆదుకుంటారు. అతిథులను గౌరవిస్తారు. కష్టాల్లో ఉన్నవారి పట్ల సానుభూతితో వ్యవహరిస్తారు. అట్లాంటి మిమ్మల్ని దేవుడు ఎన్నటికీ దుఃఖాల పాల్జేయడు" అంటూ భర్తకు ధైర్యం చెప్పారు. పైకి తెలపకపోయినా ఖదీజా (రజి.అన్హా) మనసులో కూడా ఈ సంఘటన గురించి భయాందోళనలు మొదలయ్యాయి. ఆమె భర్తను తన బాబాయి కుమారుడైన వరఖా బిన్ నౌఫిల్ దగ్గరికి తీసుకు వెళ్ళారు. ఆయనకు హిబ్రూ భాషలో మంచి ప్రావీణ్యముండేది. తౌరాత్, ఇంజీల్ గ్రంథపండితుడు. హజ్రత్ ఖదీజా (రజి.అన్హా) కోరిక మేరకు ఆయన(స) తన దగ్గరకు జిబ్రయీల్ దూత వచ్చిన సంగతిని గురించి వరఖా బిన్ నౌఫిల్‌కు తెలియజేశారు. అది విని వరఖా ఒక్కసారిగా "ఇతను మూసా (అలైహి)పై అవతరించిన దైవదూతే" 'నేను కూడా యువకుడినై, ప్రజలు మిమ్మల్ని బహిష్కరించే కాలం వరకూ బ్రతికి ఉంటే ఎంత బాగుండేది' అని అన్నారు. దైవప్రవక్త(స) ఆశ్చర్యపోతూ, "ప్రజలు నన్ను బహిష్కరిస్తారా?" అని అడిగారు. దానికి సమాధానమిస్తూ "ఔను. ప్రపంచంలో ఇలాంటి సత్యబోధన చేసిన వారందరికీ ప్రారంభంలో ప్రజల నుండి శత్రుత్వాన్నే ఎదుర్కోవలసి వచ్చింది. నాకు మీరు మక్కా నుండి

వలసపోయే రోజు వరకు బ్రతికి ఉండి మీకు చేతనయినంత సేవ చేసుకోవాలని ఉంది" అని అన్నారు వరఖా బిన్ నౌఫిల్.[1]

ఒకరోజు పరిశుద్ధాత్మ (జిబ్రయీల్) దైవప్రవక్త(స)ను ఓ కొండ ప్రాంతానికి తీసుకువచ్చి ఆయన(స) ముందు తాను వుజూ చేసుకొని చూపించారు. అది చూసి ఆయన(స) కూడా వుజూ చేశారు. ఆ తరువాత ఇద్దరూ కలిసి నమాజ్ చేశారు. పరిశుద్ధాత్మ ఆ నమాజ్‌కు సారథ్యం వహించారు.[2]

## ఇస్లాం సందేశ ప్రచారం

దైవప్రవక్త(స) తన సందేశాన్ని ప్రచారం చేయటం మొదలు పెట్టారు. అందరికన్నా ముందు తన సతీమణి ఖదీజా, ఎనిమిదేళ్ళ సోదరుడు అలీ, మిత్రులు అబూబక్ర్, ఇంకా తన ద్వారా స్వేచ్ఛనొసగబడిన బానిస జైద్ బిన్ హారిసాలు ఇస్లాం స్వీకరించారు. ఈ ప్రభృతులకు దైవప్రవక్త నలభైయేళ్ళ జీవితంలోని ప్రతి కదలిక గురించీ తెలుసు. దైవప్రవక్తతో అతి సన్నిహితంగా మెలిగిన వారు వీరు. కాబట్టి వారి ఇస్లాం స్వీకరణ ఆయన(స) గారి గొప్ప సత్యసంధతకు, సన్మార్గ గమనానికి ప్రబల నిదర్శనం. మరికొన్ని రోజులకు బిలాల్, అమ్ర్ బిన్ అబసా, ఖాలిద్ బిన్ సాద్ బిన్ ఆస్ కూడా ముస్లింలయిపోయారు. అబూబక్ర్ (రజి) గొప్ప ధనవంతులు, వ్యాపారం చేసేవారు. మక్కాలో ఆయనకు దుకాణం ఉండేది. అంచేత ప్రజలతో ఆయనకు విస్తృత స్థాయిలో సంబంధాలుండేవి. ఆయన నడవడికకు, ప్రచారానికి ప్రభావితులై ఉస్మాన్ గనీ, జుబైర్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, తల్హా, సాద్ బిన్ అబూ వఖ్ఖాస్‌లు కూడా ముస్లింలయ్యారు. ఆ తరువాత అబూ ఉబైదా ఆమిర్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ జర్రాహ్ (తరువాతి కాలంలో ఈయన 'అమీనుల్ ఉమ్మత్' అనే బిరుదాంకితులయ్యారు). అబ్దుల్ అసద్ బిన్ బిలాల్, ఉస్మాన్ బిన్ మజ్‌ఊన్, ఆమిర్ బిన్ ఫుహైరా అజ్‌దీ,

---

1) ఈ సంఘటన వివరాలన్నీ సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలలోని వహీ అవతరణ ప్రారంభ అధ్యాయాల్లో ఉన్నాయి. అప్పుడు ఆయన(స) వయస్సు నలభై సంవత్సరాలు అని కూడా అందులో ప్రస్తావించబడింది.

2) అల్‌అన్‌సాబ్ లిల్‌బలాజరీ మొదటి సంపుటిలో 111వ పుట.

www.abulhasanalinadwi.org

అబూహుజైఫా బిన్ ఉత్బా, సాయిబ్ బిన్ ఉస్మాన్ బిన్ మజ్ఊన్, అర్ఖమ్ తదితరులు ఇస్లాం స్వీకరించారు. స్త్రీలలో విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఖదీజా (రజి.అన్హా) తరువాత, దైవప్రవక్త(స) బాబాయి భార్య అయిన ఉమ్ముల్ ఫజ్ల్, అస్మాబిన్తె ఉమైస్, అస్మా బిన్తె అబూబక్ర్. ఉమర్ ఫారూఖ్ చెల్లెలు ఫాతిమా (రజి. అన్హా)లు ఇస్లాం స్వీకరించారు.[1]

ఆ రోజుల్లో ముస్లింలు పర్వత లోయల్లోకి వెళ్ళి ఎవరికీ కనపడకుండా భయపడుతూ నమాజ్ చేసేవారు. ఒకసారి దైవప్రవక్త(స) అలీ(రజి)ని వెంటబెట్టుకొని ఓ కనుమ సందులో నమాజ్ చేస్తుండగా ఆయన(స) బాబాయి అబూతాలిబ్ అటుగా వచ్చారు. ఆయనకు ఈ వింత ఆరాధనా విధానం ఆశ్చర్యం కలిగించింది. అక్కడే నిలబడి వారు చేస్తున్న పనిని పరిశీలించసాగారు. నమాజ్ అయిపోయిన తరువాత 'ఇదేం ధర్మం?' అని వారిని అడిగారు. దానికి సమాధానమిస్తూ ఆయన(స) "మన పూర్వీకులయిన ఇబ్రాహీం గారిది కూడా ఈ ధర్మమే" అని అన్నారు. అది విని అబూతాలిబ్ "నేను దీన్ని అవలంబించలేను గాని మీరు మాత్రం దీనిని మీయిష్ట ప్రకారం ఆచరించుకోండి. నా బొందిలో ప్రాణముండగా మిమ్మల్నెవరూ ఆపలేరు" అని చెప్పి వెళ్ళిపోయారు.[2]

ఆ విధంగా మూడు సంవత్సరాల వరకూ ఆయన(స) ఎంతో రహస్యంగా ధర్మ ప్రచార విధిని నిర్వర్తించారు. దైవదౌత్య కిరణాలు అన్ని చోట్లా విస్తరించాయి. అప్పుడు "నీకు ఆజ్ఞాపించబడిన విషయాలను (ప్రజల ముందు) వెల్లడించు". 'నీ సన్నిహిత బంధువులను హెచ్చరించు' అనే దివ్యఖురాన్ వాక్యాలు అవతరించాయి.[3]

ఒకరోజు విందుకు ఏర్పాట్లు చేయమని ఆయన(స) అలీ(రజి)ని ఆదేశించారు. ఆయన(స) బహిరంగంగా ఇస్లాం ప్రచారానికి పూనుకున్న తొలి సందర్భం ఇదే. అబ్దుల్ ముత్తలిబ్ వంశీయులందర్నీ ఆ విందు భోజనానికి ఆహ్వానించారు. విందుకు హమ్జా, అబూతాలిబ్, అబ్బాస్

1) సహీహ్ బుఖారీ, సుననె తిర్మిజీ, ముసన్నఫ్ అబ్దుర్రజ్జాఖ్, ముస్తద్రక్ హాకిమ్, ముసన్నఫ్ ఇబ్నె అబీ షైబా తదితర గ్రంథాల ప్రామాణిక ఉల్లేఖనాల ద్వారా వీరు ముందుగా ఇస్లాం స్వీకరించిన వారని తెలుస్తోంది.
2) సీరతున్నబీ మొదటి సంపుటి 206వ పుట.
3) సీరతున్నబీ మొదటి సంపుటి 210వ పుట.

www.abulhasanalinadwi.org

ప్రభృతులు కూడా వచ్చారు. భోజనాలయ్యాక ఆయన(స) నిలబడి. "నేను ఇహపరాల మోక్షానికి దోహదం చేసే సందేశాన్ని తీసుకొని వచ్చాను. ఈ కర్తవ్య నిర్వహణలో నాకు సహకరించేవారెవరు?" అని అడిగారు. ఆ మాట వినగానే సమావేశంలో కొన్ని క్షణాల పాటు నిశ్శబ్దం రాజ్యమేలింది. కాసేపటికి హజ్రత్ అలీ(రజి) దిగ్గున లేచి, "నా కళ్లకు వ్యాధి సోకింది. నేను బక్క పలచగా ఉన్నాను. ఇంకా నేనందరికన్నా చిన్నవాణ్ణి. అయినా ఫర్వాలేదు. ఈ పనిలో నేను మీకు తోడుంటాను" అని నిండు సభలో చెప్పారు. ఆ దృశ్యం చూసిన ఖురైషులు ఆశ్చర్య చకితులయ్యారు. ఇద్దరు సామాన్యులు (అందునా ఒకడు కుర్రకుంక) తోడయి ప్రపంచ గమనాన్ని నిర్దేశించాలనుకుంటున్నారు. అక్కడున్న వారంతా ఫకాలున నవ్వేశారు. కాని భవిష్యత్తులో అదే అక్షరాలా నిజమయింది.[1]

ఒకరోజు దైవప్రవక్త(స) సఫాకొండపైకెక్కి ప్రజలను కేకపెట్టి పిలిచారు. ప్రజలంతా అక్కడికి చేరుకున్న తరువాత, "ప్రజలారా! మీరే చెప్పండి, నేను నిజం చెప్పేవాడినా? లేక అబద్ధాలు చెప్పేవాడినా?" అని ప్రశ్నించారు. దానికి అక్కడున్న వారంతా ముక్తకంఠంతో, "ఓ ముహమ్మద్! నువ్వు అబద్ధం చెబుతుండగా గాని, పనికిమాలిన మాటలు మాట్లాడుతుండగా గాని మేమెప్పుడు వినలేదు. నువ్వు నిజాయితీపరుడవని, నిజమే చెబుతావని మాకు గట్టి నమ్మకముంది" అని సమాధానమిచ్చారు.

ఆ తరువాత దైవప్రవక్త(స) వారితో, "చూడండి, నేను కొండ శిఖరంపై నించొని ఉన్నాను. మీరు భూమ్మీద ఉన్నారు. నేను ఇక్కడి నుంచి ఇటువైపు ఏముందో, కొండకు అటువైపు ఏముందో కూడా చూడగలుగుతున్నాను. మరి నేను కొండకు అవలి వైపు నుంచి సాయుధులైన దోపిడిదొంగల ముఠా ఒకటి మక్కాపై దాడి చేయటానికి వస్తోందని మీకు చెబితే మీరు నా మాట నమ్ముతారా?" అని అడిగారు.

---

1) సీరతున్నబీ మొదటి సంపుటి 210వ పుట. తబ్రీ తాను రాసిన చారిత్రక గ్రంథంలోనూ, వ్యాఖ్యానంలోనూ ఆ తరువాత అల్లామా షిబ్లీ (రహ్మాలై) కూడా ఈ ఉల్లేఖనంలో ఎంతో కొంత బలహీనత లేకపోలేదని అన్నారు. ఇమామ్ అహ్మద్ ముస్నద్‌లో, ఇబ్నెకసీర్ తన వ్యాఖ్యానంలో, ఇబ్నెసాద్ తబఖాత్‌లో ఇంకా ఇతర చరిత్రకారులు కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఈ ఉల్లేఖనాలన్నింటిలో ఎంతోకొంత బలహీనత లేకపోలేదు.

www.abulhasanalinadwi.org

"తప్పకుండా నమ్ముతాం. నీలాంటి సత్యవంతుణ్ణి నమ్మకపోవటమా? అసంభవం. అదీగాక నువ్వు పై నుండి కొండకిరుప్రక్కలా చూడగలుగుతున్నావాయె!" అని అన్నారు అక్కడికొచ్చిన ప్రజలు. ప్రజల నుండి ఈ సమాధానం వినగానే దైవప్రవక్త(స),

"ప్రజలారా! ఇవన్నీ నేను మీకు అర్థం కావటం కోసం చెప్పిన మాటలే. ఇప్పుడు అసలు సంగతి చెబుతున్నాను వినండి. మరణం మీ తలలపై వ్రేలాడుతున్నది. మరణించిన తరువాత మీరు దైవసన్నిధిలో నిలదీయబడతారు. మీరు ప్రపంచాన్ని ఎలా చూస్తున్నారో అలాగే నాకు పరలోకం ఎంతో సమీపంలో ఉన్నట్లు కనబడుతోంది" అంటూ ప్రజలకు ఉపదేశించారు.

ప్రపంచంలో చాలామంది పరలోక జీవితాన్ని విస్మరించి జీవితం గడుపుతుంటారు. కాని విశ్వాసులకు మాత్రం పరలోకం సమీపంలోనే ఉన్నట్లు అనిపిస్తుంది. ఈ విషయాన్నే దైవప్రకవ్త(స) ప్రజల హృదయాలకు హత్తుకునేలా సోదాహరణంగా వివరించారు.[1]

## బహుదైవారాధకుల ఆగడాలు

అప్పటికే నలభైమందికి పైగా ఇస్లాం స్వీకరించి ముస్లింలయ్యారు. ఆ కాలంలోనే దైవప్రవక్త(స) కాబా గృహంలోకి వెళ్ళి ధైర్యంగా దేవుడు ఒక్కడేనని ప్రకటించారు. బహుదైవారాధకులు ఈ ప్రకటనను తమ విగ్రహాల కీర్తికే కళంకమని తలపోశారు. దాంతో మక్కాలో ఒక్కసారిగా కలకలం చెలరేగింది. ఈ ప్రకటన చేయగానే బహుదైవారాధకులు కత్తులు, కటారాలతో ఆయన మీద దాడి చేశారు. ఈ సంగతి హజ్రత్ ఖదీజా గారి మాజీ భర్త కుమారులైన హారిస్ ఇబ్నె అబీ హాలాకు తెలిసింది. అప్పుడు ఆయన తన ఇంట్లో ఉన్నారు. దైవప్రవక్తను కాపాడటానికి ఆయన ఇంటి నుంచి పరుగెత్తుకుంటూ వచ్చారు. అయితే బహుదైవారాధకుల ఖడ్గాలు ఆయన మీదికి తిరగబడటంతో ఆయన

1) ఈ సంఘటనకు సంబంధించిన ఉల్లేఖనాలు బుఖారీ - ముస్లింలలో సంక్షిప్తంగా ప్రస్తావించబడ్డాయి.

కుప్పకూలిపోయారు. ఆ విధంగా హారిస్ ఇస్లాం కోసం ప్రాణత్యాగం చేసిన తొలివీరుడయ్యారు.[1]

దైవప్రవక్త(స) ఆ తరువాత జనసామాన్యంలో ధర్మ ప్రచారం మొదలెట్టారు. మక్కాలో, ఇతర చుట్టు ప్రక్కల గ్రామాల్లో జరిగే సంతలకు వెళ్ళి ప్రజలకు ఇస్లాం సందేశం వినిపించేవారు. వీధి వీధి తిరిగి జనానికి దేవుడు ఒక్కడేనన్న విషయాన్ని బోధించేవారు. చెట్టూ, పుట్ట, రాయీ రప్పల పూజ నుండి ప్రజల్ని వారించేవారు. దేవుడనే వాడిలో ఎలాంటి లోపాలుండవనీ, ప్రజలు కల్పిస్తున్న దైవత్వ భాగస్వామ్యానికి ఆయన అతీతుడనీ, భూమ్యాకాశాలను, సూర్యచంద్ర నక్షత్రాలను సృష్టించినవాడు ఆయనేననీ, యావత్తు సృష్టి ఆయనపైనే ఆధారపడి ఉందనీ బాధితుల మొరలను ఆలకించేవాడు, వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యాన్ని ప్రసాదించేవాడు, ప్రజల కోరికలను తీర్చేవాడూ ఆయనేననీ, ఆయన ఆజ్ఞ లేనిదే ఎవరూ ఏమీ చేయలేరని, ఆఖరికి దైవదూతలు దైవప్రవక్తలు కూడా ఆయన ఆజ్ఞల్ని ఉల్లంఘించలేరని ప్రజలకు బోధించేవారు. ఉకాజ్, ఉమైనా జిల్‌మజాజ్‌లు అరబ్ దేశంలో ప్రసిద్ధి చెందిన తిరునాళ్లు, వాటి కోసం దూర ప్రాంతాల నుంచి ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చేవారు. దైవప్రవక్త (స) అక్కడికి వచ్చేవారందరికీ ఇస్లాం గురించి, ఒకే దేవుణ్ణి పూజించటం గురించి బోధించేవారు.[2]

దైవప్రవక్త(స) బహిరంగంగా విగ్రహారాధనను ఖండించటం మొదలు పెట్టినప్పుడు కొంతమంది ఖురైష్ పెద్దలు ఆయన(స) గురించి అబూతాలిబ్‌కు ఫిర్యాదు చేశారు. అబూతాలిబ్ మొదటిసారి వారికి ఎలాగో నచ్చజెప్పి వారిని త్రిప్పి పంపించారు. అయితే గొడవ మాత్రం సద్దుమణగలేదు. ఆయన(స) తన పని తాను చేసుకుంటూ పోతున్నారు. మళ్ళీ అబూతాలిబ్ దగ్గరికి ఫిర్యాదు వచ్చింది. ఈ సారి ఉత్బా బిన్ రబీయా, షైబా, అబూ సుఫ్యాన్, ఆస్ బిన్ హిషామ్, అబూజహల్,

---

1) ఇబ్నె హజర్ గారి 'అల్ఇసాబా' గ్రంథంలో హారిస్‌బిన్ అబూహాలా ప్రస్తావన ఉంది.

2) ఇమామ్ తిర్మిజీ తన సునన్ గ్రంథంలో, హాకిమ్ ముస్తద్రక్‌లో, ఇమామ్ అహ్మద్ తన ముస్నద్ గ్రంథంలో ఇంకా ఇతర చరిత్రకారులు కూడా తమ గ్రంథాలలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఇమామ్ తిర్మిజీ, ఇమామ్ జహబీలు ఈ ఉల్లేఖనాలన్నింటినీ దృఢమైనవిగా ఖరారు చేశారు.

www.abulhasanalinadwi.org

వలీద్ బిన్ ముగీరా, ఆస్ బిన్ వాయిల్ తదితర ఖురైష్ పెద్దలంతా కలిసి అబూతాలిబ్ దగ్గరికి వచ్చారు. "అబూతాలిబ్! చూశారా! మీ సోదర పుత్రుడు మా దేవుళ్ళను అవమానపరుస్తున్నాడు. మా తాత ముత్తాతల్ని మార్గభ్రష్టులంటున్నాడు. మమ్మల్ని మూర్ఖుల క్రింద జమకడుతున్నాడు. కాబట్టి మీరు మధ్య నుంచి తప్పుకోండి లేదా మీరు కూడా యుద్ధానికి సిద్ధం కండి. మీరో మేమో తేల్చుకుందాం" అని అన్నారు. అబూతాలిబ్ ఆలోచనలో పడిపోయారు. ఇది చాలా సున్నితమైన పరిస్థితి. ఖురైషులు ఇక సహించలేరని గ్రహించారు. కాని తాను ఒంటరిగా ఖురైషులందరితో పోరాడలేరు. అంచేత ఆయన (సఅసం)ను పిలిచి ప్రేమపూర్వకంగా 'నాయనా! నాపై మరీ అంత ఎక్కువ భారం వేయకు. నేను మోయలేను' అని అన్నారు.

దైవప్రవక్త (స)కు ఈ లోకంలో కొండంత అండగా ఉంది ఒక్క అబూతాలిబ్ మాత్రమే. ఇప్పుడు ఆ కొండలో కూడా కదలిక కనిపిస్తుంది. ఆయన(స) కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి. అశ్రుపూరిత నయనాలతోనే ఆయన(స) "దైవసాక్షి! ఈ బహుదైవారాధకులు నాకు ఒక చేతిలో సూర్యుణ్ణి, మరోచేతిలో చంద్రుణ్ణి తెచ్చి పెట్టినా సరే నేను నా కర్తవ్యాన్ని మానుకోను. దేవుడు ఈ ధర్మాన్ని సంపూర్ణం చెయ్యాలి లేదా నేను దీని కోసం ఆత్మార్పణం చేసుకోవాలి" అని కరాకండీగా చెప్పేశారు. ఆయన(స) ఆత్మ బలానికి అబూతాలిబ్ ప్రభావితులయ్యారు. ఆయన దైవ ప్రవక్త(స)తో "సరే. నీ పని నీవు చేసుకుంటూ పో. ఎవడూ నిన్నేమీ చేయలేడు" అని ధైర్యం చెప్పారు.[1]

దైవప్రవక్త(స) ఇస్లాం ధర్మ సందేశ ప్రచారంలో తలమునకలై ఉన్నారు. ఖురైషులు ఆయన్ని చంపలేకపోయినప్పటికీ నానా విధాలుగా ఆయన్ని హింసించేవారు. ఆయన నడిచే దారిలో ముళ్ళు పరిచి ఉంచేవారు. నమాజ్ చేస్తున్నప్పుడు ఒంటిపై కసువు, చెత్తాచెదారం వేసేవారు. అనరాని మాటలు అనేవారు.[2]

---

1) జహబీగారి అస్సీరతున్నబవియ్యా గ్రంథం 86,87, ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటి 577వ పుట.

2) సీరతున్నబీ మొదటి సంపుటి 221వ పుట.

www.abulhasanalinadwi.org

అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) తాను కళ్ళారా చూసిన సంఘటనను ఇలా వివరిస్తున్నారు: ఒక రోజు దైవప్రవక్త(స) కాబా ప్రాంగణంలో నమాజ్ చేస్తున్నారు. అంతలో ఉఖబాబిన్ అబూ ముయీత్ వచ్చి తన దగ్గరున్న దుప్పటిని త్రాడులా తయారు చేశాడు. దైవప్రవక్త(స) సజ్దాలోకి వెళ్ళినప్పుడు ఆ దుప్పటిని ఆయన(స) మెడకు చుట్టి గొంతు పిసకసాగాడు. ఆయన(స) గొంతు బాగా బిగుసుకుపోయింది. అయినా ఆయన(స) ఏ మాత్రం చలించకుండా సాష్టాంగ ప్రణామంలోనే లీనమై ఉన్నారు. అంతలో అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) పరుగెత్తుకుంటూ వచ్చి ఉఖబాను తోసేస్తూ ఈ సూక్తి చదివి వినిపించారు.

"ఒక వ్యక్తి తన ప్రభువు అల్లాహ్ అని అన్నంత మాత్రాన మీరు అతణ్ణి హతమారుస్తారా? వాస్తవానికి అతను మీ దగ్గరికి, (దేవుని తరపు నుండి) స్పష్టమైన ఆదేశాలు తీసుకొని వచ్చాడు".

దాంతో ఆ తుంటరులు అబూబక్ర్(రజి) మీద తిరగబడి ఆయన్ని తీవ్రంగా కొట్టారు.[1]

ఇంకోసారి జరిగిన సంఘటన. దైవప్రవక్త(స) కాబా గృహంలో నమాజ్ చేస్తుండగా ఖురైషులు కాబా ప్రాంగణంలో కూర్చొని ఉన్నారు. వారిలో అబూజహల్ మాట్లాడుతూ, "ఈ రోజు నగరంలో ఫలానా చోట ఒంటెను కోశారు. అక్కడ దాని పొట్ట పడి ఉంది. ఎవరైనా వెళ్ళి అది తీసుకొని వచ్చి ఇతని (దైవప్రవక్త)పై వెయ్యండి" అంటూ అక్కడున్న వారిని ఉసిగొల్పాడు. అతని మాటలు విని మూర్ఖుడైన ఉఖబా దిగ్గున లేచాడు. అపరిశుద్ధంగా ఉన్న ఆ జీర్ణాశయాన్ని తీసుకొచ్చి దైవప్రవక్త(స) సజ్దాలో ఉన్నప్పుడు ఆయన(స) వీపుమీద పెట్టేశాడు. ఆయన(స) దైవధ్యానంలో ఉన్నారు. ఈ సంగతేమీ ఆయనకు పట్టలేదు. అవిశ్వాసులు ఒకరి మీద ఒకరు పడిపోతూ పగలబడి నవ్వుతున్నారు. అక్కడ దైవప్రవక్త (స) సహచరులు ఇబ్నెమస్ఊద్(రజి) కూడా ఉన్నారు. కాని అవిశ్వాసుల ముఠాను చూసి ఆయన ధైర్యం చేయలేకపోయారు. అంతలో దైవప్రవక్త(స) కూతురు, చిన్నపిల్ల హజ్రత్ ఫాతిమా (రజి. అన్హా)

---

1) సహీహ్ బుఖారీలోని కాబా నిర్మాణ ప్రకరణం

www.abulhasanalinadwi.org

వచ్చి తండ్రి వీపుపై నుంచి జీర్ణాశయాన్ని తొలగించింది. అక్కడున్న అవిశ్వాసుల్ని కసురుకుంది కూడా.[1]

మక్కా నగరానికి బయటి నుంచి వచ్చే వారిని ముహమ్మద్(స)కు దూరంగా ఉంచాలని, ఆయన మాటలు వినకుండా చేయాలని అవిశ్వాసులు నిశ్చయించుకున్నారు. దానికోసం మార్గాలు అన్వేషించ డానికి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో ఒకడు ముహమ్మద్ జ్యోతిష్యుడని చెబుదాం అని అన్నాడు. దానికి కురువృద్ధుడైన వలీద్ బిన్ ముగీరా "నేను చాలామంది జ్యోతిష్యుల్ని చూశాను. కాని జ్యోతిష్యుల కల్లబొల్లి మాటలకు, ముహమ్మద్ సత్యవచనాలకు ఎలాంటి పొంతనా లేదు. కాబట్టి ఆ మాట చెబితే అరబ్బు తెగలవారు మేము అబద్ధం చెబుతున్నామనుకుంటారు" అని అన్నాడు. మరొకడు "ముహమ్మద్ పిచ్చివాడని చెబుదాం" అన్నాడు. దానికి వలీద్ ముహమ్మద్ పిచ్చివాడంటే ఎవరు నమ్ముతారు అని అన్నాడు. "మరయితే అతను కవిత్వం అల్లుతున్నాడని చెబుదాం" అని ఇంకొకడు సలహా ఇచ్చాడు. దానికి వలీద్ 'కవిత్వం గురించి మనకు బాగా తెలుసు. కవితలల్లే తీరుతెన్నులన్నీ గ్రహించగలిగేవాళ్ళం మనం. ముహమ్మద్ చెబుతున్న మాటలకు కవిత్వంతో ఎలాంటి పోలిక లేదు' అని అన్నాడు. "మరయితే ముహమ్మద్ మాంత్రికుడని ప్రచారం మొదలెడదామా!" అన్నాడు ఇంకొకడు.

'అదీ అసంభవమే. ముహమ్మద్ పాటించే పవిత్రత, పరిశుద్ధతలు మాంత్రికులలో మనమెప్పుడయినా చూశామా? మాంత్రికుల పాలిపోయిన మొహాలు, నీచమైన అలవాట్లు మనకు తెలియనివి కావు' అన్నాడు వలీద్‌బిన్ ముగీరా. చివరికి వారంతా "పెదనాన్నా! మరేం చెయ్యాలో మీరే చెప్పాలి?" అని అన్నారు వలిద్‌తో. అప్పుడు వలీద్ వారికి ఇలా సూచించాడు: నిజం చెప్పాలంటే ముహమ్మద్ చెప్పే వాక్యాల్లో ఏదో అనిర్వచనీయమైన మాధుర్యం ఉన్నట్లు అనిపిస్తుంది. అతని సంభాషణ రసవంతంగా ఉంటుంది. కాబట్టి ఒకటే మార్గం. అతని మాటలు తండ్రీ కొడుకుల్ని వేరు చేస్తాయని, భార్యాభర్తల మధ్య

1) సహీహ్ బుఖారీలోని కాబా నిర్మాణ ప్రకరణం

www.abulhasanalinadwi.org

యెడబాటుని సృష్టిస్తాయని మనం ప్రజల్ని నమ్మించాలి. వలీద్ బిన్ ముగీరా సూచించిన సలహా అందరికీ నచ్చింది. అప్పటి నుండి అవిశ్వాసులు మక్కా దారుల్లో బైఠాయించి నగరంలోకి వచ్చే వారిని ముహమ్మద్(సల్లం) గురించి హెచ్చరించటం మొదలుపెట్టారు.[1]

## ఉత్బాతో భేటి

ఎన్ని విధాలుగా ప్రయత్నించినా ముహమ్మద్ (సల్లం) ఇస్లాం ధర్మ ప్రచారం మానుకోకపోవటంతో అవిశ్వాసులంతా మళ్ళీ ఒక చోట చేరి దైవప్రవక్త(స)కు డబ్బు ఎర చూపెడదామని, అప్పటికీ తన పని మానుకోకపోతే ప్రాణాలు తీస్తామంటూ హెచ్చరిద్దామని నిశ్చయించుకున్నారు. అప్పుడు మక్కాలో ప్రముఖ సర్దారు అయిన ఉత్బా తాను ముహమ్మద్ (సల్లం) సంగతి తేల్చుకొని వస్తానని ఛాలెంజీ చేశాడు. ఆ తరువాత దైవప్రవక్త(స) దగ్గరికి వచ్చి ఇలా ఉపన్యాసం మొదలెట్టాడు.

'నాయనా ముహమ్మద్! నువ్వీ పని చేయటంలోని ఉద్దేశ్యం ఏమిటి? దీని ద్వారా సిరిసంపదలు కూడ బెట్టుకోవాలనుకుంటున్నావా? అలాగయితే చెప్పు. మేమే స్వయంగా నీకు కావలసినంత ధనం ఇస్తాం. ఒకవేళ నువ్వు సమాజంలో పరువు ప్రతిష్ఠల కోసం ఈ పని చేస్తున్నట్లయితే మేము నిన్ను మా నాయకుడిగా ఎన్నుకుంటాము. అధికారాన్ని కోరుకుంటున్నావా? అలాగయితే నిన్ను అరబ్బు దేశానికే అధిపతిగా చేసుకుంటాం. నువ్వు కోరుకున్నదల్లా చేయటానికి మేము సిద్ధంగా ఉన్నాం. కాని నువ్వు మాత్రం నీ పద్ధతిని మార్చుకో. లేదా నీ మెదడుకేదయినా రోగం వచ్చిందేమో చెప్పు. దానికి చికిత్స చేయిస్తాం'.

అంతా విన్న తరువాత దైవప్రవక్త(స) అతనితో "ఇప్పటి వరకూ నువ్వు నాతో అన్న మాటల్లో కొంచెం కూడా యదార్థం లేదు. సిరిసంపదలు, పరువు ప్రతిష్ఠలు నాకక్కర్లేదు. నేను అధికారాన్ని కోరుకోవటం లేదు. నా మెదడుకు ఎలాంటి రోగమూ లేదు. దివ్యఖురాన్‌లోని ఈ వాక్యాలు విను. నా సందేశంలోని వాస్తవికత

1) జహబీగారి అస్సీరతున్నబవియ్యా 89, 90వ పుటలు

www.abulhasanalinadwi.org

ఏమిటో నీకే తెలుస్తుంది'' అంటూ దివ్యఖురాన్ పారాయణం మొదలుపెట్టారు.

"హామీమ్. ఇది కరుణామయుడూ, కృపాశీలుడూ అయిన దేవుని సన్నిధి నుండి అవతరింపజేయబడింది; స్పష్టంగా వివరించబడిన వాక్యాలు గల గ్రంథం. అరబ్బీ భాషలో ఉన్న ఈ ఖురాన్, జ్ఞానుల కొరకు; శుభవార్తలను ఇచ్చేది, భయపెట్టేదీను.

కాని వారిలో చాలామంది దానిపట్ల విముఖులయ్యారు. కనుక వారు వినరు. పైగా వారు "నీవు దేనివైపుకు మమ్మల్ని పిలుస్తున్నావో, దానిని గురించి మా హృదయాలను తెరలు కప్పివేశాయి, మా చెవులు చెవిటివై పోయాయి. మాకూ నీకూ మధ్య ఒక తెర అడ్డుపడింది. నీవు నీ పని చెయ్యి. మేము మా పని చేస్తాము'' అని అంటారు.

ప్రవక్తా! వారితో ఇలా అను, "నేను కూడా మీలాంటి మనిషినే. వహీ ద్వారా నాకు ఇలా తెలుపబడుతోంది. మీ దేవుడు కేవలం ఒకే దేవుడు. కనుక మీరు నేరుగా ఆయన వైపునకే మరలండి; క్షమించు అని ఆయన్ని వేడుకోండి. జకాత్ ఇవ్వనివారునూ, పరలోకాన్ని తిరస్కరించేవారునూ అయిన బహుదైవారాధకులు వినాశం పాలవుతారు. ఇకపోతే విశ్వసించి మంచి పనులు చేసిన వారికి మాత్రం ఎడతెగని ప్రతిఫలం లభిస్తుంది".

(హామీమ్ అస్ సజ్ దహ్: 1-8)

ఆ వాక్యాలకు ఉత్బా దిమ్మదిరిగిపోయాడు. అరచేతిని నేలకు ఆనించి తల భుజంపై పెట్టుకొని దైవప్రవక్త(స) నోటి నుంచి వెలువడుతున్న దివ్యఖురాన్ సూక్తుల్ని తన్మయుడై వినసాగాడు. అంతా విన్న తరువాత మారుమాట్లాడకుండా అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయాడు. కొన్ని క్షణాల క్రితం దైవప్రవక్త(స) దగ్గరికి వెళ్ళిన ఉత్బా తిరిగి వచ్చేటప్పటికి మారిపోయాడు. ఖురైష్ సర్దారులు ఉత్బా రంగు మారి పోయింది అనడం మొదలుపెట్టారు. "ఏం జరిగింది? అని ఆతురతతో

www.abulhasanalinadwi.org

అడిగారు. దానికి ఉత్‌బా సమాధానమిస్తూ, "ఖురైషీయుల్లారా! నేనో అద్భుతమైన వాణిని విని వచ్చాను. అది కవిత్వం కాదు, చేతబడి అంతకన్నా కాదు. మంత్రజాలం అసలే కాదు. మీరు నా మాట వినండి. ముహమ్మద్‌ను అతని మానాన అతన్ని వదిలేయండి" అని అన్నాడు. అది విని అవిశ్వాసులు "ముహమ్మద్ ఉత్‌బాకు కూడా తన మాటల్తో చేతబడి చేసేశాడు" అంటూ చిందులు వేశారు.[1]

## ఖురైష్ సర్దారులతో ముఖాముఖీ

ఈ వైఫల్యం తరువాత అవిశ్వాసులకు ఎటూ పాలుపోలేదు. ముహమ్మద్ (స)ను ప్రజలందరి ముందుకు తీసుకువచ్చి నచ్చజెప్పాలని అనుకున్నారు. ఖురైషులు ఈ విషయంలో సమాలోచన జరుపుకున్న తరువాత "సర్దారులు మీతో మాట్లాడాలనుకుంటున్నారు వారు, కాబా గృహంలో సమావేశమై ఉన్నారని" దైవప్రవక్త (సల్లం)కు కబురు పంపారు. సర్దారులు ఎప్పటికయినా తన ధర్మాన్ని విశ్వసిస్తారన్న ఆశ దైవప్రవక్త(స)కు ఉండేది. వారు పిలుస్తున్నారని చెప్పగానే ఆయన(స) సంతోషంగా అక్కడికి వచ్చారు. అప్పుడు ఖురైషులు సంభాషణను ఈ విధంగా మొదలు పెట్టారు.

"ఓ ముహమ్మద్! మేము నీతో మాట్లాడటం కోసం నిన్ను ఇక్కడికి పిలిపించాం. నీ వల్ల వచ్చినన్ని కష్టాలు మన జాతికి మునుపెన్నడూ రాలేదు. నీ వల్ల మన జాతికి కలగని నష్టమంటూ లేదు. ఇప్పుడు చెప్పు. నువ్వు ఈ కొత్త ధర్మం ద్వారా సిరిసంపదలు కూడబెట్టుకోవాలనుకున్నట్లయితే మేము నీకు కావలసినంత ధనం సమకూరుస్తాం. పరువు ప్రతిష్ఠల్ని కోరుకుంటున్నట్లయితే నిన్ను మా నాయకుడిగా ఎన్నుకుంటాం. అధికారం కావాలనుకుంటే నిన్ను మా దేశానికే రాజుగా అంగీకరిస్తాం. లేకపోతే ఏ భూతమైనా నిన్ను లోబరుచుకుందేమో చెప్పు. ఎంత డబ్బు ఖర్చు పెట్టి అయినాసరే భూత వైద్యం చేయించి తిరిగి నువ్వు మామూలు మనిషి అయ్యేటట్లు చేస్తాం. లేదా వికలాంగుడి క్రింద లెక్కగడతాం. దానికి దైవప్రవక్త(స), 'మీరు అనుకుంటున్నదేదీ నిజం కాదు.

1) అస్సీరతుల్ హల్బియ్యా మొదటి సంపుటి 486, 487 పుటలు. ముసన్నఫ్ ఇబ్నె అబీషైబా పద్నాలుగవ సంపుటి 295వ పుట. జహబీగారి అస్సీరతున్న బవియ్యాలో 91-92 పుటలు.

www.abulhasanalinadwi.org

సిరిసంపదలు కూడబెట్టు కోవడానికి గాని, పరువు ప్రతిష్ఠలు కోరుకొనిగాని, అధికార వ్యామోహంతో గాని నేనీ ప్రచారానికి పూనుకోలేదు. వాస్తవం ఏమిటంటే, దేవుడు నన్ను మీ దగ్గరికి ప్రవక్తగా నియమించి పంపాడు. నాపై గ్రంథాన్ని అవతరింప జేశాడు. నన్ను శుభవార్తలు అందజేసేవాడిగా, భయపెట్టేవాడిగా చేసి పంపాడు. నేను మీ ప్రభువు సందేశాన్ని మీకు అందజేశాను. మీకు బాగా అర్థమయ్యేటట్టు బోధించాను. మీరు నా బోధనల్ని స్వీకరిస్తే ఇహపరాల సాఫల్యం మీ పాదాక్రాంతమవుతుంది. మీరు గనక వాటిని నిరాకరిస్తే ఇక ఆ తర్వాత నేను దేవుని నిర్ణయం కోసం ఎదురు చూస్తూ ఉంటాను. ఆయన-నాకూ మీకూ మధ్య ఏం తీర్పు చెబుతాడో చూద్దాం'అని సమాధానమిచ్చారు.

దానికి ఖురైషులు, "సరే ముహమ్మద్! మేము చెప్పేదాన్ని నువ్వు ఒప్పుకోకపోయినా ఫర్వాలేదు. ఒక్క విషయం విను, మనం ఎలాంటి కరువు కాటకాల్ని ఎదుర్కొంటున్నామో నీకు తెలుసు. మన దగ్గర నీటి వనతులు చాలా తక్కువగా ఉన్నాయి. రోజులు గడవటవే గగనమైపోయింది. కాబట్టి నువ్వు మనముందున్న ఈ పర్వతాల్ని తొలగించి నగరాన్ని విశాలవంతం చేయమని దేవుణ్ణి ప్రార్థించి. సిరియా, ఇరాక్ దేశాల్లోలాగా మన దగ్గర కూడా కాలువలు ప్రవహించాలని వేడుకో. మా తాతముత్తాతల్ని తిరిగి బ్రతికించమని చెప్పు. తిరిగి బ్రతికే వారిలో ఖుసీ బిన్ కిలాబ్ తప్పకుండా ఉండాలి సుమా! ఎందుకంటే ఒకప్పుడు అతను మా నాయకుడు. అతను నిజం చెబుతాడు. మేము అతణ్ణి నీ గురించి అడుగుతాం. అతను నీ మాటలు నిజమని ధృవీకరిస్తే, ఆ తరువాత నీవు మా కోరికలన్నీ నెరవేరిస్తే, అప్పుడు మేము నువ్వు సత్యవంతుడవనీ, దేవుని దగ్గర నీకు ఓ స్థానమంటూ ఉందని, నువ్వు చెబుతున్నట్లుగా దేవుడు నిన్ను ప్రవక్తగా నియమించి పంపాడని నమ్ముతాం" అని అన్నారు.

"ఈ పనులు చేసి పెట్టడానికి నేను ప్రవక్తగా రాలేదు. నేను మీకు సత్య సందేశాన్ని వినిపించటానికి ప్రవక్తగా పంపబడ్డాను. దేవుని సందేశాన్ని నేను మీకు అందజేశాను. ఇక మీరు దాన్ని స్వీకరిస్తే దానివల్ల ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మీకే ప్రయోజనం ఉంటుంది. ఒకవేళ

www.abulhasanalinadwi.org

నిరాకరిస్తే నేను దైవాజ్ఞ కోసం ఎదురుచూస్తాను. ఆ దేవుడే మీకూ-నాకూ మధ్య తలెత్తిన సమస్యను పరిష్కరిస్తాడు" అని చెప్పారు దైవప్రవక్త(స).

దానికి ఖురైషీయులు, "మా కోసం ప్రార్థించకపోయినా ఫర్వాలేదు. కనీసం నీ కోసమన్నా ప్రార్థించుకో. దేవుడికి నీ వెంట ఒక దూతను నియమించమని చెప్పు. అతను నిన్ను ధృవీకరిస్తూ, నిన్ను వ్యతిరేకించే వారిని వారిస్తూ నీ వెంట తిరుగుతుంటాడు. ఇంకో విషయం, అందమైన ఉద్యానవనాలు, ఎత్తైన భవనాలు, వెండి, బంగారపు నిల్వలు కూడా కావాలని కోరుకో. ఇప్పటి దాకా నీకు బజారుల వెంబడి తిరిగి ఉపాధిని వెతుక్కోవాల్సి వచ్చేది కదా! అవి వచ్చేస్తే ఇక నీకు ఈ కష్టాలేమీ ఉండవు. ఇవన్నీ జరిగిపోయినప్పుడే మేము నీ ఔన్నత్యాన్ని గుర్తిస్తాం" అని అన్నారు.

"నాకు అవేవీ అక్కర్లేదు. నేనెన్నటికీ వాటిని ప్రసాదించమని దేవుణ్ణి కోరను. నేనొచ్చిన పనితో వాటికి ఎలాంటి సంబంధమూ లేదు. దేవుడు నన్ను విశ్వాసులకు శుభవార్తలు అందజేసేవాడిగా, అవిశ్వాసుల్ని హెచ్చరించే వాడిగా చేసి పంపాడు. మీరు విశ్వసిస్తే ఇహపరాల్లోనూ మీకు మేలు కలుగుతుంది. ఒకవేళ మీరు నిరాకరించినా ఫర్వాలేదు. నేను దైవాజ్ఞ కోసం ఎదురుచూస్తూ ఉంటాను".

"దేవుడు తలచుకుంటే ఏమైనా చేయగలడని చెబుతున్నావుగా! మరయితే మాపై ఆకాశం విరుచుకుపడేలా చెయ్యి చూద్దాం. నువ్వు ఇలా చేసి చూపించేదాకా మేము నిన్ను విశ్వసించం" అన్నారు ఖురైషులు

"ఆ విషయం దేవుని అధీనంలో ఉంది. తాను తలచు కుంటే అదీ చేయగలడు" - సమాధానమిచ్చారు మహాప్రవక్త(స).

"ముహమ్మద్ (స)! మేము నిన్ను పిలుస్తామని, ఇలాంటి ప్రశ్నలు వేస్తామని, ఈ కోరికలు కోరుతామని, మా ప్రశ్నలకు జవాబులు ఇలా ఉండాలని, తాను ఇలా చేయాలనుకుంటున్నానని దేవుడు నీకు ముందే చెప్పలేదా? చెప్పలేదు. కాబట్టి మేము విన్నది నిజమేనని తేలిపోయింది. యమామా ప్రాంతంలో రహ్మాన్ అనే వ్యక్తి ఉన్నాడు. బహుశా అతనే

www.abulhasanalinadwi.org

నీకు ఈ బోధనలు నేర్పి ఉంటాడు. మేము ఆ రహ్మాన్‌ని ఎన్నటికీ విశ్వసించం. చూడు ముహమ్మద్! మేము నిన్ను ఎందుకు విశ్వసించటం లేదో ఈ రోజు నీకు చెప్పేశాం. కాబట్టి నీ ముందే ప్రమాణం చేసి చెబుతున్నాం. మేము బ్రతికుండగా నిన్ను ఈ ప్రచారం చెయ్యనివ్వము. ఆఖరికి నువ్వో మేమో తేల్చుకోవాల్సి వచ్చినా సరే.

సంభాషణ ఇక్కడి వరకూ వచ్చిన తరువాత ఒకడు లేచి "మేము దేవుని కుమార్తెలయిన దైవదూతల్ని పూజించేవాళ్ళం" అని అన్నాడు. ఇంకొకడు "దేవుడు, దైవదూతలు మా కళ్ళ ముందుకు వచ్చే వరకు మేము నీ మాటల్ని నమ్మం" అన్నాడు.

ఆ చివరి గొంతు విని దైవప్రవక్త(స) లేచి నిలబడ్డారు. అప్పుడు అబ్దుల్లాహ్ బిన్ అబూ ఉమయ్యా బిన్ ముగీరా కూడా లేచాడు. ఇతడు దైవప్రవక్త(స) మేనత్త అయిన ఆతికా కొడుకు. అతను దైవప్రవక్త(స) వెళుతుంటే ఇలా అన్నాడు:

'ముహమ్మద్! నీ జాతి ప్రజలు నీ ముందు కొన్ని ప్రతిపాదనలు ఉంచారు. కాని నువ్వు వాటిని ఒప్పుకోలేదు. ఆ తరువాత వారు నీ గొప్పదనానికి ప్రతీకగా ఏవయినా స్పష్టమైన నిదర్శనాలు చూపించమని కోరారు. నువ్వు దానికీ అంగీకరించలేదు. తరువాత నువ్వు భయపెడుతున్న శిక్ష వచ్చిపడేలా చెయ్యమన్నారు. నువ్వు అది కూడా చెయ్యలేకపోయావు. కాబట్టి ఇక నేను నిన్ను ఎన్నటికీ విశ్వసించను. నువ్వు నా కళ్ళ ముందు నిచ్చెన సాయంతో ఆకాశం పైకెక్కి అక్కడి నుంచి నలుగురు దైవదూతల్ని వెంట తీసుకొని వచ్చినా, ఆ దైవదూతలు నువ్వు నిజంగా ప్రవక్తవని సాక్ష్యమిచ్చినా సరే నేను నిన్ను విశ్వసించను గాక విశ్వసించను.'[1]

వారి మాటలకు దైవప్రవక్త(స) ఏ మాత్రం తొణకలేదు. ఎంతమంది తిరస్కరించినా, ఎన్ని వ్యతిరేక పవనాలు వీచినా ఖురైషులకు ఇస్లాం గురించి బోధించటం మాత్రం వదలిపెట్టలేదు. మీరడగుతున్న విషయాలన్నీ నా బోధనల్లోనే నిగూఢమై ఉన్నాయని చెప్పేవారు. ఇస్లాం

1) అస్సీరతుల్‌హల్బియ్యా మొదటి సంపుటి-49వ పుట

www.abulhasanalinadwi.org

ధర్మాన్ని స్వీకరించి, దైవప్రవక్త(స) విధానాన్ని ఆచరించిన బుద్ధిజీవులు, అప్పుడు అవిశ్వాసులు కోరిన మహిమల కన్నా గొప్ప అద్భుతాల్ని వీక్షించిన అనుభూతిని పొందారు.

## ముస్లింలపై ఖురైషుల దురాగతాలు

దైవప్రవక్త(స) ప్రచారాన్ని నిలువరించటం తమ వల్ల కాదని ఖురైషులు తెలుసుకున్నారు. అందుకని ఇస్లాం స్వీకరించే నిరుపేద ముస్లింపై తమ ప్రతాపాన్ని చూపటం మొదలెట్టారు. అరబ్బు దేశంలోని ఎండ తీవ్రతకు అక్కడి ఇసుక నేల అట్లపెనంలా సలసలకాలిపోతూ ఉండేది. ఖురైషులు మిట్ట మధ్యాహ్నం వేళ నిరుపేద ముస్లింలను ఆ ఇసుక నేలపై నగ్నంగా పడుకోబెట్టేవారు. అటూఇటూ కదలటానికి కూడా వీలులేకుండా ఛాతీ మీద పెద్ద పెద్ద బండరాళ్లు ఉంచేవారు. శరీరంపై కాలుతున్న ఇసుక పోసేవారు. ఇనుప చువ్వలను ఎర్రగా కాల్చి వాతలు పెట్టేవారు. నీళ్లలో ముంచి ఊపిరాడనీయకుండా చేసేవారు.

ఇలాంటి దౌష్ట్యాలు నిరుపేద ముస్లింలందరిపై జరిగేవి. అయితే ఖురైషుల కసాయితనానికి అతి ఎక్కువగా గురయిన అభాగ్య ముస్లింలు వీరు:[1]

**ఖబ్బాబ్ బిన్ అరత్ :** ఈయన తమీమ్ తెగకు చెందినవారు. అజ్ఞాన కాలంలో బానిసగా అమ్ముడుపోయారు. ఉమ్మె అన్మార్ ఈయన్ని కొనుక్కుంది. దైవప్రవక్త(స) అర్ఖమ్(రజి) ఇంట్లో నివాసమున్నప్పుడు కేవలం ఆరు లేక ఏడుగురు మాత్రమే ఇస్లాం స్వీకరించారు. వారిలో ఖబ్బాబ్ (రజి) కూడా ఉన్నారు. ఖురైషులు ఈయన్ని నానా యాతనలకు గురి చేశారు. ఒకరోజు బొగ్గులు కాల్చి నేలపై పరచి ఈయన్ని వాటిపై వెల్లకిలా పడుకోబెట్టారు. ఒకడు ఆయన కదలకుండా ఛాతీపై కాలుపెట్టి వత్తసాగాడు. ఆ విధంగా ఆయన వీపుక్రింద వున్న బొగ్గులు కూడా చల్లారిపోయాయి.[2]

హజ్రత్ ఖబ్బాబ్(రజి) చాలా కాలం తరువాత హజ్రత్ ఉమర్ (రజి) ముందు ఈ సంఘటన వినిపించినప్పుడు వీపు మీది ఆచ్ఛాదనం

---

1) అల్లామా షిబ్లీ నూమానీగారి సీరతున్నబీ గ్రంథం మొదటి సంపుటిలో 228 నుండి 231 పుటలు

2) ఇబ్నుల్ అసీర్ గారి 'అల్‌కామిల్' గ్రంథం రెండవ సంపుటి 67వ పుట

www.abulhasanalinadwi.org

తొలగించి చూపించారు. అప్పుడు ఆయన వీపుపై బొల్లి వ్యాధిలా తెల్లని మచ్చలు కనిపించాయి.

హజ్రత్ ఖబ్బాబ్ (రజి) ఇస్లాంకు పూర్వం కంసాలి పనిచేసే వారు. అప్పుడు ఆయనకు కొంతమంది నుంచి అప్పులు రావలసి ఉండేవి. ఆయన ఇస్లాం స్వీకరించిన తరువాత రుణగ్రస్తులు రుణాన్ని తిరిగి ఇవ్వటానికి నిరాకరించారు. పైగా నువ్వు ముహమ్మద్‌ను తిరస్కరించే వరకు నీకు చిల్లిగవ్వ కూడా ఇవ్వముపో అనేవారు. దానికి ఖబ్బాబ్ (రజి), "మీరు చచ్చి బ్రతికినా సరే మీరు కోరుతున్నది జరగదు" అని జవాబు చెప్పేవారు.[1]

## హజ్రత్ బిలాల్ (రజి) :

ఇస్లాంలో తొలి 'ముఅజ్జిన్' ('అజాన్' ఇచ్చే వ్యక్తి) గా బిరుదాంకితులైన బిలాలే ఈయన. అబిసీనియా (ఇథియోపియా) నీగ్రో జాతికి చెందినవారు. ఉమయ్యా బిన్ ఖల్ఫ్ దగ్గర బానిస జీవితం గడిపేవారు. మిట్టమధ్యాహ్నం వేళ ఉమయ్యా ఆయన్ని మలమలా మాడే ఇసుక నేలపై పడుకోబెట్టేవాడు. ఒక పెద్ద బండరాయి ఆయన ఛాతీపై ఉంచేవాడు. దాంతో అయనకు కదలటానికి కూడా వీలుండేది కాదు. ఆ తరువాత ఉమయ్యా ఆయనతో, 'ఆ ధర్మం నుండి మరలిపో, లేకపోతే ఇలాగే మూలిగి, ముక్కి ఛస్తావ్'అని బెదిరించేవాడు. ఆ సమయంలో కూడా ఆయన నోటి నుండి "అహద్ అహద్" (దేవుడు ఒక్కడే) అన్న మాటలే వెలువడేవి. ఎంత శిక్షించినా బెదరకపోవటంతో ఉమయ్యా రెచ్చిపోయి ఆయన మెడకు తాడుకట్టి అకతాయి కుర్రవాళ్ళకు అప్పగించేవాడు. వాళ్ళు ఆయన్ని నగరం ఈ వైపునుంచి ఆ వైపుదాకా ఈడ్చుకుంటూ లాక్కెళ్ళేవారు. అప్పటికీ ఆయన అధరాలు 'అహద్, అహద్' అన్న పలుకుల్నే ఆలాపించేవి.[2]

**హజ్రత్ అమ్మార్ (రజి):** ఈయన యమన్ దేశస్థులు. ఈయన తండ్రి యాసిర్ (రజి) ఒకప్పుడు మక్కా వచ్చారు. అబూహుజైఫా

1) సహీహ్ బుఖారీలోని బాడుగల ప్రకరణం
2) ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటిలో 284వ పుట. ముస్నదె అహ్మద్ మొదటి సంపుటిలో 404వ పుట.

www.abulhasanalinadwi.org

మఖ్‌జూమి ఆయనకు తన బానిసరాలయిన సుమయ్యాతో వివాహం జరిపించాడు. ఆ పుణ్య దంపతుల కడుపున పుట్టినవారే అమ్మార్ (రజి). ఈయన తొలినాళ్ళలోనే ఇస్లాం స్వీకరించారు. ఈయన కంటే ముందు ఇస్లాం స్వీకరించింది ముగ్గురే. ఖురైషులు ఈయన్ని మండుతున్న ఇసుకనేలపై పడుకోబెట్టి చితక బాదేవారు. దాంతో ఆయన స్పృహ తప్పి పడిపోయేవారు. ఆయన తల్లిదండ్రుల పట్ల కూడా ఇలాగే ప్రవర్తించేవారు.[1]

**హజ్రత్ సుమయ్యా (రజి.అన్హా)** : హజ్రత్ అమ్మార్ (రజి) గారి తల్లి. ఇస్లాం స్వీకరించిందన్న నేరంపై అబూజహల్ ఆమెను ఈటెతో చంపాడు. దాంతో ఆమె అక్కడి కక్కడే నేలకొరిగి వీరమరణం పొందారు. ఇస్లాం కోసం ప్రాణార్పణం చేసిన తొలి మహిళామణి సుమయ్యా (రజి. అన్హా).[2]

**హజ్రత్ యాసిర్ (రజి)**: ఈయన అమ్మార్(రజి) గారి తండ్రి. ఈయన కూడా అవిశ్వాసుల చేతుల్లో చిత్రహింసలు అనుభవిస్తూ అమరగతి నొందారు.

**సుహైబ్ రూమి(రజి)**: దైవప్రవక్త(స) ఇస్లాం సందేశ ప్రచారం మొదలు పెట్టినప్పుడు సుహైబ్ రూమి మరియు అమ్మార్‌లు ఆయన(స) దగ్గరికి వచ్చారు. దైవప్రవక్త(స) బోధకు ప్రభావితులై ఇస్లాం స్వీకరించారు. అందుకని ఖురైషులు ఈయనకు స్పృహ తప్పిపోయే వరకు చిత్రహింసలు పెట్టేవారు. ఈయన మదీనాకు వలస వెళ్ళాలని బయలుదేరినప్పుడు ఖురైషులు ఈయన్ని అడ్డుకొని తన సంపదనంతా ఇక్కడే వదలి పెట్టి వెళ్ళాలని పట్టుబట్టారు. సుహైబ్(రజి) దానికి సంతోషంతో ఒప్పుకున్నారు. హజ్రత్ ఉమర్ (రజి) నమాజులో క్షతగాత్రులయినప్పుడు ప్రజల నమాజ్‌కు సారథ్యం వహించమని ఆయన సుహైబ్(రజి)నే పురమాయించారు.[3]

**అబూఫుకైహా (రజి)**: ఈయన సఫ్వాన్ బిన్ ఉమయ్యా బానిస. బిలాల్ (రజి)తో పాటు ఇస్లాం స్వీకరించారు. ఉమయ్యాకు ఈ

1) సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటిలో 319వ పుట.
2) అల్‌కామిల్ రెండవ సంపుటిలో 27వ పుట.
3) ముస్తద్రక్ హాకింలో సుహైబ్ మహిమోన్నతలు. మూడవ సంపుటి:449వ పుట.

www.abulhasanalinadwi.org

విషయం తెలిసినప్పుడు అతను ఈయున్ని కాళ్ళకు త్రాడుకట్టి ఈడ్చుకుంటూ వెళ్ళండని, కాలుతున్న ఇసుకపై పడుకోబెట్టండని జనానికి అప్పగించాడు. దారిలో ఒక గొంగళి పురుగు కనబడితే, "నీ దేవుడు ఇతనేననుకుంటా" అని అన్నాడు. దానికి ఫుకైహా (రజి), "నీకూ, నాకూ ఇద్దరికీ దేవుడు అల్లాహ్ మాత్రమే" అని అన్నారు. ఆ మాటకు రెచ్చిపోయిన ఉమయ్యా ఆయన మీద పడి గొంతు పిసకటం మొదలుపెట్టాడు. అది చూసిన జనం ఫుకైహా(రజి) ప్రాణాలు పోయి ఉంటాయని అనుకున్నారు. ఒకరోజు ఆయన ఛాతీపై బరువైన వస్తువు ఏదో ఉంచాడు. దాంతో ఫుకైహా నాలుక బయటికి వచ్చింది.[1]

**హజ్రత్ లుబైనా (రజి.అన్హా):** ఈమె కూడా ఒక బానిసరాలు. హజ్రత్ ఉమర్ ఈమెను కొట్టి కొట్టి అలసిపోయినప్పుడు, "నేను నీపై దయజూపి వదలిపెట్టడం లేదు. కొట్టి కొట్టి అలసిపోయాను. అందుకే వదలి పెడుతున్నాను" అనేవారు. ఆ సమయంలో కూడా ఆ వీరవనిత ఎంతో స్థయిర్యాన్ని కనబరుస్తూ, "ఉమర్! నువ్వు గనక ఇస్లాం స్వీకరించకపోతే దేవుడు దీని ప్రతీకారం తీర్చుకుంటాడు" అని చెప్పేది[2]

**జన్నీరా (రజి. అన్హా):** హజ్రత్ ఉమర్(రజి) కుటుంబానికి చెందిన బానిస స్త్రీ. అందుకని ఉమర్ (రజి) తాను ఇస్లాం స్వీకరించక ముందు ఈమెను తనివితీరా బాధలు పెట్టేవారు. అబూజహల్ ఈమెను కొట్టి కొట్టి కళ్ళు లొట్ట పోయేలా చేశాడు.[3]

**నహ్దియ్యా మరియు ఉమ్మె ఉబైస్ (రజి.అన్హా):** వీరిద్దరు కూడా బానిస స్త్రీలే. ఇస్లాం స్వీకరించిన నేరానికి వీళ్ళు కూడా ఎన్నో కష్టాలు అనుభవించారు.[4]

ఈ సందర్భంగా హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) దాతృత్వాన్ని గురించి చెప్పుకోవాలి. ఆయన ఈ బాధితుల్లో ఎంతోమంది ప్రాణాలను రక్షించారు. బిలాల్, ఆమిర్ బిన్ ఫుహైరా, లుబైనా, జన్నీరా, ఉమ్మెఉబైస్- వీళ్ళందరినీ ఆయన భారీ మూల్యాలను చెల్లించి బానిసత్వ బంధనాల నుంచి విడిపించారు.[5] ఖురైషులు బలహీన వర్గాల వారినే కాదు.

1,2) అల్‌కామిల్ రెండవ సంపుటిలో 69వ పుట.
3,4) అల్ కామిల్ రెండవ సంపుటి 69-70 పుటలు.
5) ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటి 284వ పుట. ముసన్నఫ్ ఇబ్నె అబీ షైబా 10-12 బిలాల్ (రజి)ని విడిపించిన సంఘటన బుఖారీలో కూడా ఉంది.

www.abulhasanalinadwi.org

ఉన్నత వర్గాల వారిలో ఎవరైనా ఇస్లాం స్వీకరిస్తే వారిని కూడా హింసించకుండా వదలిపెట్టేవారు కాదు. ఈ కోవకు చెందిన వారిలో ప్రముఖులు వీరు:

**ఉస్మాన్ (రజి):** ఈయన వయోజనుడు. ఉన్నత కుటుంబానికి చెందిన వ్యక్తి. ఈయన ఇస్లాం స్వీకరించినప్పుడు ఇతరులెవరో కాదు. సొంతబాబాయే ఈయన్ని త్రాళ్ళతో కట్టి హింసించాడు.[1]

**అబూజర్ర్ (రజి):** ఇస్లాం స్వీకరించిన వారిలో ఏడవ వ్యక్తి. ఈయన తాను ముస్లిం అయిన సంగతి కాబా గృహంలో ప్రకటించినప్పుడు ఖురైషులు ఈయన్ని చితకబాదారు.[2]

**జుబైర్ బిన్ అవ్వామ్ (రజి):** ఇస్లాం స్వీకరించిన వారిలో ఈయన ఐదవ వ్యక్తి. ఇస్లాం స్వీకరించినందుకు ఈయన బాబాయి ఈయన్ని చాపలో చుట్టి, ముక్కుకి పొగబెట్టి ఊపిరాడకుండా చేసేవాడు.[3]

ఉమర్(రజి) గారి పినతండ్రి కొడుకు సయీద్‌బిన్ జైద్ (రజి) ఇస్లాం స్వీకరించినప్పుడు ఉమర్ ఆయన్ని త్రాళ్ళతోకట్టేశారు.[4]

**ఈరాన్ విజేత సాద్ బిన్ అబూవఖ్ఖాస్ (రజి):** ఈయన చాలా గొప్ప వ్యక్తి. తన తెగవారిలో పరపతి గల మనిషి. అయినప్పటికీ అవిశ్వాసుల ఆగడాల నుండి ఈయన కూడా సురక్షితంగా ఉండలేక పోయారు. ఇస్లాం స్వీకరించిన నేరానికి అసద్ తెగవారు ఈయన్ని చాలా కఠినంగా శిక్షించారు. అప్పటి వరకు కాబా గృహంలో బిగ్గరగా ఖురాన్ పఠించే ధైర్యం ఎవరికీ ఉండేది కాదు. కాని ఇబ్నెమస్‌వూద్ (రజి) ఇస్లాం స్వీకరించినప్పుడు తాను ఈ విధిని నిర్వర్తించి తీరుతానని ప్రతినబూనారు. ప్రజలు వద్దని ఎంత చెప్పినా వినలేదు. కాబా ప్రాంగణంలోకి ప్రవేశించి 'ముఖామె ఇబ్రాహీం' దగ్గర నిలబడి రహ్మాన్ సూరా పారాయణం మొదలుపెట్టారు. అది విని అవిశ్వాసులు ఆయనపై దాడి చేసి మొహం

1) ఖాజీ సులైమాన్ మన్సూర్‌పూరిగారి గ్రంథం రహ్మతుల్లిల్ ఆలమీన్ మొదటి సంపుటీ 55వ పుట.
2) సహీహ్ బుఖారీలో అబూజర్ర్(రజి) ఇస్లాం స్వీకరించిన సంఘటన.
3) అల్లామా షిబ్లీ నూమానీగారి సీరతున్నబీ గ్రంథం, 'రియాజున్నజ్రా' సౌజన్యంతో
4) సహీహ్ బుఖారీలోని బలాత్కార ప్రకరణం

www.abulhasanalinadwi.org

మీద కొట్టసాగారు. కాని ఆయన ఖురాన్ పారాయణాన్ని మాత్రం ఆపలేదు. ముఖమంతా గాయాలతో తిరిగి వెళ్ళారు.[1]

## అబూబక్ర్(రజి) పట్ల అవిశ్వాసుల వైఖరి

హజ్రత్ అబూబక్ర్(రజి) మక్కా నగరంలో గౌరవోన్నతులు గల వారిలో ఒకరు. కాని ఇస్లాం స్వీకరించిన తరువాత ఆయనకు కూడా అవిశ్వాసుల చిత్రహింసలు తప్పలేదు. ఒకరోజు ప్రజలు ఆయన్ని క్రిందపడేసి తొక్కారు. విపరీతంగా కొట్టారు. ఉత్బా బిన్ రబీయా ఆయన్ని తోళ్ళ ముక్కలు అంటించివున్న చెప్పులతో కొట్టాడు. అవిశ్వాసుల దెబ్బలకు ఆయన ముఖం వాచిపోయింది. కాళ్లు చేతులు నుజ్జు నుజ్జయి పోయాయి. ఆయన తెగవారు ఆయన్ని ఒక వస్త్రంలో చుట్టి ఎత్తుకొని వెళ్ళి ఇంట్లో అప్పజెప్పారు. అబూబక్ర్ బ్రతికి బయటపడతారని ఎవరూ అనుకోలేదు. సాయంత్రానికి గాని నోట మాట రాలేదు. నోరు విప్పడంతోనే 'దైవప్రవక్త(స) క్షేమమేనా!' అని అడిగారు. ఇంత జరిగినా నీకు దైవప్రవక్త చింత వదల్లేదా? అని ఇంట్లో వాళ్లు ఆయన్ని మందలించారు. జనమంతా వెళ్ళిపోయిన తరువాత ఆయన తన తల్లితో మళ్ళీ దైవప్రవక్త(స) క్షేమసమాచారం దర్యాప్తు చేశారు. "ఆ విషయాలేవీ నాకు తెలియవు" అని ఆమె అన్నది. ఆయన ఉమ్మె జమీల్‌ను అడిగి రమ్మని కోరారు. అంతలో ఉమ్మెజమీల్ ఆయన్ని పరామర్శించటానికి వచ్చారు. ఆయన పరిస్థితి చూసి ఆమె, ఉద్రేకంతో, "మీ పట్ల ఇలా ప్రవర్తించిన వారు దుష్టులు. దైవ విరోధులు. దేవుడు వారిపై ప్రతీకారం తీర్చుకుంటాడని నాకు గట్టి నమ్మకముంది" అన్నారు. "దైవప్రవక్త(స) క్షేమమే కదా!" అని అబూబక్ర్ (రజి) అడిగారు. 'ఆయన(స) క్షేమంగానే ఉన్నారు' అని చెప్పారామె. 'ఇప్పుడాయన(స) ఎక్కడున్నారు?' అబూబక్ర్(రజి) ఎంతో ఆతురతతో అడిగారు. ప్రస్తుతం ఆయన(స) ఇబ్నె అర్ఖమ్ గారి ఇంట్లో ఉన్నారని అందామె. "దైవప్రవక్త(స)ను చూడనంతవరకు నేను అన్నపానీయాలు ముట్టను" అని అబూబక్ర్ (రజి) పట్టుబట్టి కూర్చున్నారు. రాత్రి పొద్దుపోయిన తరువాత, బయట జనసంచారం తగ్గిపోయి అంతటా నిశ్శబ్దం అలుముకుంది. ఆయన తల్లి, ఉమ్మె జమీల్ ఇద్దరూ ఆయన్ని

1) సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటి 314వ పుట. అసదుల్ గాబా మూడవ సంపుటి 282వ పుట.

www.abulhasanalinadwi.org

దైవప్రవక్త (సఅసం) సన్నిధికి తీసుకొని వెళ్ళారు. దైవప్రవక్తను కలుసుకున్న తరువాతగాని ఆయన మనసు కుదటపడలేదు.[1]

## ఇథియోపియాకు ముస్లింల వలస

అవిశ్వాసుల ఆగడాలకు అడ్డూ అయిపూ లేకుండా పోయింది. బలహీన ముస్లింలపై బహుదైవారాధకుల హింసాకాండ ఉగ్రరూపం దాల్చింది. అప్పుడు వారు తమ విశ్వాసాన్ని, ప్రాణాలను కాపాడుకోవటానికి ఇథియోపియా దేశం వెళ్ళవచ్చని దైవప్రవక్త(స) అనుమతినిచ్చారు.

దైవప్రవక్త(స) అనుమతిని పొంది పదకొండుమంది పురుషులు, నలుగురు స్త్రీలతో కూడిన ఒక బృందం రేచీకటిలో ఇథియోపియాకు బయలుదేరింది. వారంతా షయిూబా రేవు నుండి పడవ ద్వారా ప్రయాణించి ఇథియోపియాకు చేరుకున్నారు.[2]

ఈ చిన్న బృందానికి నాయకులుగా ఉస్మాన్ బిన్ అప్ఫాన్ (రజి) నియమితులయ్యారు. ఆయన వెంట దైవప్రవక్త(స) కుమార్తె రుఖయా (రజి.అన్హ) కూడా ఉన్నారు. దైవప్రవక్త(స) వారిని సాగనంపుతూ, "ఇబ్రాహీం (అలైహి) తరువాత దైవ మార్గంలో ప్రస్థానం చేస్తున్న తొలిదంపతులు వీరే"నని అన్నారు.[3]

వారి వెనుక ఇంకొంతమంది ముస్లింలు (83 మంది పురుషులు, 18 మంది స్త్రీలు) మక్కా నుండి ఇథియోపియాకు బయలుదేరారు. వారిలో దైవప్రవక్త(స) పినతండ్రి కుమారుడు జాఫర్ తయ్యార్(రజి) కూడా ఉన్నారు. ఖురైషులు సముద్రం వరకు వారిని వెంటాడారు. కాని వారు అప్పటికే పడవల్లో ఎక్కి బహుదైవారాధకులకు చిక్కకుండా ప్రయాణం కొనసాగించారు.[4]

ఇథియోపియా రాజు క్రైస్తవుడు. మక్కా అవిశ్వాసులు ముస్లింలను అక్కడ కూడా ప్రశాంతంగా ఉండనివ్వదలచుకోలేదు. రాజుకు విలువైన కానుకలు, పారితోషికాలు సమర్పించుకొని తమ దేశం నుండి పారిపోయి

1) అల్ఇసాబా మొదటి సంపుటి 42వ పుట
2) ఇబ్నె హజర్గారి ఫత్హుల్ బారీ ఏడవ సంపుటి 188-189వ పుట
3) ఇబ్నెసాద్ గారి తబఖాత్ గ్రంథం మొదటి సంపుటి 203వ పుట
4) ఫత్హుల్ బారి ఏడవ సంపుటి 189

www.abulhasanalinadwi.org

వచ్చిన వారిని తమకు అప్పగించవలసిందిగా రాజుని కోరారు. రాజు ముస్లింలను దర్బారులోకి పిలిపించాడు. ఆ సందర్భంగా దైవప్రవక్త పినతండ్రి కుమారుడు జాఫర్ తయ్యార్(రజి) రాజ దర్బారులో ఈ విధంగా ప్రసంగించారు:

"రాజా! ఒకప్పుడు మేము అజ్ఞానులుగా బతికేవాళ్ళం. విగ్రహాలను పూజించేవాళ్ళం. మృత జంతువుల మాంసాన్ని తింటూ అపరిశుభ్రంగా ఉండేవాళ్ళం. అబద్ధాలు చెప్పేవాళ్ళం. మాలో మానవత్వం, మంచితనం మచ్చుకైనా ఉండేవి కావు. తోటివారి పట్ల ఎలా వ్యవహరించాలో తెలియదు. నీతి నియమంలేని జీవితం గడిపేవాళ్ళం. అలాంటి పరిస్థితిలో దేవుడు మా దగ్గరికి ఓ పుణ్యాత్ముణ్ణి ప్రవక్తగా పంపించాడు. ఆయన వంశం, కుటుంబం గురించి ఆయన నిజాయితీ తత్పరత గురించి, దైవభక్తి, ధర్మపరాయణతల గురించి మాకు బాగా తెలుసు. ఆయన మాకు ఒకే దేవుణ్ణి పూజించమని పిలుపు ఇచ్చాడు. దేవునికి ఇతరుల్ని సాటి కల్పించకూడదని బోధించాడు. రాయిూరప్పల పూజ నుండి మమ్మల్ని వారించాడు. సత్యం పలకమని, వాగ్దానాలను నెరవేర్చమని, చెడులకు దూరంగా ఉండమని, పాపాల నుండి రక్షించుకోమని బోధించాడు. నమాజ్ చెయ్యమనీ, దానధర్మాలు ఇవ్వమనీ, ఉపవాసాలు పాటించమని ఆదేశించాడు. మేమాయన చెప్పిన మాటల్ని నమ్మినందుకు మా జాతివారు మాపై శత్రుత్వాన్ని పెంచుకున్నారు. కసితీరా హింసించారు. ఒకే దేవుణ్ణి వదలిపెట్టి కొయ్యబొమ్మల్ని, రాతి విగ్రహాలను పూజించమని బలవంతపెట్టారు. మేము వీళ్ళ చేతుల్లో నానాయాతనలు అనుభవించాం. చివరకు గత్యంతరం లేక మీ రాజ్యంలో మాకు రక్షణ లభిస్తుందన్న ఆశతో వచ్చాం".

రాజు ప్రసంగమంతా విన్న తరువాత తనకు ఖురాన్ పఠించి వినిపించమని కోరాడు. అప్పుడు జాఫర్ తయ్యార్ (రజి) అతనికి మర్యమ్ సూరాలోని వాక్యాలను పఠించి వినిపించారు. రాజు ఆ వాక్యాలకు ప్రభావితుడై కంటతడిపెట్టాడు. "నిస్సందేహంగా యేసుక్రీస్తు తన తరువాత వస్తారని చెప్పిన ప్రవక్త ఈ ముహమ్మదే. ఈ ప్రవక్త కాలంలో నేను బ్రతికి ఉన్నందుకు దైవానికి కృతజ్ఞతలు" అని అన్నాడు. ఆ తరువాత మక్కా అవిశ్వాసుల్ని తన దర్బారు నుండి తరిమేశాడు.

www.abulhasanalinadwi.org

మరునాడు అమ్ర్ బిన్ ఆస్ మళ్ళీ దర్బారుకు వెళ్ళి నజాషీతో మాట్లాడుతూ "రాజా! ఈసా ప్రవక్త విషయంలో వీళ్ళ విశ్వాసం ఏమిటో తెలుసుకున్నారా?" అని అడిగారు. నజాషీ ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవటం కోసం ముస్లింలను మళ్ళీ దర్బారుకు పిలిపించాడు. నజాషీ క్రైస్తవుడు. ఈసా (అలైహి) దేవుని కుమారుడు కారని చెబితే అతనికి కోపం వస్తుందేమోనని ముస్లింలు ముందు నిజం చెప్పటానికి తటపటాయించారు. కాని హజ్రత్ జాఫర్(రజి), "ఏమైనా సరే. మనం నిజం చెబుదాం" అని అన్నారు.

ఆ తరువాత ముస్లింలు దర్బారుకు హాజరయ్యారు. నజాషీ వారిని, "ఈసా (ఏసుక్రీస్తు) ప్రవక్త విషయంలో మీ విశ్వాసం ఏమిటి?" అని ప్రశ్నించాడు. దానికి సమాధానమిస్తూ "ఈసా దేవుని దాసుడు, దైవప్రవక్త, ఇంకా ఆయన దేవుని వచనమని మా ప్రవక్త చెప్పారు" అని హజ్రత్ జాఫర్ (రజి) అన్నారు. ఆ మాట విని నజాషీ ఆ నేలపై నుంచి ఓ పుల్లను ఎత్తి చూపుతూ, "దైవసాక్షి! ఈసా (ఏసుక్రీస్తు) విషయంలో మీరు చెప్పినది వాస్తవం. దీనికి మించి ఇతరత్రా వాటికి ఈ పూచిక పుల్లంత విలువ కూడా లేదు" అని అన్నాడు. రాజు ఆ మాట అనగానే దర్బారులో వున్న క్రైస్తవమత పెద్దలు ఆగ్రహోదగ్రులయ్యారు. కోపంతో వారి ముక్కుపుటాలు అదిరిపోయాయి. కాని నజాషీ వారి కోపాన్ని ఏ మాత్రం ఖాతరు చేయలేదు. ఖురైష్ దూతలు ఒట్టి చేతులతో మక్కాకు తిరిగి వచ్చారు.[1]

## హమ్జా (రజి) ఇస్లాం స్వీకరణ

హజ్రత్ హమ్జా (రజి) దైవప్రవక్త (స)కు స్వయాన బాబాయి. దైవప్రవక్త(స) అంటే ఆయనకు వల్లమాలిన అభిమానం, వాత్సల్యం. దైవప్రవక్త(స) కన్నా వయసులో రెండుమూడేళ్ళు పెద్ద. చిన్నప్పుడు ఇద్దరూ కలిసి ఆడుకునేవారు. ఇద్దరూ 'సౌబియా' దగ్గర పాలు తాగారు. అందువల్ల పరస్పరం పాల సోదరులు కూడా అవుతారు. అప్పటికింకా ఇస్లాం స్వీకరించకపోయినప్పటికీ దైవప్రవక్త(స) చేసే ప్రతి పనినీ ఆయన

1) సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటి 335-336వ పుటలు. ముస్నదె అహ్మద్ మొదటి సంపుటిలో 202వ పుట, ఐదవ సంపుటిలో 290వ పుట.

www.abulhasanalinadwi.org

గౌరవభావంతో చూసేవారు. విలువిద్య నేర్చుకోవటం, జంతువుల్ని వేటాడటమంటే ఆయనకు ఎంతో యిష్టం. పెందలాడే నిద్రలేచి, ధనుర్బాణాలు వెంటబెట్టుకొని వెళ్ళి పగలంతా వేటాడటంలోనే గడిపేవారు. సాయంత్రం ఇంటికి తిరిగొచ్చినప్పుడు ముందు కాబా గృహానికి వెళ్ళి, అక్కడ కాబా చుట్టూ ప్రదక్షిణ చేసేవారు. ఆ కాలంలో ఖురైష్ సర్దారులు కాబా ప్రాంగణంలో గుంపులు గుంపులుగా కూర్చొని కబుర్లు చెప్పుకునేవారు. హమ్జా(రజి) వారికి అభివాదం చేసి, అప్పుడప్పుడూ తాను కూడా వారితో కలిసి కాలక్షేపం చేసేవారు. ఆ విధంగా ఆయనకు అందరితోనూ స్నేహ సంబంధాలుండేవి. ఖురైషులు కూడా ఆయనకు మర్యాద ఇచ్చేవారు.

దైవప్రవక్త(స) పట్ల అవిశ్వాసులు వ్యవహరించే కఠిన వైఖరిని చూసి బయటివారు కూడా సహించలేకపోయేవారు. ఒకరోజు అబూజహల్ ఆయన(స) పట్ల చాలా నీచంగా ప్రవర్తించాడు. ఒక బానిసరాలు ఇదంతా చూసి, సాయంత్రం హమ్జా వేట నుంచి తిరిగొచ్చిన తరువాత జరిగినదంతా ఆయన ముందు ఏకరువు పెట్టింది. అది విని హమ్జా కోపోద్రిక్తులయ్యారు. ధనుర్బాణాలతో సహా కాబా దగ్గరికి వెళ్ళి అబూజహల్‌తో "నేను ఇస్లాం స్వీకరిస్తున్నాను. ఏం చేసుకుంటావో చేసుకోపో" అని గర్జించారు.[1]

## ఉమర్ (రజి) ఇస్లాం స్వీకరించిన సంఘటన

ఆయన(స) దైవప్రవక్తగా నియుక్తులయ్యే నాటికి ఉమర్(రజి)కు ఇరవై ఏడేళ్ళు. ఆయన వంశంలో జైద్ ఇస్లాం స్వీకరించి ఉండటం వల్ల ఒకే దేవుణ్ణి ఆరాధించాలన్న మాట ఆయనకు క్రొత్తేమీ కాదు. ముందుగా ఆయన వంశానికి చెందినవారిలో జైద్ కుమారులు సయీద్ ఇస్లాం స్వీకరించారు. సయీద్ భార్య ఫాతిమా ఉమర్ (రజి)చెల్లెలు. ఆ విధంగా భార్యా భర్తలిద్దరూ ముస్లింలయ్యారు. కాని ఉమర్ (రజి) అప్పటికింకా ఇస్లాం స్వీకరించలేదు. తొలినాళ్ళలో ఆయన ఇస్లాం గురించి విని చాలా మండిపడ్డారు. అంతేకాదు, తన వంశంలో ఇస్లాం స్వీకరించిన వారికి

1) జహబీగారి అస్సీరతున్న బవియ్యా 101వ పుట ముస్తద్రక్ హాకిం మూడవ సంపుటిలో 213వ పుట.

www.abulhasanalinadwi.org

విరోధులయ్యారు. ఆయన కుటుంబానికే చెందిన లుబైనా అనే బానిసరాలు ఇస్లాం స్వీకరించింది. దాంతో ఆయన ఆమెను కొట్టి కొట్టి అలసిపోయి, 'కాస్త ఓపికరాని మళ్ళీ కొడతాను" అని అనేవారు. ఒక్క లుబైనానే కాదు, వీలుచిక్కిన ముస్లింలందర్నీ చితగ్గొట్టేవారు. కాని ప్రజల్లో ఎవరయినా ఒకసారి ఇస్లాం మాధుర్యాన్ని ఆస్వాదిస్తే చాలు, లోకమంతా ఏకమైనా వారు దాన్నుంచి వేరయ్యేవారు కారు. ఉమర్ కూడా ముస్లింలను వేధించి ఒక్కర్ని కూడా ఇస్లాం నుండి మరల్చలేకపోయారు. ఆఖరికి ఇస్లాం ధర్మాన్ని రూపుమాపాలంటే దైవప్రవక్త(స)ను హతమార్చడం ఒక్కటే మార్గమని తలంచారు.

ఒకరోజు ఖడ్గాన్ని చేబూని దైవప్రవక్త(స)ను హతమార్చాలన్న ఉద్దేశ్యంతో ఆయన(సల్లం) ఉండేచోటుకి బయలుదేరారు. దారిలో నుఐమ్ బిన్ అబ్దుల్లాహ్ ఎదురయ్యారు. ఉమర్ ఆగ్రహావేశాన్ని చూసి ఆయన "ఉమర్! క్షేమమే కదా! ఎక్కడికి బయలుదేరావ్?" అని అడిగారు. 'ముహమ్మద్ సంగతి తేల్చుకోవటానికి వెళుతున్నాను' అని అన్నారు ఉమర్ ఆవేశంతో ఊగిపోతూ. 'ముందు నీ ఇంట్లోవాళ్ళ పరిస్థితి ఏమిటో చూసుకో. స్వయానా నీ చెల్లెలు, నీ బావ ఇస్లాం స్వీకరించారు' అని అన్నారు నుఐమ్. ఆ మాట వినగానే ఉమర్ (రజి) వెనక్కి తిరిగి చెల్లెలి ఇంటికి వెళ్ళారు. ఆ సమయంలో ఆమె ఇంట్లో ఖురాన్ పారాయణం చేస్తోంది. అన్నయ్య వచ్చాడని గ్రహించి పారాయణం ఆపేసింది. ఖురాన్ ప్రతులు దాటిపెట్టింది.

కాని ఆమె ఖురాన్ చదువుతున్న శబ్దం ఆయన బయటి నుంచే విన్నారు. "ఇందాక నువ్వు చదువుతున్నది ఏమిటి?" అని గద్దిస్తూ అడిగారు. "అబ్బే ఏం లేదు" - భయపడుతూనే జవాబు చెప్పింది చెల్లెలు.

"కాదు, నేనా శబ్దం విన్నాను. మీరిద్దరూ మతభ్రష్టులయి పోయారం"టూ బావ చొక్కా పట్టుకొని ఎడాపెడా వాయించటం మొదలుపెట్టారు. ఆయన్ని కాపాడటానికి అడ్డు వచ్చిన చెల్లెల్ని కూడా వదల్లేదు. ఆమె శరీరమంతా గాయాలయ్యాయి. కాని ఆమెలోని విశ్వాసం మాత్రం చెక్కు చెదరలేదు. "ఉమర్ నువ్వు మా ప్రాణాలు తీసినా సరే. మేము ఇస్లాం ధర్మాన్ని వదలిపెట్టం" అన్నది చెల్లెలు ఉద్వేగంతో.

ఆ మాటలకు ఉమర్ హృదయం ఒక్కసారిగా చలించింది. చెల్లెలి

www.abulhasanalinadwi.org

వంక ప్రేమ నిండిన చూపులతో చూశారు. ఆమె ఒళ్ళంతా గాయాలే. ఆ దృశ్యం చూసి ఆయన పూర్తిగా చల్లబడిపోయారు. తరువాత మృదువైన స్వరంతో "మీరు చదువుతున్న గ్రంథం. కాస్త నాక్కూడా చూపిస్తారా! ముహమ్మద్ సందేశం ఏమిటో తెలుసుకుంటాను" అన్నారు.

"నువ్వు ఈ గ్రంథం పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తావేమోనని మాకు భయంగా ఉంది" అని ఆమె అన్నది.

"లేదమ్మా. నా దేవుళ్ళ మీద ఒట్టేసి చెబుతున్నాను. ఒక్కసారి చదివి తిరిగి నీకే ఇచ్చేస్తాను" అన్నారాయన ఎంతో సౌమ్యంగా. ఆ మాట వినగానే ఆమె, ఉమర్ కూడా సన్మార్గం పొందే శుభఘడియ వచ్చిందని గ్రహించింది.

"నువ్వు బహుదైవారాధకుడివి, అపవిత్రుడువి. ఈ గ్రంథాన్ని పవిత్రులు మాత్రమే ముట్టుకోవాలి. ముందు నువ్వెళ్ళి స్నానం చేసిరా" అందామె.

ఉమర్ స్నానం చేసి వచ్చారు. అప్పుడు చెల్లెలు ఆయనకు ఖురాన్ ప్రతులిచ్చింది. ఆ ప్రతుల్లో ఆయనకు ముందుగా 'తాహా' సూరా కనిపించింది. ఆయన మొదటినుంచి కొన్ని వాక్యాల వరకు చదివి అప్రయత్నంగానే "ఆహా... ఈ గ్రంథం ఎంత మధురంగా, ఎంత అద్భుతంగా ఉంది!" అని అన్నారు. ఉమర్ నోటి నుండి ఆ మాట వెలువడగానే ఆయన వస్తున్నారని భయపడి ఓ మూలన నక్కి కూర్చున్న ఖబ్బాబ్(రజి) బయటికి వచ్చి, "ఉమర్! దేవుడు తన ప్రవక్త కోరికను మన్నించినట్లుంది. నిన్న దైవప్రవక్త(స), "దేవా! అబూజహల్ ద్వారా గాని, ఉమర్ ద్వారా గాని ఈ ధర్మానికి సహాయమందించు" అని ప్రార్థిస్తుండగా విన్నాను. కనుక "ఉమర్! ఈ అవకాశాన్ని చేజారనివ్వకు" అని అన్నారు.

"ఖబ్బాబ్! దైవప్రవక్త(సఅసం) ఇప్పుడు ఎక్కడున్నారో చెప్పు. నేను కూడా ఆయన దగ్గరికి వెళ్ళి ఇస్లాం స్వీకరిస్తాను" అని అన్నారు ఉమర్(రజి).

ఖబ్బాబ్ ఆయనకు దైవప్రవక్త(స) ఉండేచోటు తెలియజేశారు.

ఆ సమయంలో దైవప్రవక్త(స) అర్ఖమ్ (రజి) ఇంట్లో ఉన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఆయన అస్థానానికి చేరుకొని తలుపుతట్టారు.

www.abulhasanalinadwi.org

ఉమర్ చేతిలో ఖడ్గాన్ని చూసి దైవప్రవక్త (స) సహచరులు భయపడ్డారు. అప్పుడు హమ్జా (రజి), "అతణ్ణి రానివ్వండి, అతను మంచి ఉద్దేశ్యంతో వస్తే సరేసరి; లేకపోతే అతని ఖడ్గంతోనే అతని తల నరికేస్తాను" అన్నారు. కాని ఉమర్ (రజి) లోపల అడుగుపెట్టగానే దైవప్రవక్త(స) స్వయంగా వెళ్ళి ఆయన చొక్కా పట్టుకొని, "ఉమర్! ఏ ఉద్దేశ్యంతో వచ్చావ్?" అని అడిగారు. దైవప్రవక్త(స) గంభీర స్వరానికి ఆయన గజగజ వణికిపోయారు.

"ఇస్లాం స్వీకరించడానికి" - కడు వినయంగా సమాధానమిచ్చారు ఉమర్ (రజి). ఆ సమాధానం వినగానే దైవప్రవక్త(స) 'అల్లాహు అక్బర్'! అని నినదించారు. ఆయన సహచరులు కూడా 'అల్లాహు అక్బర్!' అంటూ నినదించటం మొదలుపెట్టారు. ఆ నినాదాలకు చుట్టుప్రక్కల ఉన్న పర్వతాలు ప్రతిధ్వనించాయి.[1]

హజ్రత్ ఉమర్ (రజి) ఇస్లాం స్వీకరించటంతో ఇస్లామీయ చరిత్రలో ఓ క్రొత్త అధ్యాయం మొదలయింది. ఆయనకు ముందు నలభై యాభైమంది ఇస్లాం స్వీకరించారు. వారిలో హమ్జా (రజి) లాంటి గొప్ప పరాక్రమవంతులు కూడా ఉన్నారు. కాని అప్పటి వరకు ముస్లింలు తమ విధులను బహిరంగంగా నిర్వర్తించలేకపోయేవారు. కాబా గృహంలో నమాజ్ చెయ్యడమంటే మరీ కష్టం. కాని ఉమర్ (రజి) ఇస్లాం స్వీకరించిన తరువాత ఒక్కసారిగా పరిస్థితులు మారిపోయాయి. ఆయన బహిరంగంగానే ప్రజల ముందు తాను ఇస్లాం స్వీకరించానని ప్రకటించారు. ఈ ప్రకటనతో మొదట్లో అవిశ్వాసుల తరపు నుండి ఆయనపై కష్టాల కొండలు విరుచుకుపడ్డాయి. కాని ఆయన ఏ మాత్రం తొణకలేదు. అసామాన్య సహనస్థయిర్యాలను ప్రదర్శిస్తూ అవిశ్వాసులతో పోరాడారు. ఆయన ప్రోద్బలంతోనే ముస్లింలు కాబా గృహంలో సామూహికంగా నమాజ్ చేయగలిగారు.[2]

ఇథియోపియాకు వలసవెళ్ళిన యనభై మూడు మంది ముస్లింలు అక్కడ కొంత కాలం పాటు ప్రశాంతంగానే జీవితం గడిపారు. కాని ఆ

---

1) జహబీగారి అస్సీరతున్నబవియ్యా గ్రంథం 102-103 పుటలు. సహీహ్‌బుఖారీలోని కాబా నిర్మాణ ప్రకరణం.

2) తబఖాత్ ఇబ్నెసాద్ మూడవ సంపుటి 370వ పుట

www.abulhasanalinadwi.org

తరువాత వారికి మక్కా అవిశ్వాసులు కూడా ఇస్లాం స్వీకరించారన్న సమాచారం అందింది. దాంతో అనేకమంది ముస్లింలు మక్కాకు తిరుగు ప్రయాణమయ్యారు. మక్కా సమీపానికి చేరుకున్న తరువాత ఆ సంగతి నిజం కాదని తెలిసింది. అంచేత కొంతమంది తిరిగి ఇథియోపియాకు వెళ్ళిపోయారు. అయితే చాలామంది రహస్యంగా మక్కా నగరానికి వచ్చేశారు.[1]

## ఉస్మాన్‌బిన్ మజ్‌వూన్ మక్కా రాకతో ఆయనపై అవిశ్వాసుల దౌర్జన్యకాండ

ఈ వదంతి మూలంగా మక్కాకు తిరిగి వచ్చిన వారిలో ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ (రజి) కూడా ఉన్నారు. ఆయన అరబ్బుల ఆచారాని కనుగుణంగా వలీద్ బిన్ ముగీరా దగ్గర శరణు పొందారు. కాని ముస్లింలలో తనకు తప్ప ఎవరికీ ఖురైష్ సర్దారుల రక్షణ లేదు. పైగా ముస్లింలు ఖురైషుల ఆగడాలకు గురౌతున్నారు. ఉస్మాన్ తనకు వలీద్ రక్షణ ఉండటం చేత స్వేచ్ఛగా తిరగగలిగేవారు. ఆయన్ను ఎవరూ ఏమీ చేయలేకపోయేవారు. కాని ఒకవైపు తోటిముస్లింలపై ఖురైషులు దౌర్జన్యానికి పాల్పడుతుంటే తాను ఖురైష్ సర్దారు, బహుదైవారాధకుడు అయిన వలీద్ రక్షణలో ఉండటానికి ఆయన యిష్టపడలేదు. తాను సాటి ముస్లిం కష్టాల్లో పాలుపంచుకోవటం లేదని, ఇది తన విశ్వాస బలహీనత అని ఆయన మనస్సాక్షి లోలోపలి నుంచి హెచ్చరించసాగింది. అంచేత ఆయన వలీద్ దగ్గరికి వెళ్ళి, "ఇంతవరకు మీరు మీ రక్షణ బాధ్యతను నెరవేర్చారు. కాని ఇక నుంచి నేను మీ సంరక్షణలో ఉండదలచుకోలేదు. ఇకనుంచి మీరు నాకు ఎలాంటి బాధ్యత వహించనక్కర్లేదు" అని నిర్ద్వంద్వంగా చెప్పేశారు.

ఆ మాటకు వలీద్ "బాబూ! నా తెగవారు నీకేమయినా కీడు తలపెట్టారా ఏమిటి?" అని అడిగాడు. దానికి సమాధానమిస్తూ ఉస్మాన్ (రజి) "లేదండి నేనే స్వయంగా ఈ నిర్ణయానికి వచ్చాను. నాకు ఇక దేవుని ఆశ్రయం తప్ప మరెవరి ఆశ్రయమూ అవసరం లేదు" అన్నారు. "అలాగయితే కాబా గృహం దగ్గరికి వెళ్ళి ఇక నుంచి నువ్వు నా రక్షణలో

1) జహబీగారి అస్సీరతున్నబవియ్యా గ్రంథం 113వ పుట.

www.abulhasanalinadwi.org

ఉండటం లేదని ప్రకటించు. నా బాధ్యత కూడా తీరిపోతుంది'' అన్నాడు వలీద్.

ఆ తరువాత ఇద్దరూ కాబా గృహం దగ్గరికి వెళ్ళారు. అక్కడ వలీద్ అందరి ముందు నిలబడి ''ప్రజలారా! ఉస్మాన్ నా రక్షణలో నుంచి తొలగిపోతున్నాడు'' అని చాటాడు. ఆ తరువాత ఉస్మాన్ (రజి) ''ఔను, నిజంగానే నేను ఈయన రక్షణ నుండి తొలగిపోతున్నాను. ఈయన తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాడు. తన బాధ్యత నిర్వహణలో ఎలాంటి లోటూ రానివ్వలేదు. కాని ఇక నుంచి నేను దేవుని రక్షణలో తప్ప మరెవరి రక్షణలోనూ ఉండకూడదని నిశ్చయించుకున్నాను'' అన్నారు.

ఆయన అక్కడి నుంచి బయలుదేరి వెళుతుండగా ఒకచోట ఖురైషుల కవితాగోష్ఠి జరుగుతోంది. అరబ్బు ప్రఖ్యాత కవి లబీద్ ఆ గోష్ఠిలో ప్రజల ముందు తాను రాసిన ఓ పద్యం చదివి వినిపిస్తున్నాడు. అతను ఆ పద్యంలోని మొదటి చరణం చదివి వినిపించాడు. 'దేవుడు తప్ప సృష్టిలోని ప్రతి వస్తువూ నశించిపోయేదే' అన్నది దాని భావం. ఉస్మాన్(రజి) ఆ చరణం విని 'నిజమే' అని అన్నారు. ఆ తరువాత లబీద్ ''సుఖాలన్నీ ఏదో ఒకనాడు అంతమయ్యేవే'' అంటూ పద్యం లోని రెండో చరణం చదివాడు. వెంటనే ఉస్మాన్ (రజి) కల్పించుకొని ''ఇది అబద్ధం. స్వర్గసుఖాలు ఎన్నటికీ అంతం కావు'' అన్నారు. సాధారణంగా అరబ్బులెవరూ అతని కవితల్ని ఖండించేవారు కారు. లబీద్ బిత్తరపోయి, ''ఖురైష్ సర్దారుల్లారా! మీ సమావేశాల్లో ఇంతకు ముందెన్నడూ ఇలా జరిగేది కాదు. మీలో ఈ విధంగా ముఖం మీదే ఖండించేవాళ్ళు ఎక్కడి నుంచి పుట్టుకొచ్చారు?'' అన్నాడు. అంతలో ఒక వ్యక్తి లేచి, ''ఇటీవల కొంత మంది అమాయకుల వర్గం ఒకటి ఏర్పడింది. వారు తమ తాతముత్తాతల మతాన్ని వదలిపెట్టి క్రొత్తమతాన్ని సృష్టించుకున్నారు. దయచేసి మీరేమీ అనుకోకండి'' అని విన్నవించు కున్నాడు. కాని ఉస్మాన్ (రజి) ఆ విషయాన్ని కూడా ఖండించారు. అక్కడున్న ఖురైషులు ఆయనతో గొడవ పడ్డారు. ఒకతను ఆయన ముఖంపై గట్టిగా ఓ దెబ్బ కొట్టాడు. దాంతో ఆయన ఒక కన్ను లొట్టపోయింది. అక్కడే కూర్చొని అంతా గమనిస్తున్న వలీద్ ఉస్మాన్ (రజి)తో, ''బాబూ! నువ్వు అనవసరంగా నా రక్షణ నుండి తొలగిపోయావు.

www.abulhasanalinadwi.org

నా రక్షణలోనే ఉండిపోయినట్లయితే నీకీ పరిస్థితి దాపురించేది కాదు గదా!" అన్నాడు. దానికి సమాధానమిస్తూ ఉస్మాన్ (రజి), "నా రెండవ కన్ను మొదటి కన్నుపై ఈర్ష్య చెందుతోంది. దానికి కూడా లొట్టపోవాలని ఉంది" అని అన్నారు. "ఇప్పటికయినా మించిపోయింది లేదు. నువ్వు మళ్ళీ నా రక్షణలోకి వచ్చెయ్యి" అంటూ వలీద్ ఉస్మాన్‌ను ఊరించాడు. కాని ఆయన అందుకు ససేమిరా అన్నారు.[1]

## హాషిం తెగకు సంఘ బహిష్కరణ శిక్ష

ఇస్లాం ధర్మ పరిధి రోజురోజుకి విస్తరిస్తోంది. ఉమర్, హమ్జా లాంటి పరాక్రమవంతులు కూడా ఇస్లాం స్వీకరించారు. మరోవైపు నజాషీ రాజు ముస్లింలకు తన రాజ్యంలో రక్షణ కల్పించాడు. ఖురైషులు పంపిన దూతలు ఒట్టి చేతులతో తిరిగి వచ్చారు. ముస్లింల సంఖ్య దినదిన ప్రవర్థమాన మవుతోంది. ఖురైషులు ఇదంతా గమనించి దైవప్రవక్తను, ఆయన వంశం వారిని సంఘం నుంచి బహిష్కరించాలని నిశ్చయించుకున్నారు. ఇతర తెగల వారందరూ కలిసి ఓ ఒప్పందం కుదుర్చుకున్నారు. దాని ప్రకారం మక్కాలో ఎవరూ హాషిం తెగవారితో సంబంధాలు పెట్టుకోకూడదు. వారితో ఎలాంటి లావాదేవీలు జరుపకూడదు. వారిని కలుసుకోకూడదు. వారికి అన్నపానీయాలు అందకుండా చెయ్యాలి. వారు దైవప్రవక్త(స)ను హతఘూర్చమని మాకు అప్పజెప్పనంతవరకు వారితో ఇలాగే వ్యవహరించాలి. ఖురైషులు ఈ ఒప్పంద పత్రాన్ని కాబా గృహ గుమ్మానికి వ్రేలాడదీశారు.[2]

అబూతాలిబ్ గత్యంతరం లేక తన తెగవారందరినీ వెంటబెట్టుకొని 'షీబె అబూతాలిబ్' అనే కనుమలో తలదాచుకున్నారు. హాషిం వంశీయులంతా మూడు సంవత్సరాల వరకు ఈ కనుమలోనే గడిపారు. ఆ సమయంలో వారు తలహ్ చెట్టు ఆకులు తిని బ్రతికేవారు. హదీసుల్లో దైవప్రవక్త సహచరులు తాము తలహ్ చెట్టు ఆకులు తిని బతికేవాళ్ళమని ఉల్లేఖించారు. ఈ ఉల్లేఖనాలన్నీ 'షీబె అబూతాలిబ్' సంఘటన జరిగిన కాలం నాటివే.

---

1) సీరత్ ఇబ్నెహిషామ్ మొదటి సంపుటి 370వ పుట.

2) జాదుల్ మఆద్ మూడవ సంపుటి 29వ పుట.

www.abulhasanalinadwi.org

హజ్రత్ సాద్ బిన్ అబూ వఖ్ఖాస్ ఇలా తెలియజేస్తున్నారు: ఒక రోజు రాత్రి నాకు ఎండిపోయిన తోలు దొరికింది. దాన్ని నేను నీటితో కడిగి సాతాళించాను. ఆ తరువాత దాంట్లో నీళ్ళు కలిపి తినేశాను. ఇబ్నెసాద్ ఉల్లేఖనం ఇలా ఉంది: పసిపిల్లలు ఆకలితో ఏడ్చేవారు. ఆ ఏడ్పుల శబ్దం విని ఖురైషులు ఆనందించేవారు. అయితే కొంతమంది జాలిపడేవారు కూడా.[1]

ఒకరోజు హజ్రత్ ఖదీజా (రజి.అన్హా) సోదరుని కుమారుడైన హకీమ్‌బిన్ హిజామ్ తన సేవకుని ద్వారా ఖదీజాకు కాసిన్ని గోధుమలు పంపించారు. దారిలో అబూజహల్ చూసి లాక్కోవాలని ప్రయత్నించాడు. అంతలో అబుల్ బుహ్‌తరీ అక్కడికి వచ్చాడు. అతను అవిశ్వాసే అయినప్పటికీ ముస్లింల దయనీయ పరిస్థితికి జాలిపడి, "ఒక వ్యక్తి తన మేనత్తకు ఏదయినా తినే వస్తువు పంపించుకుంటుంటే మధ్యలో ఆపటానికి నువ్వెవడివి?" అని అన్నాడు.[2]

## ఒప్పంద విరమణ

దైవప్రవక్త(స), ఆయన వంశం వారందరూ వరుసగా మూడేళ్ళ పాటు ఈ బాధలు అనుభవించారు. ఆఖరికి శత్రువులే జాలిపడ్డారు. ఈ అమానుషమైన ఒప్పందాన్ని ఎత్తివేయాలనే ఉద్యమం కూడా వారి నుంచే మొదలయ్యింది. హిషామ్ మఖ్‌జూమి అనునతను హాషిం తెగవారికి సన్నిహిత బంధువు. తన వంశంలో పలుకుబడి గల వ్యక్తి. అతను రహస్య మార్గాల ద్వారా హాషిం తెగవారికి ధాన్యం, గింజలు తదితర వస్తువులు పంపించేవాడు. ఒకరోజు అతను అబ్దుల్ ముత్తలిబ్ మనుమడైన జుబైర్ దగ్గరికి వెళ్ళి, "జుబైర్! ఒకవైపు నీ అమ్మమ్మ తరపు బంధువులు పట్టెడన్నం కోసం పడిగాపులు పడుతుంటే నువ్వు హాయిగా తింటూ, త్రాగుతూ మజాలు చేయటం ఏమైనా బాగుందా?" అని అన్నాడు. దానికి సమాధానమిస్తూ, "ఏం చెయ్యమంటావ్, ఒక్కడయినా నాకు సహకరిస్తే ఈ అమానుషమైన ఒప్పందాన్ని చించి పారేయాలని ఉంది నాకు"

1) అర్రౌజుల్ అనిఫ్ మొదటి సంపుటి 220వ పుట.
2) సీరత్ ఇబ్నెహిషామ్ మొదటి సంపుటి 354వ పుట. జహబీ గారి సీరత్ గ్రంథం, 142వ పుట.

www.abulhasanalinadwi.org

అన్నాడు జుబైర్. 'నేనున్నానుగా' అన్నాడు హిషామ్. ఇద్దరూ కలిసి ముత్యిమ్ బిన్ అదీ దగ్గరికి వెళ్ళారు. బుహ్‌తరీ ఇబ్నె హిషామ్. జమ్‌అ బిన్ అస్వద్‌లు కూడా వీరికి సహకరించారు.

మరునాడు అంతా కలిసి పవిత్ర కాబా దగ్గరికి వెళ్ళారు. అక్కడ జుబైర్ ప్రజలతో మాట్లాడుతూ, 'మక్కా వాసులారా! మనం హాయిగా బ్రతుకుతూ హాషిం తెగవారికి అన్నపానీయాలు లేకుండా చేయటం న్యాయమేనా! దైవసాక్షి! ఈ అమానుష ఒప్పందాన్ని నేను చించి పారేస్తాను' అని అన్నాడు. కాని అబూజహల్ మాత్రం, "ఆ ఒప్పంద పత్రాన్ని ముట్టుకున్నా జనం ఊరుకోరు" అని హెచ్చరిస్తూ మాట్లాడాడు. అంతలో జమ్‌అ కల్పించుకొని, "నువ్వు అబద్ధం చెబుతున్నావు. మొదటి నుంచే మేము ఆ ఒప్పందానికి సముఖంగా లేము" అని అన్నాడు.[1] అంతకుముందే దైవప్రవక్త(సఅసం) ఆ ఒప్పంద పత్రానికి చెదలు పట్టిందని అబూతాలిబ్‌కు చెప్పారు. ప్రజలు వెళ్ళి చూస్తే నిజంగానే దాన్ని చెదపురుగులు తినేశాయి. అందులో కేవలం 'దేవా! నీ పేరుతో ప్రారంభిస్తున్నాం' అన్న వాక్యం మాత్రమే మిగిలి ఉంది.[2]

## అబూబక్ర్(రజి) పట్ల ఖురైషుల వైఖరి

అవిశ్వాసుల దౌర్జన్యాలు నిరుపేద, బలహీన ముస్లింలకే పరిమితం కాలేదు. ఆ తరువాత వారు ఉన్నత వర్గాల వారిని కూడా వేధించటం మొదలు పెట్టారు. అబూబక్ర్ (రజి) గారి తెగ మక్కా నగరంలో ఓ ఉన్నతమైన, బలమైన తెగగా పరిగణించబడేది. వారికి మద్దతుదారులు చాలామందే ఉన్నారు. కాని అలాంటి అబూబక్ర్ (రజి)కూడా అవిశ్వాసుల ఆగడాలకు విసిగిపోయి ఇథియోపియాకు వలస వెళ్ళాలని నిశ్చయించుకున్నారు. మక్కా నుండి యమన్ వైపు ఐదు రోజులు ప్రయాణిస్తే ఒరకుల్ గిమాద్ అనే ప్రాంతం వస్తుంది. అబూబక్ర్ ఆ ప్రాంతానికి చేరుకోగానే అక్కడ ఆయనకు ఖారా తెగ నాయకుడైన ఇబ్నుద్దుగున్నా కలిశాడు. అతను అబూబక్ర్ (రజి)ని ఎక్కడికి

1) సీరత్ ఇబ్నెహిషామ్ మొదటి సంపుటి 374, 375, 376 పుటలు.
2) జాదుల్ మఆద్ మూడవ సంపుటి 30వ పుట. సహీహ్ బుఖారీ

www.abulhasanalinadwi.org

వెళుతున్నారు? అని అడిగాడు. "నా జాతివారు నన్ను మననీయటం లేదు. అందుకే వేరే ప్రాంతానికి వెళ్ళి దైవారాధన చేసుకుంటూ బ్రతకాలనుకుంటున్నాను" అని సమాధానమిచ్చారు అబూబక్ర్ (రజి). దానికి ఇబ్నుద్దుగున్నా, "మీలాంటి వారు మక్కా వదలి వెళ్ళటమా! మీకేం భయంలేదు. మీరు నా రక్షణలో ఉందురుగాని" అని చెప్పి ఆయన్ని మక్కా తీసుకువచ్చాడు. మక్కాలో ఖురైష్ సర్దారులందరినీ సమావేశపరచి, "ఈయన అతిథులకు మర్యాద చేస్తాడు, నిరుపేదలకు సహాయం చేస్తాడు. బంధువుల పట్ల సానుభూతితో వ్యవహరిస్తాడు. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుంటాడు. అలాంటి మహానుభావుణ్ణి మీరు మక్కా నుండి గెంటివేస్తారా' అని చీవాట్లు పెట్టాడు. దానికి ఖురైష్ సర్దారులు "అబూబక్ర్ మక్కాలో ఉండాలంటే ఒక నియమాన్ని పాటించాలి. ఆయన్ని నమాజుల్లో మెల్లిగా ఏమయినా చదువుకోమనండి. కాని బిగ్గరగా మాత్రం చదువకూడదు. ఆయన బిగ్గరగా ఖురాన్ పఠిస్తే మా స్త్రీలపై, పిల్లలపై దాని ప్రభావం పడుతుంది" అని అన్నారు.

అబూబక్ర్(రజి) కొన్ని రోజుల వరకు వారు చెప్పిన నియమాన్ని పాటించారు. కాని ఆ తరువాత ఆయన తన ఇంటి దగ్గరే ఓ మస్జిద్ నిర్మించుకొని అందులో భక్తిశ్రద్ధలతో బిగ్గరగా ఖురాన్ పారాయణం చేసేవారు. స్వాభావికంగా ఆయన చాలా సున్నిత మనస్కులు. ఖురాన్ పారాయణం చేసినప్పుడు ఆయన తీవ్రమైన భావోద్రేకాలకు లోనై విలపించటం మొదలుపెట్టేవారు. స్త్రీలు, చిన్నపిల్లలు ఆయన్ని చూసి చాలా ప్రభావితులయ్యేవారు. అంచేత ఖురైషులు ఈ విషయం గురించి ఇబ్నుద్దుగున్నాకు ఫిర్యాదు చేశారు. అతను అబూబక్ర్‌తో "ఇక నేను మీకు ఎలాంటి బాధ్యతను వహించలేను" అన్నాడు. దానికి అబూబక్ర్(రజి) "నాకు దేవుని శరణు చాలు. నేను నీ రక్షణ నుండి వైదొలగిపోతున్నాను" అని అన్నారు.

ఒకరోజు దైవప్రవక్త(స) కాబా గృహం దగ్గరికి వెళ్ళారు. ఆ సమయంలో అక్కడ బహుదైవారాధకుల సర్దారులు కూర్చొని ఉన్నారు. అబూజహల్ దైవప్రవక్త(స)ను చూసి "అబ్దెమునాఫ్ వంశస్థులారా! అదిగో మీ ప్రవక్త వచ్చాడు" అన్నాడు వెటకారంగా మాట్లాడుతూ.

అంతలో ఉఖబా బిన్ రబీయా అందుకొని, "అయితే మమ్మల్నేం చెయ్యమంటావ్. ఒకడు దైవప్రవక్తనని అంటాడు. ఇంకొకడు తాను దైవదూత అంటాడు" అని పరిహసించాడు. దైవప్రవక్త(సఅసం) వారి మాటలు విని వెనక్కి మళ్ళారు. వారి దగ్గరికి వచ్చి ముందు ఉఖబాతో, "ఉఖబా! నువ్వు దేవుణ్ణి, దైవప్రవక్తను ఎన్నడూ సమర్థించలేదు. ఎప్పుడూ నీ పంతమే నెగ్గాలంటావ్" అని అన్నారు. ఆ తరువాత అబూజహల్ నుద్దేశించి "త్వరలోనే నువ్వు తక్కువగా నవ్వుతావు. ఎక్కువగా ఏడుస్తావు. ఆ సమయం ఎంతో దూరంలో లేదు" అని హెచ్చరించారు.

ఆ తరువాత ఖురైషులతో, "అతి త్వరలోనే మీరు ఇప్పుడు నిరాకరిస్తున్న ధర్మంలోకి చేరిపోనున్నారు" అని చెప్పారు.

పాఠకులు ఈ పుస్తకంలోనే దైవప్రవక్త (సఅసం) చెప్పిన మాటలు ఎలా నిజమయ్యాయో గ్రహిస్తారు.[1]

## అబూతాలిబ్, ఖదీజా (రజి.అన్హా)ల మరణం

దైవప్రవక్త(స)కు ప్రవక్త బాధ్యత లభించిన పదవ యేట ఆయన(స) బాబాయి అబూతాలిబ్ కూడా మరణించారు. ఈయన హజ్రత్ అలీ (రజి) గారి కన్నతండ్రి.[2]

అబూతాలిబ్ దైవప్రవక్త (సఅసం)ను బాల్యం నుంచి పెంచి పోషించారు. పెద్దవారయ్యాక ఆయన(స) ఇస్లాం ప్రచారం మొదలు పెట్టినప్పటి నుంచి ఆయన(స)కు అన్ని విధాలుగా సహకరిస్తూ వచ్చారు. అంచేత అబూతాలిబ్ మరణంతో ఆయన(స) తీవ్రమైన మనస్తాపానికి గురయ్యారు.[3]

అబూతాలిబ్ మరణానికి మూడురోజుల ముందు ఆయన(సఅసం) ప్రియసతీమణి ఖదీజా (రజి.అన్హా) మరణించారు.[4] దైవప్రవక్త(స) ప్రసన్నత కోసం తన సిరిసంపదలన్నింటినీ దైవమార్గంలో

1) రహ్మతుల్లిల్ ఆలమీన్ మొదటి సంపుటి 65వ పుట తారీఖేతబ్రీ సౌజన్యంతో
2) ఫత్హుల్ బారీ: ఏడవ సంపుటి 194వ పుట.
3) బుఖారీ, ముస్లిం
4) ఫత్హుల్ బారీ ఏడవ సంపుటి 224వ పుట.

www.abulhasanalinadwi.org

ఖర్చు పెట్టిన త్యాగమయి ఈమె. అందరికన్నా ముందు ఇస్లాం స్వీకరించారు. జిబ్రయీల్ (అలైహి) ఈమెకు 'దేవుని సలాం' అందించారు. ఈమె మరణించినప్పుడు దైవప్రవక్త (సఅసం) అమితంగా దుఃఖించారు.[1]

దైవప్రవక్త(సఅసం) ఒంటరివారవటంతో ఖురైషులు ఆయన్ని మరింత ఎక్కువగా హింసించటం మొదలు పెట్టారు. ఒకసారి ఓ ఆకతాయి వ్యక్తి ఆయన(సఅసం) తలపై బురద పారబోశాడు. ఆయన (సఅసం) అలాగే ఇంట్లోకి వెళ్ళారు. ఆయన (సఅసం) కూతురు. తండ్రి తలకు అంటిన బురదను కడుగుతూ వెక్కి వెక్కి ఏడ్చింది. అప్పుడు ఆయన(స) తన కూతురిని సముదాయిస్తూ "చిట్టి తల్లీ! ఏడుస్తావెందుకు? నీ తండ్రిని ఆ దేవుడే కాపాడతాడు" అని అన్నారు.[2]

ఇప్పటి వరకు తనకు అడుగడుగునా పరోక్షంగా సహాయమందిస్తూ వచ్చిన అబూతాలిబ్ మరణించినా, జీవితాంతం తన కష్టాల్లో పాలుపంచుకొని, తనను వెన్ను తట్టి ప్రోత్సహించిన ప్రియ సతీమణి హజ్రత్ ఖదీజా మరణించినా ఆయన ఏ మాత్రం నిరాశా నిస్పృహలకు లోను కాలేదు. మరింత ఉత్సాహంతో ధర్మ ప్రచార కార్యక్రమాల్లో నిమగ్నులయ్యారు-సల్లల్లాహు అలైహి వ సల్లం.

## తాయెఫ్ వీధుల్లో తుంటరితనం

దైవప్రవక్త (సఅసం) కొన్నాళ్ళ తరువాత ప్రజలకు ధర్మ సందేశం అందజేసే ఉద్దేశంతో తాయెఫ్‌కు ప్రయాణమయ్యారు. ఈ ప్రయాణంలో జైద్ బిన్ హారిసా (రజి) కూడా ఆయనకు తోడుగా వెళ్ళారు. మక్కా-తాయెఫ్‌ల మధ్య ఉన్న తెగలవారందరికీ హితబోధ చేస్తూ, ఒకే దేవుణ్ణి పూజించటం గురించి ప్రబోధిస్తూ కాలినడకన తాయెఫ్ చేరుకున్నారు. తాయెఫ్‌లో బనూ సఖీఫ్ తెగవారు నివసించేవారు. భౌగోళికంగా తాయెఫ్ సస్యశ్యామలమైన, శీతల కొండ ప్రాంతమయినందువల్ల అక్కడి ప్రజల గర్వానికి పట్టపగ్గాల్లేకుండా పోయాయి.

1) సహీహ్ బుఖారీలోని అన్సార్ ముస్లింల మహిమోన్నతల ప్రకరణం.
2) సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటి 416వ పుట.

www.abulhasanalinadwi.org

అబ్ద్ లేక లైల్, మస్వూద్, హబీబ్ - ఈ ముగ్గురు అన్నదమ్ములు ఆ ప్రాంతానికి సర్దారులు, దైవప్రవక్త (స) అందరికన్నా ముందు వారినే కలుసుకొని వారికి ఇస్లాం గురించి బోధించారు. అప్పుడు వారిలో ఒకడు, "దేవుడు నిన్ను ప్రవక్తగా ఎన్నుకున్నాడన్న మాటే నిజమయితే నేను కాబా ముందు గడ్డం గొరిగించుకుంటాను" అని సవాలు చేశాడు. "నీ దగ్గర ఒక్క వాహనమన్నా లేదు. దేవుడికి నీలాంటి గతిలేనివాడే దొరికాడా.... ప్రవక్తగా చెయ్యటానికి!? దేవుడు తలచుకుంటే మాలాంటి నాయకుల్ని, సర్దారుల్ని ప్రవక్తలుగా చేసి ఉండేవాడే!" అని రెండవవాడు ఎగతాళి చేశాడు. "నేనసలు నీతో మాట్లాడనే మాట్లాడను. ఎందుకంటావా? నువ్వు నిజంగానే దైవప్రవక్తవై ఉండి, నేను నీ మాటల్ని తిరస్కరిస్తే అది నాకే ప్రమాదకరం. అలాగాక నువ్వు అబద్ధం చెబుతున్నట్లయితే అటు వంటప్పుడు నీతో మాట్లాడటం నాకు ఏ విధంగానూ శోభాయమానం కాదు" అని మూడోవాడు అన్నాడు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం), "దయచేసి ప్రజల ముందు ఇలా మాట్లాడకండి. లేకపోతే ప్రజలు కూడా నా హితబోధను తృణీకరించే ప్రమాదముంది" అని ఆ ముగ్గురు సర్దారులనూ ప్రాధేయపడ్డారు.

కాని బనూ సఖీఫ్ సర్దారులు ఆయన మాటల్ని ఖాతరు చెయ్యలేదు. దైవప్రవక్త(స) ప్రజల ముందు హితబోధ చేయడం మొదలుపెట్టినప్పుడు వాళ్ళు తమ బానిసలను, నగరంలోని ఆకతాయి కుర్రవాళ్ళను ఆయన మీదికి ఉసిగొల్పారు. ఆయన హితబోధ చేస్తున్నప్పుడు వాళ్ళు ఆయనపై రాళ్ళు రువ్వటం ప్రారంభించారు. ఆయన ఒళ్ళంతా గాయాలయ్యాయి. శరీరం నుండి రక్తం కారి పాదుకల్లో గడ్డకట్టుకుపోయింది. దాంతో వుజూ చేసేటప్పుడు కాళ్ళ నుండి చెప్పులు విడవటం కూడా కష్టమైపోయింది.

ఒకసారి తుంటరులు కొందరు ఆయన్ని విపరీతంగా తిట్టారు. గేలి చేస్తూ చప్పట్లు చరిచారు. దగ్గరికొచ్చి గావుకేకలు పెట్టసాగారు. ఆయన (సల్లం) చేసేది లేక ఒక ఇంటి ప్రాంగణంలో తలదాచుకున్నారు. ఆ ఇల్లు రబీయా కొడుకులైన ఉత్బా, షైబాలది. వాళ్ళు దూరం నుంచి దైవప్రవక్తను చూసి ఆయన దయనీయ స్థితికి జాలిపడ్డారు. తమ బానిస

www.abulhasanalinadwi.org

అయిన అద్దాస్‌ను పిలిచి ఒక పళ్లెంలో ద్రాక్ష పండ్లు తీసుకెళ్ళి ఆ వ్యక్తికి ఇచ్చి రమ్మని పంపారు. ఆ బానిస దైవప్రవక్త (సల్లం) ముందు ద్రాక్షపండ్లు తెచ్చి పెట్టాడు. ఆయన పళ్లెంలో నుంచి ద్రాక్షపండ్లు తీసుకొని 'బిస్మిల్లాహ్' అంటూ తినటం ప్రారంభించారు.

అద్దాస్ దైవప్రవక్త వైపు గుడ్లప్పగించి చూస్తూ, "మీరు పఠించిం దేమిటి? ఇక్కడి వాళ్ళెవరూ అలా పఠించరే!" ఆశ్చర్యపడిపోతూ అడిగాడు.

"నువ్వు ఏ ప్రాంతానికి చెందినవాడివి? నీ మతం ఏది?"

"నేను క్రైస్తవుణ్ణి. నైనవా ప్రాంతం వాడిని"

"ఓహో! పుణ్యపురుషుడయిన యూనుస్ బిన్ ముత్తా నగరం వాడివా?"

"యూనుస్ బిన్ ముత్తా ఎవరో, ఎట్లాంటివారో మీకెలా తెలుసు?"

"ఆయన నా సోదరుడు. ఆయన ఒక దైవప్రవక్త. నేనూ దైవప్రవక్తనే"

ఆ మాట వినగానే అద్దాస్ క్రిందికి వంగి దైవప్రవక్త(సల్లం) ముఖాన్ని, కాళ్ళూ, చేతుల్ని చుంబించటం మొదలుపెట్టాడు. దూరంగా ఉండి ఇదంతా గమనిస్తున్న ఉత్బా, షైబాలకు మండిపోయింది. బానిస తమ అదుపు తప్పిపోయాడని అనుకున్నారు. అద్దాస్ తిరిగొచ్చిన తరువాత వాళ్ళు అతన్ని, "ఏమయింద్రా వెర్రి వెధవా నీకు. అతని కాళ్ళు ముద్దెట్టుకుంటున్నావు" అని గద్దించారు.

'ప్రభూ! ఈ రోజు భూమండంపై ఆయనకన్నా పునీతుడు ఇంకొకడు లేడు. ఆయన నాకో విషయం తెలిపారు. దైవప్రవక్తలు మాత్రమే అలాంటి విషయాలు తెలుపగలరు" అన్నాడు అద్దాస్ ఎంతో సౌమ్యంగా.

వాళ్ళకు అరికాలిమంట నెత్తికెక్కింది. "ఒరేయ్! అతని మాటల్లో పడి నీ ధర్మాన్ని వదలిపెట్టేవు జాగ్రత్త! అతని ధర్మం కన్నా నీ ధర్మమే నయం" అంటూ వాళ్ళు అద్దాస్‌ను హెచ్చరించారు.

ఆ ప్రాంతంలోనే దైవప్రవక్త(సల్లం) ఒకసారి హితబోధ చేస్తుంటే తిరస్కారులు ఆయన్ని స్పృహ తప్పేంతవరకు తీవ్రంగా కొట్టారు.

జైద్ (రజి) ఆయన్ని తన వీపుమీద మోసుకొని ఊరి బయటకు తీసుకు వెళ్ళారు. అక్కడికి వెళ్ళిన తరువాత ముఖం మీద నీళ్లు చల్లినప్పుడు గాని ఆయనకు స్పృహ రాలేదు.

ఈ ప్రయాణంలో ఇన్ని కష్టాలు ఎదురైనా, ఇన్ని బాధలు భరించినా ఒక్కడూ ఇస్లాం స్వీకరించకపోవటంతో దైవప్రవక్త మనసు ఆవేదనతో తల్లడిల్లిపోయింది. అయినప్పటికీ ఆయన ఏ మాత్రం నిరాశా నిస్పృహలకు లోను కాలేదు. అప్పటికే ఆయన హృదయం దేవుని ఔన్నత్యం, ఆయన పట్ల అపార ప్రేమాభిమానాలతో నిండి ఉంది. ఆ సమయంలో ఆయన (సల్లం) నోటి నుండి వెలువడిన వేడుకోలు వచనాలు ఇవి:

> "దేవా! నేను నా బలహీనతను, చేతకానితనాన్ని, ప్రజల ముందు చులకన అయిపోవటాన్ని గురించి నీ సన్నిధిలో ఫిర్యాదు చేసుకుంటున్నాను. నువ్వు కరుణించే వారందరిలో కెల్లా గొప్ప కరుణామయుడవు. కష్టాల్లో చిక్కుకున్న బలహీనుల యజమానివి నీవే. నా స్వామివి కూడా నీవే. దేవా! నీవు నన్ను ఎవరి పరం చేస్తున్నావు? బుద్ధిహీనులైన అపరిచితుల, నాపై అధికారం కలిగి వున్న శత్రువులపరం చేస్తున్నావా ప్రభూ! నా యెడల నువ్వు అప్రసన్నుడవు కాకుండా ఉంటే చాలు. నేను నాపై వచ్చే కష్టాలన్నిటినీ భరిస్తాను. నీ రక్షే నాకు సర్వస్వం. నీ ఆగ్రహ బారి నుండి, నా గురించి నీవు కినుక వహించటం నుండి నేను నీ అస్తిత్వ జ్యోతి శరణు వేడుతున్నాను. ఆ జ్యోతి మూలంగానే ప్రపంచంలో అంధకారాలన్నీ పటాపంచలై వెలుతురు విరజిమ్ముతుంది. దాని ద్వారానే ఇహపరాల కార్యాలు చక్కదిద్దబడతాయి. దేవా! నాకు నీ ప్రసన్నత, నీ సంతోషం కావాలి. మంచి పనులుచేసే, చెడు పనుల నుండి కాపాడుకునే శక్తి నాకు నీ ద్వారానే ప్రాప్తిస్తుంది".

దైవప్రవక్త (సల్లం) తాయెఫ్ నుండి తిరిగి వెళుతూ, "నేను ఈ నగర ప్రజల్ని శపించినా ప్రయోజనమేముంటుంది? వీళ్ళు దేవుణ్ణి

www.abulhasanalinadwi.org

విశ్వసించక పోయినా కనీసం వీళ్ళ తరువాతి తరాల వారైనా దేవుణ్ణి విశ్వసించే వారవుతారేమో!" అని అన్నారు.[1]

## అరబ్బు తెగలకు ఇస్లాం సందేశం

మక్కాకు తిరిగి వచ్చిన తరువాత దైవప్రవక్త (సల్లం) పలు తెగల వారు నివసించే ప్రాంతాలకు వెళ్ళి వారికి ఇస్లాం సందేశం అందజేయటం మొదలెట్టారు. కొన్నిసార్లు మక్కా వెలుపల కనిపించిన బాటసారినల్లా పలకరించి విశ్వాసం గురించి, దైవభక్తి గురించి బోధించేవారు.[2]

ఆ రోజుల్లోనే దైవప్రవక్త(సల్లం) 'బనూకిందా' తెగవారి దగ్గరికి వెళ్ళారు. మలీహ్ అనే వ్యక్తి ఈ తెగకు నాయకుడు. తరువాత బనూ అబ్దుల్లాహ్ దగ్గరికి వెళ్ళి "అబ్దుల్లాహ్ వంశీయులారా! మీ తండ్రి పేరు అబ్దుల్లాహ్. అంటే దేవుని దాసుడని అర్థం. కనుక మీరు దేవునికి నిజమైన దాసులయి మీ జీవితాలను సార్థకం చేసుకోండి" అని బోధించారు. ఆ తరువాత బనూ హనీఫా తెగ దగ్గరికి వెళ్ళి ఇస్లాం సందేశాన్ని వినిపించారు. కాని వారు అరబ్బులందరిలో చాలా నీచంగా దైవప్రవక్తను తిరస్కరించారు. అలాగే బనూ ఆమిర్ బిన్ సాసా తెగ దగ్గరికి వెళితే, ఆ తెగనాయకుడు బుహైరా బిన్ ఫిరాస్ ఇస్లాం సందేశం విని, దైవప్రవక్తతో, "సరే, నువ్వు చెప్పినట్లే ఇస్లాం స్వీకరిస్తాను. కాని ఒకవేళ అవిశ్వాసులపై నువ్వు విజయం సాధిస్తే నీ తదనంతరం ఈ పదవి నాకిస్తావా?" అని అన్నాడు. దానికి సమాధానమిస్తూ దైవప్రవక్త(సల్లం), "అది అల్లాహ్ చేతుల్లో ఉంది. ఆయన తాను కోరిన వారికి నా తదనంతరం ఈ బాధ్యతను అప్పగిస్తాడు" అని అన్నారు. దానికి బుహైరా, "అంటే ఇప్పుడు మేము అరబ్బుల్ని ఎదిరించి పోరాడాలి. తీరా నీ పని పూర్తయ్యాక ఫలితం

1) ఈ సంఘటనను ఇమామ్ బుఖారీ (రహ్మాలై) తన 'సహీహ్' గ్రంథంలో సంక్షిప్తంగా పేర్కొన్నారు. ఇమామ్ జహబీగారు అస్సీరతున్నబవియ్యాలో 185 నుండి 188 పుటల వరకు, ఇబ్నె హిషామ్ అస్సీరతున్న బవియ్యా మొదటి సంపుటి 419 నుండి 421 వరకు. ఈ సంఘటనను విపులంగా పేర్కొన్నారు. ఇమామ్ హైషమీ మజ్మవుజ్జవాయిద్ ఆరవ సంపుటి 35వ పుటలో దీనిని ప్రస్తావించారు. ఇమామ్ తబ్రానీ కూడా దృఢమైన ఆధారంతో ఈ సంఘటనను పొందుపరిచారు.

2) ముఖ్రీజీ గారి అమ్‌తావుల్ అస్మా మొదటి సంపుటి 30వ పుట.

www.abulhasanalinadwi.org

ఇంకెవడో అనుభవిస్తాడు. బాగుంది! వెళ్ళవయ్యా వెళ్ళు. అసలు నీతో మాట్లాడటమే అనవసరం" అన్నాడు, కోపంతో మండిపడుతూ. ఈ ప్రయాణాల్లో హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) ఆయనకు తోడుగా వెళ్ళారు.[1]

ఆ రోజుల్లోనే దైవప్రవక్త (సల్లం)కు సువైద్ బిన్ సామిత్ అనే వ్యక్తి తారసపడ్డాడు. అతనికి తన తెగవారిలో 'కామిల్' అనే బిరుదు ఉండేది. దైవప్రవక్త (సల్లం) అతనికి ఇస్లాం సందేశం వినిపించారు. దానికతను 'బహుశా నా దగ్గరున్న జ్ఞానమూ, మీ సందేశమూ ఒకటే ననుకుంటాను' అని అన్నాడు. "నీ దగ్గరేముంది?" అడిగారు దైవప్రవక్త (సల్లం). లుఖ్మాన్ వివేచనా జ్ఞానం ఉందని చెప్పాడతను. దైవప్రవక్త (సల్లం) అది తనకు వినిపించమన్నారు. అతను కొన్ని అద్భుతమైన కవితలు చదివి వినిపించాడు. అవి విని దైవప్రవక్త (సల్లం) "నీ కవితలు చాలా బాగున్నాయి. కాని నా దగ్గర ఖురాన్ ఉంది. అది నీ దగ్గరున్న కవితల కన్నా ఎంతో శ్రేష్ఠమైనది. సన్మార్గం వైపుకు నడిపిస్తుంది. మన జీవితాల్లో వెలుగు నింపుతుంది" అని చెప్పి అతనికి ఖురాన్ పారాయణం చేసి వినిపించారు. అతను అద్భుతమైన ఖురాన్ పారాయణానికి ప్రభావితుడై, ఏ మాత్రం తటపటాయించకుండా ఇస్లాం స్వీకరించాడు. ఆ తరువాత యస్రిబ్ నగరానికి తిరిగి రాగా ఖజ్రజ్ తెగవారు అతన్ని హత్య చేశారు.[2]

ఆ కాలంలోనే అబుల్ హైసర్ అనస్ బిన్ రాఫె మక్కా వచ్చాడు. అతనితోపాటు అబ్దుల్ అష్హల్ తెగకు చెందిన మరికొందరు యువకులు కూడా వచ్చారు. వారిలో అయాస్‌బిన్ ముఆజ్ కూడా ఉన్నాడు. వీళ్ళు తమ ఖజ్రజ్ జాతివారి తరఫు నుండి ఖురైషులతో ఒప్పందం చేసుకోవటానికి వచ్చారు. దైవప్రవక్త (సఅసం) వారి దగ్గరికి వెళ్ళి, "నా దగ్గర మీ అందరి మోక్షానికి దోహదపడే సందేశముంది. తెలియ జేయమంటారా?!" అని అడిగారు.

"ఏమిటా సందేశం?" కాస్త ఆతురతతోనే ప్రశ్నించారు వాళ్ళు.

"నేను దైవప్రవక్తను. దేవుడు నన్ను మానవాళి సన్మార్గం కోసం

1) సీరత్ ఇబ్నెహిషామ్ మొదటి సంపుటి 424-425 పుటలు.
2) సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటి 426-427 పుటలు.

www.abulhasanalinadwi.org

పంపించాడు. ఒక్క దేవుణ్ణి మాత్రమే పూజించమని, ఆయనకు మరెవ్వరినీ సాటి కల్పించవద్దనీ నేను ప్రజలకు పిలుపునిస్తున్నాను. దేవుడు నాపై గ్రంథాన్ని అవతరింపజేశాడు" అంటూ దైవప్రవక్త (సల్లం) వారికి ఇస్లాం ధర్మసూత్రాలు విడమరచి చెప్పారు. ఖురాన్ పారాయణం కూడా చేసి వినిపించారు.

అయాస్ బిన్ ముఆజ్ నవయువకుడు. దైవప్రవక్త(సల్లం) మాటలు విని చివాలున లేచి, "ఓ నా జాతి ప్రజలారా! దైవంతోడు, మీరు ఇక్కడికి వచ్చిన పనికన్నా ఈ ధర్మం ఎంతో గొప్పది" అని అన్నాడు.

అతని మాటలకు అనస్ బిన్ రాఫె ఉగ్రుడయిపోయాడు. చేతినిండా కంకరరాళ్ళు తీసుకొని అయాస్ మొహం మీద విసరికొట్టి, "నోర్మూయ్, మేమొచ్చింది ఈ పని కోసం కాదు" అని మందలించాడు. దైవప్రవక్త(సల్లం) అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయారు. ఔస్-ఖజ్రజ్‌ల మధ్య జరిగిన బుఆస్ యుద్ధానికి పూర్వం జరిగిన సంఘటన ఇది. అయాస్ మక్కా నుండి తిరిగి వెళ్ళిన కొంత కాలానికే చనిపోయాడు. అతను చనిపోయినప్పుడు అతని నోటివెంట దేవుని స్తోత్రవచనాలు వెలువడసాగాయి. నిజం చెప్పాలంటే అయాస్ దైవప్రవక్త (సల్లం) హితబోధ విన్ననాడే అతని హృదయంలో ఇస్లాం బీజం నాటుకుంది. ఆఖరికి మరణ సమయంలో అది ఫలించింది.[1]

ఆ రోజుల్లోనే జిమాద్ అజ్‌దీ మక్కా వచ్చాడు. ఇతను యమన్ వాసి. యావత్తు అరేబియాలోనే పేరుగాంచిన ఇంద్ర జాలికుడు. ముహమ్మద్ (సల్లం)కు దెయ్యాలు పట్టుకున్నాయని విని అతను ఖురైషులతో, "నేను నా మంత్రశక్తితో ముహమ్మద్‌కు పట్టిన దయ్యాన్ని వదలిస్తాను" అన్నాడు. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళి, "ముహమ్మద్! ఇలా రా! నీకు మంత్రం వినిపిస్తాను" అన్నాడు. దానికి దైవప్రవక్త (సల్లం) ఆ ఇంద్రజాలకునితో 'ముందు నా మంత్రం విను' అంటూ ఈ క్రింది వాక్యాలు పఠించటం మొదలుపెట్టారు:

---

1) సీరత్ ఇబ్నెహిషామ్ మొదటి సంపుటి 427-428 పుటలు. ముస్నదె అహ్మద్ ఐదవ సంపుటి 427వ పుట. ఇబ్నె హజర్ దీని ప్రామాణికతను సమర్థించారు. అల్ ఇసాబా గ్రంథం మొదటి సంపుటి 146వ పుట.

www.abulhasanalinadwi.org

"అల్‌హమ్దు లిల్లాహి నహ్మదుహూ వ నస్తయీనుహూ
మన్ య్యహ్‌దిహిల్లాహు ఫలా ముజిల్ల లహూ, వమన్
యుజ్‌లిల్‌హు ఫలా హాదియ లహూ, వ అష్‌హదు
అఁల్లా యిలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లా షరీక
లహూ, వ అష్‌హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ
వ రసూలుహూ, అమ్మాబాద్...."

'ప్రశంసలూ, పొగడ్తలన్నీ అల్లాహ్‌కే శోభిస్తాయి. మేము ఆయన ప్రసాదించిన అనుగ్రహాలకు గాను కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాం. సహాయం కోసం ఆయన్నే అర్థిస్తున్నాం. (యదార్థమేమిటంటే) దేవుడు సన్మార్గం చూపిన వ్యక్తిని ఎవరూ మార్గం నుండి తప్పించలేరు. దేవుడు భ్రష్టుపట్టించిన వాణ్ణి ఎవరూ సన్మార్గంపైకి తీసుకురాలేరు. అల్లాహ్ తప్ప నిజమైన ఆరాధ్య దేవుడు మరెవ్వడూ లేడని, ఆయన ఒక్కడేనని, ఆయనకు సహవర్తులెవరూ లేరని నేను సాక్ష్యమిస్తున్నాను. ఇంకా ముహమ్మద్ దేవుని దాసుడు, ప్రవక్త అని ప్రకటిస్తున్నాను. ఆ తరువాత.....'

జిమాద్ ఇక్కడి వరకు విన్న తరువాత మధ్యలో ఆపి ఆ వాక్యాలు మరోమారు చదివి వినిపించమని కోరాడు. అలా రెండు మూడు సార్లు ఆ వాక్యాలు విని, "నేను గొప్ప గొప్ప జ్యోతిష్యుల్ని చూశాను, చేయి తిరిగిన ఇంద్రజాలికులను చూశాను, ఎందరో మహా కవుల కవితలు విన్నాను. కాని ఇలాంటి వచనాలు మాత్రం నేను మునుపెన్నడూ వినలేదు. ఈ వాక్యాల్లో భావసముద్రాలు ఇమిడి ఉన్నాయి. ముహమ్మద్ దయచేసి మీ చెయ్యి అందించండి. నేను మీ చేతిలో చెయ్యేసి ఇస్లాం స్వీకరిస్తానని మాటిస్తాను" అన్నాడు.[1]

ఆ రోజుల్లోనే తుఫైల్ బిన్ అమ్ర్ మక్కా వచ్చాడు. ఈయన దౌస్ తెగ నాయకుడు. యమన్ శివార్లలో ఈయన వంశీయుల్లో నాయకత్వ పాలన ఉండేది. తుఫైల్ స్వయాన కవి, గొప్ప మేధావి. మక్కావాసులు నగరం నుండి బయటికి వచ్చి ఈయనకు ఘనస్వాగతం పలికారు.

1) సహీహ్ ముస్లింలోని జుమా ప్రకరణం.

www.abulhasanalinadwi.org

మక్కాకు తీసుకొని వచ్చి రాచమర్యాదలు చేశారు. అలాంటి గొప్ప మేధావి అయిన తుఫైల్ ఇలా అంటున్నాడు:

"నేను మక్కా చేరుకోగానే ఖురైషులు నన్ను ముహమ్మద్ (సల్లం) గురించి భయపెట్టటం మొదలుపెట్టారు. 'తుఫైల్! మాలో ఓ క్రొత్త వ్యక్తి పుట్టాడు. అతనికి కాస్త దూరంగా ఉండు. అతనికి జాల విద్యలు తెలుసు. అతను చేతబడి చేసి తండ్రీ కొడుకుల మధ్య, భార్యాభర్తల మధ్య, అన్నదమ్ముల మధ్య యెడబాటుని సృష్టిస్తాడు. అతను మా జాతి ఐకమత్యాన్ని ఛిన్నాభిన్నం చేసేశాడు. మా పనుల్ని చెడగొట్టాడు. మాలాగే మీ జాతి వారు కూడా కష్టాల్లో చిక్కుకోవటం మాకిష్టం లేదు. అందుకే మీ మేలు కోరి చెబుతున్నాం. మీరు అతని దగ్గరికి వెళ్ళకండి, అతని మాటలు వినకండి, అసలు అతనితో మాట్లాడకండి" అని హెచ్చరించారు.

"ఖురైషులు చెప్పిన మాటలకు నేనెంతగా భయపడిపోయానంటే నేను కాబా గృహంలోకి వెళ్ళాలనుకున్నప్పుడు ముహమ్మద్ (సల్లం) మాటలు నా చెవిలో పడకుండా ఉండాలని చెవుల్లో దూది పెట్టుకొని వెళ్ళేవాడ్ని. ఒకరోజు ఉదయం నేను కాబా గృహంలోకి వెళ్ళాను. ఆ సమయంలో దైవప్రవక్త(సల్లం) నమాజ్ చేస్తున్నారు. ఆయన పలుకులు నా చెవులకు వినపడాలని దేవుడు రాసి పెట్టాడేమో! ఆయన నోట జాలువారుతున్న అద్భుతవాణి విన్నాను. అప్పుడు నన్ను నేను నిందించుకోవటం మొదలుపెట్టాను. నేను స్వయంగా కవిని, పండితుడ్ని. మంచీ చెడ్డరల గురించి తెలిసినవాడ్ని. అటువంటప్పుడు నేనాయన మాటల్ని ఎందుకు వినకూడదు? మంచి మాట అయితే స్వీకరిద్దాం. లేకపోతే వదిలేద్దాం" అని అనుకొని అక్కడే నిలబడ్డాను. దైవప్రవక్త(సల్లం) ఇంటికి తిరిగి వెళుతుంటే నేను కూడా ఆయన్ని అనుసరిస్తూ వెళ్ళాను. చివరికి ఆయనింటికి చేరుకొని నేను మక్కా వచ్చిన సంగతి, ప్రజలు నన్ను భయపెట్టిన సంగతి, ఈ రోజు ఆయన నోటి ద్వారా దివ్యవాణి విన్న సంగతి అంతా ఆయనకు వివరించాను. ఆ తరువాత నాకు ఇస్లాం గురించి బోధించమని ఆయన్ని కోరాను. అప్పుడు దైవప్రవక్త(సల్లం) నాకు ఖురాన్ చదివి వినిపించారు. దైవసాక్షి! మాటిమాటికీ సత్కార్యం, న్యాయం గురించి వక్కాణించే అంతటి పవిత్రమైన వాణి నేను అంతకు ముందెన్నడూ వినలేదు".

తుఫైల్ అప్పటికప్పుడే ఇస్లాం స్వీకరించారు. ఖురైషులు మాటిమాటికీ పూజ్యుడా! ఆరాధ్యుడా! అని పిలుచుకునే తుఫైల్ ఇప్పుడు ముహమ్మద్ (సల్లం)కు అత్యంత సన్నిహితుడు, ప్రాణ స్నేహితుడయి పోయాడు. తుఫైల్ ఇస్లాం స్వీకరించాడన్న సమాచారం ఖురైషులకు మింగుడుపడలేదు.

హజ్రత్ అబూజర్ర్ యస్రిబ్‌లో ఉన్నప్పుడు ఆ నోట ఈ నోట దైవప్రవక్త ప్రస్తావన విని నువ్వు మక్కా వెళ్లి ఆ దైవప్రవక్తను గురించి వాకబు చేసి రమ్మని తన సోదరుణ్ణి పంపించారు.

అబూజర్ర్ సోదరుడైన ఉనైస్ పేరు గాంచిన కవి. మంచి మాటకారి. అతను మక్కా వెళ్ళి దైవప్రవక్తను కలుసుకున్నాడు. ఆ తరువాత తిరిగొచ్చి ముహమ్మద్ (సల్లం) మంచి పనులు చెయ్యమని, చెడుపనుల నుండి రక్షించుకోమని బోధిస్తున్నారని అబూజర్ర్‌తో చెప్పాడు.

అబూజర్ర్ తన సోదరుడు తెచ్చిన సమాచారంతో సంతృప్తి చెందలేదు. తానే స్వయంగా కాలినడకన మక్కా చేరుకున్నారు. ఆయనకు దైవప్రవక్త (సల్లం) ఎలా ఉంటారో తెలియదు. ఎవరినన్నా అడిగి తెలుసుకుందామన్నా అందుకు ఆయన మనసొప్పలేదు. జమ్‌జమ్ నీళ్ళు త్రాగి కాబా గృహంలోనే పడుకున్నారు. అంతలోనే అలీ (రజి) అటుగా వచ్చారు. దగ్గరికి వెళ్ళి కాస్త బిగ్గరగానే 'ఈయనెవరో బాటసారిలాగున్నాడు' అన్నారు. దానికి అబూజర్ర్ ఔనన్నారు. 'అయితే మా ఇంటికి పదండి' అంటూ హజ్రత్ అలీ (రజి) ఆయన్ని తన వెంట తీసుకొని వెళ్ళారు.

అబూజర్ర్ ఆ రోజు రాత్రి అలీ దగ్గరే ఉన్నారు. కాని అలీ (రజి) ఆయన్ని ఏమీ అడగలేదు. ఆయన కూడా తన గురించి ఏమీ చెప్పలేదు. తెల్లారిన తరువాత మళ్ళీ కాబా గృహానికి వచ్చేశారు. ఆయన మనసు దైవప్రవక్త(సల్లం)ను వెతుకుతోంది. కాని ఆయన(సల్లం) గురించి ఎవరినీ అడగలేకపోతున్నారు. మరునాడు హజ్రత్ అలీ మళ్ళీ కాబా గృహం వైపు వచ్చారు. అబూజర్ర్ అక్కడే ఉండటం చూసి, 'బహుశా మీకు ఉండటానికి ఎక్కడా ఇల్లు దొరకలేదేమో! మా ఇంటికి వెళదాం పదండి' అంటూ మళ్ళీ ఆయన్ని తన ఇంటికి తీసుకొని వెళ్ళారు. ఈసారి మాత్రం హజ్రత్ అలీ(రజి) ఆయన గురించి తెలుసుకోవాలన్న ఉద్దేశంతో

www.abulhasanalinadwi.org

"మీరెవరు? ఎక్కడి నుంచి వచ్చారు? ఏం పని మీద వచ్చారు?" అని అడిగారు. తాను చెప్పేది రహస్యంగా ఉంచుతానని మాటిస్తే చెబుతాను అన్నారు అబూజర్ర్. హజ్రత్ అలీ రహస్యంగానే ఉంచుతానని మాటిచ్చారు.

"ఈ నగరంలో ఎవరో ఒకతను తాను దైవప్రవక్తనని చెబుతున్నాడని విన్నాను. ఆయన గురించి తెలుసుకు రమ్మని నా సోదరుణ్ణి ఇక్కడికి పంపించాను. కాని అతను ఇచ్చిన సమాచారం నాకు సంతృప్తికరంగా తోచలేదు. అంచేత స్వయంగా నేనే వచ్చాను" అన్నారు.

"చాలా మంచిపని చేశారు. అదృష్టం బాగుండి మీరు నన్ను కలుసుకున్నారు. నేనిప్పుడు ఆయన దగ్గరికే వెళుతున్నాను. మీరు కూడా నాతో రండి. నేను లోపలికి వెళ్ళి చూస్తాను. ఒకవేళ పరిస్థితి అనుకూలంగా లేకపోతే నేను చెప్పులు సర్దుకుంటున్నట్లు నటిస్తూ గోడకు ఆనుకొని నించుంటాను" అన్నారు హజ్రత్ అలీ (రజి).

చివరకు అబూజర్ర్ ఎలాగో తంటాలు పడి హజ్రత్ అలీతో పాటు దైవప్రవక్త(సల్లం) సన్నిధికి వెళ్ళి తనకు ఇస్లాం ధర్మం గురించి బోధించమని ఆయన్ని కోరారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం), "అబూజర్ర్! నువ్వు ఇస్లాం స్వీకరించావన్న సంగతిని రహస్యంగానే ఉంచు. ప్రస్తుతానికి మీ దేశం వెళ్ళిపో. మేము విజయం సాధించామన్న విషయం తెలిసినప్పుడు తిరిగి మా దగ్గరికి రా" అన్నారు. కాని అబూజర్ర్ (రజి) "దైవసాక్షి! నేను శత్రువుల మధ్య నించొని ఇస్లాం స్వీకరించానని ప్రకటిస్తాను" అంటూ కాబా వైపు బయలుదేరారు. అక్కడ ఖురైషులు సమావేశమై ఉన్నారు. ఆయన అందరికీ వినపడేలా బిగ్గరగా దేవుడు ఒక్కడేనని, ముహమ్మద్ (సల్లం) దైవప్రవక్త అని ప్రకటించారు. ఈ ప్రకటన వినగానే ఖురైషులు 'ఈ మతభ్రష్టుణ్ణి కొట్టండి'అంటూ ఆయన మీద విరుచుకుపడి చావుదెబ్బలు కొట్టసాగారు. అంతలో అబ్బాస్ (రజి) అక్కడికి వచ్చారు. ఆయన అబూజర్ర్‌ను గుర్తుపట్టి, "మూర్ఖులారా! ఇతనెవరో తెలుసా? గిఫార్ తెగకు చెందిన వ్యక్తి. మీరు వ్యాపారానికి వెళ్ళేది, ఖర్జూర పండ్లు కొనుగోలు చేసి తెచ్చేది ఆ తెగ ప్రాంతం నుంచే" అంటూ ఖురైషుల్ని మందలించారు.

www.abulhasanalinadwi.org

అప్పుడు గాని ప్రజలు ఆయన్ని వదల్లేదు. రెండో రోజు అబూజర్(రజి) మళ్లీ అందరికీ వినపడేలా అదే ప్రకటన చేశారు. అప్పుడు కూడా ప్రజలు ఆయన్ని కొడ్తుంటే అబ్బాసే వచ్చి విడిపించారు. ఆ తరువాత అబూజర్ స్వదేశానికి తిరిగి వెళ్ళిపోయారు.[1]

## ఉఖబా ఒప్పందం

దైవదౌత్యం లభించిన పదకొండవ యేట హజ్‌యాత్ర జరుగుతున్న కాలంలో మక్కా నగరానికి కొన్ని మైళ్ళ దూరంలో 'ఉఖబా' అనే చోట కొంతమంది చీకట్లో కూర్చొని మాట్లాడుకుంటున్నారు. వారి మాటలు విని దైవప్రవక్త (సల్లం) కూడా అక్కడికి చేరుకున్నారు. అక్కడ యస్రిబ్‌కు చెందిన అరుగురు సమావేశమై ఉన్నారు. దైవప్రవక్త (సల్లం) వారి ముందు దేవుని ఔన్నత్యాన్ని, ఆయన గొప్పదనాన్ని వివరించారు. దైవంపట్ల ప్రేమాభిమానాలు కల్గివుండమని బోధించారు. విగ్రహ పూజను త్యజించమని చెప్పారు. భక్తి విశ్వాసాలను గురించి బోధించి, చెడుల నుండి, నీతి బాహ్యతల నుండి వారించారు. దివ్య ఖురాన్ పారాయణం చేసి వారి హృదయాలను జ్యోతిర్మయం చేశారు. వాళ్ళు బహుదైవా రాధకులైనప్పటికీ అతి త్వరలోనే ఒక దైవప్రవక్త రానున్నాడని తమ నగరంలో యూదులు చెబుతుండగా అనేకసార్లు విని ఉన్నారు. అంచేత వాళ్ళు అప్పటికప్పుడే ఇస్లాం స్వీకరించారు. ఆ తరువాత తమ నగరానికి వెళ్ళి సత్య ధర్మాన్ని ప్రచారం చేయటం మొదలుపెట్టారు.[2]

ప్రపంచమంతా ఎదురుచూస్తున్న ఆ దైవప్రవక్త వచ్చేశాడు అని వాళ్ళు ప్రతి ఒక్కరికీ శుభవార్తను అందజేసేవారు. మేము మా చెవులతో ఆయన సందేశం విన్నాం. ఆయన్ని కళ్ళారా చూశాం. ఆయన మమ్మల్ని సజీవుడైన దేవునితో అనుసంధానం చేశాడు. ఆ సంతోషం ముందు ప్రపంచంలోని జీవన్మరణాలకు ఎలాంటి విలువా లేదు'' అని చెప్పుకుంటూ తిరిగేవారు.[3]

---

1) సహీహ్ బుఖారీలోని అన్సార్ల మహిమోన్నతల ప్రకరణం; సహీహ్ ముస్లింలోని ప్రవక్త సహచరుల మహిమోన్నతల ప్రకరణం.
2) సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటి 428-429 పుటలు.
3) సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటి 428-429 పుటలు.

www.abulhasanalinadwi.org

వాళ్ళు ఆ విధంగా ప్రచారం చేయటం మూలంగా యస్రిబ్‌లో ఇంటింటా దైవప్రవక్త (సల్లం) పేరు మార్మోగసాగింది. మరుసటి సంవత్సరమే ఆయన (సల్లం) దైవప్రవక్త అయిన పన్నెండొవ యేట యస్రిబ్ వాసులు కొంతమంది మక్కాకు వచ్చి దైవప్రవక్త చేతుల మీదుగా ఈమాన్ భాగ్యాన్ని పొందారు.

ఆ సందర్భంగా వాళ్ళు తాము ఈ పనులు నెరవేరుస్తామని దైవప్రవక్త (సల్లం)కు ప్రమాణం చేశారు :

1) మేము ఒకే దేవుణ్ణి పూజిస్తాం. ఇతరులెవ్వరినీ ఆయనకు భాగస్వామ్యం కల్పించం.
2) దొంగతనానికి, వ్యభిచారానికి దూరంగా ఉంటాం.
3) ఆడపిల్లల్ని వధించే పశుప్రవృత్తిని మానుకుంటాం.
4) ఎవరిపైనా నీలాపనిందలు మోపము, ఒకరి వీపు వెనుక చాడీలు చెప్పము.
5) ప్రతి మంచి విషయంలోనూ మేము దైవప్రవక్త (సల్లం)కు విధేయత చూపుతాం.[1]

యస్రిబ్ వాసులు తిరిగి వెళుతున్నప్పుడు దైవప్రవక్త(సల్లం) వారికి ధర్మోపదేశాలు చేయటానికి ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి)ను వారి వెంట పంపారు. ముస్అబ్ (రజి) గొప్ప ధనవంతుల కుటుంబంలో ఎంతో గారాబంగా పెరిగిన వ్యక్తి. ఆయన గుర్రంపై స్వారీ చేస్తున్నప్పుడు ఎల్లప్పుడూ ముందూ వెనుక సేవకులు ఆయన వెంట నడిచేవారు. ఆయన ఎల్లప్పుడూ ఎంతో ఖరీదైన బట్టలు తొడిగేవారు. కాని ఇస్లాం స్వీకరించిన తరువాత లభించిన ఆధ్యాత్మిక ఆనందాలను ఆస్వాదించి ఈ భౌతిక విలాసాలన్నింటినీ వదలి పెట్టేశారాయన. ఆయన మదీనాలో ధర్మ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కాలంలో ఆయన ఒంటిపై చిన్న గొంగళి మాత్రమే ఉండేది. దాన్ని ఆయన భుజం మీద చుట్టుకొని దానికి పిన్నీసులు పెట్టుకునేవారు.[2]

---

1) సహీహ్ బుఖారీలోని విశ్వాస ప్రకరణం. ఇబ్నెహిషామ్ తన 'సీరత్' గ్రంథంలో ప్రామాణికమైన ఆధారాలతో ఈ సంఘటనను పొందుపరిచారు. సీరత్ ఇబ్నెహిషామ్ మొదటి సంపుటి 431 నుండి 434 పుటల వరకు.
2) అసదుల్ గాబా నాల్గో సంపుటి 406వ పుట.

www.abulhasanalinadwi.org

హజ్రత్ ముస్అబ్(రజి) మదీనా (యస్రిబ్)లో అస్అద్ బిన్ జురారా ఇంట్లో బస చేశారు. మదీనావాసులు ఆయన్ని ముఖ్రి (గురువు) అని పిలిచేవారు. ఒకరోజు ముస్అబ్, అస్అద్, ఇంకా కొంతమంది ముస్లింలు మరఖ్ అనే బావి దగ్గర సమావేశమై అబ్దుల్ అష్హల్, బనీజఫర్ తెగలవారికి ఇస్లాం సందేశం అందజేసే విషయమై సమాలోచనలు జరుపసాగారు.

సాద్ బిన్ ముఆజ్, ఉసైద్ బిన్ హుజైర్‌లు ఆ రెండు తెగలకు నాయకులు. వీళ్ళిద్దరూ అప్పటికింకా ఇస్లాం స్వీకరించలేదు. ముస్లింలు సమావేశమైన సంగతి తెలుసుకొని సాద్ బిన్ ముఆజ్ ఉసైద్‌తో మాట్లాడుతూ, "మీరు ఏ లోకంలో ఉన్నారు. చూడండి! ముస్అబ్, అస్అద్‌లు మన ఇళ్ళకు వచ్చి అమాయక జనాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు. మీరెళ్ళి వాళ్ళని మందలించండి. మా వీధుల దరిదాపులకు కూడా రావద్దని చెప్పండి. ఈ పని స్వయంగా నేనే చేసేవాణ్ణి. అస్అద్ నా పిన్ని కుమారుడు. అందుకే ఊరుకోవాల్సి వస్తోంది" అన్నాడు.

ఆ మాటలు వినగానే ఉసైద్‌కు కోపం కట్టలు త్రెంచుకుంది. సాయుధుడై ముస్అబ్, అస్అద్‌లు ఉన్నచోటుకి బయలుదేరాడు. ఉసైద్ రాకను గమనించిన అస్అద్, ముస్అబ్(రజి) నుద్దేశించి, "అదిగో ఆ వస్తున్నతనే ఈ తెగకు నాయకుడు. దైవకృప వల్ల అతను మీ మాటలు విని ఒప్పుకుంటే సరి" అన్నారు. "అతనొచ్చి నా ముందు కూర్చుంటే నేను తప్పకుండా అతనితో మాట్లాడతాను" అన్నారు ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి). అంతలో ఉసైద్ అక్కడికి చేరుకున్నాడు. వచ్చీ రాగానే నిలబడి తిట్ల పురాణం మొదలెట్టాడు. నువ్వు మా అమాయక ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నావంటూ ముస్అబ్ (రజి)ను నానా మాటలన్నాడు.

ముస్అబ్(రజి) అతనితో, "మీరు కాస్త ప్రశాంతంగా కూర్చొని మా మాటలు వినండి. నచ్చితే నమ్మండి. లేదనుకుంటే వదలిపెట్టండి" అని అన్నారు ఎంత సౌమ్యంగా. వింటే నష్టం ఏమొచ్చిందిలే అనుకొని ఉసైద్ ఆయన ముందు కూర్చున్నాడు. ముస్అబ్ (రజి) అతనికి ఇస్లాం సందేశం ఏమిటో బోధించారు. ఆ తరువాత దివ్య ఖురాన్ పారాయణం చేశారు. ఉసైద్ అంతా శ్రద్ధగా విన్న తరువాత, "సరే గాని, ఎవరైనా క్రొత్తగా మీ ధర్మంలోకి చేరాలంటే ఏం చెయ్యాలి?" అని అడిగాడు.

www.abulhasanalinadwi.org

"మేము అలాంటి వ్యక్తికి స్నానం చేయించి, పరిశుభ్రమైన బట్టలు తొడిగించి 'షహాదత్' (సాక్ష్య) వచనాలు చదివిస్తాం. ఆ తరువాత రెండు రకాతుల నఫిల్ నమాజ్ చేయిస్తాం అని సమాధానమిచ్చారు ముస్అబ్ (రజి). అది విన్న వెంటనే ఉసైద్ లేచి వెళ్ళి బట్టలు ఉతుక్కొని, స్నానం చేసి షహాదత్ వచనాలు పఠించాడు. (దేవుడు ఒక్కడేనని ముహమ్మద్(సల్లం) దేవుని ప్రవక్త అని సాక్ష్యం చెప్పాడు). ఆ తరువాత రెండు రకాతుల నఫిల్ నమాజ్ చేసి, "నాకు బాగా తెలిసిన వ్యక్తి ఇంకొకడున్నాడు. అతను కూడా ఇస్లాం స్వీకరిస్తే ఇక ఈ ప్రాంతంలో మిమ్మల్ని ఎదిరించేవాడే ఉండడు. నేనిప్పుడే వెళ్ళి అతన్ని మీ దగ్గరికి పంపిస్తాను" అని చెప్పి వెళ్ళిపోయాడు.

మరోవైపు సాద్ బిన్ ముఆజ్ ఉసైద్ కోసం తీవ్రంగా ఎదురు చూడసాగాడు. అంతలో ఉసైద్ అక్కడికి వస్తున్నట్లు కనిపించింది. సాద్ దూరం నుంచే ఆయన ముఖ కవళికల్ని పసిగట్టి "ఉసైద్ మొహంలో ఏదో మార్పు కన్పిస్తుంది" అన్నాడు. ఉసైద్ దగ్గరికి వచ్చి కూర్చున్న తరువాత ఎంతో ఆత్రుతతో 'ఏం జరిగింది?' అని అడిగాడు.

"నేనెళ్ళి వాళ్ళకు బాగానే బుద్ధి చెప్పాను. వాళ్ళు మన అభీష్టానికి వ్యతిరేకమైన పనులేవీ చేయమంటున్నారు. ఆ సంగతేమోగాని అక్కడ ఇంకో ఘోరం జరిగిపోతోంది. నేను వెళ్ళేటప్పటికి బనూహారిసా తెగవాళ్ళు అక్కడికి వచ్చి ఉన్నారు. వాళ్ళు నీ పిన్నికొడుకైన అస్అద్ బిన్ జురారాను హత్య చేయాలని చూస్తున్నారు" అని చెప్పాడు ఉసైద్. ఆ మాట వినగానే సాద్ బిన్ ముఆజ్ భగ్గుమన్నాడు. ఆయుధం చేతిలోకి తీసుకొని రివ్వున లేచాడు. బనూహారిసా తెగవాళ్ళు తన సోదరుణ్ణి హత్య చేసి ఉంటారేమోనని అతని హృదయం భయంతో కంపించి పోయింది. వెళ్తూ వెళ్తూ తన సోదరుణ్ణి కాపాడకుండా తిరిగొచ్చినందుకు ఉసైద్‌పై నిప్పులు చెరిగాడు. తీరా అక్కడికి వెళ్ళి చూస్తే ముస్అబ్(రజి), అస్అద్‌లు ప్రశాంతంగా కూర్చొని ఉన్నారు. ఇది తనకు వీళ్ళ మాటలు వినిపించటానికి ఉసైద్ వేసిన ఎత్తుగడ అని సాద్‌కు అర్థమయిపోయింది. దగ్గరికి వెళ్ళి వాళ్ళను చెడమడా తిట్టసాగాడు. అస్అద్(రజి)ను పట్టుకొని, "మీకూ-మాకూ మధ్య బంధుత్వమే లేకపోయినట్లయితే నిన్ను మా

ఇండ్ల దరిదాపులకు కూడా రానిచ్చేవాణ్ణి కాను" అని హూంకరించాడు. అస్అద్ (రజి), ఏ మాత్రం తొణకలేదు. పైగా ఆయన మస్ అబ్‌తో "ఈయన చాలా గొప్ప నాయకులు. మీరు గనుక ఈయన్ని ముస్లింగా మార్చేస్తే ఇక మీకెవరూ ఎదురు చెప్పేవారు ఉండరు"అన్నారు. ముస్అబ్ (రజి) సాద్‌ను ఎంతో ఆప్యాయంగా, ప్రేమనిండిన స్వరంతో, "రండి, కూర్చొండి. ముందు మనం మనసు విప్పి మాట్లాడుకుందాం. మా మాటలు మీకు నచ్చితే ఒప్పుకోండి, లేకపోతే వదలిపెట్టండి" అంటూ ఆహ్వానించారు. సాద్ మంచులా కరిగిపోయాడు. ఆయుధం క్రిందపడేసి ఆయన ముందు కూర్చున్నాడు. ముస్అబ్(రజి) అతనికి ఇస్లాం వాస్తవికతను గురించి బోధించారు. దివ్యఖురాన్‌ను చదివి వినిపించారు. అంతా విన్న తరువాత సాద్ కూడా ఉసైద్ అడిగిన ప్రశ్నే అడిగాడు. అక్కడి నుంచి లేచివెళ్ళి స్నానం చేసి షహాదత్ వచనాలు పఠించాడు. రెండు రకాతుల నఫిల్ నమాజ్ కూడా చేశాడు. తరువాత ఇంటికి వెళ్ళి వెంటనే తన తెగ వాళ్ళందరినీ సమావేశపరచి "అబ్దుల్ అష్‌హల్ వంశీయులారా! నా గురించి మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగాడు.

దానికి తెగవాళ్ళందరూ, "మీరు మా నాయకులు. మీ ఆదేశం మాకు శిరోధార్యం. మీ అన్వేషణ మాకందరికీ శ్రేయోదాయకం" అన్నారు.

"మరయితే వినండి. మీలో ప్రతి ఆడది, ప్రతి మగాడు ఇస్లాం స్వీకరించనంతవరకూ నేను వారితో మాట్లాడకూడదనుకుంటున్నాను" అన్నారు సాద్(రజి).

ఆయన ఆ మాట అనగానే సాయంత్రానికల్లా ఆయన తెగవారిలో ఒక్కడూ అవిశ్వాసిగా మిగల్లేదు. అందరూ ఇస్లాం స్వీకరించి ముస్లింలయిపోయారు.

## రెండవ ఉఖబా ఒప్పందం

హజ్రత్ ముస్అబ్(రజి) శిక్షణ మూలంగా అన్సార్ తెగలన్నీ ఇస్లాం ధర్మాన్ని తెలుసుకున్నాయి. ఫలితంగా మరుసటి సంవత్సరం (దైవదౌత్యపు పదమూడవ యేట) యస్రిబ్ నుండి ఎనభై మూడు మంది పురుషులు, ఇద్దరు స్త్రీలతో కూడిన ఒక బృందం మక్కాకు వచ్చింది. దైవప్రవక్త

www.abulhasanalinadwi.org

(సల్లం)ను మదీనాకు ఆహ్వానించమని, దాని కోసం ఆయన్ని ఎలాగైనా ఒప్పించి తీరాలని యస్రిబ్‌లోని ముస్లింలు వాళ్ళకు చెప్పి పంపించారు.

ఈ సత్యపథగాముల బృందం కూడా-గడిచిన రెండేళ్ళ నుంచి యస్రిబ్ నగర సత్యాన్వేషకులు సమావేశమవుతూ వస్తున్న ఉఖబా ప్రాంతంలోనే సమావేశమయ్యింది. దైవప్రవక్త (సల్లం) కూడా తన బాబాయి అబ్బాస్‌ను వెంటబెట్టుకొని అక్కడికి చేరుకున్నారు.

హజ్రత్ అబ్బాస్ అప్పటికింకా ఇస్లాం స్వీకరించకపోయినప్పటికీ ఆ సమావేశంలో ఆయన ఒక మంచి మాట చెప్పారు. యస్రిబ్ వాళ్ళనుద్దేశించి ఆయన, "యస్రిబ్ నగర వాసులారా! మక్కాలోని ఖురైషులు ముహమ్మద్‌కు ప్రాణ శత్రువులన్న సంగతి మీకు తెలుసు. కనుక ముహమ్మద్‌తో ఒప్పందం కుదుర్చుకోవటమంటే మాటలు కాదు. ఆయనతో ఒప్పందం చేసుకోవట మంటే కయ్యాన్ని కొనితెచ్చుకోవటమే. ఏం చేయదలచుకున్నా ఆచితూచి అడుగు ముందుకు వేయండి. లేకపోతే మీ ప్రయత్నాలు మానుకోవటమే మంచిది" అని హెచ్చరించారు.

దానికి వాళ్ళు ఏమీ సమాధానం చెప్పలేదు. తమకు ఏదయినా ఉపదేశించమని దైవప్రవక్త (సల్లం)ను కోరారు.

దైవప్రవక్త(సల్లం) వారికి దైవవాణి చదివి వినిపించారు. దివ్య గ్రంథ పారాయణం విని వాళ్ళు తన్మయులై భక్తీవిశ్వాసాలలో ఓలలాడారు.

"దైవప్రవక్తా(సల్లం) తమరు మా నగరానికి వచ్చి స్థిరపడాలి. మీ బోధనలతో మాకు పూర్తి ప్రయోజనాన్ని చేకూర్చాలి" అని వాళ్లు పట్టుబట్టారు.

అప్పుడు దైవప్రవక్త(సల్లం) వారిని ఇలా ప్రశ్నించారు:

1. సత్యధర్మ ప్రచారంలో మీరు నాకు పూర్తిగా సహకరిస్తారా?
2. నేను మీ నగరంలోకి వచ్చి స్థిరపడితే మీరు నాకూ, నా అనుచరులకు సొంత ఆత్మీయుల్లాగా సహాయం చేస్తారా?

'ఒకవేళ మేము అలా చేస్తే దానివల్ల మాకు ప్రయోజనమేమిటి?'

"మీకు పరలోకంలో స్వర్గం లభిస్తుంది".

www.abulhasanalinadwi.org

"మీరు చెప్పిన దానికి మేము ఒప్పుకుంటున్నాం. కాని మీరు కూడా మమ్మల్ని ఎన్నటికీ వదలిపెట్టమని మాటివ్వాలి".

"అలాగే మాటిస్తున్నాను. నేను బ్రతికినా, చచ్చినా మీ వెంటే ఉంటాను..."

దైవప్రవక్త నోట ఆ చివరి మాట వినగానే వాళ్ళు సత్యధర్మ మకరందాన్ని ఆస్వాదించిన తేనెటీగల్లా దైవప్రవక్త చేతి మీద ప్రమాణం చెయ్యటానికి ముందుకొచ్చారు. ఆ రోజు రాత్రి దైవప్రవక్త(సల్లం) చెప్పిన మాటల్ని అనుసరిస్తానని ఆయన చేతిమీద అందరికన్నా ముందు ప్రమాణం చేసిన మహానుభావుడు బరాబిన్ మారూర్ (రజి).

అంతలో ఒక దుర్మార్గుడు కొండ శిఖరంపై నుండి ఇదంతా గమనించి "ప్రజలారా! రండి, చూడండి. ముహమ్మద్, అతని అనుచరులంతా కలిసి మీతో యుద్ధం చేయటానికి సమాలోచనలు జరుపుకుంటున్నారు" అంటూ మక్కా వాళ్ళను బిగ్గరగా కేకవేసి పిలవసాగాడు.

'మీరు అతని మాటలేవీ పట్టించుకోకండి' అన్నారు దైవప్రవక్త(స). "దైవప్రవక్తా! మీరు అనుమతిస్తే రేపే ఈ మక్కా వాళ్ళకు మా ఖడ్గం రుచిని చూపిస్తాం" - అబ్బాస్ బిన్ ఉబాదా ఆవేశపడిపోతూ అన్నారు. దానికి దైవప్రవక్త(స) "వద్దు! దేవుడు నాకింకా యుద్ధం చేయటానికి అనుమతి ఇవ్వలేదు" అన్నారు. ఆ తరువాత ఆయన వారిలో పన్నెండుమందిని ఎన్నుకొని వారికి 'నఖీబ్'లని పేరు పెట్టారు. 'ఈసా ప్రవక్త తన అనుచరుల్లో పన్నెండు మందిని ఎన్నుకున్నారు. అలాగే నేనూ మిమ్మల్ని ఎన్నుకుంటున్నాను. మీరెళ్ళి యస్రిబ్ నగరవాసుల్లో ధర్మప్రచారం మొదలెట్టండి. మక్కాలో ఆ పని స్వయంగా నేనే చేస్తాను' అన్నారు వారితో.

## నాయకులుగా ఎన్నికయిన వారి పేర్లు

ఆ విధంగా నఖీబ్‌లుగా ఎన్నికయిన వారిలో ఖజ్‌రజ్ తెగకు చెందినవారు తొమ్మిదిమంది ఉన్నారు. వారు: అస్అద్ బిన్ జురారా, రాఫె బిన్ మాలిక్, ఉబాదా బిన్ సామిత్ (వీళ్ళు ముగ్గురూ మొదటి ఉఖబా ఒప్పందంలోనూ ఉన్నారు) సాద్ బిన్ రబీ, ముంజిర్ బిన్ అమ్ర్,

www.abulhasanalinadwi.org

అబ్దుల్లాహ్ బిన్ రవాహ్, బరా బిన్ మారూర్, అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ హరామ్, సాద్ బిన్ ఉబాదా.

మిగతా ముగ్గురు ఔస్ తెగకు చెందినవాళ్ళు. ఉసైద్ బిన్ హుజైర్, సాద్ బిన్ ఖైసమా, అబుల్ హైసమ్ బిన్ తీహాన్.[1]

తెల్లవారిన తరువాత గాని ఖురైషులకు రాత్రి జరిగిన ఒప్పందం గురించి తెలీలేదు. విషయం తెలిసిన వెంటనే ఖురైషులు యస్రిబ్ వాళ్ళను వెంబడించారు. కాని అప్పటికే వాళ్ళు చాలా దూరం వెళ్ళిపోయారు. సాద్‌బిన్ ఉబాదా, ముంజిర్ బిన్ అమ్ర్ వెనుకబడిపోవడంతో వాళ్ళను పట్టుకోవటానికి ప్రయత్నించారు. ముంజిర్ (రజి) ఎలాగో తప్పించుకొని పారిపోయారు. కాని సాద్ బిన్ ఉబాదా మాత్రం పట్టుబడిపోయారు. ఖురైషులు ఆయన వాహనం పగ్గాలు విప్పదీసి ఆయన దగ్గరున్న నీళ్ళతిత్తులు లాక్కున్నారు. మక్కాకు తీసుకొచ్చి విపరీతంగా కొట్టారు. ఆయన తలపై ఉన్న పొడువాటి జుట్టుని పట్టుకొని లాగేవారు. దైవప్రవక్త (స) ఎన్నుకున్న పన్నెండుమంది నఖీబ్‌లలో సాద్ బిన్ ఉబాదా కూడా ఉన్నారు. ఖురైషుల చేతుల్లో తాను అనుభవించిన యాతనల గురించి ఆయన ఇలా వివరిస్తున్నారు.

"ఖురైషులు నన్ను కొడ్తున్నప్పుడు ఎర్రగా బుర్రగా ఉండి, తెల్లని దుస్తులు ధరించి వున్న ఒక వ్యక్తి ఎవరో నావైపు వస్తున్నట్లు కనిపించాడు. అతన్ని చూసి నేను, ఖురైషుల్లో ఎవరైనా మంచివాడనే వాడు ఉంటే, ఇతనే అయి ఉంటాడనుకున్నాను. అతను నా దగ్గరికి వచ్చి నా చెంప ఛెళ్ళుమనేలా గట్టిగా కొట్టాడు. ఇంక ఇలాంటి క్రూరుల నుండి మంచిని ఆశించటం వ్యర్థమనుకున్నాను మనసులో. అంతలో ఇంకో వ్యక్తి వచ్చాడు. అతను నన్ను చూసి జాలిపడి, "ఖురైషుల్లో నీకు తెలిసినవారు, గతంలో నీచేత సహాయం పొందినవారు ఎవరూ లేరా?" అని అడిగాడు. దానికి నేను "ఉన్నారు, అబ్దెమునాఫ్ మనవళ్ళయిన జుబైర్ బిన్

1) ముస్నదె అహ్మద్ మూడవ సంపుటి 322 నుండి 339 పుటల వరకు. ముస్తద్రక్ హాకిమ్ రెండవ సంపుటి 624, 625 పుటలు. ఇమామ్ జహబీ హాకిమ్ ఉల్లేఖనాలను ప్రామాణికమైనవిగా ఖరారు చేశారు. మరిన్ని వివరాల కోసం సీరత్ ఇబ్నెహిషామ్ మొదటి సంపుటి 438 నుండి 448 పుటల వరకు, ఫత్‌హుల్ బారీ ఏడవ సంపుటి 219 నుండి 223 పుటల వరకు చూడగలరు.

www.abulhasanalinadwi.org

ముత్‌యిమ్, హారిస్ బిన్ హార్బ్ వ్యాపార నిమిత్తం మా దగ్గరికొచ్చేవాళ్ళు. నేను చాలా సార్లు వాళ్ళను రక్షించాను" అని చెప్పాను. "అలాగయితే ఖురైషులు నిన్ను కొట్టినప్పుడు నువ్వు వాళ్ళిద్దరినీ సహాయం కోసం అర్థించు. నువ్వు వాళ్ళకు చేసిన ఉపకారమేమిటో గట్టిగా అందరికీ వినబడేలా చెప్పు" అన్నాడా వ్యక్తి. నేను అతను చెప్పినట్లే చేశాను. ఆ తరువాత అతనే వాళ్ళిద్దరి దగ్గరికి వెళ్ళి, "ఖజ్‌రజ్ తెగకు చెందిన ఒక వ్యక్తిని ఖురైషులు చిత్రహింసలు పెడుతున్నారు. అతను మీరిద్దరి పేర్లు తీసుకొని సహాయం చెయ్యమని అరుస్తున్నాడ'ని వాళ్ళతో చెప్పాడు.

'ఎవరతను?' అని అడిగారు వాళ్ళు.

"సాద్ బిన్ ఉబాదా అట"

'ఔనౌను, అతను మాకు చాలా ఉపకారం చేసి ఉన్నాడు" అని ధృవీకరించారు.

తరువాత వాళ్ళిద్దరూ వచ్చి నన్ను ఖురైషుల చెర నుండి కాపాడారు. నేను యస్రిబ్‌కు తిరిగి వెళ్ళిపోయాను. [1]

1) సీరత్ ఇబ్నెహిషామ్ మొదటి సంపుటి 449 -450 పుటలు. రహ్మతుల్లిల్ ఆలమీన్ మొదటి సంపుటి 82వ పుట.

www.abulhasanalinadwi.org

# హిజ్రత్‌కు అనుమతి

ఖురైషుల నిరంతర దౌర్జన్యాల మూలంగా మక్కాలోని ముస్లింలకు బ్రతుకు దుర్భరమైపోయింది. అంచేత రెండవ ఉఖబా ఒప్పందం జరిగిన తరువాత దైవప్రవక్త(సల్లం) బాధిత ముస్లింలకు యస్రిబ్ (నేటి మదీనా) నగరానికి వలస వెళ్ళేందుకు అనుమతినిచ్చారు. విశ్వాసులకు తమ ఇళ్ళను, ఆత్మీయుల్ని, బంధుమిత్రుల్ని, భార్యాపిల్లల్ని, అన్నదమ్ముల్ని వదలి వెళ్ళాల్సి వస్తున్నందుకు కొంచెమైనా బాధ అనిపించలేదు. పైగా యస్రిబ్ వెళితే పూర్తి స్వేచ్ఛతో ఏకేశ్వరుణ్ని ఆరాధించవచ్చనే సంతోషంతో వారి ముఖాలు ప్రకాశించాయి.[1]

ముస్లింల కష్టాలు అంతటితో ఆగలేదు. మక్కావదలి వెళ్లాలనుకున్న వారికి ఖురైషుల తరపు నుండి గట్టి ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వచ్చింది.

హజ్రత్ సుహైబ్ రూమి (రజి) మక్కానుండి వలస వెళ్ళాలని బయలుదేరినప్పుడు అవిశ్వాసులు ఆయన్ని చుట్టుముట్టి, సుహైబ్! నువ్వు మక్కాకు వచ్చినప్పుడు కటిక దరిద్రుడివి. ఇక్కడికి వచ్చిన తరువాత నువ్వు లక్షల ఆస్తి సంపాదించావు. ఈ రోజు ఇక్కడి నుండి వెళ్తూ ఈ సంపదనంతా మూటగట్టుకొని వెళ్దామనుకుంటున్నావా? అలా ఎన్నిటికీ కుదరదు" అన్నారు.

"అలాగయితే నా సంపద మొత్తం మీకే ఇచ్చేస్తాను. మరి నన్ను ఇక్కడినుండి వెళ్ళిపోనిస్తారా?" అని అడిగారు సుహైబ్ రూమి (రజి).

ఖురైషులు అందుకు ఒప్పుకున్నారు. సుహైబ్ (రజి) తన దగ్గరున్న ధనం మొత్తం ఖురైషులకు ఇచ్చి యస్రిబ్‌కు వెళ్ళిపోయారు. దైవప్రవక్త

---

1) జాదుల్ మఆద్ మూడవ సంపుటి 49వ పుట. రహ్మతుల్లిల్ ఆలమీన్ మొదటి సంపుటి 82వ పుట.

www.abulhasanalinadwi.org

(సల్లం) ఈ సంగతి విన్నప్పుడు 'సుహైబ్ తాను చేసిన బేరంలో లాభాన్ని గడించాడు' అని వ్యాఖ్యానించారు.[1]

ఉమ్మె సలమా (రజి. అన్‌హా) కథనం: నేనూ, నా భర్త అబూసలమా యస్రిబ్‌కు వలస వెళ్ళాలని నిశ్చయించుకున్నాం. నేను మా చంటిపిల్లోడ్ని ఒళ్ళో పెట్టుకొని ఒంటెపై కూర్చున్నాను. మేము బయలుదేరుతుండగా బనూ ముగీరా తెగవారు అడ్డొచ్చారు. వాళ్ళు అబూసలమాను చుట్టుముట్టి, "నువ్వెళ్ళు, కాని మా అమ్మాయిని మాత్రం నీవెంట పంపించం" అన్నారు. అంతలో అబ్దుల్ అసద్ తెగవాళ్ళు కూడా అక్కడికి చేరుకొని, 'కావాలంటే నువ్వెళ్ళిపో. కాని పిల్లవాడ్ని మాత్రం తీసుకొని వెళ్ళనివ్వం. అతను మా తెగ పిల్లవాడు" అన్నారు.

వాళ్ళందరూ కలిసి అబూసలమా చేతిలోనుండి ఒంటెపగ్గాలు లాక్కొని ఒంటెను కూర్చోబెట్టారు. అబ్దుల్ అసద్ తెగవాళ్ళు తల్లి ఒడిలోనున్న పిల్లవాడ్ని లాక్కొని వెళ్ళిపోయారు. ముగీరా తెగవాళ్ళు ఉమ్మె సలమాను బలవంతంగా ఇంటికి తీసుకొని వెళ్ళిపోయారు. కాని ధర్మం కోసం వలసవెళ్ళటం విధిగా భావించిన అబూసలమా మాత్రం భార్యను, కన్న పిల్లవాడ్ని వదలిపెట్టి తానొక్కరే యస్రిబ్ దారిన పడ్డారు. ఉమ్మెసలమా సాయంత్రం పూట భర్త, పిల్లవాడు తన నుండి విడిపోయిన చోటుకి వెళ్ళి గంటల తరబడి ఏడ్చేవారు. ఆమె ఒక సంవత్సరం దాకా ఇలాగే ఏడుపు, పెడబొబ్బల్లోనే గడిపారు. చివరికి ఆమె బాబాయి కుమారుడు ఆమెపై జాలిపడి, ఇరుతెగలవారికీ నచ్చజెప్పి, వాళ్ళనుండి నానామాటలు భరించి, ఎలాగో ఆమెకు తన భర్త దగ్గరికి వెళ్ళటానికి అనుమతి ఇప్పించారు. అబ్దుల్ అసద్ తెగవాళ్ళు కూడా ఆమెకు పిల్లవాడ్ని తిరిగి ఇచ్చేశారు. అప్పుడు ఉమ్మె సలమా (రజి.అన్‌హా) ఒంటరిగా ఒంటెపై ప్రయాణించి మదీనాకు వెళ్ళిపోయారు.

ఇలాంటి కష్టాలు ఒక్క అబూసలమా కుటుంబానికే కాదు, దాదాపు ముస్లింలందరికీ ఎదురయ్యాయి.[2]

---

1) సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటి 477వ పుట. బైహఖీగారి దలాయిలున్నుబువ్వా గ్రంథం రెండవ సంపుటి 522వ పుట.

2) సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటి 467, 468 పుటలు.

www.abulhasanalinadwi.org

హజ్రత్ ఉమర్ ఫారూఖ్(రజి) కథనం ప్రకారం ఆయన మదీనాకు బయలుదేరినప్పుడు అయ్యాష్ బిన్ రబీయా, హిషామ్‌లు ఇద్దరూ కూడా ఆయన వెంట మదీనాకు వలస వెళ్ళటానికి సిద్ధమయ్యారు. ముగ్గురూ కలిసి ఒకేచోటునుండి బయలుదేరుదామని కూడబలుక్కున్నారు. అయ్యాష్ కూడబలుక్కున్న చోటుకి చేరుకోగలిగారు కాని హిషామ్ మాత్రం అవిశ్వాసుల చేతుల్లో చిక్కిపోయారు. మక్కావారు ఆయన్ని బంధించారు. మరోవైపు అయ్యాష్ మదీనాకు చేరుకున్నారు. ఆయన వెనుక అబూజహల్ కూడా తన సోదరుడు హారిస్‌తో పాటు మదీనా చేరుకున్నాడు. అయ్యాష్ అతని బాబాయి కుమారుడు. ముగ్గురూ ఒకే తల్లిబిడ్డలు. అబూజహల్, హారిస్‌లు అయ్యాష్‌తో, "సోదరా! నువ్వు వెళ్ళిపోయిన దగ్గర్నుంచి అమ్మ బెంగతో మంచం పట్టింది. తిరిగి నీ ముఖం చూడందే తలదువ్వుకోనని, నీడలో కూడా కూర్చోనని ఒట్టేసుకుంది. అందుకని అమ్మకోసమైనా ఇంటికి వెళ్ళిపోదాం పద" అంటూ మాయ మాటలు చెప్పసాగారు.

అప్పుడు ఉమర్(రజి), "అయ్యాష్! నాకు వీళ్ళు చెప్పేవన్నీ మాయమాటల్లా అనిపిస్తున్నాయి. మీ అమ్మ తలలో పేలు పడితే ఆమె తల దువ్వుకుంటుంది. మక్కా ఎండ చురక తగిలితే తనే స్వయంగా నీడలోకి వచ్చి కూర్చుంటుంది. కాని ఇటువంటి పరిస్థితిలో నువ్వు ఇంటికి తిరిగి వెళ్ళకపోవటమే మంచిది" అన్నారు.

దానికి అయ్యాష్, "ఫర్వాలేదు, నేనెళ్ళి అమ్మ ప్రమాణం నెరవేర్చి వెంటనే తిరిగొచ్చేస్తాను" అన్నారు.

"సరే, నువ్వు వెళ్ళాలనే నిర్ణయించుకుంటే నా ఈ ఆడ ఒంటె ఎక్కి వెళ్ళు. ఇది చాలా వేగంగా ప్రయాణిస్తుంది. దారిలో నువ్వు వీళ్ళ నుండి ఏ మాత్రం కుట్రను శంకించినా ఈ ఆడ ఒంటె ద్వారా నువ్వు వారినుండి సులువుగా తప్పించుకొనిరావచ్చు" అని చెప్పారు హజ్రత్ ఉమర్ (రజి).

అయ్యాష్ ఉమర్ ఇచ్చిన ఆడ ఒంటెపై బయలు దేరారు. ఆయన వెంట అబూజహల్, హారిస్‌లు కూడా బయలు దేరారు. మక్కా సమీపానికి

www.abulhasanalinadwi.org

వచ్చిన తరువాత అబూజహల్, "సోదరా! మా ఒంటె ప్రయాణంలో బాగా అలసిపోయింది. మా ఒంటెకు ఆయాసం తగ్గేదాకా నేను నీ ఒంటెపై కూర్చోవచ్చా" అని కోరాడు. అయ్యాష్ సరేనని చెప్పి తన ఒంటెను కూర్చోబెట్టారు. అప్పటివరకూ అదనుకోసం ఎదురుచూస్తున్న అన్నదమ్ములిద్దరూ ఆయన ఒంటెను కూర్చోబెట్టగానే ఆయన్ని ఒడిసి పట్టుకున్నారు. పెడరెక్కలు విరిచి మక్కాకు తీసుకొని వచ్చారు. మూర్ఖుల్ని, వెర్రివాళ్ళని ఇలాగే పట్టుకోవాలి అంటూ ఆ ఇరువురు అన్నదమ్ములు ప్రజల ముందు గొప్పలు చెప్పుకున్నారు. మక్కా అవిశ్వాసులు హిషామ్ బిన్ ఆస్‌తోపాటు అయ్యాష్‌ను కూడా బంధించారు. దైవప్రవక్త (సల్లం) మదీనాకు వలసవెళ్ళిన చాలాకాలం తరువాత ఆయన(స) కోరిక మేరకు వలీద్ బిన్ ముగీరా మక్కా వెళ్ళి ఓ రోజు రాత్రి వారిద్దరినీ చెరసాల నుండి విడిపించుకొని వచ్చారు.[1]

## దైవప్రవక్త (సల్లం) మదీనాకు హిజ్రత్ చేసిన సంఘటన

ముస్లింలు మదీనాలో క్రమక్రమంగా నిలదొక్కుకో సాగారు. అక్కడ ఇస్లాం చాలా వేగంగా వ్యాప్తి చెందుతోంది. మక్కా అవిశ్వాసులు ఈ విషయాన్ని జీర్ణించుకోలేకపోయారు. అంచేత వాళ్ళు దారున్నద్వా (సమాలోచనలు జరుపుకునే గృహం)లో ఓ సార్వత్రిక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమావేశానికి అన్ని తెగల నాయకులు హాజరయ్యారు. పలువురు పలు అభిప్రాయాలు వెల్లడించారు. "ముహమ్మద్ కాళ్ళూ చేతులకు బేడీలు వేసి అతన్ని కొట్లో పడేద్దాం" అని ఒకడు అన్నాడు. "అతన్ని మన సంఘం నుండి బహిష్కరిద్దాం. తనే దారికొస్తాడు" అని ఇంకొకడు సలహా ఇచ్చాడు. ఆఖరికి అబూజహల్ మాట్లాడుతూ, "అలాకాదు, మన తెగల్లో ఒక్కో తెగ నుండి కనీసం ఒక్కో వ్యక్తి ముందుకు రావాలి. ఆ తరువాత అందరూ కలిసి ఒక్కసారిగా ఖడ్గాలతో దాడిచేసి ముహమ్మద్‌ను మట్టుబెట్టాలి. అప్పుడు అతణ్ణి అన్ని తెగలవారూ కలిసి చంపినట్టవుతుంది. హాషిం తెగవారు ఒంటరిగా

1) ముస్తద్రక్ హాకిమ్ రెండవ సంపుటి 435వ పుట. ఇమామ్ జహబీ ఈ ఉల్లేఖనాన్ని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు.

www.abulhasanalinadwi.org

మనందరితో పోరాడలేక ప్రతీకార చర్యల్ని మానుకుంటారు'' అని సూచించాడు. ఈ ఆఖరి సలహా పట్ల అందరూ తమ అంగీకారాన్ని వ్యక్తం చేశారు. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా దైవప్రవక్త (సల్లం) ఇంటిని ముట్టడించారు. అరబ్బులు స్త్రీలు ఉండే ఇళ్ళల్లోకి ప్రవేశించటాన్ని తప్పుగా భావించేవారు. అందుకని దైవప్రవక్త (సల్లం) బయటికి వస్తే తమపని పూర్తిచేసుకొని వెళదామని ఇంటి బయటే నిలబడి ఆయన కోసం ఎదురుచూడసాగారు.[1]

ఖురైషులకు దైవప్రవక్త (సల్లం)తో ఇంత శత్రుత్వం ఉన్నప్పటికీ వారికి ఆయన నిజాయితీపై నమ్మకముండేది. ప్రజలు ధనం, సొమ్ములు ఏవైనా భద్రపరచుకోవాలనుకుంటే ఆయనకే అప్పగించేవారు. ఆ విధంగా అవిశ్వాసులు దైవప్రవక్త ఇంటిని ముట్టడించినప్పటికీ ఆయన దగ్గర ఎంతోమంది ప్రజల అప్పగింతలున్నాయి. ఖురైషుల దురుద్దేశం గురించి ఆయనకు ముందుగానే తెలిసిపోయింది. అంచేత ఆయన హజ్రత్ అలీని పిలిచి, ''నాకు హిజ్రత్ ఆజ్ఞ అయ్యింది. నేను ఈ రోజే మదీనాకు బయలుదేరుతున్నాను.[2] నువ్వు నా మంచంపై నా దుప్పటి కప్పుకొని పడుకో. తెల్లారిన తరువాత ఎవరి అప్పగింతలు వారికి ఇచ్చేసిరా'' అని పురమాయించారు. హజ్రత్ అలీ (రజి) ఖురైషుల ఖడ్గాల నీడలో హాయిగా, కమ్మగా నిద్రపోయారు. మరోవైపు దైవప్రవక్త దేవుని రక్షణలో బయలుదేరారు. అంధమనస్కులైన మక్కా అవిశ్వాసుల కళ్ళల్లో మన్ను కొడుతూ, 'యాసీన్' సూరా పఠిస్తూ నెమ్మదిగా అక్కడి నుండి బయట పడ్డారు. 'దేవుడు ఏడి?' అని ప్రశ్నించే అవిశ్వాసులు దైవప్రవక్త (సల్లం) కళ్ళ ముందు నుంచి పోతున్నా చూడలేక పోయారు.[3] ఈ సంఘటన దైవదౌత్యపు పదమూడవ యేట సఫర్ మాసం 27వ తేదీన గురువారం నాడు (క్రీ.శ. 621 సంవత్సరం సెప్టెంబర్ పన్నెండో తేదీన) జరిగింది.[4]

---

1) సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటి 480వ పుట.
2) హిజ్రత్ ఆదేశం దైవప్రవక్త (సల్లం)కు దేవుని తరఫు నుండి ఇవ్వబడింది. సహీహ్ బుఖారీలో దీని ప్రస్తావన ఉంది. అందులో మహిమోన్నతల ప్రకరణం చూడండి.
3) ముస్నదె అహ్మద్ మొదటి సంపుటి 348వ పుట. ముసన్నఫ్ అబ్దుర్రజ్జాఖ్ ఐదవ సంపుటి 389వ పుట.
4) సీరతున్నబీ మొదటి సంపుటి 270వ పుట. రహ్మతుల్లిల్ ఆలమీన్ మొదటి సంపుటి 85వ పుట

www.abulhasanalinadwi.org

హిజ్రత్‌కు రెండ్రోజుల ముందు దైవప్రవక్త (సల్లం) ఒకనాటి మధ్యాహ్నం పూట అబూబక్ర్(రజి) ఇంటికి వెళ్ళి, నియమానుసారం తలుపుతట్టారు. అనుమతి తీసుకున్న తరువాత ఇంట్లోకి ప్రవేశించారు. అబూబక్ర్ (రజి)తో, "కొంచెం మీతో మాట్లాడాలి. మీ ఇంట్లో వాళ్ళందరినీ ప్రక్కకు తప్పుకోమనండి" అన్నారు. "దైవప్రవక్తా! ఇక్కడ తమరి భార్యామణి తప్ప మరెవ్వరూ లేరు (అప్పటికే దైవప్రవక్త (సల్లం)తో హజ్రత్ ఆయిషా వివాహం జరిగివుంది.)" అని అన్నారు.

"నాకు మక్కానుండి వలస వెళ్ళేందుకు అనుమతి లభించింది"

"నా తల్లిదండ్రుల్ని మీకు అర్పింతు. దైవప్రవక్తా! నాకు మీ వెంటవచ్చే భాగ్యం లభిస్తుందా?"

"తప్పకుండా....."

అబూబక్ర్ (రజి) నాలుగుమాసాల నుండి హిజ్రత్ కోసం రెండు ఒంటెల్ని తుమ్మ ఆకులు మేపుతూ సిద్ధం చేసి ఉంచారు. ఆ రెండిట్లో ఏదో ఒకదాన్ని ఎంపిక చేసుకోమని దైవప్రవక్త (సల్లం)ను కోరారు. ఆ మానవ మహోపకారి ఎన్నడూ ఎవరి ఉపకారభారమూ మోయదలచుకోలేదు. అందుకే, "ఎంపిక చేసుకుంటాను, కాని మూల్యం చెల్లించి మరీ తీసుకుంటాను" అన్నారు. అబూబక్ర్ అయిష్టంగానే అందుకు ఒప్పుకోవాల్సి వచ్చింది. హజ్రత్ ఆయిషా (రజి. అన్హా) అప్పటికి చిన్నపిల్లే. ఆమె అక్క అస్మా వారికి ప్రయాణ ఏర్పాట్లు చేసింది. రెండు మూడు రోజులకు సరిపోయే ఆహారాన్ని ఓ గుడ్డలో ఉంచి, తన నడుం కట్టుని చించి దాంతో ఆ అన్నాన్ని మూటకట్టింది. దాంతో ఆ రోజు నుంచి ఆమెకు 'జాతున్నితాఖైన్' అనే పేరు పడిపోయింది.[1]

ఆయన (సల్లం) కాబావైపు ఆఖరిసారి చూస్తూ, "ఓ మక్కా! నువ్వు నాకు ప్రపంచంలోకెల్లా అత్యంత ప్రియమైన భూమివి. కాని నీ పుత్రులు నన్ను ఇక్కడ ఉండనివ్వటం లేదు" అన్నారు.[2] ఆ రోజు రేజీకటిలోనే ఆ ఇద్దరు త్యాగధనులూ మదీనాకు బయలుదేరారు. మక్కా వెలుపల

1) సహీహ్ బుఖారీ, అన్సార్ల మహిమోన్నతల ప్రకరణం
2) ఇమామ్ తిర్మిజీ, ఇమామ్ దారిమి, ఇబ్నెమాజాలు దీనిని ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'హసన్' 'గరీబ్' కోవకు చెందిన హదీసుగా పేర్కొన్నారు.

www.abulhasanalinadwi.org

నాలుగైదు మైళ్ళదూరాన 'సూర్' అనే కొండగుహ ఉంది. అది చాలా ఎత్తులో ఉంది. అక్కడికి చేరుకోవాలంటే రాళ్ళూ, రప్పల గుండా వెళ్ళాలి. దైవప్రవక్త(సల్లం) పాదాలకు రాళ్ళు గుచ్చుకోసాగాయి. రాళ్ళదెబ్బలకు ఆయన కాళ్ళు విపరీతంగా నొప్పి పెట్టసాగాయి. అబూబక్ర్ దైవప్రవక్తను తన భుజాన్నెత్తుకొని గుహదాకా తీసుకొని వెళ్ళారు. ఆ తరువాత దైవప్రవక్తను బయట కూర్చోబెట్టి తాను గుహలోకి ప్రవేశించి లోపల అంతా శుభ్రం చేశారు. తన ఒంటిమీదున్న బట్టల్ని చించి గుడ్డపీలికలతో గుహలోని రంధ్రాలన్నీ మూసివేశారు. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం)ను లోనికి తీసుకువెళ్ళారు.[1]

తెల్లవారింది. హజ్రత్ అలీ మాములుగానే నిద్రలేచారు. ఖురైషులు దగ్గరికి వెళ్ళి ఆయన్ని గుర్తుపట్టి 'ముహమ్మద్ ఏడి?' అని అడిగారు. దానికి హజ్రత్ అలీ, 'నాకేం తెలుసు. నేనేమైనా ఆయనకు కాపలా ఉన్నానా? మీరే ఆయన్ని వెళ్ళనిచ్చారు. ఆయన హాయిగా వెళ్ళిపోయారు' అన్నారు వారిని పరిహసిస్తూ. ఖురైషులు క్రోధంతో పశ్చాత్తాపంతో ఏమీ పాలుపోక హజ్రత్ అలీని పట్టుకొని చితకబాదారు. కాబా దగ్గరికి లాక్కొని వెళ్ళి కాసేపు బంధించి ఉంచి, ఆ తరువాత వదిలేశారు.[2]

హజ్రత్ అస్మా బిన్తె అబూబక్ర్ ఇలా తెలియజేస్తున్నారు. మా నాన్నగారు మదీనాకు వలసవెళ్ళినప్పుడు ఇంట్లో ఉన్న ఆరువేల రూపాయల నగదు మొత్తం పైసామిగల్చకుండా తీసుకొనివెళ్ళారు. నాన్న వెళ్ళిపోయిన తరువాత మా తాతయ్య అబూ ఖహాఫా నా దగ్గరికొచ్చి, "అమ్మాయి! మీ నాన్న నిన్ను రెండింతలు కష్టానికి గురిచేసి ఉంటాడు. తాను వెళ్ళిపోవటమే గాకుండా ఇంట్లో ఉన్న డబ్బంతా తీసుకొని వెళ్ళి ఉంటాడమ్మా!" అన్నాడు.

"లేదు, తాతయ్యా! నాన్న మా కోసం చాలా డబ్బులు వదలిపెట్టి వెళ్ళారు" అన్నాను నేను.

1) ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటి 6వ పుట. దలాయిలున్నుబువ్వా రెండవ సంపుటి 477వ పుట. జహబీగారి అస్సీరతున్న బవియ్యా గ్రంథంలో 221వ పుట. రహ్మతుల్లిల్ ఆలమీన్ మొదటి సంపుటి 85వ పుట.

2) తారీఖె తబ్రీ మొదటి సంపుటి 568వ పుట.

www.abulhasanalinadwi.org

ఆ తరువాత నేను ఓ రాయిని గుడ్డతో చుట్టి మేము డబ్బులు ఉంచే బిందెలో దాన్ని పెట్టాను. తాతయ్య చేయి పట్టుకొని తీసుకొని వెళ్ళి చూపించాను. మా తాతయ్య గ్రుడ్డివారు. అంచేత ఆ మూటను చేత్తో తాకి, "సర్లే, డబ్బు చాలానే వదలిపెట్టి పోయాడు. ఇక నువ్వు మీ నాన్న గురించి బెంగపడకు. అతను మీకోసం ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసి వెళ్ళుంటాడు" అన్నాడు. మా ముసలి తాతయ్య ఆత్మ తృప్తికోసమే నేనలా చేశాను. నిజానికి మా నాన్నగారు ఇంట్లో ఉన్న ధనమంతా దైవప్రవక్త సేవ కోసం వెంటతీసుకొని వెళ్ళారు.[1]

మరోవైపు దైవప్రవక్త, అబూబక్ర్‌లిరువురూ మూడురోజుల వరకూ సూర్ కొండగుహలోనే తలదాచుకున్నారు. అబూబక్ర్ కుమారుడు అబ్దుల్లాహ్ రాత్రిపూట గుహలో వారితోపాటే నిద్రపోయేవారు. పగలంతా మక్కాలో తిరిగి ఖురైషుల ప్రయత్నాలను గురించి తెలుసుకొని సాయంత్రానికి ఆ విషయాలన్నీ దైవప్రవక్త (సల్లం)కు తెలియజేసేవారు. కాస్త పొద్దుపోయిన తరువాత అబూబక్ర్ బానిస గుహవైపు గొఱ్ఱెల్ని తోలుకొని వచ్చేవాడు. దైవప్రవక్త (సల్లం) అబూబక్ర్‌లు ఆ గొఱ్ఱెల పాలు త్రాగి కడుపు నింపుకునేవారు. మూడ్రోజుల వరకు పరిస్థితి ఇలాగే కొనసాగింది.[2]

అటు ఖురైషులు దైవప్రవక్త అన్వేషణలో బయలుదేరారు. ఆయన్ని వెతుక్కుంటూ గుహదాకా చేరుకున్నారు. అబూబక్ర్ వారి అలికిడి విని భయపడుతూ "దైవప్రవక్తా! శత్రువులు మనకు చాలా దగ్గరికి వచ్చేశారు. వాళ్ళల్లో ఎవరైనా మన కాళ్ళవైపు దృష్టిమరల్చితే మనం వాళ్ళ కంట బడటం ఖాయం" అన్నారు. అప్పుడు, దైవప్రవక్త (సల్లం) "దిగులు పడకు. దేవుడు మనకు తోడుగా ఉన్నాడు" అంటూ అబూబక్ర్‌కు ధైర్యం చెప్పారు.[3]

నాల్గోరోజు దైవప్రవక్త (సల్లం) గుహ నుండి బయలుదేరారు. మదీనా (గతంలోని యస్రిబ్) కు వెళ్ళేదారి చూపించటానికి అబ్దుల్లాహ్ బిన్ ఉరైఖిత్ అనే వ్యక్తికి, కూలి ఇచ్చి తమ వెంట తీసుకొని వెళ్ళారు.

1) సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటి 488వ పుట.
2) సహీహ్ బుఖారీ: అన్సార్ల మహిమోన్నతల ప్రకరణం.
3) సహీహ్ బుఖారీ: ప్రవక్త సహచరుల మహిమోన్నతల ప్రకరణం

www.abulhasanalinadwi.org

అబ్దుల్లాహ్ అవిశ్వాసి అయినప్పటికీ నమ్మకస్థుడు. తాను ముందు నడుస్తూ వారికి దారి చూపించేవాడు. ఆ రాత్రంతా అలాగే ఎక్కడా ఆగకుండా ప్రయాణించారు. మరునాడు మిట్టమధ్యాహ్నానికి ఎండ బాగా వేడెక్కింది. అబూబక్ర్ మనసులో దైవప్రవక్త(సల్లం) ఇక్కడ ఆగి ఏ నీడలోనయినా కాసేపు సేదతీర్చుకుంటే బాగుంటుందను కున్నారు. అనుకున్నదే తడవుగా ఒకసారి నలువైపులా కలియజూశారు. ఒక పెద్ద చట్టు బండ ప్రక్కన నీడ ఉన్నట్లు కనిపించింది. వాహనం దిగి నీడున్న చోటుకి వెళ్ళారు. ఆ చోటంతా ఊడ్చి శుభ్రంచేసి తనదగ్గరున్న దుప్పటిని పరచారు. దైవప్రవక్త (సల్లం) దానిపై పడుకున్న తరువాత తాను ఆహార అన్వేషణలో బయలుదేరారు. ఒకచోట ఆయనకు ఓ గొర్రెల కాపరి గొర్రెల్ని కాస్తూ కనిపించాడు. అతనితో ఏదైనా ఒక గొర్రె పొదుగు శుభ్రపరచమని చెప్పారు. అతను ఒక గొర్రెను తెచ్చి దాని పొదుగును తనచేత్తోనే శుభ్రపరచి ఇచ్చాడు. అబూబక్ర్ ఒక పాత్రలో గొర్రెపాలు పితికి పాత్రలో దుమ్ము, ధూళి పడకుండా ఉండటానికి దానిమూతిని గుడ్డతో కట్టారు. తరువాత దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి పాలలో కాసిన్ని నీళ్ళు కలిపి ఆయనకు సమర్పించారు. దైవప్రవక్త ఆ పాలు సేవించిన తరువాత, "పొద్దుగ్రూకింది. ఒక బయల్దేరుదామా?" అన్నారు. సరేనని ఇద్దరూ అక్కడినుండి ప్రయాణం సాగించారు.[1]

## దైవప్రవక్త (సల్లం) కోసం సురాఖా వేట

మక్కాలో ఖురైషులు ముహమ్మద్(సల్లం)ను గాని లేదా అబూబక్ర్‌ను గాని పట్టితెచ్చినవారికి నూరు ఒంటెల బహుమతి ఇస్తామని చాటింపు వేయించారు. సురాఖా అనేవాడు ఆ నూరు ఒంటెల బహుమతికి ఆశపడి దైవప్రవక్తను వెతికి పట్టుకోవాలని బయలుదేరాడు. దైవప్రవక్త(సల్లం) కూడా సరిగ్గా అప్పుడే ప్రయాణం మొదలుపెట్టిన కారణంగా వాళ్ళు సురాఖా కంటబడ్డారు. సురాఖా వారిని చూడగానే రెట్టింపు ఉత్సాహంతో గుర్రాన్ని పరుగెత్తించి దగ్గరికి చేరుకున్నాడు. కాని అంతలోనే అతని గుర్రం ఎదురుదెబ్బ తగిలి బోల్తా పడిపోయింది. అతను ఒక్క ఉదుటున పైకిలేచి, అంబులపొదినుండి పాచికల్లాంటి బాణాలు

1) సహీహ్ బుఖారీ: ప్రవక్త సహచరుల మహిమోన్నతల ప్రకరణం

www.abulhasanalinadwi.org

తీసి వారిపై దాడి చేయాలా వద్దా అని జోస్యం చూశాడు. 'వద్ద'ని జవాబొచ్చింది. కాని నూరు ఒంటెల ఆశ అతని ప్రయత్నాన్ని మానుకో నివ్వలేదు. మళ్ళీ గుర్రం మీదకు లంఘించి వారి వెంటపడ్డాడు. దైవప్రవక్త (సల్లం) మాత్రం దివ్యఖురాన్ వాక్యాలు పఠిస్తూ, దైవధ్యానంలో నిమగ్నులై నిక్షేపంగా ముందుకు సాగిపోతున్నారు. ఈసారి సురాఖా గుర్రం మోకాళ్ళ దాకా భూమిలో దిగబడింది. అతను వెంటనే గుర్రం దిగి ఇంకోసారి జోస్యం చూశాడు. మళ్ళీ అదే జవాబు వచ్చింది. రెండుసార్లూ అదే అనుభవం. ఎదురవడంతో అతని ధైర్యం సడలింది. ఇవేవో దైవిక సూచనల్లా ఉన్నాయని అతనికి అర్థమయిపోయింది. దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళి ఖురైషులు చాటింపు వేయించిన సంగతి వారికి తెలియజేశాడు. తన దగ్గరున్న ధనమంతా దైవప్రవక్త (సల్లం)కు ఇవ్వబోయాడు. కాని దైవప్రవక్త (సల్లం) దాన్ని స్వీకరించటానికి నిరాకరించారు. తమ గురించి ఎవరికీ చెప్పవద్దని మాత్రం కోరారు. ఆ తరువాత సురాఖా దైవప్రవక్తను తనకు శాంతి సందేశం రాసి ఇవ్వమని కోరాడు. హజ్రత్ అబూబక్ర్ బానిస అయిన ఆమిర్ బిన్ ఫుహైరా దైవప్రవక్త అనుజ్ఞతో ఒక తోలుపత్రంపై అతనికి శాంతి సందేశాన్ని వ్రాసి ఇచ్చాడు.[1]

## భాగ్యవంతుడు

గుహనుండి బయలుదేరిన తొలిరోజే దైవప్రవక్త బృందం ఉమ్మెమాబద్ అనే ఓ వృద్ధురాలి గుడారం సమీపం నుండి వెళ్ళింది. ఈ వృద్ధురాలు ఖుజాఅ తెగకు చెందినది. బాటసారులకు సపర్యలు చేసేది. దాహార్తుల దాహం తీర్చేది. బాటసారులు ఆమె గుడారం దగ్గర ఆగి ప్రయాణ బడలిక తీర్చుకొని తిరిగి ప్రయాణం కొనసాగించేవారు. దైవప్రవక్త (సల్లం) కూడా అక్కడ ఆగి "నీ దగ్గర తినే వస్తువులు ఏమైనా ఉన్నాయా?" అని ఆమెను అడిగారు. "ప్రస్తుతం నా దగ్గర ఏమీ లేవు. ఒకవేళ ఉండి వుంటే మీరడగక ముందే పెట్టి ఉండేదాన్ని" అని అందామె.

దైవప్రవక్త (సల్లం) గుడారం మూలన ఉన్న గొర్రెను చూచి, "ఈ గొర్రె ఇవ్వాళ మేతకోసం వెళ్ళలేదా?" అని అడిగారు. "ఇది చాలా

1) సహీహ్ బుఖారీలోని మహిమోన్నతల ప్రకరణం

www.abulhasanalinadwi.org

బలహీనంగా ఉంది, మందతోపాటు నడవలేకపోతోంది'' అని చెప్పిందామె.

"మీరు అనుమతిస్తే దీని పాలు పితుక్కుంటాం"

"ఈ గొర్రె పాలివ్వదు. కావాలంటే పితికి చూసుకోండి"

దైవప్రవక్త (సల్లం) 'బిస్మిల్లాహ్' అంటూ దాని పొదుగుకు చేతులు తాకారు. ఆమె దగ్గర్నుంచి ఒక పాత్ర తీసుకొని స్వయంగా పాలు పితకసాగారు. పాల పాత్ర నిండిపోవటమేగాక కాసిన్ని పాలు క్రిందికి పొర్లిపోయాయి కూడా. ఆ పాలు దైవప్రవక్త, ఆయన అనుచరులు త్రాగారు. రెండోసారి పాత్రనిండా పాలు పితికారు. ఇవి కూడా ఆయన అనుచరులే త్రాగారు. మూడోసారి మళ్ళీ పాత్రనిండా పితికారు. ఆ పాలు ఉమ్మెమాబద్‌కు ఇచ్చి అక్కడి నుండి ప్రయాణం సాగించారు.

తరువాత ఆమె భర్త వచ్చాడు. గుడారంలో పాలపాత్ర చూసి ఆశ్చర్యపోయి, "ఈ పాలెక్కడివి?'' అని అడిగాడు.

"ఇందాక ఇక్కడికి ఓ భాగ్యవంతుడు వచ్చాడు. ఆయన రాక ఫలితమే ఈ పాలు.''

"బహుశా ఆయన నేను వెతుకుతున్న ఖురైష్ వ్యక్తేనేమో! ఆయన ఎలాగుంటాడో కాస్త నాకు చెబుతావా?''

"ఆయన ఎంతో నీటుగా ఉన్నారు. ముఖం దివ్యమైన తేజస్సుతో వెలిగిపోతూ ఉంది. బలిష్ఠమైన శరీరాకృతి, తేనెలొలికే మాటలు, సంస్కారం ఉట్టిపడుతోంది. మనిషి మరీ అంత లావుగా, మరీ అంత సన్నగా గాకుండా మధ్యరకంగా ఉన్నాడు. పొట్ట బయటకు వచ్చి, తల వెంట్రుకలు చిందరవొందరగా లేవు. నల్లని పద్మాల్లాంటి కళ్ళు. మొహంలో హుందాతనం ఉట్టిపడుతుంది. ఆయన మాట్లాడుతుంటే ముత్యాలు రాలుతున్నట్లుంది. ఆయనతోపాటు ఇంకోవ్యక్తి కూడా ఉన్నాడు. ఇద్దరూ రెండు లేత కొమ్మల్లాగున్నారు. ఆ రెండు లేత కొమ్మల్లో ఒక కొమ్మ తాజాగా ఉండి చూసేవారి కళ్ళను కట్టిపడేస్తున్నది. ఆయన చుట్టూ అనుచరులు ఆయన ఆదేశం కోసం ఎదురుచూస్తూ ఉంటారు. ఆయన

www.abulhasanalinadwi.org

ఆజ్ఞాపించిందే తడవుగా దాన్ని పాలించటానికి పరుగులు తీస్తారు. ఆయన తన అనుచరులకు ఆరాధ్యుడిలా ఉన్నాడు. ఆయన వదరుబోతు కాదు, అలా అని మరీ మితభాషీ కాదు."

ఈ వర్ణన అంతా విని ఆమెభర్త "ఆయన తప్పకుండా ఖురైష్ మనిషే అయి ఉంటాడు. నేనాయన్ని తప్పకుండా కలుసుకుంటాను" అని అన్నాడు.[1]

దైవప్రవక్త (సల్లం) యస్రిబ్ వెళుతుండగా దారిలో ఆయనకు బురైదా అస్లమీ కలిశాడు. ఇతను తన తెగకు నాయకుడు. దైవప్రవక్తను పట్టితెచ్చినవారికి నూరు ఒంటెల పారితోషికం ఇస్తామని ఖురైషులు ప్రకటించగా బురైదా ఆ పారితోషికానికి లాలూచీపడి దైవప్రవక్త అన్వేషణలో బయలుదేరాడు. కాని అతను దైవప్రవక్త (సల్లం)కు తారసపడి ఆయనతో సంభాషించిన తరువాత అతను తన డెబ్భైమంది సహచరుల సమేతంగా ఇస్లాం స్వీకరించాడు. తన తలపాగా తీసి ఈటెకు కట్టాడు. అది గాలిలో రెపరెపలాడుతూ శాంతి ప్రదాత, న్యాయ విధాత వస్తున్నాడనే శుభవార్తను అందజేయసాగింది.[2]

ఆ తరువాత ఆయనకు జుబైర్ బిన్ అవ్వామ్ కలిశారు. ఆయన సిరియా నుండి వస్తున్నారు. ఆయనతో పాటు ముస్లింల వర్తక బిడారు కూడా ఉంది. ఆయన దైవప్రవక్త(సల్లం), అబూబక్ర్‌లకు కానుకగా తెల్లని వస్త్రాలు సమర్పించుకున్నారు.[3]

## మదీనాలో దైవప్రవక్త (సల్లం)కు స్వాగతం

దైవప్రవక్త (సల్లం) వస్తున్నారని మదీనా వాసులకు ముందే తెలిసింది. నగరమంతా కళ్ళు కాయలు చేసుకొని ఆయన రాకకోసం ఎదురుచూడసాగింది. చిన్న చిన్న పిల్లలు కూడా ఎంతో గర్వంతో, ఉత్సాహంతో దైవప్రవక్త (సల్లం) వస్తున్నారని చెప్పుకుంటూ తిరిగేవారు.

---

1) ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటి తొమ్మిదోపుట. తబఖాత్ ఇబ్నె సాద్ మొదటి సంపుటి 230వ పుట. జాదుల్ మఆద్ మూడవ సంపుటి 56వ పుట.
2) జహబీగారి అస్సీరతున్నబవియ్యా 228వ పుట.
3) సహీహ్ బుఖారీలోని మహిమోన్నతల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

ప్రజలు పెందలాడే నగరం వెలుపలికి వెళ్ళి దైవప్రవక్త రాకకోసం ఎదురుచూసేవారు. మధ్యాహ్నం వరకు ఎదురుచూసి నిరాశతో వెనుతిరిగి వెళ్ళిపోయేవారు. ఒకరోజు అలాగే మధ్యాహ్నం దాకా ఎదురుచూసి తిరిగి వెళుతుండగా కోటపై నుంచొని ఉన్న ఓ యూదుడు దూరం నుండి ఓ సమూహం రాకను గమనించి అది దైవప్రవక్త బృందమేనని గ్రహించి, గట్టిగా కేకపెట్టి పిలుస్తూ,"... అరబ్బులారా! అదిగో మీరు ఎదురుచూస్తున్న వ్యక్తి వస్తున్నాడు'' అని అన్నాడు. ఆ మాట వినగానే నగరమంతా ఒక్కసారిగా 'అల్లాహు అక్బర్' అనే నినాదాలతో ప్రతిధ్వనించింది. అన్సార్లు ఆయుధాలు ధరించి ఇండ్లనుండి బయటికి వచ్చారు. అప్పటి వరకూ మదీనాలోని ముస్లింలలో చాలామంది దైవప్రవక్త (సల్లం)ను చూడలేదు. దైవప్రవక్త (సల్లం) అబూబక్ర్(రజి) తో పాటు కలిసి వస్తుండటంతో వాళ్ళిద్దరిలో దైవప్రవక్త ఎవరో మదీనావాళ్ళు పోల్చుకోలేకపోతున్నారు. అబూబక్ర్ (రజి) వారి సందిగ్ధ పరిస్థితిని అర్థం చేసుకొని వెంటనే ఆయన దైవప్రవక్త (సల్లం)కు గొడుగుపట్టారు. మదీనాకు మూడు మైళ్ళదూరంలో ఎత్తుగానున్న ప్రాంతాన్ని 'అలియా', 'ఖుబా' అని పిలిచేవారు. అక్కడ అన్సార్లకు చెందిన అనేక తెగలుండేవి. వాటిలో అత్యంత ప్రముఖమైన తెగ అమ్ర్ బిన్ ఔఫ్ తెగ. కుల్సూమ్‌బిన్ హదమ్ ఈ తెగకు నాయకులు. దైవప్రవక్త(సల్లం) వారి దగ్గరికి వెళ్ళగానే వారు మితిమీరిన ఆనందంతో 'అల్లాహు అక్బర్' అంటూ నినదించారు. దైవప్రవక్త (సల్లం)కు తొలుత అతిథిమర్యాదలు చేసే భాగ్యం ఆ తెగవారికే దక్కింది. ఆయన వారి దగ్గర బసచేశారు. అన్సార్లు తండోపతండాలుగా అక్కడికి వచ్చి గౌరవంతో, వినమ్రతతో ఆయనకు సలాములు చేయసాగారు.[1]

## ఖుబా మస్జిద్ నిర్మాణం

దైవప్రవక్త (సల్లం) ఖుబా ప్రాంతంలో బసచేసిన తరువాత ఆయన మొట్టమొదటగా ఓ మస్జిద్ నిర్మాణ కార్యక్రమం చేపట్టారు. కుల్సూమ్ దగ్గర కొంత బంజరు భూమి ఉంది. అందులో కుల్సూమ్ తెగవారు ఖర్జూరాలు ఎండబెట్టేవారు. దైవప్రవక్త (సల్లం) ఆ స్థలంలోనే తన

1) సహీహ్ బుఖారీ మహిమోన్నతల ప్రకరణం. తుబఖాత్ ఇబ్నెసాద్ మొదటి సంపుటి 233వ పుట.

www.abulhasanalinadwi.org

పుణ్యహస్తాలతో మస్జిద్ నిర్మాణానికి పునాదివేశారు. ఆ మస్జిద్ గొప్పదనం గురించి దివ్యఖురాన్‌లో ఇలా చెప్పబడింది.

> "తొలిరోజు నుండి భయభక్తులు పునాదిగా స్థాపించబడిన మస్జిదే నీవు (ఆరాధన కొరకు) నిలబడటానికి తగినది. అందులో పరిశుద్ధంగా ఉండటానికి యిష్టపడేవారు ఉన్నారు. అల్లాహ్‌కు పరిశుద్ధతను పాటించేవారు అంటేనే ఇష్టం." (అత్ తౌబా: 108)

మస్జిద్ నిర్మాణంలో తన అనుచరులతో పాటు దైవప్రవక్త(సల్లం) కూడా పనిచేశారు. పెద్ద పెద్ద బండరాళ్ళను మోసి ఆయన బాగా అలసిపోయేవారు. అప్పుడు అనుంగు అనుచరులు ఆయన దగ్గరికొచ్చి "దైవప్రవక్తా! మా తల్లిదండ్రుల్ని మీకోసం అర్పింతు! మీరు కూర్చోండి ఆ పని మేము చేసుకుంటాం" అనేవారు. ఆయన వాళ్ళ విన్నపాన్ని మన్నించేవారు. కాని కాసేపయిన తరువాత మళ్ళీ రాళ్ళుమోయటం ప్రారంభించేవారు.[1] పనిచేస్తున్న వారిలో అబ్దుల్లాహ్ బిన్ రవాహా కూడా ఉన్నారు. ఆయన మంచి కవి. సహచరుల్లో అలసటను తగ్గించటానికి ఆయన పనిచేస్తున్నప్పుడు 'మస్జిద్ నిర్మించేవాడు, నిత్యం ఖురాన్ పారాయణం చేసేవాడు, రాత్రిళ్ళు జాగారం చేసేవాడు ముక్తి పొందాడు' అంటూ గీతాలాపన చేసేవారు. దైవప్రవక్త (సల్లం) కూడా ఆయనతో స్వరం కలిపి ఆలాపించేవారు.[2]

## మదీనాలో మొట్ట మొదటి జుమా నమాజు

మదీనాకు వలసవచ్చిన తరువాత రబీవుల్ అవ్వల్ పన్నెండో తేదీ శుక్రవారం నాడు దైవప్రవక్త (సల్లం) ఖుబా ప్రాంతం నుండి బయలుదేరి బనూసాలిమ్ తెగవారి ఇండ్ల దగ్గరికి వచ్చేసరికి జుమా ఆరాధనకు సమయమయింది. ఆయన (సల్లం) అక్కడే వందమంది అనుచరులతో పాటు జుమా (శుక్రవారం) నమాజ్ చేశారు. ఇది ఇస్లామీయ చరిత్రలో

1) వఫావుల్ వఫా - తబ్రానీ సౌజన్యంతో - మొదటి సంపుటి 180వ పుట.
2) వఫావుల్ వఫా మొదటి సంపుటి 181 వ పుట. ఇబ్నె అబీషైబా సౌజన్యంతో

www.abulhasanalinadwi.org

తొట్టతొలి జుమా నమాజు.[1] ఆ సందర్భంగా దైవప్రవక్త (సల్లం) ప్రజలనుద్దేశించి ఈ విధంగా ఉపన్యసించారు:

"ప్రశంసలన్నీ అల్లాహ్‌కే శోభిస్తాయి. నేను ఆయన్నే స్తుతిస్తున్నాను. సహాయాన్ని, మన్నింపును, సన్మార్గాన్ని ప్రసాదించమని ఆయన్నే వేడుకుంటున్నాను. నేను ఆయన్నే విశ్వసిస్తున్నాను. నేనెన్నటికీ ఆయన పట్ల అవిధేయతకు పాల్పడను. పైగా ఆయన అవిధేయులపట్ల శత్రుత్వానికి పూనుకుంటున్నాను. అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడనీ, ఆయనకు సాటిరాగల వారెవ్వరూ లేరని, ముహమ్మద్ ఆయన దాసుడు, ప్రవక్త అని సాక్ష్యమిస్తున్నాను. ఆయనే ముహమ్మద్‌కు సన్మార్గాన్ని, జ్యోతిని, హితబోధను ప్రసాదించి ఎన్నో తరాల తరువాత జ్ఞానం క్షీణించి, మార్గభ్రష్టత్వం పెచ్చరిల్లిన తరుణంలో, ప్రళయం సమీపిస్తున్న కాలంలో పంపాడు. దేవునికి, దైవప్రవక్తకు విధేయత చూపినవాడే సన్మార్గం పొందుతాడు. వారి ఆజ్ఞల్ని ధిక్కరించినవాడు భ్రష్టుపట్టిపోతాడు, అధోగతి పాలౌతాడు, అపమార్గానికి లోనవుతాడు.

"ముస్లింలారా! నేను మిమ్మల్ని దైవానికి భయపడుతూ ఉండమని ఆదేశిస్తున్నాను. ప్రతి ముస్లిం తోటి ముస్లింకు పరలోక జీవితం గురించి ప్రేరేపించాలి. దైవభీతిని అలవరచుకోమని చెప్పాలి. ఒక ముస్లిం సాటి ముస్లింకు చెయ్యగల గొప్పహితబోధ ఇదే! ప్రజలారా! దేవుడు మీకు దూరంగా ఉండమని ఆదేశించిన విషయాలకు దూరంగా ఉండండి. దాన్ని మించిన గొప్పహితవుగాని, దైవధ్యానంగాని మరొకటి లేదు. ఒక విషయం గుర్తుంచుకోండి! దైవానికి భయపడి పనిచేసేవాడికి పరలోక జీవితంలో అతను పాటించిన 'దైవభీతి' అతనికి ఎంతగానో తోడ్పడుతుంది.

1) బైహఖీగారి దలాయిలున్నుబువ్వా రెండవ సంపుటి 500వ పుట. జాదుల్ మఆద్ మూడవ సంపుటి 59వ పుట.

www.abulhasanalinadwi.org

అంతరంగికంగాను, బాహ్యపరంగానూ దేవునితో తన వ్యవహారాన్ని చిత్తశుద్ధితో సజావుగా ఉంచుకున్న వాడికోసం ఇహలోకంలో అది ఆరాధనగా పరిణమిస్తుంది. మరణానంతరం దాని పుణ్యం నిక్షేపంగా ఉంచబడుతుంది. కాని అలా చెయ్యనివాడు మరణానంతరం తన ఆచరణలు తనకు దూరంగా ఉండటమే మంచిదనుకుంటాడు. దేవుడు మిమ్మల్ని తన గురించి భయపెడుతున్నాడు. ఆయన తన దాసులపట్ల విపరీతమైన ప్రేమాభిమానాలు కల్గివున్నవాడు. దైవాజ్ఞల్ని నిజమని ధృవీకరించి, ఆయన వాగ్దానాలను నెరవేర్చేవాడి గురించి చెబుతూ దేవుడు, "మేము ఆడిన మాట తప్పము. మేము మా దాసులకు అన్యాయం చేసేవాళ్ళం కాము" అని అంటున్నాడు.

"ముస్లింలారా! మీరు చేసిన, చేయబోయే పనుల్లో, అంతరంగిక, బాహ్యకార్యకలాపాలన్నిటిలో దైవభీతిని దృష్టిలో పెట్టుకోండి. ఎందుకంటే దైవానికి భయపడేవారి పాపాలను మన్నించటం జరుగుతుంది. వారి ప్రతిఫలం వృద్ధి చెందుతుంది. వారు ఉన్నతాశయాలను పొందుతారు. ఈ దైవభీతే మనిషి నుండి దైవవిరక్తిని, దైవశిక్షను, దైవాగ్రహాన్ని దూరం చేస్తుంది. ముఖాన్ని జ్యోతిర్మయం చేస్తుంది. దేవుడు ప్రసన్నుడయ్యేలా చేసి పదోన్నతిని కల్పిస్తుంది. ముస్లింలారా! ధనం సంపాదించండి. కాని దేవుని హక్కుల్ని మాత్రం విస్మరించకండి. దానికోసమే దేవుడు మీకు గ్రంథాన్ని బోధించాడు, సన్మార్గాన్ని చూపించాడు. ఆ విధంగా నిజాయితీపరుల్ని, అసత్యవాదుల్ని వేరుపరచాడు. ప్రజలారా! దేవుడు మీపట్ల ఉత్తమంగా వ్యవహరించాడు. కాబట్టి మీరు కూడా ప్రజలతో అలాగే వ్యవహరించండి. దైవవిరోధుల్ని తమ విరోధులుగా భావించండి. దైవమార్గంలో పూర్తి ఏకాగ్రతతో, ధైర్యంతో పాటుపడండి. ఆ దేవుడే మిమ్మల్ని పుణ్యాత్ములుగా పుట్టించి

మీకు 'ముస్లింలు' అనే పేరు పెట్టాడు. దానివల్ల చనిపోయేవాడు స్పష్టమైన నిదర్శనాలను చూసి చనిపోతున్నాడు. బ్రతికున్నవాడు కూడా ఆ స్పష్టమైన నిదర్శనాలకు అనుగుణంగానే జీవితం గడుపుతున్నాడు. సత్కార్యాలన్నీ దైవసహాయంతోనే ఉనికిలోకి వస్తాయి. ప్రజలారా! దైవధ్యానం చెయ్యండి. రాబోయే పరలోక జీవితం కోసం మంచిపనులు చేసుకోండి. ఎవరయినా దేవునితో తన వ్యవహారాన్ని చక్కబెట్టుకుంటే దేవుడు అతనికి-ప్రజలకూ మధ్య జరిగే వ్యవహారాలను చక్క బెడతాడు. జాగ్రత్త! దేవుడు తన దాసులపై అధికారం చెలాయిస్తాడు. కాని దాసులు మాత్రం ఆయనపై ఎలాంటి అధికారాన్ని చెలాయించలేరు. దేవుడు దాసులందరికీ యజమాని. కాని దాసులకు ఆయనపై ఎలాంటి అధిక్యం లేదు. దేవుడు అందరికన్నా గొప్పవాడు. పుణ్యకార్యాలు చేసుకునే శక్తి మనకు ఆ మహోన్నతుని ద్వారానే లభిస్తుంది.[1]

## అబూ అయ్యూబ్ అన్సారీ (రజి) ఇంట్లో బస

దైవప్రవక్త (సల్లం) మదీనా నగరానికి వస్తున్నారని తెలియగానే ప్రజలు ఆయనకు ఎదురెళ్ళి స్వాగతం పలకటానికి సంతోషంతో పరుగెత్తుకొచ్చారు. ఖుబా నుండి మదీనా వరకు తోవకిరుప్రక్కలా ఆయన ప్రాణానికి ప్రాణం ఇచ్చే అనుచరులు బారులు తీరి నించొని ఉన్నారు. దారిలో ఎన్నో అన్సార్ తెగలు ఎదురయ్యాయి. ప్రతి తెగవారూ ఆయన ముందుకు వచ్చి, "దైవప్రవక్తా! ఈ ఇల్లు, ఈ ధనం, ఈ ప్రాణాలు మీ సేవకోసం సిద్ధంగా ఉన్నాయి. మీరు మా దగ్గరే ఉండిపోండి" అని అభ్యర్థించసాగారు. దైవప్రవక్త (సల్లం) వారి అభ్యర్థనను నగుమోముతో నిరాకరించేవారు. వారికి మేలు జరగాలని ప్రార్థిస్తూ తన ఒంటె ఎక్కడ ఆగితే అక్కడే దిగుతానని, తన ఒంటెకు దేవుని తరఫు నుండి ఆదేశం అయ్యిందని చెప్పేవారు. ఆ విధంగా మదీనాలోని ఐదు ప్రముఖ తెగల

1) తారీఖె తబ్రీ రెండవ సంపుటి 807వ పుట.

www.abulhasanalinadwi.org

నాయకులు ఆయనకు ఆతిథ్యం ఇవ్వటానికి ముందుకు వచ్చారు. కాని వారందరికీ ఆయన (సల్లం) అదే సమాధానమిచ్చారు.[1] నగర సమీపానికి చేరుకోగానే అమ్మాయిలు ఇండ్ల కప్పుల పైకెక్కి ఆనంద పరవశంతో పాటలు పాడసాగారు.

"పూర్ణచంద్రుడు ఉదయించాడు
వీడ్కోలు కనుమల నుండి
ప్రార్థించేవారు ప్రార్థిస్తున్నంత వరకు
కృతజ్ఞత పాటించటం మనపై విధి"[2].....

నజ్జార్ తెగ అమ్మాయిలు డప్పు వాయిస్తూ,
"మేము నజ్జార్ తెగ బాలికలం
ముహమ్మద్ ఎంతో మంచి మిత్రులు!"

-అని ఆలాపించసాగారు.

దైవప్రవక్త (సల్లం) ఆ అమ్మాయిలనుద్దేశించి "మీరు నన్ను అభిమానిస్తున్నారా?" అని అడిగారు. వారు 'అవున'న్నారు. అయితే నేను కూడా మిమ్మల్ని అభిమానిస్తున్నాను" అని ఆయన(స) అన్నారు.[3]

ఇప్పటి మస్జిదె నబవీకి ఆనుకొని అబూ అయ్యూబ్ అన్సారీ (రజి) ఇల్లు ఉండేది. దైవప్రవక్త గారి ఒంటె ఆయన ఇంటి ముందే ఆగింది. ఆయన ఇల్లు రెండంతస్థుల కట్టడమవటం చేత పై అంతస్థును ఆయన దైవప్రవక్త (సల్లం)కు సమర్పించుకున్నారు. కాని దైవప్రవక్త (సల్లం) మాత్రం సందర్శకుల సౌలభ్యం కోసం క్రింది అంతస్థులో ఉండటానికే యిష్టపడ్డారు.[4]

అబూ అయ్యూబ్(రజి) దైవప్రవక్త (సల్లం)కు రెండుపూటలా భోజనం పంపించేవారు. దైవప్రవక్త (సల్లం) తిని వదలిన భోజనాన్ని తను,

1) దలాయిలున్నుబువ్వా రెండవ సంపుటి 503, 504వ పుట.
2) దలాయిలున్న బువ్వా రెండవ సంపుటి 506, 507వ పుట
3) దలాయిలున్న బువ్వా రెండవ సంపుటి 508వ పుట; ఫత్‌హుల్ బారీ ఏడవ సంపుటి 261వ పుట.
4) ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటి 460వ పుట. ఇమామ్ జహబీ ఈ హదీసును ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. సీరత్ ఇబ్నెహిషామ్ మొదటి సంపుటి 498 వ పుట.

www.abulhasanalinadwi.org

తన భార్య కలిసి తినేవారు. శుభం కలుగుతుందన్న ఆశతో దైవ ప్రవక్త వ్రేళ్ళ ముద్రలు పడిన చోటే తానూ వ్రేళ్ళు ఉంచి తినేవారు.[1]

ఒకరోజు అనుకోకుండా పై అంతస్థులో ఓ నీళ్ళపాత్ర పగిలిపోయింది. నీళ్ళు క్రింది అంతస్థులోకి కారి దైవప్రవక్త (సల్లం)కు ఇబ్బంది కలిగే సూచనలు కనిపించాయి. అప్పుడు అబూ అయ్యూబ్ దగ్గర కప్పుకోవటానికి ఉపయోగించే ఒకే ఒక దుప్పటి ఉంది. ఆయన ఆ దుప్పటితోనే నీళ్ళు క్రిందికి జారిపోకుండా తుడిచేశారు.[2]

## మస్జిదె నబవీ ఇంకా ఇతర ఇండ్ల నిర్మాణం

మదీనాకు వచ్చిన తరువాత దైవప్రవక్త (సల్లం)కు అన్నిటికన్నా ముందు ఒక దైవగృహాన్ని నిర్మించాల్సిన అవసరం ఏర్పడింది. అప్పటి వరకు ఆయన పశువుల కొట్టంలో నమాజ్ చేసేవారు. ధాన్యాగారానికి సమీపంలో నజ్జార్ తెగవారికి చెందిన కొంతభూమి ఉండేది. ఆ స్థలంలో సమాధులు, ఖర్జూర చెట్లుండేవి. దైవప్రవక్త (సల్లం) ఆ తెగ వారిని పిలిచి, "నేనీ భూమిని ధర చెల్లించి తీసుకోవాలనుకుంటున్నాను" అని అన్నారు. దానికి వారు, "మేము దీని ధర తీసుకోవటానికి సిద్ధమే.కాని మీ నుండి కాదు, దేవుని నుండి తీసుకుంటాము" అన్నారు. అసలు ఆ భూమి ఇద్దరు అనాథ పిల్లలది. అంచేత దైవప్రవక్త (సల్లం) ఆ ఇద్దరు పిల్లల్ని పిలిపించారు. ఆ పిల్లలు కూడా తమకున్న ఆ కొంత ఆస్తిని దైవం కోసం విరాళంగా ఇస్తామన్నారు. అనాధ పిల్లల ఆస్తిని విరాళంగా స్వీకరించడానికి దైవప్రవక్త(సల్లం)కు మనసొప్పలేదు. అంచేత అబూ అయ్యూబ్ చేత వారికి దాని పైకం ఇప్పించారు. ఆ స్థలంలో ఉన్న సమాధుల్ని కూల్చి నేలను చదును చేయటం జరిగింది. ఆ తరువాత మస్జిద్ నిర్మాణం మొదలయ్యింది. ఆ సమయంలో దైవప్రవక్త (సల్లం) కూడా ఒక కార్మికుడిలా పనిచేశారు. ఆయన అనుచరులు మస్జిద్ కోసం రాళ్ళు మోస్తూ కవితలు పాడేవారు. ఆయన కూడా వారితోపాటు స్వరం కలుపుతూ ఇలా అనేవారు:

1) సీరత్ ఇబ్నెహిషామ్ మొదటి సంపుటి 499వ పుట.
2) ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటి 460వ పుట.

www.abulhasanalinadwi.org

"దేవా! పరలోక విజయమే సిసలైన విజయం.
దేవా! ముహాజిర్లపై, అన్సార్లపై దయజూపు[1]

ఈ మస్జిద్ ఇస్లామీయ నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనం. అందులో ఎలాంటి కృత్రిమ వైభవం గోచరించదు. పచ్చి ఇటుకలతో కట్టిన గోడలు, ఖర్జూర ఆకులతో వేసిన కప్పు, ఖర్జూర చెట్టుమ్రానులే నిట్టరాళ్ళు. అప్పుడు 'ఖిబ్లా' బైతుల్ మఖ్దిస్ వైపు ఉండేది.[2] ఆ తరువాత కొంతకాలానికి 'ఖిబ్లా' కాబావైపుకు మరలించబడినప్పుడు మస్జిదె నబవీకి ఉత్తర దిక్కున ఓ క్రొత్త వాకిలిని నిర్మించడం జరిగింది. మస్జిద్‌లోపల మట్టినేల అవటం చేత వర్షం కురిసినప్పుడు బురద అయ్యేది. ఒకసారి సహచరులు నమాజ్‌కు వచ్చినప్పుడు కంకరమట్టి వెంటతీసుకొచ్చుకొని నేలపై పోసుకొని దానిపై కూర్చొన్నారు. దైవప్రవక్త (సల్లం)కు మట్టినేల కన్నా కంకరనేల నయంగా ఉంటుందనిపించింది. దాంతో ఆయన మస్జిద్‌లోపల అంతా కంకరమట్టి పోయించారు. మస్జిద్ వెలుపల ఒక మూలన పైన పాకవేయబడిన ఒక అరుగుని నిర్మించారు. దాన్ని 'సుఫ్ఫా' అనేవారు. నిరాశ్రయులైన ముస్లింలు సుఫ్ఫా నీడలో తలదాచుకునేవారు. మస్జిదె నబవీ నిర్మాణం పూర్తయిన తరువాత ఆయన దాని ప్రక్కనే తన సతీమణులకోసం చిన్న చిన్న కుటీరాలు కట్టించారు. ఆ సమయంలో ఆయన వివాహబంధంలో హజ్రత్ సౌదా (రజి. అన్హా), హజ్రత్ ఆయిషా (రజి. అన్హా) మాత్రమే ఉన్నారు. అంచేత రెండు ఇళ్ళే కట్టించారు. ఆ తరువాత సతీమణుల సంఖ్య పెరిగిన కొద్దీ వారికోసం వేర్వేరుగా కుటీరాలు కట్టించేవారు. ఆ కుటీరాలు కూడా పచ్చి ఇటుకలతో చేసినవే. వాటిలో ఐదు కుటీరాలు ఖర్జూర తడికలతో చేసినవి. ఇటుక ఇండ్లలో కూడా గోడలకు బదులు తడికలే ఉండేవి. ఉమ్మె సలమా, ఉమ్మె హబీబా, జైనబ్, జువైరియా, మైమూనా, జైనబ్ బిన్తె జహష్‌ల కుటీరాలు సిరియా దిక్కున ఉండేవి. ఆయిషా, సఫియా, సౌదా (రజి. అన్హా)ల ఇండ్లు వాటికి వ్యతిరేక దిశలో ఉండేవి. ఈ కుటీరాలు మస్జిదె నబవీకు ఆనుకునే ఉండేవి. దైవప్రవక్త (సల్లం) మస్జిద్‌లో ఏతెకాఫ్

1) సీరతున్నబీ మొదటి సంపుటి 280, 281వ పుటలు. సహీహ్ బుఖారీ, అబూదావూద్ సౌజన్యంతో.
2) జాదుల్ మఆద్ మూడవ సంపుటి 63వ పుట.

www.abulhasanalinadwi.org

పాటించినప్పుడు ఆయన తన తల (మస్జిద్‌లోనుండి) బయటికి వంచితే సతీమణులు తమ ఇంట్లో కూర్చునే ఆయన తల దువ్వగలిగేవారు. ఈ కుటీరాలు దాదాపు ఆరేడు గజాల వెడల్పు, పది గజాల పొడవు ఉండేవి. మనిషి నిలబడి చేత్తో అందుకోగల అంత ఎత్తులో పై కప్పు ఉండేది. గుమ్మాలకు గొంగళ్ళు వ్రేలాడబడి ఉండేవి.[1]

దైవప్రవక్త (సల్లం) ఇళ్ళల్లో రాత్రిపూట దీపాలు వెలిగేవి కావు.[2] ఆయనకు పొరుగున ఉండే అన్సార్లలో సాద్ బిన్ ఉబాదా. సాద్ బిన్ ముఆజ్, ఉమారా బిన్ హరమ్, అబూ అయ్యూబ్(రజి)లు బాగా ధనవంతులు. వీళ్ళు దైవప్రవక్త(సల్లం)కు పాలు పంపేవారు. ఆయన (సల్లం) ఆ పాలతోనే రోజులు వెళ్ళబుచ్చేవారు. సాద్‌బిన్ ఉబాదా దైవప్రవక్త (సల్లం)కు రాత్రి భోజనం కోసం రోజూ ఓ పెద్ద పాత్ర నిండా ఆహార పదార్థాలు పంపాలని నియమం పెట్టుకున్నారు. దాని ప్రకారం ఆయన అందులో కూరలు, పాలు, నెయ్యి మొదలగు తినే వస్తువులు పంపేవారు.[3] అనస్ (రజి) గారి తల్లి అయిన ఉమ్మెసులైమ్ తన ఆస్తిపాస్తులన్నీ దైవప్రవక్త(సల్లం)కు సమర్పించుకుంది. ఆయన వాటిని స్వీకరించి తన దాది అయిన ఉమ్మె ఐమన్‌కు ఇచ్చేసి తాను మాత్రం నిరుపేదగా ఉండటానికే ఇష్టపడ్డారు.[4]

## అజాన్ ఆదేశం

ఇస్లామీయ ఆరాధనలన్నీ ఏకత్వాన్ని, ఐకమత్యాన్ని బోధిస్తాయి. కాని దైవప్రవక్త (సల్లం) మదీనాకు వచ్చిన తరువాత కూడా ముస్లింలందర్నీ ఏకకాలంలో మస్జిద్‌లో సమీకరించటానికి ఓ నియమిత పద్ధతంటూ లేని కారణంగా అప్పటి వరకు సామూహిక నమాజ్‌కు ఎలాంటి ఏర్పాట్లు జరగలేదు. ప్రజలు తమకు తోచినప్పుడు మస్జిద్‌కు వచ్చి నమాజ్ చేసుకొని వెళ్ళిపోయేవారు. కాని అందరూ కలిసి సామూహికంగా నమాజ్ చేసేవారు

---

1) అల్లామా షిబ్లీ నూమానీగారి సీరతున్నబీ గ్రంథం మొదటి సంపుటి 281, 282 పుటలు. తబఖాత్ ఇబ్నెసాద్ మరియు వఫాపుల్ వఫా సౌజన్యంతో

2) సహీహ్ బుఖారీ నమాజ్ ప్రకరణం

3) తబఖాత్ ఇబ్నెసాద్ మహిళల ప్రకరణం 112వ పుట

4) సహీహ్ బుఖారీలోని స్వయం సమర్పణ ప్రకరణం

www.abulhasanalinadwi.org

కాదు. దైవప్రవక్త(సల్లం)కు ఈ పద్ధతి నచ్చలేదు. నమాజ్ వేళ అవగానే ప్రజలందరినీ పిలుచుకురావటానికి కొంతమందిని ఆ పనికోసం నియమించాలనుకున్నారు. కాని అది చాలా కష్టమైన పని. అంచేత ఆయన తన అనుచరులందరినీ పిలిచి ఈ విషయంలో తనకు సలహా ఇవ్వమని కోరారు. ఆ సందర్భంగా పలువురు పలువిధాలుగా ఆయనకు సలహాలిచ్చారు. ఒకాయన నమాజ్ వేళ అవగానే మస్జిద్‌పైన ఓ ఎత్తైన జెండా ఎగరేస్తే, ప్రజలు దాన్ని చూసి నమాజ్‌కు వస్తారని తన అభిప్రాయం వెలిబుచ్చాడు. ఆయన(సల్లం)కు ఈ సలహా నచ్చలేదు. యూదులు, క్రైస్తవులు తమ ఆరాధనల కోసం చేసే ప్రకటనల గురించి కూడా ఆ సమావేశంలో చర్చించటం జరిగింది. చివరికి ఆయనకు హజ్రత్ ఉమర్ (రజి) ఇచ్చిన సలహా నచ్చింది. దాని ప్రకారం ఆయన బిలాల్ (రజి)ని 'అజాన్' ఇవ్వమని ఆదేశించారు.[1] ఈ అజాన్ ద్వారా ప్రజలకు నమాజ్ వేళ అయిందని తెలియపరచటంతో పాటు మరోవైపు రోజుకు ఐదుసార్లు ఇస్లాం ధర్మంవైపుకు పిలుపునిచ్చినట్లవుతుంది.

## ముహాజిర్, అన్సార్ల మధ్య సోదర బంధం

మక్కానుంచి మదీనాకు వలస వచ్చిన ముస్లింలు ఖాళీ చేతులతోనే వచ్చారు. అలా వలసవచ్చిన వారిలో ధనికులు కూడా లేకపోలేదు. అయితే అవిశ్వాసులకు కనపడకుండా రహస్యంగా బయలుదేరినందువల్ల తమవెంట ఏమీ తీసుకురాలేకపోయారు. మదీనాలోని అన్సార్లు మక్కానుండి వలసవచ్చిన ముస్లింలందరినీ తమ అతిథులుగా భావించేవారు. అయితే ముహాజిర్ల బ్రతుకుతెరవుకోసం కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు జరగవలసిన అవసరం ఏర్పడింది. మరోవైపు ముహాజిర్లు అన్సార్ల కానుకలు, దానధర్మాలపై ఆధారపడదలచుకోలేదు. వారు కాయకష్టం చేసి డబ్బు సంపాదించుకోవాలని అభిలషించేవారు. అయితే ప్రస్తుతం వారి దగ్గర ఏమీలేదు. కనీసం తొడుక్కోవటానికి సరిగ్గా ఒక జత బట్టలు కూడా లేవు. అంచేత దైవప్రవక్త(సల్లం) ముహాజిర్లకు, అన్సార్లకు మధ్య సోదరభావాన్ని నెలకొల్పాలని నిశ్చయించుకున్నారు.

1) సహీహ్ బుఖారీ అజాన్ ప్రకరణం. సహీహ్ ముస్లిం ఇంకా ఇతర ప్రామాణిక గ్రంథాలలో కూడా ఈ సంఘటన ప్రస్తావనకు వచ్చింది.

www.abulhasanalinadwi.org

మస్జిదెనబవీ నిర్మాణం పూర్తవుతున్నప్పుడు ఆయన (సల్లం) అన్సార్లందరినీ పిలిచారు. అప్పటికి హజ్రత్ అనస్(రజి) వయసు పదేండ్లు. ప్రజలంతా వారి ఇంట్లోనే సమావేశమయ్యారు.[1] ముహాజిర్లు మొత్తం నలభై ఐదు మంది ఉన్నారు. దైవప్రవక్త(సల్లం) అన్సార్లను సంబోధిస్తూ. "వీళ్ళు మీ సోదరులు" అన్నారు. ముహాజిర్ల నుండి ఒక వ్యక్తి, అన్సార్ల నుండి ఒక వ్యక్తిని పిలిచి "మీరిద్దరూ అన్నదమ్ములు" అని చెప్పేవారు. ఇక ఆపై వాళ్ళిద్దరూ పరస్పరం సొంత అన్నదమ్ముల్లాగానే వ్యవహరించుకునేవారు. అన్సార్లు ముహాజిర్లను తమ ఇండ్లకు తీసుకువెళ్ళి తమదగ్గరున్న ప్రతివస్తువులో వారికి సగం పంచి ఇచ్చారు.[2] అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌తో సోదరబంధం ఏర్పడిన సాద్ బిన్ రబీకు ఇద్దరు భార్యలుండేవారు. అబ్దుర్రహ్మాన్‌తో ఆయన "నేను నా ఇద్దరు భార్యల్లో నువ్వు కోరుకున్న ఆమెకు విడాకులిస్తాను. ఆమెను నువ్వు వివాహం చేసుకో" అని అన్నారు. కాని అబ్దుర్రహ్మాన్ పెద్ద మనసుతో దాన్ని నిరాకరించారు.[3]

అన్సార్ల సంపద అంతా ఖర్జూర తోటల రూపంలోనే ఉండేది. వారిదగ్గర డబ్బులు ఉండేవి కావు. అంచేత వారు తమ ఖర్జూర తోటలను తమ సోదరులకు సమానంగా పంచిపెట్టమని దైవప్రవక్త (సల్లం)ను కోరారు. ముహాజిర్లు వ్యాపారస్తులు. వారికి వ్యవసాయం చేయటం రాదు. అంచేత దైవప్రవక్త (సల్లం) ముహాజిర్ల తరపు నుండి అన్సార్ల విన్నపాన్ని నిరాకరించారు. అప్పుడు అన్సార్లు వ్యవసాయపు పనంతా తామే చేసుకొని, పండిన పంటలో ముహాజిర్లకు సగం ఇస్తామన్నారు. ముహాజిర్లు దానికి ఒప్పుకున్నారు.[4] ఆ విధంగా దైవప్రవక్త (సల్లం) వారిమధ్య ఏర్పరచిన సోదరత్వం నిజమైన సోదరత్వంగా విరాజిల్లింది. ఏ అన్సార్ ముస్లిం అయినా చనిపోతే అతని ఆస్తులన్నీ ముహాజిర్ సోదరునికి లభించేవి. అతని సొంత అన్నదమ్ములకు కూడా అతని ఆస్తిలో ఏమీ లభించేది కాదు. ఈ క్రింది దివ్యఖురాన్ సూక్తికి ఆచరణరూపమే అన్సార్-ముహాజిర్ల సహోదరీకరణ:

1) జాదుల్ మఆద్ మూడవ సంపుటి 63వ పుట.
2) షిబ్లీ గారి సీరతున్నబీ గ్రంథం మొదటి సంపుటి 245వ పుట. ఇబ్నె హిషామ్ గారి సీరత్ గ్రంథం మొదటి సంపుటిలో 504 నుండి 507 పుటల వరకు.
3) సహీహ్ బుఖారీ మహిమోన్నతల ప్రకరణం
4) సహీహ్ బుఖారీ, మహిమోన్నతల ప్రకరణం

www.abulhasanalinadwi.org

"విశ్వాసాన్ని స్వీకరించి వలసపోయినవారూ, అల్లాహ్ మార్గంలో తమ ప్రాణాలనూ, తమ సంపదలనూ ఒడ్డి పోరాడిన వారూ, వలసవచ్చిన వారికి ఆశ్రయమిచ్చి సహాయం చేసినవారూ-వారే అసలు పరస్పరం స్నేహితులు, సంరక్షకులూను." బద్ర్ యుద్ధం తరువాత ముహాజిర్లు ఆర్థికంగా కాస్త కోలుకున్నారు. అప్పుడు ఈ సూక్తి అవతరించింది:

"రక్త సంబంధం కలవారు పరస్పరం ఎక్కువ హక్కుదారులు"
(అల్ అన్ ఫాల్:75)[1]

అన్సార్లు ప్రదర్శించిన త్యాగాన్ని, ఔదార్యాన్ని ప్రపంచం ఎన్నటికీ మరిచిపోలేదు. అదిసరే; కాని మరోవైపు ముహాజిర్ల ఆత్మవిశ్వాసం ఎంతగొప్పదో చూడండి. సాద్ బిన్ రబీ, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌తో తన సంపదలో ప్రతి వస్తువు నుండి సగం ఆయనకు తీసుకోమన్నారు. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, ఆయన సమర్పణను సున్నితంగా త్రోసిపుచ్చుతూ, "దేవుడు మీ సంపదలో శుభాన్ని ప్రసాదించుగాక! నాకు దాని అవసరం లేదు. మీరు నాకు కాస్త సంతకు వెళ్ళే దారి చూపించండి" అన్నారు. సాద్ బిన్ రబీ ఆయనకు పేరెన్నికగన్న ఖైనుఖా సంతకువెళ్ళేదారి చూపించారు. ఆయన కొంత నెయ్యి, కొంత జున్ను తీసుకొని వెళ్ళి ఆ సంతలో అమ్ముకోవటం ప్రారంభించారు. కొన్ని రోజుల తరువాత బాగా డబ్బు సంపాదించి పెళ్ళికూడా చేసుకున్నారు.[2] అంచెలంచెలుగా తన వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకున్నారు. "ఆ కాలంలో నేను మట్టి పట్టుకున్నా అది బంగారమయ్యేది. నా వ్యాపారంలో అంతటి శుభాన్ని ప్రసాదించాడు దేవుడు" అని ఆయన స్వయంగా చెప్పుకునేవారు. ఆయన వ్యాపార సామగ్రిని ఏడొందల ఒంటెలు మోయవలసి వచ్చేది. ఆయన వ్యాపార సామగ్రి మదీనాకు వచ్చేరోజు నగరమంతా సందడిగా ఉండేది.[3] కొంతమంది ముహాజిర్ ముస్లింలు దుకాణాలు పెట్టుకున్నారు.

సునుహ్ ప్రాంతంలో అబూబక్ర్(రజి)గారి పరిశ్రమ ఉండేది. అక్కడ ఆయన బట్టల వ్యాపారం చేసేవారు.[4] హజ్రత్ ఉస్మాన్ బనూ ఖైనుఖా

1) సహీహ్ బుఖారీ వ్యాఖ్యానాల ప్రకరణం
2) సహీహ్ బుఖారీ మహిమోన్నతల ప్రకరణం
3) అసదుల్ గాబా మూడవ సంపుటి 314, 315వ పుటలు
4) తబఖాత్ ఇబ్నెసాద్ రెండవ సంపుటి 120వ పుట.

www.abulhasanalinadwi.org

సంతలో ఖర్జూరాలు కొని అమ్ముతుండేవారు. హజ్రత్ ఉమర్ (రజి) కూడా వ్యాపారం మొదలెట్టారు. ఆయన వ్యాపారం దాదాపు ఈరాన్ దాకా విస్తరించింది.[1] ఇతర ముహాజిర్లు కూడా ఇలాగే చిన్నాచితకా వ్యాపారాలు మొదలెట్టారు. సహీహ్ బుఖారీలోని ఒక ఉల్లేఖనంలో ఇలా ఉంది: అబూహురైరా అతి ఎక్కువగా హదీసులు ఉల్లేఖించటంపై ప్రజలు అభ్యంతరం లేవనెత్తగా అందుకాయన. "ఇందులో నా తప్పేముంది. ఇతర అనుచరులు పొలంపనుల్లో, వ్యాపారాల్లో నిమగ్నులై ఉండేవాళ్లు. నేను మాత్రం దైవప్రవక్త(సల్లం)నే అంటిపెట్టుకొని ఉండి ఆయన హదీసుల్ని వింటుండేవాణ్ణి. అందుకే నాకు అందరికన్నా ఎక్కువగా హదీసులు గుర్తున్నాయి" అని అన్నారు.[2]

ఖైబర్ విజయం తరువాత ముహాజిర్లు అన్సార్ల ఖర్జూరతోటలను వారికి వాపసు చేసేశారు. సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణంలో ఇలా ఉంది: దైవప్రవక్త(సల్లం) ఖైబర్ యుద్ధం విజయవంతంగా ఎదుర్కొని మదీనాకు తిరిగి వెళుతున్నప్పుడు ముహాజిర్లు, అన్సార్లు తమకు కానుకగా ఇచ్చిన ఖర్జూర తోటలను వారికి తిరిగి ఇచ్చేశారు. అన్సార్లు తమ ఇండ్ల చుట్టూ ఉన్న ఖాళీ స్థలాల్ని ముహాజిర్లకు ఇళ్ళు కట్టుకోమని ఇచ్చారు. ఖాళీ స్థలాలు లేనివారు తాము నివసించే ఇళ్ళే ఇచ్చేశారు.[3] అన్సార్లు ముహాజిర్ల పట్ల మానవ చరిత్రలోనే అరుదైన, అనన్య సామాన్యమైన సానుభూతిని, త్యాగభావాన్ని ప్రదర్శించారు. ముస్లింలు బహ్రైన్‌ను జయించినప్పుడు దైవప్రవక్త (సల్లం) అన్సార్లందరినీ పిలిచి, "నేను ఈ విజయప్రాప్తిని అన్సార్లకు పంచిపెట్టాలని అనుకుంటున్నాను' ' అని అన్నారు. దానికి వారు, "దైవప్రవక్తా! ముందు మన ముహాజిర్ భాయీలకు కూడా మా దగ్గరున్నంత భూమి ఇవ్వండి. ఆ తరువాతే మేము ఈ విజయప్రాప్తిని తీసుకుంటాం" అని విన్నవించుకున్నారు.[4]

ఒకసారి ఓ ఆకలిగొన్న వ్యక్తి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి 'బాగా ఆకలితో ఉన్నాను. అన్నం పెట్టండి' అని అర్థించాడు. దైవప్రవక్త

1) ముస్నదె అహ్మద్‌లో వీటి ప్రస్తావన ఉంది.
2) సహీహ్ బుఖారీ, విద్యా ప్రకరణం
3) సహీహ్ ముస్లిం: జిహాద్ ప్రకరణం
4) సహీహ్ బుఖారీ అన్సార్ల మహిమోన్నతల ప్రకరణం

www.abulhasanalinadwi.org

(సల్లం) ముందుగా తన ఇంట్లో ఏమైనా ఆహారపదార్థాలున్నాయేమోనని అడిగి చూశారు. మంచినీళ్ళు తప్ప మరేమీ లేదని జవాబు లభించింది. అప్పుడాయన తన సహచరులనుద్దేశించి, "ఇతనికి ఈరోజు ఆతిథ్యమిచ్చేవారు మీలో ఎవరైనా ఉన్నారా?" అని అడిగారు. అబూతల్హా (రజి) లేచి 'నేనిస్తాను దైవప్రవక్తా' అని అన్నారు. ఆయన ఆ అతిథిని తన ఇంటికి వెంటబెట్టుకొని వెళ్ళారు. భార్యనడిగితే పిల్లల అన్నం మాత్రం ఉందని చెప్పింది. అప్పుడాయన తన భార్యతో, "ఈ రాత్రికి పిల్లలు అన్నం అడిగితే ఏదో ఒకటి చెప్పి వాళ్ళని నిద్రపుచ్చు. అతిథికి అన్నం వడ్డించిన తరువాత దీపం ఆర్పెయ్యి. మేము కూడా ఆయనతోపాటు అన్నం తింటున్నట్టు నటిద్దాం" అని అన్నారు. ఆయన భార్య అలాగే చేసింది. ముగ్గురూ అన్నానికి కూర్చున్నారు. అతిథికి కడుపునిండా అన్నంపెట్టి ఆ పుణ్యదంపతులు మాత్రం పస్తులుండిపోయారు. వారి ఔదార్యాన్ని కొనియాడుతూ దేవుడు దివ్యఖురాన్‌లో ఈ సూక్తిని అవతరింపజేశాడు:

> "వారు (అంటే విశ్వాసులు) స్వయంగా అగత్యం కలవారైనప్పటికీ, తమకంటే ఇతరులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు." [1]

## అరుగు వాసులు

మస్జిదె నబవీ వెలుపల ఓ మూలన ఒక అరుగు ఉంది.[2] దైవప్రవక్త సహచరుల్లో చాలామంది ధార్మిక కార్యకలాపాలతో పాటు వ్యాపారం, వ్యవసాయం కూడా చేసేవారు. అయితే కొంతమంది అనుచరులు మాత్రం దైవారాధన, దైవప్రవక్త శిక్షణల కోసం తమ జీవితాన్ని అంకితం చేసుకున్నారు. వారికి భార్యాబిడ్డలు ఉండేవారు కారు. ఒకవేళ వారిలో ఎవరికయినా వివాహమయితే వారు అక్కడినుండి వేరే చోటుకి వెళ్ళి కాపురం పెట్టుకునేవారు. ఈ అరుగువాసుల్లోనే కొంతమంది పగలు అడవికి వెళ్ళి కట్టెలు తెచ్చి అమ్ముకునేవారు. వచ్చిన డబ్బుతో భోజన వసతులు సమకూర్చుకునేవారు. వీరు పగటిపూట దైవప్రవక్త సన్నిధిలో ఉండి ఆయన హితోక్తుల్ని వింటుండేవారు. రాత్రిపూట ఆ అరుగుమీదే పడుకునేవారు.[3]

1) సహీహ్ బుఖారీ అన్సార్ల మహిమోన్నతల ప్రకరణం
2) వఫాఉల్ వఫా మొదటి సంపుటి 321వ పుట
3) సహీహ్ బుఖారీ నాయకత్వ ప్రకరణం

www.abulhasanalinadwi.org

హజ్రత్ అబూహురైరా (రజి) కూడా ఆ అరుగు వాసుల్లోనివారే. కప్పుకునే దుప్పటి, కట్టుకునే లుంగీ. ఈ రెండు వస్త్రాలు ఉన్నవారు వాళ్ళల్లో ఒక్కడు కూడా ఉండడు. ఓ చిన్న దుప్పటిని మెడలో చుట్టికట్టుకునేవారు. అది తొడలదాకా వ్రేలాడుతూ ఉండేది.[1] అన్సార్లు తమ తోటల్లో కాసిన ఖర్జూర గెలలు తెచ్చి అరుగు కప్పుకు తగిలించేవారు. అవి పండి క్రిందపడితే అరుగువాళ్ళు వాటిని ఏరుకొని తినేవాళ్ళు. ఒక్కోసారి రెండేసి రోజుల వరకూ తినడానికి ఏమీ దొరికేది కాదు. దైవప్రవక్త (సల్లం) నమాజ్ చేయిస్తున్నప్పుడు వీళ్లు వెనుక పంక్తుల్లో నించొని ఉండి ఆకలివల్ల, బలహీనతవల్ల నమాజులోనే కళ్ళు తిరిగి పడిపోయేవారు. ఇలా చాలా సార్లు జరిగింది. ప్రజలు వాళ్ళను అలా పడిపోవటం చూసి పిచ్చోళ్ళనుకునేవారు.[2] దైవప్రవక్త (సల్లం) దగ్గరికి ఎవరైనా ఏదయినా సదఖా (దానం చేసిన) ఆహారం పంపిస్తే ఆయన ఆ ఆహారమంతా అరుగువాళ్ళకే ఇచ్చేవారు. అదే ఏమైనా కానుకలు వస్తే వారిని తన దగ్గరికి పిలిపించుకొని తాను కూడా వారితోపాటు కలిసి తినేవారు.[3] సాధారణంగా దైవప్రవక్త (సల్లం) అరుగువాళ్ళను రాత్రిపూట భోజనానికి ముహాజిర్ల, అన్సార్ల వెంట పంపించేవారు. ప్రజలు తమ తాహతును బట్టి వాళ్ళల్లో ఒక్కర్నిగాని, ఇద్దర్నిగాని తమ ఇంటికి భోజనానికి ఆహ్వానించేవారు.[4] హజ్రత్ సాద్‌బిన్ ఉబాదా పెద్ద ధనికులే కాదు, గొప్ప దాత కూడాను. ఒక్కోసారి ఆయన ఎనభై ఇంకా అంతకన్నా ఎక్కువ మంది నిరుపేదల్ని కూడా తన ఇంటికి తీసుకెళ్ళి భోజనం చేయించేవారు.

దైవప్రవక్త (సల్లం) ఏ సందర్భంలోనూ అరుగువాళ్ళను విస్మరించేవారు కారు. ఒకసారి ఆయన కూతురు ఫాతిమా (రజి.అన్హా) ఆయన దగ్గరికొచ్చి, "పనిచేసి చేసి నా చేతులు కాయలు కాశాయి. దయచేసి ఒక సేవకురాలు ఇప్పించండి నాన్నా!" అని కోరారు.

1) సహీహ్ బుఖారీ మొదటి సంపుటి 114వ పుట. హుల్‌యతుల్ ఔలియా మొదటి సంపుటి 341వ పుట.
2) సునన్ తిర్మిజీలోని ఐహిక అనాసక్తత ప్రకరణం
3) సహీహ్ బుఖారీలోని ప్రేమైక వచనాల ప్రకరణం
4) సహీహ్ బుఖారీలోని వ్యవధుల ప్రకరణం

www.abulhasanalinadwi.org

దానికాయన "ఉన్న కాస్త సొమ్ము నీకిచ్చేస్తే పాపం అరుగువాళ్ళు ఏమైపోవాలి"?! అని అన్నారు.[1] సాధారణంగా అరుగువాళ్ళు రాత్రిళ్ళు ఆరాధనలోనే గడిపేవారు. ఖురాన్ పారాయణం చేసేవారు. వారికి ఓ గురువు ఉండేవాడు. వారు ఆ గురువు దగ్గరికి వెళ్ళి ధార్మిక పాఠాలు నేర్చుకునేవారు. అందుకే వీరిలో చాలామందిని 'ఖారీ' లని పిలుస్తారు. ఇస్లాం ధర్మ ప్రచారం నిమిత్తం ఎవరినన్నా పంపాలనుకున్నప్పుడు వీరినే పంపడం జరిగేది. మవూనా యుద్ధ సందర్భంలో అరుగువాళ్ళల్లో నుంచే డెబ్భైమందిని ప్రజలకు ఇస్లాం ధర్మం బోధించే నిమిత్తం పంపటం జరిగింది.[2]

1) సుననె బైహఖీ తొమ్మిదో సంపుటి 304వ పుట. ముస్నదె అహ్మద్ మొదటి సంపుటి 79, 106 పుటలు

2) సహీహ్ ముస్లిం: నాయకత్వ ప్రకరణం

www.abulhasanalinadwi.org

# బద్ర్ సంఘటన

ముస్లింలు మక్కానుండి వలసవెళ్ళగానే ఖురైషులు మదీనాపై దాడి జరపడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. "ముహమ్మద్‌ను హతమార్చండి, లేదంటే మేమొచ్చి అతనితో సహా మీ అందరి పని పడతాం" అని వారు మదీనాలో ఉన్న అబ్దుల్లాహ్ బిన్ ఉబైకు లేఖ రాశారు.[1] ఖురైషులు చిన్న చిన్న సమూహాలుగా వచ్చి మదీనా శివారు ప్రాంతాల్లో గస్తీ చేసేవాళ్ళు. కుర్జ్ ఫహ్రీ అనేవాడు మదీనావాసుల పచ్చికబయళ్ళదాకా వచ్చి అక్కడ విధ్వంసం సృష్టించేవాడు. ముస్లింలపై దాడిచేయాలంటే దానికోసం ఆయుధాలు కావాలి కనుక మక్కావాసులు ఖురైషు వర్తక బిడారులు సిరియా వెళ్తున్నప్పుడు అక్కడినుండి ఆయుధాలు కొనుగోలు చేసుకొని రమ్మని తమ దగ్గరున్న ధనమంతా సిరియా వెళ్ళే వ్యాపారులకిచ్చేశారు. ఆఖరికి స్త్రీలు కూడా ఆయుధాల కొనుగోలు కోసం ధనం ఇచ్చారు. ఆ వర్తక బృందం సిరియా నుండి బయలుదేరకముందే హ్రజమీ అనే అవిశ్వాసి ముస్లింలచేత వధింపబడ్డాడు. దాంతో ఖురైషుల కోపం కట్టలు త్రెంచుకుంది. అంతలోనే ముస్లింలు వారి వర్తక బిడారులను దోచుకోవాలని చూస్తున్నారనే వదంతి మక్కాలో మళ్ళీ వ్యాపించింది. ఇక దాంతో ఖురైషుల ఆగ్రహం ఆకాశాన్నంటింది.[2]

దైవప్రవక్త (సల్లం)కు ఈ విషయం తెలియగానే ఆయన తన అనుచరులందర్నీ సమావేశపరచి పరిస్థితిని వివరించారు. ఈ సంఘటన మదీనా నుండి బయలుదేరిన తరువాత జరిగిందన్న విషయం గమనార్హం. మదీనా నుండి దైవప్రవక్త(సల్లం) అబూసుఫ్యాన్ వర్తక

---

1) సుననె అబూదావూద్‌లోని రెండవ సంపుటి 67వ పుట.

2) షిబ్లీ గారి సీరతున్నబీ గ్రంథం మొదటి సంపుటి 315వ పుట. కుర్జ్ ఫహ్రీ సంఘటన తబఖాత్ ఇబ్నెసాద్ రెండవ సంపుటి 9వ పుటలో, హ్రజమీ హత్య సంఘటన సుననె బైహఖీ తొమ్మిదో సంపుటి 11వ పుటలో ఉంది.

www.abulhasanalinadwi.org

బిడారును నిలువరించడానికి బయలుదేరారు. ప్రామాణికమైన హదీసుల ద్వారా బోధపడే విషయం ఏమిటంటే మదీనా నుండి బయలుదేరి వచ్చిన తరువాత హఠాత్తుగా ఖురైషుల సైన్యం ఎదురుదాడి చేయటానికి వస్తోందని తెలిసింది. అప్పుడు దైవప్రవక్త (సల్లం) తన అనుచరులతో పరిస్థితుల గురించి సమాలోచనలు జరిపారు.... ఇక్కడ తెలుసుకోవాల్సిన విషయం మరొకటుంది: దైవప్రవక్త (సల్లం) అబూ సుఫ్యాన్ వర్తక బిడారును నిలువరించటానికి బయలుదేరటానికి కారణం ఖురైషులు మదీనాపై దాడి జరపటానికి కుట్రలు పన్నుతున్నారని వార్తలు అందటమే. దాన్ని అడ్డుకోవటం కోసమే దైవప్రవక్త (సల్లం) అబూసుఫ్యాన్ వర్తక బిడారును వెంబడించారు. ఖురైషులు ఈ వర్తక బిడారును ఆయుధాలు కొనుగోలు చేసుకొని రావటం కోసమే పంపారని చారిత్రక ఉల్లేఖనాలు స్పష్టం చేస్తున్నాయి. ఆ సమయంలో హజ్రత్ అబూబక్ర్ తదితరులు ఉద్వేగభరితమైన ఉపన్యాసాలిచ్చారు. కాని దైవప్రవక్త (సల్లం) మాత్రం అన్సార్లవైపే చూడసాగారు. ఎందుకంటే ఉఖబా ఒప్పందంలో అన్సార్లు దైవప్రవక్త (సల్లం)ను మదీనాలో ఉన్నప్పుడు రక్షిస్తామని మాత్రమే ప్రమాణం చేశారు. అంచేత ఆయనకు ఇప్పుడు అన్సార్లు యుద్ధానికి సన్నద్ధులౌతారో లేదో నన్న సంశయం కలిగింది. ఆయన మళ్ళీ మళ్ళీ అనుచరుల సలహా కోరసాగారు. దాంతో దైవప్రవక్త తమ జవాబుకోసం వేచివున్నారని అన్సార్లకు అర్థమయిపోయింది. సాద్ బిన్ ముఆజ్ (రజి) తటాలున లేచి, "అన్సార్లు మదీనా వెలుపలికి వచ్చి సహాయం చేస్తారో లేదోనని బహుశా దైవ ప్రవక్త సంశయంలో పడినట్లున్నారు. అన్సార్లందరి తరపు నుండి నేను చెబుతున్నాను. మేము ఎట్టిపరిస్థితుల్లోనయినా సరే దైవప్రవక్తకు తోడ్పడతాం. మీరు మీకిష్టమైన వారితో ఒప్పందం చేసుకోవచ్చు. ఎవరితోనయినా యుద్ధానికి దిగవచ్చు. మేము మీతోపాటే ఉంటాం. మా సిరిసంపదలన్నీ మీకు సమర్పించుకోవటానికి మేము సదా సిద్ధమే. మీరు ఏది ఆజ్ఞాపిస్తే అది చేస్తాం. మీరు మా ధనం స్వీకరిస్తే మాకెంతో ఆనందం కలుగుతుంది. మీరు గిమాద్ కాలువ దాకా వెళ్ళాలన్నా మేము మీ వెంట వస్తాం. సముద్రంలో దూకమన్నా దూకేస్తాం.[1]

1) సీరత్ ఇబ్నెహిషాం మొదటి సంపుటి 625వ పుట. ఫత్హుల్ బారీ ఏడవ సంపుటి 287, 288 పుటలు. సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం.

www.abulhasanalinadwi.org

అంతలోనే హజ్రత్ మిఖ్దాద్ అందుకొని, "దైవప్రవక్తా! మేము మూసా జాతివారి లాంటి వాళ్ళం కాము. వారు తమ ప్రవక్తతో 'మీరూ, మీ ప్రభువు వెళ్ళి యుద్ధం చెయ్యండి. మేమిక్కడే కూర్చొని ఉంటాం' అన్నారు. కాని మేము దైవప్రవక్తను కుడి నుండి, ఎడమ నుండి, వెనుకనుంచి ముందునుంచి రక్షిస్తాం" అన్నారు. ఆయన మాట వినగానే దైవప్రవక్త (సల్లం) ముఖారవిందం కాంతివంతమయింది.[1]

## రణరంగానికి.......

హి.శ. రెండవ యేట రమజాన్ మాసం పన్నెండో తేదీన దైవప్రవక్త (సల్లం) సుమారు మూడొందల మంది తన ప్రాణ సహచరుల్ని వెంటబెట్టుకొని మదీనా నగరం నుండి బయలుదేరారు. ఒక మైలుదూరం వెళ్ళిన తరువాత సైన్యాన్ని పరిశీలించారు. సైన్యం వెంట వచ్చిన చిన్న పిల్లల్ని వెనక్కి పంపించారు. ఆ సమయంలో ఉమైర్ బిన్ వఖ్ఖాస్ అనే బాలుణ్ణి ఇంటికి వెళ్ళిపొమ్మని అంటే అతను ఏడ్వసాగాడు. అతని ఏడ్పు చూసి దైవప్రవక్త(సల్లం) అతనికి యుద్ధంలో పాల్గొనేందుకు అనుమతినిచ్చారు. ఉమైర్ అన్న అయిన సాద్‌బిన్ అబూవఖ్ఖాస్ (రజి) ఆ చిన్ని సిపాయి మెడలో ఖడ్గం వ్రేలాడదీశారు. అఖరికి సైన్యంలో మొత్తం మూడువందల పదమూడు మంది మిగిలారు. వారిలో అరవైమంది ముహాజిర్లు. మిగతావారంతా అన్సార్ సహచరులే.[2] అంతపెద్ద సైన్యంలో రెండే రెండు గుఱ్ఱాలున్నాయి. జుబైర్ (రజి) దగ్గర ఒకటి, మిఖ్దాద్ బిన్ అస్వద్ దగ్గర ఒకటి. ఒంటెలు మొత్తం డెబ్భై ఉన్నాయి. ఒక్కొక్క ఒంటెపై ఇద్దరుగాని, ముగ్గురుగాని వంతులవారీగా కూర్చొని ప్రయాణించేవారు. స్వయంగా దైవప్రవక్త (సల్లం), అలీ, ముర్సద్ గన్‌వీ ముగ్గురూ ఒకే ఒంటెపై వంతులవారీగా కూర్చొని ప్రయాణించారు.[3]

మరోవైపు ఖురైషులు మక్కానుండి సకల సన్నాహాలతో

---

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
2) తబఖాత్ ఇబ్నెసాద్
3) సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటి 613వ పుట. జాదుల్ మఆద్ రెండవ సంపుటి 171వ పుట. ముస్నదె అహ్మద్, ముస్తద్రక్ హాకిమ్‌ల ప్రామాణికమైన ఉల్లేఖనాల్లో ముర్సద్ గన్‌వీకు బదులు అబూలుబాబా ప్రస్తావన ఉంది.

www.abulhasanalinadwi.org

బయలుదేరారు. వెయ్యిమంది సైనికులు. వాహనాలపై గుంపులు గుంపులుగా బయలుదేరారు. ఒక్కొక్క గుంపులో నూరు వాహనాలు. ఖురైష్ సర్దారులందరూ యుద్ధానికి బయలుదేరారు. అబూలహబ్ మాత్రం ఏదో అనివార్య కారణం వల్ల రాలేకపోయాడు. అయితే వేరొకర్ని తన ప్రతినిధిగా నియమించి సైన్యం వెంట పంపించాడు. ఖురైష్ సర్దారులైన అబ్బాస్, ఉత్బాబిన్ రబీయా, హర్స్ బిన్ ఆమిర్, నజర్ బిన్ హారిస్, అబూజహల్, ఉమయ్యా తదితరులు వంతుల వారీగా ప్రతిరోజూ పదేసి ఒంటెల్ని కోసి సైన్యానికి, వెంట వచ్చిన జనానికి తినిపించేవారు. ఖురైషుల్లో అందరికన్నా గొప్ప సర్దారు అయిన ఉత్బాబిన్ రబీయా సైన్యానికి సారథ్యం వహించాడు.[1]

బద్ర్ మైదానం సమీపానికి చేరుకున్న తరువాత అబూసుఫ్యాన్ వర్తక బృందం అపాయం నుండి తప్పించుకొని మక్కాకు వస్తుందని ఖురైషులకు తెలిసింది. జుహ్రా, అదీ తెగల వాళ్ళు, "ఇక యుద్ధం చేయాల్సిన అవసరం లేదు. వెనక్కి వెళ్ళిపోదాం పదండి" అన్నారు. కాని అబూజహల్ మాత్రం ససేమిరా అన్నాడు. జుహ్రా, అదీ తెగలవాళ్ళు వెనక్కి తిరిగి వెళ్ళిపోయారు. మిగతాసైన్యం ముందుకు నడిచింది.[2]

ఖురైషులు యుద్ధభూమికి ముందుగా వెళ్ళి అనువైన చోట్లను కైవసం చేసుకున్నారు. ముస్లిం సైన్యాలు ఆగినచోట ఒక్క బావి అయినా లేదు. ఇసుక నేల అవటంచేత ఒంటెలకాళ్ళు ఇసుకలో దిగబడిపోయేవి. సైన్యం ఆగిన చోటు వహీ (దైవవాణి) ద్వారా తెలుపబడినదా లేక యుద్ధ తంత్రమా?" అని హుబాబ్ బిన్ ముంజిర్ దైవప్రవక్త (సల్లం)ను అడిగారు. దీని గురించి వహీ ఏమీ అవతరించలేదని దైవప్రవక్త(సల్లం) అన్నారు. అలాగయితే మనం కాస్త ముందుకువెళ్ళి ఆ కాలువను కైవసం చేసుకొని సమీపంలో ఉన్న బావుల్ని శత్రువులు ఉపయోగించుకోకుండా చేద్దామన్నారు హుబాబ్(రజి). దైవప్రవక్త (సల్లం)కు ఆయన ఇచ్చిన సలహా నచ్చింది. ఆయన చెప్పినట్టుగానే ముస్లిం సైన్యాలు ముందుకు వెళ్ళి

1) సీరత్ ఇబ్నె హిషామ్‌లో బద్ర్ యుద్ధ సంఘటన. అల్ బిదాయా వన్నిహాయా మూడవ సంపుటి 360వ పుట. ముస్నదె అహ్మద్ రెండవ సంపుటి 193వ పుట.

2) ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటి 426 వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటి 619వ పుట.

www.abulhasanalinadwi.org

కాలువను కైవసం చేసుకున్నారు. అదృష్టవశాత్తూ వర్షం కురవటంతో ముస్లిం సైన్యం ఆగిన ఇసుకనేల తడిసి గట్టిపడింది. చిన్న చిన్న గుంటలు త్రవ్వుకొని వర్షపునీటిని నిల్వ చేసుకున్నారు - ఆ నీళ్ళు వుజూలకు, స్నానాలకు పనికొస్తాయని!ఈ మహోపకారం గురించి దివ్యఖురాన్‌లో ఇలా సెలవీయబడింది.

"మిమ్మల్ని పరిశుద్ధులుగా చేయటానికి దేవుడు మీకోసం ఆకాశం నుండి వర్షాన్ని కురిపించాడు"

నీటి కొలనులపై ముస్లింల ఆధిపత్యం ఉన్నప్పటికీ దైవ ప్రవక్త (సల్లం) శత్రువులకు కూడా అక్కడినుండి నీళ్లు తీసుకోనిచ్చేవారు.[1]

అనుచర ముస్లింలందరూ ఆయుధాలు ప్రక్కనపెట్టి రాత్రంతా హాయిగా నిద్రపోయారు. కాని ఆయన (సల్లం) మాత్రం తెల్లవారేదాకా మేల్కొని ఉండి ప్రార్థనలో నిమగ్నులై ఉన్నారు. తెల్లారిన తరువాత ప్రజలను నమాజ్ కోసం మేల్కొలిపారు. నమాజ్ తరువాత 'జిహాద్' గురించి ఉపన్యాసమిచ్చారు.[2]

## యుద్ధ సన్నాహాలు

ఖురైషులు యుద్ధ చేయటానికి తహతహలాడుతున్నారు. అయితే వారిలో కొందరు దయార్ద్ర హృదయులూ లేకపోలేదు. జరగనున్న దారుణ మారణకాండను తలచుకొని వారి హృదయాలు కంపించిపోయేవి. అలాంటి వారిలో హకీమ్ బిన్ హిజామ్ ఒకరు. ఈయన ముమ్మందు ఇస్లాం స్వీకరిస్తారు. ఈయన సైన్యాధిపతి అయిన ఉత్బా దగ్గరికి వెళ్ళి, "మీరు కోరుకుంటే ఈ రోజు మీకు చరిత్రలోనే గొప్ప పేరు ప్రఖ్యాతుల్ని తెచ్చిపెట్టగలదు" అన్నారు.

'అదెలా సాధ్యం' అడిగాడు ఉత్బా.

'ఖురైషులకు కావలసింది హజ్రమీ రక్తపరిహారమే కదా! అతనితో మీకు ఒప్పందం ఉంది. కాబట్టి ఆ రక్తపరిహారం మీరు చెల్లించండి.

1) సీరత్ ఇబ్నెహిషామ్ మొదటి సంపుటి 620, 621 పుటలు. దలాయిలున్నుబువ్వా మూడవ సంపుటి 35వ పుట. ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటిలో 326 వ పుట.

2) జాదుల్ మఆద్ మూడవ సంపుటి 179వ పుట. దలాయిలున్ను బువ్వా మూడవ సంపుటి 39వ పుట. నసాయిగారి సుననె కుబ్రా గ్రంథం.

www.abulhasanalinadwi.org

పెద్ద యుద్ధం తప్పిపోతుంది" అని వివరించారు హకీమ్ బిన్ హిజామ్.

ఉత్బా స్వాభావికంగా మంచివాడవటంచేత హకీమ్ చెప్పిన మాటల్ని ఎంతో సంతోషంతో ఒప్పుకున్నాడు. అయితే దానికోసం కూడా అబూజహల్ అంగీకారం అవసరమే. హకీమ్ ఉత్బా సందేశాన్ని తీసుకొని అబూజహల్ దగ్గరికి వెళ్ళారు. ఆ సమయంలో అతను అంబులపొదినుండి బాణం తీసి సరిచేసుకుంటున్నాడు. ఉత్బా సందేశం విని అబూజహల్ ఒక్కసారిగా

'ఉత్బా పిరికివాడైపోయాడు' అన్నాడు.

ఉత్బా కుమారుడు అబూహుజైఫా (రజి) అప్పటికి ఇస్లాం స్వీకరించి ఉన్నారు. దైవప్రవక్త సేనల వెంట ఆయన కూడా యుద్ధానికి వచ్చారు. అందుకని తన కొడుక్కి ఎక్కడ హాని జరుగుతుందోనన్న భయంతో ఉత్బా యుద్ధం నుండి తప్పించుకోవాలని ఎత్తులు వేస్తున్నాడని అబూజహల్ అనుకున్నాడు. ఆ తరువాత అతను హజ్రమి సోదరుడైన ఆమిర్‌ను పిలిచి, "చూశావా, నీ కళ్ళ ముందే నీ సోదరుని రక్తపరిహారాన్ని తప్పించాలని చూస్తున్నారు" అన్నాడు. దాంతో ఆమిర్ అరబ్బుల ఆచారం ప్రకారం బట్టలు చించుకొని దుమ్ము రేపుతూ, 'అయ్యో అమర్! అయ్యో అమర్! అని విలపించటం మొదలుపెట్టాడు. దాంతో సైనికులందరిలో ప్రతీకార వాంఛ పెల్లుబికింది.

అబూజహల్ తనను దెప్పిపొడిచాడని తెలుసుకొని ఉత్బా విపరీతంగా మండిపడ్డాడు. 'మగతనం ఎవరికి లేదో యుద్ధభూమిలో తేలిపోతుంది' అంటూ తనకు శిరస్త్రాణాన్ని తొడిగించమని అనుచరుల్ని కోరాడు.కాని అతని తల చాలా పెద్దది కావటం చేత ఏ శిరస్త్రాణమూ అతనికి సరిపోలేదు. ఆఖరికి తలకు గుడ్డచుట్టుకొని ఆయుధాలు ధరించాడు.[1]

దైవప్రవక్త (సల్లం)కు తన చేతుల్ని రక్తసిక్తం చేసుకోవటం ఇష్టంలేదు. సహచరులు ఆయనకోసం యుద్ధభూమికి అవతల ఓ చిన్న

---

1) సీరత్ ఇబ్నెహిషామ్ మొదటి సంపుటి 622, 623 పుటలు. జాదుల్ మఆద్ మూడవ సంపుటి 779వ పుట.

www.abulhasanalinadwi.org

పాక తయారుచేశారు. శత్రువులెవరూ అటువైపు రాకుండా ఉండేందుకు సాద్‌బిన్ ముఆజ్ (రజి) దాని ద్వారం వద్ద చేతిలో ఖడ్గం పుచ్చుకొని నించున్నారు.[1]

ఈ యుద్ధంలో ముస్లింలే విజయం సాధిస్తారని దేవుడు ముందుగానే తెలియజేశాడు. సృష్టిరాశులన్నీ ముస్లిం సైన్యాలకు సహాయపడటానికి సిద్ధంగా ఉన్నాయి. దివినుండి దైవదూతల సైన్యం కూడా భువికి దిగివచ్చింది. కాని ఈ ప్రపంచంలో ఏది జరిగినా హేతుబద్ధంగా జరుగుతుంది కాబట్టి దైవప్రవక్త(సల్లం) సైన్యాన్ని యుద్ధతంత్రం ప్రకారం నించోబెట్టారు. ముహాజిర్లు, ఔస్, ఖజ్‌రజ్ అనే మూడు సైనికపటాలాలుగా సైన్యాన్ని విభజించారు. ముహాజిర్ల యుద్ధపతాకం ముస్‌అబ్ బిన్ ఉమైర్ చేతికిచ్చారు. ఖజ్‌రజ్ యుద్ధపతాకం హుబాబ్ బిన్ ముంజిర్‌కు లభించింది. సాద్‌బిన్ ముఆజ్ ఔస్ సైనికదళానికి సారథ్యం వహించారు.

తెల్లవారగానే దైవప్రవక్త (సల్లం) సైనికుల పంక్తుల్ని తీర్చిదిద్దటం మొదలుపెట్టారు. చేతిలో ఒక బాణం తీసుకొని సైనికులు ఒక్క అంగుళమయినా ముందుకుగాని, వెనక్కిగాని జరగకుండా పంక్తులు తిన్నగా ఉండేటట్లు చేసేవారు. యుద్ధంలో అరవటం, గోల చేయటమనేది సాధారణంగా జరిగేదే. కాని దైవప్రవక్త (సల్లం) తన అనుచరుల్ని నోటినుండి చిన్న శబ్దం కూడా రాకూడదని ఆదేశించారు.[2]

ముస్లింల శత్రువులు చాలా ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. అలాంటి సమయంలో ముస్లింలలో ఏ ఒక్కడు వచ్చి చేరినా అది ముస్లిం సైన్యానికి ఎంతో కొంత ఊరటను కలిగిస్తుంది. అబూహుజైఫా బిన్ యమాన్, అబూహుసైల్ అనే ఇరువురు ముస్లింలు మక్కానుండి బయలుదేరి వస్తుండగా వీరు ముహమ్మద్ (సల్లం)కు సహాయం చేయటానికి వెళుతున్నారేమోనని అవిశ్వాసులు వారిని అడ్డుకున్నారు. ఆ ఇరువురు ముస్లింలు తాము వెళుతున్నది అందుకోసం కాదని చెప్పి, తాము ముహమ్మద్ (సల్లం) సైన్యంలో చేరబోమని వాగ్దానం చేశారు. తరువాత

---

1) జాదుల్ మఆద్ మూడవ సంపుటి 620వ పుట.

2) షిబ్లీ నూమానీ గారి సీరతున్నబీ గ్రంథం మొదటి సంపుటి 320వ పుట.

www.abulhasanalinadwi.org

వారు దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి తమకు ఎదురైన పరిస్థితిని గురించి వివరించారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం). "మనం ఎట్టిపరిస్థితిలోనయినా వాగ్దానాన్ని నెరవేర్చాలి. కనుక మీరు యుద్ధంలో పాల్గొనవలసిన అవసరం లేదు. మనకు దైవసహాయం చాలు" అన్నారు.[1]

ఇక ఇరుపక్షాలూ పోరుకు సిద్ధంగా ఉన్నాయి.

"పరస్పరం తలపడే ఇరుపక్షాల్లో మీకు సూచనలున్నాయి. వారిలో ఒక వర్గం దైవమార్గంలో యుద్ధం చేస్తోంది. రెండవది దైవాన్ని తిరస్కరిస్తోంది."

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఇంత విశాలమైన ప్రపంచంలో ఒకే దేవుణ్ణి ఆరాధించే సిద్ధాంతం కేవలం అతికొద్దిమంది ప్రాణాలపైనే ఆధారపడి ఉంది. సహీహ్ ముస్లిం గ్రంథంలో ఇలా ఉంది: యుద్ధానికి ముందు దైవప్రవక్త (సల్లం) దేవుని సన్నిధిలో చేతులెత్తి, "దేవా! నువ్వు నాతో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చు" అంటూ కడుదీనంగా వేడుకునేవారు. ప్రార్థనలో తన్మయులై ఉండటంచేత భుజాలపై నుండి దుప్పటి జారిపోయినా ఆయనకి పట్టేది కాదు. ఒక్కోసారి సాష్టాంగపడి, "దేవా! ఈ రోజు ఈ గుప్పెడుమంది ప్రాణాలు కోల్పోతే ఇక భూమిపై నిన్ను ఆరాధించేవాడే మిగలడు" అని వేడుకునేవారు.

దైవప్రవక్త (సల్లం) ఇలా దీనంగా వేడుకోవటం చూసి ఆయన అనుచరుల గుండెలు కరిగిపోయాయి. "దైవప్రవక్తా! దేవుడు తన వాగ్దానాన్ని తప్పకుండా నెరవేరుస్తాడు" అంటూ ఆయన్ని సముదాయించ సాగారు. హజ్రత్ అబూబక్ర్(రజి).[2] ఆఖరికి "శత్రుసైన్యాన్ని ఓటమికి గురిచేయటం జరుగుతుంది. వారు వెన్నుచూపి పారిపోతారు" అన్న దైవసూక్తి అవతరించిన మీద ఆయన మనసు కుదుటపడింది. ఆయన శుభ ఆధరాల నుండి గెలుపు సువార్త వెలువడింది.[3]

ఖురైషుల సైన్యాలు ఇప్పుడు ఇంకా దగ్గరయ్యాయి. దైవప్రవక్త (సల్లం) తన అనుచరుల్ని ముందుకు వెళ్ళకుండా, శత్రువులు

1) సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం
2) సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం
3) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం

www.abulhasanalinadwi.org

దగ్గరికొచ్చినప్పుడు బాణాలు విసిరి వారిని నిరోధించమని ఆదేశించారు.

ఆ సమయంలో ఆయన ముస్లిం సైన్యాలకు సహన స్థయిర్యాలను గురించి, దైవసహాయం గురించి ఉపదేశించారు. ఈ యుద్ధం ద్వారా ఇహలోకంలో విజయం లభిస్తుందనీ, పరలోకంలో పుణ్యం ప్రాప్తిస్తుందని గుర్తు చేశారు. దైవమార్గంలో అమరగతినొందిన వ్యక్తికోసం దేవుడు స్వర్గాన్ని వ్రాసి ఉంచాడని చెప్పారు. ఆ మాటవిని ఉమైర్ బిన్ హుమామ్.

"దైవప్రవక్తా! భూమ్యాకాశాల అంత వెడల్పుగల స్వర్గమా?"

అని అడిగారు.

దైవప్రవక్త (సల్లం) 'ఔన'న్నారు.

"నిజంగానా దైవప్రవక్తా?" అని ఆయన మళ్ళీ అడిగారు.

ఆ మాటకు దైవప్రవక్త (సల్లం) "అలా అడుగుతున్నావేమిటి?" అన్నారు.

దానికి సమాధానమిస్తూ ఉమైర్ (రజి), "అది నాక్కూడా లభిస్తుందేమోనన్న ఆశతో అడుగుతున్నాను దైవప్రవక్తా!" అన్నారు.

"నీకు అది తప్పకుండా లభిస్తుంది" అంటూ శుభవార్తను అందజేశారు దైవప్రవక్త(సల్లం).

తరువాత ఉమైర్ తన డాలులోనుండి ఖర్జూర పండ్లు బయటికి తీసి తినడం మొదలుపెట్టారు. కాసేపటికి ఇలా ఖర్జూరాలు తింటూ కూర్చుంటే సమయం వృధా అవుతుందని చెప్పి, చేతిలో ఉన్న ఖర్జూరాలు క్రిందపడేసి యుద్ధభూమిలోకి దూసుకుపోయి వీరోచితంగా పోరాడుతూ అమరగతినొందారు.[1]

ఇరుపక్షాల మధ్య భీకర పోరు మొదలయ్యింది. ఈ యుద్ధం ఇరుపక్షాలలోని సైనికుల స్థయిర్యానికి త్యాగభావాలకు పరీక్షలా జరిగింది. తమ ఖడ్గాలతోనే తమ ఆత్మీయుల్ని మట్టుబెట్టాల్సిన పరిస్థితి ఎదురయ్యింది. శత్రువుల తరపునుంచి అబూబక్ర్ కుమారుడు యుద్ధ

1) సహీహ్ ముస్లింలోని నాయకత్వ ప్రకరణం

www.abulhasanalinadwi.org

భూమిలోకి రాగానే అతన్ని ఎదిరించటానికి అబూబక్ర్ స్వయంగా ఖడ్గం తీసుకొని ముందుకు వెళ్ళారు.[1] ఉత్బా మైదానంలోకి రాగానే అతని కుమారుడు హుజైఫా (రజి) అతన్ని మట్టుబెట్టటానికి బయలుదేరారు. హజ్రత్ ఉమర్ (రజి) ఖడ్గం తన మేనమామ రక్తంతో తడిసిపోయింది.[2]

## తొలిదశ యుద్ధం

యుద్ధం మొదలవగానే ముందుగా శత్రువులవైపు నుండి తన సోదరుని హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలన్న పట్టుదలతో ఉడికిపోతున్న అమిర్ హజ్రమీ మైదానంలోకి వచ్చాడు. హజ్రత్ ఉమర్ (రజి) గారి బానిస మహ్జా అతన్ని ఎదుర్కొబోయి అతని చేతిలోనే వధించబడ్డాడు. సైన్యాధిపతి అయిన ఉత్బా అబూజహల్ దెప్పి పొడుపుకు ఆగ్రహంతో ఊగిపోతున్నాడు. అతనే అందరి కన్నా ముందు తన సోదరుణ్ణి, కొడుకుని వెంటబెట్టుకొని యుద్ధమైదానంలోకి వచ్చి ముస్లింలకు సవాలు విసిరాడు. అరబ్ దేశంలో పేరు ప్రఖ్యాతులున్న వ్యక్తులు యుద్ధానికి వెళ్ళేటప్పుడు ప్రత్యేక చిహ్నాలు ధరించి వెళ్ళేవారు. ఉత్బా తన ఉదరభాగానికి నిప్పుకోడి ఈకలు తగిలించుకున్నాడు. అతణ్ణి మార్కొనటానికి ముస్లింల వైపు నుండి ఔఫ్, ముఆజ్, అబ్దుల్లాహ్ బిన్ రవాహ్ బయలుదేరారు. ఉత్బా వారి పేర్లు, వంశాల గురించి అడిగాడు. వాళ్ళు అన్సార్లు అని తెలుసుకొని మీతో మాకు పని లేదని అన్నాడు. తరువాత దైవప్రవక్త (సల్లం)ను పిలిచి, "ముహమ్మద్! వీళ్ళు మాకు సమవుజ్జీలు కారు" అన్నాడు.

దైవప్రవక్త (సల్లం) అనుజ్ఞ మేరకు ఆ అన్సార్ సహచరులు తిరిగొచ్చేశారు. వారికి బదులు హమ్జా, అలీ, అబూ ఉబైదాలు ఉత్బాను ఎదుర్కోవటానికి వెళ్ళారు. వీళ్ళు ముఖాలకు ముసుగులు ధరించి ఉండటం వల్ల ఉత్బా వాళ్ళను గుర్తుపట్టలేకపోయాడు.

'మీరెవరు?' అని అడిగాడు ఉత్బా.

ముగ్గురూ తమపేర్లు, వంశాలను గురించి తెలియజేశారు.

---

1) సీరత్ ఇబ్నెహిషామ్ మొదటి సంపుటి 238వ పుట

2) షిబ్లీ నోమానీ గారి సీరతున్నబీ గ్రంథం మొదటి సంపుటి 322వ పుట.

www.abulhasanalinadwi.org

"ఆఁ వీళ్ళు మాకు సరిజోడి అవుతారు' అన్నాడు ఉత్బా.

ఉత్బా హమ్జాతోనూ, వలీద్ హజ్రత్ అలీతోనూ తలపడి ఇద్దరూ నేలకొరిగారు. ఉత్బా సోదరుడు షైబా అబూ ఉబైదా (రజి)ని గాయపరిచాడు. వెంటనే అలీ (రజి) లంఘించి షైబాను మట్టి కరిపించారు. అబూ ఉబైదాను భుజంపై మోసుకొని దైవప్రవక్త (సల్లం) దగ్గరికి తీసుకొని వచ్చారు. అప్పుడు అబూ ఉబైదా దైవప్రవక్త (సల్లం)ను, "నేను వీరమరణం పొందే భాగ్యాన్ని కోల్పోయానా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం), "లేదు, నీకా భాగ్యం లభించింది" అన్నారు. అప్పుడు అబూ ఉబైదా "ఈ రోజు గనక అబూతాలిబ్ బ్రతికి ఉండినట్లయితే తాను చెప్పిన ఈ కవిత నాకు వర్తించిందని ఒప్పుకొని ఉండేవారు" అని అన్నారు.[1]

'మేము ముహమ్మద్‌ను నలువైపుల నుండి కాపాడుతాం.
మా ప్రాణాలుపోయినాసరే ఆయన్ని శత్రువులకు అప్పజెప్పం.
ఆయన కోసం మేము మా ఆలుబిడ్డల్ని కూడా మర్చిపోతాం'

సాద్ బిన్ ఆస్ కుమారుడు ఉబైదా ఆపాదమస్తకం ఇనుప కవచం తొడుక్కొని మైదానంలోకి వచ్చి 'నేను అబూ కిర్షను. నాతో యుద్ధం చేయటానికి ఎవరైనా సిద్ధంగా ఉన్నారా?' అంటూ సవాలు చేశాడు. జుబైర్ (రజి) అతన్ని మార్కొనటానికి వెళ్ళారు. అతని శరీరం మొత్తంలో కేవలం కళ్ళు మాత్రమే కానవస్తున్నాయి. జుబైర్ గురిపెట్టి బరిసె విసిరారు. అది సరాసరి అతని కంట్లో గుచ్చుకోవడంతో క్రిందపడి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఆ బరిసె అతని కంట్లో ఎంత లోతుకి దిగబడిందంటే జుబైర్(రజి) అతని శవంపై కాలుపెట్టి గట్టిగా లాగితేగాని అది బయటికి రాలేదు. అప్పటి నుండి ఆ బరిసె ఒక చరిత్రాత్మక వస్తువు అయిపోయింది. జుబైర్ నుండి దాన్ని దైవప్రవక్త (సల్లం) తీసుకున్నారు. ఆ తరువాత నలుగురు ఖలీఫాల చేతుల్లోకి మారింది.[2] ఆఖరికి అది అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ దగ్గరికొచ్చింది.

---

1) సునసె అబూదావూద్‌లోని జిహాద్ ప్రకరణం, ముస్నదె అహ్మద్ మొదటి సంపుటిలో 117వ పుట. సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.

2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం

www.abulhasanalinadwi.org

జుబైర్ (రజి)కు ఈ యుద్ధంలో ఎన్నో గాయాలయ్యాయి. ఆయన జబ్బలో ఎంతపెద్ద గాయమయిందంటే అది నయమైన తరువాత కూడా అక్కడ వ్రేలు లోపలికి వెళ్ళగలిగేంత గుంట ఏర్పడింది. ఆయన కుమారుడు ఉర్వా పసితనంలో ఆ గాయాలతో ఆడుకునేవాడు. యుద్ధం చేస్తున్నప్పుడు ఆయన కరవాలం జారి క్రిందపడిపోయింది. దాంతో ఆయన శత్రువుల ఖడ్గాలకు చిక్కి వీరమరణం పొందారు.

ఒకసారి అబ్దుల్ మలిక్ ఉర్వాతో మాట్లాడుతూ, "నువ్వు నీ తండ్రి కరవాలాన్ని గుర్తుపట్టగలవా?" అని అడిగాడు. గుర్తుపడతానన్నారు ఉర్వా. ఎలా గుర్తుపడతావని అడిగితే దానికి ఉర్వా "బద్ర్ యుద్ధం జరిగిన రోజు మా నాన్న చేతుల్లో ఆ ఖడ్గం పదను అరిగి రంపపు దంతాల్లా మారిపోయింది" అన్నారు. అబ్దుల్ మలిక్ ఆయన మాటల్ని ధృవీకరించి ఆయన తండ్రి ఖడ్గాన్ని ఆయనకు ఇచ్చివేశాడు. ఆయన దాన్ని వేలం వేయిస్తే అది మూడువేల రూపాయల ధర పలికింది. దాని పిడికి వెండిపూత పూయబడి ఉండేది.[1]

ఇక తుది దశ యుద్ధం ప్రారంభమయింది. ఒకవైపు మక్కా బహుదైవారాధకులు తమ భౌతిక శక్తి సామర్థ్యాలపై ఆధారపడి యుద్ధం చేస్తుంటే మరోవైపు దైవప్రవక్త (సల్లం) సాష్టాంగ ప్రణామంలో లీనమై దైవ సహాయాన్ని అర్థించసాగారు.[2]

## పేరు మోసిన అవిశ్వాస సర్దారుల వధ

అబూజహల్ ఆగడాల గురించి, ఇస్లాంతో అతనికున్న విరోధం గురించి ప్రజలందరికీ తెలుసు. అన్సార్‌కు చెందిన ముఅవ్విజ్, ముఆజ్ అనే ఇద్దరు అన్నదమ్ములు ఈ దైవద్రోహి ఎక్కడ కనిపించినా అతణ్ణి మట్టుబెడతామని లేదా తామైనా ప్రాణాలర్పిస్తామని ప్రతిన బూనారు. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) కథనం:

'నేనొక పంక్తిలో నించొని ఉండగా ఇద్దరు యువకులు నా కుడిఎడమలకు వచ్చి నించున్నారు. వారిలో ఒకడు నా చెవిదగ్గరికి వచ్చి

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
2) షిబ్లీ నూమానీ గారి సీరతున్నబీ గ్రంథం : మొదటి సంపుటి 324వ పుట.

www.abulhasanalinadwi.org

మెల్లిగా 'అబూజహల్ ఎవరు?' అని అడిగాడు.

"నాయనా! అబూజహల్ ఎవరో తెలుసుకొని ఏం చేస్తావ్?" అన్నాను నేను.

'ఆ దైవద్రోహి ఎక్కడ కనిపించినా ప్రాణాలతో వదలనని, దానికోసం నా ప్రాణాలైనా అర్పిస్తానని నేను దేవునిపై ప్రమాణం చేశాను' అన్నాడా బాలుడు.

నేనతనికి జవాబు చెప్పబోయేంతలో అతని సోదరుడు కూడా దగ్గరికొచ్చి నా చెవిలో అవే మాటలన్నాడు. నేను వాళ్ళిద్దరికీ అబూజహల్ వైపు సైగచేసి చూపించాను. వెంటనే ఆ ఇరువురు సోదరులు కొదమ సింహాల్లా, అతనిమీదపడి అతను నేలకొరిగేలా చేశారు. వీళ్ళిద్దరూ (ముఅవ్విజ్, ముఅజ్) ఉఫ్రా కుమారులు.[1] అబూజహల్ కొడుకు ఇక్రిమా వెనుక నుండి వచ్చి ముఅజ్ ఎడమ భుజంపై ఖడ్గంతో ఒక వేటు వేశాడు. దాంతో ఆయన చెయ్యి తెగి కాస్తంత చర్మం ఆధారంతో వ్రేలాడసాగింది. ముఅజ్ ఇక్రిమాను వెంబడించారు. కాని అతను పారిపోయాడు. ముఅజ్ ఆ స్థితిలోనే శత్రువులతో తలపడసాగారు. ఆ సమయంలో వ్రేలాడుతున్న చెయ్యి అడ్డం తగులుతుండటంతో ఆయనకు యుద్ధం చేయటంలో ఇబ్బందిగా ఉండేది. అంచేత చేతిని కాలుక్రింద పెట్టిలాగి భుజం నుండి వేరుచేసుకొని ఒంటి చేత్తోనే స్వేచ్ఛగా పోరాడసాగారు.[2]

అవిశ్వాసుల సైన్యం వెంట వచ్చిన వారిలో కొంతమంది అన్యమనస్కంగానే -ఖురైషుల బలవంతం మీద-వచ్చి ఉంటారని, దైవప్రవక్త(సల్లం) ముస్లింలకు యుద్ధానికి ముందే చెప్పారు. వారి పేర్లు కూడా తెలియజేశారు. వారిలో అబుల్ బుఖ్తరీ కూడా ఉన్నాడు. ముజజ్జర్ అన్సారీ అతన్ని చూడగానే అతని దగ్గరికెళ్ళి, 'దైవప్రవక్త (సల్లం) నిన్ను వధించవద్దని చెప్పారు. అందుకే నిన్ను వదలిపెడుతున్నాను' అన్నారు. ఆ సమయంలో అబుల్ బుఖ్తరీతోపాటు అతని మిత్రుడు

1) సహీహ్ బుఖారీ - ఖుముస్ ప్రకరణం, సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం
2) సీరత్ ఇబ్నెహిషామ్ మొదటి సంపుటి 635వ పుట. ముస్నదె అహ్మద్ మొదటి సంపుటి 444వ పుట.

www.abulhasanalinadwi.org

కూడా ఉన్నాడు. అతను తన మిత్రుణ్ణి కూడా వదలిపెట్టమని అడిగాడు. ముజజ్జర్ దానికి నిరాకరించారు. అప్పుడు అబుల్ బుఖ్తరీ, "నా మిత్రుడు నాకళ్ళ ముందే వధించబడితే నాకు 'అబుల్ బుఖ్తరీ తన ప్రాణాన్ని కాపాడుకోవటానికి తన మిత్రుణ్ణి వదలిపెట్టాడు' అనే అపకీర్తి వస్తుంది. అరబ్బు మహిళలకు నేను లోకువ అయిపోతాను. వారి నిందల్ని నేను భరించలేను" అంటూ ముజజ్జర్‌తో పోరాడి మరణించాడు.[1]

ఉత్బా, అబూజహల్‌లు వధించబడగానే యుద్ధభూమిలో ఖురైషులు నిలదొక్కుకోలేకపోయారు. సైనికుల హృదయాలపై భీతావహస్థితి ఆవరించింది.

దైవప్రవక్త (సల్లం) గారి పరమ శత్రువైన ఉమయ్యా బిన్ ఖల్ఫ్ కూడా ఈ యుద్ధంలో పాల్గొన్నాడు. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ఎప్పుడో ఒకప్పుడు అతనితో అతను మదీనా వచ్చినట్లయితే తాను అతని ప్రాణానికి రక్షణ కల్పిస్తానని వాగ్దానం చేసి ఉన్నారు. బద్ర్ యుద్ధంలో ఆ దైవద్రోహిని చంపటానికి ముస్లింలకు మంచి అవకాశం లభించింది. కాని మరోవైపు ఇస్లాం ధర్మం వాగ్దానాన్ని నెరవేర్చాలని కూడా చెబుతోంది. కాబట్టి అబ్దుర్రహ్మాన్ అతను బ్రతికిపోతే బాగుంటుందనుకున్నారు. అతణ్ణి తీసుకొని కొండపైకెక్కారు. అయితే బిలాల్ (రజి) వారిని చూసి ఈ విషయం అన్సార్లకు తెలియజేశారు. ఉమయ్యా కొండపై ఉన్నాడని తెలియగానే ముస్లింలందరూ పరుగెత్తుకుంటూ వెళ్ళి అతని మీద విరుచుకుపడ్డారు. అబ్దుర్రహ్మాన్ ఉమయ్యా కొడుకుని ముందుకు పంపారు. ప్రజలు అతని కొడుకుని వధించారు. అంతటితో ఆగక ఉమయ్యా మీదికి ఎగబడ్డారు. అబ్దుర్రహ్మాన్ ఉమయ్యాను నేలపై పడుకోబెట్టి అతన్ని కాపాడటానికి తను అతనిపై పడుకున్నారు. కాని ప్రజలు ఏ మాత్రం ఊరుకోకుండా ఆయన కాళ్ళక్రింద నుంచి చేతులు పోనిచ్చి అతణ్ణి చంపేశారు. ఈ హత్యాయత్నంలో అబ్దుర్రహ్మాన్ కాలికి కూడా గాయమయింది. గాయం మానిపోయినా చాలాకాలం వరకు దాని మచ్చ అలాగే ఉండిపోయింది.[2]

---

1) అసదుల్‌గాబ : నాల్గో సంపుటి 288వ పుట. అల్‌బిదాయా వన్నిహాయా మూడవ సంపుటి 285వ పుట.

2) సహీహ్ బుఖారీలోని వకాలా ప్రకరణం.

www.abulhasanalinadwi.org

అబూజహల్, ఉత్బా లాంటి హేమాహేమీలు వధించబడిన తరువాత ఖురైషులు ఆయుధాలను క్రిందపడేశారు. ముస్లింలు వారి వెంటపడి వారిని బంధించడం మొదలుపెట్టారు. అబ్బాస్, ఉఖైల్ (అలీ సోదరుడు) నౌఫిల్, అస్వద్ బిన్ ఆమిర్, అబ్ద్ బిన్ జమఆ తదితర ప్రముఖులు ఖైదీలుగా పట్టుబడ్డారు.

ఎవరైనా వెళ్ళి అబూజహల్ ఏమయ్యాడో కనుక్కొని రమ్మని దైవప్రవక్త (సల్లం) ఆదేశించారు. అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ వెళ్ళి శవాల్లో వెతుకుతుంటే ఒకచోట అతను క్షతగాత్రుడై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ కనిపించాడు. అబ్దుల్లాహ్ అతని దగ్గరికెళ్ళి, "నువ్వు అబూజహల్వేనా?" అని అడిగారు. దానికతను, "ఒక వ్యక్తిని అతని తెగవారే చంపేస్తే అందులో గొప్పేముంది" అన్నాడు. అబ్దుల్లాహ్ క్షణం ఆలస్యం చెయ్యకుండా అతని తల నరుక్కుని తెచ్చి దైవప్రవక్త (సల్లం) పాదాలదగ్గర పడేశారు.[1]

## ఘన విజయం

యుద్ధం ముగిసిన తరువాత ముస్లింలలో కేవలం పధ్నాలుగు మంది మాత్రమే అమరగతినొందారని తెలిసింది. వారిలో ఆరుగురు ముహాజిర్లు కాగా మిగిలినవారందరూ అన్సారీలే.[2] కాని మరోవైపు ఖురైషుల వెన్నుముక విరిగిపోయింది. గొప్పవీరులుగా పేరుమోసిన ఖురైష్ సర్దారులు, సైన్యాధిపతులందరూ ఈ యుద్ధంలో మరణించారు. వారిలో ఉత్బా, షైబా, అబూజహల్, అబుల్ బుఖ్తరీ, జమ్ఆ బిన్ అస్వద్, ఆస్‌బిన్ హిషామ్, ఉమయ్యా బిన్ ఖల్ఫ్, మునబ్బా బిన్ హజ్జాజ్ లాంటి అతిరథ, మహారథులున్నారు. సుమారు డెబ్బైమంది మరణించటంతో పాటు, అంతేమంది ఖైదీలుగానూ పట్టుబడ్డారు.[3] యుద్ధఖైదీల్లో ఉఖబా, నజర్ బిన్ హారిస్‌లు మాత్రం విడుదలయ్యారు. మిగిలిన వారిని ఖైదు చేసి మదీనాకు తీసుకురావటం జరిగింది. వీరిలో

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
2) సీరత్ ఇబ్నె కసీర్ రెండవ సంపుటి 463వ పుట.
3) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం

www.abulhasanalinadwi.org

అబ్బాస్, ఉఖైల్, అబుల్ ఆస్ (దైవప్రవక్తగారి అల్లుడు) కూడా ఉన్నారు.[1]

సాధారణంగా దైవప్రవక్త (సల్లం) యుద్ధాల తరువాత ఎక్కడయినా శవం కనపడితే దాన్ని అక్కడే సమాధి చేయించేవారు. కాని ఈ సందర్భంలో శవాల సంఖ్య చాలా ఎక్కువగా ఉండటంతో వాటిని వేర్వేరుగా పూడ్చిపెట్టడం కష్టమయిపోయింది. అంచేత ఆయన ఆ శవాలన్నింటినీ అక్కడే ఉన్న ఒక పెద్ద బావిలో వేయించారు.[2] కాని ఉమయ్యా శవం మాత్రం బాగా ఉబ్బి బావిలో పడేయటానికి అనువుగా లేకపోవటంతో దాన్ని అక్కడికక్కడే మట్టితో కప్పేయమని ఆదేశించారు.[3]

## యుద్ధఖైదీల పట్ల ముస్లింల వ్యవహారం

దైవప్రవక్త(సల్లం) యుద్ధంలో పట్టుబడ్డ ఖైదీలందరినీ నలుగురైదుగురు అనుచరులకు అప్పగించి వారిపట్ల మర్యాదగా మెలగమని ఆదేశించారు. దైవప్రవక్త అనుచరులు ఆ యుద్ధఖైదీలకు అన్నం పెట్టి తాము మాత్రం ఖర్జూరపండ్లు తిని కడుపునింపుకునేవారు. ఆ ఖైదీల్లో ముస్అబ్ బిన్ ఉమైర్ సోదరుడైన అబూ అజీజ్ కూడా ఉన్నారు. ఆయన ఇలా తెలియజేస్తున్నారు:

నేనొక అన్సార్ ఇంట్లో ఖైదీగా ఉంచబడ్డాను. ఆ ఇంటివాళ్ళు ఉదయం, సాయంత్రం నాకు రొట్టెలిచ్చి తాము మాత్రం ఖర్జూర పండ్లతో సరిపెట్టుకునేవారు. ఆ రొట్టెలు తినడానికి నా మనసొప్పేది కాదు. నేను ఆ రొట్టెలు వారి చేతికిచ్చేవాణ్ణి, వారు వాటిని తాకనయినా తాకకుండా తిరిగి నాకే వాపసు చేసేవాళ్ళు. దైవప్రవక్త (సల్లం) తన అనుచరుల్ని ఖైదీలపట్ల ఉత్తమంగా వ్యవహరించమని ఆదేశించారు. అందుకే వారు మాపట్ల ఆ విధంగా ప్రవర్తించేవారు.[4]

ఖైదీల్లో సుహైల్ బిన్ అమ్ర్ అనే వాడొకడు ఉండేవాడు. అతను

---

1) తారీఖె తబ్రీ మూడవ సంపుటి 38వ పుట. అల్‌బిదాయా వన్నిహాయా మూడవ సంపుటి 297వపుట.
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.
3) తారీఖె తబ్రీ రెండవ సంపుటి 37వ పుట.
4) తారీఖె తబ్రీ రెండవ సంపుటి 39వ పుటతబఖాత్ ఇబ్నెసాద్ రెండవ సంపుటి 14వ పుట

www.abulhasanalinadwi.org

మంచి వక్త. బహిరంగ సభల్లో దైవప్రవక్త (సల్లం)కు వ్యతిరేకంగా ఉపన్యాసాలు చేసేవాడు. హజ్రత్ ఉమర్ 'అతని క్రింది రెండు పళ్ళు ఊడబీకితే మరోమారు ఉపన్యాసాల జోలికి పోకుండా ఉంటాడన్నారు' ఆవేశపడిపోతూ.

ఆ మాటకు దైవప్రవక్త(సల్లం), "నేనితని శరీరావయవాలను పాడుచేస్తే దేవుడు నేను దైవప్రవక్తనని కూడా చూడకుండా నా అవయవాల్ని పాడుచేస్తాడు' అన్నారు.[1] ఖైదీల దగ్గర బట్టలు లేకపోతే దైవప్రవక్త (సల్లం) వారికి బట్టలు ఇప్పించారు. అబ్బాస్ చాలా ఎత్తుగా ఉండటం మూలాన ఆయనకు ఎవరి బట్టలూ సరిపోలేదు. అప్పుడు కపటుల నాయకుడైన అబ్దుల్లాహ్ బిన్ ఉబై అబ్బాస్‌కు తన చొక్కా తెప్పించి ఇచ్చాడు. అతను అబ్బాస్ అంత ఎత్తు ఉండేవాడు. అతను చనిపోయినప్పుడు దైవప్రవక్త (సల్లం) అతని శవానికి తొడిగించటానికి తన చొక్కా ఇచ్చారు. తన బాబాయి అబ్బాస్‌కు ఇంతకుముందు అతను చేసిన ఉపకారానికి బదులుగానే ఆయన అతని శవానికి తన చొక్కా తొడిగించారని బుఖారీలో ఉంది.[2]

ఒక్కొక్క యుద్ధ ఖైదీ నుండి నాల్గువేల దిర్హముల నష్టపరిహారం వసూలు చేయటం జరిగింది. పరిహారం చెల్లించలేని నిరుపేదల్ని వదలివేయటం జరిగింది. వారిలో చదువొచ్చిన వారు పదిమంది ముస్లిం పిల్లలకు చదువు చెప్పి విడుదల కావచ్చునని కూడా సూచించటం జరిగింది.[3] హజ్రత్ జైద్ బిన్ సాబిత్ అలా చదువుకున్నవారే![4]

అన్సార్లు హజ్రత్ అబ్బాస్ తమకు మేనల్లుడౌతారని, అంచేత ఆయన్నుండి నష్టపరిహారం వసూలు చేయకుండానే ఆయన్ని విడుదల చెయ్యాలని దైవప్రవక్త సన్నిధిలో విన్నవించుకున్నారు. కాని దైవప్రవక్త (సల్లం) చట్ట సమానత దృష్ట్యా అన్సార్ల విన్నపాన్ని త్రోసిపుచ్చారు. ఆ విధంగా అబ్బాస్‌కు కూడా నష్టపరిహారం చెలించవలసి వచ్చింది.[5]

---

1) సీరతున్నబీ మొదటి సంపుటి 330వ పుట. తారీఖె తబ్రీ సౌజన్యంతో
2) సహీహ్ బుఖారీలోని జిహాద్ ప్రకరణం
3) ముస్నదె అహ్మద్ మొదటి సంపుటి 247వ పుట.
4) సీరతున్నబీ, తబఖాత్ ఇబ్నెసాద్ సౌజన్యంతో.
5) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

నష్టపరిహారం నాల్గువేలే అయినప్పటికీ నాయకుల నుండి ఇంకా ఎక్కువ వసూలు చేయటం జరిగింది. అబ్బాస్ ధనికులవటం చేత ఆయన దగ్గరి నుండి కూడా ఎక్కువ నష్టపరిహారం వసూలు చేశారు. ఆయన దీని గురించి దైవప్రవక్త (సల్లం)కు ఫిర్యాదు చేశారు. ఇస్లాం నెలకొల్పగోరుతున్న సామాజిక న్యాయభావనలో అయినవారు, కానివారు, సామాన్యులు, ప్రముఖులన్న భేదభావం లేదన్న సంగతి ఆయనకేం తెలుసు?! సామాజిక న్యాయ నియమం ప్రకారం దైవప్రవక్త (సల్లం) అబ్బాస్ ఫిర్యాదును కొట్టిపారేసినా, ఆయనతో తనకున్న ఆత్మీయతా భావం వల్ల దైవప్రవక్త (సల్లం)కు ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. ప్రజలు అబ్బాస్‌ను విడుదల చేసిన తరువాత గాని ఆయన మనసు కుదుటపడలేదు.[1]

## అబుల్ ఆస్ (రజి) ఇస్లాం స్వీకరణ

యుద్ధ ఖైదీల్లో దైవప్రవక్త (సల్లం) అల్లుడు అబుల్ ఆస్ కూడా ఉన్నారు. ఆయన దగ్గర నష్టపరిహారం చెల్లించేందుకు పైకం లేకపోవటంతో మక్కాలో ఉన్న తన భార్య (దైవప్రవక్త(సల్లం)కూతురు) హజ్రత్ జైనబ్‌కు డబ్బులు పంపమని కబురంపారు. జైనబ్ వివాహం జరిగినప్పుడు ఆమె తల్లి హజ్రత్ ఖదీజా (రజి. అన్హా) ఆమెకు ఒక ఖరీదైన హారం కానుకగా ఇచ్చారు. హజ్రత్ జైనబ్ ఆ హారమే మెళ్ళోనుండి తీసి భర్తకు పంపారు. ఆ హారాన్ని చూడగానే దైవప్రవక్త (సల్లం)కు పాతికేళ్ళనాటి సంఘటన గుర్తొచ్చింది. అప్రయత్నంగానే ఆయన విలపించటం మొదలుపెట్టారు. తన అనుచరులతో 'మీకిష్టమయితే నా కూతురికి తన తల్లి ఇచ్చిన జ్ఞాపికను ఆమెకు ఇచ్చివేయండి' అన్నారు. సహచరులందరూ ఆయన ఆజ్ఞను శిరసావహించి ఆ హారాన్ని జైనబ్ (రజి. అన్హా)కు తిప్పిపంపారు.

అబుల్ ఆస్ విడుదలై మక్కావచ్చి హజ్రత్ జైనబ్‌ను మదీనాకు పంపేశారు. అబుల్ ఆస్ చాలాపెద్ద వ్యాపారి. ఈ సంఘటన జరిగిన కొన్ని సంవత్సరాల తరువాత ఆయన భారీ ఎత్తున వ్యాపార సామగ్రిని వెంటబెట్టుకొని సిరియాకు వెళ్ళారు. తిరుగు ప్రయాణంలో ముస్లింలు

---

1) అల్ బిదాయా వన్నిహాయా రెండవ సంపుటి 300వ పుట.

www.abulhasanalinadwi.org

ఆయన్ని మొత్తం వర్తక సామగ్రితో సహా పట్టుకున్నారు. ఆయన వ్యాపార సామగ్రినంతా ముస్లిం సిపాయిలు పంచుకున్నారు. ఈయన రహస్యంగా వెళ్ళి జైనబ్ (రజి. అన్హా) ఇంట్లో తలదాచుకున్నారు. జైనబ్ కూడా ఆయనకు రక్షణ కల్పించారు. ఈ విషయం దైవప్రవక్తకు తెలిసింది. ఆయన ప్రజలనుద్దేశించి, "మీరు సముచితమని భావిస్తే వెంటనే అబుల్ ఆస్ సామగ్రి అంతా అతనికి వాపసు చెయ్యండి" అన్నారు.

ప్రజలు దైవప్రవక్త ఆజ్ఞను శిరసావహించారు. ఒక్క దారమయినా తమ దగ్గర ఉంచుకోకుండా సిపాయిలు వ్యాపార సామగ్రినంతా అబుల్ఆస్కు వాపసు చేసేశారు. దైవప్రవక్త (సల్లం) తన పట్ల కనబరచిన ఈ ఉదారవైఖరికి అబుల్ ఆస్ హృదయం చలించింది. ఆయన మక్కావెళ్ళి తనకు భాగస్వాములైన వ్యాపారులందరికీ వ్యాపార లెక్కలు చూపించి తాను ఇస్లాం స్వీకరించి మదీనాకు బయలుదేరారు. వెళ్తూ వెళ్తూ తన భాగస్వాములతో, "అబుల్ ఆస్ మా సొమ్ము కాజేశాడు. మక్కాకు వస్తే మేము నిలదీస్తామన్న భయంతో ఇస్లాం స్వీకరించి మదీనాలో ఉండిపోయాడని మీరు అనుకుంటారేమోనని నేను మీకు వ్యాపార లెక్కలు చూపించి మరీ వెళ్తున్నాను" అన్నారు.[1]

## ఉమైర్ బిన్ వహబ్ (రజి) ఇస్లాం స్వీకరణ

ఖురైష్కు చెందిన ఉమైర్ బిన్ వహబ్ ఒకప్పుడు ఇస్లాంకు బద్ధ విరోధి. అతను మరియు సఫ్వాన్ బిన్ ఉమయ్యా ఇద్దరూ ఒక రాయి మీద కూర్చొని బద్ర్యుద్ధంలో చనిపోయిన తమవారిని తలచుకుంటూ ఏడ్పులు, పెడబొబ్బలు పెడుతున్నారు. సఫ్వాన్ దుఃఖసాగరంలో మునకలు వేస్తూ, దైవసాక్షి! ఇక మా బ్రతుకులకు అర్థం లేదు"అన్నాడు. దానికి ఉమైర్ "నువ్వు నిజం చెబుతున్నావు సోదరా! నాకే గనక అప్పుల బాధ లేకపోయినట్లయితే, నా పసిపిల్లల చింత లేకపోయినట్లయితే నేను ఇప్పుడే వెళ్ళి ముహమ్మద్ అంతు చూసేవాణ్ణి. నా కొడుకు కూడా అక్కడ బందీ అయి ఉన్నాడు" అన్నాడు సఫ్వాన్కు వంతపాడుతూ.

1) సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటి 657వ పుట; బైహఖీగారి దలాయిలున్ను బువ్వా గ్రంథం మూడవ సంపుటి 154 నుండి 157 పుటలు, తారీఖె తబ్రీ మూడవ సంపుటి43, 44 పుటలు

www.abulhasanalinadwi.org

"నీకు ఆ బెంగ అక్కర్లేదు. నీ అప్పుల, నీ పిల్లల బాగోగుల సంగతి నాకు వదిలెయ్యి. నువ్వెళ్ళి ముహమ్మద్ అంతు చూడు"-సఫ్వాన్ ఉమైర్‌ను ఉసిగొల్పాడు.

అసలే ప్రతీకార వాంఛతో రగిలిపోతున్న ఉమైర్ సఫ్వాన్ కవ్వింపుతో మరింత ఉగ్రుడైపోయాడు. బరబరా ఇంటికివెళ్ళి ఖడ్గాన్ని విషంలో ముంచి తీశాడు. ఏ మాత్రం అలస్యం చెయ్యకుండా మదీనా చేరుకున్నాడు. హజ్రత్ ఉమర్ (రజి) అతని ఆవేశపూరిత వదనాన్ని చూసి కీడు శంకించారు: మెడ పట్టుకొని దైవప్రవక్త దగ్గరికి తీసుకొని వచ్చారు. ముందు అతన్ని వదలిపెట్టమని దైవప్రవక్త(సల్లం) ఉమర్‌ను ముందు ఆదేశించారు. తరువాత అతన్ని తన దగ్గరికి పిలిచి, "ఉమైర్ ఏ ఉద్దేశ్యంతో వచ్చావ్" అని అడిగారు.

"నా కొడుకుని విడిపించుకొని వెళ్దామని వచ్చాను"- ఏ మాత్రం భయపడకుండా జవాబు చెప్పాడతను.

"మరి చేతిలో ఈ ఖడ్గమెందుకు?"-మళ్ళీ మృదువుగానే అడిగారు దైవప్రవక్త (సల్లం).

" మా చేతుల్లో ఖడ్గాలున్నా మీరు భయపడాల్సిన అవసరం లేదు. బద్ర్ యుద్ధంలో మేము ఈ ఖడ్గాలతో ఏం ఒరగబెట్టామని?"- ఉమైర్ కాస్త తడుముకుంటూనే సమాధానం చెప్పాడు.

"భయపడకుండా ఎలా ఉంటాం. నువ్వూ, సఫ్వాన్ మక్కాలో ఫలానా రాళ్ళగుట్ట దగ్గర కూర్చొని నన్ను చంపటానికి కుట్ర పన్నిన సంగతి నిజం కాదా?" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఆ మాటవినగానే ఉమైర్ నిర్ఘాంతపోయాడు. "ముహమ్మద్! నిస్సందేహంగా మీరు దైవప్రవక్తే. దైవసాక్షి! ఈ విషయం నాకూ సఫ్వాన్‌కు తప్ప మూడోవ్యక్తికి తెలియనే తెలియదు" అప్రయత్నంగానే అతని నోటి నుండి దేవుడు, దైవప్రవక్తల స్తోత్రం మొదలయ్యింది. అటు దైవప్రవక్త మరణవార్త కోసం వేచిచూస్తున్న మక్కా అవిశ్వాసుల చెవులకు ఉమైర్ ఇస్లాం స్వీకరించారన్న వార్త వినపడింది.

www.abulhasanalinadwi.org

దైవప్రవక్త(సల్లం) తన అనుచరుల్ని ఉద్దేశించి, "క్రొత్తగా ఇస్లాం స్వీకరించిన ఈ మీ సోదరునికి ధర్మం గురించి బోధించండి. ఖురాన్ నేర్పించండి. ఇతని కుమారుణ్ణి విడిచిపెట్టండి" అని ఆదేశించారు.

ఉమైర్ (రజి) దైవప్రవక్తతో, "దైవప్రవక్తా! మీరు అనుమతిస్తే నేను మక్కాకు తిరిగి వెళ్ళి అక్కడి ప్రజలకు ఇస్లాం ధర్మం గురించి బోధిస్తాను. నేను ఇప్పటి వరకూ ముస్లింలను చాలా బాధపెట్టాను. దానికి నా మనసు పరిపరివిధాలా చింతిస్తోంది. ఇప్పుడు మక్కావెళ్ళి బహుదైవారాధకుల భరతం పట్టాలనిపిస్తోంది నాకు" అన్నారు.

ఇటు సఫ్వాన్ ఉమైర్‌ను దైవప్రవక్త(సల్లం) మీదకు ఉసిగొల్పి మదీనాకు పంపిన తరువాత ఖురైష్ సర్దారుల ముందు గొప్పలు చెప్పుకోవటం ప్రారంభించాడు. "అతి త్వరలోనే పరిస్థితులు ఎలా మారిపోతాయో చూడండి! బద్ర్ యుద్ధ ఓటమి వల్ల మీ గుండెల్లో రగిలిన మంటలు ఆరిపోనున్నాయి. అతిత్వరలోనే ముహమ్మద్ మరణవార్త వింటారు మీరు" అనేవాడు.

కాని ఉమైర్ మదీనావెళ్ళిన తరువాత ఇస్లాం స్వీకరించారని తెలియగానే సఫ్వాన్ కొయ్యబారిపోయాడు. ఇక తాను జీవితాంతం ఉమైర్‌తో మాట్లాడననీ, అతనికి మంచి చెయ్యనని ఒట్టేసుకున్నాడు. కాని సఫ్వాన్ తనతో మాట్లాడనంతమాత్రాన ఉమైర్‌కు కలిగే నష్టమేమిటి? ఆయన మాత్రం మక్కాకు తిరిగొచ్చి నిక్షేపంగా ఇస్లాం ప్రచారం మొదలుపెట్టారు. సఫ్వాన్ కళ్ళముందే ఎంతోమంది ఆయన చేతుల మీదుగా ఇస్లాం స్వీకరించి ముస్లింలయ్యారు.[1]

## హజ్రత్ ఫాతిమా (రజి. అన్హా) వివాహం

హజ్రత్ ఫాతిమా (రజి. అన్హా) దైవప్రవక్త (సల్లం)గారి కనిష్ట పుత్రిక. పద్దెనిమిదో యేట ఆమెకు వివాహ సందేశాలు రావటం మొదలయ్యాయి. ఆ సమయంలో హజ్రత్ అలీ (రజి) కూడా వివాహ సందేశం

1) బైహఖీ గారి దలాయిలున్నుబువ్వా గ్రంథం మూడవ సంపుటి 147 నుండి 149 పుటలు. సీరత్ ఇబ్నె హిషామ్ మొదటి సంపుటి 661వ పుట.

www.abulhasanalinadwi.org

పంపగా దైవప్రవక్త(సల్లం) కూతురి అభిప్రాయం అడిగారు. అందుకామె మౌనం వహించారు. ఒక విధంగా ఆ మౌనమే ఆమె అంగీకారం. అప్పుడు దైవప్రవక్త (సల్లం) అలీని "నీ దగ్గర మహర్‌గా ఇవ్వటానికి ఏమయినా ఉందా?" అని అడిగారు.

హజ్రత్ అలీ ప్రస్తుతం తన దగ్గరేమీ లేదన్నారు.

దైవప్రవక్త (సల్లం) బద్ర్ యుద్ధంలో లభించిన హుతియ్యా కవచం ఏమయిందని అడిగారు. అదయితే ఉందన్నారు అలీ (రజి). దైవప్రవక్త (సల్లం) "అది చాలు" అన్నారు.

కవచమనగానే అదేదో చాలా విలువైన వస్తువే అయివుంటుందని పించవచ్చు వినేవారికి. కాని దాని అసలు ఖరీదు విన్న తరువాత తెలుస్తుంది దాని విలువేమిటో! దాని ఖరీదు కేవలం నూట ఇరవై ఐదు రూపాయలు మాత్రమే! హజ్రత్ అలీ (రజి) దగ్గర ఆ కవచంగాక ఒక గొర్రెతోలు, ఓ పాత దుప్పటి మాత్రమే ఉండేవి. ఆయన ఇవన్నీ ఫాతిమా (రజి. అన్‌హా)కు సమర్పించుకున్నారు. హజ్రత్ అలీ అప్పటి వరకు దైవప్రవక్త (సల్లం) దగ్గరే ఉండేవారు. వివాహం తరువాత వధూవరులిద్దరికీ ప్రత్యేకంగా ఇల్లు కావలసి వచ్చింది. హారిసా బిన్ నూమాన్ అన్సారీ దగ్గర చాలా ఇళ్లు ఉండేవి. వాటిలో కొన్ని అప్పటికే ఆయన దైవప్రవక్త(సల్లం)కు సమర్పించుకొని ఉన్నారు. హజ్రత్ ఫాతిమా తండ్రితో ఆయన ఇళ్ళల్లో నుంచి ఒక ఇల్లు తనకు కూడా ఇప్పియ్యమని అడిగారు. దైవప్రవక్త (సల్లం), "ఎందరికని ఇప్పించను? ఆయన్ను అడిగి అడిగి నాకు సిగ్గేస్తోంది" అన్నారు.

దైవప్రవక్త (సల్లం) ఆ మాట అన్నారని తెలియగానే హారిసా పరుగెత్తుకుంటూ వచ్చి, "దైవప్రవక్తా! నా దగ్గరున్న ధనమంతా మీదే. దైవసాక్షిగా చెబుతున్నాను. మీరు నా ఇల్లు తీసుకుంటే నాకెంతో సంతోషం కలుగుతుంది" అని చెప్పి ఒక ఇల్లు ఖాళీ చేసి ఇచ్చారు. హజ్రత్ అలీ దంపతులు ఆ ఇంట్లోకి మారారు.

జగత్ ప్రవక్త తన కూతురికి వివాహ సందర్భంలో ఇచ్చిన కానుకలు, ఒక నులక మంచం, ఒక తోలు దిండు-అందులో దూదికి బదులు

www.abulhasanalinadwi.org

ఖర్జూర ఆకులు ఉండేవి. ఇంకా ఓ మట్టి దేగిశ, ఓ తోలు సంచి, రెండు తిరుగుడు రాళ్ళు, రెండు మట్టి బిందెలు.

హజ్రత్ ఫాతిమా క్రొత్త ఇంట్లోకి ప్రవేశించిన తరువాత దైవప్రవక్త (సల్లం) నూతన దంపతుల్ని చూడటానికి వెళ్ళారు. గుమ్మం దగ్గర నిలబడి లోపలికి రావటానికి అనుమతి అడిగారు. అనుమతి గ్రహించిన తరువాత లోపలికి వెళ్ళారు. ఒక పాత్రలో నీళ్ళు తెప్పించి తన రెండు చేతులూ అందులో ముంచారు. ఆ నీటిని హజ్రత్ అలీ ఉదరంపై, భుజాలపై చల్లారు. తరువాత ఫాతిమా (రజి. అన్హా)ను పిలిచారు. ఆమె సిగ్గుపడుతూ తండ్రిదగ్గరికి వచ్చింది. ఆమెపై కూడా ఆ నీళ్ళు చల్లి, "నేను నీ వివాహం మా వంశంలోని అందరికన్నా ఉత్తమునితో చేశానమ్మా!" అన్నారు.[1]

## ప్రతీకార వాంఛ పెల్లుబికింది

అరబ్బు దేశంలో ఒకసారి యుద్ధం మొదలయ్యింది అంటే ఇక అది కొన్ని వందల సంవత్సరాల వరకు కొనసాగుతూనే ఉండేది. ప్రత్యర్థుల్లో ఓడిపోయినవారు ప్రతీకారం తీర్చుకోవటాన్ని తమ జీవిత లక్ష్యంగా భావించేవారు. బద్ర్ యుద్ధంలో ఖురైష్‌కు చెందిన డెబ్భైమంది వధించబడ్డారు. వారిలో అనేకులు ఖురైష్ తెగనాయకులు, మక్కాలో బాగా పేరుమోసినవారు. అంచేత మక్కా అవిశ్వాసులందరూ ముస్లింలపై ప్రతీకారేచ్ఛతో ఉడికిపోసాగారు.[2]

బద్ర్ యుద్ధ కాలంలో ఖురైష్ వర్తక బృందాలు భారీ ఎత్తున లాభాలు గడించి సిరియానుండి తిరిగొచ్చాయి. పెట్టుబడిదారులకు పెట్టుబడి డబ్బులు ఇచ్చివేసిన తరువాత మిగిలిన ధనాన్ని ఖురైషులు భద్రపరచి ఉంచారు.

చాలాకాలం వరకు ఖురైషులు బద్ర్‌యుద్ధంలో చనిపోయిన తమ పెద్దల గురించి దుఃఖిస్తూనే కూర్చున్నారు. కాని కొన్నాళ్ళ తరువాత ఆ దుఃఖం నుండి తేరుకోగానే వారికి తమ ప్రతీకార బాధ్యత గుర్తొచ్చింది.

1) సుననె అబూదావూద్‌లోని నికాహ్ ప్రకరణం, షిబ్లీ నూమానీ గారి సీరతున్నబీ గ్రంథం మొదటి సంపుటి 366వ పుట.

2) సీరతున్నబీ మొదటి సంపుటి 369వ పుట.

www.abulhasanalinadwi.org

అబూజహల్ కొడుకు ఇక్రిమాతో సహా కొంతమంది ఖురైష్ సర్దారులు, బద్ర్‌యుద్ధంలో మరణించినవారి బంధుమిత్రుల్ని వెంటబెట్టుకొని అబూసుఫ్యాన్ దగ్గరికి వెళ్ళి, 'ముహమ్మద్ మా జాతిని నాశనం చేశాడు. ఇప్పుడు మేమతనిపై పగతీర్చుకుంటాం. ఇప్పటివరకు వ్యాపారంలో మాకొచ్చిన లాభాలన్నిటినీ ఈ పని కోసమే ఖర్చుపెట్టాలనుకుంటున్నాం' అన్నారు. అందరి హృదయాలూ పగ, ప్రతీకారాలతో మండిపోతున్నాయి కాబట్టి ఎవరూ ఈ ప్రతిపాదనకు ఎదురు చెప్పలేదు.

కాని ఖురైషులు అంతకుముందే ముస్లింల శక్తిసామర్థ్యాలను అంచనావేసి ఉన్నారు. బద్ర్ యుద్ధంలో తాము తీసుకువెళ్ళిన సామగ్రి కన్నా ఇప్పుడు మరింత ఎక్కువ సామగ్రి తీసుకెళ్ళాలని నిశ్చయించుకున్నారు. అరబ్బు దేశంలో సైనికుల్ని ఉత్తేజితుల్ని చేయటానికి, యుద్ధం వైపు ప్రజల దృష్టిని మళ్ళించటానికి ఎక్కువగా ఉపయోగపడే సాధనం కవిత్వం. ఖురైషుల దగ్గర ఇద్దరు గొప్ప కవులుండేవారు. వారిలో ఒకడు అమ్ర్ జుమ్‌హీ. రెండవవాడు ముసాఫిహ్. అమ్ర్ జుమ్‌హీ బద్ర్‌యుద్ధంలో ముస్లింల చేతికి బందీగా చిక్కాడు. కాని ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) అతనిపై దయతలచి అతణ్ణి విడుదల చేశారు. అతను తిరిగి అవిశ్వాసుల్లోనే చేరిపోయాడు. ఖురైషుల విజ్ఞప్తి మేరకు అమ్ర్ జుమ్‌హీ మరియు ముసాఫిహ్ ఇద్దరూ మక్కానుండి బయలుదేరి అనన్య సామాన్యమైన తమ వాక్చాతుర్యంతో ఖురైష్ ప్రజల హృదయాల్లో పగ ప్రతీకారాల మంటల్ని రగుల్గొల్పారు.

యుద్ధాల్లో సైనికులు సహనస్థైర్యాలతో, ఉత్సాహం ఉద్రేకాలతో పోరాడాలని అరబ్బులు తమవెంట స్త్రీలను కూడా యుద్ధానికి తీసుకుని వెళ్ళేవారు. యుద్ధానికి స్త్రీలు కూడా వచ్చినప్పుడు సైనికులు ఓడిపోతే తమజాతి మహిళలు అగౌరవం పాలౌతారన్న భయంతో, పౌరుషంతో వారు ప్రాణాలకు తెగించి మరీ పోరాడేవారు. ఖురైష్ మహిళల్లోని చాలామంది బద్ర్‌యుద్ధంలో తమ కొడుకుల్ని పోగొట్టుకొని దెబ్బతిన్న ఆడపులుల్లా ప్రతీకారం తీర్చుకునే అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. వారిలో కొంతమంది తమ కొడుకుల్ని చంపిన వారి పచ్చి నెత్తురు త్రాగుతామని ప్రతినబూనారు. ఏది ఏమైనా యుద్ధానికి

సైన్యం సిద్ధమయినప్పుడు ఉన్నతకుటుంబాల స్త్రీలు కూడా సైనికుల వెంట యుద్ధానికి బయలుదేరారు.[1]

హజ్రత్ హమ్జా బద్ర్ యుద్ధంలో హింద్ అనే మహిళ తండ్రి అయిన ఉత్బాను వధించారు. జుబైర్ బిన్ ముత్యిమ్ బాబాయి కూడా హమ్జా చేత వధించబడ్డాడు. అంచేత హింద్ జుబైర్ బానిస అయిన ఒక నీగ్రోవాణ్ణి హమ్జాను చంపమని పురమాయించింది. హమ్జాను చంపితే అతణ్ణి బానిసత్వం నుండి స్వేచ్ఛ కల్పిస్తానని మాటిచ్చింది.[2]

దైవప్రవక్త (సల్లం)గారి బాబాయి అయిన అబ్బాస్ ఇస్లాం స్వీకరించినా అప్పటికింకా మక్కాలోనే ఉన్నారు. ఆయన అతివేగంగా ప్రయాణించే ఒక వార్తాహరుని ద్వారా దైవప్రవక్త (సల్లం)కు మక్కాలోని పరిస్థితుల గురించి ఒక లేఖ వ్రాసి పంపారు. మూడ్రోజుల్లోగా మదీనా చేరుకోవాలని ఆ వార్తాహరునికి తాకీదు చేశారు. దైవప్రవక్త (సల్లం)కు ఈ విషయం తెలియగానే ఆయన హి.శ. మూడవ యేట షవ్వాల్ మాసం ఐదవ తేదీన అనస్, మూనిస్ అనే ఇద్దరు గూఢచారుల్ని ఖురైషుల గురించి మరింత సమాచారం తెలుసుకొని రమ్మని పంపించారు. వారు తిరిగొచ్చి ఖురైషుల సైన్యం మదీనా నగర సమీపానికి చేరుకుందనీ, వారి గుర్రాలు మదీనా పచ్చికబయళ్ళని మేసి నాశనం చేశాయని తెలియజేశారు.[3]

ఆ తరువాత దైవప్రవక్త(సల్లం) ఖురైషుల సైన్యం సంఖ్య ఎంతో కనుక్కొని రమ్మని హుబాబ్ బిన్ ముంజిర్‌ను పంపారు. ఆయన వెళ్ళి సైన్యాన్ని సరిగ్గా అంచనా వేసుకొని వచ్చి దైవప్రవక్త (సల్లం)కు తెలియపరచారు. శత్రువులు మదీనా నగరంపై దాడిచేసే అవకాశాలుండటంతో నగరం చుట్టుప్రక్కలా కాపలాదారుల్ని నియమించడం జరిగింది. హజ్రత్ సాద్ బిన్ ఉబాదా, సాద్ బిన్ ముఆజ్‌లు ఆయుధాలు ధరించి ఆ రాత్రంతా మస్జిదె నబవీ ద్వారం వద్ద కాపలా ఉన్నారు.[4]

1) తారీఖె తబ్రీ మూడవ సంపుటి 58,59 పుటలు; సీరత్ ఇబ్నెహిషామ్ రెండవ సంపుటి 20, 21వ పుటలు.
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
3) సీరత్ హల్బియ్యా రెండవ సంపుటి 490 వ పుట.
4) సీరత్ హల్బియ్యా రెండవ సంపుటి 490 వ పుట.

www.abulhasanalinadwi.org

తెల్లారినాక దైవప్రవక్త (సల్లం) తన అనుచరులతో యుద్ధం గురించి చర్చించారు. చాలా మంది ముహాజిర్లు, అన్సార్లలోని పెద్దలు స్త్రీలను నగరం వెలుపల ఉన్న కోటల్లోకి పంపించి, పురుషులు నగరంలోనే ఉండి శత్రువుల దాడుల్ని తిప్పికొడదామని సలహా ఇచ్చారు. అబ్దుల్లాహ్ బిన్ ఉబై బిన్ సలూల్ అంతకుముందెన్నడూ ముస్లింల సలహా సమావేశాలకు హాజరు కాలేదు. తొలిసారిగా ఈ సమావేశానికి హాజరై అతను కూడా అదే సలహా ఇచ్చాడు. కాని బద్ర్ యుద్ధంలో పాల్గొనలేక పోయిన యువత మాత్రం నగరం నుంచి బయటికివెళ్ళి యుద్ధం చెయ్యాలని పట్టుబట్టింది. దైవప్రవక్త (సల్లం) ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఇంట్లోకి వెళ్ళి కవచం ధరించి బయటికొచ్చారు. ప్రజలు తాము దైవప్రవక్త (సల్లం) అభీష్టానికి వ్యతిరేకంగా మాట్లాడి ఆయన్ని యుద్ధానికి బయలుదేరేలా చేసినందుకు బాధపడ్డారు. తాము తమ అభిప్రాయాల్ని మార్చుకోవటానికి సిద్ధంగా ఉన్నామని దైవప్రవక్తతో చెప్పారు. కాని ఒకసారి ఆయుధాలు ధరించిన తరువాత తిరిగి వాటిని విప్పేయటమనేది ఒక ప్రవక్తకు శోభించదు" అన్నారాయన (సల్లం).[1]

1) సహీహ్ బుఖారీలోని ఏతెసామ్ ప్రకరణం, ముస్నదె అహ్మద్ మొదటి సంపుటి 351వ పుట. సుననె దారిమి రెండవ సంపుటి 129వ పుట.

www.abulhasanalinadwi.org

# ఉహుద్ ప్రతిఘటన

అటు ఖురైషులు బుధవారం నాడు మదీనా నగర సమీపానికి చేరుకొని ఉహుద్ పర్వత లోయలో ఆగారు. దైవప్రవక్త(సల్లం) శుక్రవారం నాడు జుమా నమాజ్ చేసుకున్న తరువాత వెయ్యి మంది అనుచరులతో నగరం నుండి బయలుదేరారు. వారిలో మూడొందల మంది అబ్దుల్లాహ్ బిన్ ఉబై సంఘానికి చెందినవారున్నారు. కాని మార్గమధ్యంలోనే అతను, ముహమ్మద్ (సల్లం) తన సలహాను అంగీకరించలేదన్న వంక చూపెట్టి తన మూడొందల మంది అనుచరుల్ని వెంటబెట్టుకొని మదీనాకు తిరిగి వెళ్ళిపోయాడు. ఇక దైవప్రవక్త (సల్లం) వెంట మిగిలింది ఏడొందల మంది అనుచరులు మాత్రమే.[1] వారిలో వందమంది దగ్గర కవచాలున్నాయి. మదీనా వెలుపలికి వచ్చాక సైన్యాన్ని పరిశీలించటం జరిగింది. చిన్నపిల్లల్ని వెనక్కి త్రిప్పి పంపించటం జరిగింది. ఆ విధంగా పంపబడిన వారిలో జైద్ బిన్ సాబిత్, బరా బిన్ ఆజిబ్, అబూసయీద్ ఖుద్రీ, అబ్దుల్లాహ్ బిన్ ఉమర్, ఇరాబా అవేశీ కూడా ఉన్నారు. యువకుల్లో ఇస్లాం కోసం ప్రాణత్యాగం చెయ్యాలని ఎంత తపన ఉండేదంటే-రాఫె బిన్ ఖదీజ్‌తో, "నువ్వు చిన్న పిల్లాడివి. మదీనాకు తిరిగి వెళ్లిపోమ"ని అంటే ఆయన తాను పెద్దవాడిలా కనిపించాలని కాలివ్రేళ్ళపై లేచి నించునేవారు. ఎట్టకేలకు ఆయన పథకం పారి యుద్ధంలో పాల్గొనటానికి ఆయనకు అనుమతి లభించింది. అది చూసి రాఫెకు సమవయస్కుడైన సమురా అనే యువకుడు తాను మల్లయుద్ధంలో రాఫెను చిత్తుచేయగలననీ, అతనికి అనుమతి లభించినప్పుడు తనక్కూడా లభించాలని మారాం చేశాడు. ఇద్దరికీ పోటీ పెడితే నిజంగానే సమురా రాఫెను చిత్తుగా ఓడించాడు. దాంతో అతనికి కూడా యుద్ధంలో పాల్గొనటానికి అనుమతి లభించింది.[2]

---

1) జాదుల్ మఆద్ మూడవ సంపుటి 194వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 64వ పుట.

2) తారీఖె తబ్రీ మూడవ సంపుటి 61వ పుట. సీరత్ ఇబ్నె కసీర్ మూడవ సంపుటి 30వ పుట. సీరత్ ఇబ్నెహిషామ్ రెండవ సంపుటి 66వ పుట.

www.abulhasanalinadwi.org

దైవప్రవక్త (సల్లం) ఉహుద్ పర్వతం వీపు వెనుక భాగంలో ఉండేటట్లు బారులు తీర్చారు. యుద్ధపతాకాన్ని ముస్అబ్ బిన్ ఉమైర్ చేతికిచ్చారు. జుబైర్ బిన్ అవ్వామ్ సైన్యానికి దళపతి అయ్యారు. కవచాలు లేని సైనికపటాలాల సారథ్యం హమ్జా (రజి)కు లభించింది.[1] శత్రువులు వెనుక వైపు నుంచి దాడిచేసే అవకాశాలుండటంతో యాభై మంది విలుకాళ్ళను పర్వత కనుమ దగ్గర నియమించి యుద్ధంలో ముస్లింలు గెలుపొందినా సరే అక్కణ్ణుంచి కదలకూడదని తాకీదు చేయటం జరిగింది. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ ఆ విలుకాళ్ళకు నాయకునిగా నియమితులయ్యారు.[2]

ఖురైషులు బద్ర్ యుద్ధంలో కలిగిన అనుభవం వల్ల ఈసారి కడు జాగ్రత్తగా సైనికుల పంక్తులు సక్రమంగా ఉండేటట్లు చూసుకున్నారు. సైన్యంలోని కుడిపక్షానికి పర్యవేక్షకునిగా ఖాలీద్ బిన్ వలీద్ను, ఎడమ పక్షానికి అబూజహల్ కొడుకు ఇక్రిమాను నియమించారు. రౌతుదళానికి అధిపతిగా సఫ్వాన్ బిన్ ఉమయ్యా నియమించబడ్డాడు. ఇవికాక విలుకాళ్ళ విభాగం ఒకటి వేరుగా ఉండింది. దానికి అబ్దుల్లాహ్ బిన్ రబీయా సారథి అయ్యాడు. యుద్ధపతాకం తల్హా చేతికి చిక్కింది. అవసరానికి పనికొస్తాయని ఖురైషులు ముందుగానే రెండొందల గుర్రాలు అదనంగా కొనుక్కొని ఉంచుకున్నారు.[3]

సైన్యానికి ముందు ఖురైష్ స్త్రీలు డప్పు వాయించుకుంటూ ఉద్రేక పూర్వకమైన గేయాలు పాడుతూ బయలుదేరారు. ఆ గేయాల్లో బద్ర్ యుద్ధంలో చనిపోయిన ఖురైషుల పట్ల సంతాపం, ముస్లింల పట్ల పగ, ప్రతీకార భావాలు ప్రకటితమయ్యేవి. ఆ గేయాలు విని సైనికుల రక్తం ఉడికిపోయేది. అబూ సుఫ్యాన్ భార్య హింద్ ముందుగా, ఆమె వెనుక పధ్నాలుగు మంది స్త్రీలు ఈ విధంగా గీతాలాపన చేస్తూ నడవసాగారు.

"మేము దివి తారల ముద్దు బిడ్డలం
పట్టు తివాచీలపై నడిచే పడతులం

1) తారీఖె తబ్రీ మూడవ సంపుటి 61, 62 వ పుటలు.
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
3) తారీఖె తబ్రీ మూడవ సంపుటి 62, 63 వ పుటలు.

www.abulhasanalinadwi.org

మీరు ఎదురొడ్డి పోరాడితే అక్కున చేర్చుకుంటాం
వెన్ను చూపితే మేమూ మిమ్మల్ని వీడిపోతాం" [1]

## యుద్ధారంభం

ముందుగా అవిశ్వాసుల తరపు నుండి, మదీనా నగరంలో ఒకప్పుడు 'ప్రజల మనిషి' అనిపించుకున్న అబూఆమిర్ అనేవాడు నూట యాభై మందితోపాటు రంగంలోకి దిగాడు. ఇస్లాం రాకకు మునుపు తన సాత్వికత, నిరాడంబరతల మూలంగా మదీనాలో ప్రజలందరూ అతణ్ణి గౌరవించేవారు. ఇప్పుడు కూడా అన్సార్లు తనను చూస్తే దైవప్రవక్త (సల్లం)కు సహాయం చేయటాన్ని మానుకుంటారని అతను తలపోశాడు. యుద్ధభూమిలోకి వచ్చి, "నన్ను గుర్తుపట్టారా? నేను అబూ ఆమిర్‌ని" అని గట్టిగా కేకపెట్టి అన్నాడు. కాని అక్కడ అతను అనుకున్నట్టు జరగలేదు. పైగా అన్సార్లు అతనికి సమాధానంగా," ఒరేయ్ నీచుడా! మేము నిన్ను గుర్తుపట్టాం. దేవుడు నీ కోరికను మన్నించకుండుగాక"! అన్నారు.[2]

ఖురైష్ యుద్ధపతాకం పట్టుకుని ఉన్న తల్హా ముందుకు వచ్చి, "ముస్లింలలో నన్ను అతి త్వరగా నరకానికి పంపగలిగేవాడు లేదా నా చేత స్వర్గాన్ని పొందేవాడు ఎవడైనా ఉన్నాడా?" అంటూ సవాలు చేశాడు.

'నేనున్నా'నంటూ హజ్రత్ అలీ ఒక్క ఉదుటున అతని మీదికి దూకి కరవాలం ఝుళిపించారు. రెప్పపాటులోనే తల్హా శవం నేలమీద కనిపించింది.[3]

తల్హా తరువాత అతని కొడుకు ఉస్మాన్ పతాకాన్ని తన చేతిలోకి తీసుకున్నాడు. అతని వెనుక స్త్రీలు గేయాలు పాడుతూ బయలుదేరారు. అతను కూడా.

---

1) సీరత్ ఇబ్నెకసీర్ మూడవ సంపుటి 31వ పుట. సీరత్ ఇబ్నెహిషామ్ 27, 28 పుటలు. హాకిమ్ ఈ కవితల్ని తన "ముస్తద్రక్" గ్రంథంలో పేర్కొన్నారు.

2) ముస్నదె అహ్మద్ నాల్గో సంపుటి 46వ పుట. ముస్తద్రక్ హాకిమ్ రెండవ సంపుటి 107, 108 పుటలు.

3) తారీఖె తబ్రీ మూడవ సంపుటి 63వ పుట.

www.abulhasanalinadwi.org

"బరిసెనెత్తినవాడు దాన్ని శత్రువుల రక్తంతో తడపాలి లేదా అది విరిగి ముక్కలయ్యేదాకా పోరాడాలి" అంటూ ముందుకొచ్చాడు. వెంటనే హమ్జా(రజి) అతన్ని మార్కొని తన ఖడ్గంతో అతని భుజంపై ఒక్క వేటు వేస్తే అది నడుందాకా దిగబడింది. వెంటనే ఆయన నోటినుండి, "నేను హజ్ యాత్రికులకు నీళ్లు త్రాపించేవారి కుమారుణ్ణి" అనే పౌరుషం నిండిన పలుకులు వెలువడ్డాయి.

ఇక ఆ తరువాత అసలు యుద్ధం ప్రారంభమయింది.[1] హజ్రత్ హమ్జా, అలీ, అబూ దుజానా శత్రుసేనల్లోకి చొచ్చుకొనిపోయి పంక్తులకు పంక్తుల్నే మట్టి కరిపించసాగారు.[2] అబూ దుజానా అరబ్ దేశంలోనే పేరెన్నికగన్న పహిల్వాను. దైవప్రవక్త (సల్లం) తన చేతిలో ఓ ఖడ్గం తీసుకొని, "దీని హక్కు నెరవేర్చగల వాడెవడు?" అన్నప్పుడు దానికోసం ఎంతోమంది అనుచరులు ఎగబడ్డారు. కాని చివరికి ఆ అదృష్టం అబూ దుజానాకే దక్కింది. తనకు ఆ అదృష్టం లభించగానే ఆయన మనసు కించిత్ గర్వానికి లోనయింది. ఎర్రటి తలపాగా కట్టుకొని సైన్యం నుండి బయలుదేరి నిక్కుతూ నడవసాగారు. అది చూసి దైవప్రవక్త (సల్లం) ఈ నడక దైవానికి అత్యంత అయిష్టకరమైనది, కాని ఈ యుద్ధ సమయంలో మాత్రం యిష్టమైనదే!" అని అన్నారు.

అబూ దుజానా సైన్యాన్ని చీల్చుకుంటూ ముందుకు దూసుకు పోసాగారు. అడ్డొచ్చిన వాళ్ళనందరినీ తెగనరుకుతూ వీరోచితంగా పోరాడసాగారు. అలా వెళ్తుండగా ఆయనకు 'హింద్' ఎదురొచ్చింది. ఆయన ఆమె తల నరకబోయి దైవప్రవక్త కరవాల ప్రతాపాన్ని ఒక మహిళపై చూపించటం తగదనుకొని తన ప్రయత్నాన్ని విరమించు కున్నారు.[3]

హజ్రత్ హమ్జా రెండు చేతుల్లో రెండు ఖడ్గాలు తీసుకొని ఎటువెళితే అటు శవాల గుట్టలు పేర్చసాగారు. అంతలో ఆయనకు నిబా గబ్షానీ

---

1) సీరత్ ఇబ్నెహిషామ్ మూడవ సంపుటి 34వ పుట. రెండవ సంపుటి 74వ పుట.
2) తారీఖె తబ్రీ మూడవ సంపుటి 64వ పుట.
3) ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటి 256వ పుట. తారీఖె తబ్రీ మూడవ సంపుటి 63వ పుట. సీరత్ ఇబ్నెకసీర్ మూడవ సంపుటి 30, 31 పుటలు

www.abulhasanalinadwi.org

అనేవాడు ఎదురొచ్చాడు. అతన్ని చూడగానే "ఒరేయ్! వాడుగులు చేసేవాడా! ఎక్కడికి వెళతావురా?" అని అరుస్తూ ఖడ్గంతో ఒక్కవేటు వేశారు. అంతే, క్షణాల్లో అతను నేలకొరిగాడు. జుబైర్ బిన్ ముత్యిమ్ తన బానిస అయిన ఓ నీగ్రోతో, "నువ్వు గనక హమ్జాను వధిస్తే నేను నీకు 'స్వేచ్ఛనిస్తాను' అని మాటిచ్చాడు. దాంతో ఆ నీగ్రో బానిస హమ్జాను చంపటానికి అవకాశం కోసం ఎదురుచూడసాగాడు. నీగ్రోల దగ్గర 'హిర్బా' అనే ఒక రకమైన ఆయుధం ఉండేది. సాధారణంగా నీగ్రోలు ఆ ఆయుధాన్ని విసరడంలో ఆరితేరి ఉంటారు. హమ్జా (రజి) తనకు ఎదురుగా రాగానే ఆ నీగ్రో గురిచూసి ఆయన మీదకు 'హిర్బా' ఆయుధం విసిరాడు. అది ఆయన బొడ్డులో గ్రుచ్చుకొని ఇవతలకి వచ్చింది.[1] హమ్జా అతని మీద ఎదురుదాడి చెయ్యాలని ప్రయత్నించారు కాని అంతలోనే దభాలున క్రిందపడి ప్రాణం వదిలారు.[2]

## గెలుపు ఓటమిగా పరిణమించింది

ఖురైషుల్లో యుద్ధ పతాకాన్ని పట్టుకొని ఉన్నవారు ప్రాణాలు పోయినా దాన్ని క్రింద పడనివ్వటం లేదు. ఒకడు మరణించగానే ఇంకో వీరుడు వచ్చి పతాకాన్ని ఎత్తుకునేవాడు. 'సవాబ్' అనేవాడు యుద్ధ పతాకాన్ని తన చేతుల్లోకి తీసుకోగానే ముస్లింలలో ఒకడు ఖడ్గంతో గట్టిగా అతనిమీద ఒక వేటు వేశాడు. దాంతో అతని రెండు చేతులూ తెగిపోయాయి. కాని తన జాతీయ పతాకం తన కళ్ళ ముందే నేల మీద పడిపోవటాన్ని చూడలేక పతాకంతోపాటు తనూ క్రింద పడిపోయి దాన్ని తన గుండెలకు హత్తుకున్నాడు. ఆ స్థితిలోనే అతను "నేను నా కర్తవ్యాన్ని నిర్వర్తించాను" అంటూ ప్రాణాలు వదిలాడు. ఖురైషుల యుద్ధ పతాకం చాలా సేపటివరకు అలాగే క్రిందపడి ఉంది. చివరికి అమ్రా బిన్తె అల్ఖమా అనే ఓ ధైర్యస్తురాలు పతాకాన్ని ఎత్తిపట్టుకుంది. యుద్ధ పతాకాన్ని చూడగానే ఖురైషులందరూ మళ్ళీ ఒకచోట కూడారు. వారిలో ఉత్తేజం పొంగిపొర్లింది.[3]

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
2) సీరత్ ఇబ్నె కసీర్ మూడవ సంపుటి 34వ పుట.
3) సీరత్ ఇబ్నె కసీర్ మూడవ సంపుటి 43వ పుట, తబ్రీ మూడవ సంపుటి 65వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 78వ పుట.

www.abulhasanalinadwi.org

అబూఆమిర్ అవిశ్వాసుల తరపునుండి యుద్ధం చేస్తున్నాడు. కాని అతని కుమారుడు హంజలా ఇస్లాం స్వీకరించి ఉండటంచేత తన తండ్రితో పోరాడటానికి తనకు అనుమతినివ్వమని ఆయన దైవప్రవక్త (సల్లం)ను కోరారు. కాని ఒక కొడుకు తన తండ్రిపైకి ఖడ్గమెత్తటాన్ని కారుణ్యమూర్తి (సల్లం) సుతరామూ యిష్టపడలేదు. దాంతో హంజలా అవిశ్వాసుల సైన్యాధిపతి అయిన అబూ సుఫ్యాన్‌పై దాడిచేశారు. ఇంకొద్ది సేపట్లో అబూ సుఫ్యాన్ నేలకొరుగుతాడనగా, అంతలోనే షద్దాద్ బిన్ అస్వద్ ప్రక్కనుండి అడ్డుకొని ఆయన్ని హతమార్చాడు. ఇంత జరిగినప్పటికీ యుద్ధంలో ముస్లింలే పైచేయిగా ఉన్నారు.[1] గేయాలు పాడుతూ యోధుల రక్తాన్ని ఉడికిస్తున్న మహిళలు భయంతో వెనక్కి తగ్గారు. శత్రుసేనలు చెల్లాచెదరయిపోయాయి. దాంతో ముస్లింలు యుద్ధం ముగిసిపోయిందని భావించి యుద్ధప్రాప్తి కోసం ఎగబడ్డారు. అది చూసి వెనుక పర్వత కనుమ దగ్గర నియమించబడిన విలుకాళ్ళు కూడా విజయప్రాప్తి కోసం పరుగెత్తుకొచ్చారు. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ వారిని ఎంత వారించినా వారు వినకుండా తమస్థానం వదలి వెళ్ళిపోయారు.[2] అవకాశం కోసం ఎదురుచూస్తున్న అవిశ్వాసుల సైన్యాధిపతి ఖాలిద్ వెనుక వైపు నుండి దాడిచేశాడు. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ ఇంకా కొందరు వారితో ప్రాణాలొడ్డి పోరాడారు. కాని చివరకు అందరూ వీరమరణం పొందారు. ఇక శత్రు సేనలకు ముస్లింలపై దాడి చేయటానికి మార్గం సుగమం అయిపోయింది. ముస్లింలు విజయ సొత్తును సమీకరించటంలో నిమగ్నులై ఉన్నారు. వెనక్కి తిరిగి చూస్తే కరవాలాల వర్షం కురుస్తున్నట్లు కనిపించింది. ఇరుసైన్యాలు కలగాపులగం అయిపోయాయి. ఆ హఠాత్పరిణామానికి ముస్లింలు దిమ్మదిరిగిపోయి తత్తరపాటుతో తమమనుషుల్ని తామే చంపుకున్నారు.[3] ముస్లింలలో ముస్అబ్ బిన్ ఉమైర్‌కు దైవప్రవక్త (సల్లం) పోలికలు ఉండేవి. ఆయన్ని ఇబ్నె ఖుమయ్యా అనేవాడు వధించాడు.[4] శత్రువులు

---

1) ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటి 225వ పుట. తబ్రీ మూడవ సంపుటి 69వ పుట.
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
3) తబ్రీ మూడవ సంపుటి 63వ పుట, సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 78వ పుట.
4) తబ్రీ మూడవ సంపుటి 66వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 73వ పుట.

www.abulhasanalinadwi.org

ప్రవాహంలా వచ్చి ముస్లింలను తోసుకుంటూ దైవప్రవక్త (సల్లం) దగ్గరికి చేరుకొని ఆయన మొహాన్ని గాయపరిచారు. శిరస్త్రాణం లోని రెండు కొక్కాలు ముఖానికి గ్రుచ్చుకున్నాయి. ఎడమ వైపు క్రిందిభాగంలో ఉన్న పన్ను ఒకటి ఊడిపోయింది.[1] నలువైపుల నుంచి ఖడ్గాలు, బాణాలు కురవసాగాయి. దైవప్రవక్త (సల్లం) ప్రక్కకు తూలిపడిపోబోయారు. అంతలో హజ్రత్ అలీ (రజి) ఆయన చెయ్యి పట్టుకున్నారు. హజ్రత్ తల్హా (రజి) ఆయన్ని తన ఒళ్ళోకెత్తుకున్నారు.[2]

ముస్లింలు గందరగోళ స్థితిలో ఉండగానే దైవప్రవక్త (సల్లం) అమరగతి నొందారన్న వదంతి వ్యాపించింది. ఆ తప్పుడు వార్త విని ముస్లింల హృదయాలు కకావికలమయ్యాయి. చాలామంది ధైర్యాన్ని కోల్పోయారు. బెల్లం కొట్టిన రాళ్ళల్లా ఎక్కడివారక్కడే నించుండి పోయారు.[3] హజ్రత్ అనస్ బిన్ నజర్ కొందరు ముస్లింలు ఆయుధాలు క్రిందపడేసి దిగులుతో కూర్చొని ఉండటం చూసి మీరిక్కడ కూర్చొని ఏం చేస్తున్నారని అడిగారు.

"దైవప్రవక్తే (సల్లం) మరణించారు. ఇక మనం ఎవరి కోసం బ్రతకాలి?" దిగులుపడుతూనే సమాధానమిచ్చారు వాళ్ళు.

హజ్రత్ అనస్ వారిని ఊరిస్తూ "మీరు గోళ్ళు గిల్లుకుంటూ, దిగులుపడుతూ కూర్చొనే సమయం కాదిది. లేండి, లేచి దైవప్రవక్త (సల్లం) దేనికోసం తమ ప్రాణాలర్పించారో మీరూ దానికోసం ప్రాణాలొడ్డి పోరాడండి" అన్నారు. ఆ తరువాత స్వగతంలోనే, "దేవా! నేను వీరి అలసత్వానికి క్షమాపణలు చెప్పుకుంటున్నాను. బహుదైవారాధకుల దుష్కార్యాలకు నేను అతీతుణ్ణి" అంటూ కాస్త ముందుకెళ్ళగానే ఆయనకు సాద్ బిన్ ముఆజ్ ఎదురయ్యారు. అనస్ ఆయనతో తనకు ఉహుద్ కొండ ప్రక్కనుంచి స్వర్గవాసన వస్తోందంటూ శత్రువులపై మెరుపుదాడి చేసి వీరోచితంగా పోరాడుతూ అమరగతి నొందారు.

---

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
2) జాదుల్ మఆద్ మూడవ సంపుటి 197వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 80వ పుట.
3) తబ్రీ మూడవ సంపుటి 68వ పుట.

www.abulhasanalinadwi.org

మరణించిన తరువాత చూస్తే ఆయన శరీరంపై ఎనభై కన్నా ఎక్కువ గాయాలు కనిపించాయి. మొదట్లో ఆయన శవాన్ని ఎవరూ గుర్తించలేకపోయారు. ఆఖరికి ఆయన సోదరి ఆయన మునివ్రేళ్ళ సాయంతో శవాన్ని గుర్తుపట్టగలిగింది.[1] ఒక ముహాజిర్ వ్యక్తి ఓ అన్సార్ ముస్లిం సమీపం నుంచి వెళ్ళాడు. అప్పుడు ఆ అన్సార్ ముస్లిం రక్తంతో తడిసి ముద్దయి ఉన్నాడు. ముహాజిర్ వ్యక్తి అతనితో 'ముహమ్మద్ (సల్లం) మరణించారన్న సంగతి నీకు తెలుసా?' అని అడిగాడు. దానికి సమాధానమిస్తూ ఆ అన్సార్ వ్యక్తి 'ముహమ్మద్ (సల్లం) మరణిస్తే ఆయన తన లక్ష్యానికి చేరుకున్నారు, నువ్వు కూడా నీ ధర్మం కోసం ప్రాణాలర్పించు'అన్నాడు.[2]

## నిరుపమాన త్యాగభావం

ప్రముఖ ముస్లిం వీరులు ఏ మాత్రం నిరాశానిస్పృహలకు లోను కాకుండా పోరాడుతున్నారు. వారు శత్రువులతో యుద్ధం చేస్తున్నప్పటికీ వారి చూపులు మాత్రం దైవప్రవక్తనే గాలిస్తున్నాయి. అందరికన్నా ముందు దైవప్రవక్త (సల్లం)పై కాబ్ బిన్ మాలిక్ దృష్టి పడింది. ఆయన మొహంపై కవచం ధరించి ఉన్నప్పటికీ కళ్ళు మాత్రం స్పష్టంగా కన్పిస్తున్నాయి. కాబ్ దైవప్రవక్త (సల్లం)ను గుర్తుపట్టి గట్టిగా కేకవేస్తూ, "ముస్లింలారా! అదిగో దైవప్రవక్త(సల్లం) బ్రతికే ఉన్నారు" అన్నారు. ఆ మాట వినగానే దైవప్రవక్త ప్రాణస్నేహితులందరూ ఆయన చుట్టూ గుమిగూడారు.[3] అవిశ్వాసులు కూడా ఆ గుంపువైపుకు దృష్టి మరల్చి దైవప్రవక్త (సల్లం)ను చంపటానికి విరుచుకు పడ్డారు. కాని అంతలో తల్హా(రజి) మెరుపుదాడిచేసి వారిని వెనక్కి తరిమేశారు. నలువైపుల నుంచి బాణాలు కురవసాగాయి. దైవప్రవక్త (సల్లం)కు బాణాలు తగలకుండా అబూ దుజానా తన వీపుని 'డాలు'గా అడ్డం పెట్టారు.[4] బాణాలు ఆయన వీపుమీద గ్రుచ్చుకునేవి. అయినా ఆయన మాత్రం అలాగే కదలకుండా

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
2) సీరత్ ఇబ్నె కసీర్ మూడవ సంపుటి 61వ పుట.
3) తబ్రీ మూడవ సంపుటి 67వ పుట. సీరత్ ఇబ్నె కసీర్ మూడవ సంపుటి 68వ పుట.
4) ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటి 417వ పుట.

www.abulhasanalinadwi.org

నించున్నారు.[1] ఒకానొక సందర్భంలో శత్రువులు దైవప్రవక్త (సల్లం)కు చాలా సమీపానికి చేరుకున్నారు. అప్పుడు ఆయన ఎలుగెత్తి, "వీళ్లను వెనక్కి తరిమి స్వర్గాన్ని పొందేవారెవరు?" అన్నారు. అక్కడే నించొని ఉన్న ఏడుగురు అన్సార్లు ముందుకు వచ్చారు. ఒక్కొక్కరే వెళ్ళి శత్రువుల్ని వెనక్కి తరమసాగారు. దైవప్రవక్త (సల్లం) పలుమార్లు అదేమాట అన్నారు. ఆఖరికి దైవప్రవక్త (సల్లం)ను కాపాడుతూ ఆ ఏడుగురు అన్సార్లు తమ ప్రాణాలర్పించారు.[2] దైవప్రవక్త (సల్లం) పైకి వచ్చే బాణాలను తల్హా(రజి) తన చేతులతో ఆపేవారు. ఆ శరాఘాతాలతో ఆయన చెయ్యి శాశ్వతంగా చచ్చుబడిపోయింది.[3] దుర్మార్గులు దైవప్రవక్త (సల్లం)పైకి బాణాలు విసురుతూనే ఉన్నారు. ఆ సమయంలో కూడా ఆయన నోటినుండి, "ప్రభూ! నా జాతిప్రజలను మన్నించు. వారు అమాయకులు" అనే మాటలే వెలువడేవి.[4] తల్హా శరీరమంతా గాయాలతో నుజ్జునుజ్జయి పోయింది. తన దగ్గరికి సహచరులు వచ్చినప్పుడల్లా దైవప్రవక్త (సల్లం) తల్హా క్షేమం గురించి కనుక్కోమని చెప్పేవారు. ప్రజలు వెళ్ళి క్రిందపడిపోయి ఉన్న తల్హాను పైకిలేపారు. అప్పుడు ఆయన ఒంటిపై పదిగాయాలు కనిపించాయి. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌కు కూడా ఇరవైకన్నా ఎక్కువచోట్ల గాయాలయ్యాయి.[5] బాణాలు విసరడంలో అబూతల్హాది అందెవేసిన చెయ్యి. ఆయన విపరీతంగా బాణాల వర్షం కురిపిస్తుండగా ఆయన చేతుల్లోనే రెండుమూడు ధనస్సులు విరిగి పోయాయి. శత్రువుల దాడుల నుండి కాపాడటానికి దైవప్రవక్త ముఖానికి ఆయన తన డాలును అడ్డంగా ఉంచారు. దైవప్రవక్త శత్రుసైన్యాలను చూడటానికి తలపైకెత్తినప్పుడు శత్రువుల బాణాలు తగిలే ప్రమాద ముంటుందని, అందుకని తల పైకెత్తవద్దని వారించేవారు. చివరికి దైవప్రవక్తను కాపాడటానికి తన శరీరాన్నే డాలుగా ఉపయోగించారు.[6]

1) తబ్రీ మూడవ సంపుటి 66వ పుట.
2) సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం
3) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
4) సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం
5) ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటి 348వ పుట. సీరత్ ఇబ్నెహిషామ్ రెండవ సంపుటి 83వ పుట.
6) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

సాద్ బిన్ వఖ్ఖాస్ కూడా బాణాలు విసరడంలో మంచి నేర్పరి. ఆ సమయంలో ఆయన కూడా దైవప్రవక్త (సల్లం) దగ్గరే ఉన్నారు. దైవప్రవక్త (సల్లం) తన అంబుల పొదిని ఆయన చేతికిచ్చి "నా తల్లిదండ్రుల్ని నీకోసం అర్పింతు. నువ్వు కూడా బాణాలు విసురు" అని అన్నారు.[1] ఒకానొక సందర్భంలో శత్రువులు దైవప్రవక్త (సల్లం) దగ్గరికి గుంపుగా వచ్చి దాడిచెయ్యాలని ప్రయత్నించారు. అప్పుడాయన నా కోసం ప్రాణాలిచ్చే వాడెవడయినా ఉన్నాడా?" అన్నారు.

ఆ మాట వినగానే జియాద్ బిన్ సకన్ తన ఐదుగురు మిత్రులతో పాటు ఎదురుదాడి చేశారు. ప్రాణాలకు తెగించి పోరాడుతూ ఒకరి తరువాత ఒకరు అందరూ మరణించారు. ఆ సమయంలో దైవప్రవక్త (సల్లం) జియాద్ శవాన్ని తన దగ్గరికి తీసుకొనిరమ్మని అనుచరుల్ని ఆదేశించారు. ఆయన కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. అనుచరులు ఆయన శవాన్ని మోసుకొచ్చి దైవప్రవక్త (సల్లం) పాదాల దగ్గర ఉంచారు. అదే స్థితిలో ఆయన తుదిశ్వాస విడిచారు.[2]

ఒక ముస్లిం వీరుడు అలాంటి భీతావహ పరిస్థితిలో కూడా ఒకచోట నించొని నిక్షేపంగా ఖర్జూర పండ్లు తినసాగాడు. కాసేపటికి దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి, "దైవప్రవక్తా! నేనొక వేళ ఈ యుద్ధంలో మరణిస్తే ఆ తరువాత ఎక్కడుంటాను"? అని అడిగాడు. "స్వర్గంలో ఉంటావ" ని చెప్పారు దైవప్రవక్త (సల్లం). ఆ శుభవార్త వినగానే అతను ఏ మాత్రం ఆలస్యం చేయకుండా శత్రువులపై విజృంభించి వీరమరణం పొందాడు.[3] అదే సమయంలో శత్రువులందరూ కలిసి దైవప్రవక్త మీద ఒక్కసారిగా దాడిచేశారు. అప్పుడు ఆయన వెంట కొంతమంది అనుచరులు మాత్రమే ఉన్నారు. అంతలో ఉమ్మె అమ్మారా అక్కడికి చేరుకొని ఆయనకు అడ్డంగా నించుంది. అవిశ్వాసులు ముందుకు రావటానికి ప్రయత్నించినప్పుడు ఆమె వారిని ఖడ్గంతో, బాణాలతో ఎదుర్కొనేది. ఇబ్నె ఖుమయ్యా దైవప్రవక్త వైపుకు దూసుకురావటాన్ని చూసి ఆమె ముందుకు వెళ్ళి అతన్ని అడ్డుకుంది. అతను చాలా వేగంగా పరుగెత్తుకొని

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
2) తబ్రీ మూడవ సంపుటి 65, 66 పుటలు. సీరత్ ఇబ్నెహిషామ్ రెండవ సంపుటి 81వ పుట.
3) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణ.

www.abulhasanalinadwi.org

రావటంతో అతని ఆయుధం తగిలి ఆమె భుజానికి పెద్ద గాయమయింది. ఆమె కూడా తన ఖడ్గంతో ఒక వేటు వేసింది కాని అతను రెండు కవచాలు ధరించి ఉన్నందున ఆ దెబ్బ నుండి తప్పించుకోగలిగాడు.[1]

ఉబై బిన్ ఖలఫ్ ఈ యుద్ధానికి ఆపాదమస్తకం లోహం ధరించి వచ్చాడు. ముహమ్మద్ (సల్లం) గనక బ్రతికి ఉంటే తను క్షేమంగా ఉండలేనని అతను తరచూ అనేవాడు. అతను మక్కాలో దైవప్రవక్త (సల్లం)ను కడతేరుస్తానని ప్రతినబూనాడు. అన్నమాటను నిలబెట్టుకునే ఉద్దేశంతో దైవప్రవక్త (సల్లం)ను చంపటానికి ముందుకొచ్చాడు. అతని మొత్తం శరీరంలో ఒక్క కంఠనాళం మాత్రమే కనబడుతోంది. దైవప్రవక్త (సల్లం) గురిచూసి అతని మీదకు ఈటె విసిరారు. అది కంఠంలో గుచ్చుకోవడంతో అతను గుర్రంనుండి జారిపడ్డాడు. అతని మిత్రులు అతణ్ణి పైకిలేపుతుంటే ఎద్దులా అరవటం మొదలుపెట్టాడు. అతని చుట్టూ ఉన్న ప్రజలు అతనితో, "అంత చిన్న గాయానికే అలా ఎద్దులా అరుస్తావెందుకు?" అంటూ అతన్ని హేళన చేశారు.

నా బాధ మీకేం తెలుసు. ముహమ్మద్ నన్ను చంపుతానని ముందే చెప్పాడు. ఇప్పుడు నాకు కలుగుతున్న బాధను గనక జుల్‌మజాజ్ నగరం వాళ్ళకు పంచితే వాళ్ళందరూ చనిపోతారు. ......అమ్మో"అంటూ అతను మెలికలు తిరిగిపోసాగాడు. 'రాబిగ్' అనే ప్రాంతానికి చేరుకునేటప్పటికి అతను ప్రాణాలు వదిలేశాడు.[2]

ముస్లింలందరూ దైవప్రవక్త (సల్లం) దగ్గరికి చేరుకున్నారు. ఆయన ధరించివున్న శిరస్త్రాణంలోని ఒక కొండి ఆయన మొహంలో దిగబడింది. హజ్రత్ అబూ బక్ర్ (రజి) ఇలా తెలియజేస్తున్నారు. నేనా కొండీని బయటికి లాగుదామనుకున్నాను. కాని అంతలో అబూ ఉబైదా దేవుని మీద ప్రమాణం చేస్తూ ఆ కొండీని తీయటానికి తనకు అవకాశం కల్పించమని కోరారు. ఆయన తన మునిపళ్ళతో ఆ కొండీని మెల్లగా దైవప్రవక్త

1) సీరత్ ఇబ్నె కసీర్ మూడవ సంపుటి 67వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 81, 82 పుటలు.

2) తబ్రీ మూడవ సంపుటి 67వ పుట. సీరత్ ఇబ్నె కసీర్ మూడవ సంపుటి 69వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 84వ పుట.

www.abulhasanalinadwi.org

(సల్లం)కు ఏ మాత్రం నొప్పి కలగకుండా బయటికి తీశారు. కొండీ బయటికి వచ్చింది కాని దాంతోపాటు అబూ ఉబైదా గారి ఒక పన్ను ఊడిపోయింది. రెండో కొండీ నేను తీయబోయాను. కాని అప్పుడు కూడా అబూ ఉబైదా నన్ను ఆపి తనే మెల్లిగా దాన్ని బయటకు తీశారు. దాంతో ఆయన రెండోపన్ను కూడ ఊడిపోయింది.[1] మాలిక్ బిన్ సినాన్ అన్సారీ దైవప్రవక్త చెక్కిలి నుండి కారుతున్న రక్తాన్ని జుర్రుకున్నారు. దైవప్రవక్త (సల్లం) ఆయనతో ఆ రక్తాన్ని ఊసెయ్యమని చెప్పారు. కాని ఆయన మాత్రం ఆ రక్తాన్ని ఊసెయ్యటానికి సుతరామూ యిష్టపడలేదు. ఆయన అక్కడి నుంచి వెళ్ళిపోయిన తరువాత దైవప్రవక్త (సల్లం) తన అనుచరులతో, "మీలో ఎవరికయినా స్వర్గవాసిని చూడాలని ఉంటే ఇతణ్ణి చూడండి" అన్నారు.[2]

దైవప్రవక్త మరణించారన్న వార్త మదీనాలో వ్యాపించగానే ఆయన అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతితో ఉహుద్ కొండల వైపు పరుగెత్తారు. ఫాతిమా (రజి. అనహా) వచ్చినప్పుడు కూడా దైవప్రవక్త (సల్లం) మొహం నుండి ఇంకా రక్తం కారుతూనే ఉంది. హజ్రత్ అలీ ఓ తోలు సంచిలో నీళ్ళు పట్టుకొచ్చారు. ఫాతిమా తండ్రి మొహంపైనున్న రక్తాన్ని కడగసాగారు. కాని ఎంత కడిగినా రక్తం ఆగకపోవటంతో ఒక చాపముక్కను కాల్చి గాయంపై ఒత్తిపెట్టారు. దాంతో రక్తస్రావం ఆగిపోయింది.[3] ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ఒక చట్టుబడంపై ఎక్కాలనుకున్నారు. కాని సత్తువ చాలకపోవటంతో ఎక్కలేకపోయారు. హజ్రత్ తల్హా వంగి నిలబడగా ఆయన వీపుసాయంతో పైకెక్కారు.[4] నమాజు వేళకాగానే కూర్చొనే ప్రజలకు నమాజ్ చేయించారు.[5]

యుద్ధానంతరం కొంతమంది అనుచరులు దైవప్రవక్త (సల్లం)కు గాయాలవటం చూసి అవిశ్వాసుల్ని శపించమని ఆయన్ని కోరారు. దానికి

1) ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటి 29వ పుట.
2) ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటి 65వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 80వ పుట.
3) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం, సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం
4) ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటి 28వ పుట.
5) జాదుల్ మఆద్ మూడవ సంపుటి 197వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ ఏడవ సంపుటి 86, 87 పుటలు.

www.abulhasanalinadwi.org

సమాధానమిస్తూ ఆయన (సల్లం)-

"నేను ఈ లోకానికి ప్రజల్ని శపించటానికి రాలేదు. పైగా వారిని దేవుని వైపుకు పిలచేవానిగా, కారుణ్యమూర్తిగా పంపబడ్డాను. దేవా! నా జాతి జనులకు సన్మార్గం చూపు. వారు అమాయకులు" అని అన్నారు.[1]

దైవప్రవక్త(సల్లం) కొంతమంది సహచరుల్ని వెంటబెట్టుకొని కొండ శిఖరం పైకెక్కారు. అబూ సుఫ్యాన్ వారిని చూసి తాను కూడా కొంతమంది సైనికుల్ని తీసుకొని కొండపైకెక్కటానికి ప్రయత్నించాడు. కాని హజ్రత్ ఉమర్ ఇంకా ఇతర అనుచరులు రాళ్ళు విసిరి అతణ్ణి పైకెక్కనీయకుండా చేశారు.[2] అబూ సుఫ్యాన్ వేరొక కొండపైకెక్కి "ఇక్కడ ముహమ్మద్ ఉన్నాడా?" అని కేకపెట్టాడు.

అటు దైవప్రవక్త (సల్లం) తన అనుచరుల్ని ఏమీ జవాబు చెప్పవద్దని ఆదేశించారు. ఆ తరువాత అబూ సుఫ్యాన్ అబూబక్ర్, ఉమర్‌ల పేర్లు తీసుకొని పిలిచాడు. జవాబు రాకపోవటంతో అందరూ చనిపోయారంటూ ఎగిరి గంతులేయసాగాడు. అది చూసి హజ్రత్ ఉమర్ ఉండబట్టలేక, "ఓరీ దైవద్రోహి! మేమంతా బ్రతికేఉన్నాం" అన్నారు.

ఆ మాటకు అబూ సుఫ్యాన్,

"హుబల్ దేవునికే జేయ్" అన్నాడు.

అనుచరులు దైవప్రవక్త అనుజ్ఞతో

"అల్లాహ్‌కే జేయ్. ఆయన అందరికన్నా గొప్పవాడు" అన్నారు.

అబూ సుఫ్యాన్ పరిహసిస్తూ...

"మాకు ఉజ్జా దేవుడున్నాడు, మీకు లేడు" అన్నాడు.

దానికి జవాబుగా ముస్లింలు.

"అల్లాహ్ మాకు సంరక్షకుడు. మీకు ఏ సంరక్షకుడూ లేడు" అన్నారు.

---

1) రహ్మతుల్లిల్ ఆలమీన్ మొదటి సంపుటి 111వ పుట. ఖాజీ అయాజ్ గారి షిఫా గ్రంథ సౌజన్యంతో 47వ పుట.

2) సీరత్ ఇబ్నె కసీర్ మూడవ సంపుటి 45వ పుట.

www.abulhasanalinadwi.org

చివరగా అబూ సుఫ్యాన్ ఎలుగెత్తి, "ఈ యుద్ధం బద్ర్ యుద్ధానికి ప్రతీకారం. మా సైన్యాలు ముస్లింల శవాల ముక్కులు, చెవులు కోసి చీల్చి చెండాడారు. నేనలా చెయ్యమని చెప్పలేదు. కాని వారలా చేశారని తెలిసినా నాకు బాధ అనిపించలేదు" అన్నాడు.[1]

## అమర వీరుల పరిస్థితి

హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) ఇలా వివరించారు: సాద్ బిన్ రబీ ఎక్కడున్నారో చూచిరమ్మని దైవప్రవక్త (సల్లం)నన్ను పంపారు. తను ఎక్కడైనా కనిపిస్తే దైవప్రవక్త (సల్లం) తనకు సలాం చెబుతున్నారని, తను ఏ స్థితిలో ఉన్నారో అడిగిరమ్మని నన్ను పంపారని చెప్పమన్నారు. నేను శవాల్లో సాద్ బిన్ రబీను వెతుక్కుంటూ వెళుతుండగా ఒకచోట నాకాయన శరీరం కనిపించింది. ఆయన కొనఊపిరితో ఉన్నారు. ఆయన ఒళ్లంతా బాణాలు, ఖడ్గాల గాయాలే. నేను త్వరగా ఆయన దగ్గరికి వెళ్ళి, "సాద్! దైవప్రవక్త మీకు సలాం చెబుతున్నారు. మీరే స్థితిలో ఉన్నారో అడిగిరమ్మని నన్ను పంపారు" అన్నాను.

దానికాయన అతికష్టంమీద పెదవి విప్పి పలుకుతూ, "దైవ ప్రవక్త (సల్లం)కు కూడా నా సలాం తెలియ జేయండి. ఇప్పుడు నాకు స్వర్గ సువాసన వస్తోందని చెప్పండి. నా జాతివారయిన అన్సార్లకు నా సందేశం వినిపించండి. 'మీలో ఏ ఒక్కడయినా ప్రాణాలతో బ్రతికి ఉండి శత్రువులు దైవప్రవక్తను సమీపించి ఆయనకు హాని తలపెట్టగలిగితే.. మీరు.. దైవసన్నిధిలో ఏ సంజాయిషీ.. ఇచ్చుకోలేరని గ్రహిం....చం.....డి' అంటుండగానే ఆయన తుదిశ్వాస విడిచారు.[2]

కుప్పలు తెప్పలుగా పడివున్న ఆ శవాల్లో అమ్ర్ బిన్ సాబిత్ శవం కూడా ఉంది. ఆయన బిరుదు 'ఉసైరమ్'. ఆయన బనూ అబ్దుల్ అష్హల్ తెగకు చెందినవారు. ఉహుద్ యుద్ధానికి ముందు వరకు ఆయన ఎల్లప్పుడూ ఇస్లాంను తిరస్కరిస్తూనే ఉండేవారు. కాని ఉహుద్ యుద్ధం జరిగినరోజు ఆయన మనసులో ఒక్కసారిగా ఇస్లాం పట్ల

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.
2) ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటి 221 వ పుట.

www.abulhasanalinadwi.org

విశ్వాసం పొంగిపొర్లింది. ఆ రోజే ఆయన ఇస్లాం స్వీకరించి యుద్ధంలో పాల్గొన్నారు. ఈ విషయం ఎవరికీ తెలియదు. యుద్ధం ముగిసిన తరువాత బనూ అబ్దుల్ అష్హల్ తెగవారు తమ తెగవారి శవాలను వెతుకుతుండగా వారికి ఒకచోట ఉసైరమ్ కనిపించారు. ఆయన దారుణంగా క్షతగాత్రులై చావుబతుకుల మధ్య ఉన్నారు.

తెగవారు ఆయన్ని చూడగానే, "అరే, ఉసైరమ్ ఇక్కడికెలా వచ్చాడు. ఇతను ఇస్లాంకు వ్యతిరేకి కదా!" అనుకున్నారు విపరీతంగా ఆశ్చర్యపడిపోతూ. తరువాత దగ్గరికి వెళ్ళి ఆయన్నే అడిగారు.

"నువ్వు ఇక్కడికెందుకొచ్చావు? నీ తెగవారికి సహాయం చెయ్యటానికా లేక ఇస్లాం పట్ల విశ్వాసంతోనా?" అని.

దానికి ఆయన ఊపిరి బిగబట్టి, "లేదు, ఇస్లాం పట్ల విశ్వాసంతోనే వచ్చాను. నేను దేవుణ్ని, దైవప్రవక్తను విశ్వసించాను. దైవప్రవక్తతో పాటు జిహాద్‌లో పాల్గొని ఈ అదృష్టానికి నోచుకున్నాను" అనేంతలోనే మృత్యువు ఆయన్ని కబళించింది. ప్రజలు ఈ విషయాన్ని దైవప్రవక్త (సల్లం)కు తెలియజేయగా, ఆయన "సాద్ బిన్ రబీ స్వర్గవాసి అయిపోయాడు" అన్నారు. మరి చూడబోతే, ఆయనకు ఒక్కపూట కూడా నమాజ్ చేయాల్సిన అవసరం ఏర్పడలేదని హజ్రత్ అబూహురైరా (రజి) తెలియజేశారు.[1] (అంటే ఆయన ఇస్లాం స్వీకరించిన వెంటనే అమరగతి నొందారు.)

ఆ అమర వీరుల్లో జాబిర్ తండ్రి అబ్దుల్లాహ్ అమ్ర్ కూడా ఉన్నారు. ఆయన ఉహుద్ యుద్ధానికి ముందు కలలో ముబష్షిర్ బిన్ అబ్దుల్ ముంజిర్‌ను చూశారు. ముబష్షిర్ అంతకుముందే బద్ర్‌యుద్ధంలో అమరగతి నొందారు. ఆయన కలలోనే అబ్దుల్లాహ్‌తో మాట్లాడుతూ, "త్వరలోనే మీరు కూడా మా వద్దకు రానున్నారు" అని చెప్పారు. దానికి అబ్దుల్లాహ్ ఆశ్చర్యపోతూ "అసలు మీరు ఎక్కడున్నారు?" అని అడిగారు.

'స్వర్గంలో.... ఇక్కడ మేము హాయిగా, స్వేచ్ఛగా తిరుగుతున్నాం'

1) ముస్తద్రక్ హాకిమ్ మూడో సంపుటి 30వ పుట. ముస్నదె అహ్మద్ ఐదవ సంపుటి 428, 429 పుటలు.

www.abulhasanalinadwi.org

- ముబష్షిర్ సమాధానమిచ్చారు.

"మీరు బద్ర్ యుద్ధంలో చనిపోలేదా?" ఆత్రుతతో అడిగారు హజ్రత్ అబ్దుల్లాహ్ (రజి).

"చనిపోయాం.. కాని మమ్మల్ని తిరిగి బ్రతికించటం జరిగింది. మేమిప్పుడు ఎంతో సంతోషంగా ఉన్నాం" అని చెప్పారు ముబష్షిర్ (రజి).

తెల్లవారాక అబ్దుల్లాహ్ అమ్ర్ తన కల గురించి దైవప్రవక్త (సల్లం) ముందు ప్రస్తావించగా దైవప్రవక్త (సల్లం) తను ఉహుద్ యుద్ధంలో అమరగతి నొందుతాడని సూచించారు.[1]

హజ్రత్ జాబిర్ (రజి) ఇలా తెలియజేశారు. మానాన్నగారి శవాన్ని దైవప్రవక్త (సల్లం) దగ్గరికి తీసుకొని రావటం జరిగింది. శత్రువులు ఆయన శరీరాన్ని ముక్కలు ముక్కలుగా నరికారు. ప్రజలు ఆయన శవాన్ని ఓ వస్త్రంలో చుట్టి దైవప్రవక్త (సల్లం) ముందు ఉంచారు. నేను ఆయన మొహం మీద ఉన్న అచ్ఛాదనను తొలగించబోగా, ప్రజలు నన్ను వారించారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) అక్కడున్న ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, "దైవదూతలు ఈయనకు నీడకల్పిస్తూ ఉన్నార"ని చెప్పారు.[2]

ఆ అమర వీరుల్లోనే ఖైసమా కూడా ఉన్నారు. ఆయన కొడుకు బద్ర్ యుద్ధంలోనే అమరగతి నొందాడు. ఉహుద్ యుద్ధానికి ముందు ఆయన దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి-

"దైవప్రవక్తా! నేను బద్ర్ యుద్ధంలో పాల్గొనలేక పోయాను. అప్పుడే నాకు యుద్ధంలో పాల్గొనాలని విపరీతమైన కోరిక ఉండేది. కాని చీటీవేస్తే అందులో నా కొడుకు పేరు వచ్చింది. అదృష్టం కొద్దీ అతను బద్ర్ యుద్ధంలోనే అమరగతి నొందాడు. దైవప్రవక్తా! నేను రాత్రి కలలో మా అబ్బాయిని చూశాను. అతను మునుపటి కన్నా చాలా అందంగా కనిపించాడు. స్వర్గంలోని వృక్షాల పండ్లు తింటూ సెలయేళ్ళ ఒడ్డున తిరుగుతూ ఉన్నాడు. నాతో మాట్లాడాడు కూడా.. "నాన్నా! నువ్వు కూడా రా. ఇద్దరం కలిసి ఉందాం. నా ప్రభువు నాతో చేసిన వాగ్దానాన్ని నిజం చేసి

---

1) ముస్తద్రక్ హాకిమ్ మూడో సంపుటి 225వ పుట.
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

చూపించాడు అంటున్నాడు. దైవసాక్షి! ఇప్పుడు నాక్కూడా స్వర్గంలో అతనితోపాటు ఉండాలనిపిస్తోంది. నేను ముసలివాణ్ణయి పోయాను. ఇప్పుడు నాకు నా ప్రభువుని కలుసుకోవాలని ఉంది. కనుక స్వర్గంలో నాకు నా కొడుకు తోడు లభించాలని మీరు నా కోసం ప్రార్థించండి" అని విన్నవించుకున్నారు. దైవప్రవక్త (సల్లం) ఆయన కోరిక మేరకు ఆయన కోసం దేవుణ్ని ప్రార్థించగా ఆయన ఉహుద్ యుద్ధంలో వీర మరణం పొంది స్వర్గాన్నలంకరించారు.[1]

ఆ అమర వీరుల్లోనే అబ్దుర్రహ్మాన్ బిన్ జహష్ కూడా ఉన్నారు. యుద్ధానికి ముందు ఆయన దేవుణ్ణి ప్రార్థిస్తూ, "దేవా! రేపు యుద్ధభూమిలో నాకు శత్రువు ఎదురై నన్ను వధించాలి. నా పొట్ట చీల్చి ప్రేగులు బయటికి తీయాలి. ముక్కు, చెవులు కోయాలి. ఆ తరువాత నేను నిన్ను కలుసుకున్నప్పుడు నువ్వు ఇదంతా ఎందుకు జరిగిందని అడిగితే నీ కోసమే జరిగిందని నేను చెప్పుకోగలగాలి" అన్నారు.[2]

ఆ అమరవీరుల్లో అమ్ర్ బిన్ జుమూహ్ కూడా ఉన్నారు. ఆయన కుంటివారు. ఆయనకు యువకులైన నలుగురు కుమారులు ఉండేవారు. వాళ్ళు ఎల్లప్పుడూ దైవప్రవక్త(సల్లం) వెంట జిహాద్‌లో పాల్గొంటూ ఉండేవాళ్ళు. ఉహుద్ యుద్ధం నాడు అమ్ర్ కూడా యుద్ధానికి బయలుదేరారు. కొడుకులు ఆయన్ని వారించారు. తను యుద్ధంలో పాల్గొనకపోయినా దేవుడు మన్నిస్తాడనీ, తను ఇంట్లో కూర్చొని ఉంటే తాము యుద్ధానికి వెళ్ళివస్తామని చెప్పారు. అయినా ఆయన వినలేదు. నేరుగా దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళి తన కొడుకులు తనను యుద్ధానికి రాకుండా ఆపుతున్నారని ఫిర్యాదు చేశారు. తనకు ఈ యుద్ధంలో అమరగతి నొంది తన కుంటి కాళ్ళతో స్వర్గంలో నడవాలన్న విపరీతమైన కోరిక ఉన్నదని విన్నవించుకున్నారు. ఆయన విన్నపాన్ని విని దైవప్రవక్త (సల్లం) మీరు యుద్ధంలో పాల్గొనకపోయినా ఫర్వాలేదు. దేవుడు మీకు మినహాయింపును ప్రసాదించాడు." అన్నారు. ఆ తరువాత ఆయన

---

1) జాదుల్ మఆద్ మూడవ సంపుటి 208వ పుట.
2) అసదుల్ గాబా మూడవ సంపుటి 91వ పుట.
జాదుల్ మఆద్ మూడవ సంపుటి 208వ పుట.

www.abulhasanalinadwi.org

కొడుకుల వైపు తిరిగి, "ఆయన వస్తానంటే మీకు ఇబ్బంది దేనికి? బహుశా దేవుడు ఆయనకు ఈ యుద్ధంలో అమరగతి నొందే భాగ్యాన్ని వ్రాసిపెట్టాడేమో!" అని చెప్పి వారిని ఒప్పించారు.[1]

ఆ అమర వీరుల్లో ముస్అబ్ బిన్ ఉమైర్ కూడా ఉన్నారు. ఆయన ఇస్లాం స్వీకరించక ముందు రెండొందల కన్నా తక్కువ ఖరీదైన బట్టలు ఎన్నడూ తొడగలేదు. కాని ఉహుద్ యుద్ధంలో ఆయన అమరగతి నొందిన నాటికి ఆయన దగ్గర ఒక్క గొంగళి మాత్రమే ఉంది. అది ఆయన శవం మీద కప్పటానికి కూడా సరిపోలేదు. ఆ గొంగళిని ఆయన శవం తల మీద నుంచి కప్పితే కాళ్ళు బయటపడేవి. కాళ్ళ మీద నుంచి కప్పితే తల బయటపడేది. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆ గొంగళిని ఆయన తల మీద నుంచి కప్పి కాళ్ళు కనపడకుండా ఇజ్ఖిర్ గడ్డితో కప్పేయమని ఆదేశించారు.[2]

దైవప్రవక్త (సల్లం) గారి ప్రియమైన బాబాయి పులిబిడ్డ అయిన హజ్రత్ హమ్జా (రజి) కూడా ఈ యుద్ధంలోనే అమరగతి నొందారు. శత్రువులు ఆయన్ని అతిదారుణంగా హతమార్చారు. ఆయన శవాన్ని ముక్కలు ముక్కలుగా చేసి, అమానుషంగా ప్రవర్తించారు. అబూ సుఫ్యాన్ భార్య హింద్ వాటిని ఒక మాలగా కూర్చి తన మెళ్ళో వేసుకుంది. ఆయన శవం ఉదరాన్ని చీల్చి అందులో నుండి కాలేయాన్ని బయటికి తీసి నమిలింది. మింగాలనుకుంది కాని గొంతు నుండి దిగకపోవటంతో బయటికి ఊసేసింది.[3]

హజ్రత్ హమ్జా సోదరి సఫియ్యా ముస్లింల ఓటమి గురించి విని మదీనా నుండి యుద్ధభూమి వైపుకు బయలుదేరింది. దైవప్రవక్త (సల్లం) ఆమె కుమారుడైన జుబైర్‌ను పిలిచి తనను హమ్జా శవాన్ని చూడకుండా ఆపమని చెప్పారు. జుబైర్ ఆమెకు దైవప్రవక్త ఆదేశాన్ని వినిపించారు. దానికామె ఏ మాత్రం దిగ్భ్రాంతికి లోనుకాకుండా తనకు తన సోదరుని

---

1) ముస్తద్రక్ హాకిమ్ మూడో సంపుటి 226వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 90వ పుట.
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.
3) సీరత్ ఇబ్నె కసీర్ మూడో సంపుటి 74వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 91వ పుట.

www.abulhasanalinadwi.org

పరిస్థితి గురించి ముందే తెలిసిపోయిందని, కాని అది దైవమార్గంలో ఏమంత గొప్ప త్యాగం కాదని చెప్పింది. అప్పుడు దైవప్రవక్త(సల్లం) ఆమెకు తన సోదరుని శవాన్ని చూసేందుకు అనుమతినిచ్చారు. ఆమె శవం దగ్గరికి వెళ్ళి చూస్తే సోదరుడు రక్తపుమడుగులో ముక్కలు ముక్కలుగా పడివున్నాడు. తన్నుకొస్తున్న దుఃఖాన్ని దిగమ్రింగి "ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్" అని చెప్పి సోదరుని మన్నింపు కోసం దైవాన్ని ప్రార్థించింది.[1]

## యుద్ధంలో ముస్లిం మహిళల పాత్ర

ఈ యుద్ధంలో చాలామంది ముస్లిం మహిళలు కూడా పాల్గొన్నారు. హజ్రత్ ఆయిషా మరియు అనస్ (రజి) తల్లి అయిన ఉమ్మె సులైమ్ క్షతగాత్రులకు నీళ్ళు త్రాపించేవారు. సహీహ్ బుఖారీలో హజ్రత్ అనస్ (రజి) ఇలా తెలియజేశారు. ఉహుద్ యుద్ధం నాడు ఆయిషా మరియు ఉమ్మె సులైమ్‌లు నీళ్ళ తిత్తుల్లో నీళ్ళు నింపుకొని తెచ్చి క్షతగాత్రులకు త్రాపించేవారు. ఆ నీళ్ళు అయిపోగానే మళ్ళీ నింపుకొని తెచ్చేవారు.[2] వేరొక ఉల్లేఖనంలో హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ తల్లి ఉమ్మె సులైత్ కూడా ఇదే సేవ చేశారని ఉంది.[3]

అన్సార్లలో ఓ గుణమంతురాలి తండ్రి, సోదరుడు, భర్త ముగ్గురూ ఈ యుద్ధంలో మరణించారు. ఈ మరణ వార్తలు ఒకటి తరువాత ఒకటి ఆమె చెవులకు వినపడుతూ ఉన్నాయి. అయినా ఆమె ప్రతీసారి "దైవప్రవక్త (సల్లం) ఎలా ఉన్నార?"నే అడిగేది. ప్రజలు ఆమెతో దైవప్రవక్త (సల్లం) క్షేమంగానే ఉన్నారని చెప్పారు. అప్పుడు ఆమె స్వయంగా వచ్చి దైవప్రవక్త (సల్లం) ముఖారవిందాన్ని చూసి ఆయనతో, "మీరు బ్రతికి ఉంటే చాలు. మాకెన్ని కష్టాలెదురయినా ఫర్వాలేదు" అని అంది.[4]

ముస్లింల వైపు డెబ్భైమంది మరణించారు. వారిలో చాలావరకు

1) ముస్తద్రక్ హాకిమ్ మూడో సంపుటి 218వ పుట. తారీఖె తబ్రీ మూడో సంపుటి 72వ పుట
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.
3) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.
4) సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 99వ పుట. సీరత్ ఇబ్నె కసీర్ మూడో సంపుటి 93వ పుట. తబ్రీ మూడో సంపుటి 74వ పుట.

www.abulhasanalinadwi.org

అన్నార్లే. ఆ సమయంలో ముస్లింలు చాలా నిరుపేదలు. వారిదగ్గర ఆ అమరవీరుల అంత్యక్రియలు చేయటానికి చాలినంత వస్త్రం కూడా లేదు. వారి శవాలు నెత్తుటి మడుగుల్లో ముద్దలై ఉన్నాయి. అంచేత వారికి స్నానం చేయించకుండా అలాగే ఒక్కొక్క సమాధిలో ఇద్దరేసి చొప్పున ఉంచి ఖననం చేశారు. శవాన్ని సమాధిలో ఉంచేటప్పుడు వారిరువురిలో ఎక్కువగా ఖురాన్‌ను కంఠస్తం చేసివున్నవాడికి ప్రాధాన్యతనిచ్చేవారు.[1] ఎనిమిది సంవత్సరాల తరువాత దైవప్రవక్త (సల్లం) ఓసారి ఆ సమాధులు ఉన్నచోటు గుండా వెళుతుండగా ఒక్కసారిగా ఆయన ఒళ్ళు జలదరించింది. ఆ సమయంలో అప్రయత్నంగానే ఆయన నోటినుండి బాధాతప్తమైన పలుకులు వెలువడ్డాయి. ఆ తరువాత ఆయన ప్రజలనుద్దేశించి ఉపన్యసిస్తూ, "ముస్లింలారా! నా తదనంతరం మీరు తిరిగి బహు దైవారాధకులుగా మారిపోతారన్న భయం నాకు లేదు. కాని మీరు రాబోవు కాలంలో ప్రాపంచిక సిరిసంపదలకు దాసోహమయి పోతారని నాకు భయంగా ఉంది" అన్నారు.[2]

## హమ్రూవుల్ అసద్ వరకు శత్రువుల్ని తరిమికొట్టడం

ఇరుపక్షాలూ యుద్ధ మైదానం నుండి వెనక్కు మరలాయి. ముస్లింలు గాయాలతో నుజ్జునుజ్జయివున్నారు. కాని వారికి అబూ సుఫ్యాన్ తమల్ని ఓడిపోయినట్లుగా భావించి తిరిగి దాడిచేస్తాడేమోనని అనుమానంగా ఉంది. అందుకని దైవప్రవక్త(సల్లం) అనుచరుల్ని ఉద్దేశించి, "మీలో ఎవరైనా శత్రువుల్ని వెంటాడతారా?" అని అడిగారు. ఆ మాట అన్నదే తడవుగా డెబ్భై మంది అనుచరులు దానికోసం సిద్ధమయ్యారు. వారిలో హజ్రత్ అబూబక్ర్, జుబైర్ (రజి)లు కూడా ఉన్నారు.[3]

శత్రువులు ఉహుద్ నుండి బయలుదేరి 'రౌహా' ప్రాంతానికి చేరుకున్నాక అబూ సుఫ్యాన్‌కు తాము తలపెట్టిన కార్యం అసంపూర్ణంగా

---

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
3) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం

www.abulhasanalinadwi.org

మిగిలి పోయిందనుకొని ముస్లింలపై మళ్ళీ దాడిచేయాలనే కుట్రలు పన్నసాగాడు. కాని ఇలా జరుగుతుందని దైవప్రవక్త (సల్లం) ముందే ఊహించారు. మరుసటి దినం ఆయన ముస్లింలెవరూ అప్పుడే ఇండ్లకు తిరిగి వెళ్ళవద్దని ప్రకటించారు. ఆ తరువాత అనుచరులందరినీ వెంటబెట్టుకొని మదీనాకు ఎనిమిది మైళ్ళ దూరంలోనున్న హమ్రావుల్ అసద్ అనే ప్రాంతానికి చేరుకున్నారు. ఖుజాఆ తెగ అప్పటికింకా ఇస్లాం స్వీకరించక పోయినప్పటికీ లోపాయికారీగా మాత్రం ఇస్లాం పక్షం వహిస్తూ ఉండేది. ఆ తెగ నాయకుడు మాబద్ ఖుజాయి ఓటమి వార్త విని వెంటనే దైవప్రవక్త సన్నిధికి వెళ్ళాడు. అక్కడి నుండి తిరిగి అబూ సుఫ్యాన్ దగ్గరికి వెళ్ళాడు. అబూ సుఫ్యాన్ తాను ముస్లింలపై మళ్ళీ దాడి చేయాలను కుంటున్నానని మాబద్‌కు తన నిర్ణయం తెలిపాడు. అప్పుడు మాబద్ సమయస్ఫూర్తితో, దైవప్రవక్త(సల్లం) భారీ ఎత్తున యుద్ధ సామాగ్రితో ఇటువైపే వస్తున్నారని, ప్రస్తుతం ఆయన్ని ఎదుర్కోవటం తమవల్ల కాదని చెప్పాడు. దాంతో అబూ సుఫ్యాన్ భయపడి మక్కాకు పలాయనం చిత్తగించాడు.[1]

దైవప్రవక్త(సల్లం) మదీనాకు తిరిగి వచ్చినప్పుడు నగరమంతా శోక సముద్రంలో మునిగి ఉంది. ఆయన ఎటువైపు వెళ్ళినా ఇండ్లల్లో నుండి శోకనాదాలు వినిపిస్తున్నాయి. అందరూ తమ తమ బంధుమిత్రుల పట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారు, కాని హజ్రత్ హమ్జా గురించి ఎవ్వరూ ఏడ్వటం లేదు. ఇది గమనించి ఆయన బాధాతప్త హృదయంతో, "అయ్యో హమ్జా పట్ల సంతాపాన్ని వ్యక్తం చేసేవాడే లేడా?!" అన్నారు.

ఆ మాట వినగానే అన్సార్లు ఒక్కసారిగా బావురుమన్నారు. అందరూ తమ భార్యలతో దైవప్రవక్త (సల్లం) ఇంటికి వెళ్ళి హమ్జా పట్ల సంతాపాన్ని వ్యక్తం చేయండని చెప్పారు. వాళ్ళంతా దైవప్రవక్త (సల్లం) గృహానికి వెళ్ళి హజ్రత్ హమ్జా గురించి విలపించటం మొదలు పెట్టారు. దైవప్రవక్త (సల్లం) ఇంటికి చేరుకోగానే ఆయనకు అక్కడ ముసుగులు ధరించి ఉన్న కొంతమంది స్త్రీలు కనిపించారు. వాళ్ళంతా హజ్రత్ హమ్జా

---

1) ముస్నదె అహ్మద్ రెండవ సంపుటి 84వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 100నుండి 104 పుటలు.

www.abulhasanalinadwi.org

పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ విలపిస్తున్నారు. దైవప్రవక్త (సల్లం) వారికి మేలు జరగాలని దేవుణ్ణి ప్రార్థించి, ఆ తరువాత వారితో, "మీ సానుభూతికి నా ధన్యవాదాలు. మరణించిన వారి గురించి ఇలా ఏడ్వటం ధర్మసమ్మతంకాద"ని చెప్పారు.

## ముస్లింలపై దారుణ మారణకాండ

ఉహుద్ యుద్ధం తరువాత శత్రువులు ముస్లింలకు ఏ విధంగానయినా హాని తలపెట్టాలని ఎన్నో కుట్రలు పన్నారు. హి.శ. నాల్గవ యేట ఒక్కసారి ఖురైషులు అజ్ల్, ఖారా అనే తెగలకు చెందిన ఏడుగురిని మచ్చిక చేసుకొని మదీనాలో ఉన్న దైవప్రవక్త (సల్లం) దగ్గరికి పంపారు. వాళ్ళు దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి తమ తెగవారు ఇస్లాం స్వీకరించటానికి సిద్ధంగా ఉన్నారని, కనుక తమకు ధర్మాన్ని బోధించటానికి కొంతమంది బోధకులు కావాలని విన్నవించుకున్నారు.[2] దైవప్రవక్త (సల్లం) వాళ్ళను నమ్మి పదిమంది అనుచరుల్ని వాళ్ళవెంట పంపారు. ఆసిమ్ బిన్ సాబిత్‌ను వాళ్ళకు నాయకునిగా నియమించారు. మదీనా వెలుపలికి రాగానే వాళ్ళ తెగకే చెందిన రెండొందల మంది యువకులు ఆ ముస్లింలను బంధించి తీసుకెళ్ళాలని వారిని చుట్టుముట్టారు. దైవప్రవక్త అనుచరులు ఎలాగో తప్పించుకొని ఓ ఎత్తైన ప్రదేశానికి చేరుకున్నారు. నలువైపులా కాచుకొని నించున్న శత్రువులు క్రిందికి దిగివస్తే తమకు రక్షణ కల్పిస్తామని నమ్మబలికారు. కాని ఆసిమ్ తాను ఎన్నటికీ దైవద్రోహుల రక్షణను అంగీకరించనని తెగేసి చెప్పారు. ఆ తరువాత ఆకాశం వైపు తలెత్తి, "దేవా! ఈ వార్త దైవప్రవక్త (సల్లం)కు తెలియపరచు" అంటూ ఆ పదిమందిలో ఏడుగురు వారితో పోరాడి అక్కడికక్కడే మరణించారు.[3] ఖురైషులు ఆసిమ్ శవాన్ని ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు అతని శరీరం నుండి ఏదయినా మాంసపు ముక్కను కోసుకొని రమ్మని కొంతమందిని పంపించారు. ఒక అమరగతుని శవం పట్ల దైవద్రోహులు నీచాతి నీచంగా ప్రవర్తించ

1) ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటి 215 వ పుట. ఇబ్నెహిషామ్ రెండవ సంపుటి 99వ పుట.
2) తబఖాత్ ఇబ్నెసాద్ రెండో సంపుటి 50వ పుట.
3) సహీహ్ బుఖారీలో యుద్ధాల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

బోతుంటే దేవుడు కూడా ఊరుకోలేదు. తేనెటీగలు ఆయన శవంపై తట్టెను నిర్మించుకున్నాయి. వచ్చిన వాళ్ళు అదిచూసి భయపడి పారిపోయారు.[1] వారిలో ఖుబైబ్, జైద్ అనే ఇద్దరు అనుచరులు మాత్రం అవిశ్వాసుల వాగ్దానాలను నమ్మి గట్టు దిగివచ్చారు. సుఫ్యాన్ హుజలీ వాళ్ళిద్దర్నీ మక్కాకు తీసుకెళ్ళి ఖురైషులకు అమ్మేశాడు. ఖురైషులు వారిని హారిస్ బిన్ ఆమిర్ ఇంట్లో కొన్ని రోజులపాటు తిండి, నీళ్ళు ఇవ్వకుండా ఖైదు చేశారు. ఒకరోజు హారిస్ పిల్లవాడు ఆడుకుంటూ ఖుబైబ్ దగ్గరికి వచ్చాడు. ఆ సమయంలో ఆయన దగ్గర కత్తి ఉంది. ఆయన ఆ చంటోణ్ణి ఆప్యాయంగా తన తొడలపై కూర్చోబెట్టుకున్నారు. ఆ పిల్లవాడి తల్లి ఆ దృశ్యం చూసి ఒక్కసారిగా భయపడిపోయింది. తన పిల్లవాడు, తాము కొన్నిరోజుల నుండి తిండి నీళ్ళు ఇవ్వకుండా బంధించి ఉంచిన ఖైదీ దగ్గర ఉన్నాడు. అదీగాక ఆ ఖైదీ దగ్గర కత్తి కూడా ఉంది. అది చూసి ఆమె భయంతో గట్టిగా కేకవేసింది. అప్పుడు ఖుబైబ్ (రజి) ఆమెను సముదాయిస్తూ, "నేను నీ పిల్లవాణ్ణి చంపుతాననుకున్నావా? ముస్లింలు ఎవరికీ ద్రోహం తలపెట్టే వారుకారని నీకు తెలియదా?" అని అన్నారు.

దుర్మార్గులైన ఖురైషులు కొన్ని రోజుల తరువాత హజ్రత్ ఖుబైబ్‌ను శిలువ వేయటానికి తీసుకెళ్ళారు. శిలువ దగ్గర నించోబెట్టి ఇస్లాం ధర్మాన్ని వదలిపెడితేనే తనను ప్రాణాలతో వదలిపెడతామని హెచ్చరించారు. కాని దానికి వారిరువురు అనుచరులు ఇస్లామే లేకపోతే ఇక తాము బ్రతికి ఉండి ఏం లాభమని సమాధానమిచ్చారు.

ఖురైషులు వారిని తమ చివరి కోరిక ఏమిటని అడిగారు. ఖుబైబ్ తమకు రెండు రకాతుల నమాజ్ చేసుకునే అవకాశం కల్పించమన్నారు. ఖురైషులు దానికి సమ్మతించారు. ఖుబైబ్ నమాజ్ ముగించుకున్న తరువాత ఖురైషులను ఉద్దేశించి, "నేను సాధారణంగా సుదీర్ఘంగా నమాజ్ చేస్తాను. కాని ఖుబైబ్ ప్రాణభయంతో ఎక్కువసేపు నమాజ్ చేస్తున్నాడని మీరంటారనే నమాజ్ తొందరగా ముగించాను" అన్నారు. చివరికి ఆ నిర్దయులు వారిరువుర్నీ శిలువనెక్కించారు. ఆ తరువాత కొంతమంది బరిసెలు తీసుకొని వాటి మొనలతో వారి శరీరాలను పొడవసాగారు.[2]

1) సీరత్ ఇబ్నెహిషామ్ రెండవ సంపుటి 171వ పుట.
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం

www.abulhasanalinadwi.org

కాని అల్లాహు అక్బర్! ఏమి సహనం! ఏమి స్థయిర్యం!! పరలోక ముక్తిపట్ల వారికి ఎంత విశ్వాసం!!! అన్ని చిత్రహింసలు పెట్టినా వారి నోటినుండి చిన్న మూలుగు కూడా వినపడలేదు.

ఓ పాషాణ హృదయుడు ఖుబైబ్ గుండెను గాయపరుస్తూ, "ఇప్పుడు చెప్పు. నీకు ఈ బాధ తప్పిపోయి, ముహమ్మద్ ఇందులో చిక్కుకుంటే బావుంటుంది కదూ!" అన్నాడు. ఆ మాట వినగానే ఖుబైబ్ ఉద్రేకం కట్టలు త్రెంచుకుంది.

"నేను బ్రతికి బయటపడటానికి ముహమ్మద్ (సల్లం) కాలిలో ముల్లు గ్రుచ్చుకున్నా దాన్ని నేను సహించలేను" అన్నారు.[1]

జనం చుట్టూతా నించొని ఏదో తమాషా జరుగుతున్నట్లు అత్రంగా చూస్తున్నారు. కరగని కసాయి గుండెల ఖురైషులు ఆయన్ని శిలువనెక్కించబోతుండగా ఆయన ఆ సమయంలో హృదయాన్ని ద్రవింపజేసేటటువంటి గేయం పాడారు. ఆ గేయంలో ఆయన ఆ హృదయవిదారక సన్నివేశాన్ని చిత్రిస్తూ, ఇస్లాం పట్ల తనకున్న విశ్వాసాన్ని, ప్రగాఢ అభిమానాన్ని వెలిబుచ్చారు.

> "జనం తండోపతండాలుగా వచ్చి నా చుట్టూ చేరుతున్నారు. ఖురైషులు తమ వాళ్ళందర్నీ పిలుచుకున్నారు. వీళ్ళందరూ తమ క్రోధాన్ని వెళ్ళగ్రక్కుతున్నారు. నామీద అగ్రహావేశాలు కురిపిస్తున్నారు. నేను ఈ మరణాస్పదంలో బంధింపబడి ఉన్నాను. తెగలవాళ్ళు తమ స్త్రీలను, పిల్లల్ని కూడా పిలుచుకొని వచ్చారు. నన్ను గట్టి ఎత్తైన ఓ కొయ్యదగ్గరికి తీసుకొచ్చారు. దైవవిరోధాన్ని అవలంబిస్తే నన్ను విడిచి పెడతారట! కాని దాని కంటే నాకు చావే సులువు. నా కళ్ళనుండి కన్నీళ్లు సెలయేళ్ళై ప్రవహిస్తున్నాయి. అయినా నేను సహనాన్ని కోల్పోలేదు. నేను శత్రువుల్ని ప్రాధేయపడను, ఏడ్చిగగ్గోలూ పెట్టను. చావు గురించి నేను భయపడటం లేదు. దొంతరలు, దొంతరలుగా వచ్చి రక్తం పీల్చే నరకాగ్నికి

1) జాదుల్ మఆద్ మూడవ సంపుటి 245 పుట

www.abulhasanalinadwi.org

నేను భయపడుతున్నాను. మహోన్నత పీఠాధిపతి అయిన ఆ ప్రభువు నన్ను తన కార్యం కోసం ఎన్నుకొని సహనం వహించమని పురమాయించాడు. ఈ దుర్మార్గులు నా మాంసం నుజ్జు నుజ్జయ్యేలా చితకబాదారు. ఇక నాకు బ్రతుకుతానన్న నమ్మకమూ లేదు. నేను నా దైన్యాన్ని, నిస్సహాయతను గురించి, వీళ్ళ దుష్ట ఆలోచనల గురించి దైవానికి ఫిర్యాదు చేసుకుంటున్నాను. దైవసాక్షి! నేను ఇస్లాం కోసం ప్రాణాలర్పిస్తున్నప్పుడు ఎటువైపు తూలినా, ఎలా చంపబడినా నాకు ఫర్వాలేదు. దేవుడు తలిస్తే ఈ మాంసంలోని ప్రతి ముక్కకూ శుభం ప్రసాదిస్తాడని నాకు దృఢ నమ్మకముంది.[1]

చివరగా ఆయన ఈ విధంగా ప్రార్థించారు.

“దేవా! మేము నీ ప్రవక్త ఆదేశాల్ని వీళ్ళకు చేరవేశాము. ఇక నీవు మా పరిస్థితిని గురించి నీ ప్రవక్తకు తెలియజేయి”[2]

హజ్రత్ ఉమర్ (రజి) ఖలీఫాగా ఉన్నప్పుడు సాద్ బిన్ అమిర్ ఆయన దగ్గర గవర్నరుగా పనిచేశారు. ఆయన ఒక్కోసారి అనుకోకుండా స్పృహతప్పి పడిపోయేవారు. తమరు ఇలా పడిపోవటానికి కారణమేమిటని హజ్రత్ ఉమర్ (రజి) ఆయన్ని అడిగారు. దానికాయన సమాధానమిస్తూ...

“దైవసాక్షి! నాకెలాంటి రోగం లేదు. ఇది నాకు పుట్టుకతో వచ్చిన వ్యాధికూడా కాదు. నిజం ఏమిటంటే ఖుబైబ్‌ను శిలువ నెక్కిస్తున్నప్పుడు ఆ గుంపులో నేను కూడా ఉన్నాను. ఆ సమయంలో ఆయన అన్న మాటలు గుర్తొచ్చినప్పుడల్లా ఇలా స్పృహ తప్పి పడిపోతుంటాను” అన్నారు.[3]

---

1) జాదుల్ మఆద్ మూడో సంపుటి 245 వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 176వ పుట
2) సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 173వ పుట.
3) సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 173వ పుట.

www.abulhasanalinadwi.org

అబూ బరా ఆమిర్ కూడా ముస్లింలను ఇలాగే మోసం చేశాడు. అతడు దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి నజద్ రాజ్యంలో నివసిస్తున్న ప్రజలకు సత్యాన్ని, ధర్మాన్ని బోధించటానికి కొంతమంది బోధకులు కావాలని అడిగాడు. అతని భాతృజుడు నజద్ ప్రాంతానికి నాయకుడు. ఆమిర్ ఇస్లాం బోధకులకు అన్ని విధాలా రక్షణ కల్పిస్తామని వాగ్దానం చేశాడు. దైవప్రవక్త (సల్లం) అతని మాటల్ని నమ్మి ముంజిర్ బిన్ అమ్ర్ అన్సారీతోపాటు డెబ్భైమంది పేరెన్నికగన్న ఖురాన్ పండితుల్ని అతని వెంట పంపారు. వాళ్ళందరూ బనూ ఆమిర్ ప్రాంతంలోని మవూనా అనే బావి దగ్గరికి చేరుకున్నాక అక్కడినుంచి హరామ్ బిన్ మిల్హాన్ అనే ఆయనకు దైవప్రవక్త ఉత్తరమిచ్చి తుఫైల్ అనే రాజు దగ్గరికి రాయబారం పంపారు. కాని రాజు ఆ రాయబారిని చంపించాడు. జబ్బార్ బిన్ సలమా అనేవాడు రాజు అనుజ్ఞ మేరకు ఆయన్ని వెనుక నుండి బరిసెతో పొడవగా అది గుండె బయటికొచ్చింది. దాంతో ఆయన "కాబా గృహదైవం సాక్షి! నా జీవితం ధన్యమయింద"ంటూ అక్కడికక్కడే నేల కొరిగి ప్రాణాలు విడిచారు.

ఆయన అన్న మాటకు ఆ హంతకుడు ఎంతగానో ప్రభావితుడయ్యాడు. దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి ఇస్లాం స్వీకరించి ముస్లిం అయిపోయాడు. అక్కడి రాజు మిగిలిన ముస్లింలందర్నీ కూడా చంపించాడు. ఒక్క కాబ్ బిన్ జైద్ మాత్రం మరణించిన వారి ఆయుధాల చాటున దాక్కొని ఎలాగో బ్రతికి బయటపడ్డారు. తరువాత ఆయనే దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళి ఆయనకు ఈ సంఘటన గురించి తెలియజేశారు.[1]

## బనూ నజీర్ తెగ బహిష్కరణ

పూర్వకాలంలో ఇస్రాయీల్ సంతతివారైన యూదులు గొప్ప పవిత్రమైన, పునీతమైన జాతిగా పరిగణించబడేవారు. కాని రానురాను ధర్మానికి, సన్మార్గానికి దూరమై దైవాగ్రహానికి పాత్రులయ్యారు.

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం, సీరత్ ఇబ్నె హిషామ్ 184వ పుట రెండవ సంపుటి.

www.abulhasanalinadwi.org

హజ్రత్ ఈసా లాంటి దయార్ద్రహృదయులు కూడా వారి ఆగడాలకు, దుశ్చేష్టలకు విసిగిపోయి వారిని సర్పము (షైతాన్) సంతానముగా అభివర్ణించారు. అంతేకాదు... రానున్న కాలంలో ప్రపంచ ఆధిపత్యం యూదుల చేతులనుండి జారి వేరొక జాతికి సంక్రమిస్తుందనీ, వాళ్ళు ఆ ఆధిపత్యం సాయంతో గొప్ప ప్రయోజనాలను సాధిస్తారని కూడా చెప్పారు.

హజ్రత్ ఈసా ప్రవక్త చెప్పిన భవిష్యవాణి సాకారమయ్యే సమయం ఆసన్నమయి అన్నిచోట్లా ముహమ్మద్ (సల్లం)గారి దివ్య సందేశం ప్రతిధ్వనిస్తుండటంతో యూదులు కలవరపడ్డారు. ఆఖరికి వారు ఇంతకుముందు ఈసా ప్రవక్తపై అత్యాచారం చేసినట్లుగానే ముహమ్మద్ (సల్లం)కు కూడా ముప్పుతిప్పలు పెట్టాలని నిశ్చయించుకున్నారు.[1]

దైవప్రవక్త (సల్లం) మదీనాకు వలసవచ్చిన తొలియేటనే యూదులు ముస్లింలతో శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. కాని అనతికాలంలోనే వారి నీచబుద్ధి బయటపడింది. ఒప్పందం కుదిరి ఒకటిన్నర సంవత్సరం గడిచిందో లేదో అప్పుడే సంఘ విద్రోహక చర్యలకు పాల్పడసాగారు. దైవప్రవక్త (సల్లం), ముస్లింలు బద్ర్ యుద్ధానికి వెళ్ళివున్న రోజుల్లో జరిగిన సంఘటన- ఒక ముస్లిం స్త్రీ బనూఖైనుఖా వీధికి పాలు అమ్ముకోవటానికి వెళ్ళింది. కొంతమంది ఆకతాయి యూదులు ఆమెను నడివీధిలోనే వివస్త్రను చేశారు. ఆమె బిగ్గరగా కేకలు పెట్టి అరవడంతో ఒక ముస్లిం అక్కడికి పరుగెత్తుకొనివచ్చి ఆ పాడుపనికి ఒడిగట్టిన యూదుణ్ణి ఆవేశంలో హత్యచేశాడు. అప్పుడు యూదులందరూ ఏకమై ఆ ముస్లింను హత్యచేయటమే గాకుండా పెద్ద విధ్వంసాన్ని సృష్టించారు. దైవప్రవక్త (సల్లం) బద్ర్ యుద్ధం నుండి తిరిగొచ్చిన తరువాత ఆ విధ్వంసాన్ని గురించి యూదుల్ని సంజాయిషీ అడగటానికి పిలిచారు. వాళ్ళు దైవప్రవక్త దగ్గరికి వెళ్ళటానికి నిరాకరించటమేగాకుండా ఒప్పంద పత్రాన్ని త్రిప్పి పంపి యుద్ధానికి సిద్ధమయ్యారు.[2]

ఈ విధంగా వారు తిరుగుబాటు ధోరణులను అనుసరించటంతో దైవప్రవక్త (సల్లం) వారికి సంఘ బహిష్కరణ శిక్ష విధించారు.

1) రహ్మతుల్లిల్ ఆలమీన్ మొదటి సంపుటి 129, 130 పుట
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం

www.abulhasanalinadwi.org

అంతకుముందే ఒకసారి మక్కా ఖురైషులు దైవప్రవక్త (సల్లం)కు వ్యతిరేకంగా యుద్ధం చెయ్యమని మదీనాలోని బహుదైవారాధకులకు ఉత్తరం వ్రాసిపంపారు. కాని దైవప్రవక్త (సల్లం) అప్పుడే యుక్తితో వారి పథకాల్ని నీరుగార్చారు. ఇప్పుడు బద్ర్‌యుద్ధంలో ఓటమికి గురయ్యాక మళ్ళీ, 'మీ దగ్గరకోటలు, లెక్కలేనన్ని ఆస్తి అంతస్తులున్నాయి. కనుక మీరు ముహమ్మద్‌కు వ్యతిరేకంగా యుద్ధం చెయ్యండి. మీరు గనక యుద్ధం చేయకపోతే మేము మిమ్మల్ని ఏం చేస్తామో చూడండి. మీ జాతి స్త్రీల కాళ్ళకుండే మువ్వల్ని కూడా వదలి పెట్టకుండా దోచుకుంటాం' అని యూదుల్ని బెదిరిస్తూ ఉత్తరం రాశారు. ఈ ఉత్తరం అందుకున్నాక బనూనజీర్ తెగవారు ముస్లింలతో తాము ఇంతకు ముందు చేసుకున్న ఒప్పందాన్ని భగ్నం చేసి దైవప్రవక్త (సల్లం)కు ద్రోహం చెయ్యాలని నిశ్చయించుకున్నారు.[1]

## హి.శ. నాల్గో యేట జరిగిన సంఘటన

దైవప్రవక్త (సల్లం) కొన్ని జాతీయ ప్రయోజనాల నిమిత్తం విరాళాలు సేకరించే ఉద్దేశ్యంతో బనూనజీర్ వీధికి వెళ్ళారు. ఆ తెగవాళ్ళు దైవప్రవక్త (సల్లం)ను ఓ గోడ ప్రక్కన కూర్చోబెట్టారు. ఆ తరువాత ఇబ్నె జహాష్ అనేవాడ్ని గోడపైకెళ్ళి ఒక పెద్ద రాతిబండను దైవప్రవక్త (సల్లం) మీదకు దొర్లించమని పంపించారు.

దైవప్రవక్త (సల్లం)కు యూదులు పన్నిన కుట్ర గురించి 'వహీ' ద్వారా తెలిసిపోయింది. దైవకృపవల్ల వెంటనే ఆయన అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోయారు.[2]

ఆఖరికి బనూ నజీర్ తెగవారి చేష్టలతో విసుగెత్తి పోయి ముస్లింలు వారిని మదీనా నగరం నుండి బహిష్కరించారు. దాంతో వాళ్ళు తమ సామగ్రి అంతా ఆరొందల ఒంటెలపై మోపి తమ ఇండ్లను తమ చేతులతోనే ధ్వంసం చేసుకొని మేళతాళాలతో ఖైబర్ ప్రాంతానికి చేరుకొని అక్కడే స్థిరపడిపోయారు.[3]

---

1) సుననె అబూదావూద్
2) సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 190వ పుట
3) ముసన్నఫ్ అబ్దుర్రజ్జాఖ్ ఐదో సంపుటి 358వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 191,192 పుటలు.

www.abulhasanalinadwi.org

# కందక ప్రతిఘటన

బనూ నజీర్ తెగవారు మదీనా వదలి వెళ్ళిపోయిన తరువాత ముస్లింలపై కక్షసాధింపు కోసం కుట్రలు పన్నసాగారు. బనూనజీర్ తెగ నాయకులైన సలాం బిన్ అబుల్ హుఖైఖ్, హుయ్ బిన్ అఖ్తబ్, కినానా బిన్ రబీ తదితరులు మక్కా వెళ్ళి ఖురైషుల్ని కలుసుకొని, ఖురైషులు గనక తమతో చేయికలిపితే తాము ఇస్లాం ధర్మాన్ని నామరూపాల్లేకుండా చేస్తామని చెప్పారు. ఆ మాట వినగానే ఖురైషులకు వెతకబోయిన తీగ కాలికి తగిలినట్లనిపించింది. దాన్ని వారు సంతోషంతో అంగీకరించారు. ఖురైషుల్ని ఒప్పించిన తరువాత బనూ నజీర్ నాయకులు గిత్ఫాన్ తెగవారి దగ్గరికి వెళ్ళి తాము ఈ పనికి ఒప్పుకుంటే ఖైబర్ ప్రాంతంలోని సగం పంట తమకు ఇచ్చేస్తామని మభ్యపెట్టారు. దాంతో గిత్ఫాన్ తెగవారు కూడా ఒప్పుకున్నారు. బనూ అసద్ తెగవారు బనూ గిత్ఫాన్ తెగవారికి మద్దతుదారులు. అంచేత తాము కూడా సైన్యాన్ని తీసుకొని రావాలని గిత్ఫాన్ తెగవారు వారికి లేఖవ్రాసి పంపారు. బనూ సులైమ్ తెగవారికి ఖురైషులతో సత్సంబంధాలుండేవి. దాంతో సులైమ్ తెగ కూడా ఖురైషుల పక్షం వహించటానికి సిద్ధమయింది. బనూ సాద్ తెగవారు యూదులకు మద్దతుదారులైనందున యూదులు వారిని కూడా యుద్ధానికి ప్రేరేపించారు. మొత్తానికి అరబ్బు తెగలన్నీ ఏకమై భారీ ఎత్తున సైన్యాన్ని కూడదీసుకొని మదీనాపై దండయాత్రకు బయలుదేరాయి. ఆ సైన్యం మొత్తం దాదాపు పదివేలకు పైనే ఉంటుంది.[1]

దైవప్రవక్త (సల్లం)కు ఈ విషయం తెలియగానే ఆయన అనుచరుల సలహా కోరారు. అప్పుడు ఈరాన్‌కు చెందిన సల్మాన్ ఫార్సీ (రజి) తమ దేశంలో జరిగే కందక యుద్ధాల గురించి వివరించారు. అలాగే ప్రస్తుతం ముస్లింలు శత్రువులకు ఎదురెళ్ళి పోరాడటం విజ్ఞతతో

1) ఫత్‌హుల్ బారీ ఏడవ సంపుటి 393వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 214, 215 పుటలు.

www.abulhasanalinadwi.org

కూడుకున్న పని కాదనీ, సైన్యాన్నంతటినీ ఒకేచోట మోహరించి చుట్టూ కందకాలు త్రవ్వుకోవాలని సూచించారు. ఆయన ఇచ్చిన సలహాను ప్రజలందరూ అంగీకరించారు. వెంటనే కందకాలు త్రవ్వటానికి సాధనాలను సమకూర్చుకున్నారు.

మదీనా నగరానికి మూడు వైపులా ఇండ్లు, ఖర్జూరపు తోటలుండి నగరానికి రక్షణ కల్పిస్తుండేవి. ఒక్క సిరియా దిక్కు మాత్రం ఖాళీ మైదానం ఉండేది. దైవప్రవక్త (సల్లం) మూడు వేల అనుచరులతో పాటు వెళ్ళి ఆ ప్రాంతంలోనే కందకాలు త్రవ్వటం ప్రారంభించారు. ఇది హి.శ. ఐదవ సంవత్సరం ఎనిమిదో తేదీ నాటి సంఘటన.

కందకాలు త్రవ్వవలసిన చోట్లను దైవప్రవక్త (సల్లం) స్వయంగా నిర్ణయించారు. నేలమీద గుర్తులు వేసి పదిమంది పదిగజాల భూమి చొప్పున త్రవ్వాలని ఆదేశించారు. కందకం లోతు ఐదు గజాలు ఉండాలని నిర్ధారించారు. మూడువేల మంది అనుచరులు ఆరుదినాల్లో ఈ కందకాల పని పూర్తిచేశారు.[1]

మస్జిదె నబవీ నిర్మాణం జరుగుతున్నప్పుడు దైవప్రవక్త (సల్లం) అనుచరులతోపాటు తానూ ఓ కార్మికుడిలా పరిశ్రమించారు. ఈ రోజు కందకాలు త్రవ్వినప్పుడు కూడా అలాగే ప్రత్యక్షమయ్యారు. వణుకు పుట్టించే చలిరాత్రులు. మూడ్రోజుల దాకా తినడానికి ఏమీ దొరికేది కాదు. ముహాజిర్లు, అన్సార్లు కందకాల నుండి మట్టి మోసుకెళ్ళి పారబోస్తూ ఉత్సాహంతో ఈ విధంగా గీతాలాపన చేసేవారు.

"మేము ముహమ్మద్‌తో బాస చేసుకున్నాము జీవితాంతం
ఆయన్ని అనుసరిస్తాం".[2]

దైవప్రవక్త (సల్లం) కూడా మన్ను ఎత్తిపోసేవారు. ఆయన ఉదరంపై పడిన మన్నును దులుపుకుంటూ ఇలా అనేవారు:

"దైవసాక్షి! దేవుడే లేకుంటే మనకు సన్మార్గం లభించేది కాదు.

1) ఫత్‌హుల్ బారీ ఏడో సంపుటి 393,394 పుటలు. సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 216, 217 పుటలు.
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం

www.abulhasanalinadwi.org

మనం దానధర్మాలు చేసేవాళ్ళం కాము. దేవా! మా హృదయాలను నెమ్మదించేలా చెయ్యి, మాకు స్థయిర్యాన్ని ప్రసాదించు. ముందుగా వాళ్ళే మాపై తిరుగుబాటు చేస్తున్నారు. మేము సాధ్యమైనంతవరకు అలజడులు తలెత్తకుండా ఉండాలనే కృషి చేస్తున్నాం."

ఆ సందర్భంగా ఆయన నోటి నుండి తన అనుచరులైన అన్సార్లు, ముహాజిర్ల కోసం ఈ ఆశీర్వచనాలు వెలువడ్డాయి-

"దేవా! పరలోక సౌఖ్యమే అసలు సౌఖ్యం, ముహాజిర్లకు, అన్సార్లకు శుభాన్ని ప్రసాదించు."[1]

అనుచరులు కందకాలు త్రవ్వుతుండగా ఒక చోట ఓ రాయి అడ్డొచ్చింది.ఎవరు ఎంత ప్రయత్నించినా అది పగల్లేదు. అనుచరులు ఈ విషయం దైవప్రవక్త (సల్లం)కు తెలియపరచారు. ఆయన మూడ్రోజుల నుండి పస్తులతో గడుపుతున్నారు. ఆ స్థితిలోనే వచ్చి ఆయన పారతో ఆ రాయి మీద ఒక్క దెబ్బవేశారు. దాంతో ఆ రాయి తుత్తునియలయి పోయింది.[2]

ముస్లిం సేనలు సిలా కొండలు వీపు వెనుక భాగంలో ఉండేటట్లు బారులు తీరారు. స్త్రీలను నగరంలోని కోటల్లో ఉంచి కట్టుదిట్టం చేయటం జరిగింది. బనూ ఖురైజా తెగవారు దాడిచేసే అవకాశాలుండటం వల్ల రెండొందలమంది సైనికుల్ని ఆ కోటల దగ్గర కాపలాగా ఉంచారు. వీళ్ళకు నాయకునిగా సలమా బిన్ అస్లమ్ నియమితులయ్యారు.[3]

బనూ ఖురైజా యూదులు అప్పటివరకు ఎవరితోనూ చేతులు కలపకుండా తటస్థంగానే ఉన్నారు. కాని ఇప్పుడు బనూ నజీర్ తెగవారు వాళ్ళను తమలో కలుపుకోవాలని ఉవ్విళ్ళూరసాగారు. హుయయ్ బిన్ అఖ్తబ్ (హజ్రత్ సఫియ్యా (రజి.అన్హా) తండ్రి) ఖురైజా నాయకుడయిన కాబ్ బిన్ అసద్ దగ్గరికి వెళ్ళాడు. కాని అతను బనూ నజీర్తో చేతులు

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.
3) షిబ్లీ నూమానీ గారి సీరతున్నబీ గ్రంథం మొదటి సంపుటి 422వ పుట.

www.abulhasanalinadwi.org

కలపటానికి నిరాకరించాడు. అప్పుడు హుయ్ అతన్ని మెల్లగా దువ్వసాగాడు.

"నేను అంతులేని సైన్యాన్ని వెంటబెట్టుకొచ్చాను. ఖురైషులు, అరబ్బులంతా ఏకమయ్యారు. అందరిదీ ఒకే లక్ష్యం. ఎలాగైనా సరే ముహమ్మద్‌ను కడతేర్చటం. ఈ అవకాశాన్ని చేజారనివ్వకూడదు. ఈ దెబ్బతో ఇస్లాం ధర్మం నామరూపాల్లేకుండా పోతుంది" -హుయ్ కాబ్‌ను పురికొల్పాడు.

అయినాగాని కాబ్ ఇస్లాంకు వ్యతిరేకంగా అరబ్బులతో చేతులు కలపటానికి సుముఖుడు కాలేదు.

"ముహమ్మద్ ఎంతో సత్యబద్ధుడు. ఆయనతో చేసుకున్న ఒప్పందాన్ని నేను భగ్నం చేయలేను"-పుల్ల విరిచినట్లుగా సమాధాన మిచ్చాడు. అయినా హుయ్ శ్రమ వృధా కాలేదు. ఎట్టకేలకు తన మాయమాటలతో కాబ్‌ను తనవైపుకు లాక్కున్నాడు.

ఈ విషయం దైవప్రవక్త (సల్లం)కు తెలియగానే నిజం ఏమిటో కనుక్కొని రమ్మని ఆయన సాద్ బిన్ ముఅజ్, సాద్‌బిన్ ఉబాదాలకు పురమాయించారు. ఒకవేళ బనూ ఖురైజా తెగవారు తమ ఒప్పందాన్ని భగ్నం చేసిన మాట నిజమే అయితే ఆ విషయాన్ని చూచాయగా తనకు తెలియపరచమనీ, ప్రజలకు ఆ విషయం తెలిస్తే వారు ధైర్యం కోల్పోయే ప్రమాదముందని చెప్పి పంపించారు. ఆ ఇరువురు అనుచరులు బనూ ఖురైజా వారి దగ్గరికి వెళ్ళి వారికి తమ ఒప్పందం సంగతి గుర్తు చేశారు. దానికి వాళ్ళు, "ముహమ్మద్ ఎవరో ఆయన ఒప్పందం ఏమిటో మాకు తెలియద"ని సమాధానమిచ్చారు.[1]

ఆ విధంగా బనూ ఖురైజా తెగవారు కూడా ఖురైషులతో చేతులు కలపటం వల్ల శత్రుసైన్యం ఇంకా అధికమయింది. ఖురైషులు యూదులు, అరబ్బు తెగల పదివేలమంది సైన్యం మూడు దళాలుగా విడిపోయి మదీనా నగరంపై ముప్పేట దాడులు ప్రారంభించటంతో మదీనా నేల అదిరిపోయింది.[2]

1) సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 220 నుండి 224 పుటలు
2) షిబ్లీ నూమానీ గారి సీరతున్నబీ గ్రంథం మొదటి సంపుటి 423 వ పుట.

www.abulhasanalinadwi.org

దీని గురించే దివ్యఖురాన్‌లో ఇలా చెప్పబడింది:

"శత్రువులు మీ మీదకు పైనుండీ, క్రిందనుండీ దండెత్తి వచ్చినప్పుడు, భయం వల్ల మీ కళ్ళు తేలగిల్లినప్పుడు మీ గుండె కాయలు గొంతుల్లోనికి వచ్చినప్పుడు మీరు అల్లాహ్‌ను గురించి రకరకాలుగా అనుమానిస్తున్నప్పుడు, విశ్వాసులు కఠిన పరీక్షకు గురి అయ్యారు, తీవ్రంగా కుదిపి వేయబడ్డారు.[1] (అల్ అహ్‌జాబ్)

ముస్లిం సైన్యంతోపాటు కొంతమంది కపటులు కూడా యుద్ధాని కొచ్చారు. వాళ్ళు కేవలం ప్రదర్శనా బుద్ధితోనే వారివెంట బయలుదేరారు. తీరా యుద్ధ మైదానానికి వచ్చాక వారికి ప్రతికూల వాతావరణం ఎదురయింది. ముస్లింల దగ్గర ఆహార సామగ్రి తక్కువగా ఉంది. అంచేత కొన్ని దినాలపాటు నిరంతరంగా పస్తులుండాల్సి వచ్చేది. రాత్రిళ్ళు నిద్ర ఉండేది కాదు. దీనికి తోడు ఇసుకేస్తే రాలనట్లుగా ఉన్న సైన్యాలతో యుద్ధం చేయాలి. ఈ ఇబ్బందుల్ని చూసిన తరువాత ఆ కపటుల బండారం బయట పడింది. వాళ్ళు దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి ఏవో సాకులు చూపెట్టి తమకు ఇండ్లకెళ్ళిపోవటానికి అనుమతినివ్వమని బ్రతిమాలసాగారు.[2]

అప్పుడు వారిలోని ఒక వర్గం "మా గృహాలు ప్రమాదంలో చిక్కుకున్నాయి" అని దైవప్రవక్తకు చెప్పి సెలవుకోరింది. వాస్తవానికి వాటికి ఏ ప్రమాదమూ లేదు. అసలు వారు (యుద్ధమైదానం నుండి) పారిపోదలిచారు." (అల్ అహ్‌జాబ్)

కాని వాస్తవానికి ఈ యుద్ధం ఇస్లాం కోసం ప్రాణాలర్పించే త్యాగధనుల సహనానికి పెట్టబడిన పరీక్ష.[3]

"సత్య విశ్వాసులు వారు దాడిచేసిన సైన్యాలను చూసినప్పుడు, ఇలా పలికారు. "అల్లాహ్ ఆయన ప్రవక్త

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
2) జాదుల్ మఆద్ మూడో సంపుటి 272వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 222వ పుట.
3) తఫ్‌సీరె ఖుర్‌తుబీ 14వ సంపుటి 157వ పుట

www.abulhasanalinadwi.org

మనకు వాగ్దానం చేసిన విషయం ఇదే. అల్లాహ్, అయన ప్రవక్త నిజమే పలికారు." ఈ సంఘటన వారి విశ్వాసాన్నీ, వారి ఆత్మసమర్పణనూ మరింత అధికం చేసింది."

(అల్ అహ్‌జాబ్)

## భయంకరమైన ముట్టడి

దాదాపు ఓ నెల రోజులపాటు శత్రు సైన్యాలు ముస్లింలను ముట్టడించి కూర్చున్నాయి. దైవప్రవక్త (సల్లం)కు, ఆయన అనుచరులకు మూడేసి రోజుల వరకు తినడానికి ఏమీ లభించేది కాదు. కొంతమంది అనుచరులు ఆకలికి తాళలేక దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి తమ కడుపులకు కట్టుకొని ఉన్న రాళ్ళు చూపించారు. దైవప్రవక్త (సల్లం) తన చొక్కా ఎత్తిచూపితే ఆయన కడుపుకు ఒకటికి బదులు రెండు రాళ్ళు కట్టబడి ఉన్నాయి.[1] శత్రువుల ముట్టడింపు రానురాను తీవ్రరూపం దాల్చసాగింది. ఒకసందర్భంగా దైవప్రవక్త (సల్లం) ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ "నగరం వెలుపలకెళ్ళి శత్రువులను గురించి సమాచారం తీసుకొని రాగలిగేవాడెవడైనా ఉన్నాడా?" అన్నారు. దానికి హజ్రత్ జుబైర్ (రజి) తప్ప ఎవ్వరూ మాట్లాడలేదు. ఆ సందర్భంగానే దైవప్రవక్త (సల్లం) హజ్రత్ జుబైర్‌ను 'హవారీ' అనే బిరుదుతో సత్కరించారు.[2]

శత్రువులు కందకాలు దాటి మదీనా వైపుకు రాగలిగేవారు కారు. అందుకని దూరం నుండే రాళ్ళు, బాణాలు విసిరేవారు. దైవప్రవక్త (సల్లం) అనేక చోట్ల కందకాల వద్ద సైన్యాన్ని నిలబెట్టారు. వారు శత్రువుల దాడుల్ని త్రిప్పికొట్టేవారు. ఒకానొక కందకం వద్ద స్వయంగా దైవప్రవక్త (సల్లం) కాపలాగా నించున్నారు.[3]

ఈ భయంకరమైన ముట్టడిని చూసి అన్సార్లు ధైర్యం కోల్పోతారేమోనని దైవప్రవక్త (సల్లం)కు అనుమానం కలిగింది. అందుచేత ఆయన గిత్‌ఫాన్ తెగవారితో మదీనా పంటలోని మూడోవంతు వారికి ఇచ్చే షరతుపై ఒప్పందం చేసుకుందామని తలంచారు. అన్సార్ నాయకులు

1) షిమాయిలె తిర్మిజీ
2) సహీహ్ బుఖారీ యుద్ధాల ప్రకరణం
3) సీరతున్నబీ మొదటి సంపుటి 425వ పుట

www.abulhasanalinadwi.org

సాద్ బిన్ ఉబాదా, సాద్ బిన్ ముఆజ్‌లను పిలిచి ఈ విషయమై సలహా కోరారు. దానికి వారు "ఒకవేళ ఇది దైవాజ్ఞ అయితే ఇక దాన్ని నిరాకరించటమన్న మాటే ఉండదు, కాని ఇది కేవలం దైవప్రవక్త (సల్లం) అభిప్రాయమైతే మాదో విన్నపం. మేము అవిశ్వాసులుగా ఉన్నప్పుడే మా నుండి కప్పం వసూలు చేయటానికి ఎవరికీ ధైర్యం చాల్లేదు. ఇప్పుడు ఇస్లాం స్వీకరించిన తరువాత మా పలుకుబడి మరింత పెరిగింది. అలాంటి స్థితిలో మేము ఇతరులకు కప్పం చెల్లించటం సిగ్గుచేటు" అని అన్నారు. వారి ఆత్మవిశ్వాసం చూసి దైవప్రవక్త (సల్లం) మనసు కుదుట పడింది. సాద్ ఒప్పంద పత్రాన్ని తనచేతిలోకి తీసుకొని అందులో వ్రాసివున్న మాటలు చెరిపేస్తూ 'వీళ్ళకు ఎంత దమ్ముందో మనమూ చూద్దాం' అన్నారు.[1]

బహు దైవారాధకులు ముస్లింలపై వంతులవారీగా దాడి జరపాలని పథకం వేసుకున్నారు. ప్రముఖ ఖురైష్ సైన్యాధిపతులైన అబూ సుఫ్యాన్, ఖాలిద్ బిన్ వలీద్, అమ్ర్ బిన్ ఆస్, జిరార్ బిన్ ఖత్తాబ్, హుబైరాలలో ఒక్కొక్కరు ఒక్కోరోజు సైన్యానికి సారథ్యం వహించేవారు. ప్రతి సైన్యాధిపతీ తన వంతు వచ్చినప్పుడు సైన్యాన్నంతటినీ వెంటబెట్టుకొని వెళ్ళి యుద్ధం చేసేవాడు. శత్రువులు కందకాలను దాటలేకపోయేవారు. అయినాగాని కందకాల వెడల్పు మరీ అంత ఎక్కువగా లేకపోవటం వల్ల ఆవలివైపు నుంచి ముస్లింలపై రాళ్ళు, బాణాలు విసిరేవారు.[2] ఆఖరికి ఇలా రాళ్ళు రువ్వటం వల్ల లాభం లేదనుకొని ఒకేసారి మెరుపుదాడి చేయాలని నిశ్చయించుకున్నారు. శత్రుసేనలన్నీ ఒకచోట చేరాయి. తెగలనాయకులు ముందుండి సైన్యాన్ని నడిపిస్తుండగా, ఒకచోట కందకం వెడల్పు చాలా తక్కువగా ఉన్నట్లు కన్పించింది. ఇక అక్కడి నుంచే దాడి చేయటం ప్రారంభించారు. ప్రముఖ అరబ్బు వీరులైన జిరార్, హుబైరా, నౌఫిల్, అమ్ర్ బిన్ అబ్దెవుద్‌లు తమ గుర్రాల సాయంతో ఒక్క గంతులో ఆవలి వైపుకు చేరుకున్నారు. వారిలో అందరికన్నా గొప్పవీరుడు అమ్ర్ బిన్ అబ్దె వుద్. ప్రజలు అతన్ని వెయ్యి రౌతులకు

1) బజ్జార్‌గారి కష్ఫుల్ అస్తార్ గ్రంథం మొదటి సంపుటి 332వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 223వ పుట.

2) సీరత్ హుల్బియ్యా రెండో సంపుటి 636వ పుట

www.abulhasanalinadwi.org

సమానమైన బలవంతుడిగా చెప్పుకునేవారు. బద్ర్ యుద్ధంలో క్షతగాత్రుడై తప్పించుకొని పారిపోయాడు. ముస్లింలపై ప్రతీకారం తీర్చుకునేదాకా తైల సంస్కారం చేసుకోనని ప్రతినబూనాడు. అప్పటికి అతని వయస్సు తొంభై సంవత్సరాలు. అయినా అందరికన్నా ముందుగా అతనే దాడికి దిగాడు. అరబ్బు ఆచారం ప్రకారం నడి యుద్ధ భూమిలోకి వెళ్ళి, 'తనతో పోరాడటానికి ఎవరైనా సిద్ధంగా ఉన్నారా?' అని రంకెలు వేశాడు. హజ్రత్ అలీ "నేను సిద్ధమే" అంటూ అతని మీదకు పోబోతుండగా అమ్ర్ బిన్ అబ్దె వుద్ సామాన్యుడు కాడంటూ దైవప్రవక్త(సల్లం) ఆయన్ని ఆపారు. హజ్రత్ అలీ సరేనని కూర్చున్నారు. కాని అమ్ర్‌కు పోటీగా ఎవరూ నిలబడటం లేదు. అతను రెండోసారి సవాలు చేశాడు. అప్పుడు కూడా హజ్రత్ అలీయే అతణ్ణి ఎదుర్కొనటానికి సిద్ధమయ్యారు. కాని దైవప్రవక్త (సల్లం) ఆదేశం మేరకు వెనక్కి తగ్గారు. మూడోసారి కూడా అలాగే జరిగింది. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "ఇతను అమ్ర్, వీడు సామాన్యుడు కాడు" అని హెచ్చరించారు.

కాని హజ్రత్ అలీ ఏ మాత్రం భయపడకుండా, "అవును, ఇతను అమ్ర్ అని నాకూ తెలుసు" అన్నారు. చివరికి దైవప్రవక్త (సల్లం) ఆయనకు అమ్ర్‌తో పోరాడటానికి అనుమతి నిచ్చారు. తన శుభ హస్తాలతో ఖడ్గ ప్రదానం చేసి తలపాగా కట్టారు.

అమ్ర్ లోకంలో ఎవరయినా తనతో మూడు విన్నపాలు చేసుకుంటే ఏదో ఒక విన్నపాన్ని తప్పకుండా అంగీకరిస్తాడని ప్రతీతి. హజ్రత్ అలీ అతని దగ్గరికెళ్ళి ముందుగా ఈ విషయం గురించే అడిగారు. ఆ సంగతి నిజమని రుజువయ్యాక అతనితో ఈ విధంగా సంభాషించారు.

అలీ: నేను నిన్ను ఇస్లాం స్వీకరించమని విన్నవించుకుంటున్నాను.

అమ్ర్ : అది అసంభవం.

అలీ: లేదంటే యుద్ధం మానుకొని తిరిగివెళ్ళిపో.

అమ్ర్: అలా చేస్తే అరబ్బు మహిళలు నన్ను 'చవట' అని ముద్రవేస్తారు. అది నేను భరించలేను.

అలీ: మరయితే నాతో యుద్ధానికి సిద్ధమవ్వు.

www.abulhasanalinadwi.org

ఆ మాట వినగానే అమ్ర్ దిక్కులు పిక్కటిల్లేలా నవ్వాడు. ఈ భూమ్మీద తనతో ఛాలెంజీ చేసే మగాడు కూడా ఉన్నాడా! అని ఆశ్చర్యపోయాడు. హజ్రత్ అలీ నేల మీద నించొని ఉండగా తాను గుర్రంపై నుండి యుద్ధం చేయటం తనకు అవమానకరంగా భావించి గుర్రం దిగాడు. ఖడ్గంతో గుర్రం కాళ్ళ మీద ఒక్కవేటు వేశాడు. దాంతో గుర్రం కాళ్ళ గిట్టెలు తెగిపోయాయి. కాస్త ముందుకు వచ్చి-

"నీ పేరేంటి?" అని అడిగాడు.

'అలీ' - నిర్భయంగా సమాధానమిచ్చారు.

'నేను నీతో యుద్ధం చేయాలనుకోవటం లేదు'. హజ్రత్ అలీ లాంటి బలహీనులతో పోరాడటం అవమానకరంగా అనిపించిందతనికి.

"కాని నేను చేయాలనుకుంటున్నాను" -హజ్రత్ అలీ అతన్ని రెచ్చగొడుతూ మాట్లాడారు.

ఆ మాట వినగానే అమ్ర్ ఆగ్రహంతో పల్లు పటపటా కొరికాడు. ఒర నుండి ఖడ్గం తీసి అలీ శిరస్త్రాణంపై ఝుళిపించాడు. కత్తి శిరస్త్రాణంలో దిగబడి నుదుటికి గాయమయింది. ఆ మచ్చ ఆయన నుదుటిపై జీవితాంతం ఉండి పోయింది. ఖామూస్ గ్రంథంలో ఇలా పేర్కొనబడింది: హజ్రత్ అలీ నుదుటిపై రెండు గాయాల మచ్చలుండేవి. ఒకటి అమ్ర్ వల్ల కలిగింది. రెండోది ఇబ్నె ముల్జిమ్‌తో పోరాడినప్పుడు కలిగింది. అందుకే ప్రజలు ఆయన్ని 'జుల్ ఖర్నైన్' అని పిలిచేవారు.

అమ్ర్ దాడి తరువాత హజ్రత్ అలీ అతనిపై ఎదురుదాడి చేశారు. ఖడ్గంతో ఒక్క వేటు వేయగానే అది అమ్ర్ భుజాన్ని తెగ్గొడుతూ బాగా లోతుగా దిగబడింది. వెంటనే ఆయన "అల్లాహు అక్బర్" అని నినదించారు. అమ్ర్ వధించబడగానే ముస్లింలు విజయోత్సాహంతో ఉరకలు వేశారు.[1] అమ్ర్ తరువాత జిరార్, హుబైరాలు దాడికి దిగివచ్చారు. కాని అలీని చూడగానే వారు సయితం వెనక్కు తగ్గాల్సి వచ్చింది. హజ్రత్ ఉమర్ జిరార్‌ను వెంబడించారు. జిరార్ ఒక్కసారిగా వెనక్కి తిరిగి

1) ముస్తద్రక్ హాకిమ్ మూడవ సంపుటి 34వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 224, 225 పుటలు. బైహఖీగారి దలాయిలున్నుబువ్వా గ్రంథం మూడో సంపుటి 436 నుండి 439 పుటలు. సీరతున్నబీ గ్రంథం మొదటి సంపుటి 427, 428 పుటలు.

www.abulhasanalinadwi.org

బరిసెతో ఎదురు దాడి చేయాలనుకున్నాడు, కాని తన్నుతాను తమాయించుకొని, "ఉమర్, ఈ ఉపకారాన్ని గుర్తుంచుకో" అన్నాడు.[1]

నౌఫిల్ పరుగెత్తుకుంటూ వచ్చి కందకంలో పడిపోయాడు. అదే అదనుగా ముస్లింలు అతనిపై బాణాల వర్షం కురిపించసాగారు. అతను కందకంలో నుండి, "ముస్లింలారా! నేను ఒక వీరునిలా చావాలనుకుంటున్నాను" అని గట్టిగా కేకవేశాడు. హజ్రత్ అలీ అతని కోరికను మన్నించి తానూ కందకంలోకి దిగారు. ఒక్క ఖడ్గపు వేటుతోనే అతన్ని పైలోకానికి పంపించారు.[2] ఆ రోజు యుద్ధం చాలా కఠినంగా సాగింది. పగలంతా ఇరుపక్షాల మధ్య పోరు కొనసాగుతూనే ఉంది. అవిశ్వాసులు ముస్లింలపై అన్నివైపుల నుంచి ఎడతెగకుండా రాళ్ళు, బాణాల వర్షం కురిపించారు. ఆ రోజు దైవప్రవక్త (సల్లం)కు వరుసగా నాలుగు నమాజులు వేళ తప్పించి చేయవలసి వచ్చింది. ఎడతెరిపి లేకుండా బాణాలు, రాళ్ళు వచ్చిపడుతుండటంతో నించున్న చోటు నుండి కదలటం కూడా కష్టమయిపోయింది.[3]

## సఫియా (రజి. అన్హా) సాహసం

ముస్లిం స్త్రీలు ఉన్న కోట యూదుల నివాస ప్రాంతాలకు దగ్గర్లో ఉంది. పురుషులందరూ దైవప్రవక్త (సల్లం) వెంట యుద్ధానికి వెళ్ళి ఉన్నారు. యూదులు అదే అదనుగా తలపోసి కోటపై దాడిచేయటానికి వచ్చారు. ఒక యూదుడు కోట సింహద్వారం దగ్గరికి వెళ్ళి దాడికి అనుకూలమైన మార్గాలు వెతకసాగాడు. దైవ ప్రవక్త (సల్లం) మేనత్త అయిన హజ్రత్ సఫియా (రజి. అన్హా) అతన్ని చూసి కోటలో స్త్రీలకు రక్షణకర్తగా నియమితులై ఉన్న హస్సాన్ బిన్ సాబిత్‌ను పిలిచారు.

"అదిగో... అటు చూడండి. ఎవడో యూదుడొచ్చి సింహద్వారం దగ్గర ఏదో పరిశీలిస్తున్నాడు. మీరు కోట దిగి వెళ్ళి వెంటనే అతన్ని చంపేయండి. లేకపోతే అతనెళ్ళి కోటలో పురుషులెవరూ లేరని

1) సీరత్ హల్బియ్యా రెండో సంపుటి 644వ పుట.
2) దలాయిలున్నుబువ్వా మూడో సంపుటి 438వ పుట. సీరత్ హల్బియ్యా రెండో సంపుటి 637వ పుట.
3) సుననె నసాయి నమాజ్ ప్రకరణం

www.abulhasanalinadwi.org

శత్రువులతో చెప్పేస్తాడు" అన్నారు అతనివైపు చూపెడుతూ.

కాని హస్సాన్ బిన్ సాబిత్‌కు పిరికితనం వ్యాధి ఉండేది. ఆయన ముందు ఎవరైనా కొట్లాడుకుంటుంటే అది చూసి ఆయనలో తత్తరపాటు మొదలయ్యేది. అంచేత ఆయన తన దౌర్బల్యాన్ని వ్యక్తం చేశారు. "నాలో అంతశక్తి ఉంటే నేను ఇక్కడెందుకు ఉండేవాణ్ణి" అన్నారు.

అప్పుడు హజ్రత్ సఫియా తనే ఆ పనికి ఉపక్రమించారు. గుడారం కోసం పాతి ఉంచిన ఓ దుడ్డు కర్రను పీకి, మెల్లగా కోటదిగి వెళ్ళి అతని తలపై గట్టిగా ఒక్క దెబ్బ వేశారు. దాంతో అతని తల పుచ్చకాయలా పగిలిపోయింది. ఇక ఆమె తిరిగొచ్చి హస్సాన్‌తో ఆ యూదుని ఒంటిపైనున్న ఆయుధాలు, బట్టలు లాక్కుని రమ్మని చెప్పారు. హజ్రత్ హస్సాన్ దానికి కూడా నిరాకరిస్తూ తనకు అవేమీ అవసరం లేదని చెప్పారు. అప్పుడామె అదీ చేయలేకపోతే కనీసం అతని శవాన్నయినా మెడ వరకు నరికి తలను కోట బయటికి విసిరేస్తే యూదులు భయపడతారని చెప్పారు. కాని చివరకు ఆ పని కూడా ఆమే చేయాల్సి వచ్చింది. ఆమె ఆ యూదుడి తల నరికి కోట వెలుపలికి విసిరేశారు. అది చూసి యూదులు కోటలో కూడా సైన్యం ఉన్నారన్న భయంతో పారిపోయారు.[1]

## దైవ సహాయం వచ్చింది

రోజులు గడిచే కొద్దీ ముస్లింలను ముట్టడించి వున్న శత్రుసైన్యాల ధైర్యం సన్నగిల్లసాగింది. పదివేల మంది సైనికుల ఆహార అవసరాలు తీర్చటమంటే మామూలు విషయం కాదు. కాకతాళీయంగా అది చలికాలమయినప్పటికీ ఒక్కసారిగా తుఫాను గాలులు చెలరేగాయి. తీవ్రమైన గాలి తాకిడికి శత్రువుల గుడారాలు ఎగిరిపోయాయి. పొయ్యిల పైనున్న కుండలు నేలపాలయ్యాయి. ఒక విధంగా ఈ సంఘటన ముస్లిం సైన్యాలకు ఎంతగానో తోడ్పడింది. అందుకే ఈ తుఫాను గాలుల్ని దివ్యఖురాన్ దైవిక సైన్యాలుగా చిత్రించటం జరిగింది.[2]

1) సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 228వ పుట
2) బైహఖీగారి దలాయిలున్నుబువ్వా గ్రంథం మూడో సంపుటి 448వ పుట

www.abulhasanalinadwi.org

"విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్ మీకు చేసిన ఉపకారాన్ని జ్ఞాపకం తెచ్చుకోండి. సైన్యాలు మీ పైకి దండెత్తి వచ్చినప్పుడు, మేము వాటి మీదకు ఒక పెనుగాలిని పంపాము, మీకు కానరాని సైన్యాలను పంపాము."

(అల్ అహ్‌జాబ్)

నుఐమ్ బిన్ మస్‌వూద్ సఖఫీ అనే ఆయన ఒకానొక గిత్‌ఫాన్ తెగ నాయకులు. ఖురైషులు, యూదులు ఇరుపక్షాల వారూ ఆయన్ని గౌరవించేవారు. ఆయన ఇస్లాం స్వీకరించిన సంగతి అవిశ్వాసులకు తెలియదు. ఆయన యూదులతోనూ, ఖురైషులతోనూ వేర్వేరుగా మాట్లాడి వారు పరస్పరం అసహ్యించుకునేలా చేశారు. దాంతో వారిమధ్య చీలిక వచ్చేసింది.[1]

ఒకవైపు విపరీతమైన చలి, మరోవైపు ఎన్నిరోజుల నుండి ముట్టడించి కూర్చున్నా ఏమీ లాభం లేకపోవటం, తుఫాను గాలులు, ఆహారపదార్థాల కొరత, యూదుల సహాయ ఉపసంహరణ-ఇవన్నీ ఖురైషుల నిలకడను పెకిలించి పారేశాయి. అబూసుఫ్యాన్ తన సైన్యంతో, "ఆహార కొరత ఏర్పడింది. చలి తీవ్రంగా ఉంది, దానికితోడు యూదులు కూడా తమ సహాయాన్ని ఉపసంహరించుకున్నారు. ఇక ఇక్కణ్ణుంచి తిరిగి వెళ్ళిపోవడమే అన్ని విధాలా మంచిది" అంటూ సైన్యాన్ని వెనక్కి మరల్చాడు.[2] గిత్‌ఫాన్ తెగవారు కూడా ఖురైషుల వెంట బయలుదేరారు. బనూఖురైజా వాళ్ళు ముట్టడిని ఆపి తమ కోటల్లోకి వెళ్ళి దాక్కున్నారు. ఆ సైన్యాల మూలంగా చెలరేగిన దుమ్ముతో మదీనా నగర దిశలు ఇరవై రోజులదాకా మసకమసకగానే ఉన్నాయి.

"అల్లాహ్ అవిశ్వాసులను వెనక్కి తరిమాడు; వారు ఏ లాభాన్నీ పొందకుండానే, కడుపు మంటతో మరలిపోయారు. విశ్వాసుల పక్షాన యుద్ధం చేయటానికి అల్లాహ్ (ఒక్కడే) సరిపోయాడు." (ముస్లింలు యుద్ధం చేయాల్సిన పరిస్థితే ఏర్పడలేదు). (అల్ అహ్‌జాబ్)

---

1) సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 129వ పుట.
2) సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 232వ పుట.

www.abulhasanalinadwi.org

ఈ యుద్ధంలో ముస్లిం సైన్యానికి ప్రాణనష్టం చాలా తక్కువగానే జరిగింది.కాని ఈ యుద్ధంలోనే ఔస్ తెగనాయకులు, అన్సార్లకు కుడిభుజంలా ఉండే హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ తిరిగి కోలుకోలేని విధంగా క్షతగాత్రులయ్యారు. ఈయన క్షతగాత్రులైన సంఘటన నుండి నేర్చుకోదగిన గుణపాఠం చాలా ఉంది.

## కన్నతల్లి తన తనయుణ్ణి యుద్ధానికి వెళ్ళమని ప్రేరేపించింది

హజ్రత్ ఆయిషా (రజి. అన్హా) ఉన్న కోటలోనే సాద్‌బిన్ ముఆజ్ (రజి) తల్లి కూడా ఉన్నది. ఒకరోజు హజ్రత్ ఆయిషా కోటనుండి బయటికి వచ్చి పచార్లు చేస్తుండగా వెనుక నుండి ఎవరో వస్తున్నట్లు ఆమెకు శబ్దం వినపడింది. వెనక్కి తిరిగి చూస్తే హజ్రత్ సాద్ కనిపించారు. ఆయన చేతిలో ఆయుధం ఉంది. వడివడిగా అడుగులు ముందుకు వేస్తూ ఈ పద్యం చదువుతూ యుద్ధభూమి వైపుకు పరుగెడుతున్నారు.

"క్షణం ఆగితే శత్రుసైన్యంలో ఇంకొకడు వచ్చి చేరవచ్చు

మరణం అనన్నమయినప్పుడు ఇక మరణం పట్ల భయమెందుకు?'

ఆయన గొంతు విని ఆయన తల్లి లోపల్నుంచి, "త్వరగా వెళ్ళు నాయనా! ఇప్పటికే చాలా ఆలస్యమయింది" అని అన్నది. సాద్ తొడుక్కున్న కవచం చాలా చిన్నదవటంతో ఆయన చేతులు కూడా బయటికి కనిపించేవి. అది చూసి హజ్రత్ ఆయిషా సాద్ తల్లితో, "సాద్ తొడుక్కున్న కవచం ఇంకాస్త పొడువుగా ఉంటే బావుండేది" అన్నారు.

ఆయన యుద్ధభూమిలో శత్రువులతో పోరాడుతున్నప్పుడు ఇబ్నుల్ అరఖా అనేవాడు గురిచూసి ఆయన చేతులమీద బాణం విసిరాడు. దాంతో ఆయన మణికట్టు నరం తెగిపోయింది.[1] యుద్ధం ముగిసిన తరువాత దైవప్రవక్త (సల్లం) మస్జిదె నబవీ ప్రాంగణంలో ఆయనకోసం ఒక గుడారాన్ని నిర్మించి ప్రజలు ఆయన్ని పరామర్శించే ఏర్పాట్లు చేశారు. ఈ యుద్ధంలో రుఫైదా అనే మహిళ కూడా పాల్గొన్నది. ఆమె దగ్గర మందులు, మూలికలు ఉండేవి. వాటి సాయంతో ఆమె యుద్ధంలో

1) సహీహ్ బుఖారీ: వివరాలు సీరత్ ఇబ్నెహిషామ్ రెండో సంపుటి 226, 227 పుటలు, దలాయిలున్నుబువ్వా గ్రంథం మూడో సంపుటి 440, 441 పుటల్లో ఉన్నాయి.

www.abulhasanalinadwi.org

క్షతగాత్రులైన ముస్లింల గాయాలకు కట్లుకట్టేది. సాద్‌బిన్ ముఆజ్ చికిత్సకోసం ఆమెనే నియమించటం జరిగింది. దైవప్రవక్త (సల్లం) తన స్వహస్తాలతో ఆయన గాయానికి వాతపెట్టారు. కాని గాయం మానలేదు సరికదా విపరీతమైన వాపు వచ్చింది. దైవప్రవక్త (సల్లం) కొన్ని రోజుల తరువాత మళ్లీ వాతపెట్టారు. అయినా లాభం లేకపోయింది. ఆ తరువాత చాలా రోజులకు బనూఖురైజా తెగ నాశనమయిపోయిన తరువాత ఆ గాయం తగ్గింది కాని ఆయన మాత్రం పరమపదించారు.[1]

## జాతుర్రిఖా యుద్ధం

కందక యుద్ధం ముగిసిన తరువాత దైవప్రవక్త (సల్లం) నాలుగొందల మంది అనుచరుల్ని వెంటబెట్టుకొని గిత్‌ఫాన్ తెగవారితో యుద్ధం చేయటానికి నజద్ వైపు ప్రయాణమయ్యారు. ఈ యుద్ధం వేసవి కాలంలో జరిగింది. అనుచరుల కాళ్ళకు చెప్పులు కూడా లేవు. బోసి కాళ్ళతో నడవటం మూలంగా బొబ్బలు వచ్చి కాళ్లు విపరీతంగా నొప్పి పెట్టసాగాయి. అప్పుడు ముస్లింలు ఆ బాధను భరించలేక కాళ్ళకు గుడ్డలు చింపి చుట్టుకున్నారు. అందుకే ఈ యుద్ధాన్ని 'జాతుర్రిఖా' (చింపిరిగుడ్డల యుద్ధం) అని పిలిచారు.[2]

జాతుర్రిఖా యుద్ధం తరువాత జరిగిన సంఘటన-అబ్బాద్ బిన్ బిష్ర్, అమ్మార్ బిన్ యాసిర్ అనే ఇద్దరు సహచరులు ఒకచోట కాపలా కాయటానికి నియమితులయ్యారు. అబ్బాద్ నిలబడి నమాజ్ చేస్తుండగా అమ్మార్ పడుకొని ఉన్నారు. అప్పుడే ఒక శత్రువు అక్కడికి వచ్చి అబ్బాద్‌పైకి బాణం విసిరాడు. అది ఆయన శరీరంలో గ్రుచ్చుకుంది. ఆయన ఆ బాణాన్ని చేత్తో తీసిపారేసి నమాజును కొనసాగించారు. ఒకటి తరువాత ఒకటి ఆయన శరీరానికి మూడు బాణాలు గ్రుచ్చుకున్నాయి. అయినాసరే ఆయన నమాజ్ వదలిపెట్టలేదు. సలాంతో నమాజ్ ముగించుకున్నాక మిత్రుణ్ణి లేపారు. ఆయన మిత్రుడు ఆయన శరీరానికి గాయాలుండటం చూసి, "శత్రువు వచ్చినప్పుడు మీరు నన్ను ఎందుకు

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం

www.abulhasanalinadwi.org

లేపలేదు?" అన్నారు. దానికి సమాధానమిస్తూ, "నేనప్పుడు నమాజులో ఒక సూరా చదువుతున్నాను. దాన్ని అసంపూర్తిగా వదలి వెళ్ళబుద్ధికాలేదు' ' అన్నారు హజ్రత్ అబ్బాద్ బిన్ బిష్ర్ (రజి).[1]

## బనూ ఖురైజా యుద్ధం

దైవప్రవక్త (సల్లం) మదీనాలో స్థిరపడినప్పుడే అక్కడ ఉన్న యూదులతో శాంతి ఒప్పందం కుదుర్చుకున్నారు. వారి ధనమానప్రాణాలకుగాని, వారి మతస్వేచ్ఛకుగాని ఎలాంటి భంగం వాటిల్లదని హామీనిచ్చారు. కాని ఆ తరువాత కాలంలో ఖురైషులు వారికి ధనం ఎరజూపెడుతూ, భయపెట్టిస్తూ ఉత్తరం రాయగానే వారు ముస్లింలకు వ్యతిరేకంగా తిరుగుబాటు లేవనెత్తారు. అయినప్పటికీ దైవప్రవక్త (సల్లం) యూదులతో సత్సంబంధాలు పెట్టుకోవాలన్న ఉద్దేశ్యంతో ఒప్పంద పునర్నిర్మాణ కార్యక్రమానికి పూనుకున్నారు. కాని బనూ నజీర్ తెగ యూదులు దానికి నిరాకరించి మదీనా నుండి బహిష్కృలతులయ్యారు. బనూ ఖురైజా తెగవారు మాత్రం ముస్లింలతో తిరిగి శాంతి ఒప్పందం చేసుకున్నారు. ఈ విషయమే సహీహ్ ముస్లిం గ్రంథం లో క్లుప్తంగా ఈ విధంగా వివరించబడింది.[2]

> "హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం: బనూ నజీర్, బనూ ఖురైజా తెగల యూదులు దైవప్రవక్త (సల్లం)కు వ్యతిరేకంగా యుద్ధం చేశారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) బనూ నజీర్ తెగవారిని (మదీనా నుండి) బహిష్కరించారు. బనూ ఖురైజా తెగవారిని మాత్రం (మదీనాలోనే) ఉండనిచ్చి ఉపకారం చేశారు.[3]

బనూ నజీర్ మదీనా నుండి బహిష్కరించబడిన తరువాత ఆ తెగనాయకులైన హుయయ్ బిన్ అఖ్తబ్, అబూ రాఫె, సలాం బిన్ అబుల్ హుఖైఖ్ ఖైబర్ వెళ్ళి స్థిరపడ్డారు. అక్కడ తమ ఆధిపత్యాన్ని సుస్థిరం

1) ముస్నదె అహ్మద్ మూడో సంపుటి 344వ పుట. సుననె అబూదావూద్‌లోని శుచీశుభ్రతల ప్రకరణం.
2) సీరతున్నబీ మొదటి సంపుటి 433వ పుట.
3) సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం

www.abulhasanalinadwi.org

చేసుకోవటానికి ప్రయత్నాలు కొనసాగించారు. కందక యుద్ధం వీరి ప్రయత్నాల ఫలితమే. వాళ్ళు ముస్లింలకు వ్యతిరేకంగా అరబ్బు తెగల నాయకులందరికీ నూరిపోశారు. మొత్తం దేశాన్నే ముస్లింలపైకి ఉసిగొల్పారు. ఫలితంగా యూదులు, అరబ్బు తెగలవారందరూ ఖురైషులతో కలసి మదీనాపైకి దండెత్తి వచ్చారు. అప్పటి వరకు బనూఖురైజా తెగవారు మాత్రం ముస్లింలతో తాము చేసుకున్న శాంతి ఒప్పందానికి బద్ధులైఉన్నారు. కాని హుయ్ బిన్ అఖ్‌తబ్ వారిని మభ్యపెట్టి ఒప్పందాన్ని భగ్నం చేయించాడు. ఒకవేళ ఖురైషులు మధ్యలో తమ సహాయాన్ని ఉపసంహరించుకున్నా తాను మాత్రం ఖైబర్‌ను వదలిపెట్టి బనూ ఖురైజావారితో ఉంటానని ప్రమాణం చేశాడు. ఆ తరువాత తను అన్న మాటను నిలబెట్టుకున్నాడు కూడా.

బనూ ఖురైజా తెగవారు తమ ఒప్పందాన్ని భగ్నంచేసి కందక యుద్ధంలో బహిరంగంగానే పాల్గొన్నారు. చివరికి అరబ్బు తెగలన్నీ ఓడిపోయి పలాయనం చిత్తగించగానే ఇస్లాంకు బద్ధవిరోధి అయిన హుయ్ బిన్ అఖ్‌తబ్‌ను తమ వెంట తెచ్చుకున్నారు.[1] ఇక ముస్లింలకు బనూ ఖురైజా పై చర్య గైనక తప్పలేదు. దైవప్రవక్త (సల్లం) కందక యుద్ధం తరువాత ముస్లింలెవరూ ఆయుధాలు దించకుండా బనూ ఖురైజా ప్రాంతంవైపు వెళ్ళాలని ఆదేశించారు.[2] ఖురైజా తెగవారు పొరపాటు వల్ల ఆ పని చేసి ఉంటే దైవప్రవక్త (సల్లం) వారికి ఏదో విధంగా బుద్ధిచెప్పి సమస్యను అంతటితో పరిష్కరించి ఉండేవారు. కాని వారు తిరుగుబాటు ధోరణిని అనుసరించి యుద్ధానికి సిద్ధం కావటంతో తప్పనిసరి పరిస్థితుల్లో వారితో యుద్ధానికి దిగవలసి వచ్చింది. ముస్లిం సైన్యాలు ఖైబర్ చేరుకున్నాయి. హజ్రత్ అలీ వారి కోటల దగ్గరికి వెళ్ళగానే వారు బాహాటంగానే దైవప్రవక్త (సల్లం)ను దూషించటం మొదలుపెట్టారు. ముస్లింలు వారి కోటల్ని ముట్టడించారు. ఈ ముట్టడింపు సుమారు ఒక నెల రోజులపాటు కొనసాగింది. చివరికి వారు

---

1) సీరతున్నబీ మొదటి సంపుటి 434 వ పుట. సీరత్ ఇబ్నెహిషామ్ సౌజన్యంతో
2) సహీహ్ బుఖారీ యుద్ధాల ప్రకరణం.
3) సహీహ్ బుఖారీ యుద్ధాల ప్రకరణం

www.abulhasanalinadwi.org

హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ మధ్యవర్తిగా ఉండి తీర్పు ఇస్తే తాము ఆయన తీర్పుని శిరసావహిస్తామన్నారు.

హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) ఔస్ తెగవారు. ఈ తెగ ఖురైజా తెగకు రక్షణకర్తగా ఉండేది. ఇరుతెగల మధ్య మైత్రీ సంబంధాలుండేవి. అరబ్బు దేశంలో ఆ కాలంలో ఇటువంటి సంబంధాలు రక్తసంబంధాల కన్నా గొప్పవిగా భావించబడేవి. అంచేత దైవప్రవక్త (సల్లం) వారి విన్నపాన్ని అంగీకరించారు.[3]

ఏదయినా విషయానికి సంబంధించి స్పష్టమైన దైవాజ్ఞ అవతరించనంతవరకు దైవప్రవక్త (సల్లం) తౌరాత్ గ్రంథం ఆదేశాలనే అనుసరించేవారు. ఖిబ్లా, నమాజ్, శిలాశిక్ష, ప్రతీకార హత్యలు మొదలగు విషయాల్లో నూతన దైవాజ్ఞలు అవతరించక మునుపు ఆయన తౌరాత్ గ్రంథాన్నే అనుసరించేవారు., హజ్రత్ సాద్ ఖురైజా తెగవారిలో యుద్ధం చేయగల శక్తి ఉన్నవారిని వధించాలని, స్త్రీలను పిల్లల్ని బందీలుగా చేసి వారి సిరిసంపదలను యుద్ధప్రాప్తిగా భావించాలని తీర్పునిచ్చారు.[1] ఆయన ఇచ్చిన ఈ తీర్పు కూడా యూదుల మతగ్రంథమైన తౌరాత్ ఆదేశాలకు అనుగుణమైనదే. తౌరాత్ గ్రంథంలో ఒకచోట ఇలా ఉంది.

> "నువ్వు ఏ నగరంపైనయినా దండెత్తినప్పుడు ముందుగా వారితో సంధి చేసుకోవటానికి వారికి సందేశమివ్వు. ఒకవేళ వారు దానికి ఒప్పుకొని నీకోసం ద్వారాలు తెరిచి ఉంచితే ఆ నగరంలో ఉన్నవాళ్ళందరూ నీకు బానిసలయిపోతారు. కాని వారు గనక సంధికి అంగీకరించకపోతే నువ్వు వారిని ముట్టడించు. దేవుడు నీకు వారిపై ఆధిపత్యాన్ని ప్రసాదిస్తే అప్పుడు నువ్వు ఆ నగరంలో ఉన్న పురుషులందరినీ వధించు. ఇక మిగిలిన స్త్రీలు, ప్లిలలు, పశువులు, ఇతర వస్తువులన్నీ నీ కొరకు విజయప్రాప్తిగా పరిగణించ బడతాయి.[2]

---

1) సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం.

2) షిబ్లీ నూమానీగారి సీరతున్నబీ గ్రంథం మొదటి సంపుటి 435వ పుట. తౌరాత్ గ్రంథ సౌజన్యంతో.

www.abulhasanalinadwi.org

హజ్రత్ సాద్ (రజి) పై విధంగా తీర్పుఇచ్చినప్పుడు ఆయన దైవిక తీర్పు ఇచ్చారని దైవ ప్రవక్త (సల్లం) ప్రశంసించారు.[1] ఆ ప్రశంసాత్మక పలుకులు ఆ తౌరాత్ గ్రంథ ఆదేశాన్నే సూచిస్తున్నాయి. యూదులకు ఈ తీర్పు గురించి తెలిసినప్పుడు వారి నోటి నుండి వెలువడ్డ పలుకులు కూడా అది దైవిక నిర్ణయమేనన్న విషయాన్ని సమర్థించాయి.

అసలు ఈ కల్లోలాలన్నిటికీ సూత్రధారి అయిన హుయ్ బిన్ అఖ్తబ్‌ను శిక్షాస్థలిలో నించోబెట్టినప్పుడు అతను ఒకసారి దైవప్రవక్త (సల్లం) వైపు చూసి ఇలా అన్నాడు:

"దైవసాక్షి! నేను నీతో శత్రుత్వానికి పూనుకున్నందుకు బాధపడటం లేదు. వాస్తవం ఏమిటంటే దేవుణ్ణి వదలిపెట్టినవాణ్ణి దేవుడు కూడా వదలిపెడతాడు."

- ఆ తరువాత ప్రజలవైపు తిరిగి,

"ప్రజలారా! దైవాజ్ఞను అమలుపరచటంలో ఎలాంటి మీమాంసకు ఆస్కారం లేదు. ఇది ముందుగానే వ్రాసిపెట్టబడిన ఒక దైవాజ్ఞ. ఇస్రాయీల్ జాతివారిపై విధించబడిన ఒక శిక్ష.[2]

ఇక్కడ హుయ్‌బిన్ అఖతబ్ అన్న మాటలు గమనార్హమైనవి. వాస్తవం ఏమిటంటే అతను మదీనా నుండి బహిష్కృతుడై ఖైబర్ వెళుతున్నప్పుడు తాను ఇంకెప్పుడూ ముహమ్మద్ (సల్లం)కు వ్యతిరేకంగా ఇతరులకు సహాయం చెయ్యనని దైవసాక్షిగా ప్రమాణం చేసుకున్నాడు. కాని తానన్న మాటను నిలబెట్టుకోలేకపోయాడు. కందక యుద్ధంలో శత్రుసైన్యాలతో చేతులు కలిపి మదీనాపైకి దండెత్తి వచ్చాడు.

## నజద్ యుద్ధం-సుమామా (రజి) ఇస్లాం స్వీకరణ

దైవప్రవక్త (సల్లం) కొంతమంది రౌతుల్ని నజద్ ప్రాంతం వైపుకు పంపారు. వారు అక్కడికి వెళ్ళి తిరిగొచ్చినప్పుడు సుమామా బిన్ అసాల్‌ను బంధించి తీసుకొచ్చారు. ముస్లింలు అతన్ని మస్జిదె నబవీలోని ఒక స్తంభానికి కట్టేశారు. దైవప్రవక్త (సల్లం) అక్కడికి వచ్చి సుమామా క్షేమం గురించి అడిగారు. దానికి సుమామా స్వయంగా సమాధానమిస్తూ...-

1) సహీహ్ బుఖారీ, యుద్ధాల ప్రకరణం.
1) సీరత్ ఇబ్నె హిషామ్ రెండవ సంపుటి 241వ పుట.

www.abulhasanalinadwi.org

'ముహమ్మద్! నేను క్షేమంగానే ఉన్నాను. మీరు నన్ను వధించమని ఆజ్ఞాపిస్తే ఒక హంతకునికి శిక్ష విధించినట్లవుతుంది. కాని ఒకవేళ నాపై దయదలిస్తే మేలు ఎన్నటికీ మరువని వ్యక్తిపై దయదలచినట్లు భావించండి. మీకు ధనం అవసరమనుకుంటే ఎంత కావాలో చెప్పండి' అని విన్న వించుకున్నాడు.

మరునాడు దైవప్రవక్త (సల్లం) సుమామాకు అదే ప్రశ్న వేశారు. దానికతను, 'నేను ముందే చెప్పేశాను. మీరు నాపై దయదలిస్తే మీ మేలు ఎన్నటికీ మరువలేని వ్యక్తిపై దయదలుస్తున్నారని తెలుసుకోండి' అన్నాడు.

మూడోరోజు కూడా దైవపవక్త (సల్లం) మళ్ళీ అదే మాట అడిగారు. ఈసారి కూడా అతను, "నేను చెప్పదలచుకున్నదల్లా చెప్పేశాను. ఇక మీ యిష్టం" అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) సుమామాను విడిచిపెట్టమని ఆదేశించారు. సుమామా ఖైదు నుండి విడుదలై మస్జిదె నబవీకి దగ్గరలో ఉన్న ఒక ఖర్జూర తోటలోకి వెళ్ళారు. అక్కడ స్నానం చేసి మళ్ళీ మస్జిదె నబవీకి తిరిగి వచ్చారు. మస్జిద్‌లోకి అడుగుపెట్టగానే ఇస్లాం స్వీకార వచనాలను పఠించారు.

ఆ సందర్భంగా హజ్రత్ సుమామా దైవప్రవక్త (సల్లం)ను కొనియాడుతూ అన్న మాటలివి.

"దైవప్రవక్తా! దేవుని సాక్షిగా చెబుతున్నాను. ఒకప్పుడు నేను మిమ్మల్ని ప్రపంచంలో అందరికన్నా ఎక్కువగా ద్వేషించేవాణ్ణి. కాని ఇప్పుడు ప్రపంచంలో అందరికన్నా ఎక్కువ అభిమానపాత్రులు నాకు మీరేననిపిస్తున్నారు."

"దైవసాక్షి! ఒకప్పుడు మీ నగరం పేరు వింటేనే నాకు మండిపోయేది. కాని ఈ రోజు నా దృష్టిలో మీ నగరం కన్నా ప్రియమైన పుణ్యక్షేత్రం మరొకటి లేదు. ఒకప్పుడు మీ ధర్మంపట్ల నాకు విపరీతమైన వైరభావం ఉండేది. కాని ఈ రోజు మీ ధర్మమే నాకు అత్యంత ప్రీతికరమైన ధర్మంగా మారిపోయింది". సుమామా ఇంకా చెప్పుకుంటూ పోతున్నారు.

"దైవప్రవక్తా! నేను మా దేశం నుండి ఉమ్రా యాత్ర చేసే ఉద్దేశంతో మక్కాకు బయలుదేరాను. మార్గమధ్యంలో మీ అనుచరులు నన్ను బంధించి ఇక్కడికి తీసుకొని వచ్చారు. ఇప్పుడు నేను ఇస్లాం స్వీకరించాను. మరి ఉమ్రా చేయాలా వద్దా!" అని అడిగారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆయన ఇస్లాం స్వీకరణను అభినందిస్తూ ఉమ్రా

www.abulhasanalinadwi.org

యాత్ర చేయటానికి అనుమతి నిచ్చారు.

హజ్రత్ సుమామా మక్కా చేరుకోగానే ఒకతను ఆయన్ని పట్టుకొని "నువ్వు సాబీ అయిపోయావా?" అని అడిగాడు. సుమామా అతనికి పుల్లవిరుపు సమాధానమిచ్చారు.

> "లేదు, నేను దైవప్రవక్త అయిన ముహమ్మద్‌ను విశ్వసించాను. ఇస్లాం ధర్మాన్ని స్వీకరించాను. ఇక మీ మక్కావాసులు ఒక విషయం బాగా గుర్తుంచుకోండి. ముహమ్మద్ (సల్లం) అనుమతి లేనిదే ఇక మీదట మీకు యమామా దేశం నుండి ఒక్క గోధుమ గింజయినా సరఫరా అవదు."[1] సుమామా సమాధానం విని ఆ వ్యక్తి కొయ్యబారి పోయాడు.

సుమామా తనదేశం వెళ్ళగానే మక్కాకు సరఫరా అయ్యే ధాన్యాన్ని నిలిపివేశారు. ధాన్యం సరఫరా ఆగిపోవడంతో మక్కావాసులు కలవరపడ్డారు. చివరికి దైవప్రవక్త (సల్లం)కు అప్పీలు చేసుకోవాల్సి వచ్చింది. అప్పుడు దైవప్రవక్త (సల్లం) సుమామాకు లేఖ వ్రాసి మక్కావాసులకు మునుపటిలాగే ధాన్యం సరఫరా చేస్తుండాలని ఆదేశించారు.[2] మరి చూడబోతే మక్కా అవిశ్వాసులు దైవప్రవక్త (సల్లం)ను పట్టుకొని పచ్చి నెత్తురు తాగాలని ఎదురుచూస్తున్న రోజులవి. ఈ సంఘటన ద్వారా తన్ను తాను శిక్షార్హునిగా భావిస్తున్న ఓ హంతకునికి దైవప్రవక్త (సల్లం) క్షమాభిక్ష పెట్టడంలోని ఆంతర్యం ఏమిటో అర్థమవుతోంది! దైవప్రవక్త (సల్లం)లోని సదాచార సంపన్నతను చూసి ప్రజలు ఎంతగా ప్రభావితులయ్యే వారో అవగతమవుతోంది!! ఇస్లాం పట్ల, ముస్లింల నగరం పట్ల, దైవప్రవక్త పట్ల విపరీతమైన వైరభావం కలిగివున్న వ్యక్తి మూడ్రోజుల్లోనే సంతోషంగా ఇస్లాం స్వీకరించి ముస్లిం అయిపోయాడు. మక్కా అవిశ్వాసులు దైవప్రవక్త (సల్లం)ను వెలివేశారు. బద్ర్, ఉహుద్, ఖందఖ్, ఆ తరువాత కూడా అనేక యుద్ధాల్లో దైవప్రవక్త(స)ను, ముస్లింలను నామరూపాల్లేకుండా తుడిచిపెట్టటానికి విశ్వప్రయత్నాలు చేశారు. అలాంటి శత్రువుల విషయంలో కూడా దైవప్రవక్త (సల్లం) ఎంతో ఉదారంగా వ్యవహరించారు. వారికి ధాన్యం సరఫరాను నిలిపివేయటాన్ని గర్హించారు. ఈ సంఘటన ఆయన ఉత్తమ నైతికతకు, అసామాన్య ఔదార్యానికి ప్రబల నిదర్శనం.

---

1) సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం.
2) బైహఖీ గారి దలాయిలున్నుబువ్వా గ్రంథం నాల్గో సంపుటి 80వ పుట.

www.abulhasanalinadwi.org

# హుదైబియా ఒప్పందం

హి.శ. ఆరవయేట ఒకరోజు దైవప్రవక్త (సల్లం) తనకు వచ్చిన కల గురించి అనుచరులకు వివరించారు. ఆ కలలో తాను ముస్లింలతో పాటు మక్కా వెళ్లి అక్కడ కాబా గృహం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నామని చెప్పారు. ఆ కల గురించి వినగానే మక్కా వాసులైన ముస్లింలలో దేశభక్తి పొంగిపార్లింది. వారి కళ్ళల్లో కాబా చుట్టూ ప్రదక్షిణ చేసే భక్తిపారవశ్యపు మధురస్మృతులు మెదిలాయి. అంచేత వాళ్ళు ఆ సంవత్సరమే కాబాయాత్ర కోసం వెళ్ళాలని దైవప్రవక్త (సల్లం)ను పట్టుబట్టారు.[1]

ముహాజిర్లతో పాటు అన్సార్లలో కూడా చాలామందికి కాబా గృహ ప్రదక్షిణ చేసే భాగ్యానికి నోచుకోవాలన్న ప్రగాఢ కాంక్ష ఉండేది. ఈ ప్రయాణంలో దైవప్రవక్త (సల్లం) వెంట పద్నాలుగు వందల మంది అనుచరులు బయలుదేరారు. జుల్ హులైఫా ప్రాంతం చేరుకున్నాక ఖుర్బానీ సన్నాహాలు మొదలయ్యాయి. ఖుర్బానీ ఒంటెల్ని తోడుతీసు కెళ్ళటం, అవి ఖుర్బానీ జంతువులన్న దానికి గుర్తుగా వాటి మెడల్లో చెప్పుల దండలు వ్రేలాడదీయటం మొదలగు ఆచారాలన్నీ పూర్తయ్యాయి.[2]

ఖురైషుల పథకాల గురించి సమాచారం తెలుసుకోవటానికి ముందు జాగ్రత్తగా ముస్లింలు ఖుజాఆ తెగకు చెందిన ఒక ముస్లిం వ్యక్తిని మక్కాకు పంపించారు. అయితే అతను ముస్లిం అయిపోయాడన్న సంగతి మక్కా అవిశ్వాసులకు తెలియదు. యాత్రికుల బృందం ఉస్ఫాన్ ప్రాంతానికి చేరుకుంటున్నప్పుడు ఖుజాఆ వ్యక్తి వచ్చి ఖురైషులు తెగల నాయకులందరినీ ఒకచోట సమావేశపరచి ముహమ్మద్ (సల్లం)ను

---

1) సీరత్ హుల్‌బియా రెండో సంపుటి 688వ పుట.
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

మక్కాలోకి రానీయకుండా చెయ్యాలని కుట్రలు పనుతున్నారని తెలియజేశాడు.[1]

ఖురైషులు ముస్లింలను ఎదుర్కోవటానికి యుద్ధప్రాతిపదికన సన్నాహాలు మొదలెట్టారు. తమతో చేతులు కలిపిన తెగలవారందరికీ సైన్యాలను వెంటబెట్టుకొని తమ దగ్గరికి రావాలని కంబురంపారు. మక్కా వెలుపల బల్‌దహ్ అనే ప్రాంతంలో సైన్యాలను మోహరించారు. ఖాలిద్ బిన్ వలీద్ (ఆయన అప్పటికింకా ఇస్లాం స్వీకరించలేదు) రెండొందల మంది రౌతుల్ని వెంటబెట్టుకొని సైన్యానికి సారథ్యం వహిస్తూ ముందుకు నడిచారు. ఆ రెండొందల మంది రౌతుల్లో అబూజహల్ కొడుకు ఇక్రిమా కూడా ఉన్నాడు. ఖాలిద్ బిన్ వలీద్ సారథ్యంలో ఆ రౌతు దళం గుమైమ్ ప్రాంతానికి చేరుకుంది.[2]

దైవప్రవక్త (సల్లం)కు ఈ విషయం తెలిసింది. ఆయన తన అనుచరులతో, "ఖురైషులు ఖాలిద్ బిన్ వలీద్ ను గూఢచారిగా నియమించి పంపారు. అతను గుమైమ్ దాకా వచ్చాడు. అందుకని మనం అతనికి కనపడకుండా కుడిప్రక్కగుండా వెళ్ళాలి" అన్నారు.

ముస్లింలు గుమైమ్ పొలిమేరలు దాటివెళుతుండగా ఖాలిద్ బిన్ వలీద్‌కు అటువైపు గుర్రాలవల్ల దుమ్మురేగుతూ కనిపించింది. అప్పుడాయన తన గుర్రంపై వాయువేగంతో మక్కావెళ్ళి ముస్లింల సైన్యం గుమైమ్ దాకా వచ్చేసిందని తెలియజేశారు.

దైవప్రవక్త (సల్లం) ఇంకాస్త ముందుకు వెళ్ళి హుదైబియా అనే ప్రాంతంలో ఆగారు. కాని ఆ ప్రాంతంలో నీళ్ళకొరత ఉండేది. దగ్గర్లో ఓ బావి కనిపిస్తే అందులోని నీళ్ళు ఉపయోగించు కోవచ్చనుకున్నారు. కాని ఒక్కసారికే ఆ బావిలోనినీళ్ళు కూడా అయిపోయాయి. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) మహిమతో ఆ బావి మళ్ళీ నిండిపోయింది. ముస్లింలు పుష్కలంగా ఆ నీటిని ఉపయోగించుకున్నారు.[3]

ఖుజాఅ తెగవారు అప్పటివరకు ఇంకా ఇస్లాం స్వీకరించలేదు.కాని

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.
2) సీరతున్నబీ మొదటి సంపుటి 449వ పుట.
3) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

రహస్యంగా ఇస్లాంకు సహాయ సహకారాలు అందించేవారు. ఖురైషులు, అవిశ్వాసులు ఇస్లాంకు వ్యతిరేకంగా వేసే పథకాల గురించి దైవప్రవక్త (సల్లం)కు తెలియపరిచేవారు. బుదైల్ బిన్ వరఖా ఈ తెగకు నాయకుడు. దైవప్రవక్త (సల్లం) రాక గురించి తెలియగానే ఆయన కొంతమందితో కలసి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళి, 'ఖురైషుల సైనిక వాహిని ఇటువైపే వస్తోంది. వాళ్ళు మిమ్మల్ని కాబా గృహం దగ్గరికి వెళ్ళనివ్వరు' అని చెప్పారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆయనతో ఇలా అన్నారు:

"మీరెళ్ళి ఖురైషులతో చెప్పండి. మేము యుద్ధం చేసే ఉద్దేశ్యంతో రాలేదు. ఉమ్రా యాత్ర కోసం వచ్చాం. ఇంతకుముందు జరిగిన యుద్ధాల్లో ఖురైషులు దారుణంగా దెబ్బతిని ఉన్నారు. వారికి ఆ యుద్ధాల్లో చాలా నష్టం కలిగింది. కనుక వారు ఓ నిర్ణీత కాలంపాటు మాతో శాంతి ఒప్పందం చేసుకొని మమ్మల్ని మా మానాన వదిలేయటం మంచిది. దైవసాక్షిగా చెబుతున్నాను. వారు దీనికి కూడా ఒప్పుకోకపోతే నా శిరస్సు ఖండించబడే వరకు నేను వారితో పోరాడుతూనే ఉంటాను. ఆఖరికి దేవుడే మన మధ్య ఏదో ఒక తీర్పు చేయాలి".

బుదైల్ ఖురైషుల దగ్గరికి వెళ్ళి, "నేను ముహమ్మద్ దగ్గర్నుండి చాలా ముఖ్య సందేశం తీసుకొని వచ్చాను. అనుమతి ఇస్తే తెలియపరుద్దామనుకుంటున్నాను" అన్నారు. ముహమ్మద్ (స) సందేశమనగానే కొంతమంది తుంటరులు కస్సుబుస్సుమన్నారు. కాని సౌమ్యులైన అవిశ్వాసులు మాత్రం ఆయనకు చెప్పటానికి అనుమతినిచ్చారు. అప్పుడు బుదైల్ వారికి దైవప్రవక్త (సల్లం) చేసిన ప్రతిపాదనలు వినిపించారు. ఆ ప్రతిపాదనలు విని ఉర్వా బిన్ మస్వూద్ సఖఫీ లేచి నిలబడి.

"ఖురైషులారా నేను మీ తండ్రిలాంటి వాణ్ణి. మీరంతా నా పిల్లలతో సమానం. ఔనా? అన్నాడు.

ఖురైషులందరూ ఒక్కసారిగా ఔనన్నట్టు తలలూపారు.

"మీకు నా గురించి దురభిప్రాయమయితే లేదు కదా?" -ఉర్వా మళ్ళీ అడిగాడు.

www.abulhasanalinadwi.org

"లేదు"- అందరూ ముక్త కంఠంతో సమాధానమిచ్చారు.

"మరయితే నాకు అనుమతి ఇవ్వండి. నేను స్వయంగా వెళ్ళి ముహమ్మద్‌తో మాట్లాడి వస్తాను. అతను చేసిన ప్రతిపాదనలు సముచితంగానే ఉన్నాయి" అని చెప్పి ఖురైషుల అనుమతి తీసుకొని ఉర్వా దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళాడు. ఆయన (సల్లం)కు ఖురైషుల సందేశం వినిపించి,

"ముహమ్మద్! నువ్వు ఖురైషుల్ని సమూలంగా నాశనం చేయాలనుకుంటున్నావా? అసలు తన జాతివారినే నాశనం చేసే మూర్ఖుడు ఇప్పటి వరకు ఈ భూమ్మీద పుట్టాడంటావా? ఇప్పుడు మేము తలచుకుంటే నిన్నూ, నీతోపాటు ఉన్న ఈ కొద్దిమందిని మట్టిలో కలిపేయగలం తెలుసా?" ఉర్వా దైవప్రవక్త (సల్లం)ను గద్దిస్తూ మాట్లాడాడు.

ఉర్వా కూతలు విన్న అబూబక్ర్ (రజి)కు ఆవేశం కట్టలు త్రెంచుకుంది. అతన్ని తిడుతూ, "మేము ముహమ్మద్(స)ను విడిచిపెట్టి పారిపోయే వాళ్ళమనుకున్నావా?" అన్నారాయన.

ఉర్వా చటుక్కున ముఖం త్రిప్పి

"ఎవడు వీడు?" అని అడిగాడు

" అబూ బక్ర్" -దైవప్రవక్తే సమాధానమిచ్చారు.

"నేను ఇతని కరకు మాటలకు ఇక్కడే తగిన విధంగా బుద్ధి చెప్పేవాణ్ణి. కాని ఇతను నాకు ఒకప్పుడు ఉపకారం చేశాడు. నేనిప్పటివరకు దాని బదులు తీర్చుకోలేకపోయాను. అందుకే వదలిపెడుతున్నాను" అన్నాడు ఉర్వా.[1]

ఉర్వా దైవప్రవక్త (సల్లం)తో ఎంతో చనువుగా మాట్లాడసాగాడు. అరబ్బులు మాట్లాడినప్పుడు మాటిమాటికీ ఎదుటివ్యక్తి గడ్డం పట్టుకొని మాట్లాడేవారు. అలాగే ఉర్వా కూడా మాటి మాటికి దైవప్రవక్త (సల్లం) గడ్డం వెంట్రుకలు పట్టుకోసాగాడు. ఆ సమయంలో ఆయన వీపు వెనుక ఆయుధాలు ధరించి నుంచున్న ముగీరా బిన్ షోబాకు ఉర్వా చనువును

1) సహీహ్ బుఖారీలోని షరతుల ప్రకరణం

www.abulhasanalinadwi.org

చూసి ఒళ్ళు మండింది. "కాస్త వెనక్కి జరిగి మాట్లాడు. లేదా నా చెయ్యి లేసిందంటే ఇక వెనక్కి తగ్గేది ఉండదు" -ఆయన ఉర్వాను గద్దించారు.

ఉర్వా ముగీరాను గుర్తుపట్టి, "ఓరి ద్రోహీ! నువ్వా నన్ను గదమాయిస్తూ మాట్లాడుతున్నది. నువ్వు చేసిన ద్రోహానికి నేను ఫలితం అనుభవించాను గుర్తుందా?" -ముగీరా వైపు ఉరిమి చూశాడు. (ముగీరా ఇస్లాం స్వీకరించక ముందు కొంతమందిని హత్య చేస్తే దాని రక్తపరిహారం ఉర్వా చెల్లించాడు).[1]

దైవప్రవక్త (సల్లం) పట్ల ఆయన అనుచరులు ప్రదర్శిస్తున్న నిరుపమాన ప్రేమాభిమానాలను చూసి ఉర్వా ఎంతగానో ప్రభావితుడయ్యాడు. మక్కాకు తిరిగివెళ్ళి ఖురైషులతో ఇలా చెప్పాడు.

"నేను ఖైసర్, కిస్రా, నజాషీ చక్రవర్తుల దర్బారులు చూశాను. కాని ప్రజలు తమ నాయకునిపై ఇంతటి ప్రేమాభిమానాలు కురిపించటం నేనెక్కడా చూడలేదు. ముహమ్మద్ మాట్లాడటం మొదలు పెట్టారంటే నిశ్శబ్దం రాజ్యమేలుతుంది. ఎవరూ ఆయన కళ్ళల్లోకి కళ్ళు పెట్టి చూడడు. ఆయన వుజూ చేసుకున్న నీళ్ళను దోసిళ్ళతో పట్టుకోవటానికి ఆయన అనుచరులు ఎగబడతారు. అభిమానులు ఆయన ఉమ్మిని కూడా క్రిందపడనీయకుండా చేతుల్తో పట్టుకొని మొహానికి, చేతులకు పూసుకుంటున్నారు."[2]

వ్యవహారం అసంపూర్తిగా మిగిలిపోవడంతో దైవప్రవక్త (సల్లం) ఖిరాష్ బిన్ ఉమయ్యాను ఖురైషుల దగ్గరికి పంపించారు. కాని ఖురైషులు ఆయన ఒంటెను చంపేశారు. విశేషమేమిటంటే దైవప్రవక్త (సల్లం) తన ప్రయాణం కోసం ప్రత్యేకంగా ఉపయోగించే ఒంటె అది. ఖురైషులు ఖిరాష్‌ను కూడా చంపబోయారు. కాని ఇతర తెగవాళ్ళు అడ్డుకొని ఆయన్ని రక్షించారు. ఆయన ఎలాగో అక్కణ్ణుంచి తప్పించుకొని పారిపోయి వచ్చారు.[3]

---

1) సహీహ్ బుఖారీ షరతుల ప్రకరణం.
2) " " "
3) సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 314వ పుట. ముస్నదె అహ్మద్ నాల్గో సంపుటి 324వ పుట.

ఆ తరువాత ఖురైషులు ముస్లింలపై దాడిచేసే ఉద్దేశంతో ఒక సైనిక పటాలాన్ని పంపారు. విధివశాత్తూ దాడిచేయటానికి వచ్చి వాళ్ళే స్వయంగా ముస్లింలకు పట్టుబడ్డారు. ఇది ఖురైషులు పాల్పడిన మహా కిరాతక చర్యే అయినా దైవప్రవక్త (సల్లం) విశాల హృదయంతో వారిని క్షమించి వదలిపెట్టేశారు.[1] దివ్యఖురాన్‌లోని ఈ సూక్తి ఆ సంఘటననే సూచిస్తోంది:

> "మక్కా లోయలో వారి చేతులను మీ నుండి మీ చేతులను వారి నుండి ఆపినవాడు ఆయనే. వాస్తవానికి ఆయన మీకు వారిపై ఆధిక్యం ఇచ్చాడు. మీరు చేస్తూ ఉన్నదంతా అల్లాహ్ చూస్తూ ఉండినాడు". (అల్ అహ్‌జాబ్)

## బైతె రిజ్వాన్

దైవప్రవక్త (సల్లం) మక్కాలోని ఖురైషులతో ఒప్పందం గురించి మాట్లాడిరావటానికి హజ్రత్ ఉమర్ (రజి)ను ఎంపిక చేశారు. కాని హజ్రత్ ఉమర్ (రజి) అందుకు సిద్ధం కాలేదు. ఖురైషులు తనకు బద్ధ శత్రువులని, మక్కాలో తనను రక్షించేవాడెవడూ లేడని చెప్పి దైవప్రవక్త (సల్లం) ఆదేశాన్ని సున్నితంగా నిరాకరించారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆ పనికోసం హజ్రత్ ఉస్మాన్ (రజి)ను ఎంపిక చేశారు. ఆయన తన మిత్రుడైన అబాన్ బిన్ సయీద్ సంరక్షణలో మక్కా వెళ్ళారు. అక్కడ ఖురైషులకు దైవప్రవక్త (సల్లం) సందేశం అందజేశారు. కాని ఖురైషులు నమ్మకద్రోహానికి పాల్పడి హజ్రత్ ఉస్మాన్‌ను బంధించి చీకటికొట్టులో పడవేశారు. అంతలో అటు ముస్లింలలో ఉస్మాన్ హత్య చేయబడ్డారన్న వదంతి వ్యాపించింది.[2] దైవప్రవక్త (సల్లం)కు ఈ విషయం తెలియగానే ఆయన 'ఉస్మాన్ హత్యకు ప్రతీకారం తీర్చుకోవటం ముస్లింల కర్తవ్యం' అని ప్రకటించారు. ఆ తరువాత ఆయన ఓ తుమ్మ చెట్టుక్రింద కూర్చొని దానికోసం ప్రాణాలైనా అర్పించటానికి సిద్ధంగా ఉండాలని తన అనుచరుల నుండి ప్రమాణం తీసుకున్నారు. ఆ సమయంలో స్త్రీ పురుష

1) సహీహ బుఖారీలోని షరతుల ప్రకరణం.
2) ముస్నదె అహ్మద్ నాల్గో సంపుటి 324వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 314, 315 పుటలు.

www.abulhasanalinadwi.org

సహచరులందరూ ఎంతో ఉద్రేకంతో తాము ప్రాణ త్యాగానికయినా సిద్ధమేనంటూ దైవప్రవక్త (సల్లం) చేతిపై ప్రమాణం చేశారు. ఇస్లామీయ చరిత్రలో ఈ సంఘటనకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ ప్రమాణాన్ని "బైతుర్రిజ్వాన్" అని అంటారు. దివ్యఖురాన్‌లోని ఫత్‌హ్ సూరాలో ఆ సంఘటనతోపాటు ఆ చెట్టు ప్రస్తావన కూడా ఉంది.

> "ప్రవక్తా! విశ్వాసులు వృక్షం క్రింద నీతో విధేయతా ప్రమాణం చేస్తున్నప్పుడు, అల్లాహ్ వారిని చూసి ఆనందించాడు. వారి హృదయాల స్థితి ఆయనకు తెలుసు. కనుక ఆయన వారిపై శాంతి సంతృప్తులను అవతరింపజేశాడు. వారికి బహుమానంగా సమీపంలోని విజయాన్ని ప్రసాదించాడు." (అల్ ఫత్‌హ్)

ఇదంతా జరిగాక హజ్రత్ ఉస్మాన్ హత్యచేయబడ్డారన్న సంగతి నిజం కాదని తెలిసింది.[1]

## ఒప్పంద వివరాలు

ఖురైషులు దైవప్రవక్త (సల్లం) దగ్గరికి సుహైల్ బిన్ అమ్రన్ను రాయబారిగా పంపారు. సుహైల్ గొప్ప వాక్చాతుర్యం గల మనిషి. అందుకే ప్రజలు ఆయన్ని "ఖురైషుల వక్త" అనే బిరుదుతో గౌరవించేవారు.[2] ముహమ్మద్(స) ఈ యేడు ఉమ్రా చేయకుండా తిరిగి వెళ్ళిపోతేనే తాము ముస్లింలతో ఒప్పందం చేసుకుంటామని ఖురైషులు సుహైల్‌కు చెప్పి పంపించారు.

సుహైల్ దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళి ఆయనతో ఒప్పందానికి సంబంధించిన షరతులను గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఆఖరికి కొన్ని షరతులపై ఇరువురూ ఏకాభిప్రాయానికొచ్చారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) హజ్రత్ అలీని పిలిచి ఒప్పందాన్ని ఒక పత్రంపై వ్రాయమని చెప్పారు. హజ్రత్ అలీ ఒప్పంద పత్రంపై అగ్రభాగాన "బిస్మిల్లాహిర్రహ్మా

---

1) సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 315, 316 పుటలు. సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలలో కూడా సంక్షిప్తంగా దీని ప్రస్తావన ఉంది.

2) జుర్ఖానీ రెండో సంపుటి 223వ పుట.

www.abulhasanalinadwi.org

నిర్రహీం" అని రాశారు. అరబ్బులు ప్రాచీన కాలం నుంచి లేఖలు, ఒప్పంద పత్రాల ఆరంభంలో "బిస్మిక అల్లాహుమ్మ" అని వ్రాసేవారు.

వారికి "బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం" అన్న వాక్యం విచిత్రంగా అనిపించింది. అంచేత సుహైల్ తాము వ్యవహరించే వాక్యమే వ్రాయాలని డిమాండ్ చేశారు. దైవప్రవక్త (సల్లం) అందుకు అంగీకరించారు. ఆ తరువాత "ఇది దైవప్రవక్త ముహమ్మద్ అంగీకరించిన ఒప్పందం" అని వ్రాయించారు. ఆ వాక్యం చూసి సుహైల్ మళ్ళీ అడ్డు తగిలారు.

"మీరు దైవప్రవక్త అన్న సంగతిని మేము అంగీకరిస్తే ఇక ఈ గొడవలన్నీ ఎందుకు? మీరు మీపేరూ, మీ తండ్రిపేరూ వ్రాయండి చాలు" అన్నాడు ఖచ్చితంగా మాట్లాడుతూ.

దైవప్రవక్త (సల్లం) సుహైల్‌ను ఉద్దేశించి, "మీరు తిరస్కరిస్తున్నారు సరే, దైవసాక్షిగా చెబుతున్నాను. నిస్సందేహంగా నేను దైవప్రవక్తను" అన్నారు. ఆ తరువాత హజ్రత్ అలీని కేవలం తన పేరు మాత్రమే వ్రాసి 'దైవప్రవక్త' అనే పదాన్ని చెరిపేయమని ఆదేశించారు. దైవప్రవక్త (సల్లం) పట్ల హజ్రత్ అలీకు ఉన్న వినయవిధేయతల గురించి, ఆయన ఆజ్ఞాపాలన గురించి లోకమంతటికీ తెలుసు.కాని ఆ సమయంలో దైవప్రవక్త ఆజ్ఞను అంగీకరించటం కన్నా తిరస్కరించటమే సముచితం అనిపించిందాయనకు. దైవప్రవక్త పేరును చెరపటానికి ఆయన సుతరామూ ఒప్పుకోలేదు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆ పదం ఎక్కడుందో తనకు చూపించమని కోరారు. హజ్రత్ అలీ వేలు పెట్టి చూపించగా తనే స్వయంగా 'దైవప్రవక్త' అన్న పదాన్ని చెరిపేశారు.

## ఒప్పందంలోని షరతులు

1) ముస్లింలు ఈ సంవత్సరం తిరిగి వెళ్ళిపోవాలి.

2) వచ్చే సంవత్సరం మక్కాకు రావచ్చుగాని మూడ్రోజులుండి వెంటనే తిరిగి వెళ్ళిపోవాలి.

3) ఆయుధాలు ధరించి రాకూడదు. ఒక్క ఖడ్గం మాత్రం వెంట తెచ్చుకోవచ్చు. అది కూడా ఒరలోనే ఉండాలి. ఒరల్ని ఏదైనా సంచిలో పెట్టుకొని రావాలి.

4) ముందునుంచి మక్కాలో ఉంటున్న ముస్లింలను తమ వెంట తీసుకెళ్ళకూడదు. ఇక మదీనా నుంచి వచ్చే ముస్లింలలో ఎవరైనా మక్కాలో ఉండిపోదలచుకుంటే వారిని ఆపకూడదు.

5) మక్కావాసుల్లో ఎవరైనా మదీనాకు వస్తే వారిని వెనక్కి పంపించాలి. కాని అదే ఏ ముస్లిం అయినా మక్కాకు వస్తే అతన్ని మాత్రం త్రిప్పి పంపటం జరగదు.

6) ఇతర తెగలవారు ఈ ఒప్పందం విషయంలో ఇరుపక్షాల్లో ఎవరినయినా సమర్థించవచ్చు.[1]

## ముస్లింల సహనానికి పరీక్ష

• ఈ ఒప్పందంలోని షరతులు ముస్లింలను కించపరిచే విధంగా ఉన్నాయి. ఒప్పంద పత్రంపై ఇరుపక్షాల తరపున సంతకాలు జరిగిపోయాయి. సరిగ్గా అదే సమయంలో సుహైల్ కుమారుడు అబూ జందల్ అక్కడికి వచ్చారు. ఆయన కాళ్ళకు బేడీలున్నాయి. ఇస్లాం స్వీకరించిన పాపాన అవిశ్వాసులు ఆయన్ని సంకెళ్ళతో బంధించి చిత్రహింసలు పెట్టేవారు. ఆయన ఎలాగో శత్రువుల నుండి తప్పించుకొని వచ్చి ముస్లింల శరణు కోరారు. ఆయన్ని చూడగానే సుహైల్ కనుబొమ్మలెగరేస్తూ,

"ముహమ్మద్! మన ఒప్పందంపై అమలులో ఎదురవుతున్న తొలి సందర్భం ఇది. ఒప్పంద షరతుల ప్రకారం అబూజందల్‌ను నాకప్పగించండి" అన్నాడు.

అబూ జందల్‌ను చూడగానే దైవప్రవక్త (సల్లం)కు అమితమైన జాలి కలిగింది.

"ఒప్పందం ఇంకా మొదలు కాలేదు" అన్నారు. ఆయన మాటల్లో ఎలాగైనా అబూ జందల్‌ను రక్షించుకోవాలన్న ఆశ తొణికిసలాడింది.

"అలాగయితే మాకు ఈ ఒప్పందం కూడా అవసరం లేదు" సుహైల్ మొండికేశాడు. ఈ అవకాశంతో ముస్లింల మెడలు వంచాలన్న దుర్బుద్ధి అతనిలో నిలువెల్లా ఆవహించి ఉంది.

1) సహీహ బుఖారీలోని షరతుల ప్రకరణం. సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం.

www.abulhasanalinadwi.org

"ఇతన్ని మాతోపాటే ఉండనివ్వండి" -దైవప్రవక్త (స) విన్నవించుకునే ధోరణిలో అడిగారు.

కాని సుహైల్ ససేమిరా అన్నాడు. దైవప్రవక్త (సల్లం) ఎంతగానో బ్రతిమాలారు. కాని సుహైల్ ఎంతకీ ఒప్పుకోకపోవటంతో దైవప్రవక్త (సల్లం) గత్యంతరం లేక ఒప్పందానికి శిరసావహించవలసి వచ్చింది.

అబూజందల్‌ను అవిశ్వాసులు విపరీతంగా కొట్టారు. ఆయన ఒళ్ళంతా గాయాలతో, వాతలతో పచ్చిపుండులా తయారయింది. అందరి ముందు చొక్కా విప్పి ఒంటిపైనున్న గాయాలు చూపెడుతూ ఏడుపు ముఖంతో ఆయన, "ముస్లిం సోదరులారా! మీరు నన్ను ఇదే స్థితిలో వదలిపెడతారా? నేను ఇస్లాం స్వీకరించాను. నన్ను మళ్ళీ ఈ అవిశ్వాసులకే అప్పజెప్పి వెళ్ళిపోతారా?" అంటూ ఒక్కొక్క ముస్లింని బ్రతిమాలసాగారు.

ఆయన స్థితిని చూడగానే ముస్లింల గుండెలు తరుక్కుపోయాయి.. హజ్రత్ ఉమర్ అయితే అసలు ఉండబట్టలేకపోయారు. దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళి ఆవేశంలో

"దైవప్రవక్తా! మీరు నిజంగా దైవప్రవక్తేనా?" అని అడిగారు.

"ఔను దైవప్రవక్తనే" సమాధానమిచ్చారాయన.

"మనం సత్యంపైనే ఉన్నాం కదా!?

"అవును"

"మరి ధర్మంలో మనకు ఇన్ని అవమానాలెందుకు?

"ఉమర్! నిస్సందేహంగా నేను దైవప్రవక్తను. దైవాజ్ఞను నేను ఉల్లంఘించ లేను. దేవుడు నాకు తప్పకుండా సహాయం చేస్తాడు."

"మనం కాబా ప్రదక్షిణ చేస్తామని చెప్పలేదా మీరు?"

"కాని ఈ యేడే చేస్తామని చెప్పలేదుగా".

దైవప్రవక్త (సల్లం) నోట ఆ చివరిమాట విన్న తరువాత హజ్రత్ ఉమర్ అక్కడి నుండి లేచి అబూబక్ర్ దగ్గరికి వెళ్ళి అలాగే మాట్లాడారు. దానికి అబూబకర్ సమాధానమిస్తూ, "ఆయన దైవప్రవక్త. ఏది చేసినా దైవాజ్ఞకు అనుగుణంగానే చేస్తారు" అని చెప్పారు.1

1) సహీహ్ బుఖారీలోని షరతుల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

దైవప్రవక్త (సల్లం)తో అలా దురుసుగా మాట్లాడి నందుకు హజ్రత్ ఉమర్ (రజి) ఆ తరువాత జీవితాంతం పశ్చాత్తాపంతో కుమిలిపోయేవారు. తన వల్ల అప్రయత్నంగా జరిగిపోయిన ఆ నేరానికి పరిహారంగా ఆయన ఎన్నో నమాజులు చేశారు, ఉపవాసాలు పాటించారు. దానధర్మాలు చేశారు. బానిసల్ని విడిపించారు. సహీహ్ బుఖారీలో దీని ప్రస్తావన సంక్షిప్తంగా ఉంది. ఇబ్నె ఇస్హాఖ్ మాత్రం ఈ విషయాన్ని సవివరంగా ప్రస్తావించారు.[1]

ఆ స్థితిలో సహనం వహించటం విశ్వాసుల విధేయుతా వినమ్రతలకు పరీక్ష. ఒకవైపు ఇస్లాంను కించపరచటం జరుగుతోంది. అబూ జందల్ సంకెళ్ళు వ్రేలాడుతున్న చేతులెత్తి తనను ఆదుకోమని పధ్నాలుగు వందల ముస్లింలను వేడుకొంటున్నారు. ముస్లింలందరూ ఆగ్రహావేశాలతో ఊగిపోతున్నారు. దైవప్రవక్త (సల్లం) ఒక్క సైగచేస్తే చాలు తమ ఖడ్గాలతో శత్రువులకు బాగా బుద్ధి చెప్పాలని ఎదురుచూస్తున్నారు. కాని మరోవైపు ఒప్పంద పత్రంపై సంతకాలు అయిపోయాయి. ఇక ఆ ఒప్పందానికి కట్టుబడి ఉండవలసిన బాధ్యత ఇరుపక్షాలపై ఉంది. దైవప్రవక్త (సల్లం) అబూ జందల్ వైపు జాలిగా చూస్తూ ఇలా ఓదార్చారు.

> "అబూ జందల్! కాస్త ఓర్చుకో. పుణ్యాన్ని ఆశించు. దేవుడు. నీకు నీలాంటి బాధితులకు తప్పకుండా ఏదో ఒక మార్గం చూపెడతాడు. ఒప్పందం కుదిరింది. మనం వేళ్ళతో చేసుకున్న ఒప్పందానికి కట్టుబడి ఉండాలి"[2]

దైవప్రవక్త (సల్లం) తన సహచరుల్ని అక్కడే జంతువుల్ని ఖుర్బానీ ఇవ్వమని ఆజ్ఞాపించారు. కాని అనుచరులు నిరాశానిస్పృహలకు లోనై ఉండటం చేత ఒక్కడూ లేవలేదు. దైవప్రవక్త (సల్లం) మూడుసార్లు ఆజ్ఞాపించారు. కాని అనుచరుల్లో అలుకూ లేదు పలుకూలేదు.[3] దైవప్రవక్త (సల్లం) చిరాకుతో ఇంట్లోకెళ్ళి తన సతీమణి హజ్రత్ ఉమ్మెసలమాను విచారించారు.

---

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం. సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 317వ పుట.

2) ముస్నదె అహ్మద్ నాల్గో సంపుటి 325వ పుట. సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 318వ పుట.

3) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

"మీరు ఎవరితోనూ ఏమి అనకండి. తిన్నగా బయటికి వెళ్ళి ఖుర్బానీ ఇవ్వండి. క్షవరం చేయించుకొని ఇహ్రాం దీక్షను విరమించండి" అని సలహా ఇచ్చారామె.

దైవప్రవక్త (సల్లం) అలాగే బయటికి వచ్చి తనే ముందుగా ఖుర్బానీ ఇచ్చారు. శిరోముండనం చేయించుకున్నారు. అది చూసి ఇక దైవప్రవక్త (సల్లం) నిర్ణయంలో మార్పు ఉండదని గ్రహించిన సహచరులందరూ కూడా పశువుల్ని జిబహ్ చేసి ఇహ్రాం దీక్షను విరమించారు.[1]

## పరాభవ పవనాలు కాదు, విజయ వీచికలు

ఒప్పందం జరిగిన తరువాత మూడ్రోజుల వరకు దైవప్రవక్త (సల్లం) హుదైబియా ప్రాంతంలోనే ఆగారు. ఆ పిదప అక్కడి నుండి మదీనాకు బయలుదేరినప్పుడు మార్గమధ్యంలో ఈ దైవసూక్తి అవతరించింది.

"ఓ ప్రవక్తా! మేము నీకు స్పష్టమైన విజయాన్ని ప్రసాదించాము" (అల్ ఫత్‌హ్)

ఏ స్థితినయితే ముస్లింలందరూ పరాభవంగా అవమానకరంగా భావించారో ఆ స్థితినే దేవుడు విజయంగా చిత్రించాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) హజ్రత్ ఉమర్‌ను పిలిచి ఈ సూక్తి అవతరించిందని చెప్పారు. దానికి హజ్రత్ ఉమర్ విపరీతంగా ఆశ్చర్యపోతూ, "దైవప్రవక్తా! ఇది విజయమా?" అని అడిగారు. 'ఔను, విజయమే' అన్నారు దైవప్రవక్త (సల్లం). అప్పటి వరకూ పరాభవాన్ని తలచుకుంటూ ఉడికిపోతున్న ఉమర్ హృదయం దైవప్రవక్త (సల్లం) ద్వారా విజయ సువార్త విన్న తరువాతగాని కుదుటపడలేదు.[2] వాస్తవానికి హుదైబియా ఒప్పందంలోని షరతులు ముస్లింల పాలిట విజయవీచికలే కాని పరాభవ పవనాలు కావని కాలమే తేల్చి చెప్పింది.

అప్పటి వరకు మక్కాలోని ముస్లింలకు మదీనాలోని ముస్లింలను కలుసుకునే అవకాశాలుండేవి కావు. కాని ఈ ఒప్పందం జరిగిన తరువాత ముస్లింల మధ్య రాకపోకలు, సంబంధాలు మొదలయ్యాయి. వ్యాపార

1) సహీహ్ బుఖారీలోని షరతుల ప్రకరణం.
2) సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం, సహీహ్ బుఖారీలోని వ్యాఖ్యానాల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

సంబంధాలు పునరుద్ధరించబడటంతో మక్కా అవిశ్వాసులు వ్యాపార విషయాల నిమిత్తం మదీనా వెళ్ళి అక్కడే కొన్ని నెలలపాటు విడిది చేసేవారు. ఆ సమయాల్లో వారు ముస్లింలతోపాటు కలిసి తిరిగేవారు. పరస్పరం మాట్లాడుకున్నప్పుడు ఇస్లాం ధర్మ ప్రస్తావన వచ్చేది. వారు ఇస్లామీయ ఉత్తమ జీవనశైలి గూర్చి చర్చించుకునేవారు. దానికి తోడు ముస్లింల చిత్తశుద్ధి, వ్యవహారశైలి, సదాచరణ, సభ్యతాసంస్కారాలను చూసి అవిశ్వాసులు ఎంతగానో ప్రభావితులయ్యేవారు. అప్రయత్నంగానే వారి హృదయాలు ఇస్లాం వైపుకు మ్రొగ్గేవి.[1] హుదైబియా ఒప్పందం మొదలుకుని మక్కా విజయం వరకు మునుపటి కన్నా చాలా ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఇస్లాం స్వీకరించారని చరిత్రకారులు అభిప్రాయ పడుతున్నారు.[2] సిరియా విజేత హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్, ఈజిప్ట్ విజేత హజ్రత్ అమ్ర్ బిన్‌అస్(రజి)లు ఈ కాలంలో ఇస్లాం స్వీకరించినవారే.[3]

ఒప్పందంలోని ఒక షరతు ప్రకారం మక్కా నుండి ఏ ముస్లిం అయినా మదీనాకు వెళితే అతన్ని తిరిగి మక్కాకు పంపేయాలి. అయితే ఈ షరతు కేవలం పురుషులకు మాత్రమే వర్తిస్తుంది. స్త్రీల విషయంలో ప్రత్యేకంగా ఈ దైవసూక్తి అవతరించింది.[4]

> "ముస్లింలారా! విశ్వసించిన స్త్రీలు మీ వద్దకు వలస వచ్చినప్పుడు (వారు విశ్వసించినవారవునో కాదో) పరీక్షించి తెలుసుకోండి. వారి విశ్వాసం ఎంత వాస్తవమైనదో అల్లాహ్‌యే బాగా ఎరుగును. తరువాత, వారు విశ్వసించిన వారే అని మీకు తెలిస్తే, వారిని అవిశ్వాసుల వద్దకు తిప్పి పంపకండి. వారూ అవిశ్వాసులకు ధర్మసమ్మతం కారు, అవిశ్వాసులూ వారికి ధర్మసమ్మతం కారు. అవిశ్వాసులైన వారి భర్తలు వారికిచ్చిన 'మహర్'ను వారికి తిరిగి ఇచ్చి వెయ్యండి. మీరు వారికి ఇవ్వవలసిన మహర్‌ను వారికి

1) జాదుల్ మఆద్ మూడో సంపుటి 309 వ పుట.
2) దలాయిలున్నుబువ్వా నాల్గో సంపుటి 160వ పుట.
3) సీరతున్నబీ గ్రంథం మొదటి సంపుటి 459వ పుట.
4) సహీహ్ బుఖారీలోని షరతుల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

ఇచ్చివేస్తే, అప్పుడు మీరు వారిని వివాహమాడటంలో దోషం లేదు. స్వయంగా మీరు కూడా అవిశ్వాసులైన స్త్రీలను మీ వివాహబంధంలో ఆపి ఉంచకండి."

(అల్ ముమ్‌తహినహ్)

మక్కాలో ఉండిపోయిన ముస్లింలను అవిశ్వాసులు రకరకాలుగా వేధించేవారు. అంచేత వారు తప్పించుకొని మదీనాకు పారిపోయేవారు. ఆ విధంగా అందరికన్నా ముందు ఉత్బా బిన్ ఉసైద్ మదీనాకు పారిపోయారు. దైవప్రవక్త (సల్లం) ఉత్బాను మక్కాకు తిరిగి వెళ్ళిపొమ్మని ఆదేశించారు. అప్పుడాయన తన దీనావస్థను వెలిబుచ్చుతూ,

"దైవప్రవక్తా! మీరు నన్ను ఇస్లాంను వదలిపెట్టమని బలవంతం చేస్తున్న ఆ దైవద్రోహుల వద్దకే తిరిగి వెళ్ళి పొమంటున్నారా?" అన్నారు.

"దేవుడు దానికి కూడా ఏదో ఒక మార్గం చూపకపోడు."

దైవప్రవక్త (సల్లం) ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

గత్యంతరం లేక ఉత్బా ఇద్దరు అవిశ్వాసుల వెంట మక్కాకు బయలుదేరారు. కాని మార్గమధ్యంలో ఒకణ్ని హత్య చేశారు. రెండో వాడు తప్పించుకొని మదీనా వెళ్ళి దైవప్రవక్త (సల్లం)కు దీని గురించి ఫిర్యాదు చేశాడు. అంతలోనే అబూబుసైర్ (ఉత్బా) అక్కడికి చేరుకొని,

'దైవప్రవక్తా! ఒప్పంద షరతు ప్రకారం మీరు నన్ను మక్కాకు త్రిప్పి పంపించారు. ఆ తరువాత ఇక మీపై ఎలాంటి బాధ్యతా ఉండదు'అని చెప్పి మదీనా నుండి బయలుదేరారు. 'జూమిర్రా' అనే ప్రాంతంలో సాగర తీరాన 'ఐస్' అనే చోట నివసించసాగారు. మక్కాలోని బాధిత, నిరాధార ముస్లింలకు తృతీయ ప్రపంచం నెలకొంటుందని తెలియగానే మెల్లగా ఒక్కొక్కరు మక్కానుండి పారిపోయి అక్కడికి చేరుకోసాగారు. కొంతకాలానికి అక్కడ కూడా చెప్పుకోదగిన సంఖ్యలో ఒక ముస్లిం సమూహం ఏర్పడింది. వాళ్ళంతా సంఘటితులై సిరియావెళ్ళే ఖురైషుల వర్తక బిడారాలను నిలువరించేవారు. దాని ద్వారా వచ్చే ధనాన్ని తమ అవసరాల నిమిత్తం వాడుకునేవారు.

www.abulhasanalinadwi.org

ఖురైషులు చేసేది లేక తాము ఒప్పందంలోని ఈ షరతును మినహాయిస్తున్నామని, ఇకపై ఏ ముస్లిం అయినా మదీనా వెళ్ళి స్థిరపడవచ్చునని, తాము దానికి ఎలాంటి అభ్యంతరం తెలుపబోమని దైవప్రవక్త (సల్లం)కు లేఖ్రవాశారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) సంచారజీవులై తిరుగుతున్న ముస్లింలకు మదీనా వచ్చేయమని కబురు పంపారు. దాంతో అబూజందల్, ఆయన మిత్రులు మదీనాకు వచ్చి స్థిరపడ్డారు. ఖురైషుల వర్తక మార్గం కూడా సుగమం అయింది.[1]

స్త్రీలలో మక్కా నాయకుడు ఉఖబా బిన్ అబూ మయీత్ కూతురు ఉమ్మెకుల్సూమ్ (రజి. అన్హా) ఇస్లాం స్వీకరించి ఉండటం చేత ఆమె కూడా మదీనాకు వలసవెళ్ళారు. అయితే ఆమెతోపాటు ఆమెగారి ఇద్దరు సోదరులు అమారా, వలీద్‌లు కూడా వెళ్ళారు. వారు దైవప్రవక్త (సల్లం)ను తమ సోదరిని మక్కాకు పంపించమని కోరారు. కాని దైవప్రవక్త (సల్లం) మాత్రం అందుకు నిరాకరించారు.[2] దైవప్రవక్త సహచరుల భార్యలు కొందరు ఇస్లాం స్వీకరించకుండా మక్కాలోనే ఉండిపోయారు. అంచేత సహచరులు వారికి విడాకులిచ్చేశారు.[3]

హుదైబియా ఒప్పందాన్ని దేవుడు విజయంగా చిత్రించాడు. కాని ఈ విజయం శరీరాల విజయం కాదు. హృదయాల విజయం. ఇస్లాం ప్రచారానికి కావలసిన శాంతి సౌహార్దాల వాతావరణం ఈ ఒప్పందం వల్లనే లభించింది. ఈ ఒప్పందం ముస్లింల పాలిట నిజంగానే విజయమని స్వయంగా శత్రువులు కూడా అంగీకరించారు. అప్పటి వరకు ముస్లింల - ఖురైషుల మధ్య జరిగిన యుద్ధాల్లో ఖాలిద్ బిన్ వలీద్ తలమానిక సైన్యాధిపతిగా వ్యవహరించారు. అజ్ఞాన కాలంలో ఖురైషుల సైనిక పటాలాలకు ఆయనే నాయకత్వం వహించేవారు. ఉహుద్ యుద్ధంలో ఖురైషులను ఓటమి అంచుల నుండి కాపాడింది ఆయనే. హుదైబియా ఒప్పంద సందర్భంలోనూ ఆయనే ఖురైషుల దళపతిగా వ్యవహరించారు. చివరికి ఆ ఖురైషు దళపతి కూడా ఇస్లామీయ ఆధ్యాత్మిక ప్రభావం నుండి తప్పించుకోలేకపోయాడు.[4]

---

1) సహీహ్ బుఖారీలోని షరతుల ప్రకరణం.
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.
3) సహీహ్ బుఖారీలోని షరతుల ప్రకరణం.
4) సీరతున్నబీ గ్రంథం మొదటి సంపుటి 473వ పుట.

www.abulhasanalinadwi.org

హుదైబియా ఒప్పందం తరువాత ఒకసారి హజ్రత్ ఖాలిద్ మక్కా నుండి బయలుదేరి మదీనా వెళుతున్నారు. దారిలో అమ్ర్ బిన్ ఆస్ ఎదురయి ఎక్కడికి వెళుతున్నారని అడిగారు. ఇస్లాం స్వీకరించడానికి వెళుతున్నానని చెప్పారు ఖాలిద్ బిన్ వలీద్. తాను కూడా ఇస్లాం స్వీకరిస్తానని అన్నారు అమ్ర్ బిన్ ఆస్. ఇద్దరూ కలిసి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళి ఇస్లాం స్వీకరించి సౌభాగ్యులయ్యారు.[1] అప్పటి వరకు ఇస్లాంకు వ్యతిరేకంగా ఉపయోగించిన తమ శక్తి సామర్థ్యాలను ఇకపై ఇస్లాం అభ్యున్నతి కోసం ఉపయోగించటం మొదలుపెట్టారు.

మక్కా విజయం సందర్భంగా ఖాలిద్ ఒక ముస్లిం సైనికదళానికి అధిపతిగా ఉండి దైవప్రవక్త (సల్లం) ముందు నుంచి వెళ్ళారు. దైవప్రవక్త (సల్లం) ప్రజల చేత చెప్పించే ఉద్దేశ్యంతో, "ఎవరీయన?" అని అడిగారు. ప్రజలు 'ఖాలిద్' అని చెప్పగానే ఆయన "ఖాలిద్, దేవుని కరవాలం" అన్నారు.[2]

మౌతా యుద్ధంలో జాఫర్, జైద్ బిన్ హారిసా, అబ్దుల్లాహ్ బిన్ రవాహ్ లాంటి సైన్యాధిపతులు వీరోచితంగా పోరాడుతూ అమరగతి నొందిన తరువాత హజ్రత్ ఖాలిద్ యుద్ధపతాకాన్ని తన చేతుల్లోకి తీసుకొని ముస్లింలను ప్రమాదం నుండి గట్టెక్కించారు.

ఖిలాఫత్ కాలంలో ఖాలిద్ రోము చక్రవర్తి నుండి సిరియాను వశపరచుకోగా అమ్ర్ బిన్ ఆస్ ఈజిప్ట్‌లో ఇస్లామీయ విజయపతాకాన్ని ఎగురవేశారు.[3]

## రాజులు, చక్రవర్తులకు ఇస్లాం సందేశం

హి.శ. ఏడవ యేట ముహర్రమ్ మాసం ఒకటో తేదీన దైవప్రవక్త (సల్లం) ప్రపంచ చక్రవర్తులు, రాజులకు ఇస్లాం సందేశం అందజేసే నిమిత్తం రాయబారుల ద్వారా వారికి ఉత్తరాలు వ్రాసి పంపటం మొదలుపెట్టారు. ప్రతి రాయబారి తాను వెళ్ళబోయే దేశంలో మాట్లాడే

1) అల్ ఇసాబా మొదటి సంపుటి 418వ పుట.
2) సుననె తిర్మిజీ మహిమెన్నతల అధ్యాయాలు
3) సీరతున్నబీ గ్రంథం మొదటి సంపుటి 474వ పుట.

www.abulhasanalinadwi.org

భాష తెలిసినవాడయి ఉండేవాడు. కనుక అతను ఆ దేశంలో చక్కగా ఇస్లాం ధర్మాన్ని ప్రచారం చేయగలిగేవాడు.[1]

అప్పటి వరకు దైవప్రవక్త (సల్లం) ఎలాంటి రాచముద్రికలు తయారు చేయించుకోలేదు. కాని ఇప్పుడు రాజులకు లేఖలు వ్రాయవలసి వచ్చినప్పుడు తనకు కూడా ఒక రాచముద్రిక అవసరమనిపించింది. అంచేత ఆయన ఒక వెండి ఉంగరాన్ని తయారు చేయించుకున్నారు. ఆ ఉంగరం ముద్రభాగంలో "ముహమ్మదు రసూలుల్లాహ్" అని మూడువరుసల్లో వ్రాసి ఉండేది.[2]

అప్పట్లో దైవప్రవక్త (సల్లం) వ్రాయించిన లేఖలను పరిశీలించగా బోధపడే ఒక ముఖ్య విషయం ఏమిటంటే క్రైస్తవ రాజులకు వ్రాసిన లేఖల్లో ముఖ్యంగా ఈ సూక్తిని పొందుపరచేవారు.

"గ్రంథ ప్రజలారా! మాకూ మీకు మధ్య సమానమైన ఒక విషయం వైపునకు రండి. (అది ఏమిటంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ దాస్యం చెయ్యరాదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు. మనలోని వారెవరూ అల్లాహ్‌ను తప్ప మరెవరినీ తమ ప్రభువుగా చేసుకోరాదు అనేది" (ఆలి ఇమ్రాన్)

ఆ లేఖల్లో కొన్నింటిని ఇక్కడ పొందుపరుస్తున్నాం.

## అబిసీనియా రాజు నజాషీకి లేఖ

ఆ కాలంలో అబిసీనియారాజు అస్‌హమ్ బిన్ అబ్‌జర్. నజాషీ అతని బిరుదు. అమ్ర్ బిన్ ఉమయ్యా జమ్‌రీ అతని దగ్గరికి రాయబారిగా వెళ్ళి అతనికి దైవప్రవక్త (సల్లం) లేఖను అందజేశారు. ఇతను క్రైస్తవుడు.[3] తారీఖె తబ్రీ నుండి సేకరించిన ఆ లేఖ అనువాదాన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాం.

బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీం:

ఈ లేఖ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) తరపునుండి

---

1) తబఖాత్ ఇబ్నెసాద్ రెండో సంపుటి 23వ పుట.
2) సహీహ్ బుఖారీలోని వస్త్రధారణ ప్రకరణం.
3) జాదుల్ మఆద్ మూడో సంపుటి 689వ పుట.

www.abulhasanalinadwi.org

అబిసీనియా చక్రవర్తి అస్‌హమ్ నజాషీకి వ్రాయబడుతోంది. నీకు శాంతికల్గుగాక! ముందుగా నేను దైవాన్ని స్తుతిస్తున్నాను. ఆయన విశ్వ సామ్రాట్టు. పరిశుద్ధుడు, శాంతిప్రదాత, సంరక్షకుడు.

మర్యమ్ కుమారుడైన హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) దేవుని సృష్టి అనీ, కుమారి శీలవతి అయిన హజ్రత్ మర్‌యమ్ వైపునకు పంపబడిన ఒక ఆజ్ఞ అనీ నేను స్పష్టం చేస్తున్నాను. ఆ ఆజ్ఞతోనే ఆమె ఈసాకు గర్భం దాల్చింది. ఏ విధంగానైతే దేవుడు హజ్రత్ ఆదంను తన చేత్తో, తన శ్వాసతో పుట్టించాడో అదే విధంగా ఈసాను తన ఆత్మతో, తన శ్వాసతో పుట్టించాడు.

ఇక నేనిచ్చే సందేశమేమిటంటే నువ్వు, ఒక్కడూ తనకు మరెవ్వరూ సాటిలేని దైవాన్ని విశ్వసించు. నిత్యం ఆయనకు విధేయుడవై ఉండు. నన్ను అనుసరించు. చిత్తశుద్ధితో నా బోధనల్ని అంగీకరించు ఎందుకంటే నేను దైవప్రవక్తను.

“నేను ఇంతకు ముందు నీ రాజ్యానికి నా పినతండ్రి కుమారుడు జాఫర్‌తోపాటు కొంతమంది ముస్లింలను పంపాను. వారిని నీ రాజ్యంలో సుఖంగా ఉంచుకో. నజాషీ! నువ్వు అహంకారాన్ని వదలిపెట్టు. నేను నిన్నూ, నీ ఆస్థానంలోని వారిని దైవం వైపునకు ఆహ్వానిస్తున్నాను. నేను మీకు దైవసందేశాన్ని అందజేసి, బాగా అర్థమయ్యేలా వివరించాను. ఇక మీరు నా హితవును అంగీకరించటమే మీకు అన్ని విధాలా శ్రేయస్కరం. సన్మార్గగాములకు శాంతి కల్గుగాక!”[1]

నజాషీ చక్రవర్తి ఆ లేఖను చూసి ముస్లిం అయిపోయాడు. జవాబుగా ఈ ఉత్తరం వ్రాశాడు:

## బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీం

“ఈ ఉత్తరం నజాషీ చక్రవర్తి అస్‌హమ్ బిన్ అబ్‌జర్

1) తారీఖె తబ్రీ రెండో సంపుటి 131, 132 పుటలు. జాదుల్ మఆద్ మూడో సంపుటి 689వ పుట.

www.abulhasanalinadwi.org

తరపునుండి దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) సన్నిధికి వ్రాయబడుతోంది. ఓ దైవప్రవక్తా! మీపై దేవుని శాంతి కల్గుగాక! ఆయన కారుణ్యాలు, శుభాలు మీపై కురియుగాక! ఆయన తప్ప వేరొక ఆరాధ్య దేవుడు లేడు, ఆయనే నాకు ఇస్లాం భాగ్యాన్ని ప్రసాదించాడు.

ముఖ్యంగా వ్రాయునది ఏమనగా తమరి లేఖను అందుకున్నాను. భూమ్యాకాశాల ప్రభువు సాక్షిగా చెబుతున్నాను. ఈసా-అలైహి-కు మీరు వ్రాసిన దానికంటే అణుమాత్రమయినా ఎక్కువ విలువ లేదు. మీరు వ్రాసినట్లుగా ఆయనకున్న విలువ అంతే! మేము మీ బోధనల్ని నేర్చుకున్నాం. మీ పినతండ్రికుమారుడు, ఇతర ముస్లింలు మా రాజ్యంలో సుఖంగా ఉన్నారు. మీరు దైవప్రవక్త అని నేను ధృవీకరిస్తున్నాను. మీరు సత్యసంధులు. సత్యవంతుల సత్యాన్ని ప్రకటించేవారు. నేను మీతో ప్రమాణం చేస్తున్నాను-నేను మీ పినతండ్రి కుమారుడు జాఫర్ చేతిపై కూడా ప్రమాణం చేశాను. దైవానికి విధేయుడనై ఉంటానని మాటిచ్చాను. ఇప్పుడు నేను నా కుమారుడు అరహాను మీ దగ్గరికి పంపుతున్నాను. నాకు కేవలం నా మీద అధికారం ఉంది (ఇతరుల హృదయాలపై అధికారం లేదు). మీరు కోరుకుంటే మీ సేవ చేయటానికి నేను తప్పకుండా హాజరవుతాను. ఎందుకంటే మీరు ఏది చెప్పినా సత్యమే చెబుతారని నేను నమ్ముతున్నాను. ఓ దైవప్రవక్తా! మీపై శాంతి కల్గుగాక!"[1]

## బహ్రాయిన్ రాజుకి లేఖ

బహ్రైన్ రాజు ముంజిర్ బిన్ సావీ. ఇతను పారశీక చక్రవర్తికి సామంతుడు. అలా బిన్ హజ్రమీ (రజి) ఇతని దగ్గరికి రాయబారిగా వెళ్ళారు. ఇతను దైవప్రవక్త (సల్లం) లేఖ చదివి ఇస్లాం స్వీకరించాడు.

1) తారీఖె తబ్రీ రెండో సంపుటి 232వ పుట. జాదుల్ మఆద్ మూడో సంపుటి 690వ పుట. సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణంలో క్లుప్తంగా ఉంది.

www.abulhasanalinadwi.org

అంతేకాదు అతని ప్రజల్లో కూడా అత్యధిక మంది ఇస్లాం స్వీకరించారు. ఇతను జవాబుగా దైవప్రవక్త (సల్లం)కు లేఖ వ్రాశాడు. తన రాజ్యంలో కొంతమంది ఇస్లాంను అమితంగా ఇష్టపడ్డారనీ, మరికొంత మంది అయిష్టత వ్యక్తం చేశారని, ఇంకా కొందరయితే ఇస్లాం స్వీకరించటానికి నిరాకరించారని, తన రాజ్యంలో యూదులు, అగ్ని పూజారులు ఎక్కువగా ఉన్నారని వ్రాస్తూ వారి విషయంలో ఏదయినా ఆదేశం ఇవ్వవలసిందిగా కోరాడు. దానికి జవాబుగా దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా వ్రాసి పంపారు.

"హితవును గ్రహించినవాడు తన మంచికోసమే గ్రహిస్తాడు. కాని ఎవరయినా యూదత్వాన్ని లేదా అగ్నిపూజ మతాన్నే అంటిపెట్టుకొని ఉండాలనుకుంటే అతను 'జిజ్‌యా' (రక్షణ రుసుము) చెల్లించవలసి ఉంటుంది."[1]

## అమ్మాన్ రాజుకి లేఖ

అమ్మాన్ రాజ్యానికి జులందీ రాజు. జైఫర్, అబ్ద్ అనేవారు అతని కుమారులు. వారి దగ్గరికీ దైవప్రవక్త (సల్లం) తరపు నుండి రాయబారిగా హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ పంపబడ్డారు. హజ్రత్ అమ్ర్ ఇలా అంటున్నారు. నేను అమ్మాన్ రాజ్యం చేరుకున్న తరువాత మొట్టమొదట అబ్ద్‌ను కలుసుకున్నాను. ఇతను తన రాజ్యంలో ప్రముఖ సర్దారు. తన సోదరుడు జైఫర్ కన్నా చాలా నెమ్మదస్తుడు. నేనతనితో మాట్లాడి, నేను దైవప్రవక్త (సల్లం) తరపు నుండి మీ అన్నదమ్ముల దగ్గరికి రాయబారిగా వచ్చానని చెప్పాను.

దానికి అబ్ద్, "నా అన్న వయసులో నాకంటే పెద్దవాడు. ఈ దేశానికి ఏకైక రాజూ అతనే. నేను మిమ్మల్ని అతని దర్బారుకు తీసుకువెళతాను. అసలు మీరిచ్చే సందేశమేమిటో ముందు నాకు చెప్పండి" అన్నాడు.

"ఒకే ఒక్కడూ, తనకు ఎవ్వరూ సాటిలేని దేవుని వైపుకు మేము మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాము. ముహమ్మద్ (సల్లం) దేవుని దాసుడు, ఆయన ప్రవక్త అన్న విషయాన్ని విశ్వసించమని కోరుతున్నాం"-అమ్ర్ బిన్ ఆస్ క్లుప్తంగా సమాధానమిచ్చారు.

---

1) జాదుల్ మఆద్ మూడో సంపుటి 693వ పుట. ఉయూనుల్ అసిర్ రెండో సంపుటి 266వ పుట.

www.abulhasanalinadwi.org

అది విన్న అబ్ద్‌కు ఏదో అభ్యంతరం కలిగింది. "అమ్ర్! మీరు మీ జాతి నాయకుని కుమారులు కదా! మీ తండ్రి ఈ విషయాన్ని అంగీకరించారా? అంగీకరిస్తే చెప్పండి మేమూ ఆయన్ని ఆదర్శంగా తీసుకుంటాం" తటపటాయిస్తూనే అడిగాడు అబ్ద్.

"ఆయన ఇస్లాం స్వీకరించకుండానే చనిపోయారు. ఆయన ఇస్లాం స్వీకరించి, ముహమ్మద్ (సల్లం) దైవప్రవక్త అన్న సంగతి సత్యమని ధృవీకరించి ఉంటే బాగుండేది. నేను కూడా నా తండ్రి ధర్మాన్నే అనుసరించేవాణ్ణి. కాని ఆ తరువాత దేవుడు నాకు ముహమ్మద్ (సల్లం)ను విశ్వసించే భాగ్యాన్ని ప్రసాదించాడు". ఏ మాత్రం తడుముకోకుండా సమాధానమిచ్చారు అమ్ర్.

అబ్ద్ : నువ్వు ఎప్పట్నుంచి ముహమ్మద్‌ను అనుసరిస్తున్నావ్?

అమ్ర్ : ఇటీవల నుంచే

అబ్ద్ : ఇస్లాం ఎక్కడ స్వీకరించావు?

అమ్ర్ : నజాషీ చక్రవర్తి దర్బారులో, నజాషీ చక్రవర్తి కూడా ఇస్లాం స్వీకరించాడు.

అబ్ద్ : ఆ తరువాత అక్కడి ప్రజలు నజాషీ పట్ల ఎలా ప్రవర్తించారు?

అమ్ర్ : యథాప్రకారం అతన్ని చక్రవర్తిగానే ఉండనిచ్చారు. పైగా ప్రజలు కూడా ఇస్లాం స్వీకరించారు.

అబ్ద్ : (ఆశ్చర్యంగా) క్రైస్తవమత పండితులు కూడా ఇస్లాం స్వీకరించారా?

అమ్ర్ : అవును

అబ్ద్ : చూడు అమ్ర్. నువ్వేం మాట్లాడుతున్నావో ఆలోచించే మాట్లాడుతున్నావా? అబద్ధం చెప్పటం మహాపాపమని తెలుసుకదా!

అమ్ర్ : నేను అబద్ధం చెప్పటం లేదు. అబద్ధం చెప్పటానికి ఇస్లాం ధర్మం సుతరామూ అనుమతించదు.

అబ్ద్ : మరి హెరిక్లస్ ఏం చేశాడు? నజాషీ ముస్లిం అయిపోయాడన్న సంగతి అతనికి తెలుసా?

www.abulhasanalinadwi.org

అబ్రమ్ : తెలుసు!

అబ్ద్ : తెలుసని మీరెలా చెప్పగలరు?

అబ్రమ్ : నజాషీ హెర్క్లిస్‌కు కప్పం చెల్లించేవాడు.కాని అతను ఇస్లాం స్వీకరించిన తరువాత ఇకపై చిల్లిగవ్వ అడిగినా ఇవ్వనని ప్రకటించేశాడు.

హెర్క్లిస్‌కు ఈ విషయం తెలిసింది. అతని సోదరుడు యన్నాఖ్ విపరీతంగా మండిపడ్డాడు.

"అన్నయ్యా! నీ బానిస అయిన ఆ నజాషీ మనకు కప్పం చెల్లించటానికి నిరాకరించాడు. మన మతాన్ని కూడా వదలిపెట్టి ఇంకేదో క్రొత్త మతాన్ని అవలంబిస్తున్నాడు" అంటూ నజాషీకు బుద్ధిచెప్పమని కోరాడు.

కాని హెర్క్లిస్ అతన్ని మాటల్ని ఏ మాత్రం లక్ష్యపెట్టలేదు. పైగా ఎంతో నెమ్మదిగా 'అతనికి ఆ మతం నచ్చింది. అతను దాన్ని అవలంబిస్తున్నాడు. అందులో మనకు అభ్యంతరం దేనికి? దైవసాక్షి. నాకు ఈ సామ్రాజ్య చింత లేకపోయినట్లయితే నేనూ ఆ పనే చేసేవాణ్ణి' అన్నాడు.

అబ్ద్ : అబ్రమ్, ఏమిటి మీరు మాట్లాడుతున్నది?

అబ్రమ్: దైవసాక్షి! నేను నిజం చెబుతున్నాను.

అబ్ద్ : సరేగాని మీ ప్రవక్త ఏ పనులు చేయాలని ఆదేశిస్తున్నారో, మరేపనులు చేయకూడదని అంటున్నారో చెబుతారా?

అబ్రమ్: ఆయన దేవునికి విధేయత చూపాలని ఆదేశిస్తారు. దైవం పట్ల అవిధేయతకు పాల్పడటం నుంచి వారిస్తారు. తాగుడు, జూదం, వ్యభిచారం అధర్మమైన పనులనీ, విగ్రహాలను, శిలువలను పూజించకూడదని అంటారు.

అబ్ద్ : ఆయన ఇస్తున్న ఆదేశాలు చాలా బాగున్నాయ్! మా అన్నయ్య కూడా నా మాట వింటే బాగుండు! ఇద్దరం దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి ఇస్లాం స్వీకరిస్తాం.

ఒకవేళ మా అన్నయ్య ఈ సందేశాన్ని తిరస్కరించి ప్రాపంచిక

జీవితానికే ఎక్కువ ప్రాముఖ్యతనిస్తే దానివల్ల ఈ రాజ్యానికే నష్టం వాటిల్లుతుందని నేననుకుంటున్నాను.

అమ్ర్ : ఒకవేళ మీ అన్నయ్య ఇస్లాం స్వీకరించినా ఇక్కడి రాజుగా దైవప్రవక్త (సల్లం) ఆయన్నే కొనసాగనిస్తారు. ఈ దేశంలోని ధనికుల నుండి 'సదఖాలు' వసూలు చేసి ఇక్కడి నిరుపేదలకే పంచిపెడతారు

అబ్ద్ : మీరు చాలా మంచి పని చేస్తున్నారు. అయితే నాకు తెలియక అడుగుతాను. అసలు 'సదఖా' అంటే ఏమిటి?

అమ్ర్ బిన్ ఆస్ అప్పుడతనికి జకాత్ ఆదేశాల గురించి వివరించారు. ఆయన ఆ విధంగా వివరిస్తూ ఒంటెలపై కూడా జకాత్ చెల్లించాలని చెప్పగానే అబ్ద్ ఆశ్చర్యపోతూ, "ఏమిటి, పశువులపై కూడా పన్ను చెల్లించాలా? పశువులు స్వయం పోషకాలు. అవి చెట్ల ఆకులు, అలములు తిని, నీళ్లు త్రాగి బతుకుతాయి. వాటిమీద పన్ను చెల్లించడమేమిటి?" అన్నాడు.

"ఔను, మేము పశువుల మీద కూడా జకాత్ వసూలు చేస్తాం" అన్నారు అమ్ర్ బిన్ ఆస్.

"మా జాతి ప్రజలు చాలా ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. సుదూర ప్రాంతాల వరకు విస్తరించి ఉన్నారు. నాకు వారు ఈ ఆజ్ఞను అంగీకరిస్తారన్న నమ్మకం లేదు" అన్నాడు అబ్ద్.

మొత్తానికి హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ కొన్ని రోజుల పాటు అక్కడే ఆగారు. అబ్ద్ రోజూ తాము మాట్లాడుకునే మాటలు తన అన్నకు చేరవేసేవాడు. ఒకరోజు రాజు అమ్ర్‌ను తన దర్బారుకు పిలిపించాడు. భటులు ఆయన్ని పెడరెక్కలు విరిచిపెట్టుకొని రాజదర్బారులో హాజరుపరచారు. రాజు ఆయన్ని వదలిపెట్టమని సైగచేయగానే భటులు ఆయన్ని వదలిపెట్టి ఓ ప్రక్క నించున్నారు. ఆయన రాజు ముందు కూర్చోబోతుంటే భటులు మళ్ళీ ఆయన్ని పట్టుకొని నించోబెట్టారు. అమ్ర్ రాజు వంక చూశారు.

"చెప్పు, నువ్వు వచ్చిన పని ఏమిటి?"

అమ్ర్ ఏమీ మాట్లాడకుండా దైవప్రవక్త (సల్లం) ముద్ర అంటించి వున్న ఒక లేఖను రాజు చేతికి అందించారు.

జైఫర్ ఆ ఉత్తరం తెరచి చూశాడు. ఉత్తరం మొత్తం ఒకసారి చదువుకొని తమ్ముడికిచ్చాడు. అతని తమ్ముడు కూడా ఆ ఉత్తరం చదివాడు.

ఆ తరువాత రాజు ఖురైషులు ఎలా ఉన్నారని అడిగాడు. అందరూ ఇష్టం ఉన్నా లేకపోయినా దైవప్రవక్త (సల్లం) విధేయతనే ఎంచుకున్నారని చెప్పారు అమ్ర్ బిన్ ఆస్.

రాజు: ముహమ్మద్‌ను అనుసరించేవారు ఎలాంటివారు?

అమ్ర్: మనస్ఫూర్తిగా ఇస్లాం స్వీకరించినవారు. అన్నింటినీ వదలుకొని దైవప్రవక్త (సల్లం)నే ఎంచుకున్నారు. వారు ఎన్నో అనుభవాల తరువాత బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నారు.

రాజు అమ్ర్‌బిన్ ఆస్‌తో మళ్ళీ రేపు తనను కలవమన్నాడు. అమ్ర్ మరునాడు రాజు తమ్ముణ్ణి కలుసుకున్నారు. తమ రాజ్యానికి ఎలాంటి హాని లేదనుకుంటే రాజు తప్పకుండా ఇస్లాం స్వీకరిస్తాడని హామీ ఇచ్చాడతను.

అమ్ర్ బిన్ ఆస్ మరునాడు రాజుని కలుసుకున్నారు. రాజు ఎంతో నెమ్మదిగా మాట్లాడసాగాడు.

"నేను ఈ విషయం గురించి బాగా ఆలోచించాను. చూడు, మీ ప్రవక్త సైన్యం మా రాజ్యం దరిదాపులకు కూడా రాలేదు. అలాంటి వ్యక్తికి నేను తలొగ్గితే అరబ్బు రాజులందరికీ నేను చులకన అయిపోతాను. వాస్తవానికి ఏ దేశమయినా నా మీదకు దండెత్తి వస్తే నేను మీరు మునుపెన్నడూ కనీవినీ ఎరుగని విధంగా వారిని చిత్తుగా ఓడిస్తాను. అంత బలం ఉంది నా దగ్గర."

"సరే, అయితే నేను రేపే మా దేశం వెళ్ళిపోతాను" అన్నారు అమ్ర్.

రాజు రేపు ఉండమని చెప్పాడు.

మరునాడు రాజు ఓ మనిషిని పంపి ఆయన్ని తన వద్దకు పిలిపించాడు. ఆయన సమక్షంలోనే రాజు, అతని సోదరుడు ఇరువురూ ఇస్లాం స్వీకరించారు. ప్రజల్లో కూడా చాలా మంది ఇస్లాం స్వీకరించారు.[1]

1) జాదుల్ మఆద్ మూడో సంపుటి 693 నుండి 696 పుటల వరకు. నస్‌బుర్రాయా నాల్గో సంపుటి 423, 424 పుటలు. ఉయూనుల్ ఆసిర్ రెండో సంపుటి 267 నుండి 269 పుటల వరకు.

www.abulhasanalinadwi.org

# డెమాస్కస్, ఎమన్ పాలకులకు లేఖలు

డెమాస్కస్ రాజు ముంజిర్ బిన్ హారిస్ బిన్ అబూ షిమ్ర్. అతను సిరియా ప్రాంతానికి గవర్నరుగా కూడా వ్యవహరించేవాడు. షుజా బిన్ వహబ్ అసదీ అతని వద్దకు రాయబారిగా వెళ్ళారు. అతను దైవప్రవక్త (సల్లం) పంపిన లేఖ చదివి కోపంతో చిందులు వేశాడు. తనే ముందుగా మదీనాపై దండెత్తుతానని ప్రగల్భాలు పలికాడు. రాయబారిని గౌరవ మర్యాదలతో పంపాడు కాని తాను మాత్రం ఇస్లాం స్వీకరించలేదు.[1]

ఆ కాలంలో ఎమన్ పాలకుడు హెజాబిన్ అలీ. అతను క్రైస్తవుడు. సలీత్ బిన్ అమ్ర్ అతని దగ్గరికి దైవప్రవక్త (సల్లం) తరపున రాయబారిగా పంపబడ్డారు. దైవప్రవక్త (సల్లం) సందేశం విని ఆ మూర్ఖుడు ఇస్లామీయ రాజ్యంలో తనకు సగం వాటా లభిస్తే తానూ ముస్లిం అయిపోతానని ఎకసెక్కంగా మాట్లాడాడు. ఆ మాట అన్న తరువాత కొన్నిరోజులకే అతను చనిపోయాడు.[2]

# అలెగ్జాండ్రియా రాజుకు లేఖ

ఆ కాలంలో అలెగ్జాండ్రియా, ఈజిప్ట్ దేశాలను జురైహ్ బిన్ ముత్తా ముఖవ్వఖస్ అనే బిరుదుతో పరిపాలిస్తున్నాడు. అతను క్రైస్తవుడు. హాతిబ్ బిన్ అబూ బుల్తఅ అతని దగ్గరికి రాయబారిగా వెళ్ళారు. అతనికి వ్రాసిన ఉత్తరంలో దైవప్రవక్త (సల్లం) చివరిలో ఒకవేళ తను ఇస్లాం స్వీకరించక పోతే ఈజిప్ట్ వాసులందరి పాపం తన మెడకే చుట్టుకుంటుందని హెచ్చరించారు.

రాయబారి అతనికి దైవప్రవక్త (సల్లం) లేఖను అందజేయటంతో పాటు అతనికి ఈ విధంగా బోధించారు:

"రాజా! ఈ దేశంలోనే మీకన్నా ముందు ఓ రాజు గతించాడు. అతను తాను ప్రజలకు మహాదేవుణ్ణని చెప్పుకునేవాడు. చివరికి దేవుడు ఇహపరాల్లోనూ అతన్ని పరాభవం పాల్జేశాడు. దైవశిక్ష విరుచుకుపడి అతని రాజ్యమదాంధకారాన్ని అణచివేసింది. కనుక నువ్వు ఇతరుల్ని

1) జాదుల్ మఆద్ మూడో సంపుటి 697వ పుట.
2) జాదుల్ మఆద్ మూడో సంపుటి 696వ పుట. ఉయూనుల్ ఆసిర్ రెండో సంపుటి 269వ పుట.

www.abulhasanalinadwi.org

చూసి గుణపాఠం నేర్చుకో. లేదా ఇతరులే నిన్ను చూసి బుద్ధి తెచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తుంది."

దానికి రాజు, "ప్రస్తుతం మేము ఒక మతాన్ని అవలంబిస్తున్నాం. దానికన్నా శ్రేష్ఠమైన మతాన్ని పొందనంతవరకు మేము దాన్ని వదలిపెట్టలేము" అన్నాడు.

రాజు మాట విని హాతిబ్ అతనికి విషయం అర్థమయ్యేలా చెప్పటానికి ప్రయత్నించసాగారు.

"నేను మిమ్మల్ని అన్ని మతాలకన్నా శ్రేష్ఠమైన మతం వైపునకే ఆహ్వానిస్తున్నాను."

"దైవప్రవక్త (సల్లం) ఇస్లాం సందేశం అందరికీ ఇచ్చారు. కాని ఖురైషులు దాన్ని వ్యతిరేకించారు. యూదులు ఇస్లాంతో వైరం పెంచుకున్నారు. అయితే ఇస్లాం పట్ల అతి ఎక్కువగా ప్రేమ కనబరచిన వారు, ఇస్లాంను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించినవారు ఒక్క క్రైస్తవులే. దైవసాక్షి! మూసా ప్రవక్త ఈసా రాక గురించి శుభవార్తను తెలిపినట్లే ఈసా ప్రవక్త ముహమ్మద్ (సల్లం) రాక గురించి శుభవార్తను అందజేశారు. మీరు యూదుల్ని బైబిల్ వైపుకు ఎలా ఆహ్వానిస్తున్నారో అలాగే మేము కూడా మిమ్మల్ని ఖురాన్ వైపునకు ఆహ్వానిస్తున్నాం" హాతిబ్ చెప్పుకుపోతున్నారు.

ఏదయినా జాతి వైపునకు ఒక ప్రవక్త పంపబడితే ఆ జాతి ఆయన 'ఉమ్మత్' (సమాజం)గా పరిగణింపబడుతుంది. ఒక ప్రవక్త కాలంలో మీరు బ్రతికిఉంటే ఆయన్ని అనుసరించటం మీ విధి. ఒక విధంగా చెప్పాలంటే మేము మిమ్మల్ని మీ ప్రవక్త ఈసా మతం వైపునకే ఆహ్వానిస్తున్నామని భావించండి. దానికి జవాబుగా ముఖవ్వఖస్ ఇలా అన్నాడు.

"నేను ఈ ప్రవక్త గురించి బాగా ఆలోచించాను. ఆయన మంచి విషయాల నుండి మాత్రం వారించటం లేదు. అయినప్పటికీ నేనింకా ఓ నిర్ణయానికి రాలేకపోతున్నాను. నాకు తెలుసు. ఆయన ప్రజలకు కీడు తలపెట్టే ఇంద్రజాలికుడు కాడు. మాయ మాటలు చెప్పే జ్యోతిష్యుడూ కాడు. పైగా ఆయనలో ప్రవక్త లక్షణాలే కనబడుతున్నాయి. సరే; ఈ విషయం గురించి ఇంకా బాగా ఆలోచించిన తరువాత నా నిర్ణయమేమిటో చెబుతాను".

www.abulhasanalinadwi.org

ఆ తరువాత ముఖవ్వఖస్ దైవప్రవక్త (సల్లం) లేఖను ఏనుగుదంతాలతో చేసిన ఓ పెట్టెలో ఉంచి, పెట్టెకు రాజముద్రను అంటించి కోశాగారంలో భద్రపరచాడు. దైవప్రవక్త (సల్లం)కు ఎన్నో కానుకలు పంపించాడు. జవాబుగా ఒక లేఖ కూడా వ్రాస్తూ అందులో "ఒక ప్రవక్త రానున్నాడన్న విషయం నాక్కూడా తెలుసు. కాని నేను ఆ ప్రవక్త సిరియాలో ఉదయిస్తాడని అనుకునేవాణ్ణి" అని చెప్పాడు.

ప్రసిద్ధి చెందిన 'దుల్ దుల్' కంచర గాడిద ఇతను కానుకగా పంపినదే.[1]

## హెరిక్లిస్‌కు లేఖ

కానిస్టాంటిలోపుల్ లేక రోమ్‌నగర్ తూర్పు భాగంలోని రాజ్యానికి చక్రవర్తి హెరిక్లిస్. అతను కూడా క్రైస్తవుడే. హజ్రత్ దిహ్యా బిన్ ఖలీఫా కల్బీ అతని వద్దకు రాయబారిగా వెళ్ళారు. దిహ్యా బైతుల్ ముఖ్దిస్ ప్రాంతంలో హెరిక్లిస్ చక్రవర్తిని కలుసుకున్నారు. ఈ చక్రవర్తి దైవప్రవక్త రాయబారికి ఘనంగా స్వాగతం పలికాడు. ఆయన గౌరవార్థం ప్రత్యేక దర్బారును నెలకొల్పాడు. దైవప్రవక్త (సల్లం) గురించి అనేక విషయాలను అడిగి తెలుసుకున్నాడు.

ఆ తరువాత హెరిక్లిస్ దైవప్రవక్త (సల్లం) గురించి మరిన్ని వివరాలు అడగాలనుకున్నాడు. మక్కా నుండి ఎవరయినా తన రాజ్యానికి వస్తే వారిని తన దర్బారులో హాజరుపరచమని ఆదేశించాడు.

కాకతాళీయంగా ఆ రోజుల్లోనే అబూసుఫ్యాన్ అతని మిత్రబృందం వ్యాపార నిమిత్తం సిరియా వచ్చి ఉన్నారు. భటులు వారిని గుర్తించి రాజదర్బారులో హాజరుపరచారు. రాజు అబూసుఫ్యాన్ మిత్రులను ఉద్దేశించి, "నేను మీ మిత్రుడు అబూసుఫ్యాన్‌ని కొన్ని ప్రశ్నలడుగుతాను. సమాధానం చెప్పటంలో అతను గనక అబద్ధమాడితే మీరు నాకు నిజం ఏమిటో చెప్పాలి" అన్నాడు.

---

1) జాదుల్ మఆద్ మూడో సంపుటి 691వ పుట. నస్‌బుర్రాయ నాల్గో సంపుటి 421, 422 పుటలు. ఉయూనుల్ ఆసిర్ రెండో సంపుటి 665, 666 పుటలు.

www.abulhasanalinadwi.org

ఆ రోజుల్లో అబూసుఫ్యాన్‌కు దైవప్రవక్త (సల్లం)తో విపరీతమైన శత్రుత్వం ఉండేది. తాను ఇస్లాం స్వీకరించిన తరువాత, ఆ సంఘటన గురించి అబూ సుఫ్యాన్ స్వయంగా ఇలా తెలియజేశారు:

"ఆ రోజు నా మిత్రులు నన్ను అడ్డుకుంటారేమోనన్న భయం లేకుండినట్లయితే నేను దైవప్రవక్త (సల్లం) గురించి ఆ రాజుకు ఎన్నో అబద్ధాలు చెప్పి ఉండేవాణ్ణి. కాని ఆ రాజదర్బారులో నాకు నిజమే చెప్పాల్సి వచ్చింది."

అబూ సుఫ్యాన్‌కు-రోము చక్రవర్తి (కైసర్)కీ మధ్య జరిగిన సంభాషణ ఇది.

కైసర్ : ముహమ్మద్ వంశం ఎలాంటిది?

అబూసుఫ్యాన్: మర్యాదస్తుల వంశం

ఆ జవాబు విని హెరక్లియస్ "నిజమే. ప్రవక్తలు ఉన్నత కుటుంబాలకు చెందినవారే అయివుంటారు. దానివల్ల ప్రజలు ప్రవక్తల్ని అనుసరించటంలో ఎలాంటి ఆటంకం లేకుండా ఉంటుంది" అన్నాడు.

కైసర్ : ముహమ్మద్ కన్నా ముందు మీ అరబ్బుదేశంలో ఎవరయినా తాను దైవప్రవక్తనని దావా చేశాడా?

అబూ : "లేదు."

"ఎవరైనా దావాచేసివుంటే ముహమ్మద్ అతన్ని అనుసరిస్తున్నాడనో లేక పోటీచేస్తున్నాడనో అనుకునేవాణ్ణి" హెరక్లియస్ తల పంకిస్తూ అన్నాడు.

కైసర్ : ముహమ్మద్ ప్రవక్త కాక ముందు ఎప్పుడైనా అబద్ధం చెప్పాడా? అతను అబద్ధాలు చెబుతాడనే నిందారోపణ ఎన్నడన్నా జరిగిందా?

అబూ : లేదు

"ప్రజలతో అబద్ధం పలకని వ్యక్తి దేవుని విషయంలో అబద్ధం చెప్పగలడా"? అన్నాడు హెరక్లియస్.

కైసర్ : అతని పూర్వీకుల్లో రాజులైనవారు ఎవరైనా ఉన్నారా?

అబూ : "లేరు"

దానికి హెరక్లియస్, "ఒకవేళ ఉన్నట్లయితే ఈయన ఈ ప్రవక్త పదవి ముసుగులో తన పూర్వీకుల రాజ్యాధికారాన్ని తిరిగి చేజిక్కించుకోవటానికి ప్రయత్నిస్తున్నాడని అనుకునేవాణ్ణి" అన్నాడు. తను ఆశించిన సమాధానాలే లభిస్తున్నాయి అతనికి.

కైసర్ : ముహమ్మద్‌ను అనుసరించే వారిలో నిరుపేదలు, నిస్సహాయులు, ఎక్కువగా ఉన్నారా లేక ధనమంతులు, బలవంతులు ఎక్కువగా ఉన్నారా?

అబూ : నిరుపేదలు, నిస్సహాయులే ఎక్కువగా ఉన్నారు.

"ప్రవక్తల్ని ముందుగా అభాగ్యులు, నిరుపేదలే అనుసరిస్తారు" హెరక్లియస్ మళ్ళీ ధృవీకరించాడు.

కైసర్ : ముహమ్మద్‌ను అనుసరించేవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్నదా లేక తరుగుతున్నదా?

అబూ : పెరుగుతున్నది.

"విశ్వాసం ప్రత్యేకత అదే. అది దినదిన ప్రవర్ధమానమవుతూ పరిపూర్ణతకు చేరుకుంటుంది" హెరక్లియస్ ముఖారవిందం విప్పారుతోంది.

కైసర్ : ఇస్లాం స్వీకరించిన తరువాత ఎవరైనా వెనక్కి మళ్ళి పోయాడా?

అబూ : 'లేదు'.

హెరక్లియస్ నవ్వుతూ అన్నాడు. "విశ్వాస మాధుర్య ప్రభావం అదేమరి. ఒకసారి విశ్వాసం మనిషి మనసులోకి ప్రవేశించి ఆత్మను ప్రభావితం చేయగలిగిందంటే ఇక అది వీడిపోయే ప్రసక్తే ఉండదు".

కైసర్ : ముహమ్మద్ ఎప్పుడన్నా ఒప్పందం చేసుకొని దాన్ని భంగపరిచాడా?

అబూ : ఇప్పటి వరకయితే అలాంటిదేమీ జరగలేదు. కాని ఈ యేడు ఆయనతో మాకు ఓ ఒప్పందం జరిగింది. దాని పరిణామం ఎలా ఉంటుందో చూడాలి.

www.abulhasanalinadwi.org

అబూ సుఫ్యాన్ ఇలా తెలియజేశారు. "నేను కైసర్‌తో చేసిన సంభాషణలో ఈ ఒక్కమాట మాత్రం ఎక్కువ మాట్లాడగలిగాను. అయినా కైసర్ దాన్ని కూడా పట్టించుకోలేదు. పైగా "ప్రవక్తలు ప్రమాణ భంగానికి పాల్పడరు. ప్రాపంచిక సుఖసౌఖ్యాలకోసం జీవించేవారే అలాంటి పనిచేస్తారు. ప్రవక్తలు ప్రాపంచిక సుఖసౌఖ్యాల్ని కోరుకోరు అంటూ ముహమ్మద్ (సల్లం)నే సమర్థించాడు."

కైసర్ : మీరెప్పుడయినా అతనితో యుద్ధం చేశారా?

అబూ : "చేశాం"

కైసర్ : ఎవరు గెలిచారు?

అబూ : "ఒకసారి వారు గెలిచారు, మరోసారి మేము గెలిచాం".

హెరక్లియస్ మళ్ళీ ముహమ్మద్ (సల్లం)నే సమర్థిస్తూ, "దైవప్రవక్తల విషయంలో ఇలాగే జరుగుతుంది. యుద్ధాల్లో దైవ సహాయం, విజయం చివరికి వారికే ప్రాప్తిస్తాయి" అన్నాడు.

కైసర్ : అసలు ఆయన ఇచ్చే సందేశం ఏమిటి?

అబూ : ఒకే దేవుణ్ణి పూజించాలి. పూర్వీకుల బహుదైవారాధనా మతాన్ని విడిచిపెట్టి, నమాజ్, ఉపవాసాలు పాటించాలి. ఎల్లప్పుడూ సత్యం పలకాలి. సౌశీల్యవంతమైన జీవితం గడపాలి, బంధువుల పట్ల సత్సంబంధాలను కలిగి ఉండాలి. ఇదే ఆయన ఇచ్చే సందేశం.

ఆ సమాధానం విని హెరక్లియస్, "ఈసా తరువాత రాబోయే ప్రవక్త గురించి చెప్పబడిన లక్షణాలన్నీ ముహమ్మద్‌లో ఉన్నాయి. ఒక ప్రవక్త రానున్నాడని నాక్కూడా తెలుసు. కాని ఆ ప్రవక్త అరబ్ దేశంలో ఉదయిస్తాడని నేనెన్నడూ అనుకోలేదు. అబూ సుఫ్యాన్! నువ్వు చెప్పిన సమాధానాలన్నీ నిజమే అయితే ఏదో ఒక రోజు ఆయన ప్రస్తుతం నేను కూర్చొని ఉన్న (సిరియా, బైతుల్ మఖ్దిస్) ప్రాంతాలను కూడా జయిస్తాడు. నాకు ఆయన దగ్గరికెళ్ళి, ఆయన కాళ్ళు కడగాలనిపిస్తోంది" అన్నాడు.

అబూ సుఫ్యాన్ ఇలా తెలియజేశారు: ఆ తర్వాత నిండుసభలో దైవప్రవక్త (సల్లం) పంపిన లేఖ చదివి వినిపించటం జరిగింది. అది వినగానే అతని ఆ స్థాన సభ్యులందరూ గోలచేయటం మొదలుపెట్టారు.

www.abulhasanalinadwi.org

మమ్మల్ని దర్బారు నుండి బయటికి పంపించేశారు. ఆ రోజే నాకు, ఎప్పటికయినా నేను అవమానం పాలవుతానని, దైవప్రవక్తే విజయం సాధిస్తారన్న నమ్మకం కలిగింది.[1]

## ఈరాన్ చక్రవర్తికి లేఖ

ఖుస్రూ పర్వేజ్ కిస్రా ఈరాన్ చక్రవర్తి. అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా అతని దగ్గరికి రాయబారిగా దైవప్రవక్త (సల్లం) లేఖ తీసుకొనివెళ్ళారు. ఆ లేఖలో ఇలా వ్రాసి ఉంది:

> "దైవప్రవక్త ముహమ్మద్ తరపు నుండి పారశీకపెద్ద కిస్రాకు ఈ లేఖ. సన్మార్గంపై నడిచే వానిపై, దేవుడు, దైవప్రవక్తను విశ్వసించిన వానిపై, దేవుడు తప్ప వేరొక ఆరాధ్యుడులేడని, ముహమ్మద్ దైవప్రవక్త అని సాక్ష్యం చెప్పేవానిపై శాంతి కల్గుగాక! నేను నిన్ను దైవ సందేశం వైపునకు ఆహ్వానిస్తున్నాను. నేను దైవప్రవక్తను. మానవులందరి కోసం నేను పంపబడ్డాను. నేను బ్రతికున్న వారికి దైవశిక్ష గురించి భయపెడతాను. ఇక ఎవరైనా తిరస్కరించినా అతనిపై దేవుని బాధ్యత మాత్రం తీరిపోతుంది. నువ్వు ఇస్లాం స్వీకరిస్తే ప్రశాంతంగా ఉంటావు. లేదా నీ ప్రజల్లో అగ్నిపూజ చేసేవారందరి పాపం నీ నెత్తిమీదే పడుతుంది."

ఖుస్రూ ఆ ఉత్తరం చదవగానే దాన్ని చించిపారేశాడు. ఆగ్రహంతో హూంకరిస్తూ, "నా పాలిత ప్రజల్లోని ఒక నీచుడు నాకే ఉత్తరం వ్రాసి నాపేరు కంటే ముందు తనపేరు రాసుకుంటాడా?" అంటూ పళ్లు పటపటా కొరికాడు.

ఖుస్రూ బాజాన్ అనేవాడు ఎమన్ దేశంలో ఖుస్రూ చక్రవర్తికి ప్రతినిధి (వైస్రాయ్)గా ఉండేవాడు. అధబ్బు దేశమంతా అతని ఆధీనంలోనే ఉండేది. ఖుస్రూ చక్రవర్తి ఆ ప్రవక్తను తన వద్దకు బంధించి తీసుకొని రమ్మని తన ప్రతినిధికి ఉత్తర్వు ఇచ్చాడు.

బాజాన్ ఆ పని కోసం ఒక సైనిక దళాన్ని ఏర్పాటు చేశాడు. ఆ

1) సహీహ్ బుఖారీలోని వహీ అవతరణ ప్రారంభ ప్రకరణం సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం.

www.abulhasanalinadwi.org

సైనికదళ అధిపతి పేరు ఖుర్‌ఖుస్రహ్. బాజాన్ దైవప్రవక్త (సల్లం)ను పట్టుకురావటం కోసం బాబ్‌వేహ్ అనే ఓ అధికారిని కూడా నియమించాడు. ముఖ్యంగా బాబ్‌వేహ్‌తో దైవప్రవక్త (సల్లం)పై గట్టి నిఘా ఏర్పాటు చేయమని, ఆయన్ని కిస్రా చక్రవర్తికి అప్పగించమని, ఒకవేళ ఆయన వెంట రావటానికి నిరాకరిస్తే వెంటనే తనకు కబురుచేయమని చెప్పి పంపించాడు.

ఆ అధికారి మదీనాచేరుకొని దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళాడు. ఆయన అతన్ని మరునాడు రమ్మని చెప్పి పంపించాడు. మరునాడు అతను మళ్ళీ దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) అతనితో, "దేవుడు రాత్రి మీరాజుని చంపేశాడు. కావాలంటే వెళ్ళి కనుక్కో" అన్నారు. అధికారి ఆ మాట విని వెంటనే ఎమన్‌కు వెళ్ళాడు. అప్పటికే ఎమన్ వైస్రాయ్‌కు అధికారికంగా యువరాజు షేర్‌వేహ్ రాజు ఖుస్రూను హత్యచేసి సింహాసనాన్ని అధిష్ఠించాడన్న వార్త అందింది.

ఇక అప్పటి నుండి ఎమన్ వైస్రాయ్ అయిన బాజాన్ దైవప్రవక్త (సల్లం) నీతి నడవడికలు, హితోపదేశాల గురించి దర్యాప్తు మొదలుపెట్టాడు. పూర్తి వివరాలు సేకరించిన తరువాత ఇస్లాం సత్యధర్మమని గ్రహించి ముస్లిం అయిపోయాడు. అతని రాజ్యంలోని చాలామంది ప్రజలు కూడా ఇస్లాం స్వీకరించారు.[1]

దైవప్రవక్త (సల్లం) తరపున పంపబడిన రాయబారి తిరిగొచ్చి ఈరాన్ చక్రవర్తి దైవప్రవక్త లేఖను ముక్కలుముక్కలుగా చించివేశాడని చెప్పారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం), "నిజానికి అతను తన రాజ్యాన్నే ముక్కలు చేసుకున్నాడు" అన్నారు.[2]

బుధజనులారా! ఈ సంఘటనకు నాలుగైదు వేల సంవత్సరాల ముందు నుంచీ ఈరాన్ దేశం దాదాపు సగం ప్రపంచంపై ఆధిపత్యం చెలాయిస్తూ వచ్చింది. ఆ కాలంలో ఈరాన్ రాజ్యం సాధించిన విజయాలు రోమ్, గ్రీకు రాజ్యాల విజయాలను తలదన్నేలా ఉండేవి. కాని ఒక్కసారి దైవప్రవక్త (సల్లం) ఈరాన్ గురించి పలికిన పలుకులను పురస్కరించుకొని ఆ తరువాతి పధ్నాలుగు వందల సంవత్సరాల చరిత్రను పరిశీలించండి. ఇప్పుడు దాని నామరూపాలైనా కానవస్తున్నాయా!?

---

1) తారీఖె తబ్రీ రెండో సంపుటి 133వ పుట.
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

# ఖైబర్ ప్రతిఘటన

మదీనా నుండి సిరియా వెళ్ళే దారిలో మూడు మజిలీల దూరాన ఉన్న ప్రాంతమే ఖైబర్. ఇది ప్రత్యేకంగా యూదుల నివాస ప్రాంతం. అక్కడ జనవాసాల చుట్టూ పటిష్టమైన కోటలు నిర్మించబడి ఉండేవి.[1]

దైవప్రవక్త (సల్లం) మదీనా ప్రయాణం నుండి తిరిగొచ్చిన తర్వాత కొద్దిరోజులకే ఖైబర్ యూదులు తిరిగి మదీనాపై దాడి చేయటానికి కుట్రలు పన్నుతున్నారని తెలిసింది. దానికోసం వారు బనూ గిత్ఫాన్ తెగకు చెందిన నాలుగువేల మంది సైనికుల్ని కూడా కలుపుకున్నారు. మదీనాపై విజయం సాధిస్తే పండిన పంటలో సగభాగం ఎల్లకాలం గిత్ఫాన్ తెగ వారికి ఇచ్చే షరతుపై ఇరుపక్షాల మధ్య ఒప్పందం కుదిరింది.[2]

ఈ యుద్ధం కోసం దైవప్రవక్త (సల్లం) తన అనుచరుల్లో "విశ్వాసులు వృక్షం క్రింద నీతో విధేయతా ప్రమాణం చేస్తున్నప్పుడు, అల్లాహ్ వారిని చూసి ఆనందించాడు." "అల్లాహ్ మీకు అమితమైన విజయధనాల వాగ్దానం చేస్తున్నాడు. వాటిని మీరు పొందుతారు" అన్న దివ్యఖురాన్ శుభవార్తను అందుకున్నవారినే ఎన్నుకున్నారు. వీళ్ళు మొత్తం పదహారు వందలమంది సైనికులు. వారిలో రెండొందలమంది రౌతులున్నారు.[3]

ముస్లింలసైన్యం ఖైబర్ ప్రాంతం సమీపానికి చేరుకునేసరికి చీకటిపడింది. దైవప్రవక్త (సల్లం) రాత్రిపూట యుద్ధం ప్రారంభించేవారు కారు. చీకట్లో శత్రువులపై దాడిచేసేవారు కారు. అందుకే ముస్లిం సైన్యాలు ఖైబర్ ప్రాంతానికి వెలుపల మైదానంలోనే తమ గుడారాలు

---

1) సీరత్ హుల్‌బియా రెండో సంపుటి 726వ పుట.
2) సీరతున్నబీ గ్రంథం మొదటి సంపుటి 478వ పుట.
3) సీరత్ హుల్‌బియా రెండో సంపుటి 726వ పుట.

వేసుకున్నాయి.[1] ఆ మైదానం ఖైబర్‌కు, బనూ గిత్‌ఫాన్ ప్రాంతానికి మధ్యలో ఉంది. ముస్లింలు అక్కడ ఆగటం ఒక విధంగా వారి మంచికే అయింది. ఎందుకంటే ఖైబర్ యూదులకు సహాయం చేద్దామని బయలుదేరిన గిత్‌ఫాన్ తెగ సైనికులకు ముస్లిం సైన్యాలు అడ్డు తగిలాయి. దాంతో వారు తోక ముడుచుకొని ఇండ్లకు తిరిగి వెళ్ళిపోయారు.[2]

దైవప్రవక్త (సల్లం) అన్నిటికన్నా ముందు ఖైబర్ కోటల వైపు దృష్టి సారించారు. ఒక్కొక్క కోటను జయిస్తూ పోయారు. ఒక కోటలో ప్రఖ్యాత యూద రౌతు అయిన మర్‌హబ్ సింహాసనం ఉండేది. ఆ కోటను హజ్రత్ అలీ (రజి) నేలమట్టం చేశారు. ఆ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ముస్లింలు యూదుల కోటల్లోని ఒక కోటను జయించలేకపోతున్నారు. ఆ కోటపై వారికి పట్టు లభించటం లేదు. ఆ సమయంలో హజ్రత్ అలీ కళ్ళు నలతగా ఉన్నాయి. ఆ సందర్భంలోనే దైవప్రవక్త (సల్లం) "రేపు నేను యుద్ధపతాకం దేవునికి, దైవప్రవక్తకు అభిమానపాత్రుడైన వ్యక్తికి ఇస్తాను. అతని చేతుల మీదుగానే దేవుడు విజయాన్ని ప్రసాదిస్తాడు" అని ప్రకటించారు. దైవప్రవక్త (సల్లం) నోట ఆ ప్రశంస వినగానే సైన్యంలోని గొప్పగొప్ప యోధులందరూ ఆ అదృష్టం తమకే దక్కాలని ఉవ్విళ్ళూరారు.

తెల్లవారిన తరువాత దైవప్రవక్త (సల్లం) "అలీ ఏడి?" అని అడిగారు. ప్రజలు ఆయన కండ్ల కలకతో బాధపడుతున్నారని చెప్పారు. అలీ ఆ కండ్ల కలకతోనే దైవప్రవక్త (సల్లం) దగ్గరకి వచ్చారు. దైవప్రవక్త (సల్లం) ఆయన కళ్ళకు తన లాలాజలాన్ని పూశారు. ఆశ్చర్యంగా ఆయన కళ్ళు నయమయిపోయాయి. కళ్ళల్లోని ఎరుపుదనం పోయింది. నొప్పి కూడా తగ్గింది. ఆ తర్వాత అలీని ఉద్దేశించి ఆయన, "అలీ! వెళ్ళు. దైవమార్గంలో పోరాడు. ముందు వారికి ఇస్లాం సందేశం వినిపించు, ఆ తర్వాతే యుద్ధం చెయ్యి, అలీ! నీ చేతుల మీదుగా ఒక్కడు ఇస్లాం

---

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.
2) సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 330వ పుట.

www.abulhasanalinadwi.org

స్వీకరించినా అది భారీఎత్తున లభించే విజయ ధనాల కన్నా చాలా గొప్ప భాగ్యంతో సమానం" అన్నారు.[1]

హజ్రత్ అలీ ముందుగా నాయిం కోటపై దాడిచేసేందుకు వ్యూహరచన చేశారు. ఆ కోటలోని ప్రముఖ నాయకుడయిన మర్‌హబ్ ఆయన్ని మార్కొనడానికి వచ్చాడు. తాను వెయ్యిమంది వీరులకు సమానుడనని అతను గొప్పలు చెప్పుకునేవాడు. అతను యుద్ధ మైదానంలోకి దిగగానే కవితాధోరణిలో ఈ విధంగా పొలికేక వేశాడు.

"నేను ఆయుధ ధారినని, వీర, శూర అనుభవశాలి
అయిన మర్‌హబ్‌నని ఖైబర్‌కు తెలుసు. నా
శౌర్యాన్ని చూస్తే ప్రజలు సొమ్మసిల్లిపోతారు."

అతణ్ణి మార్కొనడానికి ముస్లింల తరఫు నుండి ఆమిర్ బిన్ అక్వా ఇలా అంటూ బయలుదేరారు.

"ఖైబర్‌కు నా గురించి కూడా తెలుసు. నేను
ఆయుధాలు త్రిప్పటంలో ఉస్తాదును, ఘటికుడను,
అరివీర భయంకరుణ్ణి."

మర్‌హబ్ ఖడ్గంతో ఆయన మీద దాడిచేశాడు. ఆమిర్ డాలుతో అతని దెబ్బను నిలువరించారు. ఆ తర్వాత తనే అతని క్రిందిభాగాలపై ఖడ్గం ఝుళిపించబోయారు.కాని ఆయన ఖడ్గం పొడవు తక్కువగా ఉండటం చేత అది తిరిగొచ్చి ఆయన మోకాలికే తగిలింది. ఆ నొప్పితోనే ఆయన చివరికి అమరగతి నొందారు. ఆ తర్వాత హజ్రత్ అలీ అతన్ని ఎదుర్కోవటానికి యుద్ధభూమిలోకి వచ్చారు. ఆ అరివీరభయంకరుని కేకలతో యుద్ధభూమి దద్దరిల్లింది.

"మా అమ్మ నాకు భయంకరమైన సింహం అని పేరు పెట్టింది.
నేను అడవి సింహాలకన్నా భయంకరుణ్ణి.
దాతృత్వంలో నాది ఎముకలేని చెయ్యి.

హజ్రత్ అలీ తన ఖడ్గంతో ఒకే ఒక్క వేటు వేశారు. అంతే మర్‌హబ్

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం, సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం.

www.abulhasanalinadwi.org

నేలకొరిగి గిలగిల తన్నుకుంటూ ప్రాణం విడిచాడు. దాంతో ఖైబర్ ప్రాంతమంతా ముస్లింల వశమయింది.[1]

ఖైబర్ యుద్ధంలోనే జరిగిన సంఘటన. ఒక నీగ్రో జాతి బానిస తన యూద యజమాని దగ్గర మేకలు కాసేవాడు. ఒకరోజు అతను యూదులు యుద్ధ సన్నాహాలు చేసుకోవటం చూసి తనకు తెలిసిన కొందరు యూదుల్ని విషయమేమిటని అడిగాడు. దైవప్రవక్త అని చెప్పుకుంటున్న వ్యక్తిపై యుద్ధం చేయటానికి వెళుతున్నామని చెప్పారు వారు. అప్పట్నుంచి అతనిలో దైవప్రవక్త (సల్లం)ను కలవాలన్న ఆసక్తి మొదలయింది. ఒకరోజు మేకల మందను తోలుకొని దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళాడు. దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ, "తమరిచ్చే సందేశం ఏమిటి?" అని అడిగాడు.

"నేను ప్రజల్ని ఇస్లాం ధర్మం వైపునకు ఆహ్వానిస్తున్నాను. అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడనీ, నేను దైవప్రవక్తనని సాక్ష్యం ఇవ్వు. దేవుణ్ణి తప్ప ఇతరులనెవ్వరినీ ఆరాధించకు" అని దైవప్రవక్త (సల్లం) ఆ వ్యక్తికి బోధించారు.

> "ఆ విధంగా సాక్ష్యం చెప్పి దైవాన్ని విశ్వసిస్తే నాకేం దొరుకుతుంది?" ఎంతో ఆత్రుతగా అడిగాడావ్యక్తి. "నువ్వు జీవితాంతం దానికి కట్టుబడి ఉంటే నీకు స్వర్గం దొరుకుతుంది" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఆ మాట విని ఆ బానిస ఇస్లాం స్వీకరించాడు. కాని తన దగ్గర మేకల మంద ఉంది. అది తన యజమాని అయిన ఓ యూదుని అప్పగింత. ఇస్లాం ధర్మం ప్రకారం ఎవరి అప్పగింత అయినా సరే అందులో నమ్మకద్రోహానికి పాల్పడకూడదు. అంచేత అతను ఆ మేకల్ని ఏం చేయాలని దైవప్రవక్త (సల్లం)ను అడిగాడు. "వాటిని యజమాని ఇంటికి తోలి వాటి వెనుక కంకర్రాళ్ళు విసురు. అల్లాహ్ వాటిని నీ యజమానికి అప్పజెబుతాడు" అన్నారు దైవప్రవక్త.

అతను దైవప్రవక్త (సల్లం) చెప్పినట్లే చేశాడు. మేకలు యజమాని దగ్గరికి చేరుకున్నాయి. మేకల వెంట బానిస లేకపోవటం చూసి అతను

---

1) సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం.

www.abulhasanalinadwi.org

ఇస్లాం స్వీకరించి ఉంటాడని యాజమానికి అర్థమయిపోయింది.

ఆ తర్వాత కొన్నాళ్ళకు దైవప్రవక్త (సల్లం) తన అనుచరులకు హితబోధ చేస్తూ యుద్ధసన్నాహాలు మొదలెట్టమని ఆదేశించారు. ముస్లింలకు, అవిశ్వాసులకు మధ్య యుద్ధం జరిగింది. యుద్ధానంతరం చూస్తే అమరగతుల్లో ఆ బానిస కూడా కనిపించాడు. ప్రజలు అతని శవాన్ని ఓ గుడారంలోకి తీసుకొని వెళ్ళారు. అతని శవాన్ని చూసి దైవప్రవక్త (సల్లం), "దేవుడు ఈ బానిసను కరుణించాడు, ఇతనిపై మహాభాగ్యాన్ని ప్రసాదించాడు. నేను ఇతని తల దగ్గర ఇద్దరు స్వర్గకన్యల్ని చూశాను. మరి చూడబోతే ఇతనికి ఒక్క సారన్నా నమాజ్ చేసి దైవ సన్నిధిలో మోకరిల్లే అవకాశం రాలేదు" అన్నారు.[1]

అలాంటిదే ఇంకొక సంఘటన.

ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి, "దైవప్రవక్తా! నేను నల్లగా, అందవికారంగా ఉన్నాను. శరీరం కంపుకొడుతోంది. నా దగ్గర ధనం కూడా లేదు. ఈ స్థితిలో నేను యూదులతో పోరాడి చనిపోతే నాకు స్వర్గం లభిస్తుందా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "లభిస్తుంద"ని సమాధానం చెప్పారు. ఆ మాట వినగానే ఆ వ్యక్తి శత్రు సేనల్లోకి దూసుకువెళ్ళి వీరోచితంగా పోరాడుతూ అమరగతినొందాడు. దైవప్రవక్త (సల్లం) అతని శవం దగ్గరికి వెళ్ళి, "దేవుడు నీ ముఖారవిందాన్ని తేజోమయం చేశాడు. నీ శరీరం నుండి సుగంధాల్ని గుభాళింపజేశాడు. నీకు ఎంతో సంపద ఇచ్చాడు" అంటూ తన అనుచరుల్ని ఉద్దేశించి, 'స్వర్గ కన్యల్లో ఇతనికి ఇద్దరు భార్యలున్నారని చెప్పారు.[2]

ఖైబర్ యుద్ధానికి ముందు ఒక పల్లెటూరి వ్యక్తి దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి, ఇస్లాం స్వీకరించి ఆయన అనుచరుల్లో కలిసిపోయాడు. ఆయన అతన్ని ఒక అనుచరునికి అప్పగించి అతనికి విద్యాశిక్షణలు గరపమని ఆదేశించారు. ఆ సమయంలోనే ఖైబర్ యుద్ధం జరిగింది. యుద్ధంలో ముస్లింలకు యూదుల కోటల నుండి కొంత ధనం హస్తగతమయింది. దైవప్రవక్త (సల్లం) యుద్ధప్రాప్తిలో ఆ పల్లెవాసికి కూడా

1) దలాయిలున్నుబువ్వా నాల్గో సంపుటి 219వ పుట.
జాదుల్ మఆద్ మూడో సంపుటి 323వ పుట.

2) దులాయిలున్ను బువ్వా నాల్గో సంపుటి 221వ పుట.
జాదుల్ మఆద్ మూడో సంపుటి 324వ పుట.

www.abulhasanalinadwi.org

వాటాను కేటాయించారు. ఆ సమయంలో ఆ పల్లెటూరి వ్యక్తి తన మిత్రుల ఒంటెల్ని కాయటానికి పొలం వెళ్ళి ఉన్నాడు. తిరిగొచ్చిన తరువాత ప్రజలు అతనికి తన వాటా ధనం అప్పగించారు. అతను ఆ ధనం తీసుకుని దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళి, "దైవప్రవక్తా! ఏమిటది?" అని ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇది నీ వాటాలో వచ్చిన ధనం" అని చెప్పారు దైవప్రవక్త (సల్లం) "దైవప్రవక్తా! నేను దీనికోసం ఇస్లాం స్వీకరించలేదు. (తన గొంతు వైపు చూపెడుతూ) నేను ఇస్లాం స్వీకరించింది ఇక్కడ శత్రువుల బాణాలు గుచ్చుకొని ప్రాణాలు విడిచి స్వర్గం పొందటానికి" పల్లెటూరి వ్యక్తి ఆ ధనం పట్ల నిరాసక్తతను వెలిబుచ్చుతూ అన్నాడు.

"నీ కోరికే నిజమయితే దేవుడు నీ కలను సాకారం చేసి చూపిస్తాడు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఖైబర్ యుద్ధంలో ఆ పల్లెటూరి వ్యక్తి శత్రువులతో పోరాడుతూ మరణించాడు. ప్రజలు అతని శవాన్ని దైవప్రవక్త (సల్లం) దగ్గరికి తీసుకొని వచ్చారు. దైవప్రవక్త (సల్లం) అతని శవం వంక చూసి,

"ఇతను ఆ పల్లెటూరి వ్యక్తేనా?" అన్నారు.

"ఔను, దైవప్రవక్తా!" అని ప్రజలు సమాధానమిచ్చారు.

"ఇతను మనస్ఫూర్తిగానే అమరత్వాన్ని కోరుకున్నాడు. అందుకే దేవుడు అతని కోరికను నెరవేర్చాడు" అని చెప్పారు దైవప్రవక్త (సల్లం).

దైవప్రవక్త (సల్లం) అతని శవానికి అతను తొడుక్కొని ఉన్న చొక్కాతోనే ఖనన సంస్కారాలు చేశారు. ఆ తర్వాత అతని శవాన్ని అందరికన్నా ముందు ఉంచి నమాజ్ చేయించారు. అతని కోసం ప్రార్థిస్తూ "దేవా! ఈ నీ దాసుడు నీ మార్గంలో బయలుదేరి అమరగతినొందాడు. దానికి నేను సాక్షిని" అన్నారు.[1]

యుద్ధం తర్వాత ముస్లింలు ఖైబర్ ప్రాంతంలోని సేద్యపు భూముల్ని స్వాధీనం చేసుకున్నారు. కాని యూదులు ఆ సేద్యపు భూముల్ని తమ అధీనంలోనే ఉంచుకొని, పండిన పంటలో సగభాగం

1) సుననె నసాయి నాల్గో సంపుటి 60వ పుట. ముస్తద్రక్ హాకిమ్ మూడో సంపుటి 495వ పుట. దలాయిలున్నుబువ్వా నాల్గో సంపుటి 221వ పుట.

www.abulhasanalinadwi.org

ముస్లింలకు ఇస్తామని విన్నవించుకోగా దైవప్రవక్త (సల్లం) వారి విన్నపాన్ని అంగీకరించారు.[1]

పంట చేతికొచ్చినప్పుడు దైవప్రవక్త (సల్లం) అబ్దుల్లాహ్ బిన్‌రవాహాను యూదుల దగ్గరికి పంపేవారు. ఆయన పండిన పంటను రెండు భాగాలుగా చేసి యూదులతో తాము కోరుకున్న భాగం తీసుకోమని చెప్పేవారు. యూదులు ఆ ఉదారవైఖరికి, న్యాయశీలతకు అమితంగా ప్రభావితులయ్యేవారు. ఇలాంటి న్యాయం వల్లనే భూమ్యాకాశాలు నిలిచి ఉన్నాయంటూ ఇస్లామీయ న్యాయ వ్యవస్థను కొనియాడేవారు.[2] ఖైబర్ ప్రాంతం ఆ యుద్ధంలో పాల్గొన్న యోధులకు పంచిపెట్టడం జరిగింది.[3]

ఆ కాలంలోనే ఎమన్ దేశానికి చెందిన అష్‌అరీ తెగవారు సుమారు యాభై అరవై మంది ఒక పడవ ద్వారా ప్రయాణించి అబిసీనియా వెళ్ళారు. అక్కడ వారికి జాఫర్ బిన్ అబూతాలిబ్, ఆయన మిత్రులు కలిశారు.

హజ్రత్ జాఫర్ వారితో, "దైవప్రవక్త (సల్లం) మమ్మల్ని ఇక్కడికి పంపించారు. ఇక్కడే ఉండమని ఆదేశించారు. మీరు కూడా మాతో పాటే ఉండండి" అన్నారు. జాఫర్ విన్నపం మేరకు ఆ అష్‌అరీలు కూడా అబిసీనియాలో ఉండటానికి అంగీకరించారు. ఆ తర్వాత కొంత కాలానికి వాళ్ళంతా కలిసి తిరిగి దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళారు. జాఫర్ గొంతు వినగానే దైవప్రవక్త (సల్లం) స్వయంగా ఆయనకు ఎదురేగి స్వాగతం పలికారు. ఆయన నుదుటిపై ముద్దుపెట్టుకొని "దైవసాక్షి! నాకు ఇంత ఆనందం ఖైబర్ విజయం వల్ల కలుగుతున్నదో లేక జాఫర్ వచ్చినందుకు కలుగుతున్నదో అర్థం కావటం లేదు" అన్నారు. ఆ తర్వాత ఖైబర్ యుద్ధప్రాప్తిలో ఆ వచ్చినవారికి కూడా భాగాలు కేటాయించారు.[4]

ఖైబర్ యుద్ధం జరిగిన రోజుల్లోనే ఒక యూద స్త్రీ దైవ ప్రవక్త (సల్లం) కు విషం పెట్టి చంపాలని ప్రయత్నించింది. సల్లాం బిన్ ముష్కమ్ అనే యూదుని భార్య జైనబ్. ఆమె దైవప్రవక్త (సల్లం) ను గురించి తెలిసిన వారి ద్వారా ఆయన మేక భుజానికుండే మాంసాన్ని ఎక్కువ

---

1) సుననె అబూదావూద్‌లోని పన్నులు, పదవుల ప్రకరణం.
2) ఫుతూహుల్ బుల్‌దాన్ గ్రంథం 34వ పుట.
3) అబూదావూద్‌లోని పన్నులు, పదవుల ప్రకరణం.
4) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం, సహీహ్ ముస్లింలోని మహిమోన్నతల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

యిష్టంగా తింటారని తెలుసుకుంది. దాని ప్రకారం దైవప్రవక్త (సల్లం)ను హత్యచేయటానికి వ్యూహం పన్నింది. ఒక మేకను సొంతం వేయించి దాని భుజానికున్న మాంసంలో విషం కలిపి పెట్టింది. యూదులు దైవప్రవక్త (సల్లం)ను విందుకు ఆహ్వానించి అయన ముందు ఆ మేక మాంసం ఉంచారు. దైవప్రవక్త (సల్లం) ఆ మాంసం తీసుకొని తినాలని చెయ్యి పెట్టగానే దేవుడు ఆ చెయ్యిద్వారానే ఆయనకు అందులో విషం కలిపి వున్న సంగతి తెలియపరచాడు. ఆయన యూదుల్ని పిలిచి మాంసంలో విషం పెట్టిన సంగతి అడిగారు. తామే పెట్టామని ఒప్పుకున్నారు యూదులు. ఎందుకు పెట్టారని అడిగితే, దానికి సమాధానంగా వారు, మీరు దైవప్రవక్త కాకపోతే ఈ విషం తిని మరణిస్తారు. దాంతో మాకు విముక్తి లభిస్తుంది. ఒకవేళ మీరు నిజంగానే దైవప్రవక్త అయితే ఆ విషం వల్ల మీకు ఏ హానీ జరగదు. అలా ఆలోచించుకునే మాంసంలో విషం కలిపాం" అన్నారు. ఆ తర్వాత ఈ పథకానికి అసలు సూత్రధారి అయిన స్త్రీని ఆయన దగ్గర హాజరుపరచటం జరిగింది. ఆమె మాత్రం తాను దైవప్రవక్తను చంపే ఉద్దేశ్యంతోనే విషం కలిపానని మొండిగా సమాధానమిచ్చింది. ఆమె సమాధానం విని దైవప్రవక్త (సల్లం) 'దేవుడు ఎన్నటికీ నీకు అలాంటి అవకాశం కల్పించడు' అన్నారు. ఆయన అనుచరులు ఆ స్త్రీని హతమారుస్తామన్నారు. కాని దైవప్రవక్త (సల్లం) స్వయంగా వారిని వారించారు.[1]

అంతకు ముందు ముస్లింలు ఖురైషులతో హుదైబియా ప్రాంతం లో మరు సంవత్సరం దైవప్రవక్త (సల్లం) తన అనుచరుల సమేతంగా మక్కా వచ్చి ఉమ్రా యాత్ర చేస్తారని మూడ్రోజుల వరకు అక్కడే విడిది చేస్తారని ఒప్పందం చేసుకొని ఉన్నారు.[2] అంచేత దైవప్రవక్త (సల్లం) ఆ యేడు ఉమ్రా చేయాలని నిశ్చయించుకొని గత సంవత్సరం హుదైబియా ఒప్పందంలో పాల్గొన్న వారందరూ ఈ యేడు తప్పకుండా ఉమ్రా చేయాలని ప్రకటించారు. దాంతో ఆ మధ్యకాలంలో చనిపోయిన వారు మినహా మిగతా వారందరూ ఉమ్రాయాత్ర చేసే భాగ్యానికి నోచుకున్నారు.[3]

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.
3) సీరత్ ఇబ్నె కసీర్ మూడో సంపుటి 429వ పుట.

www.abulhasanalinadwi.org

హుదైబియా ఒప్పందంలో ముస్లింలు మక్కా వచ్చినప్పుడు ఆయుధాలు ధరించి రాకూడదనే షరతు ఉంది. అందుకని ముస్లింలు తమ ఆయుధాలన్నీ మక్కాకు ఎనిమిది మైళ్ల దూరంలోనే యాజుహ్ అనే లోయలో ఉంచి వెళ్ళారు. రెండొందల రౌతులతో కూడిన ఒక సైనిక పటాలాన్ని ఆయుధాల రక్షణ కోసం నియమించారు.[1] దైవప్రవక్త (సల్లం) 'లబ్బైక్' అని నినదిస్తూ బయలుదేరారు. అబ్దుల్లాహ్ బిన్ రవాహా ఆయన ఒంటె ముకుతాడు పట్టుకొని ఈ గేయం పాడుతూ ముందుకు నడవసాగారు:

"అవిశ్వాసులారా! అడ్డం తొలగిపోండి

ఈ రోజు గనక మమ్మల్ని అడ్డుకుంటే

మీ తలలు పిట్టల్లా ఎగిరిపోతాయి.

చెట్టుకొకరు, పుట్టకొకరు అయిపోతారు జాగ్రత్త![2]

దైవప్రవక్త (సల్లం) వెంట అనుచరవాహిని మక్కా పురవీధుల గుండా నడుస్తూ కాబా గృహానికి చేరుకుంటోంది. ముస్లింల చిరకాల వాంఛ నెరవేరుతోంది. వారు ఆనందోత్సాహాలతో ఉమ్రా విధులు నిర్వర్తించసాగారు. ఖురైషులు మక్కానుండి వలసపోయిన ముస్లింలు మదీనా వాతావరణం అచ్చిరాక బలహీనులైపోయారని అనుకునేవారు. అందుకని దైవప్రవక్త (సల్లం) తన అనుచరుల్ని కాబాగృహ ప్రదక్షిణ చేసేటప్పుడు మొదటి మూడు చుట్లలో నిక్కుతూ నడవమని ఆదేశించారు. ఇలా నడవటాన్ని అరబీ భాషలో 'రమల్' అంటారు.[3] నేటికీ ఈ సంప్రదాయం అమల్లో ఉంది.

మక్కావాసులు ఇష్టపూర్వకంగానో, అయిష్టంగానో ముస్లింలకు ఉమ్రా చేసుకునే అనుమతి ఇచ్చినప్పటికీ వారు ఆ దృశ్యాన్ని చూసి సహించే స్థితిలో లేరు. అందుకని చాలామంది ఖురైషులు పట్టణం

---

1) జాదుల్ మఆద్ మూడవ సంపుటి 370వ పుట.

2) సుననెతిర్మిజీలోని ఉపమానాలప్రకరణం, సుననె నసాయిలోని హజ్ ప్రకరణం.

3) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

వదలి కొండలపైకి మకాం మార్చుకున్నారు. మూడ్రోజుల తర్వాత అలీ దగ్గరికి వెళ్ళి, "మనమనుకున్న ప్రకారం మూడ్రోజులు పూర్తయిపోయాయి. ఇక ముహమ్మద్‌ను ఇక్కణ్ణుంచి వెళ్ళిపొమ్మని చెప్పు" అన్నారు. హజ్రత్ అలీ ఈ విషయం దైవప్రవక్త (సల్లం)కు తెలియజేశారు. ఆ సంగతి విన్న వెంటనే దైవప్రవక్త (సల్లం) తన అనుచరుల్ని తీసుకొని మదీనాకు బయలుదేరారు.[1]

మక్కానుండి బయలుదేరుతున్నప్పుడు హజ్రత్ హమ్జాగారి చిన్న కూతురు ఉమామా "బాబాయ్, బాబాయ్" అంటూ దైవప్రవక్త (సల్లం) వెంట పడింది. అలీ ఆ పాపను ఒళ్ళోకెత్తుకున్నారు. ఆయనతోపాటు ఆయన సోదరుడు జాఫర్, ఇంకా జైద్ బిన్ హారిస్‌లు కూడా పాపను తాను పోషిస్తానంటే తాను పోషిస్తానని వాదులాడుకోవటం మొదలుపెట్టారు. ధర్మం దృష్ట్యా హమ్జా తనకు సోదరులు అవుతారని, ఆ విధంగా ఆ పాప తన సోదరకుమార్తె అవుతుందని జైద్ చెప్పుకుంటే, ఆ పాప తనకు పాలవరస చెల్లెలు అవుతుందని, ముందు తన ఒళ్ళోకి వచ్చింది కాబట్టి తనే ఆ పాపను పోషించటానికి ఎక్కువ అర్హుణ్ణని హజ్రత్ అలీ వాదించారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) వారి వాదప్రతివాదాలను పరిశీలించిన మీదట పాపను ఆమె పిన్ని అయిన అస్మాకు అప్పజెబుతూ 'పిన్ని తల్లితో సమానం' అని అన్నారు.[2]

## మౌతా యుద్ధం

దైవప్రవక్త రాజులు, చక్రవర్తులను ఇస్లాం వైపునకు ఆహ్వానిస్తూ వారి దగ్గరికి రాయబారాలు పంపిన కాలంలోనే, దైవప్రవక్త (సల్లం) బస్రా (హౌరాన్) రాజయిన షురహ్‌బీల్ బిన్ అమ్ర్ దగ్గరికి ఒక లేఖ వ్రాసి పంపారు. అతను కైసర్ చక్రవర్తికి సామంతరాజు. అరబ్బులైన అతని వంశస్థులు అనాది నుంచి క్రైస్తవమతాన్ని అవలంబిస్తూ వస్తున్నారు. సిరియా శివారు ప్రాంతాలు వీళ్ళ అధీనంలోనే ఉండేవి. ఆ రాజు దగ్గరికి హారిస్ బిన్ ఉమైర్ రాయబారిగా వెళ్ళారు. కాని ఆ దుర్మార్గుడు దైవప్రవక్త రాయబారిని నిర్దాక్షిణ్యంగా హత్య చేయించాడు. దాని ప్రతీకారం

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.
2) " " " "

www.abulhasanalinadwi.org

తీర్చుకోవటం కోసం దైవప్రవక్త (సల్లం) మూడువేలమంది సైన్యాన్ని సిద్ధం చేసి సిరియా వైపుకు పంపారు. జైద్ బిన్ హారిసాను సేనాపతిగా నియమించారు. ఒకవేళ ఆయన చనిపోతే జాఫర్ తయ్యార్, ఆయన కూడా చనిపోయిన పక్షంలో అబ్దుల్లాహ్ బిన్ రవాహా సైన్యాధ్యక్ష పదవిని కొనసాగించాలని చెప్పి పంపించారు.[1]

ఈ సైనికచర్య ప్రతీకార భావంతో జరుగుతున్నప్పటికీ ఇస్లాం జరిపే అన్ని రకాల చర్యల ముఖ్య ధ్యేయం ధర్మ ప్రచారమే కాబట్టి దైవప్రవక్త (సల్లం) సైన్యానికి హితోపదేశం చేస్తూ శత్రువులకు ముందు ఇస్లాం గురించి వివరించాలనీ, ఒకవేళ వారు ఇస్లాం స్వీకరిస్తే ఇక యుద్ధం చేయవలసిన అవసరం లేదనీ చెప్పారు. తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ప్రాణాలర్పించిన హారిస్ బిన్ ఉమైర్ మరణించిన చోటుకెళ్ళి సానుభూతి ప్రకటించాలని కూడా దైవప్రవక్త (సల్లం) సైనికులను ఆదేశించారు. సనియ్యతుల్ వదా ప్రాంతం దాకా వెళ్ళి సైన్యాన్ని సాగనంపి వచ్చారు. క్షేమంగా, విజయపతాకం ఎగురవేస్తూ తిరిగి రావాలని సహచరులు బిగ్గరగా దేవుణ్ణి ప్రార్థించారు.[2]

ముస్లిం సైన్యం మదీనా నుండి బయలుదేరగానే గూఢచారులు ఈ విషయం షురహ్బీల్‌కు తెలియజేశారు. అతను కూడా ముస్లిం సైన్యాన్ని ఎదుర్కొనటానికి సుమారు లక్షమంది సైనికుల్ని సమకూర్చుకున్నాడు. అటు రోమ్ చక్రవర్తి హెరక్లియస్ అసంఖ్యాక అరబ్బు సైనికులతో వచ్చి బల్ఖా జిల్లా ప్రాంతాలలో మఆబ్ అనే చోట గుడారమేసుకొని కూర్చున్నాడు. ఈ పరిస్థితుల్ని చూసి జైద్ (రజి) దైవప్రవక్త (సల్లం)కు కబురుచేసి ఆయన ఆజ్ఞ వచ్చే వరకు వేచి చూద్దామని అనుకున్నారు. కాని అబ్దుల్లాహ్ బిన్ రవాహా మాత్రం తమ ఉద్దేశ్యం విజయం కాదని, దైవమార్గంలో ప్రాణాలర్పించటమని, అది ఎట్టి పరిస్థితుల్లోనయినా సాధించవచ్చని ముస్లిం సైనికులకు ధైర్యం చెప్పారు.[3] మొత్తానికి ఆ చిన్నపాటి సైనికదళం లక్షమంది సైనికులతో ఢీకొంటానికి సిద్ధమయింది. యుద్ధారంభంలోనే జైద్ బిన్ హారిసా వీర మరణం

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
2) సీరతున్నబీ మొదటి సంపుటి 506వ పుట
3) సీరత్ ఇబ్నెహిషామ్ రెండో సంపుటి 375వ పుట.

www.abulhasanalinadwi.org

పొందారు. ఆయన తర్వాత జాఫర్ తయ్యార్ యుద్ధ పతాకాన్ని చేతిలోకి తీసుకున్నారు. గుర్రం దిగి ఖడ్గంతో గుర్రం కాళ్ళపై విసురుగా కొట్టారు. దాంతో గుర్రం గిట్టెలు తెగి కిందపడిపోయింది. ఆ తర్వాత ఆయన నేలపై నించొనే యుద్ధం చేశారు. ఆ విధంగా పోరాడటం వల్ల ఒళ్ళంతా ఖడ్గ ఘాతాలతో నుజ్జునుజ్జయిపోయి ఆయన క్రిందపడిపోయారు.[1] అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ ఆయన గురించి ఇలా అంటున్నారు. "యుద్ధం తర్వాత నేను జాఫర్ శవాన్ని చూశాను. ఆయన ఒంటిమీద తొంభై గాయాలు కనిపించాయి నాకు. విశేషమేమిటంటే ఆ గాయాలన్నీ ఉదరభాగంవైపే ఉన్నాయి గాని వీపుమీద చిన్న గాయమయినా కనిపించలేదు.[2]

జాఫర్ తర్వాత అబ్దుల్లాహ్ బిన్ రవాహా యుద్ధపతాకం పట్టుకున్నారు. చివరికి ఆయన కూడా అమరగతి నొందారు. ఆ తర్వాత ఖాలిద్ బిన్ వలీద్ సైన్యాధిపతి అయి వీరోచితంగా పోరాడారు. సహీహ్ బుఖారీ గ్రంథంలోని ఒక ఉల్లేఖనం ప్రకారం ఈ యుద్ధంలో ఆయన చేతిలో ఎనిమిది ఖడ్గాలు విరిగిపోయాయి.[3] మూడువేలమంది సైనికులు లక్షమంది సైన్యంతో యుద్ధం చేయటమంటే మాటలా?! అయినప్పటికీ ఖాలిద్ ఎంతో చాకచక్యంతో తన సైన్యం శత్రువులకు పట్టుబడకుండా తప్పించుకొని తీసుకొచ్చారు.

ఈ సంఘటన వల్ల దైవప్రవక్త (సల్లం)కు ఎంతో దుఃఖం కలిగింది. జాఫర్ పట్ల ఆయనకు అమితమైన ప్రేమాభిమానాలుండేవి. అంచేత జాఫర్ మరణవార్త ఆయన హృదయాన్ని కలచివేసింది. ఆయన మస్జిద్‌లో కూర్చొని దుఃఖించసాగారు. ఆ సమయంలోనే ఒక వ్యక్తి వచ్చి జాఫర్ ఇంటి ఆడవాళ్ళు రోదిస్తున్నారని చెప్పాడు. ఆయన వాళ్ళను వారించమని ఆ వ్యక్తితో చెప్పి పంపించారు. ఆ వ్యక్తి తిరిగొచ్చి తను ఎంత వారించినా వారు వినటం లేదని చెప్పాడు. ఆయన మళ్ళీ చెప్పి పంపించారు. ఆ వ్యక్తి ఇంకోసారి వెళ్ళొచ్చి వాళ్ళను ఆపటం తమ వల్ల కాదని చెప్పాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం), "వాళ్ళ నోళ్ళల్లో మన్ను కొట్టండి" అని

1) సీరత్ ఇబ్నెహిషామ్ రెండో సంపుటి 378వ పుట.
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.
3) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం, సీరత్ ఇబ్నెహిషామ్ రెండో సంపుటి 379 380 పుటలు.

www.abulhasanalinadwi.org

విసుక్కున్నారు. ఈ సంఘటన సహీహ్ బుఖారీ గ్రంథంలో అయిషా (రజి.అన్హా) చే ఉల్లేఖించ బడింది. బుఖారీలో అదనంగా ఈ వాక్యం ఉంది: ఆయిషా (రజి. అన్హా) ఆ వ్యక్తిని ఉద్దేశించి, "దైవసాక్షి! నువ్వా పని చేయకపోతే దైవప్రవక్త (సల్లం) బాధ తగ్గదు" అని అన్నారు.[1]

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

# మక్కా విజయం

హి.శ అరవ యేట ముస్లింలు-ఖురైషులు కుదుర్చుకున్న హుదైబియా ఒప్పందంలోని ఒక షరతు ప్రకారం ఇరుపక్షాలవారు పది సంవత్సరాల వరకు పరస్పరం దాడికి దిగకూడదు. ఇరుపక్షాల వాళ్ళు తమకిష్టమొచ్చిన తెగతో సంబంధాలు పెట్టుకోవచ్చు.

దాని ప్రకారం బనూ ఖుజాఆ తెగవారు దైవప్రవక్త (సల్లం) తరపున చేరారు. బనూ బక్ర్ తెగవారు ఖురైషులతో చేతులు కలిపారు. ఒప్పందం జరిగి రెండు సంవత్సరాలు పూర్తికాక ముందే బనూబక్ర్ తెగ బనూఖుజాఆ తెగపై దాడిచేసింది. ఈ దాడి వెనుక ఖురైషుల హస్తం ఉంది. వారే దాడిచేయమని బనూబక్ర్ తెగకు ఆయుధాలు సరఫరా చేశారు. అబూజహల్ కొడుకు ఇక్రిమా, ఒప్పంద పత్రంపై సంతకం చేసిన సుహైల్ బిన్ అమ్ర్, ప్రముఖ ఖురైష్ సర్దారు సఫ్వాన్ బిన్ ఉమయ్యా లాంటివాళ్ళు తెరవెనుక ఉండి తమ అనుంగు అనుచరుల చేత ఈ దాడి చేయించారు.

నిస్సహాయులైన బనూఖుజాఆ తెగవారు తమను హింసించవద్దని ప్రాధేయపడ్డారు. ఆఖరికి పవిత్ర కాబాగృహంలోకి వెళ్ళి దాక్కున్నారు. కాని ఖురైషులు వారిని ఎక్కడా వదల్లేదు. దొరికిన వారిని దొరికిన చోటల్లా నిర్దాక్షిణ్యంగా పొడిచి చంపారు. బనూఖుజాఆ బాధితులు "దైవం కోసం మమ్మల్ని వదలిపెట్టండి" అని ప్రాధేయపడ్డారు. దానికి సమాధానంగా ఆ దుర్మార్గులు 'ఈ రోజు దేవుడన్న మాటే లేదు' అంటూ మరింత హింసకు పాల్పడేవారు.[1]

ఆ దుర్మార్గుల హింసా దౌర్జన్యాల నుండి బ్రతికి బయటపడిన నలభైమంది మక్కానుండి పారిపోయి మదీనాకు చేరుకున్నారు. అక్కడికి వెళ్ళి తమపై జరిగిన అత్యాచారం గురించి దైవప్రవక్త సన్నిధిలో

1) సీరత్ ఇబ్నె హిషామ్ రెండోసంపుటి 390వ పుట. తారీఖె తబ్రీ రెండో సంపుటి 153వ పుట.

www.abulhasanalinadwi.org

మొరపెట్టుకున్నారు. అమ్ర్ బిన్ సాలిమ్ ఖుజాయీ అనే ఆయన దుర్మార్గులు తమపై జరిపిన అత్యాచారాలను ఆవేదనాభరితమైన గేయరూపంలో పూసగ్రుచ్చినట్లు వివరించారు. ఆ గేయ అనువాదం ఇలా ఉంటుంది:

> "దైవప్రవక్తా! ఖురైషులు ప్రమాణభంగానికి పాల్పడ్డారు. వారు మీతో చేసిన పటిష్టమైన ఒప్పందాన్ని భగ్నం చేసేశారు. 'కదా' ప్రాంతంలో దారుణ మారణకాండను సృష్టించారు. మాకు సహాయం చేసేవారెవ్వరూ లేరని, మమ్మల్ని నీచులుగా, అల్పసంఖ్యాకులుగా భావించి మాపై దాడిచేశారు. మేము రాత్రిపూట పడుకున్నప్పుడు, నమాజ్ స్థితిలో రుకూ, సజ్దాల్లో ఉన్నప్పుడు పట్టుకొని ఊచకోత మొదలుపెట్టారు".

ఒప్పంద గౌరవాన్ని కాపాడటానికి, బాధితవర్గ రక్షణకోసం భవిష్యత్తులో మిత్రవర్గాల భద్రత దృష్ట్యా దైవప్రవక్త (సల్లం) వెంటనే మక్కాకు ప్రయాణమయ్యారు. ఆయన వెంట పదివేల సైన్యం బయలుదేరింది.[1] కొంతదూరం వెళ్ళగానే దారిలో ఆయనకు అబూసుఫ్యాన్ బిన్ హారిస్, అబ్దుల్లాహ్ బిన్ అబూ ఉమయ్యాలు దొరికారు.

వీళ్ళు దైవప్రవక్త (సల్లం)ను నానా రకాలుగా హింసించిన వాళ్ళు. సదా ఇస్లాంను తుడిచిపెట్టడానికి కృషిచేస్తుండినవాళ్ళు. వారిని చూడగానే దైవప్రవక్త (సల్లం) అసహ్యంతో మొహం త్రిప్పుకున్నారు. ఆ సమయంలో విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఉమ్మె సలమా వారిపై దయతలచి దైవప్రవక్త (సల్లం)కు సిఫారసు చేయసాగారు.

"దైవప్రవక్తా! అబూసుఫ్యాన్ మీ సొంత బాబాయి కొడుకు. అబ్దుల్లాహ్ మీ మేనత్త ఆతికా కొడుకు. అంత దగ్గరి బంధువుల్ని క్షమించకపోవటం భావ్యం కాదు" అన్నారు.[2]

---

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.
2) సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 400వ పుట.
ముస్తద్రక్ హాకిమ్ మూడో సంపుటి 46వ పుట.

www.abulhasanalinadwi.org

ఆ తర్వాత హజ్రత్ అలీ వారిద్దరికీ ఒక ఉపాయాన్ని సూచిస్తూ యూసుఫ్ ప్రవక్త సోదరులు యూసుఫ్‌ను క్షమించమని కోరిన విధంగా వీళ్లు దైవప్రవక్త (సల్లం)ను క్షమాభిక్ష పెట్టమని కోరితే ఆయన తప్పకుండా క్షమిస్తారని చెప్పారు.

అప్పుడు వారిరువురు దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళి దివ్యఖురాన్‌లోని ఈ సూక్తి పఠించారు.

"అల్లాహ్ తోడు! అల్లాహ్ మాకంటే మీకు ఎక్కువ ఔన్నత్యాన్ని ప్రసాదించాడు. మేము నిజంగానే దోషులం."

దానికి సమాధానంగా దైవప్రవక్త (సల్లం) ఈ సూక్తి పఠించారు.

"ఈ రోజు మిమ్మల్ని నిందించటం జరగదు. అల్లాహ్ మిమ్మల్ని క్షమించుగాక. ఆయన అందరికంటే అధికంగా కరుణించేవాడు."[1]

ఆ సమయంలో అబూసుఫ్యాన్ బిన్ హారిస్ తీవ్రభావోద్రేకాలకు లోనయి ఒక కవిత పఠించారు. దాని అనువాదం ఇలా ఉంటుంది.

> "ఒకప్పుడు నేను లాత్ విగ్రహసైన్యం ముహమ్మద్ సైన్యంపై ఆధిక్యతను సాధించాలన్న ఉద్దేశ్యంతో యుద్ధపతాకం ఎత్తేవాణ్ణి. అప్పుడు నేను చీకటిలో ఎదురు దెబ్బలు తినే ముళ్ళపందిలా వ్యవహరించాను. కాని ఇప్పుడు నాకు సన్మార్గంపై నడిచే భాగ్యం లభించింది.నాకు నా మనసు కాదు. సన్మార్గాన్ని ప్రసాదించేవాడే సన్మార్గం చూపించాడు.! నేను ధిక్కరించి, తృణీకరించిన వాడే నాకు దైవమార్గం చూపించాడు."

దానికి దైవప్రవక్త (సల్లం), "ఔను మీరు నన్ను ఎల్లప్పుడూ తృణీకరిస్తూనే వచ్చారు" అని అన్నారు.[2]

దైవప్రవక్త (సల్లం) మక్కావాసులకు తమరాక గురించి తెలియకుండా ఉండాలని భావించారు. అలాగే జరిగింది! దైవప్రవక్త (సల్లం) మక్కా పొలిమేరలకు చేరుకొనే వరకు ఈ విషయం మక్కావారికి

1) జాదుల్ మఆద్ మూడో సంపుటి 400వ పుట.
2) సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 401వ పుట.
ముస్తద్రక్ హాకిమ్ మూడో సంపుటి 46వ పుట.

www.abulhasanalinadwi.org

తెలియలేదు. అక్కడ గుడారాలు ఏర్పాటుచేసుకొని అగ్ని గుండాలను రగిలించమని దైవప్రవక్త (సల్లం) సహచరుల్ని ఆదేశించారు. ఆయన ఆదేశానుసారం అగ్ని గుండాల్ని రగిలించటం జరిగింది. అదే సమయంలో అబూసుఫ్యాన్ బిన్ హర్బ్ మక్కా పరిస్థితుల్ని బేరీజు వేసుకునే ఉద్దేశ్యంతో అటుగా వచ్చారు. అక్కడ మోహరించబడిఉన్న సైన్యాన్ని చూసి భయకంపితులవుతూ అప్రయత్నంగానే అంతటి వైభవోపేతమైన సైన్యం, అంతటి వెలుగు తను అంతకుముందెన్నడూ చూడలేదన్నాడు.

హ(జత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ అంతకుముందే మదీనాకు వలసవెళ్ళిపోయారు. ప్రస్తుతం ఆ సైన్యంలో తను కూడా ఉన్నారు. అబూసుఫ్యాన్ గొంతుని పసిగట్టి ఆయన్ని దగ్గరికి లాక్కొని, 'చూడు, దైవప్రవక్త (సల్లం) ఇక్కడే ఉన్నారు. రేపు ఖురైషుల స్థితి ఎంతో దయనీయంగా ఉండబోతోంది. కనుక నువ్వు ఇప్పుడే ముస్లిం అయిపో' అన్నారు. ఇతర ముస్లింలెవరయినా అబూసుఫ్యాన్‌ను వదలిపెట్టరు. అందుకని ఆయన్ని తన కటారు సాయంతో కాపాడుతూ దైవప్రవక్త (సల్లం) దగ్గరికి తీసుకొని వెళ్ళారు. దైవప్రవక్త (సల్లం) అబూసుఫ్యాన్‌ని చూడగానే, "అబూ సుఫ్యాన్ నీకు మేలు జరుగుగాక! దేవుడు తప్ప వేరొక ఆరాధ్యుడు లేడని విశ్వసించే సమయం నీకింకా ఆసన్నం కాలేదా?" అన్నారు.

దానికి జవాబుగా అబూసుఫ్యాన్. "దైవప్రవక్తా! నా తల్లిదండ్రుల్ని మీకోసం అర్పింతునుగాక! మీరు దయార్ద్ర హృదయులు! విశాల హృదయులు! ప్రజల పట్ల ఉత్తమంగా వ్యవహరించటంలో ఎవరూ మిమ్మల్ని మించిపోలేరు. దేవుడు తప్ప మరొక ఆరాధ్య దైవమే ఉండి ఉంటే నాకీ గతి పట్టి ఉండేదికాదు" అన్నారు ఎంతో పశ్చాత్తాపభావంతో.

"అబూ సుఫ్యాన్! దేవుడు నీకు సద్బుద్ధినొసగుగాక! నేను దైవప్రవక్తనని విశ్వసించే సమయం నీకింకా ఆసన్నం కాలేదా?" దైవప్రవక్త (సల్లం) మళ్ళీ అడిగారు.

"దైవప్రవక్తా ! నా తల్లిదండ్రుల్ని మీకై అర్పింతునుగాక! మీరు ఎంతో దయార్ద్ర హృదయులు! విశాల హృదయులు! ప్రజలపట్ల ఉత్తమంగా వ్యవహరించటంలో మిమ్మల్ని మించినవారెవరూ ఉండరు. ఇకపోతే మీరడిగిన విషయంలో మాత్రం నాకింకా కొంచెం సందేహం గానే ఉంది" అని చెప్పారు అబూసుఫ్యాన్.

www.abulhasanalinadwi.org

అబూసుఫ్యాన్ మాటవిని అబ్బాస్ మండిపడుతూ, "మహానుభావా! ముస్లింల ఖడ్గాలు నీ తలను వేరుచేయకముందే ఇస్లాం స్వీకరించు. అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ (సల్లం) దైవప్రవక్త అని విశ్వసించు" అంటూ ఆయన్ని గదిమారు.

అప్పుడు అబూసుఫ్యాన్ కూడా విశ్వసించి ముస్లింలలో చేరిపోయారు.[1]

## అందరికీ క్షమాభిక్ష

ఆ రోజు దైవప్రవక్త (సల్లం )గారి మృదుత్వం,మన్నింపుల వైఖరి మునుపెన్నడూ లేని విధంగా విస్తృతమయిపోయింది. బహుశా జీవితం పట్ల విరక్తి చెంది శాంతి సౌమనస్యాలను తృణీకరించిన దౌర్భాగ్యుడే ఆ రోజు ముస్లింల ఖడ్గాలకు బలి అయి ఉంటాడు. సైన్యసమేతంగా మక్కాలోకి ప్రవేశించగానే దైవప్రవక్త (సల్లం) అబూసుఫ్యాన్ ఇంట్లో దాక్కున్న వారికి, ఇండ్లలోనే ఉండి తలుపులు మూసుకున్నవారికి, కాబాగృహంలో శరణుజొచ్చినవారికి ముస్లిం సేనల వల్ల ఎలాంటి హాని జరగదని అభయమిచ్చారు. తమ దారికి అడ్డొచ్చిన వారిపై, తమకు ఆటంకం కలిగించేవారిపై మాత్రమే చెయ్యెత్తాలని, మక్కావాసుల ఆస్తులకు ఎలాంటి హాని తలపెట్టకూడదని, నిష్కారణంగా ఎవరినీ హతమార్చరాదని దైవప్రవక్త (సల్లం) తన సైన్యానికి ఉపదేశించారు.[2]

ఆ తర్వాత దైవప్రవక్త (సల్లం) అబ్బాస్‌తో అబూసుఫ్యాన్‌ను తీసుకెళ్ళి ముస్లిం సేనావాహిని దర్శనం చేయించమని చెప్పారు. ముస్లిం సేనలు ఎగిసిపడుతున్న సముద్రకెరటాల్లాగా విజయానందాలతో కదం తొక్కుతూ ముందుకు వెళుతున్నారు. పలు తెగలు పలురకాల జెండాలు పట్టుకొని ఉన్నాయి. ఒకటి తర్వాత మరొకటి వివిధ తెగలు తమ ముందు నుంచి నడచివెళ్తుంటే అబూసుఫ్యాన్ అబ్బాస్‌తో ఆ తెగలపేర్లు అడిగి తెలుసుకునేవారు. ఆయన పేరు చెప్పగానే ఆ తెగలతో తనకెలాంటి సంబంధం లేదని అనేవారు.[3]

---

1) సీరత్ ఇబ్నెహిషామ్ రెండో సంపుటి 402, 403 పుటలు.
   జాదుల్ మఆద్ మూడో సంపుటి 398,401,402వ పుటలు.
2) జాదుల్ మఆద్ మూడో సంపుటి 403 వ పుట.
3) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

ఆ తర్వాత స్వయంగా దైవప్రవక్త (సల్లం) నిండుగా ఆయుధాలు ధరించివున్న ఒకసైనికదళంతో పాటు వారి ముందు నుంచి వెళ్ళారు. ఆ సైనిక దళం పచ్చరంగు దుస్తుల్లో కళ్ళు మాత్రమే కనపడే విధంగా ముసుగులు ధరించి ఉంది. వారిని చూసి అబూసుఫ్యాన్ అబ్బాస్‌తో ఆ సైనికపటాలం ఎవరిదని అడిగారు. దానికి అబ్బాస్, "అది దైవప్రవక్త (సల్లం) రక్షక దళం. ఆయన చుట్టూ ఉన్నది ముహాజిర్, అన్సార్ అనుచరులు" అని చెప్పారు. ఆ మాట వినగానే అబూసుఫ్యాన్ గుండె గతుక్కుమన్నది. ఆయన మనసు ఇస్లాం ఔన్నత్యాన్ని గుర్తించింది. అప్రయత్నంగానే ఆయన నోటి వెంట. "దైవసాక్షి! వీరిలో ఎవరికీ ఇంతకుముందు ఇంతటి శక్తిసామర్థ్యాలు, ఇంతటి వైభవం ఉండేదికాదు. అబ్బాస్! నీ సోదరకుమారుడు ఎంత ఎత్తుకు ఎదిగిపోయాడయ్యా!" అన్న మాటలు వెలువడ్డాయి.

దానికి అబ్బాస్, "అబూ సుఫ్యాన్ ఇది దైవదౌత్యపు మహిమ" అని అన్నారు.

ఆ తర్వాత అబూసుఫ్యాన్, ఎలుగెత్తి, "ఖురైషులారా! ఈ రోజు ముహమ్మద్ (సల్లం) మీరు ఇంతకు ముందెన్నడూ కనీవినీ ఎరుగనంతటి సైన్యంతో, శక్తిసామర్థ్యాలతో వచ్చారు. కాబట్టి మీరు లొంగిపోవటమే మంచిది. నా ఇంటికొచ్చినవారికి శరణులభిస్తుంది" అని ప్రకటించారు.

ఆ ప్రకటన విని ప్రజలు ఆశ్చర్యపోయారు. "జనుల్లో గుసగుసలు మొదలయ్యాయి. కొందరు, "నీ ఇల్లు పాడుగాను! నువ్వు నిన్నటిదాకా ముహమ్మద్‌ను హింసించావు. అలాంటిది, ఈ రోజు నీ ఇంటికొస్తే మాకు శరణు లభిస్తుందా?" అన్నారు.

అబూసుఫ్యాన్ మళ్ళీ ప్రకటించారు. "తమ ఇండ్లల్లోనే ఉండి తలుపులు మూసుకున్నవారికి శరణు లభిస్తుంది. కాబాగృహంలో శరణు జొచ్చిన వారికి కూడా శరణు లభిస్తుంది."

ప్రజలు చెల్లాచెదరయిపోయారు. కొంతమంది తమ ఇళ్ళల్లోనే ఉండి తలుపులు వేసుకున్నారు. మరికొంతమంది కాబాగృహంలో శరణు తీసుకున్నారు.[1]

1) సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 404, 405 పుటలు. సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం.

www.abulhasanalinadwi.org

యావత్తు మక్కానగరం తన పాదాక్రాంతమయిన తరువాత కూడా దైవప్రవక్త (సల్లం) అత్యంత నమ్రతతో, అణకువతో శిరస్సు వంచుకొని నగరంలోకి ప్రవేశించారు. చుబుకం ఒంటె అంబారీకి తగిలేటంత క్రిందికి వంగి పోయారు దైవప్రవక్త (సల్లం)[1], ఆ సమయంలో ఆయన దివ్యఖురాన్‌లోని 'ఫత్‌హ్' సూరా పారాయణం చేస్తూ నగరంలోకి ప్రవేశించారు.[2]

మక్కా నగరం యావత్తు అరబ్బు ద్వీపానికి ఆధ్యాత్మిక, రాజకీయ కేంద్రం. అటువంటి మహానగరాన్ని జయించినప్పుడు కూడా దైవప్రవక్త (సల్లం) అడుగడుగునా నిరుపమాన వినయవినమ్రతల్ని ప్రదర్శించారు. ఈ లోకంలో సత్యం సమానత్వాలకు ఆయువుపట్టు అయిన ధర్మం ఇస్లాం ఒక్కటేనని క్రియాత్మకంగా నిరూపించారు. తనచేత స్వేచ్ఛ నొసగబడిన ఒక బానిస కుమారుణ్ణి తన వెంట ఒంటెమీద కూర్చోబెట్టుకున్నారు. మరి చూడబోతే ఖురైష్, బనూ హాషిం తెగలకు చెందిన అతిరథ, మహారథులు కూడా ఆ సమయంలో ఆయన వెంట ఉన్నారు. కాని వారిలో ఎవ్వరికీ ఆ భాగ్యం లభించలేదు.[3]

మక్కా విజయం నాడు ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం)తో భయంతో వణుకుతూ మాట్లాడసాగాడు. ఆయన అతనికి ధైర్యం చెబుతూ, "భయపడుతున్నావెందుకు? నిబ్బరంగా మాట్లాడు. నేను రాజునేమీ కాను. నేను ఎండుమాంసపు ముక్కలు తిని బ్రతికిన ఓ సామాన్య ఖురైష్ తల్లి కుమారుణ్ణి మాత్రమే" అని అన్నారు.[4]

## కక్ష, కార్పణ్యాల రోజుకాదు, కరుణాకటాక్షాల దినం

అన్సార్ల సైనికదళానికి అధిపతిగా ఉన్న సాద్ బిన్ ఉబాదా అబూసుఫ్యాన్ ముందు నుంచి వెళ్తూ "ఈ రోజు నెత్తురు ప్రవహించే రోజు. ఇవాళ కాబా గృహంలో ఏం చేసినా ధర్మసమ్మతమే. దేవుడు ఖురైషులను ఈ రోజు పరాభవం పాలు చేశాడు" అంటూ అబూ సుఫ్యాన్‌ను రెచ్చగొడుతూ మాట్లాడారు.

1) సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 405వ పుట. ముస్తద్రక్ హాకిమ్ మూడో సంపుటి 50వ పుట.
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
3) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
4) ముస్తద్రక్ హాకిమ్ మూడో సంపుటి 50వ పుట.

www.abulhasanalinadwi.org

కాసేపటికి దైవప్రవక్త (సల్లం) ఓ చిన్న సైనికదళంతోపాటు అటుగా వెళుతున్నారు. అప్పుడు అబూసుఫ్యాన్ ఆయన దగ్గరికి సాద్ బిన్ ఉబాదా గురించి ఫిర్యాదు చేస్తూ, "దైవప్రవక్తా! సాద్ ఏమన్నాడో మీరు విన్నారా?" అని అడిగారు.

'ఏమన్నాడు?' ఆయనేమన్నాడో తను వినలేదని దైవప్రవక్త (సల్లం) చెప్పారు.

సాద్ ఖురైషుల్ని రెచ్చగొడుతూ మాట్లాడిన సంగతిని అబూసుఫ్యాన్ దైవప్రవక్త (సల్లం)కు తెలియపరచారు. ఆయన సాద్ అన్న మాటకు తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేశారు.

తలపంకిస్తూ, "కాదు, ఈ రోజు కారుణ్యం కురిసేరోజు. ఈ రోజు దేవుడు ఖురైషులకు గౌరవాన్ని ప్రసాదిస్తాడు. కాబా గృహ ఔన్నత్యాన్ని ఇనుమడింపజేస్తాడు" అని ఎలుగెత్తి ప్రకటించారు.

ఆ తర్వాత ఆయన సాద్ బిన్ ఉబాదాను పిలిపించారు. ఆయన దగ్గర్నుంచి యుద్ధపతాకం వాపసు తీసుకొని ఆయన కుమారుడైన ఖైస్‌కు దాన్ని ప్రదానం చేశారు.[1] దైవప్రవక్త (సల్లం) తన దగ్గర్నుంచి యుద్ధపతాకం లాక్కున్నారని సాద్ నిరాశానిస్పృహలకు లోనుకాకుండా ఉండాలనే ఆయన అలా చేశారు.

ఒకవైపు సాద్‌బిన్ ఉబాదా "ఈ రోజు నెత్తురు ప్రవహించే రోజు" అంటూ రెచ్చగొట్టే నినాదాలతో ఖురైషుల గుండెల్ని గాయపరిస్తే మరోవైపు దైవప్రవక్త (సల్లం), "ఈ రోజు కారుణ్యం కురిసే రోజు" లాంటి ప్రకటనలతో ఖురైషుల హృదయాలను శాంతపరిచే ప్రయత్నం చేశారు. ఒకవైపు అబూసుఫ్యాన్‌ను ఊరించటంతోపాటు మరోవైపు సాద్‌బిన్ ఉబాదా నిరాశా నిస్పృహలకు లోనుగాకుండా జాగ్రత్తపడ్డారు. సాద్‌ను తగిన విధంగా శిక్షించకపోతే క్రొత్తగా ఇస్లాం స్వీకరించిన అబూసుఫ్యాన్ మనస్సు శాంతించదు. మరోవైపు సాద్ నుండి యుద్ధపతాకాన్ని లాక్కొని ఆయన్ని పదవీచ్యుతుణ్ణి చేస్తే అప్పటివరకు ఇస్లాం కోసం ఆయన చేసిన సేవల్ని ఉపేక్షించినట్లవుతుంది. దాని వల్ల ఆయన నిరాశానిస్పృహలకు, లోనుకావచ్చు. 'తినమంటె కప్పకు కోపం, వదలమంటె పాముకు కోపం'

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల క్రరణం.

www.abulhasanalinadwi.org

అన్నట్టు తయారయింది సమస్య. అలాంటి సున్నిత పరిస్థితిలో దైవప్రవక్త (సల్లం) యుద్ధపతాకాన్ని సాద్ కుమారుడయిన ఖైస్‌కు ఇప్పించి ఇరువర్గాలూ శాంతించేటట్లు ఎంతో చాకచక్యంగా సమస్యను అధిగమించారు. ఈసంఘటన ఆయన అసామాన్య విజ్ఞతా వివేచనలకు, దైవదౌత్యపదవికే ప్రబల నిదర్శనం.

## చెదురుమదురు సంఘటనలు

ఆ సందర్భంగా సఫ్వాన్ బిన్ ఉమయ్యా. ఇక్రిమా, సుహైల్ బిన్ అమ్ర్ ఇంకా కొంతమంది ఖురైషులు తిరుగుబాటు చేయటంతో వారికీ, ఖాలిద్ బిన్ వలీద్ సహచరులకు మధ్య స్వల్పంగా ఘర్షణలు జరిగాయి. ఆ పొట్లాటల్లో దాదాపు డజనుమంది బహుదైవారాధకులు వధించబడ్డారు. ఆ తర్వాత వారే స్వయంగా ఓటమిని అంగీకరించారు.[1] దైవప్రవక్త (సల్లం) మక్కాలోకి ప్రవేశించినప్పుడు తమపై తిరుగుబాటు చేసినవారిపైనే చెయ్యెత్తాలని ముస్లిం సైన్యాధిపతులకు హితోపదేశం చేశారు. అందుకని ఆ చెదురుమదురు కొట్లాటల తర్వాత నగరమంతా ప్రశాంత వాతావరణం నెలకొంది.

## కాబాగృహం నుండి విగ్రహాల ప్రక్షాళన

నగరమంతా ప్రశాంత వాతావరణం నెలకొన్న తర్వాత దైవప్రవక్త (సల్లం) కాబా గృహంవైపు బయలుదేరారు. అక్కడికి వెళ్ళి కాబాగృహం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆ సమయంలో ఆయన చేతిలో ఒక ధనస్సు ఉంది. కాబాగృహం లోపల మూడొందల అరవై విగ్రహాలుండేవి. దైవప్రవక్త (సల్లం) తనచేతిలోని వింటితో విగ్రహాలను తొలగిస్తూ దివ్యఖురాన్‌లోని ఈ సూక్తిని పఠించసాగారు.

'సత్యం వచ్చేసింది అసత్యం నిష్క్రమించింది.
అసత్యం నిష్క్రమించక తప్పదు'' (అల్ ఇస్రా:81)

విగ్రహాలన్నీ ఒక్కొక్కటీ కూలిపోసాగాయి.

కాబా గృహంలో కొన్ని చిత్రాలు, పటాలు కూడా ఉండేవి. దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞతో వాటిని కూడా తొలగించటం జరిగింది.[2]

---

1) సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 408వ పుట.
2) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

కాబా గృహం తాళం చెవులు ఉస్మాన్ బిన్ తల్హా దగ్గరుండేవి. దైవగృహ ప్రదక్షిణలు చేసిన తర్వాత దైవప్రవక్త (సల్లం) ఆయన్ని పిలిపించి కాబా గృహ తలుపులు తెరవమని ఆదేశించారు.[1] కాని ఆయన తలుపులు తెరవటానికి నిరాకరించారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఉస్మాన్ బిన్ తల్హాను హెచ్చరిస్తూ, "మంచిది! చూసుకో, ఏదో ఒకరోజు ఆ తాళంచెవులు నా దగ్గరికొస్తాయి. అప్పుడు నేను వాటిని నాకిష్టమయిన వాళ్ళకి ఇచ్చుకుంటాను" అన్నారు.

దానికి ఉస్మాన్ పౌరుషం వెలిబుచ్చుతూ, "అప్పటికి ఖరైషు పురుషులందరూ అవమానం పాలై నాశనమయిపోతారా?" అన్నారు.

దానికి దైవప్రవక్త (సల్లం) ఎంతో నిదానంగా సమాధానమిస్తూ, "లేదు, మరింత గౌరవ మర్యాదలతో జీవిస్తుంటారు" అన్నారు.[2]

ఆ తర్వాత దైవప్రవక్త (సల్లం) ఆయన దగ్గర్నుంచి తాళం చెవులు తీసుకొని కాబా గృహ ద్వారం తెరిచారు. లోపలికి వెళ్ళి దైవ గృహ మూలలన్నీ మార్మోగేలా "అల్లాహు అక్బర్" గీతాల్ని ఆలాపించారు. కృతజ్ఞతా పూర్వకంగా నమాజ్ చేశారు. కడు వినయ వినమ్రతలతో, తమ నిస్సహాయతను, దీనత్వాన్ని వ్యక్తపరుస్తూ నొసలు నేలకు అన్చి పరమప్రభువు సన్నిధిలో సాష్టాంగపడ్డారు.[3]

మానవులందరికోసం కారుణ్యమూర్తిగా ఈ లోకానికి పంపబడిన దైవప్రవక్త దైవారాధన ముగించుకొని కాబాగృహం నుండి బయటికి రాగానే ఆయన బాబాయి అయిన అబ్బాస్ కాబాగృహం తాళం చెవులు బనూహాషిం తెగవారికి ఇవ్వమని కోరారు.[4]

కాని దైవప్రవక్త (సల్లం) "ఈ రోజు ఉపకారభావంతో వ్యవహరించే రోజు. మాటను నిలబెట్టుకునే రోజు "అంటూ ఉస్మాన్ బిన్ తల్హాను పిలిచి తాళం చెవులు ఆయనకే అప్పగించారు. పైగా "ఈయన దగ్గర్నుంచి తాళం చెవులు లాక్కునేవాడు దుర్మార్గుడు" అన్నారు.[5]

---

1) సహీహ్ బుఖారీలోని యుద్ధాల ప్రకరణం
2) తబఖాత్ ఇబ్నె సాద్ రెండో సంపుటి 136, 137 పుటలు.
3) రహ్మతుల్లిల్ ఆలమీన్ మొదటి సంపుటి 119 120 పుటలు.
4) హదాయిఖుల్ అన్వార్ గ్రంథం రెండో సంపుటి 673వ పుట.
5) సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 412వ పుట.

www.abulhasanalinadwi.org

ఆ కాలంలో అరబ్ దేశంలో ఒకరు ఇంకొకర్ని హత్యచేస్తే దానికి ప్రతీకారం తీర్చుకోవటాన్ని వంశబాధ్యతగా తలపోసేవారు. సమయానికి ఆ హంతకుడు చేతికి చిక్కకుండా పారిపోయినా అతని పేరును తమ వంశ జాబితాలో నమోదు చేసుకునేవారు. నూరేళ్ళు గడిచిన తర్వాత అయినా సరే హంతకుడిపై పగ తీర్చుకునేవారు. ఒకవేళ హంతకుడు చనిపోతే అతని కుటుంబం లేదా వంశానికి చెందినవారిలో ఎవరినయినా ప్రతీకారంగా హత్యచేసేవారు. అదే విధంగా తాత హత్యచేస్తే రక్తపరిహారం ఇవ్వమని తండ్రిని డిమాండ్ చేసేవారు. ఆ విధంగా ప్రతీకారం తీర్చుకోవటాన్ని అరబ్బులు గొప్పగా భావించేవారు. అలాంటివి ఎన్నో దురాచారాలు, దుష్టపోకడలు అరబ్ దేశంలో ఉండేవి. ఇస్లాం ధర్మం అలాంటి దుష్టపోకడల్ని రూపుమాపటానికే వచ్చింది. అంచేత అజ్ఞానకాలపు ప్రతీకార పోకడలు, దుష్టాచారాలను ప్రస్తావిస్తూ దైవప్రవక్త (సల్లం) "వాటినన్నిటినీ నేను నా కాళ్ళతో తొక్కి నలిపేశాను" అన్నారు.[1]

అరబ్బు దేశాల్లోనేకాక ప్రపంచంలోని ఇతర దేశాల్లోకూడా జాతి, కులం, వర్గం, వర్ణాల ప్రాతిపదికపై మానవుల మధ్య కులీనులు కులహీనులున్న భేదభావం ఏర్పడింది. ఉదాహరణకు భారతదేశంలో వర్ణవ్యవస్థ అమల్లో ఉండేది. ఆ వ్యవస్థలో శూద్ర వర్గాన్ని పశువుల కన్నా హీనంగా చూశారు. సంఘంలో వారు పైకి రాకుండా త్రొక్కిపెట్టారు.

అటువంటి పరిస్థితుల్లో ఇస్లాం ధర్మం ప్రపంచానికి సమానత్వం, సౌభ్రాతృత్వ భావాలను నేర్పి మహోపకారం చేసింది. అరబ్బు-అరబ్బేతరుడు, కులీనుడు -కులహీనుడు అనే అడ్డుగీతల్ని తుడిచేసింది. సృష్టి ధర్మం రీత్యా ప్రతి మానవుడూ ఈ లోకంలో అత్యున్నత ప్రగతి శిఖరాలను అధిరోహించగలడని ప్రబోధించింది. అందుకే ఆ సందర్భంగా దైవప్రవక్త (సల్లం) దానికి సంబంధించిన దివ్యఖురాన్ సూక్తిని ప్రజల ముందు పఠించి వివరిస్తూ "మీరందరూ ఆదం పుత్రులే. ఆదం మట్టితో పుట్టించబడ్డారు. కాబట్టి మీలో ఎవరికీ ఎవరిపైనా ప్రాధాన్యత లేదు" అన్నారు.[2]

1) సీరత్ ఇబ్నెహిషామ్ రెండో సంపుటి 412వ పుట, సుననె అబూదావూద్‌లోని రక్తపరిహారాల ప్రకరణం.

2) సీరత్ ఇబ్నెహిషామ్ రెండో సంపుటి 412వ పుట. సుననె అబూదావూద్‌లోని రక్తపరిహారాల ప్రకరణం.

www.abulhasanalinadwi.org

ఉపన్యాసం తరువాత దైవప్రవక్త(సల్లం) ప్రజల వైపు తిరిగి చూశారు. ఆయన ముందు ఖురైష్ తలబిరుసులు సిగ్గుతో తలలు వంచుకొని నిలబడి ఉన్నారు. వారిలో నిత్యం ఇస్లాంను తుడిచి పెట్టటానికి ప్రయత్నించిన ధీరులున్నారు, దైవప్రవక్త (సల్లం) ను దూషించిన దుర్మార్గు లున్నారు, దైవప్రవక్త (సల్లం)ను పరాభవించిన పాపాత్ములున్నారు. ఆయన నడిచే దారిలో ముళ్ళకంపలు పరిచిన వనితలూ ఉన్నారు. ఆయన ప్రజలకు హితబోధ చేయాలని వెళితే ఆయన పాదాలు రక్తసిక్తమయ్యేలా కొట్టి హింసించిన కఠినాత్ములూ ఉన్నారు, అదను దొరికితే దైవప్రవక్త నెత్తురు తాగాలని పరితపించిన పిశాచాలూ ఉన్నారు, చీటికి, మాటికి మదీనాపై దాడులు చేసి శాంతికి విఘాతం కలిగించిన అరాచకులూ ఉన్నారు, బలహీన ముస్లింలపై దారుణ మారణకాండను సృష్టించిన దుష్టులూ ఉన్నారు.

దైవప్రవక్త (సల్లం) వారందరి వైపు తీక్షణంగా చూస్తూ గంభీర స్వరంతో, "ఇప్పుడు మిమ్మల్ని నేనేం చేస్తానో తెలుసా?" అని గద్దించారు.

దైవప్రవక్త (సల్లం) సన్నిధిలో తలలు వంచుకొని నించున్న ఖురైషులు దుర్మార్గులే. మూర్ఖులే. కాని దైవప్రవక్త కారుణ్య స్వభావం గురించి తెలియని వారు మాత్రం కారు. అందుకే బిగ్గరగా విలపిస్తూ, "దైవప్రవక్తా! తమరు పెద్ద మనసున్న అన్నయ్య లాంటివారు, విశాల హృదయులైన భాతృజుల్లాంటివారు" అన్నారు.

ఖురైషుల నుండి ఆ మాట వినగానే దైవప్రవక్త కారుణ్య స్వభావం కట్టలు త్రెంచుకుంది. ఆయన శుభ అధరాలు కదలాడాయి.

"ఈ రోజు మిమ్మల్ని నిందించటం జరగదు. పొండి, మీరందరూ స్వేచ్ఛాజీవులై బ్రతకవచ్చు"[1] అన్నారు.

ఆ ప్రకటన వినగానే ఖురైషుల పాషాణ హృదయాలు మెత్తబడి అప్రయత్నంగానే ఇస్లాం వైపుకు మొగ్గాయి. మక్కా నుండి వలసపోయిన ముస్లింల ఆస్తుల్ని అవిశ్వాసులు కబ్జా చేసుకున్నారు. ఇప్పుడు అవిశ్వాసులు ముస్లింల ఆస్తుల్ని ముస్లింలకు వాపసు చేయవలసి వచ్చింది. కాని దైవప్రవక్త (సల్లం) పరోపకార భావంతో తమ ఆస్తుల్ని

1) సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 412వ పుట. ముస్నదె అహ్మద్‌లోని ఐదో సంపుటి 135వ పుట.

www.abulhasanalinadwi.org

వదలుకోవాలని ముస్లింలను ఆదేశించారు.

అంతలో నమాజ్‌కు వేళ అయింది. బిలాల్ (రజి) కాబా కప్పుపైకెక్కి అజాన్ ఇవ్వసాగారు. ఒక నీగ్రోజాతి వ్యక్తి దైవగృహంపై నించొని అజాన్ ఇచ్చే దృశ్యాన్ని చూడగానే కొద్ది క్షణాల క్రితం మెత్తబడిన ఖురైషుల హృదయాల్లో మళ్ళీ జాత్యహంకారం పెల్లుబికింది. అత్తాబ్ బిన్ ఉసైద్ అవమాన భారంతో కృంగిపోతూ, "దేవుడు మా నాన్న గౌరవాన్ని కాపాడాడు. ఈ నీచుని గొంతు వినకుండా ముందే ఆయన్ని పైకి లేపుకున్నాడు" అని అన్నాడు. " ఇక మా బతుకులు బుగ్గిపాలే" అన్నాడు ఇంకో ఖురైష్ వ్యక్తి.[1]

దైవప్రవక్త (సల్లం) సఫా కొండప్రాంతంలో ఓ ఎత్తైన చోట ఆసీనులయ్యారు. ఇస్లాం స్వీకరించాలనుకున్నవారు అక్కడికి వచ్చి ఆయన చేతిమీద ప్రమాణం చేసేవారు. పురుషుల ప్రమాణ కార్యక్రమం ముగిసిన తర్వాత స్త్రీల వంతు వచ్చింది. స్త్రీల నుండి ఎలా ప్రమాణం తీసుకునేవారంటే-ముందుగా ఇస్లాం ధర్మాంశాలు, నైతికతను అనుసరించే విషయంలో వారి నుండి ప్రమాణం తీసుకునేవారు. ఆ తర్వాత దైవప్రవక్త (సల్లం) ఒక పాత్రనిండా నీళ్ళు తెప్పించి అందులో తన చెయ్యి ముంచి తీసేవారు. ఆ తర్వాత స్త్రీలు ఆ పాత్రలో తమ చేతులు ముంచేవారు. ఆ విధంగా వారి ప్రమాణం.పూర్తయిపోయినట్లుగా భావించటం జరిగేది.[2]

పదిమంది ఖురైష్ అతిరథులు యావత్తు అరబ్బుదేశంలోనే ప్రముఖ నాయకులుగా పరిగణించబడేవారు. వారిలో ఒకరైన సఫ్వాన్ బిన్ ఉమయ్యా జెద్దాకు పారిపోయారు. ఉమైర్ బిన్ వహబ్ దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళి అరబ్బు నాయకుడంతటి వాడు మక్కా నుండి పారిపోయాడని చెప్పారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆయన మక్కాకు తిరిగివస్తే రక్షణ కల్పిస్తానని మాటిచ్చారు. దానికి సూచనగా తన తలపాగాను కూడా ఇచ్చి పంపారు. ఉమైర్ జిద్దా వెళ్ళి సఫ్వాన్ బిన్ ఉమయ్యాను తిరిగి మక్కాకు తీసుకొని వచ్చారు. హునైన్ యుద్ధం వరకు ఆయన ఇస్లాం స్వీకరించలేదు.[3]

---

1) సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 413వ పుట.
2) రహ్మతుల్లిల్ ఆలమీన్ మొదటి సంపుటి 120, 121 పుటలు.
3) సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 417, 418వ పుటలు.

www.abulhasanalinadwi.org

అబ్దుల్లాహ్ బిన్ జుబీరా అనే ప్రముఖ అరబ్బు కవి మక్కా విజయానికి ముందు తన కవితల ద్వారా దైవప్రవక్త (సల్లం)ను తూలనాడేవాడు. దివ్యఖురాన్పై విమర్శనాస్త్రాలు సంధించేవాడు. కాని మక్కా విజయం జరిగినప్పుడు అతను భయపడి నజరాన్కు పారిపోయాడు. ఆ తర్వాత కొంతకాలానికి తిరిగొచ్చి ఇస్లాం స్వీకరించాడు.[1]

హారిస్ బిన్ హిషామ్ కూతురు ఉమ్మె హకీమ్ ఇక్రిమా భార్య. మక్కా విజయం నాడు ఆమె ఇస్లాం స్వీకరించింది. కాని ఆమె భర్త ఇక్రిమా మాత్రం ఇస్లాం స్వీకరించకుండా ఎమన్కు పారిపోయారు. అప్పుడు ఉమ్మె హకీమ్ స్వయంగా ఎమన్ వెళ్ళి తన భర్తను ఇస్లాం వైపుకు ఆహ్వానించారు. ఎట్టకేలకు ఆయన ఇస్లాం స్వీకరించి ముస్లిం అయ్యారు. ఆ తర్వాత దంపతులిరువురూ మక్కాకు తిరిగి వచ్చారు. దైవప్రవక్త (సల్లం) ఆయన్ని చూడగానే పట్టరాని సంతోషంతో లేచి నిలబడ్డారు. వేగంగా ఆయన దగ్గరికి వెళ్ళి ఆయన్నుండి ప్రమాణం తీసుకున్నారు. ఆ సమయంలో తన ఒంటిపై దుప్పటి లేదన్న సంగతి కూడా ఆయనకు గుర్తు రాలేదు.[2]

హజ్రత్ హమ్జాను వెన్నుపోటు పొడిచి చంపి ఆ తర్వాత ఆయన భౌతికకాయం పట్ల పశువులా ప్రవర్తించిన నీగ్రో బానిస వహ్షీకు కూడా ఆ రోజు క్షమాభిక్ష లభించింది.[3]

మక్కా విజయం తర్వాత రెండోరోజు దైవప్రవక్త (సల్లం) కాబాగృహం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అదే సమయంలో పుజాలా బిన్ ఉమైర్ అదను చూసి దైవప్రవక్త (సల్లం) ను హత్య చేయాలని నిశ్చయించుకొని దగ్గరికి రాగానే దైవప్రవక్త (సల్లం) వెనక్కిమళ్ళి "పుజాలా వస్తున్నావా.....?" అన్నారు.

"ఆ (... వస్తున్నాను!" పుజాలాకు తనేం సమాధానం చెప్పాడో తనకే అర్థం కాలేదు.

"ఇందాక నువ్వు మనసులో ఏమని నిర్ణయం చేసుకున్నావు?"

---

1) సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 418, 419 పుటలు. దలాయిలున్నుబువ్వా గ్రంథం 99వ పుట.

2) బైహఖీగారి దలాయిలున్నుబువ్వా గ్రంథం ఐదవ సంపుటి 95వ పుట.

3) రహ్మతుల్లిల్ ఆలమీన్ గ్రంథం మొదటి సంపుటి 122వ పుట.

www.abulhasanalinadwi.org

దైవప్రవక్త (సల్లం) సూటిగా అడిగారు.

"అబ్బే... ఏం నిర్ణయం చేసుకున్నాను. నేను ఇందాకట్నుంచి అల్లాహ్ అల్లాహ్ అంటూ జపం చేసుకుంటున్నాను" తడుముకుంటూనే సమాధానం చెప్పారు పుజాలా.

దానికి దైవప్రవక్త (సల్లం) దరహాసం చిందిస్తూ, "సరే, నువ్వు మనసులోనే మన్నించమని దేవుణ్ణి వేడుకో" అని ఆయన రొమ్ము భాగంపై తన చెయ్యి ఉంచారు.

పుజాలా ఇలా అంటున్నారు. దైవప్రవక్త (సల్లం) నా ఛాతీపై చెయ్యి ఉంచగానే నా హృదయం నెమ్మదించింది. నాలో దైవప్రవక్త మీద విపరీతమైన ప్రేమాభిమానాలు పుట్టాయి. అప్పట్నుంచి ఆయన నాకు అందరికన్నా ప్రియతములై పోయారు.

నేను అక్కణ్ణుంచి ఇంటికి బయలుదేరాను. దారిలో నా ప్రియురాలు కనిపించింది. నేను రోజూ ఆమె దగ్గర కూర్చొని కాలక్షేపం చేసేవాణ్ణి. ఆమె నన్ను చూడగానే, "పుజాలా! ఒక మాట చెబుతాను ఇట్రా" అంది. నేనందుకు నిరాకరిస్తూ, "దేవుడు, దైవప్రవక్త అలాంటి మాటల నుండి వారిస్తున్నారు" అని అన్నాను.[1]

1) సీరత్ ఇబ్నె హిషామ్ రెండో సంపుటి 417వ పుట.

www.abulhasanalinadwi.org

# హునైన్ పోరాటం

మక్కా విజయం తరువాత అరబ్బు తెగలన్నీ తండోపతండాలుగా వచ్చి ఇస్లాం స్వీకరించసాగాయి.[1] కాని హవాజిన్, సఖీఫ్ తెగలపై ఏ మాత్రం ప్రభావం పడలేదు. ఈ తెగలవారు యుద్ధాలలో ఆరితేరినవారు. పోరాటపటిమ చూపగలవారు. ఇస్లాం ప్రాబల్యం పెరుగుతున్న కొద్దీ ఈ రెండు తెగలవారిలో అసహనం పెరిగి పోతుండేది. ఎందుకంటే నానాటికీ అరేబియాలో వాటికున్న వైశిష్ట్యం కాస్తా క్షీణించసాగింది. అందుకే మక్కా విజయానికి పూర్వమే హవాజిన్ తెగనాయకులు ఓ మారు అరేబియా ప్రాంతమంతా సందర్శించి ఇస్లాంకు వ్యతిరేకంగా ప్రజలకు నూరిపోశారు. సర్వత్రా విద్వేష బీజాలు నాటారు. దాదాపు ఓ ఏడాదికాలం వారి ఈ నకారాత్మక జన జాగరణ ఉద్యమం నడిచింది. అరబ్బులంతా కలసి ఒక్కుమ్మడిగా ముస్లింలపై దండెత్తాలని అప్పటికే వారంతా ఒక అవగాహనకు వచ్చారు. కాని మక్కా విజయం తరువాత వారంతా దిక్కుతోచని స్థితికి లోనయ్యారు. ముస్లింలను గనక ఈ తరుణంలో అణచి వేయకపోతే, ఇక ఎన్నడూ వారిని ఎదిరించలేమని సఖీఫ్ సర్దారులకు అర్థమై పోయింది.[2]

మహాప్రవక్త (సఅసం) మక్కా నుంచి పయనమవుతుండగా, ఆయన సరాసరి వారిపైకే దండెత్తి వస్తున్నట్లు పుకార్లు పుట్టాయి. ఇక ఆలస్యం చేయటం లేదని వారంతా కూడబలుక్కుని సకల సన్నాహాలతో తామే ముందుగా దాడి చేయటానికి నిశ్చయించుకున్నారు. వారి ఆవేశం పరాకాష్టకు చేరింది. వారి తెగలు, ఉపతెగలన్నీ కదలివచ్చాయి. పిల్లాజల్లా అంతా కదన రంగానికి కాలు దువ్వుతూ ముందుకు సాగారు.[3] రణరంగంలో ఆలుబిడ్డలుంటే వారి ప్రాణాలను కాపాడటానికి ప్రతి

---

1) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజి

2) సీరతున్నబీ - అల్లామా షిబ్లీనూమానీ-మొదటి సంపుటి, పేజీ 530, 531.

3) ముస్తద్రక్ హాకిమ్-3:51

www.abulhasanalinadwi.org

ఒక్కరూ తమ ప్రాణాలొడ్డి పోరాడతారన్నది వారి రణనీతి.[1]

ఈ యుద్ధంలో సఖీఫ్ హవాజిన్ తెగలన్నీ పాల్గొన్నప్పటికీ కాబ్, కలాబ్ అనే తెగలవారు మాత్రం తటస్థంగా ఉండి పోయారు. సైనిక సారథ్యం కోసం ఇరువురు వ్యక్తుల పేర్లు పరిశీలనకు వచ్చాయి. వారిలో మాలిక్ బిన్ ఔఫ్ హవాజిన్ తెగలో సుప్రసిద్ధ సర్దారు. రెండవ వ్యక్తి దురైద్ బిన్ సిమ్మ. ఇతను అరేబియాలోని అగ్రశ్రేణి కవులలో ఒకడు. జషమ్ అనే తెగకు సర్దారు. అతని కవితల్ని,సాహసోపేతమైన గాథల్ని గురించి ఇప్పటికీ అరబ్బులు చెప్పుకుంటూ ఉంటారు. కాని అతను సేనానిగా ఎన్నికయ్యేనాటికి నూరేళ్ళు దాటాయి. శారీరక సత్తువ పూర్తిగా క్షీణించింది. అయితే అరబ్బులకు అతనంటే అపారమైన గౌరవాభిమానాలుండటం వల్లనూ, అతని రణనీతిపై అందరికీ చెక్కుచెదరని విశ్వాసం ఉండటం వల్లనూ సారథ్య బాధ్యతలు అతనికే కట్టబెట్టారు. మాలిక్ బిన్ఔఫ్ సయితం అతన్ని ప్రాధేయపడ్డాడు. అతను విశ్రమించే మంచాన్ని ఎత్తుకుని యుద్ధరంగానికి వచ్చారు. "మనం ఇప్పుడు ఏ ప్రాంతానికి వచ్చాము?" అని అతనడిగాడు. "ఔతాస్" అని అందరూ బదులిచ్చారు. "ఇక్కడే ఆగిపోండి. ఈ ప్రదేశం ప్రతిఘటనకు సర్వవిధాలా అనువైనది. ఇక్కడి నేల మరీ గట్టిగానూ ఉండదు. కాళ్లు దిగబడేలా మరీ మెత్తగానూ ఉండదు" అని తన అనుభవాన్నంతా రంగరించి చెప్పాడు ఆ వృద్ధనాయకుడు. "ఇక్కడ చిన్న పిల్లల ఏడ్పులు వినిపిస్తున్నాయేమిటీ?" మళ్ళీ ప్రశ్నించాడు. "పసిపిల్లల్ని, స్త్రీలను కూడా వెంటబెట్టుకొచ్చాం. నిలకడగా పోరాడాలన్న ఉద్దేశ్యంతోనే ఆలుబిడ్డల్ని తీసుకువచ్చాము" -అన్నారంతా. "రణరంగంలో నిలకడకు తోడ్పడేవి ఖడ్గాలు, ఆయుధాలే సుమా! మిగతావేమీ మీ పాదాలను నిలదొక్కుకోనివ్వవు. దురదృష్టవశాత్తూ ఓడిపోతే అది మన మహిళల, పసివాళ్ళ పాలిట అత్యంత అవమానకరంగా పరిణమిస్తుంది. ఆ సంగతిని బాగా అర్థం చేసుకోండి" అంటూ తన వారిని అప్రమత్తం చేశాడు ఆ ముదుసలి నాయకుడు.

"కాబ్, కలాబ్‌లు కూడా ఈ యుద్ధంలో పాల్గొంటున్నారా?" తీవ్రంగా ఆలోచించుకుంటూ అడిగాడు మళ్ళీ. పాల్గొనటంలేదని

---

1) సీరతున్నబీ - 1: 531

www.abulhasanalinadwi.org

తెలిసింది.ఈ దినం మన కోసం సుదినమే అయి ఉంటే ఆ తెగల వారు పాల్గొనకుండా ఉండేవారు కారు అన్నాడు. బహిరంగప్రదేశంలో ఉండి పోరాడటం కన్నా ఏదైనా సురక్షిత స్థావరాన్ని ఎన్నుకుని గెరిల్లా తరహా యుద్ధం చేయాలన్నది ఆ వృద్ధుని అభిప్రాయం. కాని మాలిక్ బిన్ ఔఫ్ యువకుడు. అతనిలో ఉత్సాహం, పరువం ఉరకలు వేస్తోంది. గెరిల్లా తరహా పోరాటానికి అతను సుముఖంగా లేడు. పైగా, వేధ ముకుళించుకు పోయిన ముసలివాళ్ళ మాట వింటే తమ సంగతి యిక అంతేనని హెచ్చరించాడు.[1]

హవాజిన్, బనీసఖీఫ్, యుద్ధ సన్నాహాల గురించి దైవప్రవక్త (సఅసం)కు చూచాయగా తెలిసింది. నిజానిజాలను తెలుసుకోవడానికి ఆయన (స) అబ్దుల్లా బిన్ ఉబై హద్రద్‌ని పంపించారూ. ఆయన గూఢచారిగా హునైన్‌కు వచ్చి, సైనికరంగంలో జొరబడి పరిస్థితులన్నీ బేరీజు వేశారు.[2] తప్పనిసరి పరిస్థితుల్లో మహాప్రవక్త (స) యుద్ధానికి సిద్ధం కావలసి వచ్చింది. ఆయుధ సామగ్రి కోసం రుణం తీసుకోవలసి వచ్చింది. అబ్దుల్లా బిన్ రబీయ అప్పట్లో అతిపెద్ద ధనికులు. ఆయన ఈ యుద్ధం కోసం 30 వేల దిర్హములు అప్పుగా ఇచ్చారు.[3] సుఫ్వాన్ బిన్ ఉమయ్యా మక్కాలో మరో ముఖ్య నాయకుడు. అతిథి మర్యాదలో అగ్రజుడు. కాని అప్పటి వరకూ అతనింకా ఇస్లాం స్వీకరించలేదు. ఆయుధ సామగ్రి ఇవ్వమని మహాప్రవక్త (సఅసం) అతన్ని కోరారు. అతడు పెద్ద మనసుతో వంద యుద్ధ కవచాలతో పాటు మరికొంత సామగ్రిని కూడా సమకూర్చాడు.[4] ఎట్టకేలకు హిజ్రీ 8 యేట షవ్వాల్ మాసంలో (క్రీ.శ. 630 జనవరిలో) 12 వేల మంది ముస్లిం సైనికులు సమరోత్సాహంతో హునైన్ వైపుకు సాగిపోయారు. అందరినోటా ఒక్కటే మాట"ఈ రోజు మనల్ని ఎదుర్కొనే మొనగాడుఎవడో చూద్దాం" అని! అయితే వారి ఈ ధోరణి దైవానికి ఏ మాత్రం నచ్చలేదు.[5]

---

1) జాదుల్ మఆద్ - 3 :466, సీరత్ ఇబ్నె హిషామ్-2:338, 339
2) ముస్తద్రక్ హాకిమ్-3:51, ఇబ్నెహిషామ్-2:440.
3) సీరతున్నబీ-1:533.
4) సుననె బైహఖీ-6:89. సుననె అబూ దావూద్-కితాబుల్ బుయూ.
5) సీరత్ ఇబ్నె హిషామ్-2:444.

www.abulhasanalinadwi.org

"మీరు మీ సంఖ్యాబలంపై బీరాలు పోయిన హునైన్ దినాన్ని నెమరు వేసుకోండి. కాని అది మీకు ఏ మాత్రం పనికి రాకుండా పోయింది. భూమి విశాలంగా ఉండి కూడా అది మీ కోసం ఇరుకై పోయింది. అంతేకాదు, మీరు వెన్నుచూపి పారిపోసాగారు. అప్పుడు అల్లాహ్ తన ప్రవక్తపై, ముస్లింలపై ప్రశాంతతను అవతరింప జేశాడు. మీకు కానరాని సేనలను మీకు అండగా పంపించాడు. వారు అవిశ్వాసులకు తమ తడాఖా చూపించారు. అవిశ్వాసులకు విధించబడే శిక్ష యిదే." (తౌబా)

మొదట్లో ముస్లింలదే పైచేయి అయింది. దాంతో వారు యుద్ధప్రాప్తి వైపుకు ఎగబడ్డారు. ఈ అవకాశం కోసమే పొంచి ఉన్న శత్రుసైనికులు ఎడతెగకుండా బాణాల వర్షం కురిపించారు. అనూహ్యమైన ఈ పరిణామానికి ముస్లిం సైనిక పంక్తుల్లో గందరగోళం ఏర్పడింది. కలకలం రేగింది.[1]

ఆ యుద్ధంలో పాల్గొన్న సహాబీలలో హజ్రత్ అబూ ఖాతాదా ఒకరు. పరిస్థితుల తీవ్ర స్వరూపాన్ని వివరిస్తూ ఆయన ఇలా అన్నారు: సైనికులు దిక్కుతోచక అటూ యిటూ పరుగెత్త సాగారు. ఆ సమయంలో ఒక అవిశ్వాసి ఒక ముస్లిం ఛాతీపై కూర్చుని ఉన్నాడు. అప్పుడు నేను విసిరిన ఆయుధం అతని కవచాన్ని ఛేదించుకుంటూ వీపులో దిగబడింది. అయినాసరే అతడు వెను తిరిగి నన్ను గట్టిగా అదిమి పట్టుకున్నాడు. ఆ సమయంలో నా ప్రాణం పోయినంత పనయింది. కాని దైవవశాత్తు అంతలోనే అతను కుప్పకూలిపోయాడు. ఆ సమయంలోనే హజ్రత్ ఉమర్ (రజి) కనిపించారు. మనవాళ్ళ పరిస్థితి ఎలా ఉంది? అని అడిగాను. "దైవేచ్ఛ ఇదే కాబోలు" అని ఆయన బదులిచ్చారు.[2]

## ఓటమికి కారణాలు

ఈ యుద్ధంలో ముస్లింల ఓటమికి పెక్కు కారణాలున్నాయి. హజ్రత్ ఖాలిద్(రజి) సారథ్యంలో వచ్చిన సైనికుల్లో చాలామంది మక్కా

1) సహీహ్ బుఖారీ: కితాబుల్ మగాజీ-బాబు గజ్వతుల్ హునైన్.
2) సహీహ్ బుఖారీ: కితాబుల్ మగాజీ-బాబు గజ్వతుల్ హునైన్.

www.abulhasanalinadwi.org

యువకులు. వారు అప్పుడప్పుడే ఇస్లాం స్వీకరించి ఉన్నారు. తాము నవయువకులమన్న మితిమీరిన విశ్వాసం వల్ల చాలామంది ఆయుధాల్లేకుండానే వచ్చారు. సైనికుల్లో అప్పటికీ ఇస్లాం స్వీకరించని వారు రెండు వేల మంది వరకూ ఉన్నారు.

అదే సమయంలో హవాజిన్ తెగవారు యుద్ధ కాముకులు. వారు ప్రదర్శించే విలువిద్య ముందు అరబ్బులెవరూ నిలదొక్కుకోలేరు. రణరంగంలో వారు ప్రయోగించే ఒక్క బాణం కూడా వృథాపోదు. అదీగాక అవిశ్వాసులు చాలా ముందుగా రణరంగానికి వచ్చి తమకు అనువైన ప్రదేశాలను ఎంచుకున్నారు. విలుకాండ్రు పర్వత కనుమల్లోనూ, గుట్టల మాటున మొహరించి గెరిల్లా యుద్ధం చేశారు.[1]

వారు కురిపించే బాణాల వర్షం ముందు 12 వేలమంది సైన్యం వెలవెలబోయింది. కాని అత్యంత క్లిష్టమైన ఆ తరుణంలో ఒక మూర్తిమంతుడు కదలని కొండలా కదన రంగంలో నిలబడి ఉన్నాడు. అతను స్వయాన ఒక సైనిక పటాలంలా, మొక్కవోని వీరునిలా, ఒక సామ్రాజ్యంలా, ఒక మహాజ్ఞానిలా, బహుముఖ ప్రజ్ఞాశాలిలా, విశ్వనాయకునిలా కానవస్తున్నాడు.[2]

దైవప్రవక్త (స) కుడివైపుకు తిరిగి పలాయనం చిత్తగిస్తున్న వారి నుద్దేశ్యించి, "ఓ అన్సార్ వర్గీయులారా!" అని ఎలుగెత్తి పిలిచారు. "మేము హాజరయ్యాము" అన్న జవాబు ప్రతిధ్వనించింది. ఎడమవైపుకు తిరిగి మళ్ళీ పిలిచారు. ఈసారి కూడా అదే సమాధానం! వెంటనే ఆయన (సఅసం) వాహనం నుంచి దిగి ఒక దైవప్రవక్తగా తన సహజశైలిలో నినదించారు. "నేను దేవుని దాసుడను. దైవప్రవక్తను."[3]

బుఖారీలోని మరో ఉల్లేఖనం ప్రకారం ఆయన(స) నోట ఈ పలుకులు పదే పదే వెలువడ్డాయి.

> "నేను దైవప్రవక్తను. నేను చెబుతున్నది అబద్ధం కాదు.
> నేను అబ్దుల్ ముత్తలిబ్ బిడ్డను".[4]

---

1) సీరతున్నబీ - 1: 535.
2) సీరతున్నబీ - 1: 535, 538. ఇమామ్ నవవీగారు ముస్లిం వ్యాఖ్యానంలో ఓటమి వెనుక కారణాలు కొన్నింటికి విశదీకరించారు.
3) సహీహ్ బుఖారీ: కితాబుల్ మగాజీ-బాబు గజ్వతుత్తాయఫ్.
4) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ-బాబు గజ్వతుత్తాయఫ్.

www.abulhasanalinadwi.org

హజ్రత్ అబ్బాస్ (రజి) ది కంచుకంఠం. ముహాజిర్, అన్సార్ వర్గీయులను కేకేసి పిలువవలసిందిగా ఆయన (స) అబ్బాస్‌ను పురమాయించారు. అప్పుడు హజ్రత్ అబ్బాస్, వాళ్ళనుద్దేశించి,

ఓ అన్సార్ వర్గీయులారా!

ఓ బైతె రిజ్వాన్ వారలారా!!

అంటూ బిగ్గరగా కేకేశారు. ఈ పిలుపు వినబడగానే తిరోన్ముఖులై వెళ్ళిపోతున్న సైనికులంతా మరలివచ్చారు. అనూహ్యమైన ఈ పరిణామానికి కొన్ని గుఱ్ఱాలు బెదిరిపోయినాయి. కాని సైనికులు ప్రవక్త పిలుపును అందుకుని గుర్రాలను దూకి వచ్చేశారు. దాంతో రణరంగ పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది.[1] అవిశ్వాసులు పలాయనం చిత్తగించసాగారు. మరికొంతమంది బందీలయ్యారు. సఖీఫ్ తెగకు చెందిన ఒక ఉపతెగ బనూ మాలిక్. ఈ తెగవారు కడదాకా పోరాడారు. కాని 70 మంది సైనికుల్ని కోల్పోయారు. తమ నాయకుడైన ఉస్మాన్ బిన్ అబ్దుల్లాహ్ మరణించటంతో బనూ మాలిక్ సయితం యుద్ధరంగం లో నిలదొక్కుకోలేకపోయింది.[2]

పరాజయం పాలైన సైన్యం చెల్లాచెదురైపోయింది. కొంతమంది ఔతాస్‌లో పోగయ్యారు. మరి కొంతమంది తాయఫ్ పట్టణానికి వెళ్ళి శరణు పొందారు.సైన్యాధిపతి అయిన మాలిక్ బిన్ ఔఫ్ కూడా ఈ బృందంలో ఉన్నాడు.

దురైద్ బిన్ సిమ్మ కొన్ని వేల మందిని వెంటబెట్టుకుని ఔతాస్‌కు వచ్చాడు. వారిని ప్రతిఘటించడానికి దైవప్రవక్త (స) ఒక సైనిక దళాన్ని అబూఆమిర్ అష్అరీ నేతృత్వంలో అక్కడికి పంపించారు. కాని దురైద్ కొడుకు చేతిలో అబూఆమిర్ అమరగతి నొందారు. దాంతో ఇస్లాం ధ్వజం అతని చేతికి చిక్కింది. ఈ పరిస్థితిని చూచిన హజ్రత్ అబూమూసా అష్అరీ (రజి) ఓర్చుకోలేక ఒక్క ఉదుటున శత్రువుపై లంఘించి, అతన్ని తుదముట్టించారు. ఆ విధంగా ఇస్లాం ధ్వజాన్ని తన హస్తగతం చేసుకున్నారు.[3]

1) సహీహ్ ముస్లిం: కితాబుల్ జిహాద్.
2) ఇబ్నె హిషామ్-2:449, 450.
3) ఇబ్నె హిషామ్-2:453, సహీహ్ బుఖారీ:బాబు గజ్వతుల్ ఔతాస్.

యుద్ధఖైదీలుగా పట్టుబడిన వారు వేలసంఖ్యలో ఉన్నారు. వారిలో షీమా అనే మహిళ కూడా ఉంది. ఆమె దైవప్రవక్త (స)కు పాలవరుస సోదరి అవుతుంది. సైనికులు ఆమెను నిర్బంధించినప్పుడు "ఏమిటీ, మీరు పైగాంబరు సోదరిని బంధిస్తున్నారా?" అని ఆమె ప్రశ్నించింది. నిజనిర్ధారణ కోసం సైనికులు ఆమెను దైవప్రవక్త (స) సమక్షంలో హాజరుపరచారు. అప్పుడామె తన వీపును చూపిస్తూ, చిన్నప్పుడు దైవప్రవక్త (స) తనను కొరికిన సంఘటనను గుర్తు చేసింది. అనురాగంతోనూ, ఆనందంతోనూ దైవప్రవక్త (సఅసం) కళ్లు చెమ్మగిల్లాయి. ఆమెను కూర్చోబెట్టడానికి తాను స్వయంగా చాపవరచారు. ప్రేమతో పలకరించారు. ఆమెకు కుశల ప్రశ్నలు వేశారు. కొన్ని మేకలను, నిప్పు కోళ్ళను ఆమెకు కానుకగా యిచ్చారు. ఆమె తలచుకుంటే తమతో ఉండవచ్చనీ, లేదంటే ఆమెను స్వస్థలానికి పంపిస్తానని చెప్పారు. తన వాళ్లపట్ల గల ప్రేమతో ఆమె తన స్వస్థలానికి వెళ్ళడానికే సుముఖత వ్యక్తం చేసింది. అప్పుడామెను గౌరవ మర్యాదలతో ఆమె ఇంటికి పంపించారు దైవప్రవక్త (సఅసం).[1]

హునైన్‌లో చావుతప్పి కన్నులొట్టపోయిన మిగతా శత్రుసైన్యం తాయఫ్ నగరానికి వెళ్ళి తలదాచుకుంది. కొన్ని రోజులు గడిచాయి. ప్రతీకార భావంతో వారు మళ్లీ యుద్ధసన్నాహాలు మొదలెట్టారు. తాయఫ్ సర్వవిధాలా సురక్షిత స్థానం. ఆ నగరానికి నలువైపులనుంచీ రక్షణ నిమిత్తం ప్రహరీ గోడలుండటం వల్ల కూడా దానిని 'తాయఫ్' అనే పేరు వచ్చింది. అక్కడ నివసించే సఖీఫ్ తెగ అరేబియాలోకెల్లా గొప్ప శూరుల తెగగా -వినుతి కెక్కింది. ఖురైషులతో సమ ఉజ్జీ అనదగ్గ అర్హతలు ఈ తెగవారిలో ఉన్నాయి. సఖీఫ్ తెగ నాయకుడైన ఉర్వ బిన్ మసూద్ అబూసుఫ్యాన్‌కి అల్లుడవుతాడు. దివ్యఖుర్ఆనే గనక ఆకాశం నుంచి అవతరించే పక్షంలో మక్కా సర్దారులపైననో, తాయఫ్ సర్దారులపైననో అవతరించేది అని మక్కా అవిశ్వాసులు వ్యాఖ్యానించేవారు. యుద్ధతంత్రాల్లో కూడా బనూసఖీఫ్‌ది అందెవేసిన చేయి.[2] ఉర్వబిన్ మసూద్, గీలాన్ బిన్ సలమ వంటి నాయకులు యమన్‌లోని 'జర్షి

1) ఇబ్నె హిషామ్-2:458, తబ్రీ-2:171.
2) సీరతున్నబీ-1:541, తారీఖె తబ్రీ-2:171

www.abulhasanalinadwi.org

జిల్లాకు వెళ్ళి కోటలను కూల్చే, క్షిపణుల్లాంటి ఆయుధాలను ప్రయోగించే ప్రత్యేక శిక్షణ పొంది వచ్చారని తబ్రీ, ఇబ్నె ఇస్‌హాఖ్‌లు పేర్కొన్నారు.[1]

అక్కడ ఒక సురక్షితమైన కోట ఉండేది. తాయఫ్‌వాసులు, ఓటమి పొందిన సైనికులు కలసి ఆ కోటను మరమ్మత్తు చేశారు. ఒక ఏడాది కాలానికి సరిపడా ఆహార పదార్థాలను, ఇతరత్రా వనరులను సమకూర్చుకున్నారు. కోటకు నలువైపులా అగ్ని గోళాలతో కూడుకున్న అస్త్రాలను, విలుకాండ్రను మోహరించారు.[2]

హునైన్‌లో లభించిన విజయసొత్తును, యుద్ధఖైదీలను సురక్షితంగా ఉంచమని దైవప్రవక్త (స) ఆదేశించి, తాయఫ్ వైపుకు పురోగమించాలని నిశ్చయించుకున్నారు. సేనాధిపతిగా హజ్రత్ ఖాలిద్ (రజి) ముందుగానే అక్కడికి పంపబడ్డారు. కోట ముట్టడించబడింది. ఈ రకమయిన ముట్టడి జరగటం ఇస్లామీయ చరిత్రలో అదే మొట్టమొదటిసారి. కోటలో తలదాచుకున్న నగరవాసులు కొలిమిలో కాల్చబడిన ఇనుప చువ్వలను సైనికులపై విసిరారు. ఎడతెగకుండా కోటపైనుంచి వారు కురిపించిన బాణవర్షానికి ముస్లిం సైనికులు నిలదొక్కుకోలేకపోయారు. ఎంతో మంది క్షతగాత్రులయ్యారు. ఈ ముట్టడి 20 రోజులదాకా సాగింది. అయినప్పటికీ కోట వారి వశం కాలేకపోయింది.[3] దైవప్రవక్త (సఅసం) నౌఫిల్ బిన్ ము ఆవియాను పిలిచి, "ఏం చేద్దాం?" అని అడిగారు. "నక్క గుహలోకి దూరింది. ప్రయత్నిస్తే ఆలస్యంగానయినా చేజిక్కుతుంది. వదలివేసినా వచ్చే నష్టం ఏమీలేదు" అని ఆయన అభిప్రాయపడ్డారు. అంతే. ముట్టడిని ఉపసంహరించుకోమని దైవప్రవక్త (స) ఆజ్ఞాపించారు. "దైవప్రవక్తా! వీళ్లను శపించండి" అని సహచరులు ఆగ్రహంతో కోరారు.

> "దేవా! సఖీఫ్ తెగవారికి సన్మార్గం చూపు. వారు నాకు దగ్గరయ్యే సద్బుద్ధిని వొసగు"

అని దైవప్రవక్త (సఅసం) ఎంతో ఆర్ద్రతతో ప్రార్థించారు.

---

1) ఇబ్నె హెషామ్-2:478
2) తబఖాత్ ఇబ్నెసాద్-2:158.
3) సీరత్ ఇబ్నె హిషామ్-2:482, 483, తబఖాత్ ఇబ్నె సాద్-2:158.

www.abulhasanalinadwi.org

కోట ముట్టడిని ఉపసంహరించుకున్న తరువాత ఆయన(స) 'యుద్ధప్రాప్తి'ని నిలువ ఉంచిన "జియ్యిర్రాన" స్థలానికి వచ్చారు. యుద్ధప్రాప్తి కుప్పతెప్పలుగా పడి ఉంది. 6 వేల మంది యుద్ధఖైదీలు, 24 వేల ఒంటెలు, 40 వేల గొఱ్ఱెలు, 4 వేల ఊఖియాల వెండి ఆ యుద్ధ ప్రాప్తిలో ఉన్నాయి. యుద్ధఖైదీల విషయంలో ఆయన (స) వెంటనే ఒక నిర్ణయానికి రాలేదు. ఖైదీల సంబంధీకులు ఎవరయినావస్తే, వారితో చర్చించి తదనుగుణంగా వ్యవహారం చేయాలన్నది ఆయన (స) అభిమతం. కాని ఎన్నో రోజులు ఎదురు చూసినా ఎవరూ రాలేదు. యుద్ధప్రాప్తి 5 భాగాలుగా విభజించబడింది. అందులో 4 భాగాలను నియమానుసారం సైనికుల మధ్య పంచిపెట్టారు. 5వ భాగం బైతుల్‌మాల్ కోసం, అగత్యపరులకోసం నిలువ ఉంచబడింది.

అప్పుడప్పుడే ఇస్లాం స్వీకరించిన మక్కా సర్దారులు కొంతమంది ఉన్నారు. ధర్మావలంబన విషయంలో వారింకా పరిపక్వతను పొందలేదు. విశ్వాస(ఈమాన్) బీజం వారి మనోక్షేత్రంలో యింకా బలంగా నాటుకోలేదు. దివ్యఖుర్ఆన్ అటువంటి వారిని "ముఅల్లఫతుల్ ఖులూబ్" (మనసులు జయించబడినవారు)గా అభివర్ణించింది. ఖుర్ఆన్‌లో 'మాలె గనీమత్' (యుద్ధప్రాప్తి) ప్రస్తావన వచ్చిన చోటల్లా సాధారణంగా ఈ వర్గం ప్రస్తావన కూడా వస్తుంది. దైవప్రవక్త (సఅసం) వారు పరిస్థితుల స్వరూపాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నవ ముస్లింలకు ఉదారంగా కానుకలు ఇచ్చారు.[1]

ఈ విధంగా కానుకలు అధికంగా పొందిన వారిలో మక్కావాసులు, కొత్తగా ఇస్లాం స్వీకరించినవారూ ఉన్నారు. దీంతో అన్సారుల మనసు నొచ్చుకుంది. "దైవప్రవక్త (స) ఖురైషులపై కానుకల వర్షం కురిపించి, మాకేమో శూన్యహస్తం చూపించారు" అని కొంతమంది చెప్పుకున్నారు కూడా. "కష్టకాలంలోనయితే మేము గుర్తుకు వస్తాం. కష్టాలు తీరాక కానుకలు మాత్రం మరొకరికి ముడుతాయి" అని మరికొంతమంది వాపోయారు.

---

1) దలాయలున్నబవ-5:171, ఇబ్నెహెషామ్-2: 489, సీరతున్నబీ-1:542, 543. సహీహైన్‌లో కూడా ఈ ప్రస్తావన ఉంది.

www.abulhasanalinadwi.org

ఈ మాటలు దైవప్రవక్త (స) దాకా వెళ్ళాయి. ఆయన ఎంతో వ్యాకులతకు లోనయ్యారు. అన్సారులను పిలిపించారు. జనులు కూర్చోవడానికి ఒక పందిరి వేయించారు.

దైవప్రవక్త (స) అన్సారులను ఉద్దేశ్యించి, "ఏమిటీ? మీరు నా గురించి చెప్పుకుంటున్న ఈ మాటలు నిజమేనా?" అని అడిగారు.

"దైవప్రవక్తా! మాలోని పెద్దలు, అనుభవజ్ఞులు ఎవరూ అలా అనలేదు. యువకులు కొందరు ఈ మేరకు వ్యాఖ్యానించారు" అని బదులిచ్చారు.

సహీహ్ బుఖారీలో అన్సారుల గొప్పదనాన్ని గురించి వివరించే అధ్యాయంలో హజ్రత్ అనస్ ఉల్లేఖనం ఇలా ఉంది: దైవప్రవక్త (సఅసం) అన్సారు సోదరులను పిలిపించి, "మీ గురించి ఏమేమో వింటున్నాను. అసలు సంగతేమిటి?" అని విచారించారు. అన్సారులు సత్యసంధులు. వారెన్నడూ అబద్ధం చెప్పలేదు. అందుకే ముక్తసరిగా, "తమరు వినేది నిజమే" అని సమాధానమిచ్చారు.1

అప్పుడాయన (సఅసం) అన్సారు సోదరులనుద్దేశించి ప్రసంగించారు. మానవ చరిత్రలోనే ఎంతో అపురూపమైన, అనుపమమైన ప్రసంగం అది!

ఆయన అన్సారుల వైపు తిరిగి, "ఒకప్పుడు మీరు మార్గవిహీనతకు లోనై ఉండేవారు. దేవుడు నా ద్వారా మీకు రుజుమార్గం చూపిన విషయం నిజం కాదా? మీరు చెల్లాచెదురై ఉండేవారు. ఒండొకరి పట్ల శత్రువులుగా మసలుకునేవారు. దేవుడు నా ద్వారా మీ మధ్య ఐకమత్యాన్ని, సుహృద్భావాన్నీ సృజించిన సంగతి సత్యం కాదా? మీరు దుర్భర దారిద్ర్యానికి లేమికి లోనై ఉండేవారు. దేవుడు నా ద్వారా మీకు సిరిసంపదలను, కలిమిని ప్రసాదించలేదా?"

ఈ విధంగా దైవప్రవక్త (స) వేసిన ప్రతి ప్రశ్నకూ అన్సారులు "ఔననీ, నిజమనీ" జవాబు ఇస్తూ పోయారు. "దేవుడు మరియు దైవప్రవక్త (స) తమకు చేసిన ఉపకారం అన్నింటికన్నా గొప్పది" అని ఒప్పుకున్నారు.

1) సహీహ్ బుఖారీ: కితాబుల్ మగాజీ-బాబు గజ్వతుత్తాయిఫ్

www.abulhasanalinadwi.org

ఉన్నట్టుండి సీను అకస్మాత్తుగా మారిపోయింది.

"లేదు. మీరు చెప్పేది నిజం కాదు"- అన్నారు దైవప్రవక్త (స) అందరూ అవాక్కయి ఆయన(స) వంక చూడసాగారు.

"మీరు ఇవ్వవలసిన సమాధానం ఇది కాదు. నిజానికి మీరు ఇలా అనాల్సింది.. 'ఓ ముహమ్మద్(స)! జనులు మిమ్మల్ని ధిక్కరించినపుడు మేము మిమ్మల్ని నిజప్రవక్తగా ధృవీకరించాము. మీవాళ్లు మిమ్మల్ని దూరం చేసినప్పుడు మేము మీకు ఆశ్రయమిచ్చాము. మీరు కడు నిస్సహాయ స్థితిలో మా దగ్గరకు వచ్చారు. మేము మీకు ఆదరువుగా నిలిచాము. మీ సందేశ కార్యక్రమానికి తోడ్పాటునందించాము..." అని మీరు చెబుతూపోండి. 'అవును,నిజమే' అని నేను ధృవీకరిస్తూ పోతాను.

అప్పటికే అన్సారుల గుండెలు కరిగి ప్రవహించ సాగాయి. దైవప్రవక్త (సఅసం)గారి కరుణా రసం పొంగిపొరలుతూనే ఉంది.

"కాని అన్సారు సోదరులారా! మీరే చెప్పండి. జనులు ఒంటెల్ని, గొర్రెల్ని వెంటబెట్టుకుని తమ ఇళ్ళకు సాగిపోగా, మీరు దైవప్రవక్త (స)ను మీ ఇళ్ళకు గొనిపోవటం మీకు సమ్మతం కాదా?!"

అంతే! అన్సారులు ఇక తమ భావోద్రేకాలను అదుపు చేసుకోలేకపోయారు. "మాకు ముహమ్మద్ (సఅసం) చాలు. మరేమీ అక్కరలేదు" అంటూ ముక్తకంఠంతో నినదించారు అన్సారులు. ఎంతోమంది బోరున విలపించారు. వారి గడ్డాలు కన్నీటితో తడిసి పోయాయి.

ఇప్పుడు వారిని సముదాయించటం దైవప్రవక్త (స) పనయింది. "మక్కా వాసులు ఇప్పుడిప్పుడే ఇస్లాం స్వీకరించారు. నేను వారికి వారి హక్కును ఇవ్వలేదు. వారి మనసులను జయించే వ్యవహారం మాత్రమే వారితో జరిపాను"[1] అని అన్సారులను ఓదార్చారు.

హునైన్‌లో పట్టుబడిన యుద్ధఖైదీలు 'జయ్యిర్రాన'లో ఉన్నారు. ఖైదీలను విడుదల చేయాలంటూ ఓ ప్రముఖుల దౌత్యబృందం దైవప్రవక్త

1) సహీహ్ బుఖారీ: కితాబుల్ మగాజీ-బాబు గజ్వతుత్తాయఫ్...

www.abulhasanalinadwi.org

(స) వద్దకు వచ్చింది. వారెవరోకాదు, దైవప్రవక్త (స)కు బాల్యంలో పాలుత్రాపిన హజ్రత్ హలీమా తెగవారే. తెగనాయకుడు ఈ సందర్భంగా ఉపన్యసించాడు. అతను దైవప్రవక్తనుద్దేశించి, "ఇప్పుడు మీ వద్ద బందీలుగా ఉన్న మహిళలలో మీ మేనత్తలు, మీ పినతల్లులు కూడా ఉన్నారు. దైవసాక్షి! అరబ్బు పరిపాలకులలో ఎవరు మా మహిళల పాలు త్రాగి ఉన్నా వారిపట్ల మేము ఎన్నో ఆశలు పెట్టుకుని ఉంటాం. ఇక తమరి విషయంలోనయితే మాకు మరిన్ని ఆశలు ఉన్నాయి" అని అన్నాడు. దానికి దైవప్రవక్త (సఅసం) ఇలా స్పందించారు: "అబ్దుల్ ముత్తలిబ్ కుటుంబానికి ఎంత భాగం వస్తుందో అదంతా మీదేననుకోండి. అయితే యుద్ధఖైదీల విడుదల కోసం కొన్ని నిబంధనలను పాటించటం అవసరం కదా! అందుకే నమాజు అనంతరం, అక్కడ సమావేశమై ఉన్న జనులందరి సమక్షంలో విజ్ఞప్తి చేసుకోండి."

జుహ్ర్ నమాజు అనంతరం ఆ దౌత్యబృందం ముస్లిమందరినీ ఉద్దేశించి అభ్యర్థన చేసుకుంది. దానికి సమాధానంగా దైవప్రవక్త (సఅసం), "నాకు నా కుటుంబీకులపై మాత్రమే అధికారం ఉంది. అయితే ముస్లిములందరినీ నేను సిఫారసు మాత్రం చేయగలను" అన్నారు. 'అయితే మా భాగం కూడా మేము సమర్పించుకుంటున్నాం' అని అన్సారులు, ముహాజిర్లు ముందుకొచ్చారు. ఈ విధంగా 6 వేలమంది యుద్ధఖైదీలు ఒక్కసారిగా విడుదల అయ్యారు.[1]

1) తారీఖె తబ్రీ-2:173, ఇబ్నె హిషామ్-2:488, 489

www.abulhasanalinadwi.org

# తబూక్ ప్రతిఘటన

ఒకరోజు ఒక వర్తక బృందం సిరియా నుంచి వచ్చి, రోము సైన్యాలు మదీనాపై దండెత్తి రావటానికి సన్నాహాలు సాగిస్తున్నట్లు చెప్పింది. అరేబియా ప్రాంతంలోని క్రైస్తవ తెగలు కూడా ఈ సమర సన్నాహాల్లో పాల్గొంటున్నట్లు మరో సమాచారం అందింది.[1]

దండెత్తి వస్తున్న సైన్యాన్ని అరేబియా ప్రాంతంలో అడుగుపెట్టకముందే -సరిహద్దుల్లోనే-నిలువరించటం అవసరమనీ, ఆ సైన్యాలు గనక తమ భూభాగంలోకి చొచ్చుకుని వస్తే దేశంలో అశాంతి అలజడులు చెలరేగే ప్రమాదం ఉందని దైవప్రవక్త (స) భావించారు.

రోము సామ్రాజ్యాన్ని ఢీ కొనటమంటే ఆషామాషీ వ్యవహారం కాదు. దాదాపు ప్రపంచ భూభాగంలో సగం దాని ఆధీనంలోనే ఉంది. ఈ మధ్యనే రోము సైన్యాలు ఈరాన్ సామ్రాజ్యానికి తమ తడాఖా చూపించి ఉన్నాయి.[2]

మరోవైపు ముస్లింల ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం ఆశాజనకంగాలేదు. వారిదగ్గర ఒనరులు లేవు. ఆయుధ సామగ్రి లేదు. అందునా వేసవికాలం. అరేబియా వేసవి ఎలా ఉంటుందో జగద్విదితమే. మదీనా నగరంలో పంటలు కోత కొచ్చాయి. ఖర్జూరపండ్లు ఆరగిస్తూ నీడలో సేదతీరవలసిన తరుణమది.[3]

ఒనరుల సమీకరణ నిమిత్తం దైవప్రవక్త సర్వసామాన్యమైన విరాళాల ప్రకటన చేశారు. ఈ ప్రకటన వెలువడగానే హజ్రత్ ఉస్మాన్ (రజి) మూడు వందల ఒంటెల్ని, యాభై గుర్రాలను, వెయ్యిదీనార్ల

---

1) తబఖాత్ ఇబ్నెసాద్-2:165.
2) రహ్మతుల్ లిల్ ఆలమీన్-1:136.
3) సీరత్ ఇబ్నె హెషామ్-2:516.

www.abulhasanalinadwi.org

నగదును విరాళంగా సమర్పించారు. ఈ విరాళం ఇచ్చినందుకు ఆయనకు "ముజహ్హిజు జైషిల్ ఉస్రతి" అని బిరుదు లభించింది.[1]

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) గారు 40 వేల దిర్హములు సమర్పించారు.[2]

హజ్రత్ ఉమర్ (రజి) తన ఇంట్లో ఉన్న సంపత్తిలో సగభాగం తెచ్చి ఇచ్చారు. అది కూడా కొన్నివేలల్లోనే ఉంది.

హజ్రత్ అబూబక్ర్ (రజి) తెచ్చిన సంపత్తి మూల్యం రీత్యాకొంచెం తక్కువే అయినప్పటికీ ఆయన ఇంట్లో ఉన్నదంతా తీసుకువచ్చారు. మరి ఇంటివాళ్ళ కోసం ఏం వదిలావని అంటే "దైవాన్ని, దైవప్రవక్త (స)ను వదలివచ్చాన"ని ఆయన బదులిచ్చారు.[3]

ఈ విధంగా తమ స్థోమతనుబట్టి అందరూ విరాళాలు ఇవ్వసాగారు. అటువంటి వారిలో అబూ అఖీల్ అన్సారీ (రజి) ఒకరు. ఆయన రెండుసేర్ల ఖర్జూరాలు విరాళంగా తెచ్చారు. ఈ అల్ప విరాళాన్ని తెచ్చినందుకు ఆయన సంజాయిషీ యిస్తూ ఇలా అన్నారు. "రాత్రంతా నీళ్లుతోడి చేను తడిపితే నాల్గుసేర్ల ఖర్జూరపండ్లు కూలిగా లభించాయి. వాటిలో రెండుసేర్ల ఖర్జూరాలను ఇంటివారలకు ఇచ్చి, మిగతా రెండుసేర్లను విరాళంగా తెచ్చాను" అన్నారు.

ఈ రెండుసేర్ల ఖర్జూరాలు మొత్తం విరాళాల ధనరాశిపై విస్తరించేలా కుమ్మరించండి అని దైవప్రవక్త (సఅసం) ఆదేశించారు.[4]

చెప్పవచ్చిందేమంటే ప్రవక్త ప్రియసహచరుల్లో ప్రతి ఒక్కరూ తమ ఔదార్యాన్ని, చిత్తశుద్ధినీ ఈ సందర్భంగా ప్రదర్శించారు. అయితే 82 మంది ప్రదర్శనా బుద్ధికోసం ప్రాకులాడే వారు (కపటులు) తమ ఇండ్లలోనే ఉండిపోయారు.[5]

అబ్దుల్లా బిన్ఉబై అనే కపటాగ్రేసరుడు తన అనుంగు

---

1) సుననె తిర్మిజీ-అంతస్తుల అధ్యాయం, ముస్నదె అహ్మద్-5:63
2) తఫ్సీరెతబ్రీలో 20 వేలు అని ఉంది.
3) తఫ్సీరె తబ్రీ:10-197. 4) తఫ్సీరె తబ్రీ-10:197
4) జాదుల్ మఆద్ -3:529, ఇబ్నెసాద్-2:165.

www.abulhasanalinadwi.org

అనుచరులకు అండగా నిలిచాడు. ముహమ్మద్ (స) గానీ ముహమ్మద్ అనుచరులుగానీ ఇక మదీనా నగరానికి తిరిగిరారనీ, ఇంతటితో వారికథ ముగుస్తుందని కపటులకు నూరిపోశాడు. రోము చక్రవర్తి అందరినీ బందీలుగా పట్టుకుని వివిధ రాజ్యాలకు తరలిస్తాడని కూడా అన్నాడు.[1]

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముప్పై వేలమంది సమూహంతో తబూక్ వైపుకు పయనమయ్యారు.[2]

మదీనాలో సిబా బిన్ ఉర్ఫుతాను తన ప్రతినిధిగా నియమించారు. తమ వారల మంచీ చెబ్బరలను పర్యవేక్షించే బాధ్యతను హజ్రత్ అలీ ముర్తుజా (రజి)కు అప్పగించారు.[3]

సైనిక సమూహంలో వాహనాల కొరత తీవ్రంగాఉంది. సగటున 18 మంది వ్యక్తులకుగాను ఒక ఒంటె చొప్పున ఉంది. ఆహార పదార్థాలు చాలినన్ని లేకపోవటం వల్ల ఎన్నో చోట్ల ఆకులలములు తిని ఉండిపోవలసి వచ్చింది. అందువల్ల పెదాలు వాచిపోయాయి. కొన్ని సందర్భాల్లో తాగటానికి మంచి నీరు కూడా లభించలేదు. అసలే ఒంటెల కొరత. అందునా దాహంతో నాలుక పిడచకట్టుకుపోతోంది. గత్యంతరంలేక కొన్ని ఒంటెలను కోసి వాటి గర్భంలో నిలువగా ఉండే నీటిని త్రాగాల్సిన అగత్యం ఏర్పడింది.[4]

ఈ విధంగా అడుగడుగునా బాధలను భరిస్తూ, ప్రయాసకు ఓర్చుకుంటూ తబూక్ చేరుకున్నారు ఈ త్యాగధనులు.

తబూక్ పొలిమేరల్లో ఉండగానే వెనుక నుంచి హజ్రత్ అలీ (రజి) కూడా వచ్చి వారితో కలిశారు. మదీనాలో దైవప్రవక్త సూచనానుసారం ఉండిపోయిన అలీ (రజి)ని కపటులు నానావిధాలుగా వేధించారని తరువాత తెలిసింది. పనికిరాని చవట కనుకనే కదనరంగానికి వెళ్ళలేదని కొందరంటే, ఇతని స్థితిపై జాలిపడి బహుశా వదిలేసి ఉంటారని మరికొంతమంది గేలిచేసేవారు. కపటుల మాటలు ఈ అభిమానధనుని

1) రహ్మతుల్లిల్ ఆలమీన్-1:136.
2) తబఖాత్ ఇబ్నె సాద్: యుద్ధాల ప్రకరణం-పేజీ:119
3) ఇబ్నె హెషామ్-2:519.
4) మదారిజున్నబువ్వ-2:577, 580

www.abulhasanalinadwi.org

పౌరుషాన్ని జాగృతం చేశాయి. అందుకే ఆయన మదీనాలో ఆగలేక తబూక్‌కు పయనమయ్యారు. నిరంతరం ప్రయాణం చేసి దైవప్రవక్త (సఅసం) సన్నిధికి చేరుకున్నారు. అవిశ్రాంత ప్రయాణం మూలంగానూ, ఎండ తీవ్రత మూలంగానూ బాగా అలసిపోయారు. కాళ్ళపై వాపు వచ్చేసింది. పాదాలకు కాయలు కాశాయి. ఈ పరిస్థితిని చూసి దైవప్రవక్త (సఅసం) ఇలా అన్నారు: "అలీ! నా తరువాత ఎలాగూ ప్రవక్త రాడు. అయితే నువ్వు మూసా తమ్ముడైన హారూన్‌లా మసలుకుని ఉంటే నీకది మరింత సంతోషదాయకమయ్యేది కదూ!" ఈ మాట విన్నంతనే హజ్రత్ అలీ మహదానందంతో మదీనాకు తిరుగు ప్రయాణమయ్యారు.[1]

తబూక్‌లో మహాప్రవక్త(సఅసం) నెలరోజులపాటు విడిది చేశారు. ఆయన (స) తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయానికి సిరియావాసులు ఒక్కసారిగా ఖంగుతిన్నారు. ఆయన(స) జీవించి ఉన్నంతకాలం అరేబియాపై దండెత్తడం ఎంతమాత్రం సమంజసం కాదనీ, ఆయన(స) తదనంతరమే సమర సన్నాహాలు మొదలెడదామని నిర్ణయించుకున్నారు.[2]

తబూక్‌లో ఉండగా దైవప్రవక్త (స) ఒక నమాజు అనంతరం తన సహచరులనుద్దేశించి ఎంతో సమగ్రమైన ప్రసంగం చేశారు. ఆ ప్రసంగం ఇలా సాగింది-

> దైవ స్తోత్రానంతరం..
>
> ప్రతి విషయంలోనూ సత్యబద్ధత దృష్ట్యా దైవగ్రంథమే గొప్పది. అన్నింటికన్నా ఎక్కువగా నమ్మశక్యమైన విషయం ఏదన్నా ఉంటే అది దైవభక్తితో కూడుకున్న విషయమే. అన్ని సమాజాలలోకీ ఉత్తమమైన సమాజం ఇబ్రాహీం (అలైహిస్సలాం) సమాజం. అన్ని విధానాలలోకీ ఉత్తమమైన విధానం ముహమ్మద్ (సఅసం) విధానమే. సమస్త విషయాలలోకీ శ్రేష్ఠమైనది దైవనామస్మరణ. బోధనలన్నింటిలోకెల్లా గొప్పది ఈ ఖుర్ఆనే. స్థిరచిత్తంతో, వజ్రసంకల్పంతో కూడుకున్న పనే అన్నింటికన్నా గొప్పది.

1) ఇబ్నె హిషామ్-2: 519, 520; సహీహ్‌బుఖారీ: కితాబుల్ మగాజీ-బాబు గజ్వయె తబూక్.
2) రహ్మతుల్ లిల్ ఆలమీన్-1:137.

www.abulhasanalinadwi.org

వ్యవహారాలలో కెల్లా అత్యంత నీచమైనది సరికొత్తగా కల్పించ బడిన లేనిపోని వ్యవహారం. దైవప్రవక్తల విధానం విధానాలన్నింటిలోకెల్లా ఉత్తమమైనది. మరణాలలో కెల్లా గొప్పది వీరమరణం. అన్నింటికన్నా గుడ్డిది సన్మార్గం పొందిన మీదట కూడా లోనయ్యే మార్గ భ్రష్టత. ప్రయోజనకరమైన ఆచరణే శ్రేష్ఠమైన ఆచరణ. ప్రజలందరికీ అనుసరణీయమైన వైఖరే మేలైన వైఖరి. అత్యంత నికృష్టమైన అంధత్వం మనోనేత్రపు అంధత్వం. పై చేయి క్రింది చేయికన్నా ఉత్తమమైనది. పరధ్యానానికి లోనుచేసే పుష్కలమైన సంపద కన్నా పరిమితమైన సంపదే మేలైనది. ప్రాణంపోయే ఘడియలో వేడుకునే క్షమాపణ అత్యంత హీనమైనది. ప్రళయదినాన చెందే పశ్చాత్తాపం పరమ దరిద్రంతో కూడుకున్నది.

కొంతమంది జుమా నమాజుకు వస్తారుగాని వారి మనసులు వెనక్కి లాగుతుంటాయి. వారిలో కొంతమంది అప్పుడప్పుడూ దైవ నామాన్ని స్మరిస్తూ ఉంటారు. పాపాలన్నింటిలోకెల్లా భీకరమైనది అసత్యవాక్కు. అన్నిటికన్నా గొప్పది మానసిక కలిమి. అన్నింటికన్నా ఉత్తమమైన సామగ్రి భయభక్తుల సామగ్రి. మనసులో దైవభీతిని కలిగి ఉండటం అన్నింటికన్నా గొప్ప విజ్ఞత. దృఢనమ్మకమే మనసును కుదుటపరుస్తుంది. అనుమానం అవిశ్వాసానికి సోపానం. బిగ్గరగా రోదించటం అజ్ఞానానికి ఆనవాలు. నమ్మకద్రోహం నరకలోకపు సామగ్రి. సిరిసంపదలు నరకాగ్ని మచ్చలాంటివి, కవిత ఇబ్లీసు భాగం. మద్యం సమస్త పాపాలకు మూలం. అత్యంత నీచమైన భృతి అనాథల సొమ్మును కబళించగా ప్రాప్తించిన భృతి. ఇతరులను చూచి గుణపాఠం నేర్చుకున్నవాడే ధన్యుడు. పుట్టుకనాటి నుంచే దౌర్భాగ్యుడుగా ఉన్నవాడే సిసలయిన దౌర్భాగ్యుడు. ఆచరణాసామగ్రే మనిషి సాఫల్యానికి అసలు సాధనం. అబద్ధాలతో కూడుకున్న

www.abulhasanalinadwi.org

విషయమే అత్యంత అధమమైనది. సంభవించబోయేది సమీపంలోనే ఉంది. విశ్వాసి (ముస్లిం)ని తిట్టడం అవిధేయతకు ప్రతిరూపం. విశ్వాసిని హతమార్చటం కుఫ్ర్ (అవిశ్వాసం). విశ్వాసి మాంసం తినటం (అంటే వీపు వెనుక చాడీలు చెప్పటం) దైవాజ్ఞల ఉల్లంఘనే. సాటి విశ్వాసి సొమ్మును స్వాహాచేయటం అతని రక్తాన్ని పీల్చటం వంటిదే. దైవం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించేవాణ్ణి దేవుడు ధూత్కరిస్తాడు. సాటి జనుల లోపాలను మరుగుపరచిన వాని లోపాలను అల్లాహ్ మరుగుపరుస్తాడు. క్షమించేవాడే క్షమాభిక్షకు నోచుకుంటాడు. కోపాన్ని దిగమ్రింగినవానికి అల్లాహ్ అత్యుత్తమ పుణ్యఫలం ప్రసాదిస్తాడు. నష్టం వాటిల్లినప్పుడు ఓర్చుకున్నవాడికి అల్లాహ్ మంచి ప్రతిఫలం ఒసగుతాడు. చాడీలను సర్వవ్యాప్తం చేసేవాణ్ణి అల్లాహ్ పరాభవం పాల్జేస్తాడు. సంయమనం పాటించిన వాని అంతస్థులను అల్లాహ్ పెంచుతాడు. దేవుని అవిధేయతకు ఒడిగట్టినవాణ్ణి దేవుడు యాతనకు గురిచేస్తాడు. ఆ తరువాత మూడుమార్లు క్షమాపణ వచనాలు పలికి ఆయన (సఅసం) తన ప్రసంగాన్ని ముగించారు.

తబూక్‌లో ఉండగానే జుల్‌బజాదైన్ చనిపోయాడు. ఈ వ్యక్తి మరణం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడాన్ని బట్టి మహాప్రవక్త (సఅసం) పేదల పట్ల ఎలా పెన్నిధిగా, ప్రేమమూర్తిగా వ్యవహరించేవారో అర్థమవుతోంది. ఈ సహచరుని అసలుపేరు అబ్దుల్లాహ్. పిన్న వయస్కుడుగా ఉండగానే ఇతని తండ్రి చనిపోయాడు. ఇతని సంరక్షణా బాధ్యతల్ని పినతండ్రి తీసుకున్నాడు. యుక్తవయస్సుకు చేరగానే కొన్ని మేకల్ని, ఒంటెల్ని, బానిసల్ని ఇచ్చి పినతండ్రి ఇతన్ని ఆర్థికంగా ఆదుకున్నాడు ఆ రోజుల్లోనే అబ్దుల్లాహ్ ఇస్లాం గురించి విన్నాడు. ఇస్లాం పట్ల అతని మదిలో ఆసక్తి పెరిగింది. కాని పినతండ్రికి భయపడి బహిరంగంగా ఇస్లాం స్వీకారాన్ని ప్రకటించలేకపోయాడు. ఎట్టకేలకు దైవప్రవక్త (స) మక్కాను జయించి, తిరిగివచ్చాక పినతండ్రి వద్దకు వెళ్ళి "బాబాయి! ఏదో ఒకరోజు మీరు ఇస్లాం ధర్మం స్వీకరించకపోతారా! అన్న ఉద్దేశ్యంతో కొన్ని సంవత్సరాల పాటు ఎదురుచూశాను. కాని మీ

www.abulhasanalinadwi.org

ధోరణిలో ఎలాంటి మార్పురాలేదు. ఇకనేను నా జీవితంపట్ల ఎలాంటి ఆశలుపెంచుకోలేదు. ఏరోజు చావువస్తుందో తెలీదు. నేను ముస్లింగా మారదలచాను. దయచేసి ఈ విషయంలో మీరు అభ్యంతరం చెప్పకండి" అని అన్నాడు.

"అబ్బాయి! నవ్వు గనక ముహమ్మద్ (స) మతం వైపుకు మొగ్గావంటే నీకిచ్చిన ఆస్తిపాస్తులన్నింటినీ స్వాధీనపరచుకుంటాను. నీ ఒంటిపై దుప్పటిని, లుంగీని కూడా లేకుండా చేస్తాను. జాగ్రత్త!" అని హెచ్చరించాడు అతని బాబాయి.

'బాబాయి! నేను ఇస్లాం స్వీకరించాలన్న నిర్ణయానికే కట్టుబడి ఉన్నాను. విధేయత గనక చూపితే ముహమ్మద్(స)కే విధేయత చూపుతాను. బహుదైవోపాసనపట్ల, విగ్రహారాధనపట్ల నాకెలాంటి ఆసక్తి లేదు. నేను దీనిపట్ల విసుగెత్తిపోయాను. ఇప్పుడు తమరేం చేసుకుంటారో చేసుకోండి. ఈ రోజు నా అధీనంలో ఉన్న ఆస్తినంతటినీ మీ కిష్టమొచ్చిన విధంగా జప్తు చేసుకోండి. మనం ఏదో ఒకనాడు వీటన్నింటినీ వీడిపోవలసిందే కదా! ఈ ఆస్తిపాస్తులకోసమని నేను సత్యధర్మాన్ని వీడలేను.'

ఈ మాటలంటూనే అబ్దుల్లాహ్ తాను తొడిగివున్న దుస్తుల్ని విడిచేశారు. ఆ స్థితిలోనే కన్నతల్లి దగ్గరకు వెళ్లారు. ఆయన స్థితిని చూసిన తల్లి తల్లడిల్లిపోయింది. "ఈ క్షణం నుంచీ నేను విశ్వాసినయ్యాను. ఏకేశ్వరోపాసకుడనయ్యాను. దైవప్రవక్త (సఅసం) దగ్గరకు వెళ్ళదలచాను. నడుముకు చుట్టుకోవడానికి ఏదన్నా వస్త్రం ఇస్తావా అమ్మా!" అన్నారు. పుత్ర వాత్సల్యం పొంగిపొరలగా లోపలినుంచి ఓ కంబలిని తెచ్చి ఇచ్చింది ఆ తల్లి. సగం కంబలిని చించి నడుముకు లుంగీగా చుట్టుకుని, మిగిలినదాన్ని దుప్పటిగా కప్పుకున్నారు అబ్దుల్లాహ్. ఆ మరుక్షణమే మదీనాకు బయలుదేరారు. తెలతెలవారుతుండగా మస్జిదెనబవీకి చేరుకున్నారు. మస్జిద్ గోడకు ఆనుకుని దైవప్రవక్త (సఅసం) రాక కోసం ఎదురు చూడసాగారు. దైవప్రవక్త (స) వచ్చీరాగానే, ఈ అపరిచితవ్యక్తిని చూసి "ఎవరు?' అని అడిగారు. "నా పేరు అబ్దుల్ఉజ్జా' బీదవాణ్ణి. బాటసారిని, దైవప్రవక్త అభిమానిని. సన్మార్గభాగ్యం కోసం తహతహ లాడుతూ వచ్చినవాణ్ణి" అని సూటిగా సమాధానమిచ్చారు.

www.abulhasanalinadwi.org

ఈ సమాధానం వినగానే దైవప్రవక్త (స) మోము వికసించింది.

"ఇక నుంచి నువ్వు అబ్దుల్లాహ్‌వి. 'జుల్ బజాదైన్' అనే బిరుదు నీకివ్వబడింది. నువ్వు మాకు చేదోడువాదోడుగా ఉండవచ్చు. మస్జిద్‌లోనే ఉండు" అని చెప్పారాయన(స).

ఆ రోజు నుంచీ 'అస్‌హాబె సుప్ప' (అరుగు వాసులు) లో చేరిపోయారు హజ్రత్ అబ్దుల్లాహ్! దైవప్రవక్త (స) నోట ఖుర్ఆన్ విని పగలల్లా ఎంతో దీక్షతో భక్తి పారవశ్యాలతో పారాయణం చేసేవారు.

ఒకసారి ఉమర్ ఫారూఖ్ (రజి) జోక్యం చేసుకుని "ప్రజలు నమాజు చేస్తుండగా ఈ పల్లెటూరి వ్యక్తి ఇంత బిగ్గరగా చదువుతున్నాడేమిటి? అందరికీ ఇబ్బంది కలుగదా?" అని అన్నారు. దైవప్రవక్త(స) వెంటనే వారిస్తూ, "ఉమర్! ఇతన్నేమీ అనకండి. దైవం మరియు దైవప్రవక్త (స) కోసం ఇతను సర్వం వదులుకుని వచ్చాడు" అని అన్నారు.

తబూక్ ప్రయాణ సందడిని అబ్దుల్లాహ్ గమనించారు. దైవప్రవక్త (స) సమక్షంలోకి వచ్చి, "దైవప్రవక్తా! దైవమార్గంలో అమరగతినొందే భాగ్యం నాకు లభింపజేయమని దైవాన్ని ప్రార్థించండి" అని విన్నవించుకున్నారు. "అయితే వెళ్ళి చెట్టు బెరడు తీసుకురా!" అని ఆయన(స) చెప్పారు. వెంటనే బెరడు తెచ్చారు అబ్దుల్లాహ్. దైవప్రవక్త (స) ఆ బెరడు ముక్కను ఆయన చేతికి కట్టి "దేవా! నేను ఇతని రక్తాన్ని అవిశ్వాసుల కొరకు నిషేధించాను" అని అన్నారు. "అదేమిటి? నేను వీరమరణాన్ని కోరుకుంటూ ఉండగా తమరు ఈ విధంగా దీవించారేమిటి దైవప్రవక్తా!" అని అబ్దుల్లాహ్ సందేహపడగా, "నీవు ధర్మయుద్ధం చేసే సంకల్పంతో బయలుదేరి, సామ్మసిల్లి మరణించినా సరే అమరగతి నొందినట్లే" అని ఆయన (స) స్పష్టపరిచారు.

తబూక్ చేరిన తరువాత జరిగింది కూడా అదే. వడ దెబ్బతగిలి ఆయన ఈ లోకాన్ని వీడిపోయారు. అబ్దుల్లాహ్ అంత్యక్రియల స్థితిగతులను వివరిస్తూ బిలాల్ బిన్ హారిస్ మదనీ ఇలా అన్నారు: అది రాత్రి వేళ. హజ్రత్ బిలాల్ (రజి) చేతిలో లాంతరు ఉంది. అబూబక్ర్ (రజి) ఉమర్ (రజి)లు ఆయన భౌతికకాయాన్ని గోరీలోకి దించారు. దైవప్రవక్త (స) సయితం గోరీలోనికి దిగారు. "మీ సోదరుణ్ణి నాకు దగ్గరగా

చేర్చండి" అని ఆయన (స) ఆ క్షణంలో అబూబక్ర్, ఉమర్‌లనుద్దేశించి చెప్పారు. దైవప్రవక్త (స) తన స్వహస్తాలతో సమాధిలో ఇటుకలను పేర్చారు. ఆ తరువాత ఇలా వేడుకున్నారు. "దేవా! ఇతని పట్ల నేను ప్రసన్నుడయ్యాను. నువ్వు కూడా ఇతని పట్ల ప్రసన్నుడవుకమ్ము". ఈ దృశ్యాన్ని తదేకంగా తిలకించిన ఇబ్నె మసూద్(రజి), "ఈ సమాధిలో తాను ఖననమై ఉంటే ఎంత బాగుండేది!" అంటూ కించిత్ ఈర్ష్య చెందారు.

ఆ తరువాత ముస్లింలు తబూక్ నుంచి మదీనాకు తిరిగివచ్చారు. మదీనా పొలిమేరల్లో ఉండగానే నగరవాసులు ఆనందోత్సాహాలతో స్వాగతం పలకడానికి ఎదురు వెళ్ళారు. పరదా పాటించే మహిళలు సయితం ఇళ్ళనుంచి బయటికి వచ్చేశారు.

కాని కపటుల మొహాలు మాడిపోయాయి. ముహమ్మద్ (స) తో సహా ముస్లింలంతా ఎవరికీ తెలియని దీవులకు తరలించబడతారని కాకిలెక్కలు వేసుకున్న వంచనా శిల్ప నిష్ణాతులకు ఈ వార్త మింగుడు పడలేదు. మదీనాకు రాగానే దైవప్రవక్త అందరినీ సమావేశపరచి, తబూక్‌కు రాని వారిని సంజాయిషీ అడిగారు. వంచకులు ఏవో కుంటిసాకులు చూపి, అబద్ధాలు పలికారు. దైవప్రవక్త(స) వారి వ్యవహారాన్ని దైవానికే అప్పజెప్పి, సర్వసాధారణమైన మన్నింపును ప్రకటించారు. కాని ముగ్గురు నిజాయితీపరులైన ముస్లింలు మాత్రం ఉన్నదున్నట్టు తమ మనసులోని మాటను బహిర్గతం చేశారు. తాము తబూక్‌కు రాలేకపోవడానికి బలమైన కారణమేదీలేదనీ, కేవలం బద్ధకం, అశ్రద్ధ మూలంగానే వెనుకబడిపోయామని వారు చెప్పారు. వారు నిజం చెప్పినందుకు కఠినమైన పరీక్షను కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది.

ఆ ముగ్గురిలో ఒక గొప్ప సహాబీ (రజి) తాను స్వయంగా చెప్పిన వృత్తాంతం. ఇలా ఉంది:-

ఈయన పేరు హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ అన్సారీ (రజి). రెండవ ఉఖబా ప్రమాణంలో పాల్గొన్న 73 మంది ప్రముఖులలో ఈయన ఒకరు. ఎన్నదగ్గ కవి కూడాను.[1] ఆయనిలా అన్నారు: పరీక్షించబడటానికే నేను

1) రహ్మతుల్ లిల్ ఆలమీన్-1: 142.

www.abulhasanalinadwi.org

బహుశా ఇంటిపట్టున ఉండిపోయానేమో! ఉద్దేశ్యపూర్వకంగా నేను అశ్రద్ధ చేయలేదు. వెళ్ళకపోవటానికి బలమైన కారణం కూడా ఏదీ లేదు. ప్రయాణ సామగ్రి కూడా నా దగ్గర ఉంది. మేలుజాతి ఒంటెలున్నాయి. ఆర్థిక పరిస్థితి కూడా ముందెన్నడూ లేనంత మెరుగ్గా ఉంది. అయితే జనులంతా ప్రయాణ సన్నాహాలు చేసుకుంటూ ఉండగా నేను బొత్తిగా శ్రద్ధ చూపలేదు. అందరూ బయలుదేరిన రోజే నేను కూడా ఏర్పాట్లు చేసుకోవచ్చులే అని అనుకున్నాను. కాని సైనికులు తీరా ప్రయాణమైన రోజున కాకతాళీయంగా నాకొక పని వచ్చి పడింది. ఆ పని చేసుకుని మరునాడే గబగబా వెళ్ళి సైనికుల్ని కలుసుకోవచ్చని భావించాను. రెండుమూడురోజులు ఇలాగే గడచి పోయాయి. కించిత్ బద్ధకం ఆవహించింది. వెళ్ళాలా వద్దా అనే తటపటాయింపు కూడా చోటుచేసుకుంది. ఇలా తాత్సారం చేసేలోపే ముస్లిం సైన్యం బహుదూరం వెళ్ళిపోయింది. ఇక ఆ సైన్యాన్ని అందుకోవటం కష్టమే. కనుక ప్రయాణ సంకల్పాన్ని విరమించుకున్నాను. వెళ్ళలేకపోయినందుకు మనస్సాక్షి లోపలినుంచి గట్టిగా హెచ్చరించ సాగింది.

ఒకరోజు నేను ఇంటినుంచి బయటికెళ్ళాను. వీధుల్లో కపటులు, వికలాంగులు, అబద్ధాల కోరులు తప్ప నికార్సయిన ముస్లింలెవరూ కనిపించలేదు. ఈ పరిస్థితి నన్ను మరింతగా కృంగ దీసింది. సిగ్గుతో కుమిలిపోతూ రోజులు వెళ్ళదీస్తూ ఉండగానే దైవప్రవక్త (సఅసం) సహచరుల సమేతంగా మదీనాకు తిరిగి వచ్చారు. ఏ మొహం పెట్టుకుని దైవప్రవక్త (స) ఎదుట వెళ్ళాలి? ఏమని చెప్పాలి? ఆయన(స) ఆగ్రహం నుండి ఎలా తప్పించుకోవాలి? పరిపరివిధాలా ఆలోచించాను. కొంతమంది నాకు కుంటి సాకులు చెప్పమని కూడా సలహాలు ఇచ్చారు. కాని నా అంతరాత్మ అందుకు అంగీకరించలేదు. ఏమైనాసరే నిజమే చెప్పాలి. నా మోక్షం ఎట్టి పరిస్థితిలోనూ సత్యవాక్కులోనే ఇమిడి ఉందన్న నిర్ధారణకు వచ్చాను. ఎట్టకేలకు దైవప్రవక్త (సఅసం) సమక్షంలో హాజరయ్యాను. ఆయన(స) నన్ను చూచి చిరునవ్వు చిందించారు. "నీకేమయ్యింది నాయనా?!" అన్నట్టుంది ఆ చిరునవ్వు. ఆ మందహాసానికే నా నవనాడులు స్థంభించి పోయాయి.

"చెప్పు కాబ్! నువ్వు రాకపోవడానికి కారణమేమిటి? నీ దగ్గర కూడా ప్రయాణ సామగ్రి లేదా?"-ప్రశ్నించారు నాయక శిఖామణి (సఅసం).

"దైవప్రవక్తా (సఅసం)! నా వద్ద సామగ్రికేమీ లోటులేదు. అన్నీ ఉన్నాయి. కాని నా మనోవాంఛే నన్ను పరధ్యానంలో పడవేసింది. బద్ధకం నన్ను లొంగదీసుకుంది. పిశాచం నన్ను ఆవహించి ప్రమత్తతకు, అలసత్వానికి లోను చేసింది" సమాధానమిచ్చాను.

"అయితే నువ్వు నీ ఇంటిపట్టునే ఉండి, దైవ నిర్ణయం కోసం నిరీక్షించు"-తీర్పు చెప్పారు దైవప్రవక్త (స).

(కపటుల మాదిరిగా) నువ్వు కూడా ఏదో ఒక్కసాకు చూపి ఉంటే ఈ శిక్షపడేది కాదుకదా! అని కొంతమంది అన్నారు. నేను అబద్ధం చెప్పినా దైవప్రవక్త (స)కు నిజం తెలియకుండా ఉండదు. దైవ సందేశం ద్వారా నా బండారం ఎలాగూ బయటపడి పోతుంది. నేను చేసే వ్యవహారం సామాన్యులతో కాదు, దైవప్రవక్త (స)తో! ఈనాడు నేను కుంటిసాకులు చెప్పి శిక్ష నుండి తప్పించుకున్నా రేపటి రోజున దైవసమక్షంలో అవమానం పాలు కాక తప్పదు" అని జవాబిచ్చాను. "నాలాంటి వారు ఇంకెంత మంది ఉన్నారు?" అని అడిగాను.

"హిలాల్ బిన్ ఉమయ్యా, మురారా బిన్ రబీ కూడా నీలాగే శిక్ష అనుభవిస్తున్నార"ని సమాధానం ఇచ్చారు మిత్రులు. ఈ సంగతి తెలుసుకుని నాకు కాస్త ఊరట కలిగింది. నిజం చెప్పిన సజ్జనులు మరో ఇద్దరు కూడా ఉన్నారన్నమాట! అనుకున్నాను. మాతో ఎవరూ మాట్లాడవద్దనీ, కలసి కూర్చోరాదని దైవప్రవక్త (స) అజ్ఞాపించారు. దీంతో మా బ్రతుకు దుర్భరమై పోయింది. ఈ ప్రపంచమే నరకతుల్యం అనిపించింది. ఆ రోజుల్లో హిలాల్‌గానీ, మురారాగానీ ఇంటి గడపదాటి బయటికి రాలేదు. ఎందుకంటే వారిద్దరూ ముసలివారు. కాని నేను యువకుణ్ణి. పౌరుషం గలవాణ్ణి. ఇల్లువిడిచి బయటికి వచ్చేవాణ్ణి. మస్జిద్‌కు వెళ్ళేవాణ్ణి. నమాజు చేసి మస్జిద్ మూల కూర్చునేవాణ్ణి.

నేను తలదించుకుని కూర్చుని ఉన్నప్పుడు దైవప్రవక్త (స) నన్ను ప్రేమతో చూసేవారు. నా దీనస్థితిపై జాలిచూపేవారు. కాని నేనాయన్ని కన్నెత్తిచూసే ప్రయత్నం చేసినప్పుడు మాత్రం తన చూపుల్ని మరల్చుకునేవారు.

ఇక సాటి ముస్లింలెవరూ నాతో మాట్లాడేవారు కాదు. నేను సలాం

www.abulhasanalinadwi.org

చేసినా బదులు పలికేవారు కారు. ఆ గడ్డు కాలంలోనే నేను ఒకరోజు దుఃఖిస్తూ మదీనా నగరం వెలుపలకు వచ్చాను. నా బాబాయి కుమారుడైన అబూ ఖతాదా(రజి) కనిపించాడు. మేమిద్దరం ఎంతో ఆప్యాయంగా ఉండేవాళ్ళం. అతను తన తోటలో పనిచేసుకుంటున్నాడు. అతని దగ్గరకెళ్ళి 'సలాం' చేశాను. కాని అతను కనీసం ప్రతి సలాం కూడా చేయలేదు. ముఖం త్రిప్పుకున్నాడు. అతని వైముఖ్యాన్ని భరించలేక, "అబూఖతాదా! నేను దైవాన్ని, దైవప్రవక్త (సఅసం)ను ఎంతగా ప్రేమిస్తున్నానో నీకు తెలుసు. నా ఆంతర్యంలో కాపట్యం ఏ కోశానా లేదన్న సంగతి కూడా నీకు తెలుసు. మరలాంటప్పుడు నువ్వు నాతో ఎందుకు మాట్లాడవు?" అబూఖతాదా నుంచి సమాధానం రాలేదు. మూడుసార్లు ఇదే ప్రశ్నవేసినా మౌనమే అతని సమాధానం అయింది. "నాతో ఎందుకు మాట్లాడటం లేదు?" దాదాపు విలపిస్తూ అడిగితే "ఎందుకో దైవానికి, దైవప్రవక్తే బాగా తెలుసు" అని అన్నాడు. నా దుఃఖం కట్టలు త్రెంచుకుంది. పెద్దగా ఏడ్చేశాను. నగరానికి తిరిగివస్తుండగా నాకొక క్రైస్తవుడు ఎదురుపడ్డాడు. అప్పటికే అతను మదీనాలో నన్ను చాలాసేపు వెతికాడు. గస్సాన్ చక్రవర్తి నా పేరున రాసిన ఒక ఉత్తరాన్ని అతను తెచ్చాడు. ఆ ఉత్తరంలో ఇలా వుంది-

> "మీ నాయకుడు మీపై కినుక వహించాడని మాకు తెలిసింది. మిమ్మల్ని వెలివేశారని, అందరూ మిమ్మల్ని దూరం చేశారని విన్నాము. మీరు ఏ స్థాయికి చెందినవారో మాకు బాగా తెలుసు. మీరు అవమానాల పాలు కావలసిన వారు కారు. మీ అంతస్థకు తగ్గరీతిలో మీరు సత్కరించబడాలి. ఈ ఉత్తరం చదవగానే మీరు మా దగ్గరకు వచ్చేయండి-మేము మిమ్మల్ని ఎంతగా ఆదరిస్తామో, ఎంత మర్యాద చేస్తామో మీరే చూద్దురుగాని!"

ఈ ఉత్తరం చదవటం పూర్తవగానే నాకు మతిపోయినంత పనయింది. 'ఇది మరో కఠిన పరీక్ష కాబోలు!' అనుకున్నాను. ఈ రోజు ఒక క్రైస్తవ వ్యక్తి వచ్చి నన్ను, నా జీవనవిధానాన్ని శాసించగోర్తున్నాడు. ఇంతకన్నా అగ్నిపరీక్ష ఇంకేముంటుంది? నా ఆవేదన అంతకంతకూ

www.abulhasanalinadwi.org

పెరిగిపోతోంది. గస్సాన్ చక్రవర్తి పంపిన దూత సమక్షంలోనే ఆ ఉత్తరాన్ని చింపి అగ్నిలో పడవేశాను. "వెళ్ళు, మీ రాజు చేసే మర్యాదలు ఘన సత్కారాలకంటే మా ప్రవక్త (సఅసం) విధించిన శిక్ష లక్ష రెట్లు నయం అని మీరాజుకు చెప్పు" అన్నాను.

నేను ఇంటికి వెళ్ళే సరికి దైవప్రవక్త (సఅసం) తరపున ఒక వ్యక్తి వచ్చి ఉన్నాడు. "నువ్వు నీ భార్యకు దూరంగా ఉండవలసిందిగా దైవప్రవక్త (స) ఆదేశించారు"అన్నాడతను."విడాకులు ఇవ్వమన్నారా"? అని అడిగాను. "అక్కరలేదు. కేవలం ఆమెకు దూరంగా ఉండ మన్నారు" అని సమాధానం వచ్చింది. ఆ రోజే నేను మా ఆవిడను ఆమె పుట్టింటికి పంపించేశాను. హిలాల్, మురారాలకు కూడా ఈ విధంగానే ఆజ్ఞాపించబడిందని తెలిసింది. అప్పుడు హిలాల్ సతీమణి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "దైవప్రవకా (స)! హిలాల్ మరీ వృద్ధులు, నీరసించి పోయారు. ఆయనకెలాంటి కోర్కెలు లేవు. అదీగాక ఆయన సేవచేసేవారు కూడా ఎవరూ లేరు. తమరు గనక అనుమతిస్తే నేను ఆయన సేవచేసుకుంటూ ఉంటాను" అని విన్నవించుకుంది. "సరే, నువ్వు ఆయన సేవ చేసుకో. కాని ఆయన పడక పైకి మాత్రం పోవద్దు" అని దైవప్రవక్త (స) చెప్పారు. దానికామె, "దైవప్రవక్తా (స), హిలాల్ వేదనాస్థితిని చూస్తుంటే ఆయనకు ఈ సంక్షోభం నుంచి బయటపడే కోరిక తప్ప మరో ధ్యాసలేదు" అని వివరించింది.

నువ్వు కూడా అలాగే అనుమతి తీసుకోరాదూ! కనీసం నీ ఇల్లాలు నీకు చేదోడువాదోడుగా ఉంటుంది కదా! అని నాకు కొంత మంది సలహా యిచ్చారు. "నేను ధైర్యం చేయలేను. అదీగాక దైవప్రవక్త ఆ మేరకు అనుమతిస్తారో లేదో తెలీదు-ఎందుకంటే హిలాల్ లాగా నేను ముసలివాణ్ణికాను. నా పనులు నేను స్వయంగా చేసుకోగలను.నాకు ఒకరి సపర్యల అవసరం లేదు" అని అన్నాను.

అప్పటికే 50 రోజులు గడచిపోయాయి. ఒకరోజు రాత్రి నేను ఇంటికప్పుపైకెక్కి నా స్వయంకృతాన్ని నెమరువేసుకుంటూ పడుకున్నాను. అంతలోనే మా యింటికి సమీపంలో నున్న సులా కొండశిఖరంపైకెక్కి హజ్రత్ అబూబక్ర్(రజి) నన్ను కేకేస్తున్నారు-"కాబ్‌కు శుభాకాంక్షలు! అతని

పశ్చాత్తాపం స్వీకరించబడింది". ఈ పిలుపు విన్నంతనే నా మిత్రులంతా పరుగులు తీస్తూవచ్చారు. నిజాయితీపరుని ప్రాయశ్చిత్తం స్వీకార యోగ్యమైనందుకు శుభాభివందనలు అంటూ అందరూ నన్ను పలకరించసాగారు సంతోషాతిశయంతో. ఈ శుభవార్త అందగానే నేను నేలపై మోకరిల్లి దైవానికి మనసారా కృతజ్ఞతలర్పించాను. ఆ తరువాత దైవప్రవక్త (స) సన్నిధికి పరుగెత్తాను.

ఆ సమయంలో దైవప్రవక్త (స) ముహాజిర్ల, అన్సార్ల మధ్య కూర్చుని ఉన్నారు. నన్ను చూసి ముహాజిర్లు శుభాకాంక్షలు తెలిపారు. అన్సార్ సోదరులు మౌనంగా ఉన్నారు. నేను మరికాస్త ముందుకువెళ్ళి 'సలాం' చేశాను. దైవప్రవక్త (స) వారి ముఖారవిందం పున్నమి చంద్రునివలే దేదీప్యమానంగా ఉంది. ఆయన (స) సంతోషంగా ఉన్నప్పుడల్లా ఆయన(స) మోము ఇలాగే మెరిసిపోతూ ఉంటుంది. 'కాబ్! నీకు శుభం. నీవు నీతల్లి కడుపున పుట్టిన నాటి నుంచీ ఇప్పటి వరకూ ఎన్నడూ నీ కొరకు ఇంతటి శుభకరమైన రోజు రాలేదు. నీవు అదృష్టవంతుడివి. సర్వలోకప్రభువు నీ పశ్చాత్తాపాన్ని సమ్మతించి ఆమోద ముద్ర వేశాడు' అని అగ్రజులు (సఅసం) శుభవార్త వినిపించారు.

"దైవప్రవక్తా (స)! ఈ స్వీకృతికి కృతజ్ఞతగా నేను ఆస్తిపాస్తులన్నింటిని దైవమార్గంలో దానం చేయదలిచాను" అన్నాను. "అంతా వద్దు" అని ఆయన(స)అన్నారు. "పోనీ సగభాగం ఇస్తాను" అన్నాను. "వద్దు. మూడోవంతు చాలు. అవును మూడవ వంతు సమంజసంగా ఉంటుంది. ఆ మాటకొస్తే మూడో వంతు కూడా ఎక్కువే" అని దైవప్రవక్త (స) వ్యాఖ్యానించారు.[1]

ఏ విధంగానయినాసరే ముస్లింల మధ్య మనస్పర్థల్ని సృష్టించి వారిలో చీలిక తీసుకురావాలన్నది కపటుల ఎత్తుగడ. మస్జిదె ఖుబాకు విరుగుడుగా మరో మస్జిదును నిర్మించాలనీ, వయోవృద్ధులు మస్జిదె నబవీ వరకూ నడచి రావటం కష్టమవుతోందని కపటులు ప్రతి పాదించారు. కపటుల ఆగడాలకు అండగా నిలిచాడు అబూ ఆమిర్. అబూఆమిర్ అన్సార్ వర్గీయుడు. క్రైస్తవుడుగా మారాడు. "మీ

1) సహీహ్ బుఖారీ: కితాబుల్ మగాజీ-కాబ్ బిన్ మాలిక్ హదీసు

www.abulhasanalinadwi.org

ప్రయత్నాలు మొదలెట్టండి. నేను రోము చక్రవర్తి వద్దకు వెళ్ళి సైన్యం తీసుకు వస్తాను. ఈ రాజ్యంలో ఇస్లాంను నామరూపాల్లేకుండా చేద్దాం" అని కపటులను ఉసిగొల్పాడు అబూఆమిర్.

తీరా దైవప్రవక్త తబూక్‌కు ప్రయాణమవుతుండగా కొంతమంది కపటులు వచ్చి, "మేము వ్యాధిగ్రస్తుల, వృద్ధుల సౌకర్యార్థం ఒక మస్జిద్‌ను నిర్మించాము. మీరొకసారి వచ్చి, అందులో నమాజుచేస్తే దానికి ప్రారంభోత్సవం చేసి నట్టుంటుంది" అని సూచించారు. దానికాయన(స) "నేను ఇప్పుడు తబూక్‌కు బయలుదేరుతున్నాను" అని చెప్పారు. అయితే తబూక్ ప్రయాణం నుంచి తిరిగివచ్చాక ఆయన(స), ఆ మస్జిద్‌ను కాల్చివేయమని హజ్రత్ మాలిక్‌ను, హజ్రత్ మాన్ బిన్ అదీని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే ఈ ఆయతులు అవతరించాయి.[1]

> "వారిలో కొందరున్నారు. (సత్య సందేశానికి) నష్టం కలిగించాలన్న ఉద్దేశ్యంతో వారొక మస్జిద్‌ను నిర్మించారు. ఇంకా (దేవుని ఆరాధన చెయ్యటానికి బదులుగా) అవిశ్వాసాన్ని అనుసరించాలనీ, విశ్వాసులలో చీలిక తీసుకు రావాలనీ, ఇది వరకు అల్లాహ్‌కు-ఆయన ప్రవక్తకూ వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తికి మాటుగా చెయ్యాలని. మా ఉద్దేశం మేలు చెయ్యటం తప్ప మరొకటి కాదని వారు మాటిమాటికీ ప్రమాణాలు చేసి చెబుతారు. కాని అల్లాహ్ సాక్షిగా ఉన్నాడు. వారు పూర్తి అసత్యవాదులు. నీవు ఎన్నడూ ఆ కట్టడంలో నిలబడకు. మొదటి రోజు నుండే భయభక్తుల ఆధారంగా స్థాపించబడిన మస్జిదే (ఆరాధన కొరకు) నీవు నిలబడటానికి తగినది. అందులో పరిశుద్ధంగా ఉండటానికి ఇష్టపడేవారు ఉన్నారు. అల్లాహ్‌కు పరిశుద్ధతను పాటించేవారు అంటేనే ఇష్టం."
>
> (తౌబా-107,108)

---

1) సీరత్ ఇబ్నె హిషామ్-2: 529, 530, జాదుల్ మఆద్-3:549

www.abulhasanalinadwi.org

## దౌస్ ప్రతినిధి బృందం

తుఫైల్ బిన్ అమ్ర్ (రజి) దౌసీ ఇస్లాం స్వీకరించిన సంగతి ఇంతకు ముందే ప్రస్తావించబడింది. ఇస్లాం స్వీకరించిన తరువాత ఈయన దైవప్రవక్త (స) దగ్గర సెలవు తీసుకుంటూ, "దైవప్రవక్తా(స)! నా జాతి ప్రజలు సన్మార్గం పొందేలా ప్రార్థించండి" అని కోరారు. దైవప్రవక్త (స) ప్రార్థించారు. 'దేవా! తుఫైల్‌ను ఒక సూచనగా చెయ్యి' అని వేడుకున్నారు. హజ్రత్ తుఫైల్ ఇంటికెళ్ళగానే, ఆయన్ని పలకరించటానికి ముసలితండ్రి ఎదురుగా వచ్చారు. "నాన్నా! ఇప్పుడు నేను మీవాణ్ణి కాను. మీరు నా వారు కారు" అని తుఫైల్ అన్నారు. "ఎందుకనీ?" ప్రశ్నించాడు తండ్రి, "ఎందుకంటే నేను ముహమ్మద్ (సఅసం) ధర్మాన్ని స్వీకరించి ముస్లింనయ్యాను" అన్నారు తుఫైల్. "ఒరేయ్ కన్నా! ఇక నుంచి నీ ధర్మమే నా ధర్మంరా!" అన్నాడా ముసలి తండ్రి. అయితే మీకు శుభం. మీరు స్నానం చేసి, పరిశుభ్రమైన బట్టలు తొడుక్కురండి. నేను మీకు ఇస్లాం ఉపదేశం చేస్తాను" అన్నాడు కొడుకు. తరువాత ఆయనగారి శ్రీమతి వచ్చింది. ఆమెతోనూ అదే ధోరణి. ఆమె కూడా ఇస్లాం స్వీకరించింది. ఆనాటి నుంచీ హజ్రత్ తుఫైల్ (రజి) తమ వర్గ ప్రజలలో ఇస్లాం సందేశ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించారు. కాని జనులు పెద్దగా ఇస్లాం పట్ల ప్రభావితులు కాలేదు.[1]

హజ్రత్ తుఫైల్ మళ్ళీ దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "దైవ ప్రవక్తా!నాజాతివారిలో వ్యభిచారం బాగా ప్రబలిపోయింది. ఈ (వ్యభిచారాన్ని ఇస్లాం నిషేధించిన) కారణంగా జనులు ఇస్లాంకు చేరువ కావటం లేదు" అని విన్నవించుకున్నారు. "దేవా! దౌస్ తెగవారికి సన్మార్గం చూపు" అని దైవప్రవక్త (సఅసం) ప్రార్థించారు. ఆ తరువాత తుఫైల్‌నుద్దేశించి, "ఇప్పుడు వెళ్ళి జనులను దైవధర్మం వైపుకు ఆహ్వానించు" అని ఆజ్ఞాపించారు. ప్రజలపట్ల మృదువుగా వ్యవహరించమనీ, ప్రేమతో పలకరించమని కూడా సూచించారు.

ఈసారి హజ్రత్ తుఫైల్ సందేశ ప్రచార కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. హిజ్రీ 5వ యేట ఆయన ఇస్లాం స్వీకరించిన 80

1) జాదుల్ మ ఆద్-3:625.

www.abulhasanalinadwi.org

మంది దౌస్ తెగవారిని వెంటబెట్టుకుని మదీనా వచ్చారు. దైవప్రవక్త (స అసం) ఖైబర్ వెళ్ళి ఉన్నారని తెలీటంతో ఈ బృందం సరాసరి ఖైబర్‌కు వెళ్ళి దైవప్రవక్తను కలుసుకుంది. వారంతా ఖైబర్‌లోనే దైవప్రవక్త (స)ను చూచే భాగ్యం పొందారు.[1] దైవప్రవక్త (స) పినతండ్రి కొడుకు కూడా అదే సమయంలో అబిసీనియాలో ఇస్లాం స్వీకరించిన తెగలను వెంటబెట్టుకుని అక్కడికి చేరుకున్నారు.

ఒకవైపు నుంచి జాఫర్(రజి) అబిసీనియా నుంచి అప్పుడప్పుడే ఇస్లాం స్వీకరించిన నీగ్రో ముస్లింలను తీసుకురావటం, మరోవైపు నుంచి తుఫైల్ బిన్ అమ్ర్ యమన్ నుంచి దౌస్ తెగవారిని నవముస్లింలుగా వెంటబెట్టుకు రావటం-ఒకేసారి వారంతా ఖైబర్‌కు చేరుకోవటం యూదులకు శరాఘాతం లాంటిది. ఇందులో దేవుని తరపున యూదులకు ఓ సూచన ఉంది. హెచ్చరిక కూడా ఉంది. ఇస్లాం కిరణాలు దూర ప్రదేశాలలో నివసించే నిరక్షరాస్యుల హృదయాలలోకి దూసుకుపోతుండగా, మీరు రాళ్లు ఇటుకలతో కట్టుకున్న కోటలపై ఇంకెంత కాలం ఆధారపడి ఉంటారు? ఇకనయినా ఆత్మావలోకనం చేసుకోండి అని ఈ పరిణామాలు సూచిస్తున్నాయి.[2]

## సఖీఫ్ ప్రతినిధి వర్గం

సఖీఫ్ తెగవారిలో అందరికన్నా ముందు ఇస్లాం శిక్షణ పొందటానికి మదీనా నగరానికి వచ్చిన వ్యక్తి ఉర్వ బిన్ మస్‌వూద్ (రజి). ఈయన తన తెగకు నాయకుడు. హుదైబియా ఒప్పందం సందర్భంగా మక్కా అవిశ్వాసుల తరపున వకాల్తా పుచ్చుకున్నారు. హవాజిన్‌ల యుద్ధం తరువాత ఈయన ఆలోచనలో మార్పు వచ్చింది. మదీనాకు వచ్చి ఇస్లాం స్వీకరించారు. హజ్రత్ ఉర్వకు 10 మంది భార్యలుండేవారు. నలుగురిని మాత్రం ఉంచుకుని మిగిలిన వారందరికీ విడాకులివ్వమని దైవప్రవక్త (స) సూచించారు. దైవప్రవక్త (స) చెప్పినట్లే చేశారాయన.[3]

హజ్రత్ ఉర్వ (రజి) ఇస్లాం శిక్షణ పొందిన తరువాత దైవప్రవక్త(స)

1) జాదుల్ మఆద్-3:625, 626.
2) రహ్మతుల్ లిల్ ఆలమీన్-1:163.
3) దలాయలున్న బువ్వ-5:299, జాదుల్ మఆద్-3:498

www.abulhasanalinadwi.org

సన్నిధికి వచ్చి, 'నా తెగవారిలో ఈ సత్యధర్మాన్ని పరిచయం చేసేందుకు అనుమతించండి' అని విన్నవించుకున్నారు. "అలా చేస్తే నీ జాతివారు నిన్ను బ్రతకనివ్వరేమో!" అన్నారు దైవప్రవక్త. "ఒక ప్రియుడు తన ప్రియనేస్తాన్ని ప్రేమించినంతగా నా తెగవారు నన్ను ప్రేమిస్తారు., దాన్ని గురించి తమరు చింతించకండి" అంటూ తన తెగవారిలో ఇస్లాం ప్రచారాన్ని మొదలెట్టారు ఈ పెద్దమనిషి. ఒక రోజు ఆయన తన ఇంటిపైన నమాజు చేస్తుండగా ఎవరో ఆయనపై బాణం ప్రయోగించారు. ఆ విధంగా ఆయన అమరగతి నొందారు.[1]

హజ్రత్ ఉర్వ (రజి) సఖీఫ్ తెగవారి మధ్యలేకపోయినప్పటికీ ఆయన చేసిన త్యాగం వృధా కాలేదు. ఆయన చనిపోయిన కొన్నాళ్ళకే తెగవారు కొంతమంది ప్రముఖుల్ని ప్రతినిధులుగా ఎన్నుకుని ఇస్లాం గురించి క్షుణ్ణంగా తెలుసుకు రమ్మని మదీనా పంపించారు.

ఈ ప్రతినిధి బృందం హిజ్రీ 9వ యేట దైవప్రవక్త (సఅసం) దగ్గరకు వచ్చింది. అబ్దె యాలైల్ ఈ బృందానికి నాయకుడు. అతన్ని బోధపరచేందుకు దైవప్రవక్త(స) ఒకప్పుడు తాయఫ్ కొండపైకి వెళ్ళి ఉన్నారు. కాని అతడు దైవప్రవక్త(స) సందేశాన్ని వినలేదు సరికదా, పట్టణంలోని అలగా జనులకు, ఆకతాయి కుర్రాళ్లను ఉసిగొల్పి దైవప్రవక్త (స)ను అవమానపరచాడు. ఇతని ఆదేశానుసారమే జనులు ఆయన (స)పై రాళ్లు రువ్వారు. బురద చల్లారు.

సఖీఫ్ తెగవారిని శపించే అవకాశం దైవ ప్రవక్త (స)కు లభించింది. కాని ఆయన (స) వారి వినాశాన్ని కోరుకోలేదు. వాళ్ళు ఇస్లాం స్వీకరించకపోయినా, భవిష్యత్తులో దైవాజ్ఞలను పాలించేవారు వారిలో పుట్టకపోతారా?! అన్న ఉద్దేశ్యంతో ఆయన వారిని క్షమించి వదలిపెట్టారు. ఆయన(స) ఆశించిందే నిజమయింది. క్రమంగా సఖీఫ్ తెగవారి కరకు గుండెలు కరిగాయి. వారి హృదయ కవాటాలు ఇస్లాం కొరకు తెరచుకునే సమయం వచ్చేసింది. వారంతట వారుగా ఇస్లాం గురించి వాకబుచేస్తూ మహాప్రవక్త (స) సమక్షంలో హాజరయ్యారు.

హజ్రత్ ముగీరా బిన్ షూబా (రజి) దైవప్రవక్త (స) వద్దకు వచ్చి,

1) ముస్తద్రక్ హాకిమ్-3:713

www.abulhasanalinadwi.org

"వీళ్లు (సఖీఫ్ తెగవారు) నా జాతి ప్రజలు. తమరికేమీ అభ్యంతరం లేదంటే నేను వీళ్ల అతిథ్యాన్ని స్వీకరించి, తగు విధంగా సత్కరించ గోర్తున్నాను" అన్నారు. "నీ జాతివారికి నీవు స్వాగతం పలికి, అతిథి మర్యాద చేయదలిస్తే నాకెలాంటి అభ్యంతరం లేదు. కాకపోతే వారి చెవుల్లో దివ్యవచనాలు పడే స్థలాన్ని ఎంపికచెయ్యి" అని చెప్పా రాయన(స).

ఆఖరికి మస్జిద్ ప్రాంగణంలోనే వారికోసం శిబిరాలు వేయబడ్డాయి. అక్కడ కూర్చొని వారు దివ్యఖుర్ఆన్ పారాయణాన్ని వినేవారు. ప్రజలు నమాజ్ చేస్తుండగా ఆసక్తిగా చూసేవారు తద్వారా వారిలో ఆశించిన పరివర్తన వచ్చింది. కడకు వారంతా మహాప్రవక్త (స) చేతిపై ప్రమాణం చేస్తూ ఇస్లాం స్వీకరించారు. ప్రతిజ్ఞ చేసే ముందు, తమకు నమాజ్ బాధ్యతనుంచి మినహాయింపు ఇస్తే బావుంటుందని వాళ్లు కోరారు. "నమాజు లేని మత ధర్మంలో శుభశ్రేయాలుండవు" అంటూ మహాప్రవక్త (స) వాళ్ల ప్రతిపాదనను తిరస్కరించారు. "సరే. అలా అయితే మమ్మల్ని జిహాద్ (ధర్మయుద్ధం) చేసే విధి నుంచి జకాత్ నుంచి రాయితీ ఇప్పించండి" అని కోరారు. మహాప్రవక్త (స) ఈ కోర్కెను తాత్కాలికంగా అమోదించారు. ఇస్లాం గనక వారి హృదయాంతరాళాల్లోకి చొచ్చుకుపోతే వారంతటవారే ఈ రెండు విద్యుక్త ధర్మాల్ని కూడా పాటిస్తారని దైవప్రవక్త (స) ఆశించారు.[1]

సఖీఫ్ తెగనాయకుడైన అబ్దె యాలైల్ దైవప్రవక్త (స)తో మరి కొన్ని విడతల చర్చలు జరిపి క్రింది విషయాలపై కూడా సందేహాలను లేవనెత్తాడు.

1) మా జాతివారు తరచూ ఇళ్లు విడిచి ప్రయాణాలు చేస్తుంటారు. కాబట్టి వారు అక్రమ లైంగిక సంబంధాలు పెట్టుకోవటం మినహా మరో మార్గం లేదు. మరెలా?

దీనికి సమాధానమిస్తూ దైవప్రవక్త (స), "వ్యభిచారం నిషేధించ బడింది. వ్యభిచారం దరిదాపులకు కూడా పోరాదనీ, అదొక నీతిమాలిన

1) సుననె అబూదావూద్: కితాబుల్ ఖిరాజ్.

www.abulhasanalinadwi.org

చేష్ట అనీ, చెడ్డమార్గమనీ ఖుర్ఆన్ అంటోంది" (బనీ ఇస్రాయీల్-4వ రుకూ) అన్నారు.

2) "దైవప్రవక్తా! వడ్డీ విషయంలో మీ అభిప్రాయం ఏమిటీ? అది మాకు రావలసిన సొమ్మేకదా?!" అని సందేహపడగా,

"మీకు రావలసిన అసలు సొమ్మును మాత్రమే తీసుకోండి. ఎందుకంటే వడ్డీని అల్లాహ్ నిషేధించాడు. 'విశ్వసించిన ఓ ప్రజలారా! దైవానికి భయపడండి. వడ్డీగా మీకు రావలసి ఉన్న దాన్ని వదలిపెట్టండి' అని అల్లాహ్ ఆజ్ఞాపించాడు" అని ఆయన(స) సమాధానమిచ్చారు.

3) "దైవప్రవక్తా! మద్యం గురించి మీరేమంటారు? ఇదైతే దేశవాళీ అరకు. దీన్ని సేవించకపోతే మేము ఉండలేం కదా!" అని ఇంకో ప్రశ్న వేశాడు.

"మద్యాన్ని దేవుడు నిషేధించాడు. అల్లాహ్ ఏమని ఆజ్ఞాపించాడో తెలుసా?-విశ్వాసులారా! సారాయి, జూదం, దైవేతర మందిరాలు, పాచికల ద్వారా జోస్యం-ఇవన్నీ అసహ్యకరమైన షైతాను పనులు. వాటిని విసర్జించండి. మీకు సాఫల్య భాగ్యం కలిగే అవకాశం ఉంది అని అల్లాహ్ సెలవిచ్చాడు" అని దైవప్రవక్త (స) సమాధానమిచ్చారు.

మరునాడు అతను మరోసారి వచ్చి, సరే. మీరు చెప్పేవన్నీ మేము ఒప్పుకుంటున్నాం. కాని 'రబ్బ' వ్యవహారం ఏం చేద్దాం? అని సందేహపడ్డాడు. తాము పూజించే 'దేవీ'ని వారు 'రబ్బ'గా పిలిచేవారు. 'దాన్ని పడగొట్టండి' అని దైవప్రవక్త (స) సూచించారు. ప్రతినిధి మండలి సభ్యులంతా దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ విగ్రహాన్ని పడగొట్టబోతున్నామన్న సంగతి గనక తెలిస్తే దేవి మనందరినీ సర్వనాశనం చేసేస్తుంది అని వారంతా ముక్త కంఠంతో పలికారు.

వారి పరిస్థితిని అప్పటివరకూ ప్రశాంతంగా గమనిస్తున్న హజ్రత్ ఉమర్ (రజి) ఈ మాట వినగానే పెదవి విప్పారు. "ఇబ్నె అబ్దె యాలైల్! మీవాళ్ల తీరు కడుశోచనీయం! అది కేవలం ఒక రాతి విగ్రహం తప్ప మరేమీకాదన్న సంగతి మీకు తెలీదా?" అన్నారు. ఇబ్నె అబ్దె యాలైల్‌కు కోపం వచ్చింది. ఉమర్ (రజి) వైపు తీక్షణంగా చూస్తూ, "మేము వచ్చింది నీతో మాట్లాడటానికి కాదు" అన్నాడు.

www.abulhasanalinadwi.org

తరువాత అతను దైవప్రవక్త (స) నుద్దేశించి, "ఆ విగ్రహాన్ని పడగొట్టే బాధ్యతను దైవప్రవక్తకే వదలిపెడదాం. ఎందుకంటే చేతులారా మేము దాన్ని పడగొట్టలేము" అన్నాడు. "సరే. దాన్ని పడగొట్టే వ్యక్తిని నేను పంపిస్తానులెండి" అన్నారు దైవప్రవక్త (స). "ఇప్పుడేవద్దు. మేము వెళ్ళిపోయిన తరువాత పంపండి" అని వారంతా అభ్యర్థించారు.

మొత్తానికి ప్రతినిధులుగా వచ్చిన వారంతా ఇస్లాం స్వీకరించి మరీ వెళ్ళారు. వెళ్ళే సమయంలో తమపై ఎవరినయినా ఇమాముగా నియమించమని విజ్ఞప్తి చేశారు. వారిలో అందరికన్నా పిన్న వయస్కులైన హజ్రత్ ఉస్మాన్ బిన్ అబుల్‌ఆస్‌ను వారి ఇమాము (సారథి)గా నియమించారు దైవప్రవక్త (స). ఎందుకంటే ఉస్మాన్ అప్పటికే రహస్యంగా ఖుర్‌ఆన్ అధ్యయనం చేశారు. షరీయత్ ఆజ్ఞలు తెలుసుకున్నారు.

తమ స్వస్థలానికి తిరిగివస్తూ, మార్గమధ్యంలో వాళ్ళంతా ఒక అవగాహనకు వచ్చారు. తాము ఇస్లాం పుచ్చుకున్న సంగతిని రహస్యంగా ఉంచుదాం. కీడెంచిన తరువాతే మేలెంచుదాం అని అందరూ కూడబలుక్కున్నారు. తాయఫ్‌కు తిరిగి రాగానే తెగవారంతా వచ్చి, "ఏమయింది?" అని ఆత్రుతతో అడిగారు.

"ఆఁ ఏం చెప్పమంటారు? ఏ మాత్రం పట్టువిడుపులు లేని కరకు మనిషితో మేము మాట్లాడాల్సి వచ్చింది. మా వల్ల సాధ్యంకాని ఆదేశాలు జారీచేస్తున్నాడు. మా ఆరాధ్య దైవాలైన లాత్ ఉజ్జాలను పడగొట్టాలట! వడ్డీ సొమ్మునంతటినీ వదలుకోవాలట!! సారాయి త్రాగకూడదంట!!! వ్యభిచారం చేయరాదట!!!!".

"ఇది ముమ్మాటికీ అసంభవం" అని జాతి ప్రజలంతా చెప్పారు.

"మరయితే ఆయుధాలకు పదునుపెట్టండి, సమరసన్నాహాలు మొదలెట్టండి. కోటలకు మరమ్మత్తు చేయండి" అని ప్రతినిధి మండలి సభ్యులు రెచ్చగొట్టారు.

రెండు రోజుల వరకూ సఖీఫ్ తెగవారంతా అదే మాటపై స్థిరంగా ఉన్నారు. మూడో రోజు మెత్తబడి పోయారు.

www.abulhasanalinadwi.org

"ఇంక మేము ముహమ్మద్ (సఅసం)తో పోరాగలమా? యావత్తు అరేబియా వాసులు ఈ రోజు ముహమ్మద్ (స)ను అనుసరిస్తున్నారు. అలాంటప్పుడు కయ్యానికి కాలుదువ్వి ప్రయోజనమేమిటి? వెళ్ళి ముహమ్మద్ (స) పెట్టే షరతులన్నింటినీ ఒప్పేసుకోండి" అన్నారంతా.

అప్పుడుగాని ప్రతినిధి మండలి అసలు విషయాన్ని బయటపెట్టలేదు.

"ఇప్పుడు నిజం చెబుతున్నాం వినండి! భయభక్తులలో, సత్యసంధతలో, నిజాయితీలో మేము ముహమ్మద్ (సఅసం) కన్నా మిన్న అయిన వ్యక్తిని ఎన్నడూ చూడలేదు. ఈ ప్రయాణం వల్ల మాకు అనిర్వచనీయమైన శుభాలు ప్రాప్తించాయి" అన్నారు.

మరయితే మీరు ఎందుకు ఈ విషయాన్ని దాచి పెట్టారు? మమ్మల్ని ఆందోళనకు ఎందుకు లోనుచేశారు? అని తాయఫ్‌వాసులు ఆగ్రహాన్ని వెళ్ళగ్రక్కారు.

"మీ అంతర్యాల్లో తిష్ఠవేసి ఉన్న పైశాచిక అహంభావాలను తీసిపారెయ్యడానికే మేమీ ఎత్తువేశాము" అని ప్రతినిధి బృందం చెప్పింది.

ఆ తరువాత అందరూ మూకుమ్మడిగా ఇస్లాం స్వీకరించారు.

కొన్నాళ్లు గడిచాయి. దైవప్రవక్త (స) నియమించిన ఓ పయనబృందం హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (రజి) నేతృత్వంలో తాయఫ్ చేరుకుంది. లాత్ విగ్రహాన్ని కూల్చివేద్దామని వారంతా నిర్ణయించుకున్నారు. సఖీఫ్ తెగలోని మగవారు, ఆడవారు, వృద్ధులు, పిల్లలు-అందరూ ఇది ఎవరి వల్లా కాని పని అని అనుకునేవారు. పరదాలో ఉండే స్త్రీలు కూడా ఈ తమాషాను చూడటానికి ఇళ్లనుంచి బయటికొచ్చారు. విగ్రహాన్ని కూల్చడానికి హజ్రత్ ముగీరా బిన్ షూబ (రజి) తొలుత బాణం ప్రయోగించారు. కాని మితిమీరిన ఆవేశంలో ఆయన స్వయంగా క్రిందపడి పోయారు. ఈ దృశ్యాన్ని చూసిన సఖీఫ్ తెగ వారికి పూనకం వచ్చినంత పనయింది. "చూశారా! దేవుడు ముగీరాను ధూత్కరించాడు. రబ్బాదేవీ ఇతని పనిపట్టేసింది. ఇక ఈ విగ్రహాలను పడగొట్టడం ఎవరితరమూ కాదు" అంటూ గంతులు వేయసాగారు.

www.abulhasanalinadwi.org

"సఖీఫ్ తెగవారలారా! మీరు వట్టి మూర్ఖులు. ఈ రాతి ముక్క ఏం చేయగలదు? అందుకే ఒక్కడైన దైవాన్ని నమ్మి, ఆయన్నే సేవించండి" అని ముగీరా బదులిచ్చారు. మరుక్షణమే ఆయన విగ్రహం ప్రతిష్ఠించబడివున్న ఆలయం తలుపులు మూసేసి విగ్రహాన్ని ముక్కలు ముక్కలు చేశారు. తరువాత గోడల్ని పడగొట్టారు. మిగిలినవారు కూడా గోడలన్నింటినీ నేలమట్టం చేశారు.

గర్భగుడిదాకా వెళ్ళమనండి, అది వీళ్ళని నేలలో కూర్చివేస్తుందని విగ్రహ పూజారి చెప్పాడు. ఈ మాటను విన్నంతనే హజ్రత్ ముగీరా గర్భగుడి పునాదుల్ని సయితం పెకలించి వేశారు. ఈ దృశ్యాన్నంతటినీ తదేకంగా తిలకించిన స్థానికుల హృదయాలపై ఇస్లాం చెరగని ముద్రవేసింది.[1]

## అబ్దుల్ ఖైస్ ప్రతినిధి వర్గం

అబ్దుల్ ఖైస్ తెగ తరపున కూడా ఓ ప్రతినిధి వర్గం దైవ ప్రవక్త (స) సన్నిధికి వచ్చింది. "మీరే జాతికి చెందినవారు?" అని దైవప్రవక్త (స) ప్రశ్నించగా, "రబీయా జాతివారమ"ని వారు బదులిచ్చారు. దైవప్రవక్త (స) ఈ బృందానికి స్వాగతం పలికారు. "దైవప్రవక్తా! మీకు - మాకు మధ్య ముజర్ తెగవారు (అవిశ్వాసులు) అవరోధంగా ఉన్నారు. అందుచేత మేము కేవలం పవిత్ర నగరానికి మాత్రమే రాగలము. కనుక మేము, మా జాతివారు ఆచరించవలసిన విద్యుక్త ధర్మాలను స్పష్టపరిస్తే మేము వాటికి కట్టుబడి ఉంటాము" అని వారంతా విన్నవించుకున్నారు.

వారికి దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు:

నాలుగు విషయాలను పాటించవలసిందిగా, నాల్గు విషయాలను విడనాడవలసిందిగా నేను మీకు ఆజ్ఞాపిస్తున్నాను. పాటించవలసిన ఆజ్ఞలు ఇవి: 1) ఒకే దైవాన్ని ఆరాధించాలి ('లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్' అనే కలిమాకు కట్టుబడి ఉండాలి).

2) నమాజు చేయాలి. 3) జకాతు చెల్లించాలి. 4) రమజాన్ మాసంలో ఉపవాసాలుండాలి. యుద్ధప్రాప్తిగా లభించే సొమ్ములో నుంచి 5వ భాగం (ఖుముస్) ఇవ్వాలి.

---

1) జాదుల్‌మఆద్ - 3:596-599, దలాయలున్నబువ్వ లిల్ బైహఖి-5:299-304.

www.abulhasanalinadwi.org

మరో నాల్గో విషయాలకు దూరంగా ఉండాలి. 1) దుబ్బా[1] 2) హంతుమ్, 3) నఖీర్, 4)ముజప్ఫత్-ఈ నాల్గు విషయాలను మీరు స్వయంగా జ్ఞాపకముంచుకోవటమేగాక, మీ భావితరాలకు కూడా జ్ఞాపకం చేయాలి.[2]

"దైవప్రవక్తా (సఅసం)! నఖీర్ అంటే ఏమిటో తమరికి తెలుసా?" అని వారు ఆశ్చర్యంగా ప్రశ్నించగా, "తెలుసు. ఖర్జూర చెట్టును తొలచి అందులో ఖర్జూరాలు వేస్తారు. దానిపై నీళ్ళు వేస్తారు. అందులో పొంగువస్తుంది. పొంగు తగ్గిన తరువాత దాన్ని సేవిస్తారు. ఆ మత్తులో మీరు మీ బాబాయి కొడుకునే చంపుతారేమో!" అన్నారు దైవప్రవక్త (స). (ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఆ ప్రతినిధి వర్గంలోకి ఒక వ్యక్తి ఈ సారా మత్తులో మునిగి తన బాబాయి కొడుకునే హతమార్చాడు.)

"దైవప్రవక్తా (స)! మరి మేము మంచి నీరు ఎలా త్రాగాలి?" అని వారు ప్రశ్నించగా, "మూతి కట్టుడు ఉన్న తోలు సంచుల్లో నీరు నిలువ చేసుకోండి" అని దైవప్రవక్త (స) సలహా యిచ్చారు. "దైవప్రవక్తా! మా ప్రాంతంలో ఎలుకలు ఎక్కువగా ఉన్నాయి. బహుశా ఈ రకమయిన నీటితిత్తులు సురక్షితం కావేమో!" అని వారు సందేహపడగా, "అయినా సరే! మీరు వాటినే ఉపయోగించండి" అని ఆయన (స) చెప్పారు.[3]

ఈ ప్రతినిధి వర్గంలో జారూద్ బిన్ ముఅల్లా కూడా ఉన్నాడు. అతడు క్రైస్తవ మతస్తుడు. "దైవప్రవక్తా! నాకంటూ ప్రస్తుతం ఒక మతం ఉంది. నేను గనక దాన్ని విడిచిపెట్టి మీ మతం పుచ్చుకుంటే మీరు నా మోక్షానికి హామీగా ఉంటారా?" అని అడిగాడు. "ఉంటాను. ఎందుకంటే నేను బోధించే జీవన విధానం నువ్వు అవలంబించే మతం కన్నా

---

1) దుబ్బా: ఇది సొరకాయ బుర్ర. దీన్ని వారు ఎండబెట్టేవారు.
హంతుమ్: పచ్చనిబాన.
నఖీర్: చెట్టువేరును త్రవ్వితీసేవారు. దాన్ని చెక్కి పాత్రగా తయారు చేసేవారు.
ముజప్ఫత్: ఒకరకమైన జిగటు పదార్థాన్ని పాత్రకు అతికించేవారు. ఈ పాత్రలన్నింటినీ వారు మద్యం తదితర మత్తు పదార్థాల కోసం ఉపయోగించేవారు. అందుచేత దైవప్రవక్త (సఅసం) వీటి వాడకాన్ని వారించారు.

2) సహీహ బుఖారీ: కితాబుల్ ఈమాన్. ఇమామ్ ముస్లిం (రహ్మలై) కూడా సహీహ ముస్లింలో ఈ హదీసును పొందుపరచారు.

3) దలాయలున్న బువ్వ-5:366.

www.abulhasanalinadwi.org

శ్రేష్టమైంది'' అన్నారాయన(స). జారూద్‌తో పాటు మరికొంతమంది క్రైస్తవులు కూడా ఇస్లాం స్వీకరించారు.[1]

## హునైఫ ప్రతినిధి వర్గం

బనూ హునైఫ బృందం కూడా దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చింది. హ్రజత్ సుమామ బిన్ ఉసాల్ (రజి) కృషివల్ల ఈ ప్రాంతంలో ఇస్లాం వ్యాపించింది. ఈ బృందం మదీనా వచ్చి ఇస్లాం స్వీకరించింది. ఈ బృందంలో అబద్ధాగ్రేసరుడైన ముసైలిమా కూడా ఉన్నాడు. వాడు మదీనా నగరానికి వచ్చి, ముహమ్మద్ (స) తదనంతరం తనను ఉత్తరాధికారిగా నియమించడానికి ఒప్పుకుంటే తాను బైత్ (ప్రమాణ స్వీకారం) చేయడానికి సిద్ధంగా ఉన్నానని ప్రజలకు చెప్పుకున్నాడు. ఈ సంగతి దైవప్రవక్త (స)కు తెలిసింది. ఆ సమయంలో ఆయన(స) చేతిలో ఖర్జూరపు బెత్తం ఉంది. "ఉత్తరాధికారిగా కాదు కదా, కనీసం ఈ బెత్తం ఇచ్చే షరతుపై కూడా నేనతని చేత ప్రమాణస్వీకారం చేయించను'' అని దైవప్రవక్త (స) నిర్ద్వంద్వంగా చెప్పారు. "వాడు గనక బైత్ చేయకపోతే దేవుడు వాణ్ణి నాశనం చేస్తాడు. అతని పర్యవసానాన్ని అల్లాహ్ నాకు చూపెట్టాడు. నాకు కల వచ్చింది. నా చేతిలో బంగారు కడియాలున్నాయి. అవి నాకు ఇబ్బందికరంగా తోచాయి. నోటితో ఊదివేయమని నాకు కలలోనే 'వహీ' వచ్చింది. నోటితో ఊదగా అవి ఎగిరిపోయాయి. బహుశా వారిద్దరూ ముసైలిమా మరియు అన్సా అని నేను భావిస్తున్నాను'' అని ఆయన (సఅసం) వివరించారు.[2]

## 'తై' తెగ

జైదుల్ ఖీల్ సారథ్యంలో 'తై' తెగవారు దైవప్రవక్త (స) వద్దకు వచ్చారు. తెగనాయకుడు ఆయన్ని (స) ఉద్దేశ్యించి "అరేబియాలోని ఏ వ్యక్తి గొప్పదనం గురించి నేను విన్నానో అతన్ని చూచే అవకాశం అనతి కాలంలోనే దక్కింది'' అన్నాడు. ఆనాటి నుంచి అతను జైదుల్ ఖైర్‌గా

1) దలాయలున్నబువ్వ-5:328, ఇబ్నె హిషామ్-2:575.
2) సహీహ్ బుఖారీ: కితాబుల్ మగాజీ-బాబు వఫ్దె బనీహునైఫ.

www.abulhasanalinadwi.org

పిలువబడ్డాడు. వీళ్ళంతా కాస్సేపు సంప్రతించిన మీదట ముస్లింలై పోయారు.[1]

యమన్‌కు చెందిన అష్అరియా తెగవారు కూడా వచ్చారు. వారి రాకను గురించి తెలుసుకున్న దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

"యమన్ వాసులు వచ్చారు. వారి హృదయాలు మృదువైనవి, సున్నితమైనవి. విజ్ఞత, విశ్వాసనీయతలు యమన్ వాసులలో ఉన్నాయి. సంయమనం మేకల వారిలో ఉంది. గర్వం అహంకారం తూర్పు ప్రాంతంలో ఉండే ఒంటెల వారిలో ఉన్నాయి."[2]

మదీనా నగరంలో ప్రవేశించినపుడు వారి నోట ఈ కవితలు వెలువడ్డాయి.

"రేపు మేము మా మిత్రులను కలుసుకుంటాము. ముహమ్మద్ (స) మరియు ఆయన సహచరులే మా మిత్రులు".[3]

## అజ్ద్ బృందం

ఈ బృందంలో ఏడుగురు సభ్యులున్నారు. దైవప్రవక్త (స) సన్నిధిలోకి వచ్చినప్పుడు, ఆయన(స) వారి సంస్కారాన్ని చూసి మెచ్చుకున్నారు. "ఎవరు మీరు?" అనడిగారు. "మేము విశ్వాసులం" అన్నారు. " అది సరే. ప్రతివాక్కు వెనుక ఓ వాస్తవికత ఉంటుంది. మీ విశ్వాసంలోని విశిష్టత, వాస్తవికత ఏమిటో చెప్పండి?" అన్నారు దైవప్రవక్త (స). అప్పుడు వారిలా అన్నారు. "మాలో 15 గుణాలున్నాయి. వాటిలో ఐదింటిని విశ్వసించమని మీ ప్రతినిధులు మాకు ఆదేశించి ఉన్నారు. మరో ఐదింటిని పాటించవలసినదిగా తమరు మమ్మల్ని ఆజ్ఞాపించారు. ఇంకో ఐదు నియమాలకు మేము మునుపటి నుంచే కట్టుబడి ఉన్నాము.

దైవప్రవక్త (స) నియమించి పంపిన ప్రతినిధులు జారీ చేసిన

1) ఇబ్నె హెషామ్-2:577.
2) సహీహ్ బుఖారీ: కితాబుల్ మగాజీ
3) ముస్నదె అహ్మద్-3:105, 150

www.abulhasanalinadwi.org

5 ఆదేశాలు ఇవి: దైవాన్ని, దైవదూతల్ని, దైవగ్రంథాలను, దైవప్రవక్తలను, మరణానంతరం తిరిగిలేపబడే విషయాన్ని విశ్వసించాలి.

5 విషయాలను ఖచ్చితంగా ఆచరించవలసిందిగా మాకు ఆజ్ఞాపించబడింది.-1) 'లా యిలాహ ఇల్లల్లాహ్' అనే వచనాన్ని పలకాలి. 2) 5 పూటల నమాజులను నెలకొల్పాలి 3) జకాత్‌ను చెల్లించాలి 4) రమజాన్ ఉపవాసాలను పాటించాలి. 5) స్థోమత ఉంటే హజ్‌యాత్ర చేయాలి.

ముందు నుంచే మేము కట్టుబడి ఉన్న 5 సూత్రాలు: 1) కలిమిలో కృతజ్ఞతలు చెల్లించటం. 2) లేమిలో ఓర్పు వహించటం. 3) దైవేచ్ఛపై రాజీపడిపోవటం. 4) పరీక్షా ఘడియల్లో స్థయిర్యం కనబరచటం 5) శత్రువును సయితం దుర్భాషలాడకుండా ఉండటం.

వారి ఈ మాటల్ని విన్న దైవప్రవక్త (స) మెచ్చుకోలుగా చూశారు. ఈ సూత్రాలను బోధించిన వారు వివేకవంతులనీ, మహాజ్ఞానులన్నీ కొనియాడారు. బహుశా ఈ ఉపదేశం చేసిన వారు దైవప్రవక్తలై ఉండవచ్చని కూడా అన్నారు. మరో ఐదు విషయాలు మీకు చెబుతాను. వాటిని కూడా మీరు పాటిస్తే 20 సూత్రాలకు కట్టుబడిన వారవుతారు. అవేమంటే-

1) మీరు తినలేని వస్తువులను సమకూర్చుకోకండి.

2) మీరు నివసించని ఇళ్లను నిర్మించకండి.

3) రేపటి రోజున మీరు విడిచి పోవలసిన విషయాలలో పరస్పరం పోటీ పడకండి.

4) మీరు ఏ ప్రభువు సమక్షంలో హాజరు కానున్నారో ఆయనకు భయపడండి.

5) శాశ్వత నివాస స్థలమైన పరలోకంలో మీకు పనికి వచ్చే వాటికోసం ప్రయత్నిస్తూ ఉండండి.

దైవప్రవక్త (సఅసం) ఉపదేశాన్ని వారు ఖచ్చితంగా పాటించారు.[1]

1) జాదుల్ మఆద్-3:272, 273, అల్ అసాబ-3:151.

www.abulhasanalinadwi.org

ఆనాడు అరేబియా ఉత్తరాది ప్రాంతం కానిస్టాంటినోపుల్ అధీనంలో ఉండేది. ఈ ప్రాంతానికి ఫరోహ్ బిన్ అమ్ర్ గవర్నరుగా ఉండేవాడు. మఆన్ అతని రాజధాని నగరం. పాలస్తీనా సరిహద్దు భూభాగం కూడా ఇతని అధీనంలోనే ఉండేది.

దైవప్రవక్త (సఅసం) ఇతనికి ఇస్లాం సందేశం పంపించారు. ఫరోహ్ ఇస్లాం స్వీకరించాడు. దైవప్రవక్త (స) దగ్గరకు తన దూతను పంపిస్తూ, కానుకగా ఒక తెల్లని కంచెరగాడిదను కూడా సమర్పించుకున్నాడు.

ఈయన ఇస్లాం స్వీకరించారన్న సంగతి కానిస్టాంటినోపుల్ చక్రవర్తికి తెలియగానే, గవర్నర్ పదవి నుంచి ఉద్వాసన పలికి, ఈయన్ని వెనక్కి పిలిపించాడు. ఇస్లాం ధర్మం నుండి మరలిపొమ్మని ముందు నచ్చజెప్పాడు. హజ్రత్ ఫరోహ్ (రజి) చక్రవర్తి సలహాను త్రోసిపుచ్చటంతో ఆయన్ని కారాగారంలో పెట్టారు. అప్పటికీ ఆయన ఇస్లాం ధర్మానికే కట్టుబడి ఉండటంతో ఉరితీయమని ఆజ్ఞాపించాడు. పాలస్తీనా పట్టణంలోని అఫ్రా చెరువు దగ్గర ఆయన ఉరితీయబడ్డారు.

## హమ్దాన్ బృందం

ఈ తెగవారు యమన్‌దేశంలో నివసించేవారు. ఇస్లాం ధర్మ పరిచయం నిమిత్తం ఖాలిద్ బిన్ వలీద్ (రజి) అక్కడికి పంపబడ్డారు. చాలాకాలం అక్కడే ఉన్నారు. కాని అక్కడ ఇస్లాం వ్యాప్తి చెందలేదు. ఆఖరికి హజ్రత్ అలీ (రజి)కి దైవప్రవక్త (స) ఈ బాధ్యతను అప్పగించారు. ఆయన కృషివల్ల ఒక్క రోజులోనే తెగవారంతా ముస్లింలైపోయారు.

హజ్రత్ అలీ (రజి) ఈ సంగతిని వివరిస్తూ దైవప్రవక్త (స)కు ఉత్తరం వ్రాశారు. ఈ సంగతి తెలుసుకున్న దైవప్రవక్త (స) దైవసన్నిధిలో కృతజ్ఞతా పూర్వకంగా ప్రణామం చేశారు. “హమదాన్ వారలకు శాంతి చేకూరు గాక” అన్న వచనం ఆ శుభ సమయంలో ఆయన (స) నోట వెలువడింది. హజ్రత్ అలీ (రజి) చేతులమీదుగా ఇస్లాం స్వీకరించినవారే ఇప్పుడు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చారు.

తారిఖ్ బిన్ అబ్దుల్లా ఇలా అంటున్నారు.

నేను మక్కాలో మజాజ్ అంగడిలో నిలబడి ఉన్నాను. అంతలో

www.abulhasanalinadwi.org

ఒక వ్యక్తి అక్కడికి వచ్చి, ఎలుగెత్తి ప్రకటించసాగాడు.

"ప్రజలారా! లా ఇలాహ ఇల్లల్లాహ్ అని పలకండి ముక్తి పొందుతారు".

అంతలోనే మరో వ్యక్తి వెనుక నుంచి వచ్చాడు. అతను మొదటి వ్యక్తిపై కంకరరాళ్లు రువ్వుతూ, "ప్రజలారా! వీడి మాటల్ని నమ్మకండి. వీడు అబద్ధాలకోరు" అని అంటున్నాడు. "ఎవరితను?" అని నేను వాకబు చేశాను.

ఇతను బనూ హాషిమ్‌కు చెందిన వ్యక్తి. తాను దైవప్రవక్త (స)నని అంటున్నాడు. రెండవ వ్యక్తి అతని పినతండ్రి అబ్దుల్ ఉజ్జా (అబూ లహబ్ అసలు పేరు అబ్దుల్ ఉజ్జా) అని జనులు చెప్పారు. ఈ సంఘటన జరిగి అనేక సంవత్సరాలు గడిచాయని తారిఖ్ చెప్పారు. మా తెగకు చెందిన కొంతమంది ఖర్జూర పండ్లు కొనే ఉద్దేశంతో మదీనాకు ప్రయాణం కట్టారు. ఆ వర్తక బృందంలో నేనూ ఉన్నాను. నగర పొలిమేరల్లో ఆగి బట్టలు మార్చుకున్నాము. అంతలో ఒక వ్యక్తి అటువైపు వస్తూ కనిపించాడు. అతని ఒంటిపై రెండు పాత దుప్పట్లు మాత్రం ఉన్నాయి. మాకు సలాం చేసిన తరువాత "ఎక్కడి నుంచి వచ్చారు? ఎక్కడి కెళుతున్నారు?" అని ప్రశ్నించాడు. 'రబ్జా' నుంచి వచ్చామనీ, మదీనా నగరానికి వెళ్ళే ఉద్దేశ్యంతోనే వచ్చామనీ అతనికి చెప్పాము. "ఏమిటీ విశేషం?" -మళ్ళీ ప్రశ్నించాడావ్యక్తి.

"ఖర్జూరపండ్లు కొనేందుకు వచ్చాం" అన్నాము. మా దగ్గర ఓ అందమైన ఎర్రని ఒంటె ఉండేది.

"ఈ ఒంటెను అమ్ముతారా?"

"అమ్ముతాము. కాని దాని మూల్యానికి సరిపడా ఖర్జూరపండ్లు ఇస్తేనే అమ్ముతాం" అని చెప్పాం. అంతే, ఆ వ్యక్తి బేరసారాలేమీ చేయకుండానే ఒంటె పగ్గాలు పట్టుకుని నగరం వైపుకు సాగిపోయాడు. మేమలా చూస్తూ నిలబడి పోయాము. ఆ వ్యక్తి వెళ్ళిపోయిన తరువాత గాని మేము చేసిన వ్యవహారం ఎలాంటిదో అర్థం కాలేదు. అదేమిటీ? ముక్కూ మొహం తెలియని వ్యక్తికి ఒంటెను ఇచ్చేసి దిక్కులు

www.abulhasanalinadwi.org

చూస్తున్నాం. దాని మూల్యం అసలు మనకు లభిస్తుందా?! అని కొందరు సందేహపడ్డారు.

మా బిడారులో ఓ కులీన స్త్రీ ఉంది. ఆమె దూరదృష్టి గల మహిళ. మా సందేహాన్ని పటాపంచలు చేస్తూ ఆమె ఇలా అంది: మీరేమీ బెంగపడకండి. నేనతని ముఖారవిందాన్ని పరికించాను. పూర్ణచంద్రునిలా ఆ మోము ప్రకాశిస్తోంది. ఆ వ్యక్తి ముమ్మాటికీ మిమ్మల్ని మోసగించడు. ఒకవేళ ఆ మూల్యం మీకు ఇవ్వకపోతే నేను చెల్లిస్తాను."

మేము ఈ విషయాన్ని చర్చించుకుంటూ ఉండగానే ఒక వ్యక్తి వచ్చి, "దైవప్రవక్త (స) నన్ను మీ వద్దకు పంపించారు. ఒంటె వెలకు సమానంగా ఖర్జూరపండ్లు ఇచ్చి రమ్మన్నారు. మీకు అతిథి మర్యాదగా మరికొన్ని ఖర్జూరపండ్లు కూడా ఇచ్చారు. ముందు భోజనం చేసి, ఆ తరువాత మీకు రావలసిన ఖర్జూరాలను కొలిచి తీసుకోండి" అన్నాడు. మేము భోజనాదుల్ని ముగించుకుని నగరంలోకి ప్రవేశించాము. మా దగ్గర ఒంటెను కొన్న వ్యక్తే మస్జిద్ వేదికపై నిలబడి ప్రసంగిస్తున్నాడు. ఆయన చెప్పే ఈ మాటలు మా చెవినపడ్డాయి.

> 'ప్రజలారా! దానధర్మాలు చేయండి. మీరిచ్చే దానాలు మీ పాలిట శ్రేయస్కరం అవుతాయి. ఇచ్చే చేయి పుచ్చుకునే చేయికన్నా ఉత్తమమైనది. (కాబట్టి ఇవ్వటం అలవరచుకోండి) మీ తల్లికి ఇవ్వండి, తండ్రికివ్వండి, చెల్లెలికివ్వండి, సోదరునికివ్వండి, ఆ తరువాత సమీప బంధువులకివ్వండి, ఆపైన ఇతర బంధువుల కివ్వండి..'[1]

## నజీబ్ బృందం

నజీబ్ తెగకు చెందిన 13 మంది వచ్చారు. వీళ్లు తమ తెగవారి జకాత్ ధనాన్ని తీసుకువచ్చారు. ఈ సొమ్మును వాపసు తీసుకువెళ్ళి అక్కడి పేదలకు పంచిపెట్టుమని దైవప్రవక్త (స) సూచించారు.

---

1) జాదుల్ మఆద్-3:646, 647. ఇమామ్ హాకిమ్ ముస్తద్రక్‌లో ఈ ఉల్లేఖనాన్ని పొందుపరచారు. ఇమామ్ జహబీ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు.

www.abulhasanalinadwi.org

"దైవప్రవక్తా (స)! పేదలకు ఇవ్వగా మిగిలిన ధనాన్నే మేము యిక్కడికి తెచ్చాము" అని వాళ్ళన్నారు.

"దైవప్రవక్తా (స) ! ఇప్పటి వరకూ యిక్కడి కొచ్చిన బృందాల న్నింటిలోకీ ఉత్తమ బృందం యిది" అని హజ్రత్ అబూబక్ర్ (రజి) అభిప్రాయపడ్డారు.

"సన్మార్గం, సద్బుద్ధి సర్వోన్నతుడైన అల్లాహ్ చేతిలో ఉంది. ఆయన తాను తలచిన వారికి ఈ భాగ్యాన్ని ప్రసాదిస్తాడు. తాను కోరిన వారి హృదయాన్ని ఈ భాగ్యం కోసం తెరుస్తాడు" అని కారుణ్యమూర్తి (సఅసం) చెప్పారు.

వాళ్లు దైవప్రవక్త (సఅసం) సమక్షంలో కొన్ని ధర్మ సందేహాలు వెలిబుచ్చారు. దైవప్రవక్త (స) వారి సందేహాలన్నింటికీ జవాబు వ్రాయించారు.

వీళ్లు ఖుర్‌ఆన్ హదీసుల పట్ల ఎక్కువ శ్రద్ధాసక్తులను కనబరిచారు. అందువల్ల వారికి తగు సౌకర్యాలు కల్పించే నిమిత్తం దైవప్రవక్త (స) హజ్రత్ బిలాల్ (రజి)ను నియమించారు.

కాని వారు మదీనాలో ఉండటానికి ఇబ్బంది పడుతున్నారు. వారి మనసంతా తమ స్వస్థలం మీదే ఉంది. పైకి మాత్రం చెప్పలేకపోతున్నారు. మీ వ్యాకులతకు కారణం ఏమిటి? అని కొంతమంది అనుచరులు ధర్యాప్తు చేయగా వాళ్ళిలా అన్నారు:"దైవప్రవక్త (స) సహచర్యభాగ్యం వల్ల మాకు లభించిన కాంతి కిరణాలను, ఆయన (స) ఉపదేశాల వల్ల మాకు కలిగిన ప్రయోజనాన్ని, ఇక్కడికొచ్చాక మాకు చేకూరిన శుభాలను మా తెగ వారందరికీ ఎప్పుడు తెలియజేయాలా అని మేము ఆరాటపడు తున్నాము."

దైవప్రవక్త (స) వీళ్ళందరికీ కానుకలు ఇచ్చారు. మీలో ఎవరయినా ఇంకా మిగిలి ఉన్నారా? అని కూడా అడిగారు. 'అవును ఒక అబ్బాయి మా సామానునకు కాపలాగా ఉన్నాడు' అని వారు బదులిచ్చారు. 'అయితే అతన్ని కూడా పంపించండి" అని దైవప్రవక్త (స) చెప్పారు. ఆ అబ్బాయి వచ్చి, "దైవప్రవక్తా (స)! తమరు మా తెగవారిపై ఎంతగానో దయ

www.abulhasanalinadwi.org

చూపారు. నాక్కూడా ఏదైనా ప్రసాదించండి" అన్నాడు.

"నీకేం కావాలి?" ప్రశ్నించారు దైవప్రవక్త (స).

"దైవప్రవక్తా(స)! నా వ్యవహారం మా తెగవారి వ్యవహారంకన్నా కొంచెం విలక్షణమైంది. వారంతా ఇస్లాం పట్ల గల అభిమానంతో యిక్కడి కొచ్చారన్న సంగతి నాకు బాగా తెలుసు. వాళ్ళు సదఖా సొమ్మును కూడా మీ వద్దకు తెచ్చారు" అన్నాడా యువకుడు.

"మరయితే నీకేం కావాలో చెప్పావు కాదు" అడిగారు దైవప్రవక్త.

"తమరు నా మన్నింపు కోసం ప్రార్థిస్తారనీ, నాపై దయజూపమని దైవాన్ని వేడుకుంటారనీ, నాకు ఆత్మ తృప్తిని ప్రసాదించమని ప్రభువును అభ్యర్థిస్తారన్న ఆశతో యిక్కడికి వచ్చాను"- చెప్పాడా నవయువకుడు.

దైవప్రవక్త (స) అతని కోసం అలాగే ప్రార్థించారు. హిజ్రీ 10వ యేట దైవప్రవక్త (స) హజ్‌యాత్ర చేసినపుడు కూడా ఈ తెగవారు అక్కడికి వచ్చి ఆయన్ని (స) కలుసుకున్నారు. అప్పుడు దైవప్రవక్త (స) ఆ అబ్బాయి ధార్మిక స్థితిని గురించి వాకబు చేశారు. దానికి వారు, "ఆ అబ్బాయి గురించి ఎంత చెప్పినా తక్కువే. నెమ్మదస్తుడు, నిస్వార్థపరుడు, నిరపేక్షాపరుడు. తన ముందు ప్రపంచ సిరిసంపదలు పంపిణీ అవుతున్నాసరే తనకేమీ అక్కరలేదన్నట్లుగా ప్రవర్తిస్తాడు. కనీసం వాటి వంక కన్నెత్తి కూడా చూడడు."[1]

## బనీ సాద్ హుజైమ్ బృందం

ఈ బృందం మదీనాకు వచ్చిన సమయంలో దైవప్రవక్త (సఅసం) అంత్యక్రియల నమాజుకు సారథ్యం వహించి ఉన్నారు.

దైవప్రవక్త (స)ను కలుసుకునే దాకా తాము ఏ పనీ చేయరాదని వారంతా కూడబలుక్కున్నారు. అందుకే వారంతా ఒక ప్రక్కకు జరిగి కూర్చున్నారు. దైవప్రవక్త (స) నమాజు పూర్తయ్యాక వారిని పిలిపించారు. "మీరు ముస్లిములేనా?" అని అడిగారు. "అవును" అన్నారు వారంతా.

1) జాదుల్ మ ఆద్ - 3:250,251, ఇబ్నె సాద్-1:323.

www.abulhasanalinadwi.org

"మరి మీరు మీ సోదరుని కోసం జరిగే ప్రార్థన (దుఆ) లో ఎందుకు పాల్గొనలేదు?"

"దైవప్రవక్త (స) చేతిలో చెయ్యేసి ప్రమాణం చేసేదాకా బహుశా ఏ పనీ చేయరాదుగామోలు! అనుకున్నాం."

"అది సరైన పద్ధతి కాదు. మీరు ఇస్లాం స్వీకరించిన మరు క్షణం నుంచే ముస్లింలుగా మీ బాధ్యతల్ని నెరవేర్చాలి" అన్నారు దైవప్రవక్త (స)

అంతలోనే మరో ముస్లిం వ్యక్తి కూడా వచ్చి వారితో చేరాడు. వాళ్లతన్ని తమ వాహనాల దగ్గర వదలి వచ్చారు.

"దైవప్రవక్తా(స)! ఇతను మాకన్నా చిన్నవాడు. అందుకే మా సేవలో నిమగ్నుడై ఉన్నాడు" అని వాళ్ళు చెప్పారు.

"చిన్నవాడు తమ పెద్దల సేవకుడై ఉంటాడు. దేవుడితనికి శుభం చేకూర్చుగాక!" అని దైవప్రవక్త (స) దీవించారు. ఈ దీవెనలను అందుకున్న ఆ వ్యక్తి తన జాతికి నాయకుడయ్యాడు. దివ్యఖుర్ఆన్ అవగాహనలో తమ వారందరికన్నా మేటిగా రాణించాడు.

ఈ ప్రతినిధి బృందం మదీనా నుండి తమ నివాసానికి తిరిగి వెళ్ళాక ఆ తెగ వారంతా ముస్లింలైపోయారు.[1]

## బనీ అసద్ బృందం

వీళ్లు పది మంది వరకూ ఉన్నారు. వారిలో వాబిస బిన్ మాబద్, ఖువైలిద్‌లు కూడా ఉన్నారు. దైవప్రవక్త (సఅసం) తన సహచరులతో మస్జిద్ లోపల కూర్చొని ఉండగా వారు వచ్చారు. "దైవప్రవక్తా! దేవుడు ఒక్కడేననీ, ఆయనకు 'సహవర్తులెవరూ లేరనీ, తమరు ఆ దేవుని దాసులు మరియు ప్రవక్తయనీ మేము సాక్ష్యమిస్తున్నాము. చూడండి దైవప్రవక్తా (స)! మా అంతట మేముగా వచ్చి ఇస్లాం స్వీకరిస్తున్నాం. మీరు మీ తరపున ఎవరినీ మా వద్దకు పంపించలేదు" అని వారిలో

1) జాదుల్ మ ఆద్-3:252, ఇబ్నెసాద్-1:329.

www.abulhasanalinadwi.org

ఒకతను చెప్పాడు. అతని ధోరణి అల్లాహ్‌కు నచ్చలేదు. అప్పుడు దివ్య ఖురాన్‌లోని ఈ వాక్యం అవతరించింది:

> "(ఓ ప్రవక్తా!) వారు ఇస్లాంను స్వీకరించి తాము మీకేదో మేలు చేసినట్లు చెబుతున్నారు. వారితో ఇలా అనండి: 'ఇస్లాంకు సంబంధించిన మేలును నా మీద మోపకండి. మీరు గనక మీ విశ్వాస ప్రకటనలో నిజాయితీ పరులైనట్లయితే అల్లాహ్‌మీకు విశ్వాసానికి సంబంధించిన మార్గం చూపి, ఆయనే మీకు ఉపకారం చేశాడు."
>
> (అల్ హుజురాత్-17)

పశుపక్ష్యాదుల ద్వారా జోస్యం చూడటం, శకునాలు చూడటం గురించి వారు ప్రశ్నించగా, అలాంటి వాటన్నింటికీ దూరంగా ఉండాలని ఆయన (స) బోధించారు.

"దైవప్రవక్తా (స)! ఇంకొక్క సందేహం తీర్చండి" అన్నారు వారు. "ఏమిటదీ!?" అని అడగ్గా, "రేఖలు గీయటం గురించి చెబుతారా?" అని సందేహపడ్డారు. దానికి ఆయన(స) పూర్వకాలంలో దైవప్రవక్త ఒకరు ఆ విద్యను నేర్పి ఉన్నారు. ఆ విద్య ప్రామాణిక ఆధారాలతో గనక మీకు అందితే అప్పుడు దాన్ని అభ్యసించవచ్చు" అని వివరించారు.[1]

## బహ్‌రా బృందం

వీళ్లు మదీనా వచ్చి హజ్రత్ మిఖ్దాద్ (రజి) ఇంటి ముందర తమ ఒంటెల్ని కూర్చోబెట్టారు. వీళ్లకోసం వంట చేయమని ఆయన తన ఇంటి ఆడవాళ్ళకు చెప్పి, వారికెదురుగా వెళ్ళారు. వారికి స్వాగతం పలికి తన ఇంటికి పిలుచుకు వచ్చారు. వారికి 'హైస్' అనే పదార్థాన్ని వడ్డించారు. ఇది అరేబియా ప్రాంతపు రుచికరమైన, స్వాదిష్టమైన వంటకం. ఖర్జూరపండ్లు, పిండి, నెయ్యి కలిపి వండుతారు. తినేవారి అభిరుచిని బట్టి కొంత కొవ్వును కూడా వేస్తారు. ఆ వంటలో కొంత భాగం దైవప్రవక్త (స)కు పంపటం జరిగింది. దైవప్రవక్త (స) కొద్దిగా తిని మిగిలిన దాన్ని

1) జాదుల్ మ ఆద్ - 3:654, ఇబ్నె సాద్ -1:292

www.abulhasanalinadwi.org

తిప్పి పంపించారు. ఆ రోజు నుంచీ హ.జత్ మిఖ్దాద్ ఆ వంటపాత్రను అతిథుల ముందు సమర్పించేవారు. అతిథులు సుష్టుగా ఆరగించేవారు. అయినాసరే అన్నం తరిగేదికాదు. ఈ విషయం వారి కాశ్చర్యం కలిగించేది. ఆ విషయమే ఒకనాడు అడిగేశారు.

"మిఖ్దాద్! మదీనా వాసులు రాగి, గోధుమలను తింటారని మేము విన్నాం. కాని మీరు మాత్రం మా అభిరుచికి తగ్గట్టుగా మేము తినే స్వాదిష్టమైన ఆహారపదార్థాన్ని ప్రతిరోజూ తినిపిస్తున్నారు. మా వాళ్లు ప్రతిరోజూ దీన్ని తినలేరు. అందులోనూ ఇంత రుచికరమైన భోజనం అసలే లభ్యంకాదు.

"అసలు విషయం చెబుతాను వినండి! ఇదంతా దైవప్రవక్త(స) వారి చలువ. ఎందుకంటే దైవప్రవక్త (సఅసం) వారి చేతివేళ్లు ఈ ఆహారపదార్థానికి తగిలాయి. అందువల్ల ఇందులో శుభం, సమృద్ధి జరిగాయి" అని మిఖ్దాద్ (రజి) చెప్పారు.

ఈ సంగతి విన్నంతనే వారి విశ్వాసం మరింతగా ఇనుమడించింది. "నిస్సందేహంగా ఆయన(స) దైవప్రవక్తే" అన్న మాటలు వారి నోట వెలువడ్డాయి. వాళ్లు కొంత కాలం మదీనాలో ఉండి ఖుర్‌ఆన్ ఆదేశాలను నేర్చుకుని తిరిగి వెళ్ళారు.[1]

## హౌలాన్ బృందం

ఈ బృందంలో పదిమంది ఉన్నారు. హి.జ్రీ 10వ సంవత్సరం వీళ్లు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చారు. "దైవప్రవక్తా (స)! మేము మా జాతివారి బడుగుజనుల తరపున ప్రతినిధులుగా వచ్చాము. మేము దైవాన్ని, దైవప్రవక్తను విశ్వసించాము. సుదీర్ఘ ప్రయాణం చేసి మీ వద్దకు వచ్చాము. దైవం మరియు దైవప్రవక్త (స) మాకు చేసిన ఉపకారం మహోన్నతం. కేవలం మిమ్మల్ని దర్శించుకునే ఉద్దేశ్యంతో వచ్చాము" అని వారు విన్నవించుకున్నారు.

"మదీనా వచ్చి నన్ను సందర్శించిన వారు ప్రళయదినాన నా పొరుగు వారుగా ఉంటారు" అని ఆయన (స) చెప్పారు.

1) జాదుల్ మ ఆద్-3: 655, 656, ఇబ్నె సాద్-1:331.

www.abulhasanalinadwi.org

"అవునూ, ఉమ్మె అనస్ సంగతులేమిటీ?" (అదొక విగ్రహం పేరు. ఆ తెగవారంతా ఆ విగ్రహాన్ని పూజించేవారు) అని దైవప్రవక్త (స) అడిగారు. "తమరి ప్రబోధనల మూలంగా మేము ఈ విగ్రహారాధనను మానుకున్నాము. కాకపోతే ఇప్పటికీ కొద్దిమంది వృద్ధులు ఈ విగ్రహ పూజను మానుకోలేకుండా ఉన్నారు. మొత్తానికి మేము అల్లాహ్‌కు కృతజ్ఞులమై ఉన్నాము" అన్నారు.

మేము తరతరాలుగా మోసానికి గురై ఉన్నాము. ఇక మీదట ఈ మోసాన్ని సాగనివ్వం. అక్కడికి వెళ్ళగానే ఆ విగ్రహాన్ని కూడా నామరూపాల్లేకుండా చేసేస్తాం అని వారు హామీ యిచ్చారు. ఆ మేరకు ఏదైనా ఒక సంఘటనను వినిపిస్తారా? అని మహాప్రవక్త(స) అడగ్గా వారిలా వివరించారు: "దైవప్రవక్తా (స)! ఒకరోజు మేము అందరం కలసి బలి జంతువులను సేకరించాం. జంతువులన్నింటినీ ఒకే రోజు ఉమ్మె అనస్ పేర బలి యిచ్చాం. ఆ మాంసాన్ని క్రూరమృగాలకోసం వదలిపెట్టేశాం. మాకు పశువుల అవసరం ఉన్నప్పటికీ బలి ఇవ్వాల్సి వచ్చింది. తినడానికి మాంసం లేకపోయినప్పటికీ ఆ ఘూంసాన్ని అడవి మృగాల కోసం, కాకులు గద్దలకోసం అర్పించుకోవలసి వచ్చింది. - అలాగే ఎవరయినా వ్యవసాయం చేస్తే పంట చేనులోనూ ఉమ్మెఅనస్ కోసం భాగం కేటాయించవలసి వచ్చేది. గట్టు ప్రక్కన ఉన్న భాగాన్ని మాత్రం దేవుని కోసం నిర్ధారించేవారు. పంటకు ఏదన్నా తెగులు వచ్చి దిగుబడి తగ్గితే అప్పుడు దేవుని భాగం ఉమ్మె అనస్‌కు ఇచ్చేవారుగాని. ఉమ్మెఅనస్ భాగం మాత్రం దేవునికి ఇచ్చేవారు కాదు".

దైవప్రవక్త (సఅసం) ఈ ప్రతినిధి మండలికి ధార్మిక విధులు నేర్పారు. కొన్ని విషయాలను గురించి వారికి గట్టిగా తాకీదు చేశారు. అవేమంటే.

1. వాగ్దానాన్ని నెరవేర్చాలి.
2. అప్పగింతలను వాటి సంబంధీకులకు అప్పగించాలి.
3. ఇరుగు పొరుగు వారితో ఉత్తమంగా మసలుకోవాలి.
4. ఎవరిపైనా దౌర్జన్యానికి దిగకూడదు. అన్యాయం, అక్రమం ప్రళయ దినాన అంధకారంగా పరిణమిస్తుంది.[1]

1) జాదుల్ మ ఆద్ - 3: 662, ఇబ్నె సాద్-1: 324.

www.abulhasanalinadwi.org

## ముఖారిబ్ ప్రతినిధి వర్గం

వీళ్లు కూడా 10 మంది వరకూ ఉన్నారు. తమ జాతివారికి ప్రాతినిధ్యం వహిస్తూ హిజ్రీ 10వ యేట మదీనా వచ్చారు. వీళ్లకు అతిథి మర్యాద చేసే బాధ్యత హజ్రత్ బిలాల్ (రజి) కు అప్పగించబడింది. ఉదయం, సాయంత్రం కూడా ఆయనే (రజి) వారికి భోజనాదులు తెచ్చేవారు. ఒకరోజు మధ్యాహ్నం (జుహ్ర్) నుంచి సాయంత్రం (అస్ర్) వేళ వరకూ దైవప్రవక్త (స) ఈ ప్రతినిధి వర్గానికి సమయం కేటాయించారు.

వారిలో ఒక వ్యక్తి మహాప్రవక్త (స)ను అదే పనిగా చూడసాగాడు. 'తమర్ని నేనెక్కడో చూసినట్లు గుర్తు' అన్నాడు.

మళ్ళీ అతనే, "అవును. తమరు కూడా నన్ను చూశారు. నాతో మాట్లాడారు. కాని నేను మీకు దురుసుగా జవాబిచ్చాను. మిమ్మల్ని తిట్టాను. అది అకాజ్ బజారులో జరిగిన సంఘటన. ఆ సమయంలో దైవప్రవక్త (స) జనులకు ఇస్లాం సందేశం ఇస్తూ తిరుగుతున్నప్పుడు జరిగిన సంఘటన ఇది......" అని చెప్పుకు పోతున్నాడా వ్యక్తి.

దానికి దైవప్రవక్త(స) "సరే ఇక ఆ సంగతిని మరచిపో" అన్నారు.

దైవప్రవక్తా(స)! ఆ రోజు నా మిత్రుల్లో అందరికన్నా ఎక్కువగా మిమ్మల్ని వ్యతిరేకించిన వాణ్ణి నేనే. ఇస్లాం పట్ల అందరి కన్నా బద్ధవిరోధిగా ఉన్నదీ నేనే. కాని నా మిత్రులంతా తమ పూర్వీకుల ధర్మంపైనే చనిపోయారు. ఈ రోజు వరకూ నన్ను బ్రతికించి, తమరి దైవదౌత్యాన్ని విశ్వసించే భాగ్యం కలుగజేసినందుకు దైవానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అన్నాడా వ్యక్తి.

"అందరి హృదయాలు దేవుని అధీనంలో ఉన్నాయి" -అన్నారు దైవప్రవక్త (స).

"దైవప్రవక్త (స)! నా పూర్వాశ్రమ స్థితిని మన్నించమని దైవాన్ని ప్రార్థించండి" అని విన్నవించుకున్నాడా వ్యక్తి.

"అవిశ్వాస స్థితిలో జరిగిన దురాగతాలన్నింటినీ ఇస్లాం నిర్మూలిస్తుంది" అని దైవప్రవక్త (స) ఓదార్చారు.[1]

1) జాదుల్ మ ఆద్-3:663, 664, ఇబ్నె సాద్ -1:299.

www.abulhasanalinadwi.org

## బనీ అబస్ బృందం

దైవప్రవక్త (సఅసం) పరమపదించక నాలుగు మాసాల ముందు ఈ బృందం నజరాన్ ప్రాంతం నుంచి వచ్చింది. వారు ఆయన్ని (సఅసం) ఉద్దేశించి, "దైవప్రవక్తా(స)! "హిజ్రత్ (వలస) చేయని వారి ఇస్లాం ఇస్లామే కాదు" అని మీరు చెప్పినట్లు ఉపన్యాసకులు అంటున్నారు. మా దగ్గర సిరిసంపదలున్నాయి. పొలాలు, పశువులున్నాయి. వాటిపై ఆధారపడి మేము బ్రతుకుతున్నాం. వలసపోనంత వరకూ ఇస్లాం ధర్మం మా యెడల శ్రేయోదాయకం కాదంటే మేము వాటన్నింటినీ వదలుకుని మీ వద్దకు వచ్చేస్తాం. మాకు మేలుచేకూర్చని అస్తిపాస్తులు మాకెందుకు?" అని విన్నవించుకున్నారు.

"అక్కరలేదు. మీరు మీ ప్రాంతంలోనే ఉండి భయభక్తుల వైఖరిని అవలంబించండి. మీ ఆచరణల్లో రవ్వంత లోటు కూడా ఏర్పడదు" అని మహాప్రవక్త (స) హామీ యిచ్చారు.[1]

## ఘామిద్ బృందం

ఈ బృందం హిజ్రీ 10వ యేట వచ్చింది. వారు 10 మంది ఉన్నారు. నగర పొలిమేరల్లో ఆగి, అక్కడ ఒక కుర్రాడిని కూర్చోబెట్టి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చారు.

"మీ సామాను వద్ద ఎవరున్నార"ని ప్రశ్నించారాయన(స).

"ఒక అబ్బాయిని కాపలాగా పెట్టి వచ్చాము."

"ఆ అబ్బాయి నిద్రపోయాడు కదా! అంతలో ఒక వ్యక్తి వచ్చి గడియారం దొంగిలించాడు."

"దైవప్రవక్తా! ఆ గడియారం నాది" అన్నాడు అందులోని ఒక వ్యక్తి.

"కంగారు పడకండి. ఆ అబ్బాయి మేల్కొని దొంగను వెంబడించాడు. అతన్ని పట్టుకుని, తస్కరించబడిన వస్తువును తిరిగి రాబట్టుకున్నాడు" అని చెప్పారు ఆయన (స).

---

1) జాదుల్ మఆద్-3:670, ఇబ్నె సాద్-1:295.

www.abulhasanalinadwi.org

ఆ సభ్యులు తమ సామానున్న చోటికి పోయి విచారిస్తే, మహాప్రవక్త(స) చెప్పిందంతా అక్షరసత్యమని తెలిసింది. మరుక్షణమే వారంతా ఇస్లాం స్వీకరించారు. దైవప్రవక్త (స) ఉబై బిన్ కాబ్ (రజి)ను వారికి గురువుగా నియమించారు. ఆయన వారికి ఖుర్ఆన్ సూరాలు కంఠస్థం చేయించారు. షరీయతు ఆదేశాలను విశదీకరించారు. వారు తమ ప్రాంతానికి తిరిగి వెళుతున్నప్పుడు ఒక కాగితంపై షరీయతు ఆజ్ఞలు లిఖించి వారికివ్వటం జరిగింది.[1]

## బనీ ఫజారా బృందం

దైవప్రవక్త (స) తబూక్ నుండి తిరిగి వచ్చే సమయానికి ఆయన(స) వద్దకు ఫజారా తెగకు చెందిన ఒక ప్రతినిధి వర్గం వచ్చింది. అందులో 15 మంది సభ్యులున్నారు. అప్పటికే వారు ఇస్లాం స్వీకరించారు. వారి వాహనాలు మరీ బలహీనంగా, బక్క చిక్కి ఉన్నాయి. "మీ ప్రాంతం వారంతా కుశలమేనా?" అని దైవప్రవక్త (స) ప్రశ్నించారు.

"దైవప్రవక్తా (స)! మా ప్రాంతంలో దుర్భిక్షం ఏర్పడింది. పశువులు చనిపోతున్నాయి. తోటలు ఎండిపోయాయి. నేల బీటలు వారింది. మా ఆలుబిడ్డలు ఆకలితో అలమటిస్తున్నారు. మా మొరలను ఆలకించమని తమరు కాస్త దైవానికి విజ్ఞప్తి చేయండి. మా తరఫున దైవానికి సిఫారసు చేయండి దేవుడు మీ తరఫున సిఫారసు చేయాలి". అని వారంతా ప్రాధేయపడ్డారు.

"ఇలాంటి విషయాలన్నింటికీ దేవుడు అతీతుడు. మీ కోసం నేను దైవసన్నిధిలో సిఫారసు చేస్తాను. కాని దేవుడు సిఫారసు చేయడమేమిటీ? ఎవరి కోసం సిఫారసు చేస్తాడు? ఆయన ఆరాధ్యదైవం. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేడు. ఆయన చాలా గొప్పవాడు. భూమ్యా కాశాలన్నింటిపై ఆయన సార్వభౌమత్వమే నడుస్తుంది" అని ఆయన (సఅసం) వారికి విడమరిచి చెప్పారు.

ఆ తరువాత ఆయన(స) వారి ప్రాంతంలో వర్షం కురిపించమని దైవాన్ని ప్రార్థించారు. ఆ ప్రార్థనా పలుకులివి:

1) జాదుల్ మ ఆద్-3:671, ఇబ్నె సాద్-1:345.

www.abulhasanalinadwi.org

"ఓ దేవా! నీ దాసుల, పశువుల దాహం తీర్చు. నీ కారుణ్యాన్ని విస్తరింపజెయ్యి. నీ మృత బస్తీలకు తిరిగి జీవం పోయి. స్వామీ! మేము నీ సన్నిధిలో దీనాతిదీనంగా మొరపెట్టుకుంటున్నాము. ఇబ్బందిని దూరం చేసే, సౌఖ్యమొసగే వర్షాన్నీ, తొందరగాపడే వర్షాన్ని, ఆలస్యం చేయని వర్షాన్ని, ప్రయోజనం కలిగించే వర్షాన్ని, నష్టం వాటిల్లని వర్షాన్ని, కష్టాలు తీర్చే వర్షాన్ని కురిపించు. దేవా! మమ్మల్ని నీ కారుణ్యంలో ముంచెత్తు. యాతనకు, ముంపుకు గురిచెయ్యకు. ప్రభూ! ఫలవంతమైన వర్షం ద్వారా మా కడగండ్లను తొలగించు. శత్రువులకు వ్యతిరేకంగా మాకు సహాయపడు."[1]

## సలామాన్ బృందం

వీళ్లు మొత్తం 17 మంది. దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి ఇస్లాం స్వీకరించారు. వారిలో హబీబ్ బిన్ అమ్ర్ అనే వాడొకడున్నాడు. "ఆచరణలన్నింటిలోకెల్లా ఉత్తమమైనదేది?" అని అతడు అడిగాడు. "వేళ కాగానే నమాజు చేయటం" అని దైవప్రవక్త (స) చెప్పారు. "మా ప్రాంతంలో వర్షాలు పడటం లేదు. తమరు దుఆ చేయండి" అని వాళ్ళంతా కోరారు.

దైవప్రవక్త (స) ప్రార్థించారు.

"దైవప్రవక్తా (స)! మీ శుభప్రదమైన చేతుల్ని ఎత్తి మరీ ప్రార్థించండి" అని హబీబ్ ప్రాధేయపడ్డాడు.

దైవప్రవక్త (స) మోముపై మందహాసం తొణికిసలాడింది. ఆయన(స) చేతులెత్తి, వారి ప్రాంతంలో వర్షం కురిపించమని దైవాన్ని ప్రార్థించారు.

ఆ బృందం తమ ప్రదేశానికి తిరుగు ప్రయాణమయింది. తీరా వారక్కడికి చేరుకున్నాక తెలిసింది. దైవప్రవక్త (స) ప్రార్థించిననాడే అక్కడ వర్షం పుష్కలంగా పడిందని![2]

---

1) జాదుల్ మఆద్-3:653, 654, ఇబ్నె సాద్-1:297.

2) రహ్మతుల్ లిల్ ఆలమీన్-1:183 (జాదుల్ మ ఆద్ సౌజన్యతో)

www.abulhasanalinadwi.org

# నజరాన్ బృందం[1]

నజరాన్ బృందానికి సంబంధించిన సంఘటన రెండు మూడు హదీసులలో కూడా వచ్చింది. వాటి ప్రకారం నజరాన్ ప్రాంతానికి చెందిన క్రైస్తవ ప్రతినిధులు రెండుసార్లు దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి చర్చలు జరిపారు. ఆ క్రమంలోనే ఈ సంఘటన పొందుపరచబడింది.

అబూ అబ్దుల్లా హకీమ్ ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) నజరాన్ వాసులకు ఇస్లాం సందేశం ఇస్తూ లేఖ వ్రాశారు. నజరాన్ మతాధిపతి అయిన ఉస్ఖఫ్ ఆ ఉత్తరాన్ని చదివినప్పుడు అతని ఒల్లు జలదరించింది. కాళ్ల క్రింద నేల కదలినట్లనిపించింది. వెంటనే అతను సర్ హుబైల్ బిన్ విదాయాను పిలిపించాడు. ఇతను హమదాన్ తెగకు చెందిన వ్యక్తి. పాలకుడైనా, క్రైస్తవ మతాధిపతి అయినా ఇతన్ని సంప్రదించనంత వరకూ ముఖ్యమైన పని ఏదీ చేసేవారు కారు.

ఉస్ఖఫ్ ఇచ్చిన ఉత్తరాన్ని అతను పూర్తిగా చదివాడు. "ఏమంటావ్?" అన్నట్టు చూశాడు ఉస్ఖఫ్.

"అయ్యా! ఇస్మాయీల్ (అలై) సంతతిలో కూడా దైవ ప్రవక్త ప్రభవిస్తాడని దేవుడు ఇబ్రాహీం (అలై)కి వాగ్దానం చేసి ఉన్నాడు. ఈ సంగతి మీక్కూడా తెలిసిందే. బహుశా ఈ ప్రవక్త ఆ ప్రవక్తేనేమో! కాని దైవప్రవక్త విషయమై నేనేం చెప్పగలను? ప్రాపంచిక వ్యవహారం ఏదన్నా ఉంటే నేను తప్పకుండా నా అభిప్రాయం తెలిపేవాణ్ణి" అన్నాడు సర్ హుబైల్.

"సరే నువ్వు కూర్చో" అన్నాడు ఉస్ఖఫ్.

మరో వ్యక్తిని పిలిపించి అతని సలహా కోరాడు ఉస్ఖఫ్. అతను కూడా మొదటి వ్యక్తి లాగానే స్పందించాడు. మూడోవ్యక్తి (జబ్బార్ బిన్ ఖైస్)ను పిలిపించాడు. ఇతను బనూ హారిస్ బిన్ కాబ్ వంశస్థుడు. అతను కూడా ఉత్తరం చదివి మొదటి ఇద్దరు వ్యక్తులు వ్యక్తపరచిన అభిప్రాయాన్నే వెలిబుచ్చాడు.

---

1) ఈ వృత్తాంతమంతా జాదుల్ మ ఆద్‌లో, దలాయలున్న బువ్వలో ఉంది.

www.abulhasanalinadwi.org

తన సమస్యకు సమాధానం దొరక్కపోవటంతో ఉస్ఖఫ్ ఆందోళన చెందాడు. గంటలు మ్రోగించి, చర్చీ గోడలకు తెరలు వ్రేలాడదీయమని ఆదేశించాడు. ఏదైనా గడ్డు పరిస్థితి ఎదురైనప్పుడు పగటి పూట ఈ విధంగా ప్రకటన గావించటం అక్కడి ఆచారం. రాత్రివేళ అయితే పర్వతంపై మంటలు వేస్తారు. ఆ చర్చీ క్రింద 73 గ్రామాలున్నాయి. ఆ గ్రామాల్లో లక్షమంది పోరాట పటిమగల పురుషులుండేవారు. ఆ ప్రాంతంలో నివసించే ప్రజలంతా క్రైస్తవులే. అందరూ సమీకరించబడిన తరువాత వారి నాయకుడు దైవప్రవక్త (స) లేఖను చదివి వినిపించాడు. వారి సలహా కోరాడు. తర్జన భర్జనల అనంతరం ముగ్గురు వ్యక్తులతో కూడిన ఒక బృందాన్ని మహాప్రవక్త (సఅసం) వద్దకు పంపాలని తీర్మానించటం జరిగింది. ఆ బృందం సభ్యులుగా సర్హుబైల్, అబ్దుల్లాహ్, జబ్బార్‌లు నియమించబడ్డారు.

ఈ ముగ్గురు సభ్యులూ మదీనాకు చేరుకుని కొన్నాళ్ళపాటు దైవప్రవక్త (స) దగ్గర ఉన్నారు. దైవప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు అలైహిస్సలాం) వ్యక్తిత్వం గురించి కూడా వారు ప్రశ్నలు వేశారు. వారి ప్రశ్నల నేపథ్యంలో ఈ ఆయతులు అవతరించాయి.

> "ఈసా పుట్టుక ఆదం పుట్టుక వంటిదే. అల్లాహ్ ఆదంను మట్టితో చేసి "అయిపో" అని ఆజ్ఞాపించాడు. అతను అయ్యాడు. అసలు వాస్తవం ఇది. ఇది మీ ప్రభువు తరపు నుండి మీకు తెలుపబడుతోంది. దాన్ని శంకించే వారిలో నీవు చేరిపోకు. ఈ జ్ఞానం వచ్చిన తరువాత ఇక నీతో ఎవరయినా ఈ విషయంలో వివాదానికి దిగితే, ప్రవక్తా! వారితో ఇలా అను. "రండి! మీరూ, మేమూ స్వయంగానూ వద్దాము. మన ఆలుబిడ్డలను కూడా పిలుచుకువద్దాము. 'అసత్యం పలికేవారిపై అల్లాహ్ శాపం పడుగాక!' అని ప్రార్థిద్దాము..." (అలి ఇమ్రాన్ :59-61)

ఈ ఆయతులు అవతరించిన తరువాత దైవప్రవక్త (స) ప్రమాణం (ముబాహిలా) చేసే నిమిత్తం తన మనుమలైన హసన్ హుసైన్‌లను పిలిపించారు. ఆయన ప్రియపుత్రిక అయిన హజ్రత్ ఫాతిమా (ర. అన్హా) కూడా ఆయన(స) వెనుకవచ్చి నిలబడ్డారు.

www.abulhasanalinadwi.org

అప్పుడు ఈ క్రైస్తవ నాయకులు పరస్పరం సంప్రతించుకున్నారు. "ఈయన గురించి మేము ఖచ్చితంగా ఒక అభిప్రాయానికి రావటం కష్టం. ఎందుకంటే మా లోయలోని జనులంతా కలసి మమ్మల్ని పంపించారు. ఒకవేళ ఈయన ఒక రాజే అనుకుందాం. అయినాసరే మనం ఈయన ముందు ప్రమాణం చేయటం సమంజసం కాదు. ఒకవేళ మేమలా చేస్తే యావత్తు అరబ్బుల దృష్టిలోకి వచ్చేస్తాం. ఒకవేళ ఈయన నిజంగా ప్రవక్త అయివుంటే, ఈ ప్రమాణం తరువాత మనం ఈ భూభాగంలో నామరూపాల్లేకుండా పోతాం. కాబట్టి మనం ఈయనకు లోబడి ఉండటానికి ఒప్పుకోవటమే మేలని నా అభిప్రాయం. జిజ్‌యా మొత్తాన్ని నిర్ధారించే అధికారం ఆయనకే వదలిపెడదాం. నాకు తెలిసినంత వరకూ ఈయన కఠిన మనస్కుడు కాదు" అని సర్ హుబైల్ చెప్పాడు. మిగిలిన ఇద్దరు కూడా అతని వాదనతో ఏకీభవించారు. అనంతరం ఆ ముగ్గురూ వచ్చి, "ఇప్పుడు మనం 'ముబాహిలా' చేసుకోవటం కన్నా, మా విషయంలో సముచితమైన నిర్ణయం గైకొనే అధికారం మీకు వొసగటమే శ్రేయస్కరం. రేపుదయం దాకా మీరే ఏదో ఒక నిర్ణయానికి రండి" అని చెప్పారు.

మరునాడు దైవప్రవక్త (స) వాళ్ళపై 'జిజ్‌యా' ను విధించారు. ఒప్పంద పత్రాన్ని లిఖించటం జరిగింది. ఆ ఒప్పందాన్ని ముగీరా (రజి) లిఖించగా అబూసుఫ్యాన్ బిన్ హరబ్, గీలాన్ బిన్ అమ్ర్, మాలిక్ బిన్ ఔఫ్, ఉఖ్ర బిన్ హాబిస్ సహచరులు దానికి సాక్షులుగా ఉన్నారు. ఆ లిఖితపూర్వక పత్రం వారికివ్వబడింది. మొత్తమ్మీద మహాప్రవక్త(స) ఆ పత్రంలో క్రైస్తవుల యెడల సడలింపుల వైఖరిని అవలంబించారు. సాధ్యమైనన్ని రాయితీలు కల్పించారు.

ఉత్తర్వును తీసుకుని ముగ్గురూ నజరాన్‌కు సాగిపోయారు. మతాధిపతి (ఉస్ఖఫ్) తదితర ప్రముఖులు ఉత్సుకతతో ముందుకు వచ్చి వారిని కలుసుకున్నారు. ప్రతినిధి బృందం ఆ పత్రాన్ని ఉస్ఖఫ్‌కు అందజేసింది. నడుస్తూనే అతను ఆ ఒప్పంద పత్రాన్ని చదువుకున్నాడు. అతని పినతండ్రి కుమారుడైన అబూ అల్ఖమ కడు ఆసక్తితో అందలి సారాంశాన్ని గ్రహించి, ఆలోచనా సముద్రంలో మునిగిపోయాడు. అంతలోనే అతని ఒంటె అతన్ని క్రిందపడేసింది. క్రిందపడగానే, "మాకీ

www.abulhasanalinadwi.org

దురవస్థను కల్పించిన వాడు పాడైపోను!" అని అన్నాడు.

దైవప్రవక్త (సఅసం) నుద్దేశించి అతనిలా అన్నాడు.

"నువ్వేమంటున్నావో తెలుసా! దైవసాక్షి! అయన ఒక దైవప్రవక్త సుమా!" అన్నాడు ఉస్లఫ్.

"అలాగా! అయితే నేను తిన్నగా అక్కడికే వెళతాను" అంటూ మదీనావైపుకు పయనమయ్యాడు.

ఉస్లఫ్ వెనుకనుంచి కేకలు వేస్తున్నాడు. అల్ఖమా! నా మాట పూర్తిగా విను. అసలు నేను ఎం చెప్పదలిచానో నీకు తెలుసా?! మనం అలవోకగా లొంగిపోయామని మా తెగవారు ఎక్కడ ఆడిపోసుకుంటారోనని శంకించి నేను అలా అన్నాను. నిజానికి మనం ఇప్పటికీ ఆయన ఉదార వైఖరి ముందు లొంగిపోలేదు. మాలో పోరాడేవారు చాలామంది ఉన్నారు. మా శక్తి అన్యుల కన్నా చాలా గొప్పది. నువ్వు తిరిగి రా! అని బిగ్గరగా అరుస్తున్నాడు.

అల్ఖమా మరేమీ వినదలచుకోలేదు. దైవసాక్షి! ఇక నన్ను ఎవరూ అడ్డుకోలేరు. నీ మాటల్లో చిత్తశుద్ధి లేదు అంటూ మదీనా వైపుకు దూసుకుపోయారు.

అల్ఖమ దైవప్రవక్త (స)ను చేరుకున్నారు. అక్కడే నివసించసాగారు. కడకు ఈయన అమరగతి నొందారు. ఇక నజరాన్ లోయలో వచ్చిన పరిణామాలేమిటో చూడండి. మదీనాలో జరిగినదంతా అక్కడి ఒక క్రైస్తవ సన్యాసికి తెలిసింది. అతనిలో అనిర్వచనీయమైన పరివర్తన వచ్చింది. ఆ సన్యాసి అనేక సంవత్సరాలుగా చర్చ్ బురుజుపైనే ఉండేవాడు. ఉన్నట్టుండి అతను జనులనుద్దేశించి ప్రకటించసాగాడు- "నన్ను క్రిందికి దించితేసరి. లేదంటే ఇక్కడి నుంచి దూకేస్తాను. నా ప్రాణం పోయినా లెక్కచేయను" అని అరుస్తున్నాడు. ఆఖరికి ఈ మతాచార్యుడు కూడా కొన్ని కానుకలు తీసుకుని దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చాడు. ఒక పాత్రను, ఒక కర్రను, దుప్పటిని కానుకగా సమర్పించుకున్నాడు. ఈ దుప్పటి అబ్బాసీ ఖలీఫాల హయాం వరకూ సురక్షితంగా ఉంది. మదీనాలోనే కొంతకాలం ఉండి ఇస్లాం ప్రబోధనలను అభ్యసించాడు ఆ క్రైస్తవ మతాచార్యుడు. కడకు దైవప్రవక్త (స) అనుమతి తీసుకుని, మరోసారి వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

కొన్నాళ్ల తర్వాత రెండవ బృందం వచ్చింది. ఈ బృందంలో ఉస్ఖఫ్ అబుల్ హారిస్ (ఇతను చర్చీ అధిపతి. కానిస్టాంటినోపుల్ చక్రవర్తులు ఇతన్ని ఎంతగానో ఆదరించేవారు. సాధారణ ప్రజలు ఇతన్ని అసాధారణమైన వ్యక్తిగా తలపోయుటవేగాక, ఇతని వద్ద దివ్యశక్తులున్నాయని నమ్మేవారు. క్రైస్తవ జగతిలోని వైతాళికులలో ఒకడుగా ఈయన పరిగణించబడేవాడు) కూడా ఉండటం విశేషం! ఈయన దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చాడు. ఇతని వెంట ఏహమ్ అనే క్రైస్తవ న్యాయమూర్తి, స్థానిక పరిపాలకుడు కూడా ఉన్నాడు. అక్కడి వారంతా అతన్ని 'సయ్యిద్' అని పిలిచేవారు. ఆఖిబ్ బిరుదాంకితుడైన అబ్దుల్ మసీహ్ కూడా వచ్చాడు. అతను నజరాన్ ప్రాంతానికి గవర్నరు. మరో 24 మంది సర్దారులు వచ్చారు. ఈ ప్రతినిధి మండలిలో మొత్తం 60 మంది సభ్యులున్నారు. ఈ పయనబృందం అస్ర్ నమాజువేళ మస్జిదె నబవీ వద్దకు చేరింది. అది బహుశా ఆదివారం. ప్రార్థనా సమయం. దైవప్రవక్త (స) వారికి తమ మస్జిదులో ప్రార్థన చేసుకోవడానికి అనుమతి ఇచ్చారు. వారు తూర్పు దిక్కుకు తిరిగి ప్రార్థన చేసుకున్నారు. కొంతమంది స్థానికులు ప్రార్థన చేయకుండా ఆపాలని చూశారు. అయితే మహాప్రవక్త (స) వాళ్లను వారించారు.

ఈ క్రైస్తవ వర్గాన్ని చూడటానికి యూదులు కూడా వచ్చేవారు. ఒక్కోసారి ఏదైనా ఒక విషయంపై క్రైస్తవులతో సంభాషించే వారు కూడా. ఒకసారి యూదులు కొందరు దైవప్రవక్త (సఅసం) ముందు హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) ప్రస్తావన తెచ్చి, "ఆయన యూదుడు" అని అన్నారు. "కాదు, ఆయన క్రైస్తవుడు" అని క్రైస్తవులన్నారు. ఈ సందర్భంగా దివ్య ఖుర్ఆన్‌లోని ఈ ఆయతులు అవతరించాయి.

> "గ్రంథ ప్రజలారా! ఇబ్రాహీము ధర్మం గురించి మీరు ఎందుకు తగాదా పడుతున్నారు? తౌరాతు, ఇంజీలు గ్రంథాలు ఇబ్రాహీము తరువాతేగా అవతరించాయి? మీరు ఈ స్వల్ప విషయాన్ని కూడా అర్థం చేసుకోలేరా? మీకు తెలిసిన విషయాలను గురించి మీరు బాగా వాదించారు. కాని మీకు తెలియని విషయాలను గురించి కూడా మీరిప్పుడు ఎందుకు వాదిస్తున్నారు? అల్లాహ్‌కు తెలుసు

www.abulhasanalinadwi.org

కాని మీకు తెలియదు. ఇబ్రాహీము యూదుడూ కాదు, క్రైస్తవుడూ కాదు, అతను అచంచలమైన విశ్వాసం గల ముస్లిము. అతను ఎంత మాత్రం ముష్రిక్కులలోని వాడు కాదు. ఇబ్రాహీముతో సంబంధం కలిగి ఉండే హక్కు ఎవరికయినా ఉందీ అంటే, అది అతన్ని అనుసరించే ప్రజలకు మాత్రమే. ఇప్పుడు ఈ ప్రవక్త, ఇతన్ని విశ్వసించేవారు ఆ సంబంధానికి అందరికంటే ఎక్కువగా అర్హులు. కేవలం విశ్వసించిన వారికే అల్లాహ్ అండదండలు లభిస్తాయి."

(ఆలి ఇమ్రాన్ 65-68)

ఒకసారి కొంతమంది యూదులు (ముస్లింలను, క్రైస్తవులను ఇరకాటంలో పెట్టే ఉద్దేశ్యంతో), "ముహమ్మద్ (స)గారూ! క్రైస్తవులు ఏసుక్రీస్తును పూజించినట్లుగానే మేము కూడా తమరిని పూజించాలని తమరు కోరుకుంటున్నారా?" అని ప్రశ్నించారు.

నజరాన్‌కు చెందిన క్రైస్తవుడు వెంటనే స్పందిస్తూ,

"అవునా ముహమ్మద్ (స)గారూ! ఒకవేళ అదే మీ ఉద్దేశ్యమై ఉంటే మీరు బాహాటంగా చెప్పండి. ఏ మాత్రం మొహమాట పడకండి" అని అన్నాడు.

"అల్లాహ్ తప్ప మరొకరిని ఆరాధించే విషయం నుండి నేను అల్లాహ్ శరణువేడుతున్నాను. నేను ఎన్నటికీ అలా అనను. అల్లాహ్ నన్ను పంపించనది దైవేతరుల దాస్యం నుండి ప్రజలకు విముక్తి కల్పించడానికే గాని, దైవేతరుల దాస్యం చెయ్యండి అని చెప్పడానికి కాదు" అని మహాప్రవక్త (స) నిర్ద్వంద్వంగా చెప్పేశారు.

ఈ నేపథ్యంలో క్రిందివచనాలు అవతరించాయి.

"ఏ వ్యక్తి కయినా అల్లాహ్ గ్రంథాన్నీ, వివేకాన్నీ, ప్రవక్త పదవిని ప్రసాదించగా, అతడు ప్రజలతో, "మీరు అల్లాహ్‌కు బదులుగా నాకు దాసులు కండి" అని అనటం తగదు. అతడు ఇదే అంటాడు: "మీరు ఇతరులకు

www.abulhasanalinadwi.org

బోధించేటటువంటి, స్వయంగా చదివేటటువంటి గ్రంథంలోని ఉపదేశాలు కోరే విధంగా నిజమైన 'రబ్బానీలు' అవండి". దైవదూతలనో లేక ప్రవక్తలనో ప్రభువులుగా చేసుకోండి అని అతను మీతో ఎన్నటికీ అనడు. ముస్లిములైన మీకు ఒక ప్రవక్త, అవిశ్వాసాన్ని అవలంబించండి అని ఆదేశించటం సాధ్యమా?

(అలి ఇమ్రాన్: 79-80)

ముహమ్మద్ బిన్ సుహైల్ కథనం ప్రకారం అలి ఇమ్రాన్ సూరాలోని మొదటి 80 ఆయతులు ఈ బృందం వచ్చి ఉన్నప్పుడే అవతరించాయి. వీళ్లు తమ ప్రాంతానికి తిరిగి వెళ్ళే ముందు మరోసారి దైవప్రవక్త (స) వద్దకు వచ్చి మరో హామీ పత్రం పొందారు. చర్చీలకు, క్రైస్తవ మతాధికారులకు సంబంధించి ఆ పత్రంలో మరిన్ని మార్గదర్శక సూత్రాలున్నాయి.[1]

ఒక విశ్వసనీయుడైన, నిజాయితీపరుడైన వ్యక్తికి తమ వెంట పంపిస్తే తాము అతనికి జిజ్‌యాను చెల్లిస్తామని కూడా వాళ్లు చెప్పారు. దైవప్రవక్త (స) హజ్రత్ అబూ ఉబైదా బిన్ జరాహ్‌ను వారి వెంట పంపిస్తూ, ఈ వ్యక్తి నా అనుచర సమాజపు విశ్వసనీయుడు అని అన్నారు.[2]

హజ్రత్ అబూ ఉబైదా (రజి) గారి సహచర్యం అక్కడి ప్రజలకు కారుణ్యప్రదంగా పరిణమించింది. ఆయన మంచితనాన్ని, నిజాయితీని చూసి జనులు ఇస్లాం స్వీకరించసాగారు. ఆ విధంగా నజరాన్ లోయలో ఇస్లాం వ్యాపించింది.

## నఖా బృందం

ఈ బృందం హిజ్రీ శకం 11వ యేట ముహర్రం నెలలో వచ్చింది. ఇది మదీనాకు వచ్చిన చివరి ప్రతినిధి బృందం. దీని తరువాత మరో ప్రతినిధి వర్గమేదీ దూరప్రాంతాల నుంచి రాలేదు. వీళ్లు సుమారు 200

1) జాదుల్ మ ఆద్ -3:629-637. దలాయలున్న బువ్వ-5:382-393. ఇబ్నె హిషామ్-1: 573-584. ఇబ్నె సాద్-1:357. సహీహ్ బుఖారీ: కితాబుల్ మగాజీ.

2) సహీహ్ బుఖారీ: కితాబుల్ మనాఖిబ్

www.abulhasanalinadwi.org

మంది వరకూ ఉంటారు. వీళ్ళంతా హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) చేతుల మీదుగా ఇస్లాం స్వీకరించి వచ్చినవారు. వారందరికీ దారుజ్జియాఫ (అతిథి నిలయం)లో వసతి కల్పించబడింది.

వారిలో ఒక వ్యక్తి పేరు జురారా బిన్ అమ్ర్. అతను దైవ ప్రవక్తనుద్దేశించి, "నేను దారిలో చిత్ర విచిత్రమైన కలలుగన్నాను" అన్నాడు.

"ఏమిటా కలలు?" అడిగారు దైవప్రవక్త (సఅసం)

"కలలో ఒక మేక ఈనింది. ఆ మేకపిల్లపై తెల్లని, నల్లని చారలున్నాయి"

"మీ ఆవిడ గర్భవతిగా ఉందా?" అని ఆయన (స) అడిగారు.

"అవును" అన్నాడతను.

"ఆమె నీ కొడుకును ప్రసవించింది.

"మరి ఈ తెల్లని, నల్లని చారలేమిటి?" అని అతను ప్రశ్నించాడు.

"దగ్గరకు రా" అంటూ దైవప్రవక్త (స) అతన్ని తన దగ్గరకు పిలిచి "నీ శరీరంపై తెల్లమచ్చలున్నాయా? వాటిని ఎవరికీ కనబడకుండా దాచిపెట్టావా?" అని అడిగారు ఎవరికీ వినిపించకుండా.

"మిమ్మల్ని దైవప్రవక్తగా నియుక్తం చేసిన ఆ శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నాను. ఈ రహస్యాన్ని నేనింతవరకెవరికీ తెలుపలేదు" అన్నాడు జురారా.

"పిల్లవాడిపై ఉన్న ఆ మచ్చల ప్రభావం అదే" అన్నారు దైవప్రవక్త (సఅసం).

జురారా తన రెండవ కలను గురించి చెబుతూ, "నేను నూమాన్ బిన్ ముంజిర్‌ను కలలో చూశాను ఆయన ఖరీదైన దుస్తులు ధరించి ఉన్నారు" అని చెప్పాడు.

దైవప్రవక్త (స) ఈ కలలోని మర్మాన్ని వివరిస్తూ అది సిరిసంపదలతో తులతూగే అరబ్బు దేశమని చెప్పారు.

www.abulhasanalinadwi.org

"ఒక వృద్ధ మహిళ నేలలో నుంచి పైకి వస్తోంది. ఆమె శిరోజాలు సగం తెల్లగానూ, సగం నల్లగానూ ఉన్నాయి" అని జురారా చెప్పారు.

"అది మిగిలి ఉన్న ప్రపంచం" అని మహాప్రవక్త (స) బోధపరచారు.

"నేను చూసిన ఇంకొక కలలో భూమి లోపలి నుంచి అగ్ని పుట్టుకు వచ్చింది. అది నాకూ-నా కుమారుడైన అమ్రీకు మధ్య దాకా వచ్చేసింది. కాలండి కాలండి.కళ్ళున్నవారూ, కళ్ళులేని వారూ అందరూ అనుభవించండి. మీ ఆహారాన్ని, మీ వంశాన్ని, మీ ఐశ్వర్యాన్నీ నాకివ్వండి. నేను హరిస్తాను అని అన సాగింది." అని జురారా చెప్పగా,

"అదొక ఉపద్రవం. చివరి కాలంలో అది పొడసూపుతుంది" అని దైవప్రవక్త (స) వివరించారు.

"ఏమిటా ఉపద్రవం?" అని జురారా సందేహపడగా

"జనులు తమ నాయకుణ్ణే చంపేస్తారు. వారిమధ్య చీలిక వస్తుంది. ఒండొకరిపై విరుచుకు పడతారు. దుర్మార్గుడు ఆనాడు తానెంతో సజ్జనుడినని తలపోస్తాడు. విశ్వాసి రక్తం మంచి నీరుకన్నా ఎక్కువ తృప్తి నిచ్చేదిగా భావించబడుతుంది. నీ కొడుకు గనక చచ్చిపోతే నువ్వు ఈ ఉపద్రవాన్ని చవిచూస్తావు. నువ్వు గనక చచ్చిపోతే నీ కొడుకు దీన్ని చవిచూస్తాడు" అని ఆయన (సఅసం) విడమరచి చెప్పారు.

"దైవప్రవక్తా (స)! ఆ దురవస్థను చూచే స్థితి నాకు రాకూడదని ప్రార్థించండి" అన్నాడు జురారా.

"దేవా! ఈ ఉపద్రవం నుంచి ఇతన్ని కాపాడు" అని దైవప్రవక్త (స) ప్రార్థించారు.

జురారా చనిపోయారు. ఆయన కుమారుడు మాత్రం మిగిలాడు. అతడు హజ్రత్ ఉస్మాన్ (రజి) చేతిపై చేసిన ప్రమాణాన్ని భంగపరిచాడు.[1]

1) జాదుల్ మఆద్-3 : 686, 687, ఇబ్నెసాద్ 1 : 346

www.abulhasanalinadwi.org

# అంతిమ హజ్

అల్లాహ్ సహాయం వచ్చినప్పుడు, విజయ భాగ్యం లభించినప్పుడు, ప్రజలు తండోపతండాలుగా అల్లాహ్ ధర్మంలో ప్రవేశించటాన్ని నీవు చూసినప్పుడు (ఓ ప్రవక్తా!) నీవు ప్రభువు స్తోత్రంతోపాటు ఆయన పవిత్ర నామాన్ని స్మరించు. ఇంకా మన్నింపుకై ఆయన్ని వేడుకో. నిస్సందేహంగా ఆయన పశ్చాత్తాపాన్ని ఎంతగానో అంగీకరించేవాడు."

(అన్ నస్ర్: 1-3)

దైవ సహాయం అందినప్పుడు, విజయం వరించినప్పుడు దైవానికి కృతజ్ఞతలు తెలుపుకోవటం సమంజసం. కాని ఇక్కడ కృతజ్ఞతల ప్రస్తావన రాలేదు. దైవస్తోత్రం చేయమనీ, క్షమాపణ కోసం వేడుకోమనీ ఉపదేశించబడింది. ఏమిటీ, ఈ ఉపదేశంలోని మర్మం?

ఈ విషయంపై ప్రవక్త ప్రియ సహచరుల మధ్య ఒకసారి తర్జన భర్జన జరిగింది. ఈ పలుకుల్లోని పరమార్థం ఏమిటి? అని హజ్రత్ ఉమర్ (రజి) అడిగారు. ఒక్కొక్కరు ఒక్కో విధంగా తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఆఖరికి అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) వైపు చూశారు హజ్రత్ ఉమర్ (రజి). ఈయన పిన్న వయస్కులు. అందుకే పెద్దల ముందు సమాధానం చెప్పడానికి మొహమాట పడ్డారు. ఎట్టకేలకు హజ్రత్ ఉమర్ (రజి) ప్రోద్బలంపై ఇలా అన్నారు: "ఇది దైవప్రవక్త (సఅసం) వారి మరణ కాలం సమీపించిందనటానికి సూచన. మరణానికి ముందు దైవ సన్నిధిలో మన్నింపుకై వేడుకోవటం అవసరం అన్నది ఈ పలుకుల్లోని ఆంతర్యం."[1]

---

1) సహీహ్ బుఖారీ : కితాబుత్తఫ్సీర్

www.abulhasanalinadwi.org

ఈ సూరా అవతరించినప్పుడే, తాను మహాప్రస్థానం చేయవలసిన సమయం సమీపిస్తోందని ఆయన(స)కు అర్థమై పోయింది. కాబట్టి లోకానికి షరీయతు సూత్రాలను చాటి చెప్పవలసిన, నైతిక నియమాలను విస్తృత స్థాయిలో అందరికీ సుస్పష్టం చేయవలసిన తరుణం ఆసన్నమైంది. హిజ్రత్ చేసినప్పటి నుంచి ఇప్పటి దాకా దైవప్రవక్త (స)కు హజ్ ధర్మాన్ని నిర్వర్తించే వీలు చిక్కలేదు.[1]

ఒక సుదీర్ఘ కాలం ఖురైషులను ప్రతిఘటించడానికే సరిపోయింది. హుదైబియా ఒప్పందం తరువాత హజ్ చేసే అవకాశం ఉన్నప్పటికీ సందేశ ప్రధానమైన కార్యక్రమాలలో తలమునకలై ఉండటం వల్ల హజ్ కోసం బయలు దేరలేకపోయారు.

మొత్తానికి జీఖఅద నెలలో దైవప్రవక్త (స) హజ్ సంకల్పం చేసుకున్నట్టు ప్రకటన వెలువడింది. ఈ వార్త నలువైపులా వ్యాపించింది. దైవప్రవక్త (స)తో కలసి హజ్ చేయాలన్న కాంక్ష అందరిలో బలపడింది.[2] జీఖ అద నెల 26వ తేదీ శనివారం నాడు ఆయన(స) స్నానం చేసి ఒక దుప్పటిని నడుముకు కట్టుకున్నారు. మరో దుప్పటిని కప్పుకున్నారు. జుహ్రా నమాజు అనంతరం మదీనా నుండి వెడలారు.[3] తన సతీమణులందరూ హజ్‌కు రావాలని ఆదేశించారు.[4] మదీనాకు 6 మైళ్ల దూరంలో 'జుల్ హులీఫా' అనే స్థలం ఒకటుంది. అది మదీనా వాసుల [5] 'మీఖాత్'. అక్కడకు చేరుకుని రాత్రిపూట అక్కడే విడిది చేశారు. మరునాడు మళ్లీ స్నానం చేసి, రెండు రకాతుల నమాజు చేశారు. ఆ తరువాత 'ఖస్వా' అనే తన వాహనంపై కూర్చొని 'ఇహ్రామ్' దీక్షబూనారు. అప్పుడే బిగ్గరగా ఇలా ఆలాపించారు.

లబ్బై కల్లాహుమ్మ లబ్బైక్. లబ్బైక్ లా షరీక లక లబ్బైక్. ఇన్నల్ హమ్ద వన్నిమత లక వల్ ముల్క్ లా షరీకలక్.

(హాజరయ్యాము దేవా! మేము హాజరయ్యాము. మేము నీ సన్నిధానంలో హాజరయ్యాము. సహవర్తులెవరూ లేని స్వామీ మేము

---

1) సహీహ్ బుఖారీ : హజ్జతుల్ విదా అధ్యాయం
2) సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్ - బాబు హజ్జతున్నబీ (స)
3) జాదుల్ మఆద్ - 2 : 102
4) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ
5) సహీహ్ బుఖారీ : కితాబుల్ హజ్

www.abulhasanalinadwi.org

హాజరయ్యాము. ప్రశంసలు నీకే శోభిస్తాయి. అనుగ్రహాలన్నీ నీవు వొసగినవే. సార్వభౌమత్వం కూడా నీదే. ఇందులో నీకు భాగస్వాము లెవరూ లేరు.)

ఈ హదీసును ఉల్లేఖించిన హజ్రత్ జాబిర్ (రజి) ఇలా అంటున్నారు: నేను అటూ యిటూ దృష్టి సారించాను. ముందు వెనుకా కుడి వైపునా, ఎడమవైపునా జనారణ్యం కనిపిస్తోంది. దైవప్రవక్త (స), "లబైబక్....." పలికినప్పుడల్లా నలువైపులా అందరి అధరాలు అదే స్తుతి గీతికను ఆలాపించేవి. దాంతో పరిసరాలు మిన్నంటేవి. చుట్టు ప్రక్కల వున్న పర్వతాల్లో ఆ ధ్వని ప్రతిధ్వనించేది.[1]

మక్కా విజయం సందర్భంగా దైవప్రవక్త (స) నమాజు చేసిన చోటల్లా జనులు శుభ స్థలంగా భావించి మస్జిదులు నిర్మించుకున్నారు. అలాంటి మస్జిదులు దారిలో ఎక్కడ కనిపించినా, దైవప్రవక్త (స) అక్కడ కాస్సేపు ఆగి నమాజు చేసి ముందుకు సాగేవారు. అయితే ఆఖరి మజిలీకి చేరిన తరువాతే స్నానం చేశారు. మరునాడు (ఆదివారం జిల్ హజ్జ్ 4వ తేదీ ఉదయం పూట) పవిత్ర మక్కాలో ప్రవేశించారు. మదీనా నుండి బయలుదేరి మక్కాకు చేరుకోవడానికి తొమ్మిది రోజులు పట్టింది.[2] హాషిమ్ వంశస్థులకు ఈ సంగతి తెలియగానే వారి పిల్లలు సంతోషాతి శయంతో పరుగులు తీస్తూ వచ్చారు. ప్రేమానురాగాలు పొంగి పొరలగా ఆయన (స) కొంతమంది పిల్లలను ఒంటెపై తనకు ముందు వెనుకా కూర్చోబెట్టుకున్నారు.[3] 'కాబా'పై దృష్టి పడగానే "దేవా! ఈ గృహానికి మరిన్ని గౌరవోన్నతుల్ని ప్రసాదించు" అని ప్రార్థించారు.[4] అనంతరం కాబా గృహ ప్రదక్షిణ చేశారు. ప్రదక్షిణ పూర్తి కాగానే 'మఖామె ఇబ్రాహీం' వద్దకు వెళ్ళి రెండు రకతుల నమాజు చేశారు. ఈ సందర్భంగా ఆయన(స) వత్త ఖిజూ మిమ్మఖామి ఇబ్రాహీమ ముసల్లా (మఖామె ఇబ్రాహీమును సాష్టాంగ స్థలంగా చేసుకోండి) అనే ఆయతును పఠించారు.

---

1) సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్
2) సీరతున్నబీ - 2 : 252
3) సుననె నసాయి : కితాబుల్ మనాసిక్
4) సుననె బైహఖీ - 5:73.

www.abulhasanalinadwi.org

సఫా కొండ వద్దకు చేరుకోగానే ఇన్నస్సఫా వల్ మర్వత మిన్ ష ఆయిరిల్లాహ్ (నిస్సందేహంగా సఫా-మర్వా పర్వతాలు అల్లాహ్ చిహ్నాలలోనివి) అనే వచనాన్ని పఠించారు. అక్కడి నుంచి కాబా గృహాన్ని చూస్తూ ఉన్నప్పుడు ఆయన నోట వెలువడిన పలుకులివి:

"అల్లాహ్ తప్ప వేరొక దేవుడు లేడు. ఆయనకు భాగస్వాము లెవరూ లేరు. రాజ్యాధికారం ఆయనదే. స్తోత్రం ఆయనకే తగును. జీవన్మరణాల ప్రదాత కూడా ఆయనే. ఆయన ప్రతిదీ చేయగల సమర్థుడు. అల్లాహ్ తప్ప మరో దేవుడు లేడు. ఆయన ఏకేశ్వరుడు. ఆయన తన వాగ్దానాన్ని నెరవేర్చాడు. తన దాసునికి తోడ్పడ్డాడు. ఆయన ఒక్కడే తెగలన్నింటినీ జయించాడు"[1]

'సఫా' పర్వతంపై నుంచి దిగి 'మర్వా' పర్వతంపైకి వచ్చారు. ఇక్కడ కూడా ప్రార్థనలు చేశారు. ఆ రోజుల్లో హజ్ సందర్భంగా 'ఉమ్రహ్' చేయటం నిషిద్ధమని జనులు అనుకునేవారు. తమ వెంట ఖుర్బానీ పశువులు తెచ్చుకోనివారు 'ఉమ్రహ్' పూర్తి చేసుకుని ఇహ్రామ్ దీక్షను విరమించుకొమ్మని ఆయన (స) ఆజ్ఞాపించారు.[2] కొంతమంది సహచరులు ఆనవాయితీగా వస్తున్న ఆచారం ప్రకారం ఈ ఆదేశాన్ని పాలించటానికి తటపటాయించారు. "ఒకవేళ నా దగ్గర ఖుర్బానీ పశువులు లేకుండా ఉంటే నేను కూడా ఇలాగే చేసి ఉండేవాణ్ణి"[3] అన్నారు ఆయన(స). ఈ హజ్‌యాత్రకు కొన్ని రోజుల క్రితమే హజ్రత్ అలీ (రజి) యమన్‌కు పంపబడ్డారు. ఆయన యమన్ నుంచి హజ్ యాత్రీకులను వెంటబెట్టుకుని మక్కా వచ్చారు. వారి వెంట ఖుర్బానీ పశువులు కూడా ఉండటం వల్ల వారు ఇహ్రామ్ వస్త్రాలను విడువలేదు. గురువారం నాడు-జిల్‌హజ్ 8వ తేదీన-ఆయన ముస్లిములందరినీ వెంటబెట్టుకుని 'మినా' చేరుకుని అక్కడ విడిది చేశారు. మరునాడు (9వ తేదీన) శుక్రవారం ఫజ్ర్ నమాజ్ చేసుకుని మినా నుండి బయలుదేరారు.[4]

1) సహీహ్ ముస్లిం: కితాబుల్ హజ్
2) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ హజ్జతుల్ విదా అధ్యాయం; సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్ బాబు హజ్జతుల్ విదా.
3) సహీహ్ బుఖారీ : కితాబుల్ మనాసిక్, 4) సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్

www.abulhasanalinadwi.org

హజ్ కోసం మక్కానుండి బయలుదేరినప్పుడు 'అరఫాత్' కు వెళ్ళకుండా 'ముజ్దలిఫా' ప్రదేశంలో ఆగటం ఖురైషుల ఆచారంగా ఉండేది. ఎందుకంటే ఇది పవిత్ర క్షేత్రం 'పరిధి'లో ఉండేది. ఈ పరిధిని దాటి వేరొకచోట విడిదిచేయటం ఖురైషుల స్థాయికి తగదని వాళ్ళను కునేవారు. అయితే ఇది ఇస్లాం సమానత్వ భావానికి విరుద్ధమైన విషయం. అందుకే "మీరు కూడా సాధారణ ముస్లింల వలెనే అరఫాత్‌కు రండి" అని దైవాదేశమయింది.[1]

ఇంకా ఈ విధంగా ప్రకటన గావించబడింది-

"మీరు మీ పవిత్ర స్థలాలలో ఆగి ఉండండి. మీరు మీ పితామహుడైన ఇబ్రాహీము(అలైహిస్సలాం)కు వారసులు"[2]

అంటే అరఫాత్ మైదానం హాజీల విడిది స్థలం. అది హజ్రత్ ఇబ్రాహీము (అలైహిస్సలాం) స్మారక స్థలం. ఆయనే ఈ ప్రదేశాన్ని ఇందు నిమిత్తం ప్రత్యేకించారు. అరఫాత్ ప్రదేశంలో 'నమ్రా' అనే ఒక స్థలం ఉంది. అక్కడాయన(స) కంబలితో వేయబడిన శిబిరంలో విడిది చేశారు. మధ్యాహ్నం పొద్దువాలిన పిదప ఒంటెపై స్వారీ అయి అరఫాత్ మైదానం నడిబొడ్డుకు చేరుకున్నారు. అక్కడే-ఒంటెపై నుంచే-ఉపన్యసించారు.[3]

ఈ రోజు ఇస్లాం తన వైభవంతో సహా ప్రస్ఫుటమయింది. అజ్ఞానకాలపు అపసవ్యమైన ఆచారాలన్నింటినీ నిర్మూలించింది. అందుకే ఆయన(స) ఇలా పలికారు

"అవును. అజ్ఞానకాలపు అహంభావాలన్నీ నా పాదాల క్రింద ఉన్నాయి."[4]

మనిషిని మానవునిగా మలిచే మార్గంలో అన్నిటికన్నా పెద్ద అవరోధం ఈ మానవ అసమానతలే. ప్రపంచ జాతులు, ప్రపంచ మతాలు, ప్రపంచ దేశాలు ఏదో ఒక పేరుతో, ఏదో ఒక రూపులో, ఏదో

1) సహీహ్ బుఖారీ : కితాబుల్ హజ్
2) సుననె తిర్మిజీ : కితాబుల్ హజ్
3) సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్ - ప్రవక్త (స) హజ్ అధ్యాయం
4) సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్

www.abulhasanalinadwi.org

ఒక స్థాయిలో మనిషీ - మనిషికీ మధ్య ఈ 'అసమానతలను' పాటించే వారు. ఈ నిమ్నోన్నతా భేదభావాలకు, జాతివివక్షకు ప్రభుత్వాలు, రాజరికాలు సయితం అండగా నిలిచేవి. ఈ కృత్రిమ భావనలపై, కుహనా ప్రతిష్ఠలపై ప్రశ్నించే అధికారం ఎవరికీ ఉండేది కాదు. మానవ సమానత్వం గురించి మత పీఠాలతో చర్చించే అనుమతి సామాన్యులకు లభించేది కాదు. 'కులీనులు' కులహీనుల కన్నా ఎంతో ఉన్నతులుగా, మర్యాదస్తులుగా పరిగణింపబడేవారు. బానిసలు తమ యజమానుల సరసన నిలబడలేరు.

ఈ రోజు ఈ నిమ్నోన్నతా భేదభావాలు, ఈ ప్రత్యేకతలు, కుహనా కట్టుబాట్లు అన్నీ ఒక్కసారిగా తునాతునకలైపోయాయి.

> "అరబ్బుకు అరబ్బేతరునిపై గానీ, అరబ్బేతరునికి అరబ్బుపైగానీ ఎలాంటి ఆధిక్యతను, శ్రేష్ఠతకు ఆస్కారం లేదు. మీరంతా ఆదము బిడ్డలే. ఆదము మట్టితో సృజించబడ్డారు."[1]

అరేబియాలో ఎవరయిన ఒకరిని హత్య చేస్తే హతుని తరపున ప్రతీకారం తీర్చుకోవటం అతని కుటుంబీకుల విధిగా భావించబడేది. అనేక సంవత్సరాలు గడచిపోయినాసరే ఆ ప్రతీకార వాంఛ అలాగే ఉండేది. ఈ కారణంగానే వర్గ తెగల మధ్య ఎడతెగని పోరాటాలు జరుగుతూ ఉండేవి. అరేబియా గడ్డ నిరంతరం రక్తంతో తడిసి ముద్దయి పోయేది. -ఈ రోజు ఈ పాత అచారం, గర్వాహంకారంతో కూడుకున్న ప్రతీకారచర్య నిర్మూలించబడుతోంది. దీని కోసం దైవప్రవక్త(స) స్వయంగా ముందుకు వచ్చి అందరి ముందూ ఒక ఆదర్శాన్ని, ఉపమానాన్ని నెలకొల్పారు.

> "అజ్ఞానకాలపు ప్రతీకార వాంఛలు మిథ్యగా ప్రకటించ బడుతున్నాయి. అందరి కన్నా ముందు నేను (నా వంశానికి బాకీగా ఉన్న రక్తాన్ని) రబీయ బిన్ హారిస్ కుమారుని రక్తాన్ని మాఫీ చేస్తున్నాను"[2]

ఆనాడు అరేబియా అంతటా వడ్డీ వ్యాపారం ఒక విష వలయంగా తయారై ఉండేది. బీదవర్గాల అణువణువూ ఈ వడ్డీ వ్యాపారుల

1) అల్ అఖీదుల్ ఫరీద్ - 2 : 149.
2) సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్

www.abulhasanalinadwi.org

అధీనంలో ఉండేది. అప్పులు చెల్లించలేని ఎంతో మంది పేదవారు వడ్డీ మా రాజులకు బానిసలుగా మారిపోయేవారు. ఈ విషయ వలయాన్ని ఛేదించి, దాని వాతన పడిన పీడితులకు హాయి నొసగే రోజు వచ్చేసింది.

"అజ్ఞానకాలం నాటి వడ్డీ వ్యాపారం లావాదేవీలన్నీ అధర్మంగా ఖరారయ్యాయి. అన్నిటి కన్నా ముందు నేను నా కుటుంబీకుల వడ్డీని-అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ వడ్డీని - నిషిద్ధంగా ఖరారు చేస్తున్నాను."[1]

అనాటి వరకూ ఆడది ఒక విలాస వస్తువుగా, నోటిమాటగా క్రయవిక్రయాలు జరుపబడే ఆట బొమ్మగా పరిగణించబడేది. తాగుబోతులు సారాయి కోసం ఆమెను అమ్ముకునేవారు. జూదానికి బానిసలుగా మారిన ఆసాములు ఆలినే తాకట్టుగా పెట్టేసేవారు. ఈ కలకంఠి కన్నీరును తడిచే, ఈ కోమలాంగి కష్టాలను తీర్చే, ఈ గృహరాణికి గౌరవప్రదమైన కిరీటం తొడిగించే రోజు వచ్చేసింది. సెలవీయబడింది:

"స్త్రీల విషయంలో దైవానికి భయపడండి."[2]

అనాడు అరేబియాలో ధన ప్రాణాలకు విలువే ఉండేది కాదు. ఒకరింకొకరిని అకారణంగా, అన్యాయంగా చంపేసేవారు. ఒకరి ఆస్తిపాస్తులను ఇంకొకరు బలవంతంగా కబళించేవారు. అయితే ఈనాడు శాంతిదూత సమస్త ప్రపంచానికీ తన శాంతి సందేశాన్ని వినిపిస్తున్నాడు.

"ఈ రోజు, ఈనెల, ఈ నగరం మీకోసం పవిత్రం గావించబడినట్లే, మీ రక్తం, మీ సంపద ప్రళయ దినం వరకూ పవిత్రం గావించబడింది."[3]

ఇస్లాంకు పూర్వం ప్రపంచంలో పెద్ద పెద్ద మతాలు ఉద్భవించాయి. కాని వాటి పునాది ఆ మతస్థాపకుల లిఖితపూర్వక ధార్మిక సూత్రాలపై నెలకొనలేదు. దేవుని తరపున లభించిన మార్గదర్శక సూత్రాలను ఆయా మతాధిపతులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మార్చుకోవటమో లేదా వాటి వాస్తవికతను, ప్రాధాన్యతను తగ్గించేటమో చేశారు. అయితే శాశ్వత మతానికి పైగంబరుగా పంపబడిన ఈ మహోపకారి (స)

1) సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్
2) సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్
3) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ; సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్

www.abulhasanalinadwi.org

దైవాదేశాలను, తన ఆదర్శాలను తన అనుచరుల పరంచేస్తూ వాటిని నిరంతరం హృదయానికి హత్తుకోవాలనీ, వాటిలో మార్పులు చేర్పులు చేయరాదని తాకీదు చేశాడు.

"నేను మీ మధ్య ఒక వస్తువును వదలి వెళుతున్నాను. మీరు దానిని గట్టిగా పట్టుకుని ఉన్నంత కాలం మీరు దారి తప్పరు. అదేమిటీ? అదే దైవగ్రంథం."[1]

"దైవ సమక్షంలో నా గురించి మీరు ప్రశ్నించబడినపుడు ఏమని సమాధానమిస్తారు?"

"మీరు దైవసందేశాన్ని అందజేశారనీ, మీ బాధ్యతను మీరు సజావుగా నిర్వర్తించారని సమాధానమిస్తాం" అన్నారు ప్రియ సహచరులు. అప్పుడు ఆయన (సఅసం) ఆకాశం వైపు చూపుడు వ్రేలును ఎత్తి "అల్లాహ్! ఈ విషయానికి నువ్వే సాక్షివి" అని మూడుసార్లు పలికారు.[2]

సరిగ్గా ఆ సమయంలోనే ఈ దైవవచనం అవతరించింది[3]:

"ఈ రోజు నేను మీ ధర్మాన్ని మీ కోసం పరిపూర్ణం గావించాను. నా అనుగ్రహాలను కూడా ఇక దీనితో సంపూర్తి చేశాను. ఇస్లాంను మీ కోసం సమ్మతించాను."

(అల్ మాయిద-3)

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ హృదయాల విజేత (స) లక్షలాది మంది భక్తుల మధ్య ఈ శాసనాలను జారీ చేస్తున్నప్పుడు ఒంటెపై ఆయన(స) ఆసీనులై ఉన్న గద్దె అతికష్టమ్మీద ఒక రూపాయికన్నా ఎక్కువ విలువైనది కాదు.[4]

ప్రసంగాన్ని ముగించగానే ఆయన(స) అజాన్ యివ్వమని హజ్రత్ బిలాల్ (రజి)ను ఆదేశించారు. అజాన్ తరువాత జుహ్ర్ అస్ర్ నమాజులను కలిపి ఒకేసారి చేశారు. అనంతరం ఒంటెపై స్వారీ అయి తన విడిది

1) సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్
2) సహీహ్ బుఖారీ : కితాబుల్ హజ్ - బాబు హజ్జ తున్నబీ
3) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ
4) సీరతున్నబీ - అల్లామా షిబ్లీ నూమానీ - 2: 154-159

www.abulhasanalinadwi.org

వద్దకు చేరుకున్నారు. ఖిబ్లా దిశకు తిరిగి చాలాసేపు దుఆ (వేడుకోలు) చేస్తూ ఉండిపోయారు.[1] సూర్యాస్తమయం జరుగుతుండగా అక్కణ్ణుంచి బయలుదేరారు. హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి)ను ఒంటెపై తన వెనుక కూర్చోబెట్టుకున్నారు.[2] ఆయన (స) ఒంటె పగ్గాలను బాగా లాగి పట్టుకోవటం వల్ల దాని మెడ ఒక్కోసారి తాను కూర్చున్న గద్దెకు తగిలేది. అశేష జనవాహిని మూలంగా కించిత్ ఇబ్బంది కూడా కలిగేది.[3] జనులకు చేత్తో సైగ చేస్తూ 'కాస్త నెమ్మదిగా నడవండి' అనేవారు. "ప్రజలారా! నిదానం, ప్రజలారా! నిదానం"[4] అనే మాటలు కూడా ఆ సందర్భంగా ఆయన నోట వెలువడ్డాయి.

ఈ మార్గంలోనే ఆయన(స) ఒకచోట కాలకృత్యాలు తీర్చుకున్నారు. "దైవప్రవక్తా! నమాజ్ వేళ దాటిపోతోంది" అని ఉసామా (రజి) గుర్తు చేయగా, నమాజు చేయవలసిన చోటు రానున్నది అని బదులిచ్చారు. కొద్ది సేపట్లోనే ఆయన(స) సహచరులందరితో కలసి 'ముజ్దలిఫా' చేరుకున్నారు. అక్కడ ఆయన(స) తొలుత మగ్రిబ్ నమాజు చేశారు. జనులు గబగబా తమ సామాను సర్దుకుంటూ ఉండగా ఇషా నమాజు కోసం 'తక్బీర్' పలకబడింది.[5] నమాజు చేసిన తరువాత ఆయన విశ్రమించారు. తెల్లవారే వరకూ నిదురించారు. ఎప్పటిలాగా ఆయన ఆ రోజు రాత్రి లేవలేదు. ఆయన (సఅసం) తహజ్జుద్ నమాజు కోసం లేవని రాత్రి అంటూ ఉంటే ఆ ఒక్కరాత్రేనని హదీసువేత్తలు వ్రాశారు. తెలతెలవారుతుండగా లేచి, అందరితో కలసి ఫజ్ర్ నమాజు చేశారు.[6] ఖురైష్ అవిశ్వాసులు సూర్యోదయం అవుతున్నప్పుడు ముజ్దలిఫా నుండి బయలుదేరేవారు. ప్రభాకరుని లేకిరణాలు పడి పర్వత శిఖరాలు నిగనిగలాడేవి. అది చూసి 'షబ్బీర్ పర్వతమా! ఎండతో మెరిసిపో" అని నినదిస్తూ వెళ్ళిపోయేవారు. దైవప్రవక్త (స) ఈ ఆనవాయితీని భంగపరుస్తూ సూర్యోదయం కాకమునుపే అక్కడి నుంచి ముందుకు సాగిపోయారు.[7] అది జిల్ హజ్ 10వ తేదీ శనివారం.

---

1) జాదుల్ మ ఆద్ - 2 : 234
2) సహీహ్ బుఖారీ : కితాబుల్ హజ్
3) జాదుల్ మఆద్ - 2 : 246
4) సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్
5) సహీహ్ బుఖారీ : కితాబుల్ హజ్
6) సీరతున్నబీ - 2 : 120
7) సహీహ్ బుఖారీ : కితాబుల్ హజ్

www.abulhasanalinadwi.org

హజ్రత్ ఫజల్ బిన్ అబ్బాస్ (రజి) ఆయన వెనుక ఒంటెపై కూర్చున్నారు. హజ్ యాత్రికులు కుడి వైపు నుంచి, ఎడమవైపు నుంచీ, ధర్మ సందేహాలు అడుగుతున్నారు. ఆయన (స) అందరి సందేహాలూ తీరుస్తున్నారు.[1] హజ్ క్రియల గురించి బిగ్గరగా సూచనలు అందజేయసాగారు. ముహస్సర్ లోయగుండా ఆయన(స) 'జుమ్రా' వద్దకు చేరుకున్నారు. పిన్నవయస్కులైన అబ్బాస్ నుద్దేశించి తనకు కంకరరాళ్ళు ఇవ్వమన్నారు. కంకర రాళ్లను చేతికివ్వగా రాళ్లురువ్వారు. ఆ సందర్భంగా ఆయన(స) జనులనుద్దేశించి,

"ధర్మంలో అతిశయిల్లకండి. అతివాదానికి దూరంగా ఉండండి. ఎందుకంటే మీకు పూర్వం గతించిన జాతులు ఈ 'అతి' మూలంగానే నాశనమయ్యాయి"[2] అని అన్నారు.

ఈ సందర్భంగానే ఆయన(స) ఈ విధంగా కూడా పలికారు.

"హజ్ క్రియలన్నీ క్షుణ్ణంగా తెలుసుకోండి. దీని తరువాత మళ్లీ నాకు హజ్ చేసే అవకాశం లభించక పోవచ్చు."[3]

"జుమ్రా' పూర్తయిన తరువాత ఆయన(స) 'మినా' మైదానంలోకి వచ్చారు. ఆయనకు ముందూ వెనుకా, కుడివైపునా ఎడమవైపునా సుమారు లక్షమంది వరకూ ఉన్నారు. ముహాజిర్లు కుడి వైపునా, అన్సార్లు ఎడమవైపునా, మధ్యలో ఇతర ముస్లింలున్నారు. ఆయన(స) మాత్రం ఒంటెపై కూర్చుని ఉన్నారు. ఒంటె పగ్గాలు హజ్రత్ బిలాల్ (రజి) చేతిలో ఉన్నాయి. హజ్రత్ ఉసామ (రజి) ఆయన (స) వెనుకే కూర్చుని వస్త్రాన్ని లాగిపట్టుకుని నీడ కల్పిస్తున్నారు. ఆయన(స) ఓ సారి కన్నెత్తి అశేష జనవాహిని వంక చూశారు. 23 సంవత్సరాల అవిరళ దైవదౌత్య కృషి ఫలితం ఆయన కళ్ల ముందు ఒక్కసారిగా కదలాడింది. సత్యామృతాన్ని ఆస్వాదించిన ధన్యజీవుల సమూహం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. దైవదౌత్య పరంపరపై 'పరిసమాప్తి' అనే ముద్రపడబోతోంది. ప్రపంచం పుట్టి లక్షలాది సంవత్సరాలు గడచిపోయాక ప్రప్రథమంగా సహజధర్మం-ప్రకృతిధర్మం-పరిపూర్ణతను సంతరించుకుందన్న శుభవార్తను పరిసర

---

1) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ - బాబు హజ్జతుల్ విదా
2) సుననె నసాయి : కితాబుల్ మనాసిక్
3) సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్

www.abulhasanalinadwi.org

ప్రాంతాల్లోని ఒక్కో రేణువూ ఆలకిస్తోంది. సరిగ్గా ఆ సమయంలోనే అంతిమ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారి అధరాల నుండి జాలువారిన ఈ పలుకులు చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోయాయి. -ఎందుకంటే ఇప్పుడు ఒక నూతన జీవనవ్యవస్థకు, నూతన షరీయతుకు, నూతన అధ్యాయానికి పునాది పడింది.[1]

"ఆదిలో దేవుడు ఏ బిందువుపై భూమ్యాకాశాలను సృజించాడో, కాలచక్రం తిరిగి తిరిగి సరిగ్గా ఆ బిందువుపైకే వచ్చింది."[2]

దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) స్థాపించిన హజ్ విధానంపై అరాచకపు కారు మేఘాలు కమ్ముకున్నాయి. రక్తపాతం నిషేధించబడిన గడ్డపై అరబ్బులు రక్తాన్ని చిందించి హజ్ మాసానికి ఉన్న పవిత్రతను మంట గలిపేశారు. హజ్ క్రియలలో కొత్తపుంతలు తొక్కి సంప్రదాయాలకు మసిపూసారు. ఇప్పుడు ఈ అజ్ఞానపు దురాగతాలకు కాలం చెల్లింది. అశేష జనవాహిని సాక్షిగా 'హజ్'కు సంబంధించి ఓ నూతన సంవిధానం ఆమోదించ బడింది. అందుకే కారుణ్యమూర్తి (సఅసం) ఇలా వక్కాణించారు.

"ఏడాదిలో 12 మాసాలుండగా 4 మాసాలు గౌరవప్రదం గావించబడ్డాయి. వాటిలో మూడు మాసాలు ఒకదాని తరువాత ఒకటి వస్తాయి. జీఖ అద, జిల్‌హజ్, ముహర్రమ్, నాల్గవ మాసం రజబ్ మాసం. అది జమాదివుస్సానీ-షాబాన్ మాసాల మధ్యన ఉంటుంది."[3]

ప్రపంచంలో న్యాయం ధర్మాలు విలసిల్లినా అన్యాయం అక్రమాలు రాజ్యమేలినా-అవి మూడు వస్తువుల చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి. 1) ప్రాణం 2) ధనం, 3) మానమర్యాదలు. దైవప్రవక్త (సఅసం) నిన్నటి ప్రసంగంలో వీటి గురించి నొక్కి పలికినప్పటికీ తరతరాలుగా అరబ్బులలో పేరుకుపోయివున్న ఈ తుప్పును తొలగించటానికి మరోసారి ఈ విషయాన్ని నొక్కివక్కాణించవలసిన

1) సీరతున్నబీ - 2 : 161.
2) సహీహ్ బుఖారీ - కితాబుల్ మగాజీ; సహీహ్ ముస్లిం : కితాబుల్ ఖుసామ
3) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ - బాబు హజ్జతుల్ విదా

www.abulhasanalinadwi.org

ఆవశ్యకత ఉందని భావించి ఉంటారు. అందుకే ఆయన(స) అనుపమమైన తన శైలిలో ఇలా ప్రసంగించారు:

"ఈ వాళ ఏం రోజు?"

"దైవం మరియు దైవప్రవక్త (స)కే బాగా తెలుసు" అని ప్రజలు జవాబిచ్చారు.

చాలాసేపు ఆయన (స) మౌనం వహించారు.

బహుశా ఆయన(స) ఆ రోజుకు కొత్త నామకరణం చేస్తారేమోనని అందరూ అనుకోసాగారు.

"ఈ రోజు ఖుర్బానీ ఇచ్చే రోజు కాదా?" అని ఆయన ప్రశ్నించారు.

"నిస్సందేహంగా ఖుర్బానీ రోజే"-ప్రజలంతా జవాబిచ్చారు.

"ఇది ఏ మాసం?" ప్రశ్నించబడింది.

ప్రజలు అదే రీతిలో బదులిచ్చారు.

ఆయన(స) చాలాసేపు మౌనం వహించారు. "ఇది జిల్ హజ్ మాసం కాదా?!" ఆయనే(స) స్వయంగా అడిగారు.

"నిస్సందేహంగా జిల్‌హజ్జ్ మాసమే" జవాబిచ్చారు సహచరులు.

"ఇది ఏ నగరం?" -మళ్లీ ప్రశ్న.

ప్రజల నుంచి మళ్లీ అదే జవాబు

"ఇది పవిత్ర నగరం కాదా?" అని ఆయన(స) ప్రశ్నించారు.

"ముమ్మాటికీ" అని బదులిచ్చారు సహచరులు.

ఈ రోజు, ఈ మాసం, ఈ నగరం-మూడూ పవిత్రమైన వన్న సంగతి అప్పటికే ప్రజల అంతర్యాల్లో నాటుకుంది. అంటే ఈ రోజునగానీ, ఈ మాసంలోగానీ, ఈ నగరంలోగానీ యుద్ధం చేయటం, రక్తపాతం సృష్టించటం ధర్మ సమ్మతం కాదు.

"ఈ రోజు, ఈ నెల, ఈ నగరం పవిత్రమైనట్లే మీ రక్తం,
మీ ధనం, మీ మానమర్యాదలు (ప్రళయదినం వరకూ)
పవిత్రం గావించబడ్డాయి."[1]

జాతుల పతనంలో, దివాలా కోరుతనంలో నిరంతర యుద్ధాలు, రక్తపాతాలే ముఖ్య కారణాలుగా నిలిచాయి. అందుకే ప్రళయదినం

1) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజి

www.abulhasanalinadwi.org

వరకూ సచేతనంగా ఉండే జాతికి మూలస్థాపకుడుగా వచ్చిన ప్రవక్త (స) తన అనుయాయులనుద్దేశించి ఇలా ఎలుగెత్తి ప్రకటించాడు-

> "వినండి! నా తదనంతరం ఒండొకరి మెడలు నరుక్కునే వారిలా అపమార్గం పాలు కాకండి. మీరంతా దైవ సమక్షంలో హాజరుకావలసి ఉన్నది. ఆయన మీ నుండి లెక్క తీసుకుంటాడు సుమా!"[1]

అన్యాయం, దౌర్జన్యం పరాకాష్ఠకు చేరుకున్న గడ్డు కాలమది. ఒక వంశంలో ఏ వ్యక్తయినా ఒక తప్పుచేస్తే ఆ వంశంలోని వ్యక్తులంతా దోషులుగా, పాపాత్ములుగా పరిగణించబడేవారు. నేరం చేసిన నేరస్థులు పలాయనం చిత్తగిస్తే, పరిపాలకులు ఆ నేరస్థుని అన్నెం పున్నెం ఎరుగని వంశస్థులను, కుటుంబీకులను పట్టుకుని శిక్షించేవారు. తండ్రిచేసిన నేరానికి కొడుకు ఉరికంభం ఎక్కాల్సి వచ్చేది. కొడుకు చేసిన పాపానికి ఫలితం తండ్రి అనుభవించాల్సి వచ్చేది. అత్యంత అమానుషమైన ఈ చట్టం అనాదిగా కొనసాగుతూ వచ్చేది. దివ్యఖుర్ఆన్ ఈ అన్యాయాన్ని ఖండిస్తూ ప్రకటన చేసినప్పటికీ వినూత్న రాజకీయ వ్యవస్థకు నడుం బిగించిన ప్రవక్త(స) ఈ నేపథ్యంలో స్పష్టమైన ఫర్మానాను జారీచేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

> "వినండి!! ఎవరు చేసిన నేరానికి వారే బాధ్యులు. తండ్రి చేసిన నేరం కొడుకుపై మోపబడదు. కొడుకు చేసిన అపరాధానికి తండ్రి బాధ్యుడు కాడు."[2]

ఆనాడు అరేబియాలో నెలకొని ఉన్న అశాంతి అలజడులకు, అరాచకం అవ్యవస్థలకు మూలకారణం అక్కడి వ్యక్తుల్లో గూడుకట్టుకుని ఉన్న బాధ్యతా రాహిత్య ధోరణే. ప్రతి ఒక్కడూ తన్ను తాను అందరికన్నా పెద్దవాడిగా ఊహించుకునేవాడు. తననొక పాలకుడుగా తలపోసేవాడే తప్ప పాలితునిగా ఉండటానికి సుతరామూ సహించేవాడు కాడు. ఈ అహంభావాన్ని తునాతునకలు చేయవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

---

1) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ

2) సుననె తిర్మిజీ : కితాబుల్ ఫితన్; సుననె ఇబ్నుమాజా : కితాబుల్ మనాసిక్

www.abulhasanalinadwi.org

"వినండి! ఒక నల్లని నీగ్రో అయినా, చెవి తెగిన బానిస అయినాసరే మీ నాయకునిగా ఎంపికైతే-అతడు దైవాజ్ఞల కనుగుణంగా మిమ్మల్ని నడిపిస్తున్నంత వరకూ-మీరతనికి విధేయులై ఉండాల్సిందే"[1]

అరేబియా ఎడారిలోని అణువణువూ ఇస్లాంతో పులకించింది. కాబా గృహం శాశ్వత ప్రాతిపదికపై ఇబ్రాహీము (అలైహిస్సలాం) అనుచర సమాజం కేంద్రంగా మారిపోయింది. కల్లోల జనకులు కుప్పకూలి పోయారు. మిథ్యావాదులు మట్టికరచారు. అందుకే ఆయన(స) ఇలా సెలవిచ్చారు:

"మీ ఈ నగరంలో తన పూజ ఇక మీదట ప్రళయ దినం వరకూ జరగదన్న విషయం గ్రహించిన షైతాన్ నిరాశకు గురయ్యాడు. అయితే మీరు చిన్న చిన్న విషయాలలో వాడి అడుగులకు మడుగులొత్తుతారు. దాన్ని చూసి వాడు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవుతాడు".[2]

ఆఖరిలో ఆయన (స) ఇస్లాం యొక్క మొదటి విధ్యుక్త ధర్మాన్ని జ్ఞాపకం చేశారు:

"మీరు మీ ప్రభువును ఆరాధించండి. ఐదువేళలా నమాజు చేయండి. (రమజాన్) మాసపు ఉపవాసం పాటించండి. నా ఆజ్ఞలను అనుసరించండి. దేవుని స్వర్గంలో ప్రవేశిస్తారు."[3]

ఈ విధంగా ఉపదేశించిన మీదట ఆయన(స) జన సముద్రం వైపు సంజ్ఞ చేస్తూ "నేను దైవసందేశాన్ని అందజేశానా? లేదా?" అని ప్రశ్నించారు.

"అవును. అందజేశారు"-అని అందరూ సాక్ష్యమిచ్చారు."

"దేవా! నీవు దీనికి సాక్షిగా ఉండాలి" అని ఆయన(స) పలికారు.

తరువాత ఆయన(స) ప్రజలవైపు తిరిగి "ఇక్కడున్నవారు ఇక్కడలేనివారికి ఈ సందేశాన్ని వినిపించాలి" అని చెప్పారు.[4]

1) సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్
2) తిర్మిజీ : కితాబుల్ ఫితన్
3) సుననె తిర్మిజీ : కితాబుస్సలాత్
4) సహీహ్ బుఖారీ : కితాబుల్ హజ్

www.abulhasanalinadwi.org

ప్రసంగాన్ని ముగిస్తూ ఆయన(స) ముస్లింలందరికీ వీడ్కోలు చెప్పారు.

ఆ తరువాత ఆయన(స) ఖుర్బానీ యిచ్చే క్షేత్రానికి వెళ్ళారు. "ఖుర్బానీ యివ్వడానికి 'మినా'లో ఏదేని ఒక స్థలమంటూ ప్రత్యేకంగా నిర్ధారించబడలేదు. మినా మరియు మక్కా నగరంలోని వీధి వీధినా, వాడవాడనా ఖుర్బానీ యివ్వవచ్చు" అని ఆయన(స) ఉద్బోధించారు. ఆయన(స) ముందర నూరు ఒంటెలు ఖుర్బానీ కోసం నిలబడి ఉన్నాయి. వాటిలో కొన్నింటిని మాత్రమే ఆయన(స) జిబహ్ చేశారు. మిగిలిన వాటిని జిబహ్ చేసే బాధ్యతను హజ్రత్ అలీ (రజి)కి అప్పజెప్పారు.[1] వాటి మాంసాదులను దానం చేయవలసిందిగా ఆదేశించారు. కసాయి వానికివ్వవలసిన వేతనం ఆ మాంసంలో నుంచి ఇవ్వరాదనీ, వేతనాన్ని వేరుగా చెల్లించాలనీ పురమాయించారు.[2]

ఖుర్బానీ ధర్మాన్ని నిర్వర్తించిన తరువాత ఆయన(స) మామర్ బిన్ అబ్దుల్లాహ్‌ను పిలిపించి, శిరోముండనం చేయించుకున్నారు.[3] ప్రేమకొద్దీ తన క్లేశాలను తన స్వహస్తాలతో అబూతల్హా అన్సారీకి, ఆయన భార్య ఉమ్మె సులైమాకి, తనకు సమీపంలో కూర్చుని ఉన్న శిష్యగణానికి ఇచ్చారు. మిగిలిన తలవెంట్రుకలను అబూతల్హా (రజి) ముస్లింల మధ్య తలా ఒక్కోటి, రెండేసి చొప్పున పంచిపెట్టారు.[4] అనంతరం ఆయన(స) మక్కాలోనికి ప్రవేశించారు. కాబా గృహ ప్రదక్షిణ చేసి, జమ్‌జమ్ జలం ఉన్న బావి వద్దకు వెళ్ళారు.

జమ్‌జమ్ బావి నుండి హజ్ యాత్రికులకు నీరు త్రాపించే బాధ్యతను అబ్దుల్ ముత్తలిబ్ వంశస్థులే నిర్వర్తించేవారు. బావి దగ్గర నిలబడి ఆయన(స) ఇలా అన్నారు: "ఓ అబ్దుల్ ముత్తలిబ్ సంతతివారలారా! నేను స్వయంగా నీళ్లు తోడుకుని త్రాగటం చూసి, జనులు ఈ బాధ్యతను మీ నుండి లాక్కుంటారనే భయమే గనక నాకు లేకపోతే నేను ఖుద్దుగా నీళ్లు తోడుకునే వాణ్ణి."[5] అప్పుడు హజ్రత్ అబ్బాస్

1) జాదుల్ మ ఆద్ - 2 : 59
2) సహీహ్ బుఖారీ : కితాబుల్ హజ్
3) ముస్నదె అహ్మద్ - 6 : 100
4) సహీహ్ బుఖారీ : కితాబుల్ వుజూ; సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్
5) సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్

www.abulhasanalinadwi.org

(రజి) బొక్కెనతో నీళ్లుతోడి ఆయన (స)కు సమర్పించారు. ఆయన(స) ఖిబ్లా దిశలో నిలబడి నీళ్లు త్రాగారు.[1] అక్కణ్ణుంచి తిరిగి మినా వెళ్ళారు. జుహ్ర్ నమాజు అక్కడే చేశారు. [2] ఆ రోజునుంచీ జిల్‌హజ్ 12వ తేదీ వరకూ ఆయన 'మినా'లోనే మకాం వేశారు. ప్రతిరోజూ పొద్దువాలినపుడు జుమ్రా కోసం వెడలేవారు.[3] జిల్‌హజ్ 13వ తేదీ మంగళవారం మధ్యాహ్నం అక్కడి నుంచి మకాం మార్చి ముహస్సబ్ లోయలో ఆగారు. రాత్రి అక్కడే గడిపారు.[4] ఆఖరి జామున లేచి మక్కాకు చేరుకున్నారు. కాబా గృహ అంతిమ ప్రదక్షిణ చేసి అక్కడే ఫజ్ర్ నమాజ్ కూడా చేశారు.[5] ఆ తరువాత వివిధ తెగలు తమతమ ప్రాంతాలకు తిరుగు ముఖం పట్టాయి. మహాప్రవక్త (స) తమ ముహాజిర్, అన్సార్ సహచరులతో కలసి మదీనా వైపుకు సాగిపోయారు. మదీనా సమీపంలో జుల్‌హులైఫా స్థలానికి చేరుకుని అక్కడ ఒక రాత్రి గడిపారు. ఉదయం సూర్యోదయం అవుతున్న సమయానికల్లా ప్రవక్త బృందం మదీనా నగరంలోకి ప్రవేశించింది. మదీనా నగరంపై దృష్టిపడగానే ఆయన(స) నోట వెలువడిన వాక్యాలివి:

> "అల్లాహ్ గొప్పవాడు, ఘనాఘనుడు. ఆయన తప్ప మరో దేవుడు లేడు. ఆయనకు భాగస్వాములెవరూ లేరు. రాజ్యాధికారం ఆయనదే. సర్వస్తోత్రాలు, ప్రశంసలు ఆయనకే శోభిస్తాయి. ఆయన అన్నింటినీ చేయగల సమర్థుడు. మేము మరలివస్తున్నాము. పశ్చాత్తాపం చెందుతూ వస్తున్నాము. దైవదాస్య భావంతో, సాష్టాంగ పడుతూ, మా ప్రభువు స్తుతి స్తోత్రాలలో నిమగ్నులమై వస్తున్నాము. దేవుడు తన వాగ్దానాన్ని నిజం చేసి చూపాడు. తన దాసునికి అండగా నిలిచాడు. వ్యతిరేక శక్తులన్నింటినీ తానొక్కడే ఓడించాడు"[6]

---

1) సహీహ్ బుఖారీ : పానీయాల ప్రకరణం
2) సహీహ్ ముస్లిం : కితాబుల్ హజ్
3) జాదుల్ మ ఆద్ - 2 : 290
4) సహీహ్ బుఖారీ : కితాబుల్ హజ్ - బాబు తవాఫుల్ విదా
5) సహీహ్ బుఖారీ : కితాబుల్ హజ్
6) సహీహ్ బుఖారీ : కితాబుల్ హజ్

www.abulhasanalinadwi.org

# మహా ప్రస్థానం

"ఇన్నక మయ్యితున్ వ ఇన్నహుమ్ మయ్యితూన్".

దేవుడు ఆయన(స) ద్వారా ప్రవేశపెట్టగోరిన సంస్కరణా కార్యం అయిపోవచ్చింది. షరీయతు (ధర్మశాస్త్రం) పరిపూర్ణమయింది. ఆత్మశుద్ధికి సంబంధించిన ప్రక్రియ పూర్తికా వచ్చింది. తన పనిపూర్తయ్యేవరకే పవిత్రాత్మ దేహాన్ని అంటిపెట్టుకుని ఉంటుంది. లక్ష్యం నెరవేరగానే అది ఊర్ధ్వలోకాలకు సాగిపోతుంది. అంతిమ హజ్ యాత్రతో అంతిమ దైవప్రవక్త(స) వారి సంస్కరణాసరణి పూర్తయింది. ఏకేశ్వరోపాసనా సిద్ధాంతం ఓ తిరుగులేని శక్తిగా అవతరించింది. నైతిక సూత్రాలు క్రియాత్మకంగా సమాజంలో వ్రేళ్లూనుకున్నాయి.

> "ఈరోజు నేను మీ ధర్మాన్ని పరిపూర్ణం గావించాను. నా అనుగ్రహాలను కూడా సంపూర్తి చేశాను."[1]

అన్న ప్రకటన వేలాదిమంది నికార్సయిన ఏకేశ్వరోపాసకుల సమక్షంలో వెలువడింది.

అదీగాక, నస్ర్ సూరా అవతరణతోనే ప్రవక్త(స)కు సన్నిహితులుగా ఉండే కొంతమంది సహాబీలకు అర్థమైపోయింది -తమ ప్రియతమ నాయకుడు తమ నుండి సెలవు తీసుకునే గడియలు దగ్గరపడ్డాయని! "నీ ప్రభువును స్తుతించటంతో పాటు, మన్నింపుకై ఆయన్ని వేడుకో (నస్ర్)" అన్న దైవాజ్ఞననుసరించి ఆయన(స) ఎక్కువ సమయం దైవారాధనలో, దైవధ్యానంలో గడిపేవారు.[2] సాధారణంగా ఆయన ప్రతి యేటా రమజాన్ నెలలో 10 రోజులపాటు 'ఏతెకాఫ్' వ్రతం

---

1) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ

2) సహీహ్ బుఖారీ : కితాబుత్తఫ్సీర్

www.abulhasanalinadwi.org

బూనేవారు. కాని ఆయన హి(జీ 10వ యేట రమజాన్ మాసంలో 20 రోజులపాటు 'ఏతెకాఫ్'లో కూర్చున్నారు. ఏటేటా ఆయన రమజాన్ మాసంలో ఒకసారి ఖుర్ఆన్ వినేవారు. అయితే ఈసారి ఆయన రెండుసార్లు దివ్యఖుర్ఆన్‌ను విన్నారు.[1] హజ్‌యాత్ర సందర్భంగా ఆయన తన సహచరులకు హజ్ క్రియలను క్షుణ్ణంగా తెలియజేయటంతో పాటు, బహుశా తనకు హజ్ చేసే అవకాశం ఇకమీదట లభించక పోవచ్చునని సూచనాప్రాయంగా చెప్పేశారు. "బహుశా నేను ఇక మీదట హజ్ చేయలేను" అని చెప్పేసినట్లు కొన్ని ఉల్లేఖనాలలో ఉంది.[2] తన అంతిమ హజ్ యాత్ర సందర్భంగా ఆయన(స) ముస్లింలందరికీ తనను దర్శించుకునే భాగ్యం కల్పించారు. ఉహుద్ యుద్ధంలో అమరగతి నొందిన త్యాగధనుల సమాధులను కూడా ఆయన ఈ మధ్యనే సందర్శించి వారి కోసం ప్రార్థించారు. మరణ ఘడియలు ఆసన్నమైన వ్యక్తి తన వారసులకు వీడ్కోలు చెప్పినట్లే వారి నుండి సెలవు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన(స) ప్రసంగించారు.

> "నేను మీ కన్నా ముందే (కౌసర్) సరస్సు వద్దకు వెళుతున్నాను. అక్లా నుండి హుజ్ఫావరకు ఎంత వెడల్పు ఉంటుందో దాని వెడల్పు కూడా అంతే ఉంటుంది. నాకు ప్రపంచ ఖజానాల తాళం చెవి ఇవ్వబడింది. నా తరువాత మీరు బహుదైవారాధనకు పాల్పడతారని నేను భయపడటం లేదు. కాని మీరెక్కడ ప్రాపంచిక లాలసలో పడి పరస్పరం రక్తపాతం సృష్టించి మీ పూర్వీకుల వలె నాశనమవుతారోనని నేను భయపడుతున్నాను."

దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రసంగిస్తుండగా తాను చివరిసారి విన్నానని ఉల్లేఖకుడు తెలిపారు.[3]

హజ్రత్ జైద్ బిన్ హారిసాను సిరియా సరిహద్దుల్లో అరబ్బులు హతమార్చారన్న సంగతి యుద్ధాల సందర్భంగా వచ్చింది. దైవప్రవక్త(స)

---

1) సహీహ్ బుఖారీ : కితాబుల్ ఫజాయెల్
2) సహీహ్ బుఖారీ : కితాబుల్ హజ్
3) సహీహ్ బుఖారీ : కితాబుల్ జనాయెజ్, సహీహ్ ముస్లిం: కితాబుల్ ఫజాయెల్

www.abulhasanalinadwi.org

అందుకు పరిహారం తీసుకోవాలనుకున్నారు. తాను అస్వస్థతకు గురికాక ఒక రోజుముందే ఆయన(స) ఉసామా బిన్ జైద్(రజి)ను సేనాధిపతిగా నియమిస్తూ, ఒక సైనిక దళాన్ని తీసుకుని ఆ ప్రాంతానికి వెళ్ళమనీ, తన తండ్రి రక్తానికి ప్రతీకారం తీర్చుకోమని ఆదేశించారు.[1]

హిజ్రీ 11వ సంవత్సరం సఫర్ నెల 18 లేక 19వ తేదీన ఆయన (సఅసం) ముస్లింల ఖననవాటిక అయిన 'జన్నతుల్ బఖీ'కి వచ్చారు. అక్కడే ఆయన(స) అస్వస్థతకు గురయ్యారు.[2] అది హజ్రత్ మైమూనా (ర. అన్హా)కి కేటాయించబడినరోజు. ఆ స్థితిలో కూడా ఆయన(స) ప్రతిరోజూ-న్యాయసమ్మతంగా తాను నిర్ధారించిన వంతుల ప్రకారం-ఒక్కో భార్య కుటీరానికి వెళుతుండేవారు. సోమవారం నాడు వ్యాధి తీవ్రత పెరిగింది. అప్పుడాయన సతీమణులందరి సమ్మతితో హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కుటీరంలోనే ఉండసాగారు. ఆయన(స) ఆ మేరకు అనుమతి కూడా స్పష్టంగా అడగలేదు. 'రేపు నేను ఉండవలసింది ఎవరి కుటీరంలో?!' అని ప్రశ్నించారు. అది (సోమవారం) హజ్రత్ ఆయిషా (ర. అన్హా) వంతు. సతీమణులు ఆయన (స) అభిలాషను గ్రహించి "తమరు ఇక నుంచి ఎక్కడుండదలిస్తే అక్కడే ఉండవచ్చు" అని చెప్పారు. బాగా నీరసించిపోవటం వల్ల నడవలేని స్థితి ఏర్పడింది. హజ్రత్ అలీ (రజి), హజ్రత్ అబ్బాస్ (రజి) లిరువురూ ఆయన భుజాలు పట్టుకుని అతి కష్టమ్మీద హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కుటీరంలోకి తెచ్చారు.[3]

మస్జిద్‌కు వచ్చే శక్తి ఉన్నంత వరకూ ఆయన (స) నమాజ్ చేయించడానికి వస్తూ ఉండేవారు. ఆయన (స) చేయించిన ఆఖరి నమాజు మగ్రిబ్ నమాజు. తలనొప్పి ఉండటం వల్ల తలకు గట్టిగా రుమాలు చుట్టుకుని వచ్చారు. నమాజులో 'వల్ ముర్సలాత్' సూరా పఠించారు.[4] ఇషా నమాజుకు వేళ అయింది. నమాజు అయిపోయిందా? అని అడిగారు. 'లేదు, అందరూ మీ రాక కోసం ఎదురు చూస్తున్నార'ని సమాధానం వచ్చింది. బానలో నీళ్లు పోయించి స్నానం చేశారు.

1) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ
2) ముస్తద్రక్ హాకిమ్ - 3 : 57
3) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ
4) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ

www.abulhasanalinadwi.org

లేవబోయి స్పృహ తప్పిపోయారు. స్పృహ వచ్చిన తరువాత నమాజు చేయటం అయిపోయిందా? అని మళ్లీ ప్రశ్నించారు. ప్రజలు మొదటిసారి లాగే సమాధానం ఇచ్చారు. ఆయన (స) మళ్లీ స్నానం చేసి నమాజు కోసం లేవబోయారు. మళ్లీ స్పృహ కోల్పోయారు. స్పృహలోకి రాగానే మళ్లీ అదే ప్రశ్న. ప్రజల నుంచి మళ్లీ అదే జవాబు. మూడోసారి శరీరంపై నీళ్లు పోసుకుని లేవబోగా ఈసారి కూడా స్పృహ తప్పారు. స్పృహలోకి వచ్చాక, "నమాజుకు సారథ్యం వహించమని అబూబక్ర్ (రజి)కు చెప్పండి" అని పురమాయించారు. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఆయన(స)కు నచ్చజెప్పారు - "దైవప్రవక్తా (స)! అబూబక్ర్ ఎంతో మృదుస్వభావులు. మీరు నిలబడే స్థానంలో ఆయన నించోలేరు" అని సలహా యిచ్చారు. కాని ఆయన (స) ఆమె మాటల్ని పట్టించుకోకుండా "అబూబక్ర్‌కు నమాజ్ చేయించమనండి" అని చెప్పి పంపించారు. ఆ రోజు నుంచీ కొన్నాళ్ళ పాటు హజ్రత్ అబూబకర్ నమాజుకు సారథ్యం వహించేవారు.

మరణానికి నాలుగు రోజుల ముందు జుహ్ర్ నమాజ్ వేళ ఆయన (సఅసం) ఆరోగ్యం కాస్త కుదుటపడింది. ఏడు చెంబుల నీళ్లు తనపై పోయమని సూచించారు. ఆ విధంగా ఆయన (స) స్నానం చేసి హజ్రత్ అలీ (రజి) హజ్రత్ అబ్బాస్ (రజి)ల సాయంతో మస్జిద్‌కు వచ్చారు. అప్పటికే సామూహిక నమాజ్ జరుగుతోంది. ఈ నమాజుకు హజ్రత్ అబూబక్ర్ (రజి) నాయకత్వం వహిస్తున్నారు. దైవప్రవక్త (స) అలికిడిని పసిగట్టిన అబూబక్ర్ (రజి) వెనక్కి వచ్చారు. అయితే దైవప్రవక్త (స) ఆయన్ని అపుతూ, ఆయన ప్రక్కనే కూర్చుని నమాజు చేయించారు. నమాజులో ఆయన్ని (స) హజ్రత్ అబూబక్ర్ అనుసరించగా, హజ్రత్ అబూబక్ర్‌ని మిగతా వారంతా అనుసరించారు.[1]

నమాజు అనంతరం విశ్వనాయకుడు (సఅసం) ప్రసంగించారు. ఆయన(స) తన జీవితంలో చేసిన తుది ప్రసంగమది!

ఆయన (స) ఇలా అన్నారు :

---

1) సహీహ్ ముస్లిం : కితాబుస్సలాత్ ; సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ.

www.abulhasanalinadwi.org

"దేవుడు తన దాసుల్లో ఒకరికి ప్రపంచానుగ్రహాలు కావాలో దైవం వద్ద (పరలోకంలో) ప్రాప్తించే అనుగ్రహాలు కావాలో ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఇవ్వగా అతను దైవసమక్షంలో లభించే అనుగ్రహాలనే ఎంపిక చేసుకున్నాడు". ఈ పలుకులు వెలువడగానే హజ్రత్ అబూబక్ర్ (రజి) విలపించసాగారు. దైవప్రవక్త (స) ఎవరో ఒక వ్యక్తి గురించి చెబుతుండగా ఈయన అలా ఏడుస్తాడేమిటీ? అని సభికులు ఆశ్చర్యపోయారు. కాని 'ఆ దాసుడు' ఎవరో దైవప్రవక్త (సఅసం) అంతరంగికునికి అర్థమైపోయింది. ఆయన (స) తన ఉపన్యాసాన్ని కొనసాగించారు. ఇలా పలికారు: "నాకు లభించిన సహచర్య భాగ్యాలలో కెల్లా ఉత్తమమైనది అబూబక్ర్ (రజి) సహచర్యం. అందుకు గాను నేనాయనకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఒకవేళ నేను ప్రపంచంలో ఎవరినయినా నా అనుచర సమాజంలో 'నేస్తం' గా చేసుకోదలిస్తే అబూబక్ర్ (రజి)ను నా ప్రియ నేస్తంగా చేసుకునేవాణ్ణి. కాని ఇస్లాం బాంధవ్యం ఒక్కటి చాలు - స్నేహ బంధానికి ! మస్జిదు దిశలో అబూబక్ర్ (రజి) కిటికీ తప్ప మరొకరి కిటికీని ఉండనివ్వకండి.[1] మీకు పూర్వం గతించిన జాతులు ప్రవక్తల, మహనీయుల సమాధులను ప్రార్థనాలయాలుగా చేసుకున్నారు. మీరు మాత్రం అలా చేయకండి.[2]

నాయక శిఖామణి (సఅసం) అస్వస్థతకు లోనై ఉండగా అన్సార్లు ఆయన (స) ఉపకారాలను, దయాదాక్షిణ్యాలను తలచుకుని దుఃఖంతో విలపించేవారు. వారొకచోట ఇలా విలపిస్తుండగా హజ్రత్ అబూబక్ర్ (రజి), హజ్రత్ అబ్బాస్ (రజి) లు అటువైపు నుంచి వెళుతున్నారు. దుఃఖానికి కారణమేమిటని దర్యాప్తు చేయగా, దైవప్రవక్త(స) వారి సహచర్యం తమకు జ్ఞాపకం వస్తోందని చెప్పారు అన్సార్లు. అన్సార్ల వ్యాకులత గురించి వారిద్దరిలో ఒకరు దైవప్రవక్త (స)కు వివరించగా,

1) సహీహ్ బుఖారీ : కితాబుల్ మనాఖిబ్
2) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజి సహీహ్ ముస్లిం : కితాబుల్ మసాజిద్

www.abulhasanalinadwi.org

అన్సార్ల గురించి కొన్ని విషయాలు ప్రజలకు చెప్పటం అవసరమని ఆయన (స) భావించారు. ఆయన (స) జనులనుద్దేశించి ఇలా ఉద్బోధించారు:

> "ప్రజలారా! అన్సార్ల గురించి నేను మీకు కొన్ని విషయాలు తాకీదు చేయదలిచాను. ఒకవైపు జన సంఖ్య పెరుగుతుంటే మరోవైపు అన్సార్లు అరుదైపోతుంటారు. వారు అన్నంలో ఉప్పు మాదిరిగా ఉంటారు. వారు తమ కర్తవ్యాన్ని సజావుగా నిర్వర్తించారు. ఇప్పుడు వారి పట్ల మీరు మీ కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. నా శరీరంలో జీర్ణ కోశానికి ఎంత ప్రాముఖ్యం ఉందో వారికంత ప్రాముఖ్యం ఉంది. మీ మంచీచెబ్బరల పర్యవేక్షకునిగా నియమితుడైనవాడు (ఖలీఫా) అన్సార్లలోని సద్వర్తనులను ఆదరించాలి. వారిలో ఎవరయినా తప్పు చేస్తే మన్నింపుల వైఖరిని అవలంబించాలి".[1]

రోమనుల మెడలు వంచడానికి పంపబడిన సైనికదళానికి ఉసామా బిన్ జైద్ (రజి)ను సారథిగా దైవప్రవక్త (స) నియమించిన సంగతి ఇంతకు ముందే వచ్చింది. దీనిపై కొంతమంది అభ్యంతరం వెలిబుచ్చారు (అలా అభ్యంతరం వెలిబుచ్చినవారు కపటులని ఇబ్నెసాద్ వివరించారు). పెద్దవారు ఉండగా ఒక కుర్రవానికి ఈ పదవి కట్టబెట్టడమెందుకు? అన్నది వాళ్ల మనోరథం. ఈ విషయంపై అగ్రజులు (సఅసం) ఇలా సెలవిచ్చారు:

> "ఉసామా నేతృత్వంపై మీకు అభ్యంతరం ఉంటే, ఇలాంటి అభ్యంతరమే మీరు ఇతని తండ్రి నేతృత్వంపై కూడా వ్యక్తపరిచారు. దైవసాక్షి! అతను ఈ పదవికి అన్ని విధాలా తగినవాడు. అతను నాకు అందరికన్నా ప్రియమైనవాడు. అతని తరువాత ఇప్పుడు ఇతను అందరికన్నా ప్రియమైన వాడు".[2]

1) సహీహ్ బుఖారీ : కితాబుల్ మనాఖిబ్. అన్సార్ల గొప్పదనానికి సంబంధించిన అధ్యాయం
2) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ

www.abulhasanalinadwi.org

ఇస్లాంకు - ఇతర మత ధర్మాలకు మధ్య ఉన్న స్పష్టమైన తేడా ఏమిటంటే షరీయతుకు సంబంధించిన సమస్త ఆదేశాలను ఇస్లాం దైవాజ్ఞలుగా ఖరారు చేస్తోంది. కాకపోతే ప్రవక్త ఆ ఆదేశాలను తన పలుకుల ద్వారా, ఆచరణల ద్వారా ప్రజా బాహుళ్యంలోకి తీసుకుపోతాడు. ఇతర మత ధర్మాలు ఈ విషయంలోనే అపార్థాలకు గురయ్యాయి. అందుకే ఈ మానవ మహోపకారి (సఅసం) ఈ విధంగా స్పష్టపరిచారు :

"ధర్మాధర్మాల (హలాల్ - హరామ్‌ల) నిర్ధారణను నాకు అంటగట్టకండి. అల్లాహ్ ధర్మసమ్మతం చేసిన దానినే నేను ధర్మసమ్మతంగా ప్రకటించాను. అల్లాహ్ నిషేధించిన విషయాన్ని నేనూ నిషేధించాను."

మనిషికి బహుమానం లభించినా, శిక్షపడినా అదంతా అతను చేసుకున్న కర్మలను బట్టే ఉంటుంది. అందుకే ఆయన (స) ఈ అంశాన్ని ముందుగానే చెప్పేయాలనుకున్నారు-

"ఓ దైవ సందేశహరుని పుత్రిక ఫాతిమా! ఓ దైవ సందేశహరుని అత్త సఫియ్యా!! దైవ సమక్షంలో పనికి వచ్చే సామగ్రిని సమకూర్చుకోండి. దేవుని పట్టు నుండి నేను మిమ్మల్ని కాపాడలేను."

ప్రసంగం పూర్తయిన తరువాత ఆయన (స) అయిషా (ర.అన్హా) కుటీరంలోనికెళ్ళారు. తన ప్రియపుత్రిక హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) అంటే ఆయనకు అమితమైన వాత్సల్యం. వ్యాధిగ్రస్తస్థితిలోనే ఆయన (స) తన పుత్రికను పిలిపించారు. ఆమె వచ్చినపుడు ఆమె చెవిలో ఏదో చెప్పారు. ఆ మాట విన్నంతనే ఆమె ఏడ్వటం మొదలెట్టారు. మళ్లీ ఆమెను దగ్గరకు పిలిచి ఆమె చెవిలో ఏదో చెప్పగా ఆమె మోముపై ఆనందం తొణికిసలాడింది. ఇంతకీ ఆయన (స) ఏం చెప్పారు? అని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) అడగ్గా, ఈ వ్యాధి తన మరణానికి సూచిక అని అన్నారని ఆమె తెలిపారు. అది విని నేను ఏడుస్తుండగా మళ్లీ పిలిచి, నాకుటుంబీకుల్లో అందరికన్నా ముందు నువ్వే వచ్చి నన్ను

www.abulhasanalinadwi.org

కలుసుకుంటావు అని చెప్పారు. ఇది వినగానే నాకు సంతోషం కలిగింది. [1]

యూదులు క్రైస్తవులు తమ ప్రవక్తల గోరీల పట్ల కనబరచిన మితిమీరిన భక్తి శ్రద్ధలు విగ్రహారాధనగా పరిణమించాయి. కాగా; విగ్రహారాధనను నిర్మూలించటం ఇస్లాం ప్రథమకర్తవ్యం. అందుకే మరణానికి ముందు తీవ్ర అస్వస్థతకు గురై ఉన్న సమయంలో కూడా ఈయన్ని (స) ఇదే విషయం వేధిస్తూ ఉండేది. కొంతమంది సతీమణులు క్రైస్తవమతంలోని ఆరాధ్యదైవాల, విగ్రహాల ప్రస్తావనను తీసుకురాగా, ఆయన (స) ఇలా వివరించారు: "జనుల్లో ఎవరయినా పుణ్య పురుషుడు మరణించినప్పుడు అతని పట్ల గల గౌరవం కొద్దీ వారు అతని సమాధికి ప్రత్యేకతను కల్పిస్తారు. అదే రాను రాను ఆరాధనగా పరిణమిస్తుంది. ఆ సమాధి వద్ద అతని విగ్రహాన్ని కూడా వారు ప్రతిష్ఠిస్తారు." [2] వ్యాధి తీవ్ర రూపం దాల్చించి. ఒక్కోసారి దుప్పటిని ముఖంపై కప్పుకునేవారు. ఊపిరాడక మళ్లీ దుప్పటిని తీసేసేవారు. ఆయన (స) నోట హజ్రత్ ఆయిషా (ర.అన్హా) విన్న పలుకులివి!

> "యూదుల, క్రైస్తవులపై దేవుని శాపం పడుగాక! వారు తమ ప్రవక్తల సమాధులను ప్రార్థనా మందిరాలుగా చేసుకున్నారు." [3]

ఈ బాధాతప్త స్థితిలోనే, హజ్రత్ ఆయిషా (ర.అన్హా) దగ్గర తాను పెట్టిన కొన్ని నాణేల సంగతి గుర్తుకు వచ్చింది. "ఆ నాణేలు ఎక్కడున్నాయి? ముహమ్మద్ (స) తన నేస్తాన్ని అనుమానాస్పదస్థితిలో కలుసుకునే అవస్థ ఏర్పడకూడదు. వెళ్ళి ఆ నాణేలను దైవమార్గంలో ఖర్చు చేసిరా!" అని పురమాయించారు.[4]

మరణించే రోజు (అంటే సోమవారంనాడు) ఆరోగ్యం కాస్తంత కుదుటపడింది. ఆయన (స) కుటీరం మస్జిద్‌కు ఆనుకునే ఉండేది.

---

1) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ
2) సహీహ్ ముస్లిం : కితాబుల్ మసాజిద్
3) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ
4) ముస్నదె అహ్మద్ - 6: 49.

www.abulhasanalinadwi.org

తెల్లవారుతుండగా కిటికీ తెరెత్తి మస్జిద్‌లోకి చూశారు. ప్రజలు (ఫజ్ర్) నమాజులో నిమగ్నులై ఉన్నారు. ఆ దృశ్యాన్ని చూసి ఆయన (స) తృప్తిగా, సంతోషంగా నిట్టూర్చారు. ఈ నిట్టూర్పును గ్రహించిన జనులు, బహుశా ఆయన (స) నమాజుకు రాదలుస్తున్నారేమోనని అనుకున్నారు. సంతోష సూచకమైన ఈ నిట్టూర్పును విని ప్రజలు తమ భావోద్వేగాన్ని అదుపు చేసుకోలేకపోయారు. వాళ్ల పరిస్థితిని చూస్తుంటే నమాజును భంగపరచేలా ఉన్నారు. ఆ సామూహిక నమాజును సారథ్యం వహిస్తున్న హజ్రత్ అబూబక్ర్ (రజి) గారైతే తాను నించుని ఉన్న స్థానంలో నుంచి వెనక్కి జరగబోయారు. అయితే దైవప్రవక్త (స) అలా చేయవద్దంటూ సంజ్ఞ చేసి కుటీరం లోపలికి వెళ్ళిపోయారు. [1]

ప్రియ సహచరులు దైవప్రవక్త (సఅసం) ముఖారవిందాన్ని ఆ స్థితిలో తిలకించటం అదే ఆఖరుసారి. ఆయన (స) ముఖారవిందం అప్పుడు దేదీప్యమానంగా వెలిగిపోయిందని హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) తెలిపారు. [2]

పొద్దెక్కే కొద్దీ ఆయన (స) వేదన పెరిగేది. కాని అంతలోనే శాంతించే వారు కూడా. ఈ పరిస్థితిని గమనించిన హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) "అయ్యో! నా తండ్రి వ్యాకులత గురించి ఏం చెప్పేది?" అంటూ విలపించారు. "నీ తండ్రి ఈ రోజు తరువాత మరెన్నడూ కలత చెందడమ్మా!" [3]అని ఆయన (స) సముదాయించారు. బాధ తగ్గినప్పుడల్లా ఆయన (స), "మరణం కావాలో ప్రాపంచిక జీవితం కావాలో (దేన్నయినా) కోరుకోవచ్చు అని ప్రవక్త (స)కు అధికారం ఇవ్వబడుతోంది" అని అనేవారు. ఆ స్థితిలో ఆయన (స) నోట ఈ పలుకులు వెలువడేవి "అల్లాహ్ అనుగ్రహించిన వారి వెంటనే..." [4]

మరణానికి కొన్ని ఘడియల ముందు హజ్రత్ అబూబక్ర్ (రజి) కుమారుడగు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ (రజి) ఆయన అన్న సన్నిధికి వచ్చారు.

---

1) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ
2) సహీహ్ ముస్లిం : కితాబుస్సలాత్
3) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ
4) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ

www.abulhasanalinadwi.org

ఆ సమయంలో ఆయన (స) హజ్రత్ ఆయిషా (ర. అన్ హా) గుండెపై తల అనించి పండుకుని ఉన్నారు. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ (రజి) చేతిలో ఉన్న 'మిస్వాక్' (పను దోముపుల్ల)ను తదేకంగా చూడసాగారు. హజ్రత్ ఆయిషా (ర.అన్హా)కు విషయం అర్థమయింది. ఆమె గారు ఆ మిస్వాక్‌ను తీసుకుని తన దంతాలతోనే నమలి మెత్తగా చేసి యిచ్చారు. ఆయన (స) మామూలు మనిషి లాగానే 'మిస్వాక్' చేశారు (పల్లు తోముకున్నారు).[1] ఆయన (స) మహాప్రస్థానంచేసే గడియ చాలా దగ్గరపడింది. మధ్యాహ్నం పొద్దువాలింది. సాయంత్రం కావస్తోంది. ఉచ్వాసనిశ్వాసల్లో తేడా వచ్చేసింది. రొప్పుతున్నారు. ఆ స్థితిలో ఆయన (స) అధరాలు కదలుతున్నాయి. "నమాజ్, బానిసలు" అన్న మాటలు నెమ్మదిగా వెలువడుతున్నాయి.[2]

దగ్గరలోనే నీళ్ళతొట్టె ఉంది. పదేపదే అందులో చేతులు ముంచి ముఖానికి తుడుచుకునేవారు. మాటిమాటికీ ముఖంపై దుప్పటి కప్పుకుంటూ మళ్లీ దాన్ని తొలగించేవారు. అంతలోనే చెతులెత్తి "ఇప్పుడు నాకు కావలసినవాడు ఆ పరమోన్నతుడే" అని అనేవారు. అలా అంటుండగానే పవిత్రాత్మ పరలోకానికి సాగి పోయింది. [3]

**అల్లాహుమ్మ సల్లూ అలైహి వ అలా ఆలిహీ వ అస్ హాబిహీ సలవాతన్ కసీరన్ కసీరా.**

## అంత్యక్రియలు

మహాప్రవక్త (సఅసం) ఇహలోకానికి వీడ్కోలు చెప్పి వెళ్ళిపోయారన్న విషయం ప్రియ సహచరులకు జీర్ణం కావటంలేదు. హజ్రత్ ఉమర్ (రజి) కరవాలం పట్టుకుని ఆవేశంతో ఊగిపోతూ, "దైవప్రవక్త (సఅసం) చనిపోయారని చెప్పిన వాడి తల నరికేస్తాన'ంటూ వీధుల్లో సంచరించసాగారు. [4]

1) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ
2) ముస్తద్రక్ హాకిమ్ - 3 : 59
3) సహీహ్ బుఖారీ : కితాబుల్ మగాజీ - బాబు మరజున్నబీ....
4) సీరత్ ఇబ్నె హిషామ్ - 2 : 655.

www.abulhasanalinadwi.org

అయితే హజ్రత్ అబూబక్ర్ (రజి) వచ్చి, సహచరులందరినీ ఉద్దేశించి ఉపన్యసించారు. దైవప్రవక్త (సఅసం) ఏదో ఒకనాడు ఈ లోకాన్ని వీడిపోవటం సహజ పరిణామమని అందరినీ సముదాయించారు. ఈ సందర్భంగా ఆయన (స) దివ్యఖుర్ఆన్‌లోని ఆయతును చదివి వినిపించగా ఈ అనివార్య పరిణామాన్ని అందరూ అర్థం చేసుకున్నారు.[1] అంత్యక్రియల సన్నాహాలు మంగళవారం నాడు మొదలయ్యాయి. ఆత్మీయులు, బంధుమిత్రులు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వర్తించారు. హజ్రత్ ఫజల్ బిన్ అబ్బాస్ (రజి), హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి)లు తెరపట్టుకొగా, హజ్రత్ అలీ (రజి) గుసుల్ (స్నానం) చేయించారు. ఈ సందర్భంగా హజ్రత్ అబ్బాస్ (రజి) కూడా అక్కడున్నారు. [2]

ఖననం ఎక్కడ చేయాలన్న ప్రశ్న ఈ సందర్భంగా ఉత్పన్నమయింది. దైవప్రవక్త పరమపదించిన చోటే ఖననం చేయబడతారని హజ్రత్ అబూబక్ర్ (రజి) అన్నారు. అందువల్ల భౌతిక కాయాన్ని లేపి, పడకను చుట్టేసి హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కుటీరంలోనే ఆయన సమాధిని త్రవ్వటం జరిగింది.[3]

బహిరంగ ప్రదేశంలో తన సమాధి ఉంటే ప్రజల భక్తీ శ్రద్ధలు మితిమీరి తన సమాధిని పూజాస్థలంగా ప్రజలు చేసుకుంటారేమోనన్న అనుమానం ఆయన (స)కు చివరి కాలంలో కలిగింది. అందుకే బహిరంగ స్థలంలో అంత్యక్రియలు జరపాలన్న నిర్ణయానికి స్వస్తి చెప్పటం జరిగిందని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) అనేవారు.[4]

మదీనా వాసుల సంప్రదాయం ప్రకారం హజ్రత్ అబూతల్హా (రజి) సమాధి త్రవ్వారు.[5] అంత్య క్రియల సమయం దగ్గర పడేసరికి జనాజానమాజు కోసం జనం పోటెత్తింది. శవ పేటిక కుటీరం లోపలే ఉంది. పురుషులు స్త్రీలు వంతుల వారీగా లోపలికి వెళ్లి కడసారి దర్శనం

1) సీరత్ ఇబ్నె హెషామ్ - 2 : 662.
2) సీరత్ ఇబ్నె హెషామ్ - 2 : 662
3) సుననె ఇబ్నె మాజ - కితాబుల్ జనాయెజ్ - బాబు వఫాతున్నబీ (స)
4) సహీహ్ బుఖారీ : కితాబుల్ జనాయెజ్
5) సీరత్ ఇబ్నె హెషామ్ - 2 : 663

www.abulhasanalinadwi.org

చేసుకుని నమాజు చేశారు. మొదట పురుషులు, తరువాత స్త్రీలు, ఆ తరువాత బాలలు జనాజా నమాజు చేశారు. ఈ నమాజుకు ఎవరూ 'ఇమామ్'గా లేరు.[1]

ఆయన (స) భౌతిక కాయాన్ని హజ్రత్ అలీ (రజి), హజ్రత్ ఫజల్ (రజి) బిన్ అబ్బాస్, హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి), హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)లు సమాధిలోనికి దించారు. [2]

సల్లల్లాహు తాలా అలైహి సలాతన్ వ సలామన్ దాయిమైని ముతలాజిమైని ఇలా యౌమిద్దీని వ అలా ఆలిహీ వ సహ్బిహీ అజ్మయీన్.

1) సీరత్ ఇబ్నె హెషామ్ - 2 : 664
2) అబూదావూద్ - కితాబుల్ జనాయెజ్

www.abulhasanalinadwi.org